# కృష్ణయజుర్వేదీయ
# తైత్తిరీయ సంహిత
## వేదార్థదీపికాసహితము

### తృతీయ కాండము
### తృతీయ సంపుటము

వ్యాఖ్యానకర్త:
శిరోమణి, భాషాప్రవీణ
తర్క-వ్యాకరణ పూర్వోత్తర మీమాంసావిశారద
**శ్రీ రామవరపు కృష్ణమూర్తిశాస్త్రి**

ప్రచురణ :
**తిరుమల తిరుపతి దేవస్థానములు**
**తిరుపతి**

# కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత

## వేదార్థదీపికాసహితము

### తృతీయ కాండము

### తృతీయ సంపుటము


వ్యాఖ్యానకర్త:

శిరోమణి, భాషాప్రవీణ,

తర్కవ్యాకరణ పూర్వోత్తర మీమాంసావిశారద

**శ్రీ రామవరపు కృష్ణమూర్తిశాస్త్రి**



ప్రచురణ:

సిహెచ్. వేంకటపతిరాజు, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

1989

Kṛṣṇa Yajurvedīya Taittirīya Saṁhita
With Telugu Commentary, Vedārthadīpika

Edited, Translated and Commented by:
Siromani Ramavarapu Krishnamurthi Sastry

T.T.D. Religious Publications Series No. 324

*Frist Edition :*

Copies :

Price Rs.

*Published by :*

Sri Ch. VENKATAPATHI RAJU, I. A. S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Printed at :*

Tirumala Tirupati Devasthanams Press, Tirupati.

# ముందుమాట

వేదాలు విశ్వవిజ్ఞాన నిధులని ప్రపంచంలోని మహా మేధావులందరు ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ధర్మార్థకామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలకు వేదాలే మూలభూతాలు. వాటిలో మొదటి మూడు పురుషార్థాలకు వేదం సాక్షాత్తుగా కారణం కాగా, మోక్షమనే నాల్గవ పురుషార్థానికి కర్మానుష్ఠానంవల్ల చిత్తనైర్మల్యం కలిగి, దానివల్ల కలిగే జ్ఞాన వైరాగ్యాలద్వారా పరంపరగా కారణ మౌతుంది. లోక కల్యాణ దాయకాలైన యజ్ఞయాగాదులు ధర్మాలు. వాటిని అనుష్ఠించటంవల్ల అర్థ కామాలు లభిస్తాయి. ఆ ధర్మాన్ని ప్రతిపాదించటంవల్ల వేదం గొప్ప ధర్మంగా పేర్కొనబడింది. భారతీయుల జీవనవిధానంలో సంస్కృతిలో వేదానికి మహోన్నత స్థానం ఉంది. అది ఒక దివ్యవాణి. నిత్యమైన శబ్దరాశి. భూత భవ్య భవిష్యత్కాలాలకు సంబంధించినది.

వేదకాలాన్ని నిర్ణయించడానికి భారతీయులు, పాశ్చాత్యులు కూడా ఎంతో కాలం నిర్విరామంగా చారిత్రక దృష్టితో పరిశీలన చేశారు. కాని ఏ ఒక్కరు కూడా ఇదమిత్థమని నిర్దుష్టంగా కాలనిర్ణయం నిర్దేశించలేక పోయారు. సనాతన ధర్మపరులు, సంప్రదాయవిదులును అయిన విద్వాంసులు ఈ చరిత్రకారుల నిర్ణయాలను అంగీకరించుటలేదు. ఇవి ఒక కాలమున ఏర్పడినవి కావు. అప్పుడప్పుడు ఆవిర్భవిస్తూ అంతర్ధానమౌతూ మరల ఆవిర్భవిస్తూ ఉండే నిత్యమైన శబ్దరాశి అని వారి సిద్ధాంతం. ఈ ఉభయుల నిర్ణయాలకు మధ్యేమార్గంగా వేదకాలం చరిత్ర కందని కాలమని కొందరంటున్నారు.

భారతీయ ధర్మాన్ని, తత్త్వాన్ని అవగాహన చేసుకోవాలనే కుతూహలంతో పాశ్చాత్యు లెందరో పరిశ్రమ చేశారు. అయితే వారందరు న్యాయమైన మార్గంలో పరిశోధనలు చేశారనటానికి వీలు లేదనీ వారిలో చాలమందికి భారతీయాచార్యుల భాష్యాలపైన తగినంత గౌరవాదరాలు లేవనీ వారి రచనలు చాలవరకు వైదిక సంస్కృతిని విమర్శించడానికే పూనుకున్నాయనీ మనవారి విమర్శ.

వేదవాఙ్మయం మీద అభిమానం ఉండి తెలుసుకోవాలనే సామాన్యప్రజలకు వేదంలోని సారాంశం అందుబాటులో లేదు. భారతీయ సంస్కృతికి విజ్ఞానానికి వేదాలు పునాదులని చెప్పేవారే కాని, ఆ వేదతత్త్వాన్ని అందరికి అర్థమయ్యే విధంగా చేయటానికి పెద్దగా ఎవరూ ముందుకు రావటం లేదు. అలా చేస్తే వేదరహస్యం అందరికీ తెలుస్తుందనీ, తెలిస్తే వేదాలమీద ఆదరం తగ్గుతుందనీ కొందరి అభిప్రాయమైతే, వేదాలు అపవిత్రా లౌతాయని మరికొందరి భ్రమ. ఈ సంకుచిత భావం విడనాడి వేదవిజ్ఞానాన్ని అందరికి అందజేయటానికి వేదార్థ విదులందరు ప్రయత్నించాలి. అందుకనే ఋషితుల్యులైన సాయణాచార్యాదులు వేదాలకు భాష్యాలు వ్రాశారు. అవి చూచే మాక్సుముల్లర్ మున్నగు పాశ్చాత్య పండితులు వేదతత్త్వాన్ని అవగతం చేసుకొనటానికి పరిశ్రమించారు. మరి ఆ వేదార్థాన్ని తెలుగులో వెలుగులోనికి తీసుకవస్తే అది ఆంధ్ర ప్రజానీకానికి మహోపకారక మౌతుంది.

ఈ ఉద్దేశ్యంతోనే తిరుమల తిరుపతి దేవస్థానం వారు కీ. శే. నేమాని వెంకటనరసింహశాస్త్రిగారు తెలుగులో పద్య రూపంలో అనువదించిన 'ఋగ్వేదమును' సమూలంగా ప్రచురించి ఆంధ్రులకు అందజేస్తున్నారు. మరొక ప్రక్క కళాప్రపూర్ణ డా॥ విద్వాన్ విశ్వం సారథ్యంలో అథర్వణవేదానువాదం ముద్రణ సాగుతున్నది. ఇక వేదవిభాగంలో ద్వితీయ స్థానంలో ఉన్న యజుర్వేదాన్ని తెలుగులో వెలుగులోకి తీసుకరావాలనే సంకల్పంతో దేవస్థానం ఇపుడు ప్రముఖ విద్వాంసులు, శిరోమణి శ్రీరామవరపు కృష్ణమూర్తి శాస్త్రిగారు తెలుగులో ప్రతిపదార్థ తాత్పర్య మంత్ర వినియోగ విశేషాలతో విపులంగా వ్రాస్తున్న వేదార్థదీపికా వ్యాఖ్యానంతో కూడ కృష్ణయజుర్వేదాన్ని స్వరసహితంగ వెలువరిస్తున్నది. ఈ ప్రయత్నంలో ఇది తృతీయ కాండాత్మకమైన తృతీయ సంపుటం మాత్రమే. మిగిలిన సంపుటాలను అనతికాలంలో ఆంధ్రపాఠక మహాశయులకు అందజేయడానికి అవిరళకృషి చేస్తున్నాము.

వేదవాఙ్మయం ఒక అగాధ క్షీరసాగరం. నిర్విరామ మథనంతో అనర్ఘ రత్నాలను వెలికిదీసి అందించవలసిన పవిత్ర కర్తవ్యం అందరిమీదా వున్నది. ఈ విషయంలో ప్రతి ఒక్కరి సహకారం లభించగలదన్న ఆకాంక్షతో దేవస్థానం ముందుకు సాగుతున్నది. ఆదరం మీది. అనుగ్రహం శ్రీనివాసునిది.

**సి. హెచ్. వేంకటపతిరాజు, ఐ. ఏ. ఎస్.**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

తిరుపతి
సెప్టెంబరు, 1987

# ఆముఖము

* * * *

వేదము అఖిల ధర్మములకు మూలము. కనుకనే "వేదోఽఖిలో ధర్మమూలమ్" అని వేదవిదులు నుడువుచుందురు. వేదము ననుసరించి అనేక కాలములలో అనేక ధర్మములు ప్రజల యోగక్షేమములకై ఆవిర్భవించినవి. "వేదమూల మిదం జగత్" ఈ జగత్తు అంతయు వేదముమీద ఆధారపడినది. నాలుగు వేదములలో యజుర్వేదము యజ్ఞములకు సంబంధించిన సర్వవిషయములను, అనగా యజ్ఞస్వరూపమును, యజ్ఞసాధనములను సంపూర్ణముగను, కూలంకషముగను వివరించినది యజ్ఞమునకు సంబంధించిన కొన్ని విషయములలో మాత్రమే ఋగ్వేదము, సామవేదము, ఉపకరించినను, యజ్ఞ నిర్వహణములో యజుర్వేదమే ముఖ్యమైన భూమికను వహించినది. అందులోను కృష్ణయజుర్వేదమునకు గల తైత్తిరీయశాఖ శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అనెడి షడంగములతో కూడి, వర్ణ, స్వర, మాత్రా, అంగ స్థాన కరణ ప్రయత్న దేవతా సహితమైన వర్ణక్రమ పద్ధతితోను, స్వరవిన్యాసములతోను ఇతర వేదములకంటె విశిష్టమై విరాజిల్లుచున్నది. వైశంపాయనుడు, పైంగి, యాస్కుడు, తిత్తిరి, ఉఖుఁడు, ఆత్రేయుడు మున్నగు మహర్షు లెందరో ఈ శాఖను అధ్యయన అధ్యాపనాది ప్రచారములోనికి తీసికొనివచ్చినారు. ఈ మహర్షు లందరు అసాధారణ తపస్సంపన్నులు, తపస్వికుల వందితులును. ఇందువలననే ఈ శాఖకు ఇంత మహత్త్వ మేర్పడినది. అయితే ఈ శాఖ ఇంత విస్తృతముగ వ్యాపించుటకు ఈ మహర్షు లందరు కృషి చేసినను ఈ మహర్షి పరంపరలో తిత్తిరి మహర్షి మధ్యమణిగా ఉండి ప్రసిద్ధిని కలిగించుట వలన ఇది తైత్తిరీయశాఖగా ప్రసిద్ధిని ప్రశస్తిని సంతరించుకొనినది.

బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఇంద్ర, వరుణ, వాయు, సూర్య, అగ్ని, అశ్విని మొదలగు దేవతల అనుగ్రహమును పొందుట కవసరములైన యజ్ఞవిశేషములు ఆ యా దేవతల మంత్రములు బహుముఖముగ ప్రతిపాదించబడినవి. ఆ యజ్ఞములను, క్రతువులను అనుష్ఠించుటకు అనేకవిషయములు అతివిపులముగ ఇందులో వివరింపఁబడినవి. ఈ వేదము ఉపదేశించిన విధముగ యజ్ఞములను జపములను తపస్సులను భక్తి విశ్వాసములతో అనుష్ఠించి తమతమ వాంఛితములను నెఱవేర్చుకొనినట్లు ఇతిహాసములవలననే గాక చరిత్రవలన కూడ తెలియుచున్నది. క్రీస్తుశకము 18 వ శతాబ్దములో గుంటూరు మండల పాలకుఁడైన నవాబు నుండి, శపథము చేసి వరుణజపానుష్ఠానముచేతను, రుద్రాభిషేకముచేతను పర్జన్యదేవతను మెప్పించి నిర్ణీతకాలమున వలసినంత వర్షమును కురియింపఁజేసి ఆరేపల్లి పొన్నపల్లి అగ్రహారములను సంపాదించిన ఒక శ్రోత్రియ బ్రాహ్మణుని ఉదంతము శాసనములవలన తెలియుచున్నదను విషయము చాలమందికి తెలిసినదే. ఈ వేదమునందు చెప్పబడిన ఉపాసనలవలన కేవలము లోకాంతరమైన స్వర్గలోకమునందలి సుఖమునే గాక ఈ లోకమునందు కూడ మహత్తరమైన ఫలితమును సాధించి మంచి జీవితమును గడుపుటకు తగిన అవకాశము కలదనుటకు ఇది యొక విశ్వసనీయమైన ఉదాహరణముగా పేర్కొనబడినది.

సామాన్య మానవునకు గోచరించని ఎన్నియో విజ్ఞానవిశేషములను ఈ వేదము తెలియజేయుచున్నది. పక్షులు రాత్రియందు భూమిమీద వాలవు. చెట్లపైని గూళ్లలో నివసించుచుండును. ఎందువలన? ఈ ప్రశ్నకు వేదమే సమాధానము చెప్పినది.— "యాం పురస్తా దుపాదధా త్తచ్ఛిరోఽభవత్సా దిగ్యాం దక్షిణత ఉపాదధాత్స దక్షిణః పక్షోఽభవత్సా దక్షిణా దిగ్యాం పశ్చా దుపాదధా త్తత్పుచ్ఛ మభవత్సా ప్రతీచీ దిగ్యాముత్తరత ఉపాదధాత్స ఉత్తరః పక్షోఽభవత్సోదీచీ దిగ్యా ముపరిష్టా దుపాదధా త్తత్పృష్ఠ మభవత్సోర్ధ్వా దిక్" (కాం. ౫. ప్ర. 6. అ. 4.) ప్రజాపతి అగ్నిచయనము చేసి భూమి నుత్పత్తి చేసిన విధము ఈ మంత్రమున వివరించఁబడినది. ప్రజాపతి తన యెదుట ఒక ప్రౌఢమైన ఇష్టక నుపధానము చేయగా ఆ ఇష్టకారూపము చీయమానాగ్నికి శిరస్థానమైనది. లోకమునందైనచో దీనివలన భూమ్యేకదేశరూపమైన పూర్వ (తూర్పు) దిక్కు సంపన్నమైనది. దక్షిణమున ఉపధానము చేసిన యిష్టక చీయమానాగ్నికి దక్షిణపు ఱెక్క అయినది. అది ఉత్తర దిక్కు అయినది. ఉపరితలమున ఉంచిన యిష్టక చీయమానాగ్నికి పృష్ఠమైనది. అది ఊర్ధ్వ దిక్కు అయినది. దీని వలన భూమికి చిత్యాగ్నిరూపత్వము నిరూపించఁబడినది. అనఁగా భూమి అగ్నిరూప యని నిర్ధారిత మైనది.

"ఇయం వా అగ్నిః పఞ్చేష్టక స్తస్మాద్యదస్యా ఖనన్త్య భీష్టకాం తృన్దన్త్యభి శర్కరాగ్ం సర్వా వా ఇయం వయోనక్తం దృశే దీవ్యతే తస్మాదిమాం వయాగ్ంసి నక్తం నాధ్యాసతే". (కాం. 5. ప్ర. 6. అ. 4.) ఈ భూమి ప్రజాపతి పూర్వ మంత్రోక్త విధముగ ఉపధానము చేసిన అయిదు ఇష్టకలచే చితమైన అగ్నిస్వరూపము. కనుక అట్టి పవిత్రమయిన భూమిని అజ్ఞులు అచ్చటచ్చట త్రవ్వుచుండుటచే వారు ప్రజాపతిచే ఉపహితమైన ఇష్టకనే హింసించుచున్నవా (చూర్ణము చేయుచున్నవా) రగుచున్నారు. ఆ విధముగనే శర్కర (రాయి) కూడ ప్రజాపతిచే ఉపహితమైన ఇష్టకయే కనుక దానిని కూడ అంతటను చూర్ణము చేసినవా రగుచున్నారు. దానివలన వారికి ప్రత్యవాయము (పాపము) కలుగుచున్నది. ఇది శాస్త్రీయ దృష్టి. పక్షుల దృష్టియందు భూమి యంతయు రాత్రియందు మాత్రము అగ్నివలె దీపించుచుండును. కనుకనే పక్షులు రాత్రియందు భూమియందు నివసించుట లేదు. వృక్షాగ్రములందే నివసించుచున్నవి. పక్షులు రాత్రియందు భూమిమీద ఎందుకు నివసించుట లేదు? అను ప్రశ్నకు అతి రహస్యాతిరహస్యమైన సమాధానము ఈ వేదము చక్కగా సహేతుకముగ వివరించునది. ఇంకను ఇటువంటి రహస్యాతిరహస్యములు లౌకిక దృష్టిమాత్రమే కల మహామేధావులకు కూడ గోచరించనివి ఈ వేదమునందు బహుళముగ కలవు.

శుద్ధ జలమువలన తేజస్సు, బ్రహ్మవర్చస్సు, అలలతో ప్రవహించునట్టి జలము వలన బలము, వీర్యము, జలాశయముల మధ్యమున ఉన్నట్టి జలము వలన పుష్టి, సంతానోత్పాదక శక్తి, యజ్ఞాంతమున యజమానుడు అధ్వర్యుఁడు, ఋత్విక్కులు అవబృథ స్నానము చేసిన జలమువలన దీర్ఘాయువు మనకు కలుగునని ఈ వేదము తెలియచేయుచున్నది. ఆరోగ్యము కొఱకు సూర్యోపాసన, తేజస్సుకొఱకు, ధనముకొఱకు అగ్న్యారాధనము ప్రతిదినము చేయవలెనని ఈ వేదము చెప్పుచున్నది. నిత్యాగ్నిహోత్రికి నిత్యము అగ్నియే రక్షకుఁడుగా నుండునని పలుతావులందు ఈ వేదము స్పష్టముగ వివరించినది. ఒక్కొక్క కోరికను సాధించుకొనుటకై ఒక్కొక్క ఇష్టి చొప్పున శతాధిక సంఖ్యలో ఈ వేదమున ఇష్టులు చెప్పఁబడినవి. అందుకై అనేక మంత్రము లామ్నాతము లైనవి. వర్ణ, స్వర, మాత్రా. కాలాది నియమములతో స్వరభంగము లేని విధముగ ఆ మంత్రములను యథావిధిగ ఉచ్చరించుచు ఆ యా ఇష్టుల నాచరించి అనేక సత్ఫలితములను పొందవచ్చును.

యజ్ఞము చేయుటకు ముందు యజమానుడు యజ్ఞదీక్షను వహించవలెనని ఈ తృతీయ కాండారంభమునందే చెప్పబడినది. దీక్షా నియమములును ప్రతిపాదించబడినవి. ఆ దీక్షకు అత్యంత ప్రాధాన్యము కూడ ప్రోక్త మైనది. ప్రజాపతి యంతటివాడే ప్రజలను సృష్టించవలెనని సంకల్పించి దీక్ష నవలంబించక అగ్నిష్టోమానుష్ఠాన మనెడి తపస్సు నాచరించి ప్రథమమున సర్పములను, పక్షులను మాత్రమే సృజించఁగలిగెనే కాని తాను అనుకొనిన ప్రజలను సృష్టించలేకపోయెను. అనంతరమాతడు తన పొరపాటును తెలిసికొని అగ్నిష్టోమ యజ్ఞమునకు సంబంధించిన దీక్షను వహించి తాను సంకల్పించిన ప్రజాసృష్టిని చేయగలిగెనని "ప్రజాపతి రకామయత ప్రజాః సృజేయేతి" అను మంత్రము స్పష్ట పఱచినది. యజుర్వేదము యజ్ఞాచరణమున ప్రధాన భూమికను వహించినను, ఋగ్వేద సామవేదముల యపేక్ష కూడ కలదని "ఋక్సామాభ్యాం యజుషా సంతరన్తే" అను మంత్రము స్పష్టముగ పేర్కొనినది. యజ్ఞాంగము లన్నియు యథావిధిగ అనుష్ఠించఁబడినప్పుడే యజ్ఞము ఫలదాయక మగుననియు, లేనిచో ఏదియో ఒక ప్రత్యవాయము (అనిష్టము) సంభవించుననియు "యో వై సోమమప్రతిష్ఠాప్య స్తోత్ర ముపాకరోత్యప్రతిష్ఠిత స్సోమో భవతి" -"అధ్వర్యుడు సోమమును ప్రతిష్ఠించకుండ ఉపాకరణము చేసినచో సోమాదులు అప్రతిష్ఠిము లగుననియు, అధ్వర్యు యజమానులు కూడ అప్రతిష్ఠితు లగుదు రనియు ఈ మంత్రము చెప్పినది.

యజమానుడు యజ్ఞము చేయునపుడు ఆ యజ్ఞమును నిర్విఘ్నముగ కొనసాగుటకై మానవమాత్రులైన రక్షకుల అవసరము లేదనియు, మంత్రములే అతని యజ్ఞమును రక్షించుననియు "యే పథుం విమథ్నీరన్యస్తాన్కామయేతాఽఽర్తిమార్ఛేయు రితి కువిదఙ్గేతి నమోవృక్తివత్యర్చాఽఽగ్నీధ్రే జుహుయా న్నమోవృక్తి మేవైషాం వృఙ్క్తే తాజగార్తిమార్ఛేయుః" అను మంత్రము చెప్పుచున్నది. ఇద్దఱు యజమానులు మాత్సర్యముతో యజ్ఞము చేయునప్పుడు సాధారణ యజ్ఞమునందువలె గాక ప్రత్యేకముగ పఠించవలసిన మంత్రములు, గానము చేయదగిన సామములు వేఱువేఱుగ ప్రతిపాదించబడినవి. వానిని యథాతథముగ అనుష్ఠించిన యజమానుడు ప్రతిస్పర్ధియైన యజమానుని జయించునని, లేక నశింపజేయునని కొన్ని మంత్రములు చెప్పుచున్నవి.

సహజములైన లోకవృత్తములవంటి వృత్తములు కూడ ఈ వేదమున అనేకములు చూపబడినవి. మనువున కనేక పుత్రు లుండిరి. వారిలో కనిష్ఠ కుమారుడు వేదాధ్యయనము చేయుచుండెను. అప్పుడు మనువు పంచి ఈయదగిన తన సంపదను తన పెద్దకుమారులకు విభజించి యిచ్చి వేదాధ్యయనము చేయుచున్న నాభానేదిష్ఠ నామకుడైన కనిష్ఠ కుమారునకు మాత్రము భాగ మీయలేదు. ఆ నాభానేదిష్ఠుడు తండ్రియొద్దకు వచ్చి "తనకు భాగ మెందు కీయలేదు? నన్ను భాగరహితు నెందుకు చేసితివి?" అని అడిగెను. "నిన్ను భాగరహితుని చేయలేదు. అంగిరో నామక మహర్షులు సత్ర మనెడి యాగము చేయుచున్నారు. వారు స్వర్గప్రాప్తి సాధములైన నాభానేదిష్ఠ నామక శస్త్రములను (దేవతా స్తోత్ర విశేషములను) తెలియనివారగుటచే స్వర్గమును తెలిసికొనలేకున్నారు. కావున నీ వధ్యయనము చేసిన శస్త్రాది ప్రతిపాదక బ్రాహ్మణమును వారికి చెప్పుము. వారు స్వర్గప్రాప్తి సాధన శస్త్రాది ప్రతిపాదక బ్రాహ్మణముచే యాగము సమాప్తము చేసి స్వర్గమునకు పోవుచు తమకున్న పశువులను నీ కిత్తురని" మనువు కుమారునకు చెప్పెను. ఆ బాలుడు తా నధ్యయనము చేసిన బ్రాహ్మణమును వారికి చెప్పగా వారు యాగ సమాప్తి చేసి స్వర్గమునకు పోవుచు తమ పశువుల నీ బాలున కొసంగిరి. నేటి లౌకిక సమాజములోని దాయభాగ వ్యవస్థకు ఇది మార్గదర్శకమని చెప్పవచ్చును.

దేవాసురులు పుట్టుకనుండియు పరస్పరము సహజ శత్రువు లనెడి విషయము చాలమందికి తెలిసినదే. వారు ఒకరి నొకరు జయించుటకై అవలంబించిన ఉపాయములు బహుళముగా ఇచట ఉదాహరించఁబడినవి. "దేవా వై యద్యజ్ఞేఽకుర్వత తదసురా అకుర్వత" (తై. కాం. ప్ర. 2. అను. 2.) అను మంత్రమును పరిశీలించినచో లోకమునందు శత్రుజయమునకై ఉపయోగించు మాయోపాయములు ఏ విధముగ నుండునో బోధపడును. పూర్వము దేవతలు అసురులను జయించుటకై యజ్ఞము చేసిరి. వా రా యజ్ఞమునందు ఏ యే యంగము నుపయోగించిరో, అసురులు కూడ విజయము నొందుటకై యజ్ఞము చేసి దేవతలు చేసిన ప్రతి అంగమును ఆచరించిరి. అప్పుడు దేవతలు తమకు జయము కలుగకపోవుటచే జయోపాయమైన సోమ మనెడి ఒక మహాయజ్ఞమును కనుఁగొనిరి. వారు ఆ యజ్ఞమును అసురులకు తెలియకుండునట్లు రహస్యముగ చేసిరి.

మఱియు వారు అగ్నిహోత్ర క్రతువును చేయుచున్నామని బహిరంగముగ చెప్పి దీక్షావ్రతమును చేసిరి. అట్లే ఆ దేవతలు పౌర్ణమాస యజ్ఞము నాచరించుచున్నామని ప్రకటించి రహస్యముగ అగ్నీషోమీయ పశుకర్మ నాచరించిరి. దర్శ యాగమును చేయుచున్నామని బహిరంగముగ ప్రకటించి రహస్యముగ ఆగ్నేయ పశుకర్మ ననుష్ఠించిరి. చాతుర్మాస్య రూప వైశ్వదేవమును చేయుచున్నామని ప్రకటించి ప్రచ్ఛన్నముగ ప్రాతఃసవనము నాచరించిరి. వరుణప్రఘాసలను చేయుచున్నామని బహిర్గతము చేసి రహస్యముగ మాధ్యందిన సవనము నాచరించరి. ఈ విధముగనే సాకమేధ, పితృయజ్ఞ, త్ర్యంబకముల నాచరించుచున్నామని చెప్పి రహస్యముగ తృతీయ సవనము నాచరించిరి. అప్పు డసురులు దేవత లాచరించిన యజ్ఞముల ననుక్రమముగ తెలిసికొనలేకపోయిరి. అప్పు డా యసురులు దేవతలను హింసింప తమకు సాధ్యము కాదనుకొనిరి. సోమయాగముచే నశింపజేయ నసాధ్యులు కనుక సోమయాగమునకు అధ్వరత్వము సిద్ధించినది. విశాఖదత్త మహాకవి తన ముద్రారాక్షస నాటకమున కనబఱచిన రాజకీయ చతురతకు ఈ సన్నివేశము ప్రేరకము కావచ్చును.

అధ్వర మనఁగా హింస లేనిది. 'ధ్వర' దాతువునకు హింస అని అర్థమని కొందఱి విశ్వాసము. "అధ్వర్తవ్యా వా ఇమే దేవా అభూవన్నితి తదధ్వరస్యాధ్వరత్వమ్" (కాం. 3. ప్ర. 2. అను 2.) అధ్వరమునకు (సోమయాగమునకు) "న ధ్వర్యన్తే అనేన సోమేన" అను వ్యుత్పత్తిచే అధ్వర మనెడి పేరు సిద్ధించినదని ఈ వేదమంత్రము చెప్పుచున్నది. అనగా అధ్వర శబ్దమునకు హింస లేనిదను అర్థము సరియైనది కాదనియు, 'ఈ అధ్వరముచే హింసింప శక్యులు కారు' అను అర్థము సరియైనదని సాయణాచార్యుల నిర్వచనము బట్టి స్పష్ట మగుచున్నది. యజ్ఞానుష్ఠానమునందు హింస ఉన్నది కనుక వైదిక యజ్ఞమును శ్రీ రామానుజులవారు రద్దు చేసినా రనియు, మధ్వాచార్యులవారు వాస్తవమైన పశువును రద్దు చేసి ఆ స్థానమున పిండితో చేసిన పశువును ప్రవేశపెట్టినా రనియు కొందఱు చెప్పుచున్నారు. ఇక స్వామి 'దయానంద సరస్వతి', 'శ్రీపద దామోదరసాత్వలేకర్' మొదలగు నవీన పండితులు వేదమున యజ్ఞపశువులుగా చెప్పబడిన గో, అజ అశ్వ, నర మొదలగు పదములకు ప్రసిద్ధమైన అర్థమును మార్చి ఆ యా పదములు ఆ యా ఓషధులను బోధించుచున్నవని వ్యాఖ్యానము చేసినారనియు వారు చెప్పుచున్నారు.

శాస్త్రీయ విషయములను శాస్త్రీయ మార్గముననే పరిశీలించవలెను. కాని లౌకిక దృష్టితో పరిశీలించుట యుక్తము కాదనుకొందును. "మా హింస్యాత్సర్వా భూతాని" అని వేదము బోధించుచున్నది. అనగా సర్వ ప్రాణులను (ఏ ఒక ప్రాణిని

కూడ) హింసించరాదని ఈ శ్రుతి వాక్యమున కర్థము. నిత్యకామ్య కర్మలైన సోమయాగాదులందు పశ్వాలంభమును ఆ వేదమే విధించుచున్నది. "బ్రాహ్మణులకు భోజనము పెట్టుము." "వసిష్ఠునకు భోజనము పెట్టవలదు." అను నివి రెండు వాక్యములు. మొదటి విధివాక్యమువలన బ్రాహ్మణుడైన వసిష్ఠునకు భోజనము ప్రాప్త మగుచున్నది. రెండవ వాక్యమువలన భోజనము నిషేధించబడుచున్నది. మొదటిది సామాన్య వాక్యము. రెండవది విశేష వాక్యము. సామాన్యవాక్యముకంటె (విధికంటె) విశేషవిధి బలవత్తరమని శాస్త్రీయ సిద్ధాంతము. ఏ ఒక విధియు వ్యర్థము కారాదు. అందువలన వసిష్ఠేతరులైన బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. వసిష్ఠునకు మాత్రము భోజనము పెట్టవలదని సమన్వయించుటవలన రెండు విధులును సార్థకము లగుచున్నవి. ఆ విధముగనే ఈ వేదమున కూడ సర్వ ప్రాణులను హింసించరా దనునది సామాన్యవిధి. సోమయాగమునందు పశ్వాలంభనము చేయవలెనను నది విశేష విధి. కనుక యాగేతర సన్నివేశములందలి ప్రాణి హింస దోషావహము. యజ్ఞము నందలి ప్రాణి హింస దోషావహము కాదని సమన్వయము చేయవలెను. దీనివలన యజ్ఞములందు యథార్థ పశువునే ఆలంభము చేయవలయునని స్పష్ట మగుచున్నది.

వేదోక్త పశుహింసవలన హింసాదోషము సంభవించకున్నను యజ్ఞమునందు పశ్వాలంభము చేసిన యజమానునకు ఋత్విజులకును ఆత్మశాంతికై వేదమునందు ఆ పశ్వాలంభ ప్రకరణమునందే సంజ్ఞప్త హోమములు విధించబడినవి. ఈ సంజ్ఞప్త హోమమునకు పూర్వము పశూపాకరణము విహిత మైనది. "ఇమం పశుం పశుపతే తే అద్య బధ్నామ్యగ్నే" —"ఓ పశుపతి వైన అగ్నీ! ఈ దినమున జ్యోతిష్టోమకర్మ మధ్యమందు ఈ యజ్ఞపశువును బంధించుచున్నాను. కావున నీ వంగీకరించుము. మేము శోభనమైన యజ్ఞము చేయుదుము. ఈ హవిస్సు దేవతలకు ప్రియ మగుఁగాక" అని యజమానుఁడు పశ్వాలంభము చేయబోవుచు అగ్నిని ప్రార్థించును. "ప్రజానన్తః ప్రతిగృహ్ణన్తి పూర్వే ప్రాణమఙ్గేభ్యః పర్యాచరన్తమ్। సువర్గం యాహి పథిభి ర్దేవయానై రోషధీషు ప్రతితిష్ఠా శరీరైః॥" —"ఓ పశూ! దేవతలు నీ వృత్తాంతమును తెలిసికొనినవారై నీ అవయవముల పైభాగమున తిరుగుచున్న నీ ప్రాణమును తమ యధీన మైనదని స్వీకరించుచున్నారు. నీవు మాత్రము దేవతలు పోవు మార్గమున స్వర్గమునకు పొమ్ము. ప్రాణరూపమున స్వర్గమునకు పోయి అవశిష్టములైన శరీరావయవములచేత పురోడాశాది కమువలె హవిస్సు వగుము ఇచట పశూపాకరణాదికమునందు యజమానుఁడు అగ్న్యాది దేవతలను ప్రార్థించిన విధమును పరిశీలించినచో దేవతల తృప్తికై చేయునట్టి హింస లోకసాధారణమైన హింసవంటిది కాదని అర్థ మగును.

"యత్పశుర్మాయు మకృతోరో వా పద్భి రాహతే। అగ్నిర్మా తస్మాదేనసో విశ్వాన్ముఞ్చత్వంహసః॥" —"ఈ పశువు మారణ సమయమునందు దుఃఖకరమైన శబ్దము చేసినను, పాదములతో రొమ్మును కొట్టుకొనినను ఏర్పడునట్టి పాపము నుండియు, బంధనాద్యుపద్రవములచే కలుగునట్టి సమస్తమైన పాపమునుండియు అగ్ని నన్ను విడిపించు గాక. ఇది సంజ్ఞప్త హోమమంత్రము. ఈ విధముగ యజ్ఞకర్త పశుబంధనమువలన, పశువిశసనము వలనను కలుగు పాపమునుండి తన్ను విడిపించుమని అగ్నిని ప్రార్థించును. పశ్వాలంభమువలన తనకు పాపము కలుగుననియే యజ్ఞకర్తయొక్క ఉద్దేశ్యము కదా! అని అడుగవచ్చును. యజ్ఞకర్త ఇచట లోకసామాన్య దృష్టితో ఈ ప్రార్థన చేసినాడు కాని, పశ్వాలంభమువలన తనకు పాపము సంభవించు ననెడి నిశ్చయజ్ఞానముతో ఈ ప్రార్థన చేయలేదు. యజ్ఞ పశ్వాలంభమువలన పాపము వచ్చుననెడి నిశ్చయ జ్ఞానమే తన కున్నచో యజ్ఞకర్మాచరణమునందు ప్రవృత్తుడే కాడు. మఱియు లోకక్షేమమునకై చేసిన యజ్ఞము కనుక దీని వలన పాపశంకయే కలుగుటకు వీలు లేదు. "అగ్నౌ ప్రాస్తాఽఽహుతిః సమ్యగాదిత్య ముపతిష్ఠతే। ఆదిత్యా జ్జాయతే వృష్టిః" అని కదా! శ్రుతి చెప్పుచున్నది.

లోకక్షేమ దాయకమైన యజ్ఞమునకువలెనే ఆ యజ్ఞమునందు ఉపయోగించబడునట్టి ప్రతివస్తువునకు ప్రత్యేక ప్రాధాన్యము కనబడుచున్నది. యజ్ఞమునకు ముఖ్యములైన అంగములలో వేది యొకటి. ఆ వేదిని నిర్మించుటకు కొన్ని సాధనములు ఉపయోగించబడును. ఆ సాధనముల నుద్దేశించి యజమానుడు ఈ విధముగ ప్రార్థించును. "స్ఫ్యః స్వస్తిర్విఘనః స్వస్తిః పశుర్వేదిః పరశుర్నః స్వస్తిః। యజ్ఞియాయజ్ఞకృతః స్థ తే మాఽస్మిన్యజ్ఞ ఉప హ్వయధ్వమ్" (కాం. ౩. ప్ర. 2. అను. 4.) స్ఫ్యము—ఖనన సాధనమైన ఆయుధ విశేషము. విఘనము—నేలను చదును చేయుట కుపయోగించు సాధన విశేషము. ఇవియు, ఇంకను కొడవలి, గొడ్డలి, వేదియు మాకు అవినాశ హేతువు లగుగాక. ఓ స్ఫ్యాదులారా! మీరు యజ్ఞార్హములు కావున యజ్ఞసంపాదకములు కండు. అటువంటి మీరు ఈ యజ్ఞమునందు నన్ను గుర్తించుడు. ఈ మంత్రమును పఠించుచు అధ్వర్యుఁడు ఆ సాధనములను ఉత్కర మనెడి ఒక నిర్దిష్ట ప్రదేశమునందు పడవైచి వానికి నమస్కారము చేయును. వేది

నిర్మాణము చేయువాడు అధ్వర్యుఁడు కనుక అతడు నమస్కారము చేయవలెను. వేయేల? యజ్ఞమున ఉపయోగించువట్టి ప్రతి అణువు కూడ యజమానాదులచే భక్తిభావముతో స్వీకరించబడుట యజ్ఞమునకు గల అపూర్వమైన విశిష్ట స్థానమును తెలియజేయుచున్నది. కనుక లోకకల్యాణమునకై యజ్ఞమును వేదోక్తవిధముగ ఆచరించవలె ననుట సమంజసము.

## కావ్యనాటకాలంకారాది సాహిత్యమునకు వేదము మూలము

లౌకిక సంస్కృత వాఙ్మయమునకు వాల్మీకి, వేదవ్యాసులు, కావ్యనాటకాది సాహిత్యమునకు భవభూతి కాళిదాసాదులు మూలపురుషు లనెడి ప్రసిద్ధి కలదు. వాల్మీకిరామాయణము ఆదికావ్య మనియు వ్యవహరించబడుచున్నది. లౌకిక వాఙ్మయమునకు వైదిక వాఙ్మయమునకు వాల్మీకిరామాయణమునందలి సంస్కృతభాష సేతువువంటిది. అందు ప్రధాన చందస్సు అనుష్టువ్వునకు వేదము మూలమని చెప్పవచ్చును. "ఉపమా కాళిదాసస్య భారవే రర్థగౌరవమ్। దణ్డినః పదలాలిత్యం మాఘే సన్తి త్రయో గుణాః" ఉపమా నిరూపణమున కాళిదాస మహాకవి, అర్థగౌరవ ప్రదర్శనమున భారవి కవి, లలిత పదముల కూర్పునందు దండి కవియు సిద్ధహస్తులు. ఈ మూడు గుణములను తన శిశుపాలవధ కావ్యమునందు కనబఱచిన మహాకవి మాఘుడు. పైని చూపిన రామాయణములోని అనుష్టుప్ ఛందస్సునకు, కాళిధాసాది మహాకవులు తమకావ్యములందు ప్రవేశ పెట్టిన ఉపమాదులకు, "బాణోచ్ఛిష్టమిదం జగత్" అని ప్రసిద్ధి చెందిన బాణకవి వర్ణనలకును వేదమే మూలమని చెప్పుట అతిశయోక్తి కాదనుకొందును. వేద సుధాంభోధినుండి ఈ మహాకవు లందఱు తమ హృదయ కలశములు పట్టినంత అమృతమును తీసికొని తమ పలుకుబడిని పండించుకొనిరి.

"ఉదప్రుతో మరుతస్తాగ్ం ఇయర్త వృష్టిం యే విశ్వే మరుతో జునన్తి। క్రోశాతి గర్దా కన్యేవ తున్నా పేరుం తుఞ్జానా పత్యేవ జాయా।" —"ఓ ఋత్విగ్యజమానులారా! మీరు ఉదక దానము చేయు సర్వవాయువులను ఆఁకలిగొని బాధపడుచున్న కన్య ఆక్రోశించుచున్న విధముగ ప్రార్థించుడు. పానాదులందు కోరిక కలిగి యేడ్చుచున్న కన్యను 'ఏడుపకు. నీ కేమి కావలెను?' అని అడుగుచున్న తల్లిదండ్రులవలె వాయువులు ఋత్విగ్యజమానుల ననుగ్రహించునని భావము. ఇచట స్వాపేక్షితమునకై ప్రార్థించుచున్న ఋత్విగ్యజమానులకు ఆఁకలిగొని యేడ్చుచున్న కవ్య ఉపమానముగా చెప్పఁబడినది. అట్లే కన్యయొక్క తల్లిదండ్రులకు వాయువులకు ఉపమేయోపమానభావము వ్యక్త మగుచున్నది. ఇచట కన్య ఆకలిగొని యేడ్చుట లోక సహజమే. అట్టి కన్యను ఉపమానముగా గైకొనుట అనితర సాధారణము, సహజ సుందరము నైనది.

"ద్వే సముద్రౌ వితతా వజూర్యౌ పర్యావర్తేతే జఠరేవ పాదాః। తయోః పశ్యన్తో అతి యన్త్యన్య మపశ్యన్తః సేతు నాఽతి యన్త్యన్యమ్। ద్వే ద్రధసీ సతతీ వస్త ఏకః కేశీ విశ్వా భువనాని విద్వాన్। తిరోధాయైత్యసితం వసానః శుక్రమాదత్తే అనుహాయ జార్యై।" (కాం. 3. ప్ర. 2. అ. 12.) ఇట శ్లేషాలంకారము ఎంత రమణీయముగా ఉన్నదో చూడుడు.

ద్రోణకలశాదులైన మూడు పాత్రములలోను ఆధవనీయ పూతభృత్పాత్రములు రెండును రెండు సముద్రములుగాను, రెండు అహోరాత్ర రూపములుగాను ఆరోపించబడినవి. చమస గణమునందీ రెండు పాత్రములు పయస్సుతో నిండియుండును గాన వానియందు సముద్రత్వ మారోపించబడినది. సముద్రములవలె నివియు విస్తీర్ణము లైనవి. నాశము లేనివి. అనగా సముద్రమున పయస్సు (జలము) శుష్కించదు. ఆధవనీయ పూతభృత్పాత్రములందు కూడ పయస్సు నశించదు. సముద్ర మధ్యమున అలలు ఒకదానివెంట మఱియొకటి ఆవృత్త మగుచుండును. ఆధవనీయ పూతభృత్తులు కూడ ఒకటి ఒక పర్యాయము, ఇంకొకటి మఱియొక పర్యాయము ఉపయోగింపబడుచు ఆవృత్తము లగుచుండును.

ఇట్లే ఆధవనీయ పూతభృత్తులు అహోరాత్రములుగా ఆరోపించబడినవి. అహోరాత్రములలో అహస్సునందు జనులు సర్వపదార్థములను చూచుచున్నవారై గమ్యమును పొందుచున్నారు. రాత్రియందు పదార్థములను చూడలేనివారై ఏదియేని సేతువువంటి సాధనముచేత గమ్యమును చేరుకొనుచున్నారు. ఈ విధముగనే హవిర్ధానమునకు (హవిస్సునుంచు శకటమునకు) పై భాగమున నీడమునందు (గూడునందు) ఉంచబడిన ఆధవనీయము తిరోహితమై ఉండుటచే కనుపించుట లేదు. ఆ హవిర్ధానముయొక్క ఆచ్ఛాదనము లేని పై భాగమున ఉన్న పూతభృత్తు కనుపించుచుండుటచే అది అహస్సువంటిది. ఆధవనీయము రాత్రి వంటిది. ఇక మూడు పాత్రములలోను మిగిలిన ద్రోణకలశము ఒకటి మాత్రము సూర్యుడుగా వర్ణింపబడినది. సూర్యు డొక్కడు కేశ సదృశములైన కిరణములు కలవాడై తన రశ్మిచే సర్వ లోకములను ప్రకాశింపజేయుచు అహోరాత్ర

టచే ఊర్ధ్వలోకమునకు ఉపరితనమున ఉన్న పర్వత సానువు కూడ కంపించుచుండును. మఱియు మీరు ఉదకములవలె వ్యాపించుచున్నవారువలె క్రీడించుచున్నవారలై పరుగిడుడు." ఇటువంటి వాయువులతో కూడియున్న పునర్నవా ధూమము వృష్టిని కలిగించు గాక అని భావము. వర్షము కురియుటకు ముందు కాని కురియు సమయమున గాని పెనుగాలులు వీచుటయు, దానివలన భయంకరమైన ధ్వనులు ఏర్పడుటయు సహజము. ఆ గాలుల గర్జనములకు మహాపర్వతములు ఊర్ధ్వలోకమునందలి పర్వత సానువులును భయపడుట అసంభవము. సంభవము కానిది సంభవించినట్లుగా వర్ణించబడుటచే ఇచట అతిశయోక్త్యలంకారము స్పష్ట మగుచున్నది.

"అభి క్రన్ద స్తనయ గర్భమా ధా ఉదన్వతా పరి దీయా రథేన। దృతిగ్ం సు కర్ష విషితం న్యఞ్చగ్ం సమా భవన్తూద్వతా నిపాదాః"। (కా. 3. ప్ర. 1. అ. 11.) "-ఓ అశ్వమా! అంతటను శబ్దము చేయుము. మేఘ గర్జితమువలె ఉచ్చధ్వని చేయుము. మేఘముయొక్క ఉదరమునందు జలరూప గర్భమును కలుగజేయుము. మఱియు ఉదకము కలిగియున్న రథసదృశ మేఘముతో కూడ అంతటను పొమ్ము. విముక్త ద్వారము కలదియు, అడ్డముగా చేయబడినదియు వగు మేఘమును సుఖముగ ఆకర్షితముగ చేయుము. నిమ్న (పల్లపు) ప్రదేశములు కూడ ఉదకములతో నిండినవై ఉన్నత ప్రదేశములతో సమానము లగుఁగాక." ఈ మంత్రము అన్నియు 'కారీరి' యాగమున హోమము చేయునపుడు పఠించవలసినవి. ఆ సందర్భముననే నల్లని గుఱ్ఱమును కృష్ణవస్త్రముతో ఆచ్ఛాదించుచు ఈ మంత్రమును పఠించవలెను. ఇది వర్షకాముడు చేయదగిన యాగము. అందు ఇది యొక ప్రక్రియ. ఆ అశ్వము ఇచట సంబోధించబడినది. కుంభవృష్టి కలిగినపుడు పల్లపుభూములు కూడ నీటితో నిండి ఉన్నత ప్రదేశములతో సమానముగ కనబడుట సహజము. ఆ లోక సహజ వృత్తాంతమే ఇచట మనోహరముగ వర్ణించబడినది. ఇచట స్వభావోక్త్యలంకారము వ్యక్త మగుచున్నది.

"పిన్వ న్త్యపో మరుతః సుదానవః పయో ఘృతవ ద్విదథేష్వాభువః। అత్యం న మిహే వి నయ న్తి వాజిన ముత్సం దుహ న్తి స్తనయ న్త మక్షితమ్" (కా. 3. ప్ర. 1. అ. 11.)-"బాగుగ దానము చేయుటయం దాసక్తములైన వాయువులు యజ్ఞములందు నీటిని నేతిని ఋత్విగ్యజమానులు స్రవింపజేయువిధముగ ఉదకములను స్రవింపజేయుచున్నవి. అశ్వశిక్షకులు అశ్వమును శిక్షించి విధేయముగ జేసికొనువిధముగ వాయువులు వర్షమునకై మేఘమును విధేయముగ జేసికొని గర్జించుచున్న మేఘమును క్షయ రహితముగ నిరంతర జలస్రావము కలుగునట్లు వర్షింపజేయుచున్నవి." ఇచట వాయువులు స్రవింపఁజేయు నుదకములకు ఋత్విగ్యజమానులు యజ్ఞమునందు స్రవింపజేయు ఉదకములు నేయి ఉపమానములుగా వర్ణించబడినవి. ఈ వర్ణనముచే యజ్ఞమునందలి ఉదకములవలెను ఆజ్యములవలెను వాయువులు స్రవింపజేయుచున్న ఉదకములు పవిత్రములైనవను అర్థము ధ్వనించుచున్నది. ఇచట ఉపమాలంకారము స్పష్ట మగుచున్నది. వాయువులు విధేయముగ జేసికొనుచున్న మేఘమునకు అశ్వశిక్షకులు విధేయముగ చేసికొను అశ్వము ఉపమానముగ పేర్కొనబడినది. కనుక ఇచట కూడ ఉపమాలంకారము వ్యక్త మగుచున్నది. ఈ రెండు ఉపమలు లోకవృత్తమును తెలియజేయుచున్నవి. ఇచట ఉపమేయములు రెండు, ఉపమానములు రెండు ఉండుటవలన రెండు ఉపమాలంకారములే కాని, మాలోపమ కాదు. ఇట్టి సాలంకారములు హృద్యములునైన మంత్రములు ప్రతికాండమునందును శతాధికముగ గలవు.

జంబూద్వీపములో భారతదేశమే కర్మభూమి. మిగిలినవి భోగభూములు. ఈ కర్మభూమియందు చేయబడిన సుకృతము కాని, దుష్కృతము కాని ఒక ముహూర్తమాత్ర కాలమందు చేయబడినదైనను అది యుగములు నశించినను ఫల మీయకుండ నశించదు అని చెప్పబడిన కర్మభూమి ఈ భారత దేశమే. ఇట్టి భారత దేశమును ఆదినుండియు ఆశ్రయించి ఉన్నవారు భారతీయులు. ఆ భారతీయు లాచరించవలసినది కర్మమార్గము. ఆ కర్మమార్గమునకు ప్రబోధకము ప్రధానముగ యజుర్వేదము. అట్టి యజుర్వేదము అందఱికి సులభ గ్రాహ్య మగుటకొఱకే ఇప్పుడు తెలుగున వ్యాఖ్యానించ బడుచున్నది.

శ్రియఃపతియగు శ్రీనివాసుని యనుగ్రహముచే యజుర్వేద ప్రాజెక్టును నెలకొల్పి అనితరసాధ్యమైన ఈ యజుర్వేద ముద్రణాది బాధ్యతను శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము నిర్వహించుటకు ఆమోదింపజేసిన, ఆస్తిక శిరోమణులు, ఆర్షవాఙ్మ

యమునందు అత్యంతాదరాభిమానులు, అప్పటి టి.టి.డి. కార్యనిర్వహణాధికారులును అయిన శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఐ.ఏ.ఎస్., గారికిని, ఈ ప్రణాళికను నిరాటంకముగ కొనసాగించుచు అనతి కాలములోనే ఈ యజుర్వేదార్థ తృతీయ సంపుటము నావిర్భవింప జేసిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారులు శ్రీ సి.హెచ్. వెంకటపతిరాజు, ఐ.ఏ.ఎస్., గారికిని నా నమోవాక శతంబులు. నన్ను దేవస్థానమువారికి పరిచితుని చేసి తాము కూడ ఈ వేదార్థ రచనా వ్యాసంగమున భాగస్వామ్యమును వహించి ఈ కార్యక్రమము అవిచ్ఛిన్నముగ కొనసాగుటకు కారణభూతులును, ఇప్పుడు కీర్తిశేషులును అయిన కళాప్రపూర్ణ, డాక్టర్. శ్రీ దివాకర్ల వేంకటవధాని, యం.ఏ.పిహెచ్.డి. గారికి కృతజ్ఞతాపూర్వకముగ సంస్మృతులు.

ఈ కార్యక్రమము ఆచరణ సాధ్య మగుటలో అనవరతము నిర్విరామముగ కృషి చేసి అనేక విధముల ప్రోత్సాహము నిచ్చి శ్రీ సాయనాచార్య విరచిత విద్యారణ్య భాష్యమునకు మాధవాచార్యులవలె ఈ వేదార్థము వెలుగులోనికి వచ్చుటకు కారణభూతులైన డాక్టర్. శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి, యమ్.ఏ.,బి.ఇడి.,డి.లిట్., గారికిని, ఈ వేదార్థ ముద్రణాదికమును పటుతరముగ పర్యవేక్షించుచు, నాకు అనేకవిధముల సహకారము నందజేసిన సప్తగిరి సంపాదకులు శ్రీ కె. సుబ్బారావు, యం.ఏ గారికిని కృతజ్ఞతా పూర్వక నమస్సులు. ముద్రణములోని లోపములను సరిచేయుటలోను, ఇతరములైన ముద్రణపు కార్యములలోను నాకు బహుముఖముగ సలహాల నొసంగుచు, నా కార్యభారమును తాము కొంత వహించుచు సహాయపడిన శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి, యమ్.ఏ. గారికిని, విద్వాన్ శ్రీ ముదివర్తి కొండమాచార్యులు గారికిని నా హార్దములైన అభివందనములు. ఈ యజుర్వేదార్థ ముద్రణమునకు ఒక ప్రత్యేకతను సంతరింపజేసి త్వరితగతిని సర్వాంగ సుందరముగ ఈ యజుర్వేదార్థ ప్రథమ ద్వితీయ సంపుటములవలె ఈ తృతీయ సంపుటమును కూడ రూపొందించిన శ్రీ యమ్. విజయకుమార్‌రెడ్డి టి.టి.డి. ప్రెస్ మేనేజరు గారికి కృతజ్ఞతా పూర్వక సాధువాదములు. వారి సిబ్బందికి ఆశీఃపూర్వకములైన నా శుభాకాంక్షలు

శిరోమణి, భాషాప్రవీణ,
తర్క వ్యాకరణ పూర్వోత్తర మీమాంసా విశారద
**రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి.**

# పారిభాషిక పదార్థ సంగ్రహము

| | పదము | | వివరణము |
|---|---|---|---|
| 1) | అనుఖ్యాత | : | కార్యమును వ్యాప్తి చేయువాఁడు. |
| 2) | అనురోహము | : | ప్రథమ సంతానానంతర భావియైన అపత్యోత్పత్తి. |
| 3) | అపానము | : | శ్వాసను లోపలికి పోనిచ్చుట. |
| 4) | అభిజితి | : | హింసార్థమైన హోమము. |
| 5) | అభిమర్శనము | : | స్పృశించుట (తాఁకుట). |
| 6) | అవదానము | : | హోమసాధనముచే ఆజ్యాదికమును పాత్రములోనికి గ్రహించుట. |
| 7) | ఆఘారము | : | దక్షిణ పరిధిని సడలించి అచటనుండి తూర్పుగాను, ఉత్తరముగాను ఆజ్యాదికమును అగ్నియందు పడవేయుట. |
| 8) | ఆమిక్ష | : | పాలవిఱుగుడు. |
| 9) | ఆలంభనము | : | చంపుట. విశసనము, ఆలంభము, సంజ్ఞపనము. ఇవి పర్యాయ పదములు. |
| 10) | ఆశిరము | : | మథించఁబడిన దధి. |
| 11) | ఇష్టము | : | శ్రౌతకర్మ. |
| 12) | ఉద్గీథము | : | ఉత్కృష్ట గానవిశేషము. |
| 13) | ఉపద్రష్ట | : | కార్యమును విచారించుకొనువాఁడు. |
| 14) | ఉపబ్ది | : | ప్రక్కన ఉన్నవారికి కొంచెము వినిపించునట్లు మంత్రముల నుచ్చరించుట. |
| 15) | ఉపాంశు | : | ప్రక్కన ఉన్నవారికి కూడ వినిపించకుండ మంత్రముల నుచ్చరించుట. |
| 16) | ఉపాకరణము | : | దర్భముష్టిచేఁగాని, దర్భలచేఁగాని మంత్రపూర్వకముగ సంస్కరించుట. స్తోత్ర పాఠమును గానము చేయుట కనుజ్ఞ నిచ్చుట. అధ్వర్యుఁడు ప్రస్తోతకు బర్హిర్ముష్టిని ప్రదానము చేయుట. ఇవి యన్నియు ఉపాకరణ పదమున కర్థములు. |
| 17) | ఉపశ్రోత | : | కార్యము నంగీకరించి బలపఱచువాఁడు. |
| 18) | ఋతము | : | మనస్సుచే యథార్థవస్తు చింతనము చేయుట. యజ్ఞము. |
| 19) | ఓజస్సు | : | బలహేతువైన అష్టమ ధాతువిశేషము. |
| 20) | క్రతువు | : | అంగోపాంగ సహితమై సంపూర్ణమైన కర్మవిశేషము. |
| 21) | గ్రహము | : | పాత్రము. దీనియందు సోమరసాదులను నింపుదురు. |
| 22) | ఛందోమములు | : | గాయత్రీ త్రిష్టుప్ జగతీ చ్ఛందస్సులచే ఉపమింపఁదగిన స్తోమములు. |
| 23) | జుహువు | : | ఆజ్యాది హవిస్సును అగ్నియందు హోమము చేయు సాధన విశేషము. ఇది మోదుగు కఱ్ఱతో చేయఁబడి యుండును. |

| | | | |
|---|---|---|---|
| 24) | తపస్సు | : | స్నానము, దానము, అనశనము, వైదిక మంత్ర పాఠము అను ఈ అయిదు తపశ్శబ్దార్థములు. |
| 25) | తానూనప్త్రము | : | తనూనప్త్రగ్ని దేవతాకమైన ఆజ్యము. |
| 26) | త్రైగుణ్యము | : | పురుషుడు, స్త్రీ, ఆ ఉభయుల సంయోగము అను ఈ మూఁడింటియొక్క సమష్టి. |
| 27) | దీక్షితవాదము | : | యజ్ఞదీక్షను వహించిన యజమానుఁడు పఠించవలసిన మంత్రము. |
| 28) | ధ్రువ | : | ఆజ్యాది హవిస్సును అగ్నియందు హోమము చేయు సాధన విశేషము. ఇది పుల్లవెలఁగ చెట్టు కఱ్ఱతో చేయఁబడియుండును. |
| 29) | నీరోహము | : | గర్భమునకు నిశ్శేషముగ అవయవాభివ్యక్తి. |
| 30) | పదాజ్యనము | : | అడుగు జాడలందు హోమము చేయఁబడిన నేతితో కలసిన ధూళి. |
| 31) | పాఙ్క్తము | : | ధాన, కరంభ, పరివాప, పురోడాశ, పయస్య అను పంచ ద్రవ్యములు కల యజ్ఞము. |
| 32) | పూర్తము | : | స్మార్తకర్మ. |
| 33) | పృషదాజ్యము | : | పెరుగులో కలుపఁబడిన నేయి. |
| 34) | ప్రజనన వ్యాపారము | : | స్త్రీ పురుషులు సంతానోత్పత్తికై చేయు రతివ్యాపారము. |
| 35) | ప్రతిగరము | : | మంత్రముచేత ప్రోత్సహించుట. |
| 36) | ప్రతిధుక్కు | : | దోహన పాత్రమునందలి పయస్సు. |
| 37) | ప్రధురము | : | బండికంటి కడకమ్మి. |
| 38) | ప్రరోహము | : | ప్రథమ సంతానోత్పత్తి. |
| 39) | ప్రవృత్తి | : | మంథన వ్యాపారము. |
| 40) | ప్రాణనము | : | శ్వాసను వెలుపలకు విడుచుట. |
| 41) | ప్రైష | : | ఈ పని ఇట్లు చేయుఁడని అధ్వర్యుఁడు హోత్రాదుల నాదేశించుట. |
| 42) | భ్రాజస్సు | : | శరీరకాంతికి బహిర్భూతమైన రశ్మిరూప దీప్తి. |
| 43) | మస్తు | : | నవనీతము(వెన్న). |
| 44) | మథునీభావము | : | ఆలుమగల సంయోగ ధర్మము. |
| 45) | మేధ | : | మంత్రమును, మంత్రార్థమును ధారణ చేయఁగల సామర్థ్యము. |
| 46) | యజ్ఞము | : | దేవత నుద్దేశించి హవిస్సును హోమము చేయుట. |
| 47) | విశసనము | : | ఆలంభనము, విశసనము, సంజ్ఞపనము సమానార్థకములు. యజ్ఞపశువును చంపుట అను నర్థమున ఈ పదముల నుపయోగింతురు. |
| 48) | విశ్రంభము | : | ప్రమాద రాహిత్యము. |

49) వ్యానసము : శ్వాసను మధ్యమున ధారణ చేయుట. అనఁగా ప్రాణాపానముల సంధి.

50) శస్త్రములు : హోతచే గానము చేయఁబడు స్తోత్రవిశేషములు.

51) శృతము : పక్వము.

52) శ్రపణము : యజ్ఞపశువునందలి వపాదికమును వండుట అను నర్థమున ఈ పదము ఉపయోగిం చఁబడును.

53) సంజ్ఞపనము : యజ్ఞపశువును చంపుట.

54) సంరోహము : శుక్ర శోణిత సంశ్లేషముచే గర్భాభివ్యక్తి.

55) సంవృత్ : మంథన వ్యాపార సమాప్తి.

56) సంస్రావము : ఒకానొక హవిస్సు.

57) సోమక్రయణి : సోమలతను కొనుటకు సాధనమైన గోవు.

58) స్తుతములు : ఉద్గాతచే గానము చేయఁబడు స్తోత్రవిశేషములు.

59) స్తోమము : త్రివృత్, పంచదశ, సప్తదశ స్తోమాదికమైన స్తోత్రవిశేషము.

60) స్రుక్కు
61) స్రువము : ఆజ్యాదికమును అగ్నియందు హోమము చేయు సాధనములు. ఇవి చంద్ర కఱ్ఱతో చేయఁబడి యుండును.

# తృతీయ కాండము

## విషయ సూచిక

### ప్రథమ ప్రపాఠకము


| విషయము | | పుట. |
|---|---|---|
| 1. దీక్షిత కర్తవ్య మంత్రాద్యభిధానము. | .... | 1 |
| 2. సోమోపస్థాన మంత్రములు | .... | 6 |
| 3. సోమక్రయణీ పదాంజనాది విధి | .... | 11 |
| 4. పశూపాకరణ మంత్రామ్నానము | .... | 14 |
| 5. పశూపాకరణ మంత్ర బ్రాహ్మణము | .... | 18 |
| 6. అభిమర్శన విధి మంత్రములు | .... | 22 |
| 7. నిమిత్త ప్రయోగాభిధానము | .... | 25 |
| 8. ఉపాంశు గ్రహార్థాభిషవ మంత్రములు | .... | 31 |
| 9. సవనాహుత్యాది మంత్రములు | .... | 33 |
| 10. ప్రవృత హోమాది మంత్రములు | .... | 40 |
| 11. యాజ్యా పురోనువాక్యలు | .... | 44 |


### ద్వితీయ ప్రపాఠకము


| | | |
|---|---|---|
| 1. పవమాన గ్రహ త్రయ విధి | .... | 55 |
| 2. సవన నిరూపణము | .... | 58 |
| 3. సోమావేక్షణము | .... | 62 |
| 4. స్ఫ్యాద్యుపస్థాన మంత్రములు | .... | 66 |
| 5. భక్ష మంత్రాభిధానము | .... | 71 |
| 6. పృషదాజ్యాభిధానము | .... | 78 |
| 7. స్తుత శస్త్రాభిధానము | .... | 82 |
| 8. తృతీయ సవన మాధ్యందిన సవన మంత్రములు | .... | 85 |
| 9. ప్రతిగరానంతర మంత్రములు | .... | 92 |
| 10. ప్రతినిర్గ్రాహ్య మంత్రములు | .... | 100 |
| 11. త్రైధాతవీయేష్టి మంత్రములు | .... | 104 |


### తృతీయ ప్రపాఠకము


| విషయము | | పుట |
|---|---|---|
| 1. అతిగ్రాహ్య మంత్రములు | .... | 108 |
| 2. స్తోత్రోపాకరణ ప్రతిగరాంగ మంత్రములు | .... | 111 |
| 3. అదాభ్యాంశు గ్రహ మంత్రములు | .... | 114 |
| 4. అదాభ్యాంశు గ్రహ మంత్ర బ్రాహ్మణము | .... | 118 |
| 5. ద్వాదశాహ శేష పృశ్ని గ్రహాభిధానము | .... | 122 |
| 6. అతిగ్రాహ్య విశేషాభిధానము | .... | 127 |
| 7. ఆశ్రావయేత్యాది మంత్ర విధి | ... | 131 |
| 8. అవభృథాంగ హోమాదికము | .... | 134 |
| 9. వృషాలంభ కర్మాభిధానము | .... | 140 |
| 10. పశు ప్రాయశ్చిత్త విశేషము | .... | 143 |
| 11. యాజ్యా పురోనువాక్యలు | .... | 146 |


### చతుర్థ ప్రపాఠకము


| | | |
|---|---|---|
| 1. వశా గర్భ దర్శన నిమిత్త పూర్వోక్త మంత్ర వ్యాఖ్యానము | .... | 153 |
| 2. భూత్యాది కామునకు వశాలంభనార్థ మంత్రములు | .... | 158 |
| 3. కామ్య పశ్వాలంభన విధి | .... | 161 |
| 4. జయాఖ్య మంత్రములు | .... | 169 |
| 5. అభ్యాతాన మంత్రములు | .... | 171 |
| 6. అభ్యాతాన హోమాభిధానము | .... | 173 |
| 7. రాష్ట్రభృన్మంత్రములు | .... | 178 |
| 8. రాష్ట్రభృన్మంత్రముల కామ్య ప్రయోగాభిధానము | .... | 180 |

| విషయము | పుట |
|---|---|
| 9. దేవికేష్ట్యాది కామ్యప్రయోగాభిధానము | .... 188 |
| 10. అగ్ని సమారోపణము | .... 195 |
| 11. యాజ్యా పురోనువాక్యలు | .... 201 |

## పంచమ ప్రపాఠకము

| విషయము | పుట |
|---|---|
| 1. అన్వారంభణీయేష్టి విధి | .... 209 |
| 2. సౌమిక బ్రహ్మత్వ విధి | .... 215 |
| 3. విష్వతిక్రమోక్తి | .... 222 |
| 4. అతిమోక్ష మంత్రములు | .... 225 |
| 5. ఆదిత్య గ్రహ మంత్రోక్తి | .... 230 |
| 6. పత్నీ విషయ మంత్రములు | .... 234 |
| 7. దర్శపూర్ణమాసాంగ భూత స్రుగాదులకు వృక్షవిధానము | .... 238 |
| 8. దధిగ్రహ మంత్రములు | .... 242 |
| 9. దధిగ్రహ విధానము | .... 244 |
| 10. గవామయనమందు అతిగ్రాహ్యాది గ్రహాభిధానము | .... 247 |
| 11. పాతుక హౌత్రోపయోగి మంత్రములు | .... 251 |
| 12. త్రివృదాది స్తోమముల స్వరూపము | .... 258 |
| 13. తృతీయకాండ గత విషయ సమీక్ష | .... 261 |

# తృతీయ కాణ్డమ్।

## తత్ర ప్రథమ ప్రపాఠకే ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]ప్రజాపతి రకామయత ప్రజా స్సృజేయేతి స తపో ఽతప్యత స సర్పా నసృజత సో ఽకామ యత ప్రజా స్సృజేయేతి స ద్వితీయ మతప్యత స వయాగ్ంస్యసృజత సో ఽకామయత ప్రజా స్సృజేయేతి స తృతీయ మతప్యత స ఏతం దీక్షితవాద మపశ్య త్తమవద త్తతో వై స ప్రజా అసృజత[2]యత్తప స్తప్త్వా దీక్షితవాదం వదతి ప్రజా ఏవ తద్యజమానః (౧)సృజతే [3]యద్వై దీక్షితో ఽమేధ్యం పశ్యత్యపాస్మా ద్దీక్షా క్రామతి నీలమస్య హరో వ్యేత్యబద్ధం మనో దరిద్రం చక్షుస్సూర్యో జ్యోతిషాగ్ం శ్రేష్ఠో దీక్షే మా మా హాసీరిత్యాహ నాస్మా ద్దీక్షాఽప క్రామతి నాస్య నీలం న హరో వ్యేతి [4]యద్వై దీక్షితమభి వర్షతి దివ్యా ఆపో ఽశాన్తా ఓజో బలం దీక్షామ్ (౨)తపోఽస్య నిర్ఘ్నన్త్యున్దతీర్బలం ధత్తౌజో ధత్త బలం ధత్త మా మే దీక్షాం మా తపో నిర్వధిష్టేత్యాహైతదేవ సర్వ మాత్మన్ధత్తే నాస్యౌజో బలం న దీక్షాం న తపో నిర్ఘ్నన్త్య [5]గ్ని ర్వై దీక్షితస్య దేవతా సో ఽస్మాదేతర్హి తిర ఇవ యర్హి యాతి తమీశ్వరగ్ం రక్షాగ్ంసి హన్తోః (౩)భద్రాదభి శ్రేయః ప్రేహి బృహస్పతిః పుర ఏతా తే అస్త్విత్యాహ బ్రహ్మ వై దేవానాం బృహస్పతి స్తమేవాన్వారభతే స ఏనగ్ం సం పారయ[6]త్యేద మగన్మ దేవయజనం పృథివ్యా ఇత్యాహ దేవయజనగ్ం హ్యేష పృథివ్యా ఆ గచ్ఛతి యో యజతే[7]విశ్వే దేవా యద

నాయందు శరీర బలమును, తత్కారణమైన ఓజస్సును ఇంద్రియబలమును తపస్సును స్థాపించుఁడు. నన్ను, నా దీక్షను, తపస్సును నశింపఁజేయవలదు'' అని మంత్రార్థము. ఈ మంత్రమును పఠించుటచేత దీక్షితుఁడు బలాదికమును సర్వమును వహించును. ఇతని ఓజస్సును, బలమును, దీక్షను, తపస్సును వర్షోదకములు నశింపఁజేయవు. కనుకనే ''న వర్షధారాస్వాచామేత్''= వర్షధారలయందు ఆచమనము చేయరాదు, అని స్మృతి చెప్పుచున్నది. (దీక్ష వహించిన యజమానుఁడు అమేధ్యమును జూచినపుడు "అబద్ధం మనః" ఇత్యాది మంత్రమును, ఎదుట వర్షము కురిసినపుడు "ఉన్దతీ ర్బలం ధత్తే" త్యాది మంత్రమును జపించవలెనని కల్పసూత్రకారుఁడు చెప్పెను. ఉన్దతీః. ''ఉన్దీ=క్లేదనే, క్లేదనమ్=ఆర్ద్రీభావః'' అని తత్త్వబోధిని. "అబద్ధం మనః" ఇత్యాది మంత్రద్వయము ''దైవీం ధియం మనామహే" అను అనువాకమునందు గలదు.)

5\. అర్థము: దీక్షితస్య=దీక్ష వహించిన యజమానునకు, అగ్నిః=అగ్ని, దేవతా వై=దేవత కదా! దీక్షితః=దీక్షితుఁడు, యర్హి=ఎప్పుడైతే, యాతి=ప్రయాణము చేయుచున్నాఁడో, ఏతర్హి=ఈ సమయమునందే, సః=ఆ యగ్ని, తిరః ఇవ (భవతి)=తిరోభూతుఁడువలె నగుచున్నాఁడు. తమ్=ఆ యగ్నిదేవతా రహితుఁడైన దీక్షితుని, రక్షాంసి=రాక్షసులు, హన్తోః=చంపుటకు, ఈశ్వరమ్=సమర్థులు. (తద్దోష నివారణాయ=ఆ దోషము పోవుటకై, భద్రాదభీతి=భద్రాదభీత్యాది మంత్రమును, పఠేత్=పఠించవలెను.) హే రథ!=ఓ రథమా! భద్రాత్=(నా) గృహమునుండి, శ్రేయః అభి=అత్యంత ప్రశస్తమైన దేవయజన స్థానమున కభిముఖముగ, ప్రేహి=రమ్ము. తే=నీయొక్క, పురః=ఎదుట, బృహస్పతిః=బృహస్పతి, ఏతా=నడువఁగలఁడు. ఇతి=అని, ఆహ=భద్రాదభీత్యాది మంత్రము చెప్పెను. దేవానామ్=దేవతలలో, బృహస్పతిః=బృహస్పతి, బ్రహ్మ వై=బ్రాహ్మణుఁడు కదా! (దీక్షితః=దీక్షితుఁడైన యజమానుఁడు, తమేవ=ఆ బృహస్పతినే), అనురభతే=అనుసరించి వెళ్లుచున్నాఁడు. సః=ఆ బృహస్పతి, ఏనమ్=ఈ దీక్షితుని, సంపారయతి=బాగుగ గమ్యమును జేర్చుచున్నాఁడు.

తాత్పర్యము: దీక్షితునకు అగ్ని దేవత కదా! దీక్షితుఁడు స్వగృహమునుండి యజ్ఞశాలకు బోవునపుడు ఆ యగ్ని తిరోభూతుఁడువలె నగుచున్నాఁడు. అగ్నిదేవతా రహితుఁడైన ఆ దీక్షితుని రాక్షసులు సంహరింప సమర్థులగుదురు. తద్దోష నివారణమునకై దీక్షితుఁడు ప్రయాణ సమయమున "భద్రాదభీ'' త్యాది మంత్రమును పఠించవలెను. "ఓ రథమా! నా గృహమునుండి అత్యంత ప్రశస్తమైన దేవయజన ప్రదేశమున కభిముఖముగ రమ్ము. నీ యెదుట బృహస్పతి నడువఁగలఁడు.'' అని ఆమంత్రముయొక్క భావము. దేవతలలో బృహస్పతి బ్రాహ్మణుఁడు కదా! (కావున బృహస్పతి రాక్షసులను శపించఁగలఁడు). దీక్షితుఁడైన యజమానుఁడు బృహస్పతి ననుసరించి వెళ్లవలెను. ఆ బృహస్పతి ఈ దీక్షితుని బాగుగ గమ్యమును చేర్చును. ('ఏతా', 'ఇణ్'=గతౌ' అను ధాతువునకు అనద్యతన భవిష్యదర్థమున లుట్ ప్రత్యయము చేయఁగా, ఏతా= అను రూప మేర్పడినది. యజ్ఞ దీక్షితుఁడైన యజమానుఁడు స్వగృహమునుండి యజ్ఞశాలకు బండిమీఁదఁ బోవుచు మార్గ మధ్యమున "భద్రాదభీ''త్యాది మంత్రమును పఠించవలెను.)

6\. అర్థము: "పృథివ్యాః=పృథివికి సంబంధించిన, ఇదం దేవయజనమ్=ఈ యజ్ఞశాలా ప్రదేశమును, ఆ అగన్మ=వచ్చితిమి'' ఇతి=అని, ఆహ="ఏదమగన్మే"త్యాది మంత్రము చెప్పెను. యః=ఏ యజమానుఁడు, యజతే=యాగము చేయుచున్నాఁడో, ఏషః=ఈ యజమానుఁడు, పృథివ్యాః=పృథివి సంబంధియైన, దేవయజనమ్=దేవయాగ ప్రదేశమును గూర్చి, ఆగచ్ఛతి హి=వచ్చుచున్నాఁడు కదా!

తాత్పర్యము: యజ్ఞ దీక్షితుఁడు యజ్ఞశాలను జేరిన యనంతరము "ఏదమగన్మే" త్యాది మంత్రమును పఠించవలెను. "పృథివి సంబంధియగు దేవయజన ప్రదేశమునకు వచ్చితిమి" అని ఆ మంత్రముయొక్క భావము. యజ్ఞము చేయు యజమానుఁడు పృథివి సంబంధియగు దేవయజన స్థానమునకు వచ్చుచున్నాఁడు కదా! (ఏదమగన్మేత్యాది మంత్ర పూర్వభాగార్థము ఇచటఁ జెప్పఁబడినది.)

7. అర్థము: "పూర్వే విశ్వే దేవాః=ప్రాచీనులైన సమస్త ఋత్విగ్బ్రాహ్మణులు, యత్=ఏ దేవయజన స్థానమును, అజుషన్త=సేవించిరో", ఇతి=అని, అహ='ఏదమగన్మే'త్యాది మంత్రమునందలి ఉత్తర భాగమైన "విశ్వే దేవాః" ఇత్యాది మంత్రము చెప్పినది. బ్రాహ్మణాః యత్=బ్రాహ్మణు లెవరు కలరో, ఏతద్విశ్వే దేవాః=ఈ సర్వ ఋత్విగ్బ్రాహ్మణులు, జోషయన్తే=దేవయజనమును సేవించుచున్నారు.

తాత్పర్యము: "ఏదమగన్మే" త్యాది మంత్రమునందలి ద్వితీయ భాగమునఁ గల దేవపదము ఋత్విజులైన బ్రాహ్మణులను దెలుపునది యని ఈ బ్రాహ్మణము దేవపదార్థమును వివరించుచున్నది. అనఁగా పూర్వులైన ఋత్విజులు సేవించిన పృథివి సంబంధి దేవయజన ప్రదేశమునకు వచ్చితిమని "ఏదమగన్మ దేవయజనం పృథివ్యా విశ్వే దేవా యదజుషన్త పూర్వే" అను మంత్రమున కర్థము. ("జుషీ"=ప్రీతి సేవనయోః, అను ధాతువు నుండి 'అజుషన్త' అను రూప మేర్పడినది.)

8. అర్థము: "ఋక్సామాభ్యామ్=ఋగ్వేద సామవేదములచేతను, యజుషా=యజుర్వేదముచేతను, సంతరన్తే=యాగము యొక్క పారమును బాగుగ బొందించుచున్నారు" ఇతి=అని, ఆహ=పూర్వోక్త మంత్రముయొక్క తృతీయ భాగము చెప్పినది. యః=ఏ యజమానుఁడు, యజతే=యాగము చేయుచున్నాఁడో, ఏషః=ఇతఁడు, ఋక్సామాభ్యామ్=ఋక్సామ వేదములచేతను, యజుషా=యజుర్వేదముచేతను, సంతరతి=యాగ పారమును బాగుగ బొందించుచున్నాఁడు.

తాత్పర్యము: "ఋక్సామాభ్యా" మిత్యాది మంత్రము 'ఏదమగన్మే' త్యాది మంత్రమునందలి తృతీయ భాగము. యాగము చేయు యజమానునకు వేదత్రయాపేక్ష కలదని ఈ తృతీయభాగము స్పష్టము చేయుచున్నది. అనఁగా యాగము చేయు నతఁడు ఋగ్యజుస్సామ వేదములచేతనే తన యాగమును బాగుగ సంపూర్తి చేయఁగలుగుచున్నాఁడని భావము.

9. అర్థము: "రాయస్పోషేణ=ధనసమృద్ధిచేతను, ఇషా=అన్నముచేతను, సం మదేమ=బాగుగ తృప్తి నొందెదము" (సంతోషించెదము), ఇతి=అని, ఆహ=పూర్వోక్త మంత్ర చతుర్థ భాగమైన "రాయస్పోషేణే" త్యాది మంత్రము చెప్పినది. ఏతామ్=ధన సమృద్ధిచేతను, అన్నముచేతను సంతోషించెదము అను ఈ ప్రార్థనము, ఆశిషమేవ=ఆశీస్సుగానే, ఆశాస్తే=(యజమానుఁడు) కోరుచున్నాఁడు.

తాత్పర్యము: "ఏదమగన్మే" త్యాది పూర్వోక్త మంత్రమునందలి "రాయస్పోషేణే" త్యాది చతుర్థ భాగము 'ధన సమృద్ధి చేతను, అన్నముచేతను సంతోషించెదము' అని చెప్పినది. యజమానుఁడు దీనిని ఆశీ రూపముగనే తలఁచుచున్నాఁడు.

ప్రథమానువాకము సమాప్తము

---

గాయత్రీ చ్ఛందస్సునకు ఇరువది నాలు గక్షరములు, త్రిష్టుప్ ఛందస్సునకు చత్వారింశాక్షరములు, జగతీ చ్ఛందస్సునకు అష్టాచత్వారింశాక్షరములును గలవు. స్తోమములు మూడింటియొక్క సంఖ్య వరుసగా ఆ విధముగనే యున్నది. గాయత్ర్యాది ఛన్దోభిః మీయ న్తే=ఉపమీయ న్తే ఇతి ఛన్దోమాః. కావున అట్టి ఛన్దోమములయొక్క సామ్రాజ్యము ద్వాదశాహోద్యుత్తర క్రతువులందుఁ గలదు.) లతారూపమైన సోమమును విక్రయింపఁ దగినదానిని ఆ ఛందోమముల సామ్రాజ్యమునకు పొమ్మని యజమానుఁడనైన నేను చెప్పుచున్నట్లుగా స్తోమములచే నారాధ్యయైన దేవత సోమదేవతకుఁ జెప్పుఁగాక యని తాత్పర్యము. (ద్వాదశాహ క్రతువునందలి అష్టమాహస్సు చతుర్వింశ స్తోమ సాధ్యము. నవమాహస్సు చత్వారింశ స్తోమ సాధ్యము. దశమాహస్సు అష్టాచత్వారింశ స్తోమ సాధ్యము. కావున ఛన్దోమముల సామ్రాజ్యము ద్వాదశాహోద్యుత్తర క్రతువులందు లభ్య మగును.)

2. **అర్థము:** యః వై=ఏ యజమానుఁడైతే, సోమం రాజానమ్=సోమ దేవతారూప రాజును, సామ్రాజ్యం లోకమ్=(పూర్వోక్తమైన) సామ్రాజ్య రూప లోకమును, గమయిత్వా=పొందించి, క్రీణాతి=కొనుచున్నాఁడో, సః=అతఁడు, స్వానామ్=స్వీయులలో, సామ్రాజ్యమ్=సామ్రాజ్యమును గూర్చి, గచ్ఛతి=వెళ్లుచున్నాఁడు. ఛన్దాంసి=గాయత్రీ త్రిష్టుప్ జగతీ రూప ఛందస్సులు, తదుపలక్షిత ఛందోమములు, సోమస్య రాజ్ఞః=సోమ రాజునకు, సామ్రాజ్యో లోకః ఖలు వై=సామ్రాజ్య యుక్త లోకము కదా!

**తాత్పర్యము:** సోమదేవతా రూపమైన రాజును సామ్రాజ్య రూప లోకమునకు పంపి లతారూప సోమమును కొనుచున్న యజమానుఁడు స్వీయుల మధ్యమున సామ్రాజ్యమును పొందును. గాయత్రీ త్రిష్టుప్ జగతీ చ్ఛందస్సులు, తదుపలక్షిత ఛందోమములును సోమ రాజునకు సామ్రాజ్య యుక్త లోకము కదా! (ఇచట "ఏష తే గాయత్ర" ఇత్యాది మంత్ర చతుష్టయమును వినియోగించుటకై ప్రస్తుతింపఁబడినది.)

3. **అర్థము:** సోమస్య=సోమలతయొక్క, క్రయాత్=క్రయముకంటె, పురస్తాదేవ=ముందుగనే, ఏవమ్="ఏష తే గాయత్రః" ఇత్యాది మంత్ర చతుష్టయముచేత, అభి మన్త్రయేత=(సోమలతను) అభిమంత్రించవలెను. (ఏవం సతి=ఇట్లు కాఁగా, యజమానః=యజమానుఁడు,) ఏనమ్=ఈ సోమరాజును, సామ్రాజ్యం లోకమ్=సామ్రాజ్య రూప లోకమును, గమయిత్వా=పొందించి, క్రీణాతి=సోమలతను కొనుచున్నవాఁ డగుచున్నాఁడు. (తదా=అప్పుడు,) స్వానామ్=స్రుక్ జుహ్వాది హోమ సాధనములయొక్క, సామ్రాజ్యమ్=సామ్రాజ్యమును, గచ్ఛతి=పొందుచున్నాఁడు.

**తాత్పర్యము:** సోమలతను కొనుటకు ముందుగానే "ఏష తే గాయత్రః" ఇత్యాది పూర్వోక్త మంత్ర చతుష్టయముచేత సోమలత నభిమంత్రించవలెను. అట్లు చేసిన యజమానుఁడు సోమదేవతా రూప రాజును సామ్రాజ్య రూప లోకమునకు పంపియే సోమలతను కొన్నవాఁ డగును. మఱియు స్రుగ్జుహ్వాదులయొక్క సామ్రాజ్య రూప లోకమును పొందును.

4. **అర్థము:** యో వై=ఏ యజమానుఁడైతే, తానూనప్త్రస్య=తనూనప్తృరూప అగ్నిదేవతాకమైన ఆజ్యముయొక్క, ప్రతిష్ఠామ్=ప్రతిష్ఠను, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=అతఁడు,) ప్రతి తిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు. (తానూనప్త్రమ్=తనూనప్త్రగ్ని దేవతాకమైన ఆజ్యమును,) న ప్రాశ్నన్తి=ప్రాశన చేయుట లేదు. న జుహ్వతి=హోమము చేయుట లేదు. తానూనప్త్రమ్=తనూనప్త్రగ్ని దేవతాకాజ్యము, క్వ=ఎచట, ప్రతి తిష్ఠతి=ప్రతిష్ఠిత మగుచున్నది? ఇతి=అని, బ్రహ్మవాదినః=మంత్రవేత్తలు, వదన్తి=చెప్పుచున్నారు (ప్రశ్నించుచున్నారు). (బ్రహ్మవాదిభిః పృష్టః బుద్ధిమాన్=మంత్రవేత్తలచే ప్రశ్నింపఁబడిన బుద్ధిమంతుఁడు,) ప్రజాపతౌ=ప్రజాపతియందు, మనసి=మనస్సుచేత, (తృతీయార్థమున సప్తమీ విభక్తి.) ప్రతిష్ఠితమ్ ఇతి=ప్రతిష్ఠిత మైనదని, బ్రూయాత్=సమాధానము చెప్పవలెను.

**తాత్పర్యము:** తనూనప్త్రగ్ని దేవతాకమైన ఆజ్యముయొక్క ప్రతిష్ఠను తెలిసికొనిన యజమానుఁడు ప్రతిష్ఠావంతుఁ డగును. సోమరసము అగ్నియందు హోమము చేయఁబడుచున్నది. ఋత్విజులచే త్రాగఁబడుచున్నది. కావున సోమరసమునకు ప్రతిష్ఠ కలదు కాని, తనూనప్త్రగ్ని దేవతాకాజ్యమును ఋత్విజాదులు త్రాగుట లేదు.

అగ్నియందది హోమము చేయఁబడుటలేదు, కావున ఆ యాజ్యమునకు ప్రతిష్ఠ యెచటఁ గలదని మంత్ర వేత్తలు ప్రశ్నించుకొనుచున్నారు. తానూనప్త్రాజ్యము ప్రజాపతియందు మనస్సుచే స్థాపించఁబడినదని మంత్రవేత్తలచే ప్రశ్నింపఁబడిన బుద్ధిమంతుఁడు సమాధానము చెప్పవలెను.

5. అర్థము: (హే తానూనప్త్రః=ఓ తనూనప్త్రగ్నిదేవతాకమైన ఆజ్యమా!), త్వా=నిన్ను, ప్రజాపతౌ=ప్రజాపతియందు, జుహోమి=హోమము చేయుచున్నాను, ఇతి=అని, మనసి=మనస్సునందు, స్మరామి=స్మరించుచున్నాను. (ఇతి=అని,) త్రిః=మూఁడు మారులు, అవ జిఘ్రేత్=తానూనప్త్రాజ్యము నాఘ్రాణము చేయవలెను. ఏషా వై=ఇదియే, తానూనప్త్రస్య=తానూనప్త్రాజ్యముయొక్క, ప్రతిష్ఠా=ప్రతిష్ఠ. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, ప్రతి తిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁడగును.

తాత్పర్యము: "ప్రజాపతౌ త్వా మనసి జుహోమి" అనునది మంత్రము. ఓ తానూనప్త్రాజ్యమా! నిన్ను ప్రజాపతి యందు మనస్సుచే హోమము చేయుచున్నానని మూఁడు పర్యాయములు తానూనప్త్రాజ్యమును యజమానుఁ డాఘ్రాణము చేయవలెను. ఇదియే తానూనప్త్రముయొక్క ప్రతిష్ఠ. ఈ విధముగ తెలిసికొనిన యజమానుఁడు నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగును. (ఈ పూర్వోక్త మంత్రములు, తద్విధులు యజమానునకు సంబంధించినవి. ఇటనుండి చెప్పఁబడునవి అధ్వర్యునివి.)

6. అర్థము: యః వా=ఏ యజమానుఁడైతే, అధ్వర్యోః=అధ్వర్యునియొక్క, ప్రతిష్ఠామ్=ప్రతిష్ఠను, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, ప్రతి తిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁడగుచున్నాఁడు. (అధ్వర్యుః=(అధ్వర్యుఁడు,) యతః=ఏ హోమ ప్రదేశమునుండి, అనభిక్రమ్య=మఱియొక ప్రదేశమునకు పోకుండ, (యం హోమమ్=ఏ హోమమును,) హోష్యామీతి=హోమము చేయఁగలనని, మన్యేత=తలఁచునో!, తత్=ఆ హోమమునకై, (తస్మిన్నేవ దేశే=ఆ ప్రదేశమునందే,) తిష్ఠన్=ఉన్నవాఁ డగుచు, ఆశ్రావయేత్=వినిపింపవలెను (ఆశ్రావణము చేయవలెను). ఏషా వా=ఇదియే, అధ్వర్యోః=అధ్వర్యునియొక్క, ప్రతిష్ఠా=ప్రతిష్ఠ. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈవిధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, ప్రతి తిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: అధ్వర్యుని ప్రతిష్ఠను తెలిసికొనిన యజమానుఁడు నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగును. అధ్వర్యుఁడు ఆహవనీయ సమీపమునందలి హోమ ప్రదేశములలో నే ప్రదేశమునుండి కదలకయే హోమము చేయవలెనని తలంచునో, ఆ హోమమునకై ఆ ప్రదేశమునందే యుండి తాను హోమము చేయుచున్నట్లు ఇతర ఋత్విజులకు ఆశ్రావణము (వినిపింప) చేయవలెను. ఇదియే అధ్వర్యునియొక్క ప్రతిష్ఠ. ఈ విధముగ నధ్వర్యుని ప్రతిష్ఠను తెలిసికొనిన యతఁడు నిశ్చయముగ ప్రతిష్ఠాపంతుఁ డగును.

7. అర్థము: (అధ్వర్యుః=అధ్వర్యుఁడు), అభిక్రమ్య=(ఆశ్రావణ ప్రదేశమునుండి మఱియొక ప్రదేశమునకు) పోయి, జుహుయాత్ యత్=హోమము చేయుచో, ప్రతిష్ఠాయాః=ప్రతిష్ఠనుండి, ఇయాత్=చ్యుతి నొందును. తస్మాత్=అందువలన, సమానత్ర=సమానదేశమునందు (ఆశ్రావణము చేసిన ప్రదేశమునందు), తిష్ఠతా=ఉంటున్నవానిచేత, ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠకొఱకు, హోతవ్యమ్=హోమము చేయవలసియున్నది.

తాత్పర్యము: అధ్వర్యుఁడు ఆశ్రావణ ప్రదేశమునుండి మఱియొక ప్రదేశమునకు పోయి హోమము చేయుచో ప్రతిష్ఠనుండి చ్యుతుఁ డగును. అందువలన ఆశ్రావణము చేసిన ప్రదేశమునం దుండి ప్రతిష్ఠకై హోమము చేయవలెను.

8. అర్థము: యో వా=ఏ యజమానుఁడైతే, అధ్వర్యోః=అధ్వర్యునియొక్క, స్వమ్=స్రుగ్గుహ్వాద్యైంద్ర వాయవ్యాది సోమరస గ్రహణాధారభూత పాత్రమును, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, స్వవాన్=స్వము కలవాడు, భవత్యేవ=నిశ్చయముగ నగుచున్నాఁడు. అస్య=ఈ అధ్వర్యునియొక్క, వాయవ్యం స్వమ్=వాయు దేవతాకమైన స్వమ్ము, స్రుగ్వా=స్రుక్కే. చమసః=చమసపాత్రము, స్వమ్=స్వమ్ము. అస్య=ఈ యధ్వర్యునియొక్క, వాయవ్యమ్=వాయు దేవతాకమైన, స్వం వా=స్వమ్మును గాని, చమసం వా=చమస

పాత్రమును గాని, అనన్వారభ్య=హస్తమునందు ధరించక, ఆశ్రావయేత్=ఆశ్రావణము చేయుచో, స్వాత్=స్వమ్మునుండి, ఇయాత్=చ్యుతుఁ డగును. తస్మాత్=అందువలన, అన్వారభ్య=స్వ (పూర్వోక్త)-పాత్రమును హస్తమునందు గ్రహించి, ఆశ్రావ్యమ్=ఆశ్రావణము చేయవలెను. (తదా=అప్పుడు, అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) స్వాత్=స్వమ్మునుండి, నైవ ఏతి=చ్యుతుఁ డగుటయే లేదు.

**తాత్పర్యము:** స్వమ్మనఁగా స్రుగ్జుహ్వాద్యైంద్ర వాయవ్యాది సోమరస గ్రహణాధారభూత పాత్రము. అధ్వర్యునియొక్క స్వమ్మును దెలిసికొనిన యతఁడు స్వమ్ము కలవాఁ డగును. వాయు దేవతాకమైన స్రుక్కు, చమస పాత్రము అధ్వర్యుని స్వమ్ము. వాయు దేవతాకమైన స్వమ్మును కాని చమసపాత్రమును గాని హస్తము నందు గ్రహించక అధ్వర్యుఁడు ఆశ్రావణము చేయుచో నతఁడు స్వమ్మునుండి చ్యుతుఁ డగును. అందు వలన అధ్వర్యుఁడు హస్తమునందు స్వమ్మును గ్రహించి ఆశ్రావణము చేయవలెను. అప్పుడు అతఁడు స్వమ్ము నుండి చ్యుతుఁడు కాఁడు.

9. **అర్థము:** యో వై=ఏ యజమానుఁడైతే, సోమమ్=సోమమును, అప్రతిష్ఠాప్య=ప్రతిష్ఠింపక, స్తోత్రమ్=ప్రాతస్సవనాది స్తోత్రమును, ఉపాకరోతి=ఉపాకరణము చేయునో, (తదా=అప్పుడు,) సోమః=సోమము, అప్రతిష్ఠితః=ప్రతిష్ఠితము కానిది, భవతి=అగుచున్నది. స్తోమః=స్తోమము, అప్రతిష్ఠితః=అప్రతిష్ఠితము, భవతి=అగుచున్నది. ఉక్థాని=శస్త్రములు (స్తోత్రవిశేషములు), అప్రతిష్ఠితాని=అప్రతిష్ఠితములు, భవన్తి=అగుచున్నవి. యజమానః=యజమానుఁడు, అప్రతిష్ఠితః=అప్రతిష్ఠితుఁడు, భవతి=అగుచున్నాఁడు. అధ్వర్యుః=అధ్వర్యుఁడు, అప్రతిష్ఠితః=అప్రతిష్ఠితుఁడు, భవతి=అగుచున్నాఁడు. సోమస్య=సోమమునకు, వాయవ్యమ్=వాయు దేవతాకమైన పాత్ర విశేషము, ప్రతిష్ఠా వై=ప్రతిష్ఠ కదా! అస్య=ఈ సోమమునకు, చమసః=చమసపాత్రము, ప్రతిష్ఠా=ప్రతిష్ఠ. స్తోమస్య=స్తోమమునకు, సోమః=సోమము, (ప్రతిష్ఠా=ప్రతిష్ఠ.) ఉక్థానామ్=శస్త్రవిశేషములకు, స్తోమః=స్తోమము, (ప్రతిష్ఠా=ప్రతిష్ఠ.) గ్రహమ్=పాత్ర విశేషమును, గృహీత్వా వా=గ్రహించి కాని, చమసమ్=చమస పాత్రమును, ఉన్నీయ వా=ఉన్నయనముచేసి కాని, ఉపాకుర్యాత్=ఉపాకరణము చేయవలెను. (తదా=అప్పుడు,) సోమమ్=సోమమును, ప్రతి తిష్ఠత్యేవ=(అధ్వర్యుఁడు) ప్రతిష్ఠాపన చేసినవాఁడే యగుచున్నాఁడు. స్తోమమ్=స్తోమమును, ఉక్థాని=శస్త్రవిశేషములను, ప్రతిష్ఠాపయతి=ప్రతిష్ఠాపన చేసినవాఁ డగుచున్నాఁడు. యజమానః=యజమానుఁడు, ప్రతి తిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు.

**తాత్పర్యము:** అధ్వర్యుఁడు సోమమును ప్రతిష్ఠించకుండ ఉపాకరణము చేసినచో సోమము, స్తోమము, శస్త్రములు అప్రతిష్ఠితము లగును. యజమానుఁడు, అధ్వర్యుఁడు కూడ అప్రతిష్ఠితు లగుదురు. కావున అధ్వర్యుఁడు వాయు దేవతాకమైన పాత్ర విశేషమును గాని, చమసమును గాని గ్రహించి ఉపాకరణము చేయవలెను. అట్లు చేసినచో సోమాదులు, అధ్వర్యు యజమానులు ప్రతిష్ఠితు లగుదురు. గ్రహమునందు గాని, చమసము నందు గాని సోమరసము నుంచుట ప్రతిష్ఠాపన మగును. దర్భముష్టిచే గాని, దర్భలచేఁ గాని మంత్ర పూర్వకముగ సంస్కరించుట ఉపాకరణము అనఁబడును. ఇచట ప్రాతస్సవనాది స్తోత్రముల కుపాకరణము విహిత మైనది. అనఁగా వాయు దేవతాకమైన ఊర్ధ్వపాత్రమునందు గాని, చమస మను పాత్ర విశేషము నందు గాని సోమరసమునుంచి సూత్రోక్త ప్రకారముగ ప్రాతస్సవనాది స్తోత్రముల నుపాకరణము చేయవలెను. ఉపాకరణ విధానము ఆపస్తంబ సూత్రమునందు వివరింపఁబడినది.

ద్వితీయానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ప్రథమ ప్రపాఠకే తృతీయోఽనువాకః ।

మూలము: [1]యజ్ఞం వా ఏతత్సం భరన్తి యత్సోమక్రయ్ణ్యై పదం యజ్ఞముఖగ్ం హవిర్ధానే యర్హి
హవిర్ధానే ప్రాచీ ప్రవర్తయేయు స్తర్హి తేనాక్ష ముపాఞ్జ్యా ద్యజ్ఞముఖ ఏవ యజ్ఞమను సం
తనోతి [2]ప్రాఞ్చమగ్నిం ప్రహరన్త్యుత్పత్నీ మానయన్త్యన్వనాగ్ంసి ప్రవర్తయన్త్యథ వా
అస్యైష ధిష్ణియో హీయతే సో ఽనుధ్యాయతి స ఈశ్వరో రుద్రో భూత్వా (౧) ప్రజాం పశూ
న్యజమానస్య శమయితో ర్యర్హి పశుమాప్రీత ముదఞ్చం నయన్తి తర్హి తస్య పశుశ్రపణగ్ం
హరేత్తేనైవైనం భాగినం కరోతి [3]యజమానో వా ఆహవనీయో యజమానం వా ఏతద్వికర్షన్తే
యదాహవనీయా త్పశుశ్రపణగ్ం హరన్తి స వైవ స్యాన్నిర్మన్థ్యం వా కుర్యా ద్యజమానస్య
సాత్మత్వాయ [4]యది పశో రవదానం నశ్యేదాజ్యస్య ప్రత్యాఖ్యాయ మవద్యేత్సైవ తతః
ప్రాయశ్చిత్తి [5]ర్యే పశుం విమథ్నీరన్యస్తా న్కామయేతాఽఽర్తి మార్చ్ఛేయు రితి కువిదఙ్గేతి
నమోవృక్తివత్యర్చాఽఽగ్నీధ్రే జుహుయా న్నమోవృక్తి మేవైషాం వృఙ్క్తే తాజగార్తి
మార్చ్ఛన్తి ॥ ౨ ॥ (భూత్వా తతః షడ్విగ్ంశతిశ్చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమ ప్రపాఠకే తృతీయోఽనువాకః ।

## వేదార్థదీపిక

అవతారిక: ద్వితీయానువాకమునందు యజమాన మంత్రములు అధ్వర్యుని విధులు సోమోపస్థాన మంత్రములు విహితము లైనవి. ఈ తృతీయానువాకమునందు సోమక్రయణీ పదాజ్యనాది విధులు చెప్పఁబడుచున్నవి. సోమమును కొనుటకు సాధనమైన గోవు సోమక్రయణి యనఁబడును. ఆ గోవుయొక్క అడుగుజాడలందు హోమము చేయఁబడిన నేతితో కలిపిన ధూళి సోమక్రయణీ పదాంజన మనఁబడును.

1. అర్థము: సోమక్రయణ్యై=సోమక్రయణియొక్క (సోమలతను క్రయము చేయుట కుపయోగించు గోవు. షష్ఠ్యర్థే చతుర్థి), పదమ్=పాదము (ఉంచిన ప్రదేశము), హవిర్ధానే=హవిస్సులను మోయు శకటములు, యజ్ఞ ముఖం యత్=యజ్ఞముఖస్థానము అనుట ఏది కలదో, ఏతత్ వా=ఇదియే, యజ్ఞమ్=యజ్ఞమును, సంభరన్తి=బాగుగఁ జేయుచున్నా రనుట. యర్హి=ఎప్పుడైతే, హవిర్ధానే=హవిస్సును వహించు శకటములను, ప్రాచీ=తూర్పుముఖముగా, ప్రవర్తయేయుః=నడిపింపఁజేయుదురో, తర్హి=అప్పుడే, తేన=ఆ సోమ క్రయిణియొక్క పద పాంసువుచేత, అక్షమ్=బండికంటిని, ఉపాఞ్జ్యాత్=పూయవలెను. (తదా=అప్పుడు,) యజ్ఞముఖే ఏవ=హవిర్ధానాత్మక పదపాంసు రూప యజ్ఞ ముఖమునందే, యజ్ఞమ్=యజ్ఞమును, అను సంతతి=(యజ్వ) అను స్యూతముగ విస్తరింపఁ జేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞము చేయునపుడు యజమానుఁడు గోవు నిచ్చి సోమలతను కొనును. ఆ గోవును యజ్ఞశాల దగ్గర నడిపించినపుడు ఆ గోవు ఆఱు అడుగులు నడచిన పిమ్మట ఏడవ యడుగును తీయగానే, ఆ యడుగుజాడ యందు నేతితో హోమము చేయుదురు. నేతితో తడిసిన ఆ యడుగు జాడయందలి పాంసువు (దుమ్ము), సోమలతాది హవిఃపదార్థములను మోయునట్టి రెండు శకటములును యజ్ఞముఖ స్థానములుగా నిట వర్ణింపఁ బడినవి. (నేతితో తడిసిన ఆ పాంసువు, ప్రధాన హవిస్సు అయిన సోమమును మోయు శకటములు ఇచట ముఖ్యములు.) గార్హపత్య సమీపమున నుండు శకటములను ప్రాఙ్ముఖముగ ప్రవర్తింపఁజేయఁగానే ఘృతముతో తడిసిన పూర్వోక్త సోమక్రయణీ పద పాంసువుచే బండికంటిని పూయవలెను. ఇట్లు చేయఁగా యజమానుఁడు హవిర్ధానాత్మకము పాంసురూపమునైన యజ్ఞముఖమునందే యజ్ఞమును సంతతము విస్తరింపఁ జేసినవాఁ డగును.

2. అర్థము: అగ్నిమ్=(అగ్నీషోమీయ పశు శ్రపణార్థమైన) అగ్నిని, ప్రాఞ్చమ్=(పురాతనాహవనీయమునకు) తూర్పు ముఖముగ, ప్రహరన్తి=తీసికొనిరావలయును. పత్నీమ్=(పశ్చిమ దిక్కునందలి పత్నీశాలయందున్న) యజమానునియొక్క భార్యను, ఉన్నయన్తి=(తూర్పు ముఖముగ) తీసికొని రావలయును. అను=అను క్రమముగ, అనాంసి=(ప్రాచీన గార్హపత్య సమీపమునందున్న) శకటములను, ప్రవర్తయన్తి=(తూర్పు ముఖముగ) ప్రవర్తింపఁ జేయవలెను. అథ=అనంతరము, అస్య=ఈ పురాతనాహవనీయముయొక్క, ధిష్ణియః=స్థానవిశేషము, హీయతే=శూన్య మగుచున్నది. సః=ఆ యగ్ని, అను ధ్యాయతి=మాటి మాటికి మనస్సునందు ఆలోచించుచున్నాఁడు. సః=ఆ విధముగ నాలోచించుచున్న యగ్ని, రుద్రః భూత్వా=క్రూరుఁడై, యజమానస్య=యజమానునియొక్క, ప్రజామ్=సంతానమును, పశూన్=పశువులను, శమయితోః=నశింపఁజేయుటకు, ఈశ్వరః=సమర్థుఁడు, (భవతి=అగుచున్నాఁడు.) యర్హి=ఎప్పుడైతే, ఆప్రీతమ్=ఆప్రీ సంజ్ఞకములైన ప్రయాజ యాజ్యలచేత సంతోషపఱచఁబడిన, పశుమ్=పశువును, ఉదఞ్చమ్=ఉత్తర దిఙ్ముఖముగ, నయన్తి=పొందించుచున్నారో, తర్హి=అప్పుడు, తస్య=ఆ ప్రతీచీన గార్హపత్య సంబంధియగు, పశు శ్రపణమ్=పశు శ్రపణకారియగు నగ్నిని, హరేత్=హరింపఁజేయవలెను. తేనైవ=ఆ హరణముచేతనే, ఏనమ్=ఈ ప్రతీచీన గార్హపత్యాగ్నిని, భాగినమ్=భాగయుక్తునిగా, కరోతి=(అధ్వర్యుఁడు) చేసినవాఁడగును.

తాత్పర్యము: పశ్చిమ దిక్కునందున్న గార్హపత్యమునందలి యగ్ని ప్రథమమున శాలాముఖీయమైన పురాతనాహవనీయమునందు తీసికొనిరాఁబడినది. పిమ్మట ఆ యగ్నిని తూర్పుముఖముగ తీసికొనిరావలయును. ఇట్లే యజమాన పత్నిని, శకటములను గూడ తూర్పు ముఖముగ తీసికొనిరావలయును. అట్లు చేయఁగా పురాతనాహవనీయ ప్రదేశము శూన్యముగా నగును. అప్పుడు అగ్ని తన మనస్సునందు తీవ్రముగ నాలోచించి క్రూరుఁడై యజమాన సంతానమును పశువులను నశింపఁజేయుటకు సమర్థుఁ డగును. అందువలన అగ్నీషోమీయ పశువును ఆప్రీ సంజ్ఞకము లయిన ప్రయాజయాజ్యలచే సంతోషపఱచవలెను. అట్లు సంతోషపఱచఁబడిన పశువును ఉత్తరదిఙ్ముఖముగ కొనిపోవలయును. పిమ్మట పశు శ్రపణకారియైన యగ్నిని హరించవలెను. అప్పు డధ్వర్యుఁడు ఆ హరణముచేతనే ప్రతీచీన గార్హపత్యాగ్నిని భాగయుక్తునిగాఁ జేసినవాఁ డగును. (ఇట్లు చేసినచో ప్రజాది వినాశము జరుగదు.) ఇచట యజ్ఞశాలకు పశ్చిమమున నున్న పురాతన గార్హపత్యము

నుండి అగ్నీషోమీయ పశు శ్రపణార్థమైన యగ్నిని శ్రపణదేశమునకుఁ గొనిపోవుట విహిత మైనది. శ్రపణ మనఁగా—యజ్ఞ పశువునందలి వపాదికమును వండుట. 'శ్రపణము' అను పదము "శ్రా—పాకే" అను ధాతువు నుండి పుట్టినది.)

3. అర్థము: యజమానః—యజమానుఁడు, ఆహవనీయః వా—ఆహవనీయ స్వరూపుఁడు కదా! ఆహవనీయాత్—ఆహవనీయమునుండి, పశు శ్రపణమ్—పశు శ్రపణార్థమైన అగ్నిని, హరన్తి యత్—తీసికొనిపోయినచో, ఏతత్—ఈ హరణమువలన, యజమానం వా—యజమానునే, వికర్షన్తే—వికర్షించువారగుచున్నారు. వా—లేదా, స ఏవ—ఆ యగ్నియే, స్యాత్—ఉండవలెను. వా—లేదా, యజమానస్య—యజమానునకు, సాత్మత్వాయ—వికర్ష లేకుండుటకై (సంపూర్ణత్వ స్వరూప సిద్ధికై), నిర్మన్థ్యమ్—నిర్మథనముచే నేర్పడునట్టి అగ్నిని, కుర్యాత్—చేయవలెను.

తాత్పర్యము: యజమానుఁడు ఆహవనీయ స్వరూపుఁడు కావున ఆహవనీయమునుండి అగ్నిని వికర్షించి పశు శ్రపణ ప్రదేశమునకు తీసికొనిపోయినచో, ఆ తీసికొనిపోయినవారు యజమానునే వికర్షించినవా రగుచున్నారు. కనుక ఆ యగ్ని అట్లే యుండవలెను. లేదా యజమానునకు వికర్ష కలుగకుండుటకై మథనము చేసి యగ్నిని పశుశ్రపణమునకై పుట్టించవలెను.

4. అర్థము: పశోః—అగ్నీషోమీయ పశువుయొక్క, అవదానమ్—అవదానము, నశ్యేత్ యది—నశించినచో, ప్రత్యాఖ్యాయమ్—ప్రత్యేకముగ లెక్కించి, ఆజ్యస్య అవద్యేత్—ఆజ్యము నవదానము చేయవలెను. తతః—తద్దోష నివృత్తికొఱకు, సైవ—ఆ యవదాన క్రియయే, ప్రాయశ్చిత్తిః—ప్రాయశ్చిత్తి, (భవతి—అగుచున్నది.)

తాత్పర్యము: యజ్ఞమునందు పశువును చంపి ఆ పశు శరీరములోని కొన్ని కొన్ని స్థానములనుండి మాంస విశేషమును అవదానము చేసి (తీసి) అగ్నియందు హోమము చేయుదురు. ఒక్కొక్క స్థానమునుండి తీసిన మాంస భాగము అవదాన మనఁబడును. ఇచట పశువుయొక్క అవదానములు ఎన్ని నష్టము లగునో లెక్కప్రకారముగ అన్ని యవదానములు ఆజ్యమునుండి గ్రహించి హోమము చేయవలెను. ఆ యవదాన క్రియయే ఇచట ప్రాయశ్చిత్తి యగుచున్నది. (పశు ప్రసంగవశమున నిచట కొంచెము ప్రాయశ్చిత్తము విధింపఁబడినది.)

5. అర్థము: యే—ఏ విరోధులు, పశుమ్—యజ్ఞ పశువు నుద్దేశించి, విమథ్నీరన్—కలహించుకొందురో, తాన్—ఆ శత్రువులను గూర్చి, (యః—ఏ యజమానుఁడు,) ఆర్తిమ్—దుఃఖమును, ఆర్ఛేయుః ఇతి—పొందుదురుగాక యని, కామయేత—కోరునో, (సః—ఆ యజమానుఁడు,) కువిదఙ్గేతి—కువిదఙ్గేత్యాదికమైన, నమోవృక్తిమతా—'నమోవృక్తి' అను శబ్దముతోఁ గూడియున్న, ఋచా—ఋక్కుచేత, అగ్నీధ్రే—అగ్నీధ్ర స్థానమునందలి వహ్నియందు, జుహుయాత్—హోమము చేయవలెను. (తదా—అప్పుడు,) ఏషామ్—ఈ శత్రువులయొక్క, నమోవృక్తిమేవ వృఙ్క్తే—నమస్కారయత్వ వర్జనమునే చేయుచున్నాఁడు. తాజక్—వెంటనే, (తే—ఆ శత్రువులు), ఆర్తిమ్—దుఃఖమును, ఆర్ఛన్తి—పొందుచున్నారు.

తాత్పర్యము: యజ్ఞము చేయునట్టి యజమానునియొక్క విరోధులు యజ్ఞ పశువు తమదే యని దాని నపహరించుకొని పోయినయెడల ఆ యపహర్తలు దుఃఖము నొందుదురు గాక యని కోరుకొని కువిదఙ్గేత్యాదికమైన నమోవృక్తి శబ్ద ఘటితమైన ఋక్కు నుచ్చరించుచు యజమానుఁడు అగ్నీధ్ర స్థానమునందలి యగ్నియందు హోమము చేసినచో ఆ యపహర్తలను తమ బంధుజనులు మున్నగువారు నమస్కరించుటను మానివేయుదురు. అప్పుడు వారు మానహానిచే మరణింతురు.

తృతీయానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ప్రథమ ప్రపాఠకే చతుర్థోఽనువాకః।

మూలము: [1]ప్రజాపతే ర్జాయమానాః ప్రజా జాతాశ్చ యా ఇమాః। తస్మై ప్రతి ప్రవేదయ చికిత్వాగ్ం అనుమన్యతామ్। [2]ఇమం పశుం పశుపతే తే అద్య బధ్నామ్యగ్నే సుకృతస్య మధ్యే। అను మన్యస్వ సుయజా యజామ జుష్టం దేవానా మిద మస్తు హవ్యమ్। [3]ప్రజానన్తః ప్రతి గృహ్ణన్తి పూర్వే ప్రాణమఙ్గేభ్యః పర్యాచరన్తమ్। సువర్గం యాహి పథిభి ర్దేవయానై రోషధీషు ప్రతి తిష్ఠా శరీరైః। [4]యేషామీశే (౧)పశుపతిః పశూనాం చతుష్పదా ముత చ ద్విపదామ్। నిష్క్రీతో ఽయం యజ్ఞియం భాగమేతు రాయస్పోషా యజమానస్య సన్తు। [5]యే బధ్యమాన మను బధ్యమానా అభ్యైక్షన్త మనసా చక్షుషా చ।అగ్ని స్తాగ్ం అగ్రే ప్రముమోక్తు దేవః ప్రజాపతిః ప్రజయా సంవిదానః। [6]య ఆరణ్యాః పశవో విశ్వరూపా విరూపా స్సన్తో బహుధైకరూపాః। వాయు స్తాగ్ం అగ్రే ప్రముమోక్తు దేవః ప్రజాపతిః ప్రజయా సంవిదానః। [7]ప్రముఞ్చమానాః (౨)భువనస్య రేతో గాతుం ధత్త యజమానాయ దేవాః।ఉపాకృతగ్ం శశమానం యదస్థాజ్జీవం దేవానా మప్యేతు పాథః। [8]నానా ప్రాణో యజమానస్య పశునా యజ్ఞో దేవేభి స్సహ దేవ యానః। జీవం దేవానా మప్యేతు పాథ స్సత్యా స్సన్తు యజమానస్య కామాః। [9]యత్పశు ర్మాయు మకృతోరో వా పద్భి రాహతే। అగ్నిర్మా తస్మా దేనసో విశ్వా న్ముఞ్చత్వగ్ంహసః। [10]శమితార ఉపేతన యజ్ఞమ్ (౩)దేవేభి రన్వితమ్। పాశాత్పశుం ప్రముఞ్చత బన్ధాద్యజ్ఞపతిం పరి। [11]అదితిః పాశం ప్రముమోక్త్వేతం నమః పశుభ్యః పశుపతయే కరోమి। అరాతీయన్త

మధరం కృణోమి యం ద్విష్మ స్తస్మిన్ప్రతి ముఞ్చామి పాశమ్। [12]త్వాము తే దధిరే హవ్యవాహగ్ం శృతం కర్తారముత యజ్ఞియం చ।అగ్నే సదక్షః సతనుర్హి భూత్వా ఽథ హవ్యా జాతవేదో జుషస్వ। [13]జాతవేదో వపయా గచ్ఛ దేవా న్త్వగ్ం హి హోతా ప్రథమో బభూథ। ఘృతేన త్వం తనువో వర్ధయస్వ స్వాహాకృతగ్ం హవిరదన్తు దేవాః। [14]స్వాహా దేవేభ్యో దేవేభ్య స్స్వాహా ॥ ४॥ (ఈశే ప్రముఞ్చమానా యజ్ఞం త్వగ్ం షోడశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమ ప్రపాఠకే చతుర్థోఽనువాకః।

## వేదార్థ దీపిక

**ఉపకారిక:** తృతీయానువాకమునందు సోమక్రయణీ పదాంజనాదులు చెప్పఁబడినవి. ఈ చతుర్థానువాకమునందు పశూపాకరణ మంత్రములు చెప్పఁబడుచున్నవి. దర్భముష్టిచేఁగాని, దర్భలచేఁగాని మంత్ర పూర్వకముగ సంస్కరించుట ఉపాకరణ మనఁ బడును.

1. **అర్థము:** యాః ప్రజాః=ఏ ప్రజలు, (ఇదానీమ్=ఇప్పుడు,) జాయమానాః=పుట్టుచున్నారో, యా ఇమాః=ఏ యీ ప్రజలు, జాతాశ్చ=పుట్టినవారునై యున్నారో, (తా స్సర్వాః=వా రందఱు,) ప్రజాపతేః=ప్రజాపతికి సంబంధించినవారు. (హే పశో!=ఓపశూ!, త్వమ్=నీవు,) తస్మై=ఆ ప్రజాపతికొఱకు, ప్రతి=ప్రత్యేకముగ, (గత్వా=వెళ్లి,) ప్ర వేదయ=(నీ వృత్తాంతమును) బాగుగఁ జెప్పుము. (సః=ఆ ప్రజాపతి,) చికిత్వాన్=(నీ స్వర్గ ప్రాప్తిని) తెలిసినవాఁడై, అనుమన్యతామ్=అనుమతించుఁగాక.

**తాత్పర్యము:** ఇప్పుడు పుట్టుచున్న ప్రజలు, ఇదివఱకు పుట్టిన ప్రజలును ప్రజాపతినుండి పుట్టినవారే కావున, ఓ యజ్ఞపశూ! నీవు ఆ ప్రజాపతియొద్దకు పోయి ఏకాంతముగ నీ వృత్తాంతమును వివరముగఁ జెప్పుము. ఆ ప్రజాపతి నీ స్వర్గప్రాప్తిని తెలిసినవాఁడై అంగీకరించుఁగాక. (అధ్వర్యుఁడు పశ్చిమ దిగభిముఖముగనున్న యజ్ఞపశువును బర్హిస్సులచేఁగాని, జువ్వికొమ్మచేఁగాని "ఉపో దేవాన్ దైవీర్విశః" "ప్రజాపతే ర్జాయమానాః" ఇత్యాది మంత్రముల నుచ్చరించుచు ఉపాకరణము చేయవలెను.)

2. **అర్థము:** హే పశుపతే! అగ్నే!=పశుపతివైన ఓ యగ్నీ!, అద్య=ఇప్పుడు (ఈ దినమునందు), సుకృతస్య=బాగుగ ననుష్ఠింపఁబడిన జ్యోతిష్టోమ కర్మయొక్క, మధ్యే=మధ్యమందు, ఇమం పశుమ్=ఈ పశువును, బధ్నామి=బంధించుచున్నాను. అనుమన్యస్వ=అనుమతించుము. (వయమ్=మేము,) సుయజా యజామ=శోభనమైన యాగము చేయుదుము. ఇదం హవ్యమ్=ఈ హవిస్సు, దేవానామ్=దేవతలకు, జుష్టమ్=ప్రియము, అస్తు=అగుఁగాక.

**తాత్పర్యము:** ఓ పశుపతివైన యగ్నీ! ఈ దినమున జ్యోతిష్టోమకర్మ మధ్యమందు ఈ యజ్ఞపశువును బంధించుచున్నాను. కావున నీవు అంగీకరించుము. మేము శోభనమైన యజ్ఞము చేయుదుము. ఈ హవిస్సు దేవతలకు ప్రియమగుఁగాక.

3. అర్థము: (హే పశో!–ఓ పశూ!) పూర్వే=దేవతలు, జానన్తః=(నీ వృత్తాంతమును) తెలిసికొనుచున్నవారై, అఙ్గేభ్యః పరి=(నీ) యవయవములకంటె పై భాగమున, ఆ చరన్తమ్=సంచరించుచున్న, ప్రాణమ్=(నీ) ప్రాణమును, ప్రతి గృహ్ణన్తి=(తమ స్వాధీనమైనదని) స్వీకరించుచున్నారు. (త్వం తు=నీవైతే,) దేవయానైః=దేవతలు పోవునట్టి, పథిభిః=మార్గములచేత, స్వర్గమ్=స్వర్గమును గూర్చి, యాహి=పొమ్ము. శరీరైః=శరీరావయవములచేత, ఓషధీషు=ఓషధులయందు, ప్రతితిష్ఠ=(పురోడాశాదులవలె హవీ రూపముగ) ఉండుము.

తాత్పర్యము: ఓ పశూ! దేవతలు నీ వృత్తాంతమును తెలిసికొనినవారై నీ అవయవముల పై భాగమున తిరుగుచున్న నీ ప్రాణమును తమ యధీనమైనదని స్వీరించుచున్నారు. నీవు మాత్రము దేవతలు పోవు మార్గమున స్వర్గమునకు పొమ్ము. ప్రాణ రూపమున స్వర్గమునకు పోయి అపశిష్టములయిన శరీరావయవములచేత పురోడాశాదికమువలె హవిస్సు వగుము. "ప్రజానన్తః" అను ఋక్కు మొదలు అయిదు ఋక్కులతో హోమము చేయవలెను. ఇది మొదటి ఋక్కు.

4. అర్థము: పశుపతిః=పశుపతియగు రుద్రుఁడు, యేషామ్=ఏ, ద్విపదామ్=ద్విపాదులు, ఉత చ=మఱియు, చతుష్పదామ్=చతుష్పాత్తులునైన, పశూనామ్=పశువులకు, ఈశే=స్వామిగా ఉంటున్నాఁడో, (తేషాం పశూనాం మధ్యే=ఆ పశువుల మధ్యమందు, స్వామిన స్సకాశాత్=స్వామి సమీపమునుండి), నిష్క్రీతః=క్రయము చేయఁబడిన, అయమ్=ఈ యజ్ఞపశువు, యజ్ఞియం భాగమ్=యజ్ఞ యోగ్య మయిన భాగత్వమును, ఏతు=పొందుఁగాక. యజమానస్య=యజమానునకు, రాయస్పోషాః=ధన సమృద్ధులు, సన్తు=కలుగుఁగాక.

తాత్పర్యము: పశుపతియగు రుద్రుఁడు ద్విపాదులు, చతుష్పాదులు నయిన యే పశువులకు స్వామిగా నుంటున్నాఁడో, ఆ పశువుల మధ్యమున స్వామినుండి కొనఁబడిన యీ యజ్ఞ పశువు యజ్ఞమునకు యోగ్యమయిన భాగత్వమును పొందుఁగాక. యజమానునకు ధన సమృద్ధులు కలుగుఁగాక.

5. అర్థము! యే=ఏ పశువులు, (ఈ పశువుయొక్క పితృ భ్రాత్రాదికములు), బధ్యమానమ్ అను=బంధించఁబడుచున్న పశువు ననుసరించి, బధ్యమానాః (సన్తః)=(ఏతదీయ స్నేహముచేత) బంధింపఁబడుచున్న వగుచు, మనసా=మనస్సుచేత, చక్షుషా చ=చక్షుస్సుచేతను, అభి=అంతటను, ఐక్షన్త=చూచినవో, తాన్=ఆ పశువులను, అగ్నిః=అగ్ని, అగ్రే=ప్రథమమున, ప్ర ముమోక్తు=ప్రకర్షగా విడిచిపెట్టుఁగాక. (తతః=పిమ్మట,) ప్రజాపతిః దేవః=ప్రజాపతి దేవుఁడు, ప్రజయా=స్వీయ ప్రజతో, సంవిదానః=ఐకమత్యము నొందినవాఁడై ప్ర ముమోక్తు=ప్రకర్షతో విడుచుఁ గాక.

తాత్పర్యము: ఈ యజ్ఞ పశువునకు సంబంధించిన పితృ భ్రాత్రాదికములైన పశువులు స్వయముగనే బంధించఁబడిన ఈ పశువు ననుసరించి బంధించఁబడిన వగుచు మనస్సుచేతను చక్షుస్సుచేతను అంతటను చూచినవో, ఆ పశువులను అగ్ని ప్రథమమున విడుచుఁ గాక. పిమ్మట ప్రజాపతి దేవుఁడు స్వీయ ప్రజతో నైక్యత నొంది ప్రకర్షగా విడుచుఁగాక. (ఇది తృతీయఋక్కు).

6. అర్థము: యే=ఏ, ఆరణ్యాః పశవః=అరణ్యమున నుండు పశువులు, విశ్వరూపాః=(జాతి భేదముచే,) అనేక రూపములును, బహుధా విరూపాః=(వర్ణభేదముచే) అనేక విధములయిన రూపములు కలవియు, సన్తః=(అపి) అయినను, ఏక రూపాః=పశుత్వ ధర్మముచే ఏక రూపములో, వాయుః=వాయువు, తాన్=ఆ పశువులను, అగ్రే, ప్ర ముమోక్తు, ప్రజాపతిః, దేవః, ప్రజయా సంవిదానః ప్ర ముమోక్తు=(వీని యర్థము పూర్వోక్తము).

తాత్పర్యము! అరణ్యమున నుండు ఏ పశువులు జాతిభేదముచేతను, వర్ణ భేదముచేతను అనేక (వివిధ) రూపములు కలవియైనను పశుత్వ ధర్మముచే ఏకరూపములే. వాని నన్నిటిని వాయుదేవుఁడు ప్రథమమునను ప్రజాపతి పిమ్మటను, ప్రకర్షగా విడుచుదురు గాక. (ఇది చతుర్థ ఋక్కు.)

7. అర్థము: హే దేవాః!=ఓ దేవతలారా!, భువనస్య=లోకమునకు, రేతః=ఉత్పత్తి హేతువైన, పశుమ్=పశువును, ప్రముఞ్చమానాః=ప్రకర్షగా (ప్రాణ మాతృ పితరులనుండి యజ్ఞముకొఱకు) విడిపించుచున్నవారై, యజమానాయ=యజమానునికొఱకు, గాతుమ్=స్వర్గలోక ప్రాప్తిని, ధత్త=ధరింపఁజేయుఁడు (కలుగఁజేయుఁడు). ఉపాకృతమ్=ఉపాకరణ క్రియచే సంస్కరింపఁబడినదియు, శశమానమ్=(హవిర్భోక్తలగు దేవతలయందు), వ్యాపించుచున్నదియునగు, యత్=ఏ అంగజాతము, అస్థాత్=(ఈ పశువునందు) కలదో!, తత్=అది, పాథః=అన్నము, (భూత్వా=అయి), దేవానామ్=దేవతలకు, జీవమపి=జీవనార్థము కూడ, ఏతు=ఉపకరించుఁ గాక.

తాత్పర్యము: ఓ దేవతలారా! లోకమునకు యాగము మూలమున ఉత్పత్తి హేతువైన పశువును మీరు తన ప్రాణ మాతృ పితరులనుండి విడిపించుచున్నవారై యజమానునకు స్వర్గప్రాప్తినిఁ గలుగఁజేయుఁడు. ఉపాకరణ క్రియచే సంస్కరింపఁబడినదియు, దేవతలందు వ్యాపించుచున్నదియునగు ఈ పశువునందలి అంగ సమూహము దేవతలకు జీవనమునకుఁ గూడ ఉపకరించుఁ గాక. అపి శబ్దమువలన యజమానునకు స్వర్గము నిచ్చుఁగాక యను నర్థము స్ఫురించుచున్నది. (ఇది పంచమ ఋక్కు.)

8. అర్థము: యజమానస్య=యజమానునియొక్క, ప్రాణః=ప్రాణము, పశునా సహ=పశువుతోఁ గూడ, నానా (భవతు)=అనేకములుగా అగుఁగాక. యజ్ఞః=(ఈ ఆచరించఁబడుచున్న) యజ్ఞము, దేవేభిః=దేవన శీలములైన పశు ప్రాణములతోఁ గూడ, దేవయానః (భవతు)=దేవతలను గూర్చి పోవుఁగాక. పాథః=పశురూపమైన యన్నము, దేవానామ్=దేవతలకు, జీవమపి=జీవన హేతుత్వమును గూడ, ఏతు=పొందుఁగాక. యజమానస్య=యజమానునియొక్క, కామాః=కోరికలు, సత్యాః=సత్యములు, సన్తు=అగుఁగాక.

తాత్పర్యము: యజమాన ప్రాణము పశువుతోఁ గూడ నానా విధము లగుఁగాక. ఈ యనుష్ఠింపఁ బడుచున్న యజ్ఞము దేవన శీలములైన పశు ప్రాణములతోఁ గూడ దేవతల యొద్దకు పోవుఁగాక. పశురూపాన్నము దేవతలకు జీవన హేతుత్వమును గూడ పొందుఁగాక. యజమానుని కోరికలు సత్యము లగుఁగాక. (అధ్వర్యుఁడు "నానాప్రాణో యజమానస్య" ఇత్యాది మంత్రమును జపించవలెను.)

9. అర్థము: పశుః=(ఈ) పశువు, మాయుమ్=(మారణ సమయమునందు) దుఃఖ హేతుక శబ్దమును, అకృత యత్=చేసినచో, వా=లేదా, పద్భిః=పాదములచేత, ఉరః=వక్షస్సును, ఆహతే యత్=కొట్టుకొనుచున్నచో, తస్మాత్ ఏనసః=ఆ పాపమునుండి, అగ్నిః=అగ్ని, మా=నన్ను, ముఞ్చతు=విడుచుఁగాక. విశ్వాత్=సమస్తమైన, అంహసః=పాపమునుండి, ముఞ్చతు=విడుచుఁగాక.

తాత్పర్యము: ఈ పశువు మారణ సమయమునందు దుఃఖకరమైన శబ్దమును చేసినను, పాదములతో రొమ్మును కొట్టుకొనినను, ఏర్పడునట్టి పాపమునుండియు, బంధనాద్యుపద్రవముచే కలుగునట్టి సమస్తమైన పాపమునుండియు అగ్ని నన్ను విడిపించుఁగాక. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు సంజ్ఞప్త హోమము చేయవలెను.)

10. అర్థము: హే శమితారః!=ఓ పశు విశసన కర్తలారా! (యూయమ్=మీరు), దేవేభిః=దేవతలతో, అన్వితమ్=కూడియున్న, యజ్ఞమ్=యజ్ఞమును, ఉపేతన=పొందుఁడు (ప్రవర్తింపఁజేయుఁడు). (ఇమం) పశుమ్=ఈ పశువును, పాశాత్=(బంధించిన) త్రాటినుండి, ప్ర ముఞ్చత=బాగుగ విడిచిపెట్టుఁడు. బన్ధాత్=బంధన జన్య దోషమునుండి, యజ్ఞపతిమ్=యజ్ఞకర్తను, పరి ముఞ్చత=అంతటను విడిచిపెట్టుఁడు. (విశసనము=చంపుట.)

తాత్పర్యము: ఓ పశువిశసన కర్తలయిన దేవతలారా! మీరు దేవతలతోఁ గూడి యజ్ఞమును ప్రవర్తింపఁ జేయుఁడు. బంధన రూపమైన త్రాటినుండి ఈ పశువును విడువుఁడు. బంధన జన్య దోషమునుండి యజమానుని విడువుఁడు. (అధ్వర్యు యజమానులు ఈ మంత్రముచేత వపాశ్రపణ సాధనము లయిన ఏకశూల ద్విశూలములను పట్టుకొని పశు విశసన ప్రదేశమునకు ధావలయును.)

11. అర్థము: అదితిః=పృథివి, ఏతం పాశమ్=పశువుయొక్క ఈ పాశమును, ప్ర ముమోక్తు=బాగుగ విడుచుఁగాక. (అహమ్=నేను), పశుభ్యః=పశువులకొఱకు, పశుపతయే=పశుపతికొఱకు, నమస్కరోమి=(నా యపరాధము పోవుటకై), నమస్కరించుచున్నాను.

తాత్పర్యము: పృథివి ఈ పశు బంధనమైన త్రాటిని విడుచుఁగాక. నేను (యజమానుఁడు) పశువులకు పశుపతికి (బంధన దోష నివృత్తికై) నమస్కరించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచుఁ పశువుయొక్క బంధనము నూడ దీయవలెను.)

12. అర్థము: అరాతీయన్తమ్=శత్రుత్వమును గోరుచున్నవానిని, అధరమ్=నాకంటె క్రిందివానినిగా, కృణోమి=చేయు చున్నాను. యమ్=ఎవనిని, ద్విష్మః=ద్వేషించుచున్నామో, తస్మిన్=వానియందు, పాశమ్=పాశమును, ప్రతి ముఞ్చామి=విడుచుచున్నాను. (ఈ త్రాటిచే వానిని బంధించుచున్నాననని భావము.)

తాత్పర్యము: నా విషయమున శత్రుత్వమును గోరుచున్నవానిని నా కంటె తక్కువవానినిగా చేయుచున్నాను. మేము ద్వేషించుచున్నవానియందు ఈ పాశమును విడుచుచున్నాను. (యజమానుఁడు శత్రువు విషయమున ఆభిచారిక హోమము చేయుచో నీ త్రాటిచే వృక్షమును గాని, జాతిని గాని, స్తంభమును గాని కప్ప వలెను.)

13. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, తే=ఆ దేవతలు, హవ్యవాహమ్=(దేవతల నుద్దేశించి) హవిస్సును వహించువాఁడవును, శృతం కర్తారమ్=(ఆర్ద్రమైన హవిస్సును) పక్వమైన దానినిగాఁ జేయువాఁడవును, యజ్ఞియమ్=యజ్ఞ సంపాదనార్హుఁడవునునగు, త్వామ్ ఉ=నిన్నే, దధిరే=(కార్యకరునిగా) నిశ్చయించిరి. హే జాత వేదః!=ఓ అగ్నీ! (త్వమ్=నీవు), సతనుః=దృఢశరీరుఁడవు, భూత్వా=అయి, సదక్షః=ఉత్సాహముతోఁ గూడినవాఁడవు కదా!, అథ=అందువలన, హవ్యా=హవిస్సులను, (వోఢుమ్=వహించుటకు), జుషస్వ=ప్రీతి యుక్తుఁడ వగుము. ('హవ్యా'=లుప్త విభక్త్యంతము. 'హవ్యాని' అని యర్థము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! 'దేవేభి రన్విత' మిత్యాది మంత్రముచేఁ జెప్పఁబడిన ఆ దేవతలు నిన్ను కార్యకరునిగా నిశ్చయించిరి. నీవు దేవతల నిమిత్తము హవిస్సును వహించువాఁడవు. ఆర్ద్రమైయున్న హవిస్సును పక్వము చేయుచున్నవాఁడవు. మఱియు యజ్ఞసంపాదనార్హుఁడవు. ఓ యగ్నీ! నీవు దృఢశరీరుఁడవై ఉత్సాహము కలిగి యున్నవాఁడవు కావున హవిస్సు వహించుటకు ప్రీతి కలవాఁడ వగుము. (అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు స్రువముతో వపను హోమము చేయవలెను.)

14. అర్థము: హే జాతవేదః!=ఓ యగ్నీ! త్వమ్=నీవు, వపయా=వపతో (కూడ), దేవాన్=దేవతలను గూర్చి, గచ్ఛ=పొమ్ము. త్వమ్=నీవు, ప్రథమః హోతా=మనుష్య హోతలకంటె పూర్వుఁడవు, బభూథ హి=అయితివి కదా! (తత్=ఆ కారణమువలన), త్వమ్=నీవు, ఘృతేన=ఆజ్యముచే, తనువః=(దేవతలయొక్క) శరీరములను, వర్ధయస్వ=వృద్ధి నొందించుము. దేవాః=(ఆ) దేవతలు, స్వాహాకృతమ్=స్వాహాకారముచే సమర్పింపఁబడిన, హవిః=హవిస్సును, అదన్తు=భక్షింతురు గాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు వపతోఁ గూడ దేవతలయొద్దకు పొమ్ము. నీవు మనుష్య హోతలకంటె పూర్వ హోతవు కావున ఆజ్యముచే దేవతల శరీరములను వృద్ధి నొందించుము. ఆ దేవతలును స్వాహా అని సమర్పింపఁబడిన హవి స్సును భక్షింతురు గాక. (ఈ మంత్రము చెప్పుచు 'వౌషట్' అని హోమము చేయవలెను 'బభూథ' అను ప్రయోగము వైదికము. 'బభూవిథ' లౌకిక సంస్కృత ప్రయోగము.)

15. అర్థము: దేవేభ్యః=దేవతలకొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుత మగుఁగాక. దేవేభ్యః స్వాహా, తాత్పర్యము సులభము.

వినియోగము: వపా హోమమునకు ముందు "స్వాహా దేవేభ్యః" అని ఆజ్యమును హోమము చేయవలెను. వపాహోమానంతరము "దేవేభ్యః స్వాహా" అని హోమము చేయవలెను. ఈ హోమములు వపాంగములు కావున వప్యము లనఁబడును.

చతుర్థానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: ప్రాజాపత్యా వై పశవ స్తేషాగ్ం రుద్రో ఽధిపతి ర్యదేతాభ్యా ముపాకరోతి తాభ్యా మేవైనం ప్రతిప్రోచ్యా ఽఽలభత ఆత్మనో ఽనాప్రవస్కాయ [2]ద్వాభ్యా ముపాకరోతి ద్విపాద్యజమానః ప్రతిష్ఠిత్యై [3]ఉపాకృత్య పఞ్చ జుహోతి పాఙ్క్తాః పశవః పశూనేవావ రున్ధే [4]మృత్యవే వా ఏష నీయతే యత్పశు స్తం యదన్వారభేత ప్రమాయుకో యజమాన స్స్యాన్నానాప్రాణో యజమా నస్య పశునేత్యాహ వ్యావృత్త్యై (౧)[5]యత్పశు ర్మాయు మకృతేతి జుహోతి శాన్త్యై [6]శమీ తార ఉపేతనేత్యాహ యథాయజు రేవైత [7]ద్వపాయాం వా ఆహ్రియమాణాయా మగ్నే ర్మేధో ఽప క్రామతి త్వాము తే దధిరే హవ్యవాహమితి వపామభి జుహోత్యగ్నేరేవ మేధ మవ రున్ధే ఽథో శృతత్వాయ [8]పురస్తా త్స్వాహాకృతయో వా అన్యే దేవా ఉపరిష్టా త్స్వాహాకృతయో ఽన్యే స్వాహా దేవేభ్యో దేవేభ్య స్స్వాహేత్యభితో వపాం జుహోతి తానేవోభయా న్ప్రీణాతి ॥ ౨ ॥

(వ్యావృత్త్యా అభితో వపాం పఞ్చ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

## వేదార్థ దీపిక

అవతారిక: నాల్గవ యనువాకమునందు పశూపాకరణ మంత్రములు చెప్పఁబడినవి. ఈ పంచమానువాకమునందు ఆ మంత్రములకు బ్రాహ్మణము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: పశవః=పశువులు, ప్రాజాపత్యాః వై=ప్రజాపతి జన్యములు కదా! తేషామ్=ఆ పశువులకు, రుద్రః=అగ్ని, అధిపతిః=అధిపతి. ఏతాభ్యామ్="ప్రజాపతే ర్జాయమానాః" "ఇమం పశుమ్" ఇత్యాదులైన చతుర్థాను వాకమునందలి ప్రథమ ద్వితీయ ఋక్కులచేత, ఉపాకరోతి యత్=పశూపాకారణము చేసినచో, (చేయవల యును.) ఆత్మనః=తనయొక్క, అనాప్రవస్కాయ=నిరపరాధిత్వముకొఱకు, తాభ్యామేవ=ఆ ప్రజాపత్యగ్ని దేవతలకొఱకే, ప్రతి ప్రోచ్య=ప్రత్యేకముగ నుచ్చరించి, ఏనమ్=ఈ పశువును, ఆలభత=(యజమానుఁడు) ఆలంభనము చేసినవాఁ డగును.

## అథ తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే షష్ఠోఽనువాకః।

మూలము: [1]యో వా అయథాదేవతం యజ్ఞముపచరత్యా దేవతాభ్యో వృశ్చ్యతే పాపీయాన్ భవతి యో యథాదేవతం న దేవతాభ్య ఆ వృశ్చ్యతే వసీయాన్భవత్యాగ్నేయ్యర్చాఽఽగ్నీధ్ర మభిమృశే ద్వైష్ణవ్యా హవిర్ధాన మాగ్నేయ్యా స్రుచో వాయవ్యయా వాయవ్యా న్యైన్ద్రియా సదో యథా దేవతమేవ యజ్ఞముప చరతి న దేవతాభ్య ఆ వృశ్చ్యతే వసీయాన్భవతి [2]యునజ్మి తే పృథివీం జ్యోతిషా సహ యునజ్మి వాయు మన్తరిక్షేణ (౧)తే సహ యునజ్మి వాచగ్ం సహ సూర్యేణ తే[3]యునజ్మి తిస్రో విపృచ స్సూర్యస్య తే। [4]అగ్ని ర్దేవతా గాయత్రీ ఛన్ద ఉపాగ్ంశోః పాత్రమసి [5]సోమో దేవతా త్రిష్టుప్ఛన్దో ఽన్తర్యామస్య పాత్రమసీన్ద్రో దేవతా జగతీ ఛన్ద ఇన్ద్రవాయువోః పాత్రమసి బృహస్పతి ర్దేవతా ఽనుష్టుప్ఛన్దో మిత్రావరుణయోః పాత్రమస్యశ్వినా దేవతా పఙ్క్తిశ్ఛన్దో ఽశ్వినోః పాత్రమసి సూర్యో దేవతా బృహతీ (౨)ఛన్ద శ్శుక్రస్య పాత్రమసి చన్ద్రమా దేవతా సతో బృహతీ ఛన్దో మన్థినః పాత్రమసి విశ్వే దేవా దేవతోష్ణిహా ఛన్ద ఆగ్రయణస్య పాత్రమసీన్ద్రో దేవతా కకుప్ఛన్ద ఉక్థానాం పాత్రమసి పృథివీ దేవతా విరాట్ఛన్దో ధ్రువస్య పాత్రమసి ॥౩॥ (అన్తరిక్షేణ బృహతీ త్రయస్త్రిగ్ంశచ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమప్రపాఠకే షష్ఠోఽనువాకః।

## వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు చతుర్థానువాక గత మంత్రముల బ్రాహ్మణము చెప్పఁబడినది. ఈ షష్ఠానువాకమునందు అభిమర్శనవిధులు, మంత్రవిశేషములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: యో వా=ఏ యజమానుఁడైతే, అయథాదేవతమ్=నిర్దిష్ట దేవత నతిక్రమించి, యజ్ఞమ్=యజ్ఞమును, ఉప చరతి=ఆచరించుచున్నాఁడో, (సః=అతఁడు), దేవతాభ్యః=దేవతలనుండి, ఆ వృశ్చ్యతే=విచ్ఛిన్నుఁ డగుచున్నాఁడు. పాపీయాన్=దరిద్రుఁడు, భవతి=అగుచున్నాఁడు. యః=ఏ యజమానుఁడు, యథాదేవతమ్=నిర్దిష్ట దేవత ననుసరించి, యజ్ఞముప చరతి=యజ్ఞము నాచరించుచున్నాఁడో, (సః=అతఁడు), దేవతాభ్యః=దేవతలనుండి, న ఆ వృశ్చ్యతే=విచ్ఛిన్నుఁ డగుట లేదు. యః=ఏ యజమానుఁడు, యథాదేవతమ్=నిర్దిష్ట దేవత నతిక్రమింపక, దేవతాభ్యః=దేవతలనుండి, న ఆ వృశ్చ్యతే=విచ్ఛిన్నుఁ డగుట లేదో, (సః=అతఁడు), వసీయాన్=ధనవంతుఁడు, భవతి=అగుచున్నాఁడు. ఆగ్నేయ్యా ఋచా=అగ్ని దేవతాకమైన "మహారాత్రే బుధ్యాఽగ్నే నయే" త్యాది ఋక్కుచేత, అగ్నీధ్రమ్=అగ్నీధ్రస్థానమును, అభి మృశేత్=అభిమర్శించవలెను. వైష్ణవ్యా=విష్ణుదేవతాకమైన "ఇదం విష్ణు ర్విచక్రమే" ఇత్యాది ఋక్కుచేత, హవిర్ధానమ్=హవిర్ధానమును, అభి మృశేత్=అభిమర్శించవలెను. ఆగ్నేయ్యా=అగ్ని దేవతాకమైన "అగ్న ఆయూగ్ంషి పవసే"త్యాది ఋక్కుచేత, స్రుచః=స్రుక్కులను, వాయవ్యయా=వాయుదేవతాకమైన "ఆ వాయో భూష శుచిపా" ఇత్యాది ఋక్కుచేత, వాయవ్యాని=వాయవ్యములైన గ్రహములను, ఐన్ద్రియా=ఇంద్ర దేవతాకమైన "అభూ యే అగ్నిమిన్ధతే" ఇత్యాది ఋక్కుచేత, సదః=సదస్సును, అభి మృశేత్=అభిమర్శించవలెను. (ఏవం చేత్=ఇట్లైనచో, యజమానః=యజమానుఁడు), యథాదేవతమేవ=నిర్దిష్ట దేవతల ననుసరించియే యజ్ఞమ్=యజ్ఞమును, ఉపచరతి=ఆచరించినవాఁ డగుచున్నాఁడు. దేవతాభ్యః=దేవతలనుండి, న ఆ వృశ్చ్యతే=విచ్ఛిన్నుఁ డగుట లేదు. (అపి చ=మఱియు) వసీయాన్=ధనవంతుఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞము చేయు నైదు దినములలో సుత్యా దినమునందలి ప్రయోగారంభమునందు యజమానుఁడు అగ్నీధ్రాది స్థానములను వరుసగా "మహారాత్రే బుధ్యాఽగ్నే నయే"త్యాది ఋక్కులను పఠించుచు నభిమర్శ చేయవలెను. ఇట్లు చేసినచో యజమానుఁడు ఆ యా దేవతల యనుగ్రహమునకు పాత్రుఁ డగును. ధనవంతుఁడు నగును. స్థానములలో దేనికి ఏ దేవతయో తత్తద్దేవతాకములైన ఋక్కులను విడిచి యితర ఋక్కులతో ఆ యా స్థానముల నభిమర్శించినచో ఆ యా దేవతలనుండి విచ్ఛిన్నుఁ డగును. మఱియు దరిద్రుఁ డగును. ("మహారాత్రే బుధ్యాఽగ్నే నయే"త్యాది మంత్రముల నైదింటిలో మొదటి నాలుగు మంత్రములు ప్రథమ కాండమునందు వ్యాఖ్యాతము లైనవి. ఐదవది బ్రాహ్మణ గ్రంథమునందలి ద్వితీయ కాండ చతుర్థ ప్రపాఠకమునందు కలదు. కావున అది యచటనే వ్యాఖ్యానించఁబడును. అభిమర్శనము=స్పృశించుట.)

2. అర్థము: (హే ద్రోణకలశ!=ఓ ద్రోణకలశమా!), తే=నీ యొక్క (స్వరూపమైన), పృథివీమ్=పృథివిని, జ్యోతిషా సహ=అగ్నితోఁగూడ, (అస్మిన్ స్థానే=ఈ స్థానమునందు), యునజ్మి=(కూర్చుచున్నాను) ఉంచుచున్నాను. (హే ఆధవనీయ!=ఓ ఆధవనీయమా!), తే=నీయొక్క, (స్వరూపమైన) వాయుమ్=వాయువును, అంతరిక్షేణ సహ=వాయ్వాధారమైన అంతరిక్షముతోఁ గూడ, (అస్మిన్=ఈ స్థానమునందు.) యునజ్మి=ఉంచుచున్నాను. (హే పూతభృత్!=ఓ పూతభృత్తూ!) తే=నీ యొక్క (స్వరూపమైన), వాచమ్=దివిని, సూర్యేణ సహ=ద్యులోకస్థుఁడైన సూర్యునితోఁగూడ, (అస్మిన్=ఈ స్థానమునందు), యునజ్మి=ఉంచుచున్నాను.

తాత్పర్యము: ద్రోణకలశము, ఆధవనీయము, పూతభృత్తు – అనునవి పాత్రవిశేషములు. వీనిలో ద్రోణకలశ పాత్రము పృథివీ రూపముగాను, ఆధవనీయము అంతరిక్ష రూపముగాను, పూతభృత్తు ద్యులోక రూపము గాను వర్ణింపఁబడినవి. ఓ ద్రోణకలశమా! నీ స్వరూపమైన పృథివిని అగ్నితోఁ గూడ నిచట నుంచుచున్నాను. శేషము సులభము. ఉచ్యతే నానావిధై ర్మంత్రైః ప్రతిపాద్యతే ఇతి వాక్=ద్యులోకః అను వ్యుత్పత్తి ననుసరించి వాక్ఛబ్ద మిచట ద్యులోకార్థకముగఁ జెప్పఁబడినది. "యునజ్మి"త్యాదికముచే హవిర్ధానము యొక్క బండికంటికి పశ్చిమభాగమున దశాపవిత్రముతోఁ గూడ ద్రోణకలశము నుంచవలెను. 'వాయు మంతరిక్షేణే'త్యాది మంత్రభాగము నుచ్చరించుచు ఆధవనీయ పాత్రమును హవిర్ధానముయొక్క పైభాగమున నుంచవలెను. పూతభృత్తును 'వాచం సహే'త్యాది మంత్రముచే హవిర్ధాన ప్రధురమునందు ఉంచవలెను. (ప్రధురము=బండి కంటి కడకమ్మి.)

3. అర్థము: తిస్రః=జుహూపభృద్ధ్రువ లనెడి మూఁడు స్రుక్కులను, విపృచః=సంపర్క రహితములుగా (ఉండునట్లు), సూర్యస్య=సూర్యుఁడపైన, తే=నీయొక్క, (ప్రకాశేన=కాంతిచే, పరీక్ష్య=పరీక్షించి), యునజ్మి=ఉంచుచున్నాను.

తాత్పర్యము: జుహువు, ఉపభృత్తు, ధ్రువ అనెడి స్రుక్కులను సంపర్కము లేని విధముగా సూర్యకాంతిచేఁ బరీక్షించి ఉంచుచున్నాను. (ఈ మంత్రముచే జుహూపభృద్ధ్రువ లనెడి స్రుక్కులను అభిమంత్రించవలెను.)

4. అర్థము: (హే ఊర్ధ్వపాత్ర!=ఓ ఊర్ధ్వ పాత్రమా!, త్వామ్=నిన్ను,) అగ్నిః దేవతా=అగ్ని దేవత, (రక్షతు=రక్షించుఁగాక.) గాయత్రీచ్ఛన్దః=గాయత్రీచ్ఛందస్సు, త్వామ్=నిన్ను, రక్షతు=రక్షించుఁగాక. త్వమ్=నీవు), ఉపాంశోః=ఉపాంశు నామక సోమరస గ్రహణమునకు, పాత్రమ్=పాత్రము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ ఊర్ధ్వపాత్రమా! అగ్నిదేవత, గాయత్రీచ్ఛందస్సు నిన్ను రక్షింతురుగాక. నీవు ఉపాంశు నామక సోమరస గ్రహణమునకు అర్హ మగుచున్నావు. (ఉపాంశునామక సోమరస గ్రహణము=మౌనముగ అనఁగా మంత్రోచ్చారణము లేకుండ సోమరసమును గ్రహించుట.)

5. అర్థము: (హే ఊర్ధ్వపాత్ర!=ఓ ఊర్ధ్వపాత్రమా!, త్వామ్=నిన్ను), సోమః దేవతా=సోమదేవత, (రక్షతు=రక్షించుఁగాక) త్రిష్టుప్ ఛన్దః=త్రిష్టుప్ ఛన్దస్సు, (రక్షతు=రక్షించుఁగాక. త్వమ్=నీవు,) అంతర్యామస్య=అంతర్యామ నామక సోమరస గ్రహణమునకు, పాత్రమ్=అర్హము, అసి=అగుచున్నావు. ఇన్ద్రః దేవతా=ఇంద్ర దేవత, జగతీ ఛన్దః=జగతీ ఛన్దస్సు, (త్వామ్=నిన్ను, రక్షతామ్=రక్షింతురుగాక). ఇన్ద్రవాయువోః=ఇంద్ర వాయు దేవతాక సోమరస గ్రహణమునకు, పాత్రమ్=అర్హము, అసి=అగుచున్నావు. బృహస్పతిః దేవతా=బృహస్పతి దేవత, అనుష్టుప్ ఛన్దః=అనుష్టుప్ఛన్దస్సు, (త్వామ్=నిన్ను, రక్షతామ్=రక్షింతురుగాక. త్వమ్=నీవు) మిత్రావరుణయోః=మిత్రావరుణ దేవతాకమైన సోమరస గ్రహణమునకు, పాత్రమ్, అసి. అశ్వినౌ దేవతా=అశ్వినీదేవతలు, పఙ్క్తిః ఛన్దః=పఙ్క్తిచ్ఛన్దస్సు, (త్వామ్=నిన్ను, రక్షతామ్=రక్షింతురుగాక, త్వమ్=నీవు,) అశ్వినోః=అశ్వినీ దేవతాక సోమరస గ్రహణమునకు, పాత్రమ్, అసి. సూర్యః దేవతా=సూర్య దేవత, బృహతీచ్ఛన్దః=బృహతీ ఛన్దస్సు, (త్వామ్=నిన్ను, రక్షతామ్=రక్షింతురుగాక. త్వమ్=నీవు) శుక్రస్య=శుక్ర సంబంధియగు సోమరస గ్రహణమునకు, పాత్రమ్, అసి. చన్ద్రమాః దేవతా=చంద్ర దేవత, సతోబృహతీచ్ఛన్దః=సతోబృహతీచ్ఛన్దస్సు, (త్వాం, రక్షతామ్=నిన్ను రక్షింతురుగాక. త్వమ్=నీవు,) మన్థినః=మన్థి సంబంధమైన సోమరస గ్రహణమునకు, పాత్రమ్, అసి. విశ్వే దేవాః దేవతా=విశ్వేదేవ దేవతలు, ఉష్ణిహా ఛన్దః=ఉష్ణిక్ఛన్దస్సు, (త్వామ్, రక్షన్తామ్=నిన్ను రక్షింతురుగాక.) (హే స్థాలి=ఓ స్థాలీ విశేషమా! త్వమ్=నీవు), ఆగ్రయణస్య=ఆగ్రయణ సంబంధి సోమరస గహణమునకు, పాత్రమసి=పాత్ర మగుచున్నావు. ఇన్ద్రః దేవతా=ఇంద్రదేవత, కకుప్ ఛన్దః=కకుప్ఛన్దస్సు, (త్వామ్, రక్షతామ్=నిన్ను రక్షింతురుగాక, త్వమ్=నీవు,) ఉక్థానామ్=ఉక్థాది శస్త్ర సంబంధి సోమరస గ్రహణమునకు, పాత్రమసి=పాత్ర మగుచున్నావు. పృథివీ దేవతా=పృథివీ దేవత, విరాట్ ఛన్దః=విరాట్ ఛన్దస్సు, (త్వామ్, రక్షతామ్. త్వమ్), ధ్రువస్య=ధ్రువ సంబంధి సోమరస గ్రహణమునకు, పాత్రమసి=అర్హ మగుచున్నావు.

తాత్పర్యము: ఓ ఊర్ధ్వపాత్రమా! నిన్ను సోమ దేవతాదులు, త్రిష్టుభాది ఛన్దస్సులు రక్షింతురుగాక. నీవు అంతర్యామాది సంబంధి సోమరసగ్రహణమునకు పాత్ర మగుచున్నావు. శేషము సులభము. సోమరస గ్రహణమునకు=సోమరసమును గ్రహించుటకు. పాత్రమ్=పాత్రము, లేదా అర్హము అనియు చెప్పవచ్చును.)

షష్ఠానువాకము సమాప్తము.

అథ తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే సప్తమోఽనువాకః।

మూలము: [1]ఇష్టర్గో వా అధ్వర్యు ర్యజమానస్యేష్టర్గః ఖలు వై పూర్వోఽర్ష్టుః క్షీయత ఆసన్న్యాన్మా మన్త్రా

త్పాహి కస్యాశ్చి దభిశస్త్యా ఇతి పురా ప్రాతరనువాకా జ్జుహుయా దాత్మన ఏవ తదధ్వర్యుః

పురస్తాచ్ఛర్మ నహ్యతే ఽనార్త్యై [2]సంవేశాయ త్వోపవేశాయ త్వా గాయత్రియా స్త్రిష్టుభో

జగత్యా అభిభూత్యై స్వాహా ప్రాణాపానౌ మృత్యోర్మా పాతం ప్రాణాపానౌ మా మా హాసిష్టం

[3]దేవతాసు వా ఏతే ప్రాణాపానయోః (౧)వ్యాయచ్ఛన్తే యేషాగ్ం సోమ స్సమృచ్ఛతే సంవే

శాయ త్వోపవేశాయ త్వేత్యాహ ఛన్దాగ్ంసి వై సంవేశ ఉపవేశ శ్ఛన్దోభి రేవాస్య ఛన్దాగ్ంసి

వృఙ్క్తే [4]ప్రేతివన్త్యాజ్యాని భవన్త్యభిజిత్యై మరుత్వతీః ప్రతిపదో విజిత్యా ఉభే బృహద్రథంతరే

భవత [5]ఇయం వావ రథంతర మసౌ బృహదాభ్యా మేవైన మన్తరేత్యద్య వావ రథంతరగ్ం

శ్వో బృహదద్యాశ్వాదేవైన మన్తరేతి భూతమ్ (౨)వావ రథంతరం భవిష్యద్బృహ ద్భూతాచ్చై

వైనం భవిష్యత శ్చాన్తరేతి పరిమితం వావ రథంతర మపరిమితం బృహత్పరిమితా చ్చైవైన

మపరిమితా చ్చాన్తరేతి [6]విశ్వామిత్రజమదగ్నీ వసిష్ఠేనాస్పర్ధేతాగ్ం స ఏతజ్జమదగ్ని ర్విహవ్య

మపశ్య త్తేన వై స వసిష్ఠస్యేన్ద్రియం వీర్య మవృఙ్క్త యద్విహవ్యగ్ం శస్యత ఇన్ద్రియమేవ

తద్వీర్యం యజమానో భ్రాతృవ్యస్య వృఙ్క్తే [7]యస్య భూయాగ్ంసో యజ్ఞక్రతవ ఇత్యాహు

స్స దేవతా వృఙ్క్త ఇతి యద్యగ్నిష్టోమ స్సోమః పరస్తా త్స్యాదుక్థ్యం కుర్వీత యద్యుక్థ్య

స్స్యాదతిరాత్రం కుర్వీత యజ్ఞక్రతుభి రేవాస్య దేవతా వృఙ్క్తే వసీయా న్భవతి ॥ ౭ ॥

(ప్రాణాపానయో ర్మృత్యుం వృత్తిః ఉష్టావింశతిశ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమప్రపాఠకే సప్తమోఽనువాకః

## వేదార్థదీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు అగ్నీధ్ర స్పర్శనాద్యర్థక మంత్రములు చెప్పఁబడినవి. ఈ సప్తమానువాకమునందు పరస్పర మాత్సర్యముతో ప్రవృత్తులైన ఇద్దఱు యజమానులకు ఒకానొక నైమిత్తిక యాగము చెప్పఁబడుచున్నది. ఏదేని నిమిత్తము కారణముగాఁ జేయు యాగము నైమిత్తిక యాగ మనఁబడును.

1. అర్థము: అధ్వర్యుః=అధ్వర్యుఁడు, ఇష్టర్గః వా=(యాగ విధానములందు ప్రమాదాలస్యాదులవలన) కోరికను నశింపఁ జేయువాఁడు కదా! ఇష్టర్గః=కోరికలను నశింపఁజేయునట్టి అధ్వర్యుఁడు, అర్తుః=(యజ్ఞ వినాశముచే) ఆర్తిని పొందునట్టి యజమానునికంటె, పూర్వః వై=పూర్వమే, క్షీయతే ఖలు=(స్వయముగ) నశించువాఁడు కదా! (తత్పరిహారాయ=ఆ దోషము పోవుటకై, "హే దేవః=ఓ దేవా!,) ఆసన్యాత్=శత్రుముఖమునందు పడునట్టి, మంత్రాత్=అభిచార రూప మంత్రమువలన, కస్యాశ్చిత్ అభిశస్త్యాః=సమస్తమైన అపవాదమునుండియు, మా=నన్ను, పాహి=రక్షింపుము." ఇతి=అను మంత్రముచే, ప్రాతరనువాకాత్ పురా=హోతృ సంబంధియైన ప్రాతరనువాకముకంటె పూర్వము, అధ్వర్యుః=అధ్వర్యుఁడు, (ఆజ్యమ్=ఆజ్యమును, ఆగ్నీధ్రే=ఆగ్నీధ్ర స్థానమునందు), జుహుయాత్=హోమము చేయవలెను. (తేన=ఆ హోమముచేత) అధ్వర్యుః=అధ్వర్యుఁడు, ఆత్మనే ఏవ=తనకొఱకే, పురస్తాత్=ప్రథమమున, శర్మ=సుఖమును, నహ్యతే=బంధించుచున్నాఁడు. తత్=అది, (యజమానస్య=యజమానునియొక్క) అనార్త్యై=దుఃఖ రాహిత్యమునకై, (సంపద్యతే=ఏర్పడు చున్నది).

తాత్పర్యము: అధ్వర్యుఁడు యజ్ఞతంత్రమును నడుపుటయందు ప్రమాదాలస్యాది దోషములచే యజమానుని కోరికను నశింపఁజేయువాఁ డగును. యజ్ఞ వినాశముచేఁ గలుగు యజమాన నాశమునకు ముందే అధ్వర్యుఁడు నశించును. అందువలన అధ్వర్యుడు స్వవినాశ పరిహారమునకై "ఆసన్యా" దిత్యాది మంత్రముచే హోతృ సంబంధియైన ప్రాతరనువాకముకంటె ముందే ఆగ్నీధ్ర స్థానమునందు ఆజ్యమును హోమము చేయవలెను. "ఓ దేవా! శత్రుముఖమునందు పడునట్టి అభిచార మంత్రమువలన సమస్తమైన అపవాదము నుండియు నన్ను రక్షింపుము." అని ఆ మంత్రమున కర్థము. ఆ హోమముచే అధ్వర్యుఁడు తన సుఖము నరికట్టినవాఁ డగును. అది యజమానునకు దుఃఖము లేకుండుటకు కారణ మగును.

2. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ! మమ=నాయొక్క), సంవేశాయ=శయనముకొఱకు, ఉపవేశాయ=ఆసనముకొఱకు, గాయత్రియాః=గాయత్రీ కర్తృకమైన, అభిభూత్యై=(శత్రు) పరిభవముకొఱకు, త్వా=నిన్నుఁగూర్చి, స్వాహా=(ఈ హవిస్సు) హుతమగుఁ గాక. త్రిష్టుభః=త్రిష్టుప్ కర్తృకమైన, అభిభూత్యై=(శత్రు) పరిభవముకొఱకు, త్వా=నిన్నుఁగూర్చి, స్వాహా=ఈ హవిస్సు హుత మగుఁ గాక. జగత్యాః=జగతీ కర్తృకమైన, అభిభూత్యై=(శత్రు) పరిభవముకొఱకు, త్వా=నిన్నుఁ గూర్చి, స్వాహా=(ఈ హవిస్సు) హుత మగుఁ గాక. హే ప్రాణాపానౌ!=ఓ ప్రాణాపాన వాయువులారా!, మృత్యోః=మృత్యువునుండి, మా=నన్ను, పాతమ్=రక్షించుఁడు. హే ప్రాణాపానౌ!=ఓ ప్రాణాపాన వాయువులారా! మా=నన్ను, మా హాసిష్టమ్=విడువ వలదు.

తాత్పర్యము: మాత్సర్యముతో సోమయాగము చేయుచున్న యిద్దఱు యజమానులకు పూర్వోక్తమైన ఆసన్య మంత్రమునకు బదులుగా ఇట మంత్రాంతరము లైదు చెప్పఁబడుచున్నవి. "సంవేశాయ త్వోపవేశాయ త్వా గాయత్రియా

అభిభూత్యై స్వాహా'' 2"సంవేశాయ త్వోపవేశాయ త్వా త్రిష్టుభో ఽభిభూత్యై స్వాహా" 3"సంవేశాయ త్వోపవేశాయ త్వా జగత్యా అభిభూత్యై స్వాహా" 4"ప్రాణాపానౌ మృత్యోర్మా పాతం స్వాహా" 5"ప్రాణాపానౌ మా మా హాసిష్టం స్వాహా'' అని యివి ఐదు మంత్రములు. ఓ యగ్నీ! నేను పరుండుటకు, కూర్చుండుటకు, గాయత్రీ ఛన్దః కర్తృక శత్రు పరిభవముకొఱకు నీకు సమర్పించిన యీ హవిస్సు హుతమగుఁగాక. ఇట్లే 2, 3 మంత్రముల తాత్పర్యము. ఓ ప్రాణాపాన వాయువులారా! నన్ను రక్షింపుఁడు. మీకు ఈ హవిస్సు హుత మగుఁగాక. ఓ ప్రాణాపానములారా! నన్ను విడువకుఁడు. మీ కీ హవిస్సు హుతమగుఁగాక అని సమన్వయము.

3. అర్థము: యేషామ్=ఏ యజమానులయొక్క, సోమః=సోమయాగము, సమృచ్ఛతే=మాత్సర్యముతో ప్రవర్తించుచున్నదో, ఏతే=ఈ యజమానులు. దేవతాసు=దేవతల విషయమునను, ప్రాణాపానయోః=ప్రాణాపాన విషయమునను, వ్యాయచ్ఛన్తే=విప్రతిపత్తి కలవా రగుచున్నారు. ("ఏతద్దేవతాకము నాకే కావలెను. ఇతరునకు వలదు'' అని ఎవరికి వారనుకొనుట విప్రతిపత్తి యనఁబడును. తస్యాం సత్యామ్=ఆ విప్రతిపత్తి కలుగుచుండఁగా), ''సంవేశాయ త్వోపవేశాయ త్వే''తి ఆహ=''సంవేశాయేత్యాది పంచ మంత్రముల చేత, (ప్రాతరనువాకమునకు పూర్వము ఆగ్నీధ్రమునందు హోమము చేయవలెను. ఇట విశ్రమ్భ పూర్వక సంవేశోపవేశ శబ్దములచేత తత్కారణీభూత గాయత్ర్యాది ఛన్దస్సులు ఉపలక్షింపఁ బడుచున్నవి. విశ్రమ్భము=ప్రమాద రాహిత్యము.) ఛన్దాంసి వై=గాయత్ర్యాది ఛన్దస్సులే, సంవేశః ఉపవేశః=సంవేశోపవేశ కారణములు. (తథా సతి=అట్లుకాఁగా), అస్య=సంవేశాది మంత్రములచే హోమము చేసిన ఈ యజమానునియొక్క, (యజ్ఞే ప్రవృత్తైః=యజ్ఞమునందు ప్రవృత్తములైన), ఛన్దోభిః=గాయత్ర్యాది ఛన్దస్సుల చేత, (అయమ్=ఈ యజమానుఁడు), ఛన్దాంసి=ప్రతిస్పర్ధి యజ్ఞగత ఛన్దస్సులను, వృఙ్క్తే=నశింపఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: మాత్సర్యముతో సోమయాగము చేయుచున్న యజమానులు 'ఏతద్దేవతాకము నాకే కావలయును. ఇతరునకు వలదు' అని విప్రతిపత్తి కలవారగుచున్నారు. ఈ విప్రతిపత్తి కలిగినపుడు 'సంవేశాయే' త్యాది పంచ మంత్రములచే ప్రాతరనువాకమునకు ముందే ఆగ్నీధ్రమునందు హోమము చేయవలెను. విశ్రంభ పూర్వకము లయిన సంవేశోపవేశ శబ్దములచేత తత్కారణీభూత ఛన్దస్సులు ఉపలక్షితము లగుచున్నవి. గాయత్ర్యాది ఛందస్సులే సంవేశోపవేశములు. సంవేశాది మంత్రములచేత హోమము చేసిన యజమానుని యజ్ఞమునందు ప్రవృత్తము లయిన గాయత్ర్యాది ఛన్దస్సులచే ఈ యజమానుఁడు ప్రతిస్పర్ధి చేయు యజ్ఞము నందలి ఛన్దస్సులను నశింపఁజేయుచున్నాఁడు. అప్పుడు దేవతలు ప్రాణాపానములు స్వాధీనము లగుటచే యజమానుఁడు స్వయముగ నుపద్రవ రహితుఁడై సుఖముగ శయనించుటకు ఉపవసించుటకు సమర్థుఁ డగునని భావము.

4. అర్థము: ప్రేతివన్తి=ప్రకృష్ట గతి కలవియగు, ఆజ్యాని=ఆజ్య స్తోత్రములు, అభిజిత్యై=అభిజయముకొఱకు, భవన్తి=సంపన్నము లగుచున్నవి. మరుత్వతీః=మరుత్వచ్ఛబ్ద ఘటితములైన, ప్రతిపదః=ఆజ్య స్తోత్రములను ప్రారంభించునట్టి ఋక్కులు, విజిత్యై=విజయముకొఱకు, భవన్తి=అగుచున్నవి. ఉభే బృహద్రథంతరే=బృహత్సామ రథంతర సామములు రెండును, (అస్మిన్ సంసవే=మాత్సర్యముతో ప్రవృత్తమైన ఈ సోమయాగమునందు, భవతః=(సముచ్చయముగ నాచరితవ్యములు) అగుచున్నవి.

తాత్పర్యము: ''ప్ర వో వాజా'' ఇత్యాదులు ప్రేతివన్తములయిన ఆజ్య స్తోత్రములు. గతి ప్రకర్ష వాచకమైన 'ప్ర' అను శబ్దమును కలిగియుండుటచే నివి 'ప్రేతివన్తి' అని చెప్పఁబడుచున్నవి. ఈ స్తోత్రములు ఉద్గాతలచే ననుష్ఠింపఁదగినవి. అవి అభిజయమునకు ఉపయోగపడుచున్నవి. మాత్సర్యము లేకుండఁ జేయఁబడు సోమయాగమునందు "అగ్న ఆ యాహి వీతయే" ఇత్యాదులయిన ఆజ్య స్తోత్రములు అనుష్ఠింపఁబడుచుండును. (అభిజితి=హింసార్థమైన హోమము.) మరుత్వచ్ఛబ్ద ఘటిత ఋక్కులచే ఆజ్య స్తోత్రములు ప్రారంభింపఁబడును కావున ఆ ఋక్కులు ప్రతిపదము లనఁబడును. ఆ ఋక్కులు విజయమున కగు

చున్నవి. మాత్సర్య ప్రవృత్త రూపమైన ఈ సోమయాగమునందు బృహత్సామము రథంతర సామము ఉభయము అనుష్ఠింపఁదగియున్నది. (మాత్సర్యము లేకుండ సామాన్యముగ ప్రవృత్తమైన సోమ యాగము (నిత్యప్రయోగము) నందు బృహత్సామము గాని, రథంతర సామము గాని ఏదియేని ఒకటి అనుష్ఠేయమై యున్నది.)

5. అర్థము: రథంతరమ్=రథంతర సామము, ఇయం వావ=ఈ భూలోక రూపమే. బృహత్=బృహత్సామము, అసౌ=ద్యులోకరూప మైనది. ఆ భ్యామేవ=ఈ భూలోక ద్యులోక రూపముల నుండియే, (యజమానః=మాత్సర్య ప్రవృత్త సోమయాగకర్త) ఏనమ్=ఈ ప్రతిస్పర్ధిని, అన్తరేతి=ప్రచ్యుతుని చేయుచున్నాఁడు. రథంతరమ్=రథంతర సామము, అద్య వావ=వర్తమాన దినరూపమే. బృహత్=బృహత్సామము, శ్వః=రేపటిదినము రూప మైనది. (అయమ్=ఈ పూర్వోక్త యజమానుఁడు), అద్యా శ్వాదేవ=వర్తమాన దినమునుండియు, రేపటి దినము నుండియు, ఏనమ్=ఈ ప్రతిస్పర్ధిని, అన్తరేతి=ప్రచ్యుతునిఁ జేయుచున్నాఁడు. రథంతరమ్=రథంతర సామము, భూతం వావ=భూతకాల శ్రేయోరూపమే. బృహత్=బృహత్సామము, భవిష్యత్=భవిష్య త్కాల శ్రేయోరూపము. (అసౌ=ఈ పూర్వోక్త యజమానుఁడు), ఏనమ్=ఈ ప్రతిస్పర్ధిని, భూతాచ్చ=భూతకాల శ్రేయస్సు నుండియు, భవిష్యతశ్చ=భవిష్యత్కాల శ్రేయస్సునుండియు, అన్తరేతి=ప్రచ్యుతుని చేయుచున్నాఁడు. రథంతరమ్=రథంతర సామము, పరిమితం వావ=పరిమిత శ్రేయోరూప మైనదియే. బృహత్=బృహత్సామము, అపరిమితమ్=అపరిమిత శ్రేయోరూప మైనది. (అసౌ=ఈ పూర్వోక్త యజ మానుఁడు), ఏనమ్=ఈ ప్రతిస్పర్ధిని, పరిమితాచ్చ=పరిమిత శ్రేయస్సునుండియు, అపరిమితాచ్చ=అపరి మిత శ్రేయస్సు నుండియు, అన్తరేత్యేవ=నిశ్చయముగ ప్రచ్యుతునిఁ జేయుచున్నాఁడు.

తాత్పర్యము: బృహద్రథంతర సామములు భూలోకాది ప్రాప్తి హేతువు లగుటచే తత్తద్రూపముగ వర్ణింపఁబడినవి. ప్రతి స్పర్ధి యగు యజమానునియందలి మాత్సర్యముతో సోమయాగము చేయుచున్న ఈ యజమానుఁడు నైమిత్తికమైన తన సోమయాగమునందు బృహద్రథంతర సామములను సముచ్చయముగ గానము చేయ వలెనని నాల్గవ మంత్రమునందుఁ జెప్పఁబడినది. అట్లు చేసిన ఈ యజమానుఁడు తన ప్రతిస్పర్ధిని భూలోక ద్యులోకములనుండియు, వర్తమానదినము రేపటిదినముల నుండియు భూతభవిష్యత్కాల శ్రేయస్సుల నుండియు, పరిమితాపరిమిత శ్రేయస్సులనుండియు జారిపోవునట్లు చేయును. ఇచట సముచ్చిత బృహద్ర థంతర సామములు బహుధా ప్రశంసింపఁబడినవి.

6. అర్థము: విశ్వామిత్ర జమదగ్నీ=విశ్వామిత్ర జమదగ్ని మహర్షులు, వసిష్ఠేన=వసిష్ఠ మహర్షితో, అస్పర్ధేతామ్=స్పర్ధ వహించిరి. సః జమదగ్నిః=ఆ జమదగ్ని మహర్షి, ఏతత్ విహవ్యమ్="మమాగ్నే విహవేషు" ఇత్యాది 'విహవ' పద ఘటితమైన సూక్తమును, అపశ్యత్=కనుఁగొనెను. తేన=ఆ సూక్తముచేత, స వై=ఆ జమ దగ్నియే, వసిష్ఠస్య=వసిష్ఠ మహర్షియొక్క, ఇన్ద్రియం వీర్యమ్=ఇంద్రియ సామర్థ్యమును, అవృఙ్క్త=నశింపఁజేసెను. యజమానః=యజమానుఁడు, విహవ్యమ్='మమాగ్నే' ఇత్యాది విహవ పద ఘటిత సూక్త మును, శస్యతే యత్=ప్రయోగించినచో, (తదా=అప్పుడు), భ్రాతృవ్యస్య=ప్రతిస్పర్ధియొక్క, ఇన్ద్రియం తత్ వీర్యమేవ=ఆ ఇంద్రియ సామర్థ్యమునే, వృఙ్క్తే=నశింపఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: "ఆ నో భద్రా" ఇత్యాది సూక్తము నిత్యప్రయోగమునం దుపయోగింపఁ బడుచుండును. మాత్సర్య గ్రస్తుఁడు చేయు యాగమునందు "మమాగ్నే వర్చో విహవేష్వస్తు" ఇత్యాది సూక్తమును ప్రయోగించ వలెను. విశ్వామిత్ర జమదగ్నులు పూర్వము వసిష్ఠ మహర్షి విషయమున స్పర్ధ వహించిరి. అప్పుడు జమ దగ్ని ''మమాగ్నే విహవేష్వస్తు" ఇత్యాది సూక్తమును కనుఁగొని దానిచే నతఁడు వసిష్ఠుని యింద్రియ సామర్థ్యమును నశింపఁజేసెను. మాత్సర్యగ్రస్తుఁ డయిన యజమానుఁడు పై విహవ్య సూక్తమును తన యాగమునందు ప్రయోగించినచో అప్పుడు తన ప్రతిస్పర్ధియొక్క ఇంద్రియ సామర్థ్యమును నిశ్చయముగ నశింపఁజేయును. ఇది హోతృ కర్తవ్యము.

అథ తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే ఒష్టఒమోనువాకః ।

మూలము: [1]నిగ్రాభ్యాః స్థ దేవశ్రుత ఆయుర్మే తర్పయత ప్రాణం మే తర్పయతాపానం మే తర్పయత వ్యానం మే తర్పయత చక్షుర్మే తర్పయత శ్రోత్రం మే తర్పయత మనో మే తర్పయత వాచం మే తర్పయతా ఒఒత్మానం మే తర్పయతాఙ్గాని మే తర్పయత ప్రజాం మే తర్పయత పశూన్మే తర్పయత గృహాన్మే తర్పయత గణాన్మే తర్పయత సర్వగణం మా తర్పయత తర్పయత మా (౧)గణా మే మా వి తృషన్ [2]ఓషధయో వై సోమస్య విశో విశః ఖలు వై రాజ్ఞః ప్రదాతో రీశ్వరా ఐన్ద్రః సోమో ఒవీవృధం వో మనసా సుజాతా ఋతప్రజాతా భగ ఇద్వః స్యామ। ఇన్ద్రేణ దేవీ ర్వీరుధః సంవిదానా అను మన్యన్తాగ్ం సవనాయ సోమ మిత్యా హౌషధీభ్య ఏవైనగ్ం స్వాయై విశః స్వాయై దేవతాయై నిర్యాచ్యాభి షుణోతి [3]యో వై సోమస్యాభిషూయమాణస్య (౨)ప్రథమో ఒగంశుః స్కన్దతి స ఈశ్వర ఇన్ద్రియం వీర్యం ప్రజాం పశూ న్యజమానస్య నిర్హన్తో స్తమభి మన్త్రయేతా ఒఒమాఒస్కాన్త్సహ ప్రజయా సహ రాయస్పోషేణేన్ద్రియం మే వీర్యం మా నిర్వధీ రిత్యాశిష మేవైతామా శాస్త ఇన్ద్రియస్య వీర్యస్య ప్రజాయై పశూనా మనిర్ఘాతాయ [4]ద్రప్సశ్చస్కన్ద పృథివీ మను ద్యామిమం చ యోని మను యశ్చ పూర్వః। తృతీయం యోని మను సంచరన్తం ద్రప్సం జుహోమ్యను సప్త హోత్రాః ॥ ౩ ॥ (తర్పయత మాభిషూయమాణస్య యశ్చ దశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమప్రపాఠకే ఒష్టమోఒనువాకః।

7. అర్థము: యస్య=ఏ యజమానునకు, యజ్ఞక్రతవః=యజ్ఞక్రతువులు, భూయాంసః=అనేకములో, సః=ఆ యజమానుఁడు, దేవతాః=(ప్రతిస్పర్ధియొక్క) దేవతలను, వృఙ్క్తే ఇతి=నశింపఁజేయుచున్నాడు కావున, ప్రతిస్పర్ధినః=ప్రతిస్పర్ధియొక్క, అగ్నిష్టోమః=ద్వాదశ స్తోత్ర ప్రయుక్తమగు అగ్నిష్టోమము, సోమః పరస్తాత్=ఈ యజమానుని సోమయాగమునకు పిమ్మట, స్యాద్యది=ప్రయుక్త మగుచో, (అసౌ=ఈ యజమానుఁడు), ఉక్థ్యమ్=పఞ్చదశ స్తోత్ర ప్రయుక్తమైన "ఉక్థ్యము" అను యాగమును, కుర్వీత=చేయవలెను. (ప్రతిస్పర్ధినః=ప్రతిస్పర్ధియొక్క, ఉక్థ్యః=ఉక్థ్య యాగము, స్యాద్యది=ప్రవృత్త మగునెడల, (అసౌ=ఈ యజమానుఁడు), అతిరాత్రమ్=ఏకోనత్రింశత్స్తోత్ర ప్రయుక్తమైన అతిరాత్ర యాగమును, కుర్వీత=చేయవలెను. (ఏవం సతి=ఇట్లు అగుచుండఁగా) అస్య=ఇతనియొక్క, యజ్ఞక్రతుభిః ఏవ=అనేకములైన స్వీయ యజ్ఞక్రతువులచేతనే, (అయమ్=ఈ యజమానుఁడు), దేవతాః=ప్రతిస్పర్ధియొక్క దేవతలను, వృఙ్క్తే=నశింపఁజేయుచున్నాఁడు. (స్వయమ్=స్వయముగా,) వసీయాన్=ధనవంతుఁడు, భవతి=అగుచున్నాఁడు. ఇతి=అని, ఆహుః=చెప్పుచున్నారు.

తాత్పర్యము: దేవత నుద్దేశించి హవిస్సును త్యాగము చేయుట మాత్రము యజ్ఞ మనఁబడును. అంగోపాంగ సహితమై సంపూర్ణమైనది క్రతు వనఁబడును. హవిస్త్యాగ సామాన్య ముండును కావున క్రతువు యజ్ఞము కూడ నగును. అంగోపాంగ విశేషము కూడ నుండుటచే క్రతువనియు వ్యవహరింపఁబడును. చూతవృక్షాది శబ్దములవలెనే యజ్ఞక్రతు శబ్ద ప్రయోగము చేయఁబడినది. పరస్పరము స్పర్ధతోఁ గూడియున్న యిద్దఱు యజ్ఞకర్తలలో నెవని యజ్ఞక్రతువు అంగోపాంగములచే గొప్పదిగా నుండునో, ఆ యజమానుఁడు తన ప్రత్యర్థియొక్క దేవతలను నశింపఁజేయును. ఇతని సోమయాగము సమాప్త మగుచుండఁగా ప్రత్యర్థి ద్వాదశ స్తోత్ర ప్రయుక్తమైన అగ్నిష్టోమ యాగము నాచరించినచో నప్పు డితఁడు పంచదశ స్తోత్ర ప్రయుక్తమైన ఉక్థ్య నామక యాగము ననుష్ఠించవలెను. ఇతని ఉక్థ్యము సమాప్త మగుచుండఁగా ప్రత్యర్థి ఉక్థ్యము ననుష్ఠించినచో నితఁడు ఏకోనత్రింశత్స్తోత్ర ప్రయుక్తమైన అతిరాత్ర యాగము నాచరించవలెను. ఇట్లు చేయఁగా నితఁడు అధిక సంఖ్యాకము లయిన స్వకీయ యజ్ఞక్రతువులచేత ప్రతిస్పర్ధియొక్క దేవతలను నశింపఁజేసి స్వయముగ తాను ధనవంతుఁ డగునని మంత్రవిదులు చెప్పుచున్నారు. (ఏకోనత్రింశత్=ఇరువదితొమ్మిది.)

సప్తమానువాకము సమాప్తము.

## వేదార్థదీపిక

**అవతారిక:** సప్తమానువాకమునందు స్పర్ధతోఁ గూడిన యజమాన సంబంధము లయిన విశేష విధులు చెప్పఁబడినవి. ఈ యష్ట మానువాకమునందు ఉపాంశు గ్రహార్థమైన అభిషవమునకు సంబంధించిన మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము:** (హే ఆపః=ఓ ఉదకములారా!, యూయమ్=మీరు,) నిగ్రాభ్యాః=నిగ్రాభ్యములు, దేవశ్రుతః=దేవశ్రుతులు, స్థ=కండు. (తాః యూయమ్=ఆ మీరు), మే=నాయొక్క, ఆయుః=ఆయువును, తర్పయత=తృప్తిపఱచుఁడు. మే=నాయొక్క, ప్రాణమ్=ప్రాణమును, తర్పయత=తృప్తిపఱచుఁడు. మే=నాయొక్క, అపానమ్=అపానమును, తర్పయత=తృప్తిపఱచుఁడు, మే వ్యానమ్=నా వ్యాన వాయువును, తర్పయత. మే చక్షుః, తర్పయత. మే, శ్రోత్రమ్, తర్పయత. మే, మనః, తర్పయత. మే, వాచమ్, తర్పయత. మే, ఆత్మానమ్=జీవాత్మను, తర్పయత. మే, అఙ్గాని=హస్త పాదాద్యవయవములను, తర్పయత. మే, ప్రజామ్=సంతానమును, తర్పయత. మే, పశూన్, తర్పయత. మే, గృహాన్, తర్పయత. మే, గణాన్=భృత్య సమూహములను, తర్పయత. సర్వగణమ్=సమస్త పుత్ర భృత్యాది సమూహము గల, మా=నన్ను, తర్పయత=తృప్తిపఱచుఁడు. (కిం బహునా?=వేయేల?), మా=నన్ను తర్పయత=తృప్తిపఱచుఁడు. (త్వదీయేన తర్పణేన=నీవు కలిగించిన తృప్తిచేత), మే=నాయొక్క, గణాః=పుత్ర భృత్యాది గణములు, మా వితృషన్=తృషాది రహితు లగుదురుగాక. (నిగ్రాభ్యాః="హవిష్మతీ రిమా ఆపః" అను మంత్రముచేత కడవలోనికి ఎక్కువగా గ్రహింపఁదగిన యుదకములు. నితరాం గ్రహీతవ్యాః ఇతి నిగ్రాభ్యాః, అని వ్యుత్పత్తి. దేవైః శ్రూయన్తే ఇతి దేవశ్రుతః=దేవతలచే వినఁబడునట్టివి. ఉత్తరపు వైపున నున్న హోతృచమస పాత్రమును వసతీ వరీ నామధేయకము లయిన ఉదకములచే, నిండించుటకై నిగ్రాభ్యములైన ఉదకములను తీసికొని వచ్చుచుండఁగా "నిగ్రాభ్యాః స్థ దేవశ్రుతః" ఇత్యాది మంత్రమును యజమానునిచే పఠింపఁజేయవలెను.)

**తాత్పర్యము:** ఓ యుదకములారా! మీరు నిగ్రాభ్యములు దేవశ్రుతములు కండు. అటువంటి మీరు నాయొక్క ఆయురాదికమును, నన్నుఁ గూడ తృప్తిపఱచుఁడు. మీరు తృప్తిపఱచుటచే నా ఆయురాదికము తృషాది రహిత మగుఁగాక. (తృష=దప్పి, ఇచ్ఛ.)

2. **అర్థము:** ఓషధయః వై=ఓషధులే, సోమస్య=సోమ (రాజు) లతకు, విశః=ప్రజలు. విశః ఖలు వై=ప్రజలే కదా! రాజ్ఞః=రాజు (ను) యొక్క, (కర్మణి షష్ఠీ) ప్రదాతోః=ఇచ్చుటకు, ఈశ్వరాః=సమర్థులు. సోమః=సోమము, ఐన్ద్రః=ఇంద్ర దేవతాకము. "సుజాతాః=సర్వజనోపకారు లగుటచే శోభన జన్మ కలవారును, ఋతప్రజాతాః=యజ్ఞములకొఱకు ప్రకర్షతో పుట్టిన వారునగు, హే ఓషధయః=ఓ ఓషధులారా! వః=మిమ్ము, మనసా=మనస్సుచే, అవీవృధమ్=వృద్ధి నొందించుచున్నాము. (వర్తమానార్థమున భూతకాలిక ప్రయోగము ఛాన్దసము.) భగే ఇత్=(మీయొక్క) సేవయందే, స్యామ=ఉందుము. వీరుధః=సోమలతా రూపులైన, దేవీః=దేవతలు, ఇన్ద్రేణ=ఇంద్రునితో, సంవిదానాః=ఐకమత్యము నొందినవై, సవనాయ=ప్రాతస్సవన కర్మ కొఱకు, సోమమ్=సోమమును, అనుమన్యన్తామ్=అనుమతింతురు గాక." ఇతి ఆహ=అను మంత్ర పాఠముచేత, ఓషధీభ్యః ఏవ=ఓషధులనుండియే, స్వాయై విశః=స్వీయ ప్రజనుండి, స్వాయై దేవతాయై=ఇంద్రరూప స్వకీయ దేవతనుండియు, సోమమ్=సోమమును, నిర్యాచ్య=విశేషముగ యాచించి, అభిషుణోతి=(యజమానుఁడు సోమలతను) అభిషవము చేయవలెను.

**తాత్పర్యము:** సోమరాజునకు ఓషధులే ప్రజలు. కనుకనే ఆ ఓషధి రూప ప్రజలే సోమరాజును మా కిచ్చుటకు సమర్థులు. సోమము ఇంద్ర దేవతాకము. (అందువలన ఓషధీంద్ర విషయకమైన 'అవీవృధ' మిత్యాది మంత్రముచే సోమము నభిమంత్రించవలెను.) ఓ ఓషధులారా! మిమ్ము మనస్సుచే వృద్ధి నొందించుచున్నాము. మీరు సర్వ జనోపకారు లగుటచే మంచి పుట్టుక కలవారు. విశేషించి యజ్ఞములకొఱకు ప్రకర్షగా పుట్టినవారు. మేము

సర్వదా మిమ్ము సేవించుటయందే యుండెదము. సోమలతా రూప దేవతలు ఇంద్రునితో నైకమత్యము నొందినవారై ప్రాతస్సవన రూప కర్మయందు సోమము ననుమతింతురు గాక, అని ఈ మంత్ర పాఠమున కర్థము. ఈ మంత్ర పాఠముచే సోమము యొక్క ఓషధి రూప ప్రజనుండియు, ఇంద్రరూపమైన సోమము యొక్క స్వీయ దేవతనుండియు సోమమును విశేషముగ యాచించి యజమానుఁడు అభిషవము చేయవలెను. (అధిషవణ ఫలకమునందు సోమము నుంచి "అవీవృధ" మిత్యాది మంత్రముచే నభిమంత్రించవలెను.)

3. అర్థము: అభిషూయమాణస్య=అభిషవము చేయఁబడుచున్న, సోమస్య=సోమలతయొక్క, యో వై ప్రథమః అంశుః=ఏ మొదటి లేశమైతే, స్కన్దతి=(భూమియందు) పడుచున్నదో, సః=ఆ సోమ లేశము, యజమానస్య=యజమానునియొక్క, ఇన్ద్రియం వీర్యమ్=ఇంద్రియ సామర్థ్యమును, ప్రజామ్=సంతానమును, పశూన్=పశువులను, నిర్హన్తోః=(నిర్హన్తుమ్) నశింపఁజేయుటకు, ఈశ్వరః=సమర్థము, (భవతి=అగుచున్నది. తస్మాత్=అందువలన, తత్పరిహారాయ=తద్వినాశ దోష పరిహారమునకై), తమ్=ఆ సోమ లేశమును, అభి మన్త్రయేత="అమూఽస్కాని" త్యాది మంత్రముచే నభిమంత్రించవలెను. ఆమూఽస్కానిత్యాది మంత్రార్థము–హే భూమౌ పతితాంశో!=భూమియందు పడిన సోమ లేశమా!, త్వమ్=నీవు, ప్రజయా=సంతానముతోడను, రాయస్పోషేణ చ సహ=ధన సమృద్ధితోఁ గూడను, మా=నన్నుఁ గూర్చి, ఆస్కాన్=మఱల వచ్చినదాన వగుచున్నావు. (తస్మాత్=అందువలన), మే ఇన్ద్రియం వీర్యమ్=నాయొక్క ఇంద్రియ సామర్థ్యమును, మా నిర్వధీః=నశింపఁజేయకుము, ఇతి=అని, ఏతామ్=ఈ ప్రార్థనను, (యజమానః=యజమానుఁడు,) ఇన్ద్రియస్య వీర్యస్య=ఇంద్రియ సామర్థ్యముయొక్కయు, ప్రజాయై=సంతానముయొక్కయు, (షష్ఠ్యర్థే చతుర్థీ), పశూనామ్=పశువులయొక్కయు, అనిర్ఘాతాయ=అవినాశమునకై, ఆశిషమేవ=ఆశీస్సుగానే ఆశాస్తే=కోరుచున్నాఁడు.

తాత్పర్యము: సోమ లతను ఫలకములపై నుంచి ఱాతితో నలుగఁగొట్టునపుడు క్రిందపడిన సోమలతయొక్క ప్రథమ లేశము యజమానుని యింద్రియ సామర్థ్యమును సంతానాదికమును నశింపఁజేయ సమర్థ మయినది. కావున ఆ నష్టము లేకుండుటకై సోమలతా లేశమును 'అమూఽస్కా' నిత్యాది మంత్రముచే నభిమంత్రించవలెను. "భూమియందు పడిన సోమలతయొక్క ప్రథమ లేశమా! నీవు సంతాన ధన సమృద్ధులతోఁ గూడ మఱల నాయొద్దకు వత్తువు. కావున నా యింద్రియ సామర్థ్యమును, సంతానమును నశింపఁజేయకుము" అని మంత్ర తాత్పర్యము. యజమానుఁడు దీనిని తన యింద్రియ సామర్థ్యాదికము నశింపకుండుటకై ఆశీస్సును గానే కోరుచున్నాఁడు. (ఈ మంత్రముచే భూమిపైఁ బడిన సోమ లతా లేశము నభిమంత్రించవలెను.)

4. అర్థము: ద్రప్సః=సోమరస బిందువు, పృథివీమను=భూమి ననుసరించి (భూమియందు), చస్కన్ద=పడెను. (స ద్రప్సః=ఆ సోమరసబిందువు, హుతస్సన్=హుత మగుచు), ద్యామ్ ఇమం యోనిమ్ అను చ=ఈ అంతరిక్ష రూపమైన స్థానమునందును, యశ్చ పూర్వః 'పృథివీమను' అని ఏ స్థానము పూర్వము చెప్పఁబడినదో, తమను చ=ఆ పృథివీస్థానము నందును), తృతీయం యోనిమను=మూఁడవది యగు ద్యులోకరూపమైన ఆదిత్య స్థానమందును, సంచరన్తమ్=సంచరించుచున్న, ద్రప్సమ్=సోమరస బిందువును, సప్త హోత్రాః అను=(సోమరస బిందువు పడిన దిక్కుకంటె భిన్నమైన) సప్త దిక్కులందు అనుక్రమముగా, జుహోమి=హోమము చేయుచున్నాను.

తాత్పర్యము: భూమియందు సోమరస బిందువు పడెను. ఆ పడిన బిందువు హుతమైన దగుచు పృథివ్యాది మూఁడులోకము లందును సంచరించుచుండును. ఆ బిందువును అది పడిన దిక్కుగాక మిగిలిన ఏడు దిక్కులందు హోమము చేయుచున్నాను. అగ్నియందు వేల్చఁబడిన ఆహుతి హుతమై పృథివ్యంతరిక్ష ద్యులోకములందు సంచరించుచు లోకమున కుపకరించు విధముగా భావన చేయుచున్నానని భావము. "అగ్నౌ ప్రాస్తా ఽఽహుతిః సమ్యగాదిత్య ముప తిష్ఠతే। ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టే రన్నం తతః ప్రజాః" అగ్నియందు వేల్చఁబడిన ఆహుతి బాగుగా నాదిత్యుని పొందుచున్నది. ఆదిత్యునినుండి వర్షము పుట్టుచున్నది. వర్షమునుండి అన్నము, అన్నమునుండి ప్రజలు పుట్టుచున్నారు, అనెడి స్మృత్యర్థము ఈ మంత్రమున వ్యక్త మగుచున్నది. "ద్రప్సశ్చస్కన్ద" అను మంత్రముచే సోమరస బిందువు నభిమంత్రించవలెను.)

అష్టమానువాకము సమాప్తము.

అథ తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే నవమో<sub></sub>ऽనువాకః ।

మూలము: [1]యో వై దేవాన్దేవయశసేనార్పయతి మనుష్యా న్మనుష్యయశసేన దేవయశస్యేవ దేవేషు భవతి మనుష్యయశసీ మనుష్యేషు యా న్ప్రాచీన మాగ్రయణా ద్గ్రహా న్గృహ్ణీయా త్తానుపాగ్ంశు గృహ్ణీయా ద్యానూర్ధ్వాగ్ం స్తానుపబ్దిమతో దేవానేవ తద్దేవయశసేనార్పయతి మనుష్యా న్మనుష్యయశసేన దేవయశస్యేవ దేవేషు భవతి మనుష్యయశసీ మనుష్యే[2]ష్వగ్నిః ప్రాతః సవనే పాత్వస్మా న్వైశ్వానరో మహినా విశ్వశంభూః। స నః పావకో ద్రవిణం దధాతు (౧)ఆయుష్మన్తః సహభక్షాః స్యామ। [3]విశ్వే దేవా మరుత ఇన్ద్రో అస్మానస్మి న్ద్వితీయే సవనే న జహ్యుః। ఆయుష్మన్తః ప్రియమేషాం వదన్తో వయం దేవానాగ్ం సుమతౌ స్యామ। [4]ఇదం తృతీయగ్ం సవనం కవీనా మృతేన యే చమస మైరయన్త। తే సౌధన్వనాః సువరానశానాః స్విష్టిం నో అభి వసీయో నయన్తు। [5]ఆయతనవతీర్వా అన్యా ఆహుతయో హూయన్తే ऽనాయతనా అన్యా యా ఆఘారవతీస్తా ఆయతనవతీర్యాః (౨)సౌమ్యా స్తా అనాయతనా ఐన్ద్రవాయవ మాదాయా ऽఽఘార మాఘారయే దధ్వరో యజ్ఞో ऽయమస్తు దేవా ఓషధీభ్యః పశవే నో జనాయ విశ్వస్మై భూతాయాధ్వరో ऽసి స పిన్వస్వ ఘృతవద్దేవ సోమేతి సౌమ్యా ఏవ తదాహుతీ రాయతనవతీః కరోత్యాయతనవా న్భవతి య ఏవం వేదాథో ద్యావాపృథివీ ఏవ ఘృతేన వ్యనత్తి తే వ్యత్తే ఉపజీవనీయే భవత ఉపజీవనీయో భవతి (౩)య ఏవం వేదై[6]ష తే రుద్రభాగో యం నిరయాచథా స్తం జుషస్వ విదేర్గౌపత్యగ్ం రాయస్పోషగ్ం

సువీర్యగ్ం సంవత్సరీణాగ్ం స్వస్తిమ్। [7]మనుః పుత్రేభ్యో దాయం వ్యభజత్స నాభానేదిష్ఠం
బ్రహ్మచర్యం వసన్తం నిరభజత్స ఆఽగచ్ఛత్సో ఽబ్రవీత్కథా మా నిరభాగితి న త్వా నిర
భాక్షమిత్యబ్రవీ [8]దఙ్గిరస ఇమే సత్రమాసతే తే (౪)సువర్గం లోకం న ప్రజానన్తి తేభ్య
ఇదం బ్రాహ్మణం బ్రూహి తే సువర్గం లోకం యన్తో య ఏషాం పశవ స్తాగ్ంస్తే దాస్యన్తీతి
తదేభ్యోఽబ్రవీత్తే సువర్గం లోకం యన్తో య ఏషాం పశవ ఆసన్తానస్మా అదదు[9]స్తం పశుభి
శ్చరన్తం యజ్ఞవాస్తౌ రుద్ర ఆఽగచ్ఛత్సో ఽబ్రవీన్మమ వా ఇమే పశవ ఇత్యదుర్వై (౫)మహ్య
మిమా నిత్యబ్రవీన్న వై తస్య త ఈశత ఇత్యబ్రవీ ద్యద్యజ్ఞవాస్తౌ హీయతే మమ వై తదితి తస్మా
ద్యజ్ఞవాస్తు నాభ్యవేత్యగ్ం సోఽబ్రవీ ద్యజ్ఞే మా ఽఽభజాథ తే పశూ న్నాభిమగ్ంస్య ఇతి తస్మై
ఏతం మన్థినః సగ్ంస్రావ మజుహో త్తతో వై తస్య రుద్రః పశూ న్నాభ్యమన్యత [10]యత్రైత
మేవం విద్వా న్మన్థినః సగ్ంస్రావం జుహోతి న తత్ర రుద్రః పశూనభి మన్యతే ॥౯॥ (దధా
త్వాయతనవతీర్యా ఉపజీవనీయో భవత ఉపజీవనీయో భవతి తేఽదుర్వై యత్రైత మేకాదశ చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమప్రపాఠకే నవమోఽనువాకః॥

## వేదార్థ దీపిక

**అవతారిక:** అష్టమానువాకమునందు ఉపాంశుగ్రహార్థములైన అభిషవ మంత్రములు విహితము లైనవి. ఈ నవమానువాకమునందు సవనాహుత్యాది మంత్రములు చెప్పఁబడుచున్నవి.

**1. అర్థము:** యో వై=ఏ యజమానుఁడైతే, దేవాన్=దేవతలను, దేవ యశసేన=దేవతల కీర్తితో, అర్పయతి=కలుపుచున్నాఁడో, మనుష్యాన్=మనుష్యులను, మనుష్య యశసేన=మనుష్యుల కీర్తితో, అర్పయతి=కలుపుచున్నాఁడో, (సః=అతఁడు), దేవేషు=దేవతలందు, దేవయశసీ ఏవ=దేవ యశస్సు కలవాఁడుగానే, భవతి=అగుచున్నాఁడు. మనుష్యేషు=మనుష్యులయందు, మనుష్య యశసీ=మనుష్య యశస్సు కలవాఁడు, భవతి=అగుచున్నాఁడు. (తదర్థమ్=ఆ దేవ మనుష్య యశస్సులు సిద్ధించుటకై), ఆగ్రయణాత్=ఆగ్రయణ గ్రహము

కంటె, ప్రాచీనమ్=పూర్వము, యాన్ గ్రహాన్=ఏ ఉపాంశ్వంతర్యామైంద్ర వాయవాది గ్రహములను, గృహ్ణీయాత్=గ్రహించవలెనో, తాన్=ఆ గ్రహములను, ఉపాంశు=ఉపాంశువుగా, గృహ్ణీయాత్=గ్రహించ వలెను. యాన్=ఏ, ఊర్ధ్వాన్=ఆగ్రయణ గ్రహముకంటె ఊర్ధ్వభావులగు ఉక్థ్యాది గ్రహములను, గృహ్ణీయాత్=గ్రహించవలెనో, తాన్=ఆ ఉక్థ్యాది గ్రహములను, ఉపబ్దిమతః=ఉపబ్ది కలవానినిగ, గృహ్ణీయాత్=గ్రహించవలెను. (తదా=అప్పుడు, సః=ఆ యజమానుఁడు), దేవాన్=దేవతలను, దేవ యశసేన=దేవతల కీర్తితోను, మనుష్యాన్=మనుష్యులను, మనుష్య యశసేన=మనుష్య కీర్తితోను, అర్పయత్యేవ=నిశ్చయముగ కలుపుచున్నవాఁ డగుచున్నాఁడు. (అపి చ=మఱియు, సః=అతఁడు), దేవేషు=దేవతలందు, దేవ యశసీ=దేవకీర్తి కలవాఁడును, మనుష్యేషు=మనుష్యులయందు, మనుష్య యశసీ=మనుష్య కీర్తి కలవాఁడును, భవత్యేవ=నిశ్చయముగ నగుచున్నాఁడు. (ఉపాంశు=ప్రక్కనున్నవారికిఁ గూడ వినిపించకుండ మంత్రముల నుచ్చరించుట. ఉపబ్ది=ప్రక్కనున్నవారికి కొంచెము వినిపించునట్లు మంత్రముల నుచ్చరించుట. "యశసేన' ఇది వైదిక ప్రయోగము. 'యశసా' ఇది లౌకిక సంస్కృత ప్రయోగము.)

తాత్పర్యము: దేవతల కీర్తితో దేవతలను, మనుష్యుల కీర్తితో మనుష్యులను గలుపునట్టి యజమానుఁడు స్వర్గలోకమునందు దేవతల మధ్యమందు దేవకీర్తి కలవాఁడుగాను, భూలోకమునందు మనుష్యుల మధ్యమందు మనుష్య కీర్తి కలవాఁడుగాను ఉండును. తదుభయ సిద్ధికై యజమానుఁడు ఆగ్రయణ గ్రహ గ్రహణమునకు పూర్వము ఉపాంశ్వంతర్యామైంద్ర వాయవాది గ్రహములను ఉపాంశువుగాను, ఆగ్రయణ గ్రహ గ్రహణమునకు ఉత్తర భావులైన ఉక్థ్యాది గ్రహములను ఉపబ్దిగను గ్రహించవలెను. ఇట్లు చేసిన యజమానుఁడు దేవతల కీర్తితో దేవతలను, మనుష్యకీర్తితో మనుష్యులను కలిపినవాఁ డగును. కావున అతఁడు నిశ్చయముగ స్వర్గమునందు దేవతల మధ్యమున దేవకీర్తి కలవాఁడుగను, భూలోకమునందు మనుష్యుల మధ్యమున మనుష్యకీర్తి కలవాఁడుగను ఉండును. (గ్రహములు=పాత్ర విశేషములు. ఇచట ఆ యా గ్రహములను గ్రహించునపుడు మంత్రములను ఉచ్చ ధ్వనితోను, నీచ ధ్వనితోను ఉచ్చరించు విధానము చెప్పఁబడినది. గ్రహము=పాత్రము.)

2. అర్థము: వైశ్వానరః=సర్వ మానవులకు స్వామిగా నుండువాఁడును, మహినా=స్వకీయ మహిమచేత, విశ్వశంభూః=విశ్వమునకు సుఖ ప్రాపకుఁడునగు, అగ్నిః=(ఈ) అగ్ని, ప్రాతఃసవనే=(మే మనుష్ఠించిన) ప్రాతఃసవన కర్మయందు, అస్మాన్=మమ్ము, పాతు=రక్షించుఁగాక. పావకః=శోధనము చేయునట్టి, సః=ఆ యగ్ని, నః=మాకొఱకు, ద్రవిణమ్=ధనమును, దధాతు=ఒసఁగుఁ గాక. (కిం చ=మఱియు, వయమపి=మేము కూడ), ఆయుష్మన్తః=దీర్ఘాయువు కలవారమై, సహభక్షాః=భుజించువారందఱితోఁ గూడినవారము, స్యామ=అగుదుము.

తాత్పర్యము: ఈ యగ్ని మే మనుష్ఠించునట్టి ప్రాతఃసవన కర్మయందు మమ్ము రక్షించుఁగాక. ఈ యగ్ని సర్వ మానవులకు స్వామిగా సంబంధము కలవాఁడు. తన మహిమచేత విశ్వమునకు సుఖము కలుగఁజేయువాఁడు. పాప క్షయము చేసి మమ్ము శోధించునట్టి ఆ యగ్ని మాకు ధనము నొసఁగుఁగాక. మేము కూడ భుజించువారందఱితోడను కూడినవార మగుదుము గాక. (ఈ మంత్రము చెప్పుచు ప్రాతస్సవన సమాప్తి కాలమునందు హోమము చేయవలెను.)

3. అర్థము: మరుతః=మరుద్గణములు, ఇన్ద్రః=ఇంద్రుఁడు, విశ్వే దేవాః=సర్వ దేవతలు, అస్మిన్ ద్వితీయ సవనే=ఈ రెండవదియగు మాధ్యందిన సవన కర్మయందు, అస్మాన్=మమ్ము, న జహ్యుః=విడువకుందురు గాక. వయమ్=మేము, ఆయుష్మన్తః=దీర్ఘాయువు కలవారము, దేవానామ్=దేవతలకు, ప్రియం వదన్తః=ఇష్టమైన స్తోత్రాదికమును పలుకుచున్నవారమునై, సుమతౌ=(ఆ దేవతల) అనుగ్రహ బుద్ధియందు, స్యామ=ఉందుము.

తాత్పర్యము: మరుత్తులు, ఇంద్రుఁడు సర్వ దేవతలు ద్వితీయమైన ఈ మాధ్యందిన సవన కర్మయందు మమ్ము విడువకుందురు గాక. మేము కూడ దీర్ఘాయువు కలవారము, దేవతల కిష్టమైన స్తోత్రాదికమును పలుకుచున్న

వారమునై అ దేవతల యనుగ్రహ బుద్ధియం దుండుము గాక. దేవతలు మమ్మనుగ్రహింతురు గాక యని భావము. (ఈ మంత్రము చెప్పుచు మాధ్యందిన సవన సమాప్తియందు హోమము చేయవలెను.)

4. అర్థము: యే=ఏ దేవతలు, చమసమ్=చమస గణమును, ఋతేన=ఋతముచేత, (మనసా యథార్థవస్తు చిన్తనమ్ ఋతమ్=మనస్సుచే యథార్థవస్తు చింతనము చేయుట.) ఐరయన్త=ప్రేరణ చేసిరో, తే=ఆ దేవతలు, సౌధన్వనాః=ఇంద్ర సంబంధులు (ఋభు నామకులు). సువరానశానాః=స్వర్గము నొందినవారు. (తాదృశాః=అటువంటి దేవతలు) కవీనామ్=పండితులగు ఋత్విజుల సంబంధియగు, ఇదమ్=ఈ, తృతీయం సవనమ్=తృతీయ సవన కర్మను, వసీయః=ధనము కలదిగా, (కృత్వా=చేసి), స్విష్టిమభి=మంచియాగమున కభిముఖముగ, నయన్తు=పొందించుదురు గాక.

తాత్పర్యము: చమస గణమును ప్రేరేపించిన దేవతలు ఇంద్ర సంబంధులు, ఋభునామకులు, స్వర్గమునొందినవారును. అట్టి దేవతలు పండితులైన ఋత్విజుల సంబంధియగు ఈ తృతీయ సవన కర్మను ధనము కలదిగాఁ జేసి మంచి యాగముతో సమానముగఁ జేయుదురు గాక. (ఈ మంత్రము చెప్పుచు తృతీయ సవన సమాప్తి యందు హోమము చేయవలెను. ఋత మన్నఁగా యజ్ఞ మనియు అర్థము చెప్పవచ్చును.)

5. అర్థము: అన్యా ఆహుతయః=ఇతరములైన (కొన్ని) ఆహుతులు, ఆయతనవతీః వా=హోమ స్థానము కలవియే యై, హూయన్తే=హోమము చేయఁబడుచున్నవి. అన్యాః=(మఱికొన్ని) ఇతరములైన ఆహుతులు, అనాయతనాః=హోమ స్థానము లేనివియై, హూయన్తే=హోమము చేయఁబడుచున్నవి. యాః=ఏ ఆహుతులు, ఆఘారవతీః=ఆఘారము కలవియో, తాః=అవి, ఆయతనవతీః=హోమ స్థానము కలవి. యాః=ఏ ఆహుతులు, సౌమ్యాః=ఆఘారము లేనివో, తాః=అవి, అనాయతనాః=హోమ స్థానము లేనివి. ఐన్ద్రవాయవమ్=ఇంద్ర వాయు దేవతాక గ్రహ సంబంధి హవిస్సును, ఆఘారమ్=ఆఘారముగ, (అధ్వర ఇత్యాది మంత్రేణ=అధ్వర ఇత్యాది మంత్రముచేత, జుహుయాత్=హోమము చేయవలెను). హే దేవాః=ఓ దేవతలారా!, అయం యజ్ఞః=ఈ (మా) యజ్ఞము, ఓషధీభ్యః=ఓషధులకొఱకు, పశవే=పశుజాతికొఱకు, నః=మా యొక్క, జనాయ=జనముకొఱకు, విశ్వస్మై భూతాయ=సర్వ ప్రాణికొఱకు, అధ్వరః=హింసక రహితము, అస్తు=అగుఁగాక. హే సోమదేవ! దేవతా రూపమైన ఓ సోమమా! (త్వమ్=నీవు), అధ్వరః=హింసా రహితము, అసి=అగుచున్నావు. సః=ఆ నీవు, ఘృతవత్=నేయివలె, పిన్వస్వ=తడుపుము. ఇతి=అని, (మంత్రార్థము.) తత్=అందుచే, (యజమానః=యజమానుఁడు), సౌమ్యాః ఏవ=ఆయతనము లేనివేయైన, ఆహుతీః (అపి)=ఐన్ద్రవాయవాది గ్రహ సంబంధములైన ఆ ఆహుతులను గూడ, ఆయతనవతీః=హోమస్థానము కలవానినిఁగా, కరోతి=చేయుచున్నాఁడు. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ పూర్వోక్త విధముగ, వేద=తెలిసికొను చున్నాఁడో, (సోఽపి=అతఁడు కూడ,) ఆయతనవాన్=స్థానము కలవాఁడు, భవతి=అగుచున్నాఁడు. అథో=మఱియు, ద్యావాపృథివీ ఏవ=ద్యావాభూములను గూడ, ఘృతేన=నేతితో, వ్యునత్తి=వివిధముగ తడుపు చున్నాఁడు. ('వి' ఇత్యుపసర్గ పూర్వక "ఉన్దీ=క్లేదనే" ఇతి ధాతోః లటి ప్రయోగః. క్లేదనమ్=ఆర్ద్రీ భావః.) వ్యుత్తే తే=తడిసిన ఆ ద్యావాభూములు, ఉపజీవనీయే=(సర్వ ప్రాణులకు) జీవనాధారములు, భవతః=అగుచున్నవి. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సోఽపి=అతఁడు కూడ), ఉపజీవనీయః=(సర్వులకు) జీవనాధారుఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: హోమము చేయఁబడు ఆహుతులు, ఆయతనయుక్తములు, ఆయతన రహితములు అని రెండు విధములు. ఆఘారముచే వ్యవస్థాపిత హోమస్థానము హోతవ్యములైన పురోడాశాద్యాహుతులకు ఆయతన మగుచున్నది. పురోడాశాదులు ఆఘార ప్రకరణమునందు విహితము లయినవి. అంశూపాంశ్వంతర్యామ గ్రహములు ఆఘార రహితము లగుటచే అనాయతనము లగును. ఆ విధముగనే ఐన్ద్ర వాయవ గ్రహాద్యాహుతులకుఁ గూడ అనాయతనత్వము ప్రాప్త మగుచున్నది. తత్పరిహారమునకై ఐన్ద్ర వాయవ గ్రహాద్యాహుతులను హోమము చేయుటకు ముందు హవిస్సు గల తద్గ్రహమును ఎడమ చేతియం దుంచుకొని కుడిచేతితో "అధ్వరో యజ్ఞః" ఇత్యాది మంత్రము చెప్పుచు ఆఘారముగ హోమము చేయవలెను. "దక్షిణ పరిధి సంధిని

సడలించి యచటనుండి తూర్పుగాను, ఉత్తరముగాను సోమరసమును పడవేయుట అహార మనఁబడును. ఓ దేవతలారా! ఈ మా యజ్ఞము ఓషధులు పశువులు మా ప్రజలు అయిన సర్వ ప్రాణులకొఱకును హింసక రహిత మగుఁగాక. ఓ సోమదేవా! నీవు హింసా రహితుడ వగుచున్నావు. కావున నేయివలె తడుపుము, అని ఆ మంత్రమున కర్థము. అందుచేత యజమానుఁడు అనాయతనములేయైన ఐద్రి వాయవ గ్రహద్యాహుతు లను గూడ ఆయతనము గలవిగాఁ జేయుచున్నాఁడు. ఈ విధముగ తెలిసికొనిన యజమానుఁడు ఆయతన వంతుఁడగు చున్నాఁడు. మఱియు 'ఘృతవత్ పిన్వస్వ' అని చెప్పుటచే ద్యావాభూములను ఘృతముతో తడుపు చున్నాఁడు. ఆర్ద్రములైన ఆ ద్యావాభూములు సర్వప్రాణులకు జీవనాధారము లగుచున్నవి. ఈ విధముగ తెలిసికొనిన యతడు కూడ సర్వులకు ఉపజీవనీయుఁ డగును. హోమసాధన మయిన కాష్ఠ పాత్ర ముతో "అధ్వరో యజ్ఞోఽయమస్తు దేవాః" ఇత్యాది మంత్రము నుచ్చరించుచు హోమము చేయవలెను. (పరిప్లవా=హోమసాధనమైన కాష్ఠపాత్రము.)

6. అర్థము: హే రుద్ర!=ఓ క్రూరదేవా!, ఏషః=ఈ సంస్రావము (హవిర్విశేషము), తే=నీ యొక్క, భాగః=భాగము యమ్=ఏ భాగమును, నిరయాచథాః=(నీకే యుండవలెనని దేవతలనుండి) నిష్కర్ష చేసి యాచించితివో, తమ్=ఆ భాగమును, జుషస్వ=సేవించుము. (త్వం తు=నీవైతే), గౌపత్యమ్=గోపాలనమును, రాయ స్పోషమ్=ధనసమృద్ధిని, సువీర్యమ్=శోభన పుత్రుని, సంవత్సరీణామ్=సంవత్సర కాలమున నిష్పాద్యము లగు ఓషధులయొక్క, స్వస్తిమ్=స్వస్తిని (అవినాశమును), విదేః=తెలిసికొనుచున్నావు. ("విదేః"= "విదజ్ఞానే" ఇతి ధాతోః వర్తమానార్థే లఙ్ త ప్రయోగః ఛాన్దసః. 'వేత్సి' అని యర్థము.)

తాత్పర్యము: ఓ క్రూరదేవా! ఈ సంస్రావ హవిస్సు నీ భాగము. నీకే యుండవలయునని దేవతలనుండి నిష్కర్షగా యాచించిన ఈ భాగమును నీ వనుభవించుము. నీవైతే గోపాలనమును, ధన సమృద్ధిని, శోభనపుత్రుని సంవత్సరకాల నిష్పాద్యములైన యోషధులకు వినాశము లేకుండుటను తెలిసికొనుచున్నావు. (కావున సర్వ మును మా కొఱకు సంపాదించుము. ప్రతిప్రస్థాత ఉత్తరార్ధమునుండి అంగారమును పరిధి బహిర్భాగము నకు తెచ్చి అచట మన్థి గ్రహమునుండి సంస్రావమును "ఏష తే రుద్ర" ఇత్యాది మంత్రముచే హోమము చేయవలెను).

7. అర్థము: మనుః=మనువు, పుత్రేభ్యః=పుత్రులకొఱకు, దాయమ్=పంచఁదగిన స్వీయ ధనమును, వ్యభజత్=విభాగము చేసి యిచ్చెను. బ్రహ్మచర్యం వసన్తమ్=వేదాధ్యయనము చేయుచున్న, నాభానేదిష్ఠమ్=నాభానేదిష్ఠ నామక పుత్రుని, నిరభజత్=భాగ రహితునిఁజేసెను. సః=ఆ బాలుఁడు, ఆగచ్ఛత్=(తండ్రి యొద్దకు) వచ్చెను. సః=ఆ కుమారుఁడు, కథా=ఎందుకు, మా=నన్ను, నిరభాక్ ఇతి=భాగరహితునిగాఁ జేసితివని, అబ్రవీత్= అడిగెను. (పితా=తండ్రి), త్వా=నిన్ను, న నిరభాక్షమ్=భాగ రహితునిఁజేయలేదు, ఇతి=అని, అబ్రవీత్= పలికెను.

తాత్పర్యము: (మనువున కనేక పుత్రు లుండిరి. వారిలో కనిష్ఠకుమారుఁడు నాభానేదిష్ఠనామకుఁడు వేదాధ్యయనము చేయు చుండెను. అప్పుడు) మనువు తన పెద్దకుమారుల కందఱకు పంచి ఈయఁదగిన తన సంపదను విభజించి యిచ్చెను. కాని వేదాధ్యయనము చేయుచున్న నాభానేదిష్ఠ నామక పుత్రునకు మాత్రము భాగ మీయలేదు. ఆ నాభానేదిష్ఠుఁడు తండ్రియొద్దకు వచ్చి (తనకు భాగ మెందు కీయలేదు?) నన్ను భాగ రహితు నెందుకుఁ జేసితివని యడిగెను. నిన్ను భాగరహితుని చేయలేదని తండ్రి కుమారునితో ననెను. (సంస్రావ హోమ మును విధించుటకు ముందు పీఠికగా నీ విషయ మిచట వర్ణించఁబడినది.)

8. అర్థము: అఙ్గిరసః ఇమే=అఙ్గిరోనామకులగు ఈ మహర్షులు, సత్రమ్=సత్ర మను యాగ విశేషమును, ఆసతే=అను ష్ఠించుచున్నారు. తే=వారు, సువర్గం లోకమ్=స్వర్గ లోకమును, న ప్రజానన్తి=బాగుగఁ దెలిసికొనుట లేదు. తేభ్యః=వారికొఱకు, (త్వమ్=నీవు), ఇదం బ్రాహ్మణమ్=నీ వధ్యయనము చేసిన శస్త్రాది ప్రతిపాదక బ్రాహ్మణ మును, బ్రూహి=చెప్పుము. తే=వారు, సువర్గం లోకమ్=(యాగసమాప్తి చేసి) స్వర్గలోకమును గూర్చి,

యన్తః=వెళ్లుచున్నవారై, ఏషామ్=వీరికి, యే పశవః (సన్తి)=ఏ పశువులు కలవో, తాన్=ఆ పశువులను తే=నీ కొఱకు, దాస్యన్తీతి=ఈయఁగలరని, (మనుః=మనువు, పుత్రాయ=కుమారునితో, అబ్రవీత్=పలికెను.) తత్=ఆ బ్రాహ్మణమును, (సః=ఆ బాలుఁడు), ఏభ్యః=ఈ అంగిరో నామక మహర్షులకొఱకు, అబ్రవీత్=చెప్పెను. తే=ఆ మహర్షులు, సువర్గం లోకం యన్తః=స్వర్గ లోకమునుగూర్చి వెళ్లుచున్నవారై, ఏషామ్=వీరికి, యే పశవః=ఏ పశువులు, ఆసన్=ఉండెనో, తాన్=ఆ పశువులను, అస్మై=ఈ నాభానేదిష్ఠ కుమారునికొఱకు, అదదుః=ఇచ్చిరి.

**తాత్పర్యము:** అఙ్గిరో నామక మహర్షులు సత్ర మనెడి యాగమును జేయుచున్నారు. వారు స్వర్గ ప్రాప్తి సాధనములైన నాభానేదిష్ఠ నామక శస్త్రములను దెలియనివా రగుటచే స్వర్గమును తెలిసికొనలేకున్నారు. కావున నీ వధ్యయనము చేసిన శస్త్రాది ప్రతిపాదక బ్రాహ్మణమును వారికిఁ జెప్పుము. వారు స్వర్గప్రాప్తి సాధన శస్త్రాది ప్రతిపాదక బ్రాహ్మణముచే యాగమును సమాప్తి చేసి స్వర్గమునకు పోవుచు తమకున్న పశువులను నీ కిత్తురని మనువు కుమారునకు చెప్పెను. ఆ బాలుఁడు తా నధ్యయనము చేసిన బ్రాహ్మణమును వారికి చెప్పెను. వారు యాగ సమాప్తి చేసి స్వర్గమునకు పోవుచు తమ పశువుల నీ బాలున కొసఁగిరి. (నాభానేదిష్ఠుఁడు తండ్రి చెప్పిన యుపాయముతో భాగము సంపాదించెనను విషయము ఇచట చెప్పఁబడినది.)

**౯. అర్థము:** యజ్ఞవాస్తౌ=యజ్ఞ భూమియందు, పశుభిః=(యజ్ఞశేష) పశువులతో, చరన్తమ్=తిరుగుచున్న, తమ్=ఆ నాభానేదిష్ఠ బాలకుని గూర్చి, రుద్రః=రుద్ర నామక క్రూర దేవుఁడు, ఆగచ్ఛత్=వచ్చెను. ఇమే పశవః=ఈ పశువులు, మమ వా=నావియే, ఇతి=అని, సః=ఆ రుద్రుఁడు, అబ్రవీత్=పలికెను. మహ్యం వై=నా కొఱకే, ఇమాన్=ఈ పశువులను, (తే=వారు), అదుః=ఇచ్చిరి. ఇతి=అని, (సః=ఆ బాలకుఁడు,) అబ్రవీత్=పలికెను. తస్య=ఆ యజ్ఞశేష ద్రవ్యమునకు (పశువులకు), తే=ఆ మహర్షులు, న వై ఈశతే=స్వాములే యగుట లేదు. ఇతి=అని, అబ్రవీత్=(రుద్ర దేవుఁడు) పలికెను. యజ్ఞవాస్తౌ=యజ్ఞభూమియందు, యత్=ఏ ద్రవ్యము, హీయతే=(యజ్ఞ సమాప్త్యనంతరము) మిగులునో, తత్=అది, మమ వై=నా యొక్క ధనమే, ఇతి=అని, (రుద్రః అబ్రవీత్=రుద్రుఁడు పలికెను.) తస్మాత్=అందువలన, (మదనుజ్ఞాం వినా=నా యనుజ్ఞ లేకుండ), యజ్ఞవాస్తు=యజ్ఞభూమి, న అభ్యవేత్యమ్=ప్రవేశింపఁ దగినది కాదు. యజ్ఞే=యజ్ఞమునందు, మా=నన్ను, ఆ భజ=బాగుగ సేవించుము (భాగము కలవానినిగాఁ జేయుము). అథ=అప్పుడు, తే=నీ యొక్క, పశూన్=పశువులను, నాభిమంస్యే=హింసించను, ఇతి=అని, సః=ఆ రుద్రుఁడు, అబ్రవీత్=పలికెను. సః=ఆ నాభానేదిష్ఠుఁడు, తస్మై=ఆ రుద్రునికొఱకు, మన్థినః=మన్థిగ్రహమునుండి, సంస్రావమ్=సంస్రావ హవిస్సును, అజుహోత్=హోమము చేసెను. తతః=అందువలన, రుద్రః=రుద్ర దేవుఁడు, తస్య=అతని యొక్క, పశూన్=పశువులను, నాభ్యమన్యత వై=హింసించనే లేదు.

**తాత్పర్యము:** అఙ్గిరో నామక మహర్షు లిచ్చిన యజ్ఞశేష పశువులను స్వగృహమునకుఁ గొనిపోవుటకై యజ్ఞభూమియందు ఆ పశువులతోఁ గూడ సంచరించుచున్న నాభానేదిష్ఠుని యొద్దకు రుద్రదేవుఁడు వచ్చి ఆ పశువులు తనవే యని పలికెను. మహర్షులు ఈ పశువులను నాకే యొసఁగిరని యతఁడు సమాధానము చెప్పెను. యజ్ఞశేష ద్రవ్యమునకు వారు స్వాములు కారు కనుక, అస్వామిదత్తమైన ద్రవ్యము నీకు యోగ్యము కాదనియు యజ్ఞభూమియందు శేషించిన ద్రవ్యము తనదే యనియు, కనుక నా యనుజ్ఞ లేకుండ ఎవరును యజ్ఞభూమియందు ప్రవేశించరా దనియు రుద్రుఁడు పలికెను. మఱియు యజ్ఞశేష పశు ద్రవ్యమునందు నీ కపేక్ష యున్నచో నన్ను యజ్ఞమువందు భాగస్వామినిగాఁ జేయుము. అప్పుడు నీ పశువులను హింసించనని రుద్రుఁడు పలికెను. అప్పుడు నాభానేదిష్ఠుఁడు మన్థిగ్రహమునుండి సంస్రావ హవిస్సును ఆ రుద్రునికొఱకు హోమము చేసెను. (అనఁగా మన్థిగ్రహమును హోమము చేసి ఆ పాత్రమందలి హవిస్సును పరిధికి వెలువల నుంచఁబడిన అంగారమునందు హోమము చేసెనని భావము.) దానివలన రుద్రదేవుఁడు తుష్టుఁడై అతని పశువులను హింసించనే లేదు. **(నాభానేదిష్ఠునకు రుద్రదేవునితో జరిగిన సంవాద మిచట వర్ణింపఁబడినది.)**

10. అర్థము: యత్ర=ఎచట, ఏతమ్=ఈ హోమమును, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, (యజమానః=యజమానుఁడు), మన్థినః=మన్థిగ్రహమునుండి, సంస్రావమ్=సంస్రావమును, జుహోతి=హోమము చేయుచున్నాఁడో, తత్ర=అచట, రుద్రః=రుద్రదేవుఁడు, పశూన్=పశువులను, నాభిమన్యతే=హింసించుట లేదు.

తాత్పర్యము: ఈ ఆఖ్యానమును ముగించి సారాంశము చెప్పఁబడుచున్నది. యజమానుఁడు ఈ విధముగఁ తెలిసికొని మన్థిగ్రహమునుండి సంస్రావమును హోమము చేయవలెను. అప్పుడు రుద్రదేవుఁడు అతని పశువులను హింసింపఁడు.

నవమానువాకము సమాప్తము.

అథ తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే దశమోఽనువాకః ।

మూలము: [1]జుష్టో వాచో భూయాసం జుష్టో వాచస్పతయే దేవివాక్। యద్వాచో మధుమత్తస్మిన్మా ధాః స్వాహా సరస్వత్యై। [2]ఋచాస్తోమగ్ం సమర్ధయ గాయత్రేణ రథంతరమ్। బృహద్గాయత్రవర్తని। [3]యస్తే ద్రప్సః స్కన్దతి యస్తే అగ్ంశు ర్బాహుచ్యుతో ధిషణయో రుపస్థాత్। అధ్వర్యోర్వా పరి యస్తే పవిత్రాత్ స్వాహాకృత మిన్ద్రాయ తం జుహోమి। [4]యో ద్రప్సో అగ్ంశుః పతితః పృథివ్యాం పరివాపాత్ (౧)పురోడాశా త్కరమ్భాత్। ధానాసోమా న్మన్థిన ఇన్ద్ర శుక్రాత్స్వాహాకృత మిన్ద్రాయ తం జుహోమి। [5]యస్తే ద్రప్సో మధుమాగ్ం ఇన్ద్రియావా న్స్వాహాకృతః పునరప్యేతి దేవాన్। దివః పృథివ్యాః పర్యన్తరిక్షా త్స్వాహాకృత మిన్ద్రాయ తం జుహోమి। [6]అధ్వర్యుర్వా ఋత్విజాం ప్రథమో యుజ్యతే తేన స్తోమో యోక్తవ్య ఇత్యాహు ర్వాగగ్రేగా అగ్ర ఏత్వృజుగా దేవేభ్యో యశో మయి దధతీ ప్రాణా న్పశుషు ప్రజాం మయి (౨)చ యజమానే చేత్యాహ వాచమేవ తద్యజ్ఞముఖే యునక్తి [7]వాస్తు వా ఏతద్యజ్ఞస్య క్రియతే యద్గ్రహా న్గృహీత్వా బహిష్పవమానగ్ం సర్పన్తి [8]పరాఞ్చో హి యన్తి పరాచీభిః స్తువతే వైష్ణవ్యర్చా పునరేత్యోపతిష్ఠతే యజ్ఞో వై విష్ణు ర్యజ్ఞ మేవాక [9]ర్విష్ణో త్వం నో అన్తమః శర్మ యచ్ఛ సహన్త్య। ప్ర తే ధారా మధుశ్చ్యుత ఉత్సం దుహ్రతే అక్షిత మిత్యాహ యదేవాస్య శయానస్యోప శుష్యతి తదేవాస్యై తేనా ఽఽప్యాయయతి ॥౩॥

(పరివాపాత్ప్రజాం మయి దుహ్రతే చతుర్దశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమ ప్రపాఠకే దశమోఽనువాకః ।

## వేదార్థదీపిక

**అవతారిక:** నవమానువాకమునందు అఘారసంప్రావ మంత్రము లభిహితము లైనవి. ఈ దశమానువాకమునందు ప్రవృత హోమాది మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1\. **అర్థము:** (అహమ్=నేను), వాచః=వాగ్దేవికి, జుష్టః=ఇష్టుఁడను, భూయాసమ్=అగుదును గాక. వాచస్పతయే=వాక్పతికొఱకు, జుష్టః=ఇష్టుఁడను, భూయాసమ్=అగుదును గాక. హే వాగ్దేవి!=ఓ వాగ్దేవీ!, వాచః=శబ్ద రూపమైన వాక్సంబంధియగు, యత్ మధుమత్=మధురమైన పదము ఏది (కలదో), తస్మిన్=దానియందు మా=నన్ను, ధాః=స్థాపించుము. సరస్వత్యై=సరస్వతీదేవియగు నీకొఱకు, స్వాహా=(ఈ హవిస్సు) హుత మగుఁగాక.

**తాత్పర్యము:** ("ఋత్విజో వృణీతే ఛన్దాగ్ంస్యేవ వృణీతే" ఇత్యాదికముచే షష్ఠ కాండమునందు ఋత్విగ్వరణ మభిహితమైనది. అచట ఎవ రెవరు యజమానునిచే యజ్ఞమునకై వరింపఁబడిరో, వారిలో ప్రతియొక వ్యక్తియు ఈ మంత్రములచే హోమములను చేయవలెను. అందు ఇది మొదటి మంత్రము.) నేను వాగ్దేవికి, వాక్పతికిఁ గూడ ఇష్టుఁడ నగుదును గాక. ఓ వాగ్దేవీ! శబ్దరూప వాక్కునకు సంబంధించిన మధుర పదమునందు నన్నుంచుము. సరస్వతివగు నీ కీ హవిస్సు హుత మగుఁగాక. (నా వాక్కును మధురమైనదిగాఁ జేయుమని తాత్పర్యము.)

2\. **అర్థము:** హే వాగ్దేవి!=ఓ వాగ్దేవీ!, ఋచా=మూలభూతమైన ఋక్కుచేత, స్తోమమ్=స్తోత్రమును (లేక-సామావృత్తిని), సమర్ధయ=సమృద్ధికలదిగాఁ జేయుము. గాయత్రేణ (సహితమ్)=గాయత్ర సామముతోఁ గూడిన, రథన్తరమ్=రథంతర సామమును, సమర్ధయ=సమృద్ధి కలదిగాఁ జేయుము. బృహత్=బృహత్సామమును, గాయత్రవర్తని=గాయత్రసామ మార్గము కలది యగునట్లుగా, సమర్ధయ=సమృద్ధి కలదిగాఁ జేయుము.

**తాత్పర్యము:** ఓ వాగ్దేవీ! కర్మానుష్ఠానమునకై యజమానునిచే వరింపఁబడిన ఋత్విజులందు ఏర్పడునట్టి ఋక్సామాదిగత వైకల్యమును పరిహరించి ఋక్సామాదికమును సమృద్ధముగాఁ జేయుము. (ఇది ద్వితీయ మంత్ర పాఠము.)

3\. **అర్థము:** (హే సోమ!=ఓ సోమమా!), తే=నీయొక్క యః=ఏ, ద్రప్సః=రసబిందువు, వా=లేదా, అంశుః=(లతాగ్రము యొక్క) లేశము, ధిషణయోః=అధిషవణ ఫలకములయొక్క, ఉపస్థాత్=పై భాగమునుండి, స్కన్దతి=(భూమియందు) పడినదో, వా=లేదా, అధ్వర్యోః=అధ్వర్యునియొక్క, బాహుచ్యుతః=బాహువునుండి జాతినదై, స్కన్దతి=(భూమియందు) పడినదో, వా=లేదా, తే=నీయొక్క, యః=ఏ రసబిందువు, పవిత్రాత్=పవిత్రమైన దశాపవిత్రము నుండి, పరి=అంతటను, స్కన్దతి=(భూమియందు) పడినదో, తమ్=ఆ రస బిందువును, అంశువును, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, స్వాహాకృతమ్=హుత మైనదిగా, జుహోమి=హోమము చేయుచున్నాను.

**తాత్పర్యము:** ఓ సోమమా! నీ సంబంధియగు రసబిందువు కాని, అంశువు కాని అధిషవణ ఫలకముల పై భాగమునుండి కాని, అధ్వర్యుని బాహువు నుండి కాని జాతినదై భూమియందు పడిన దానిని గాని, లేక పవిత్ర దశాపవిత్రము నుండి భూమియందంతటను పడిన నీ రసబిందువును, అంశువును కూడ ఇంద్రునికై హుత మగునట్లుగా హోమము చేయుచున్నాను. (స్కన్దతి=అస్కన్దత్ అని అర్థము. భూతార్థే వర్తమానకాలిక ప్రయోగము. "యస్తే ద్రప్సః", "యో ద్రప్సః" "యస్తే ద్రప్సః" ఈ ప్రతీకములు గల మూఁడు ఋక్కుల నుచ్చరించుచు యజమానునినుండి వరణము పొందిన ఋత్విజులు హోమము చేయవలెను. ఈ హోమము లకు వైప్రుష హోమములని పేరు. ఆ ఋక్కులలో నిది మొదటి ఋక్కు.)

4. అర్థము: హే ఇన్ద్ర!=ఓ ఇంద్రుఁడా!, పరివాపాత్=లాజల సమూహమునుండి, పురోడాశాత్=పురోడాశమునుండి, కరమ్భాత్=సక్తుపిండినుండి, ధానాసోమాత్=వేయించిన యవ తండులములనుండియు, సోమమునుండియు, మన్థినః=మన్థి గ్రహమునుండియు, శుక్రాత్=శుక్ర గ్రహమునుండియు, యో ద్రప్సః=ఏ రసబిందువు, పృథివ్యామ్=భూమియందు, పతితః=పడినదో, యః అంశుశ్చ=ఏ అంశువును, పృథివ్యామ్=భూమియందు, పతితః=పడినదో, తమ్=ఆ రసబిందువును, ఆ అంశువును, స్వాహాకృతమ్=స్వాహాకారముచే సమర్పింపఁబడినదిగా, ఇన్ద్రాయ=ఇంద్రుఁడవైన, (తుభ్యమ్=నీకొఱకు), జుహోమి=హోమము చేయుచున్నాను.

తాత్పర్యము: పరివాపాదులు సవనీయ పురోడాశద్రవ్య విశేషములు. ఓ యింద్రా! సవనీయ పురోడాశ ద్రవ్యము అయిన పరివాపాదులనుండి భూమియందు పడిన రసబిందువును, అంశువును స్వాహాకారముచేత సమర్పింపఁబడినదిగాఁ జేసి నీకొఱకు హోమము చేయుచున్నాను. (ఇది ద్వితీయ ఋక్కు.)

5. అర్థము: (హే సోమ!=ఓ సోమమా!) తే=నీయొక్క, యో ద్రప్సః=ఏ రసబిందువు, మధుమాన్=మాధుర్యము కలదియు, ఇన్ద్రియావాన్=ఇంద్రియ వృద్ధికారియునై, స్వాహా కృతః=(నాచే) స్వాహాకృత మగుచు, దివః(వా)=ద్యులోకమునుండి కాని, పృథివ్యాః (వా)=భూమినుండి కాని, అంతరిక్షాత్ (వా)=అంతరిక్షమునుండి కాని, పరి=అంతటను, (పతితః=పడినదియో,) తతః సర్వస్మాత్=ఆ సర్వస్వమునుండి, పునః=మఱల, దేవాన్=దేవతలను, అప్యేతి=పొందుచున్నది. తమ్=ఆ రసబిందువును, స్వాహాకృతమ్=స్వాహాకారముచే సమర్పిత మైనదిగా, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, జుహోమి=హోమము చేయుచున్నాను.

తాత్పర్యము: ఓ సోమమా! మాధుర్యము కలదియు, నింద్రియ వృద్ధికారియునైన నీ రస బిందువు నాచే స్వాహాకృత మగుచు ద్యులోకాదులనుండి అంతటను పడినదియై మఱల దేవతల నొందుచున్నది. ఆ రసబిందువును స్వాహాకారముచే సమర్పించి ఇంద్రునకై హోమము చేయుచున్నాను. (ఇది తృతీయ ఋక్కు.)

6. అర్థము: ఋత్విజామ్=(బహిష్పవమాన స్తోత్రమునకై వెళ్లుచున్న) ఋత్విజులలో, అధ్వర్యుః వా=అధ్వర్యుఁడే, ప్రథమః=ప్రథముఁడుగా, యుజ్యతే=ప్రవర్తించుచున్నాఁడు. తేన=ఆ అధ్వర్యునిచేత, స్తోమః=స్తోత్ర సముదాయము, యోక్తవ్యః=యోజనీయము, ఇతి=అని, ఆహుః=అభిజ్ఞులు చెప్పుచున్నారు. (తద్యోజనమునకై "వాగగ్రేగా" ఇత్యాది మంత్రమును పఠించవలెను.) దేవేభ్యః=దేవతలకొఱకు, ఋజుగాః=ఋజుమార్గముఁ బోవుచున్నదియు, మయి=నా (అధ్వర్యుని) యందు, యశః=కీర్తిని, దధతీ=స్థాపించుచున్నదియు, పశుషు=పశువులయందు, ప్రాణాన్=ప్రాణములను, దధతీ=స్థాపించుచున్నదియు, మయి చ=నాయందును, యజమానే చ=యజమానునియందును, ప్రజామ్=సంతానమును, దధతీ=ధరింపఁజేయుచున్నదియు, అగ్రేగాః=ముందుఁబోవుటకు సమర్థురాలునగు, వాక్=వాగ్దేవి, అగ్రే=ముందుభాగమునందు, ఏతు=పోవుఁగాక. ఇత్యాహ=అనెడి, మంత్ర పాఠముచేత, (అధ్వర్యుః=అధ్వర్యుఁడు) యజ్ఞముఖే=బహిష్పవమానారంభమునందు, వాచమేవ=వాగ్రూప సరస్వతినే, యునక్తి=యోజన చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: బహిష్పవమాన స్తోత్రమునకై అధ్వర్యుఁడు, ప్రస్తోత, ప్రతిహర్త, ఉద్గాత, బ్రహ్మ అను ఋత్విజులు ఐదుగురు వెళ్లుదురు. వారిలో మొదట అధ్వర్యుఁడు, అతని ననుసరించి ప్రతిహర్త మొదలగువారు కదలి పోవుదురు. మొదటివాఁడైన అధ్వర్యుఁడు స్తోత్ర సముదాయము నారంభించవలెను. అందుకై మొదట "వాగగ్రేగా" ఇత్యాది మంత్రమును పఠించవలెను. మంత్రార్థము:- వాగ్దేవి ఋత్విజులలో ముందుఁ బోవుటకు సమర్థురాలు. దేవ ప్రాప్తికై ఋజుమార్గముఁ బోవునది. అధ్వర్యునియందు కీర్తిని స్థాపించునట్టిది. గవాది పశువులందు ప్రాణములను ధరింపఁ జేయునది. అధ్వర్యునియందు యజమానునియందు పుత్రాది సంతానమును స్థాపించునది. అట్టి వాగ్దేవి ఋత్విజులలో ముందుఁ బోవుఁ గాక అని మంత్రార్థము. ఈ మంత్ర పాఠముచేత అధ్వర్యుఁడు ఆ బహిష్పవమానారంభమునందు వాగ్రూప సరస్వతినే యోజన చేసినవాఁ డగుచున్నాఁడు.

7. అర్థము: గ్రహాన్=ఐన్ద్రవాయవాది గ్రహములను, గృహీత్వా=తీసికొని, (ఋత్విజః=ఋత్విజులు), బహిష్పవమానమ్=బహిష్పవమాన స్తోత్రమును గూర్చి, సర్పన్తి యత్=పోవుచున్నచో, ఏతత్=ఇది, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, వాస్తు=గృహరూప స్థానము, క్రియతే త్వా=చేయఁబడుచున్నదియే యగుచున్నది.

తాత్పర్యము: ఋత్విజులు ఐన్ద్రవాయవాది గ్రహములు తీసికొని బహిష్పవమాన స్తోత్రమునకై పోయినచో, యజ్ఞమునకు గృహరూప స్థానమును కల్పించినట్లే యగును.

8. అర్థము: హి=ఏ కారణమువలన, పరాఞ్చః=పునరావృత్తి రహితులైన ఋత్విజులు, యన్తి=(బహిష్పవమాన స్తోత్రమునకై) వెళ్లుచున్నారో, (యస్మాత్చ=ఏ కారణమువలననైతే, సామగాః=సామగాయకులు), పరాచీభిః=పునరావృత్తి రహితములైన (బహిష్పవమాన స్తోత్రాధారములైన) "ఉపాస్మై గాయత" ఇత్యాది తొమ్మిది ఋక్కుల చేత, స్తువతే=స్తోత్రము చేయుచున్నారో, (తస్మాత్=అందువలన), పునః=మఱల, ఏత్య=(సోమ సమీపమునకు) వచ్చి, ఉప తిష్ఠతే=యజమానునొద్ద నివసించవలెను. యజ్ఞః=యజ్ఞము, విష్ణుః వై=వ్యాపకమైన దగుటచే విష్ణు స్వరూపమే. (అతః=ఇందువలన), వైష్ణవ్యర్చా=వైష్ణవ మంత్రముచేత, యజ్ఞమేవ=యజ్ఞమునే, అకః=ప్రవర్తింపఁ జేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: పునరావృత్తి రహితులైన ఋత్విజులు బహిష్పవమాన స్తోత్రమునకై వెళ్లుచున్నారు కావునను, సామ గాయకులు పునరావృత్తి రహితములు బహిష్పవమాన స్తోత్రాధార భూతములునగు "ఉపాస్మై గాయత" ఇత్యాది తొమ్మిది ఋక్కులచేత స్తోత్రము చేయుచున్నారు కావునను, యజ్ఞమునకు విఘ్నము కలుగకుండవలెనని తలఁచి వారు మఱల సోమ సమీపమునకు వచ్చి యజమానునియొద్ద వసించవలెను. యజ్ఞము వ్యాపన శీలము కలదగుటచే విష్ణుస్వరూపమే కావున, వైష్ణవ మంత్రముచేత అధ్వర్యుఁడు యజ్ఞమునే మఱల ప్రవర్తింపఁ జేసినవాఁ డగుచున్నాఁడు. ("విష్ణో త్వం నో అన్తమ" ఇత్యాది వైష్ణవ మంత్రమును పఠించుచు యజమానుఁడు సోమసమీపమున నుండవలెను.)

9. అర్థము: హే విష్ణో!=ఓ విష్ణూ! త్వమ్=నీవు, నః=మాకు, అన్తమః=మిక్కిలి దగ్గఱవాఁడవు. హే సహన్త్య! (మా యపరాధమును) సహించునట్టి విష్ణూ!, శర్మ=సుఖమును, యచ్ఛ=ఒసఁగుము. తే=త్వత్సంబంధములైన, ధారాః=సోమరస ధారలు, మధుశ్చుతః=మాధుర్యమును స్రవించుచున్నవై, ఉత్సమక్షితమ్=ఉపక్షయము లేనివిధముగ, ప్రదుహ్రతే=ఎక్కువగ పూరింపఁబడుఁగాక, ఇతి ఆహ=అని మంత్రము చెప్పెను. తయా నస్య=పూర్వపాత్రములయందు గృహీతమైయున్న, అస్య=ఈ సోమముయొక్క, యదేవ=ఏ స్వరూపమైతే, ఉప శుష్యతి=(చిరకాల నివాసముచేత) శుష్కించుచున్నదో, తదేవ=అది యంతయు, ఏతేన=ఈ మంత్ర పాఠముచేత, ఆప్యాయయతి=వృద్ధి నొందుచున్నది.

తాత్పర్యము: (ఇచట "విష్ణో త్వం నో అన్తమ" ఇత్యాది మంత్రము, దాని తాత్పర్యము చెప్పఁబడినవి.) ఓ విష్ణూ! నీవు మా కత్యంత సన్నిహితుఁడవు. మా యపరాధమును సహించునట్టి ఓ విష్ణూ! మాకు సుఖము నిమ్ము. త్వత్సంబంధములైన సోమరస ధారలు మాధుర్యము నొలుకుచున్నవియై క్షయము లేనివిధముగ నధికముగ పూరింపఁబడుఁగాక అని "విష్ణో త్వ" మిత్యాది మంత్రము చెప్పినది. పూర్వపాత్రములలోనికి గ్రహింపఁబడియున్న సోమముయొక్క యే భాగము చాలకాల మచట నుండుటచే శుష్కించుచున్నదో, అది యీ మంత్రపాఠముచే వృద్ధి నొందుచున్నది.

దశమానువాకము సమాప్తము

## అథ తృతీయకాణ్డే ప్రథమ ప్రపాఠక ఏకాదశోఽనువాకః।

మూలము: [1]అగ్నినా రయిమశ్నవ త్పోషమేవ దివే దివే। యశసం వీరవత్తమమ్। [2]గోమాగ్ం అగ్నే ఽవిమాగ్ం అశ్వీ యజ్ఞో నృవత్సఖా సదమి ద్ప్రమృష్యః। ఇడావాగ్ం ఏషో అసుర ప్రజావా న్దీర్ఘో రయిః పృథుబుధ్నః సభావాన్। ఆప్యాయస్వ సం తే। [4]ఇహ త్వష్టార మగ్రియం విశ్వరూపముప హ్వయే। అస్మాక మస్తు కేవలః। [5]తన్న స్తురీప మధ పోషయిత్ను దేవ త్వష్ట ర్వి రరాణః స్యస్వ। యతో వీరః (౧)కర్మణ్యః సుదక్షో యు క్తగ్రావా జాయతే దేవ కామః। [6]శివ స్త్వష్ట రిహాఽఽగహి విభుః పోష ఉత త్మనా। యజ్ఞేయజ్ఞే న ఉదవ। [7]పిశఙ్గ రూపః సుభరో వయోధాః శ్రుష్టీ వీరో జాయతే దేవకామః। ప్రజాం త్వష్టా వి ష్యతు నాభి మస్మే అథా దేవానా మప్యేతు పాథః। [8]ప్ర ణో దేవ్యా నో దివః। [9]పీపివాగ్ంసగ్ం సర స్వతః స్తనం యో విశ్వదర్శతః। ధుక్షీమహి ప్రజామిషమ్ (౨)[10]యే తే సరస్వ ఊర్మయో మధుమన్తో ఘృతశ్చుతః। తేషాం తే సుమ్నమీమహే। [11]యస్య వ్రతం పశవో య న్తి సర్వే యస్య వ్రత ముప తిష్ఠన్త ఆపః। యస్య వ్రతే పుష్టిపతి ర్నివిష్ట స్తగ్ం సరస్వన్త మవసే హువేమ। [12]దివ్యగ్ం సుపర్ణం వయసం బృహన్తమపాం గర్భం వృషభ మోషధీనామ్। అభీపతో వృష్ట్యా తర్పయన్తం తగ్ం సరస్వన్త మవసే హువేమ। [13]సినీవాలి పృథుష్టుకే యా దేవానామసి స్వసా। జుషస్వ హవ్యమ్ (౩)ఆహుతం ప్రజాం దేవి దిదిడ్ఢి నః। [14]యా సుపాణిః స్వఙ్గురిః సుషూమా బహుసూవరీ। తస్యై విశ్పత్న్యై హవిః సినీవాల్యై జుహోతన।

[15]ఇన్ద్రꣳ వో విశ్వతస్పరీన్ద్రꣳ నరః। [16]అసితవర్ణా హరయః సుపర్ణా మిహో వసానా దివ
ముత్పతన్తి। త ఆఽవవృత్రన్త్సదనాని కృత్వాఽఽదిత్పృథివీ ఘృతై ర్వ్యుద్యతే। [17]హిరణ్య
కేశో రజసో విసారేఽహిర్ధునిర్వాత ఇవ ధ్రజీమాన్। శుచిభ్రాజా ఉషసః (౪)నవేదా యశ
స్వతీ రపస్యువో న సత్యాః। [18]ఆ తే సుపర్ణా అమినన్త ఏవైః కృష్ణో నోనావ వృషభో
యదీదమ్। శివాభిర్న స్మయమానాభిరాఽగా త్పతన్తి మిహః స్తనయన్త్యభ్రా। [19]వాశ్రేవ
విద్యున్మిమాతి వత్సం న మాతా సిషక్తి। యదేషాం వృష్టి రసర్జి। [20]పర్వతశ్చిన్మహి వృద్ధో
బిభాయ దివశ్చిత్సాను రేజత స్వనే వః। యత్క్రీడథ మరుతః (౫)ఋష్టిమన్త ఆప ఇవ
సధ్రియఞ్చో ధవధ్వే। [21]అభి క్రన్ద స్తనయ గర్భమా ధా ఉదన్వతా పరి దీయా రథేన। దృతిగ్ం
సు కర్ష విషితం న్యఞ్చగ్ం సమా భవన్తూద్వతా నిపాదాః। [22]త్వం త్యా చిదచ్యుతాగ్నే పశుర్న
యవసే। ధామా హ యత్తే అజర వనా వృశ్చన్తి శిక్వసః। [23]అగ్నే భూరీణి తవ జాతవేదో
దేవ స్వధావోఽమృతస్య ధామ। యాశ్చ (౬)మాయా మాయినాం విశ్వమిన్వ త్వే పూర్వీః
సందధుః పృష్టబన్ధో। [24]దివో నో వృష్టిం మరుతో రరీధ్వం ప్ర పిన్వత వృష్ణో అశ్వస్య ధారాః।
అర్వాఙేతేన స్తనయిత్నునేహ్యపో నిషిఞ్చ న్నసురః పితా నః। [25]పిన్వన్త్యపో మరుతః
సుదానవః పయో ఘృతవ ద్విదథేష్వాభువః। అత్యం న మిహే వి నయన్తి వాజిన ముత్సం దు
హన్తి స్తనయన్త మక్షితమ్। [26]ఉదప్రుతో మరుత స్తాగ్ం ఇయర్త వృష్టిమ్ (౭)యే విశ్వే
మరుతో జునన్తి। క్రోశాతి గర్దా కన్యేవ తున్నా పేరుం తుఞ్జానా పత్యేవ జాయా। [27]ఘృతేన

ద్యావాపృథివీ మధునా సముక్షత పయస్వతీః కృణుతాఽఽప ఓషధీః। ఊర్జంచ తత్ర సుమతిం చ పిన్వథ యత్రా నరో మరుతః సిఞ్చథా మధు। [28]ఉదు త్యం చిత్రమ్। [29]ఔర్వభృగు వచ్ఛుచీ మప్నవానవదా హువే। అగ్నిగ్ం సముద్రవాససమ్। [30]ఆ సవగ్ం సవితు ర్యథా భగ స్యేవ భుజిగ్ం హువే। అగ్నిగ్ం సముద్రవాససమ్। [31]హువే వాతస్వనం కవిం పర్జన్యక్రన్ద్యగ్ం సహః। అగ్నిగ్ం సముద్రవాససమ్ ॥౮॥

(వీర ఇషగ్ం హవ్య ముషసో మరుతశ్చ వృష్టిం భగస్య ద్వాదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమప్రపాఠక ఏకాదశోఽనువాకః।

ప్రజాపతి రేష తే గాయత్రో యజ్ఞం వై ప్రజాపతేః ప్రాజాపత్యా యో వా అయథాదేవత మిష్టర్గో నిగ్రాభ్యాః స్థ యో వై దేవాఞ్జుష్టో ఽగ్నినా రయి మేకాదశ ॥౧౧॥

ప్రజాపతి రకామయత ప్రజాపతే ర్జాయమానా వ్యాయచ్ఛన్తే మహ్య మిమాన్మాయా మాయి నాం ద్విచత్వారిగ్ంశత్ ॥౪౨॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమః ప్రపాఠకః।

## వేదార్థదీపిక

అవతారిక: బహిష్పవమానాంగములైన ప్రవృత హోమాది మంత్రములు దశమానువాకమునం దభిహితము లైనవి. ఈ యేకాదశాను వాకమునందు కొన్ని యాజ్యా పురోనువాక్యలు చెప్పబడుచున్నవి.

1. అర్థము: అగ్నినా-(ఈ) అగ్నిచేత, సర్వో జనః-సమస్తజనము, రయిమ్-ధనమును, అశ్నవత్-పొందుచున్నాడు. (అశ్నవత్-అశ్నుతే-ప్రాప్నోతి). దివేదివే-ప్రతి దినమునందు, యశసమ్-కీర్తిదాయకము, వీరవత్తమమ్-అతిశయముగ వీరులైన పుత్రులుకలదియునగు, పోషమేవ-ధనపుష్టినే, అశ్నవత్-పొందుచున్నాడు.

తాత్పర్యము: ("చిత్రయా యజేత పశుకామః" అను విధియందు సప్త హవిస్సులు కలవు. అందు ఆగ్నేయ హవిస్సునకు సంబంధించిన పురోనువాక్య యిది.)

సర్వజనులు ఈ యగ్ని చేత సాధారణ ధనమునే గాక యశస్కరము, వీరులైన పుత్రులు కలదియునగు ధన సమృద్ధినే ప్రతి దినము పొందుచున్నారు.

2. అర్థము: అసుర!=ప్రాణవంతుఁడవైన, హే అగ్నే!=ఓ యగ్నీ, ఏషః యజ్ఞః=ఈ యజ్ఞము, గోమాన్=గోవులు కలదియు, అవిమాన్=గొఱ్ఱెలు కలదియు, అశ్వీ=గుఱ్ఱములు కలదియు, నృవత్సఖా=ఋత్విగ్రూప మనుష్యులతోఁ గూడిన దేవతలు సఖులుగాఁ గలదియు, సదమిత్=సర్వదైవ, అప్రమృష్యః=తిరస్కరణీయము కానిదియు, ఇడావాన్=అన్నము కలదియు, ప్రజావాన్=బహు సంతాన ప్రదమును, దీర్ఘః=(మాటిమాటికి అనుష్ఠింపఁబడుటవలన) అవిచ్ఛిన్నమును, రయిః=బహు ధనోపేతమును, పృథుబుధ్నః=విస్తీర్ణ మూలము కలదియు (మూలభూతములైన మంత్రములందు అనుష్ఠానములందు వైకల్యము లేనిదియు), సభావాన్=విద్వత్సభతోఁ గూడినదియు, (భూయాత్=అగుఁగాక. అస్యన్తే=క్షిప్యన్తే శరీరే ఇతి అసవః=ప్రాణాః ఇత్యర్థః. అసూన్=ప్రాణాన్, రాతి=దదాతీతి, అసురః=ప్రాణవాన్ అగ్నిః ఇతి వ్యుత్పత్త్యర్థః)

తాత్పర్యము: ప్రాణవంతుఁడవైన అగ్నీ! మఱల మఱల ననుష్ఠానమునకై ప్రార్థింపఁబడుచున్న ఈ యజ్ఞము గవాశ్వాది విశిష్టాంశములు కలది యగుఁగాక. (పైని చెప్పఁబడిన ఆగ్నేయ హవిస్సున కిది యాజ్య).

3. అర్థము: పైని చెప్పఁబడిన చిత్రయాగమునకు సంబంధించిన సప్త హవిస్సులలో రెండవదియగు సౌమ్య హవిస్సు యొక్క యాజ్యా పురోనువాక్యలకు "ఆప్యాయస్వ" "సంతే" అనునవి ప్రతీకములు. ఈ యుభయము చతుర్థ కాండమునందు "మా నో హిగ్ంసీత్" అను స్థలమున వ్యాఖ్యానింపఁబడును.

4. అర్థము: ఇహ=ఈ కర్మయందు, అగ్రియమ్=ముఖ్యుఁడును, విశ్వరూపమ్=గర్భమునందు మార్పు చేయు విశ్వ రూపములు కలవాఁడునగు, త్వష్టారమ్=త్వష్టృదేవుని, ఉప హ్వయే=ఆహ్వానించుచున్నాను. (సః=ఆ త్వష్టృ దేవుఁడు), అస్మాకమ్=మాకు, కేవలం=అసాధారణ పాలకుఁడు, అస్తు=అగుఁగాక.

తాత్పర్యము: ముఖ్యుఁడును, గర్భమునందలి శుక్ల శోణితములను వివిధ రూపములుగాఁ జేయువాఁడునగు త్వష్టృదేవుని నేను ఆహ్వానించుచున్నాను. ఆ త్వష్టృదేవుఁడు మాకు అసాధారణ పాలకుఁ డగుఁగాక. (పూర్వోక్త యజ్ఞమునందలి తృతీయమగు త్వష్టృదేవ హవిస్సున కిది పురోనువాక్య).

5. అర్థము: హే త్వష్టృదేవ!=ఓ త్వష్టృదేవా!, రరాణః=దానశీలుఁడవైన నీవు, తురీపమ్=శీఘ్రముగ పొందునదియు, అథ=మఱియు, పోషయిత్ను=పోషించునదియునగు, తత్=ఆ ధనమును, నః=మాకు, విష్యస్వ=విశేషముగ సమర్పించుము. యతః=ఏ ధనమువలన, కర్మణ్యః=లౌకిక, వైదిక కర్మలందు నేర్పరియు, సుదక్షః=మంచి ఉత్సాహము కలవాఁడును, యుక్తగ్రావా=సోమాభిషవమునకై ప్రయుక్తములైన ఱాళ్లు కలవాఁడును, (సర్వదా సోమయాగము ననుష్ఠించువాఁడని భావము.) దేవకామః=(ఇటువంటి సేవకుఁడు మాకు కావలెనని) దేవతలచే కోరఁబడువాఁడును, (లేక-దేవతలను సేవించుటకు స్వయముగ కోరువాఁడును.) వీరః=వీరుఁడునగు పుత్రుఁడు, జాయతే=పుట్టుచున్నాఁడో.

తాత్పర్యము: ఓ త్వష్టృదేవా!, కర్మణ్యాది లక్షణ యుక్తుఁడైన కుమారుని గలుగఁజేయునదియు, శీఘ్రముగ పొందునదియు, పోషకమునగు ధనమును మా కొసఁగుము. (పూర్వోక్త హవిస్సునకే ఇది యాజ్య.)

6. అర్థము: హే త్వష్టః!=ఓ త్వష్టృదేవా!, (త్వమ్=నీవు,) శివః=సుఖకరుఁడ వగుచు, ఇహ=ఈ కర్మయందు, ఆగహి=రమ్ము. ఉత=మఱియు, పోషే=అస్మత్పోషణ విషయమున, త్మనా=స్వయముగ, విభుః=సమర్థుఁడవు. (తాదృశః=అటువంటి నీవు), యజ్ఞేయజ్ఞే=ఆ యా యజ్ఞమునందు, నః=మమ్ము, ఉదవ=ఉత్కర్షతో పాలింపుము. (ఉత్ + అవ=ఉదవ.)

తాత్పర్యము: ఓ త్వష్టృదేవా! నీవు సుఖకరుఁడ వగుచు ఈ యజ్ఞ కర్మయందు రమ్ము. మఱియు నీవు మమ్ముఁ బోషించు విషయమున పరాపేక్ష లేకుండ స్వయముగనే సమర్థుఁడవు. అటువంటి నీవు మమ్ము ఉత్కర్షగా పాలించుము. (పూర్వోక్త హవిస్సునకే ఇది మఱియొక పురోనువాక్య.)

7\. అర్థము: (యస్య=ఏ త్వష్టృదేవునియొక్క, ప్రసాదాత్=అనుగ్రహమువలన, నః=మాకు,) పిశఙ్గరూపః=త్రివర్గ సేవియు, సుభరః=బాగుగా పోషించువాఁడును, వయోధాః=(ఎక్కువ కాలము) వయస్సును ధరించు వాఁడును (చిరంజీవి), క్రుష్టిః=శీఘ్రకారియు లేక-సత్యవాదియు, దేవకామః=దేవతలచే కోరఁబడువాఁడును లేక దేవతలను కోరువాఁడునగు, వీరః=వీరుఁడైన పుత్రుఁడు, జాయతే=పుట్టుచున్నాఁడో (పుట్టెనో), తాదృశః త్వష్టా=అటువంటి త్వష్టృదేవుఁడు, నాభిమ్=(చక్రమునకు) నాభివలె ప్రశస్తమైన, ప్రజామ్=పుత్ర పౌత్రాది రూప ప్రజను, అస్మే=మాయందు, విష్యతు=విశేషముగ సమర్పించుఁగాక. అథ=అనంతరము, దేవానామపి=దేవతలకుఁ గూడ, పాథః=అన్నమును, ఏతు=పొందుఁగాక (పొందించుఁగాక).

తాత్పర్యము: పిశంగ రూపత్వ, సుభరత్వాది విశిష్ట గుణ సంపన్నుఁడైన కుమారుని అనుగ్రహించిన త్వష్టృ దేవుఁడు చక్రమునకు నాభివలె ప్రశస్తమయిన పుత్ర పౌత్రాది రూప ప్రజను మాకు విశేషముగ సమర్పించుఁగాక. మఱియు నతఁడు దేవతలకుఁ గూడ అన్నమును సమకూర్చుఁ గాక. (ఇది పూర్వోక్త హవిస్సునకే మఱి యొక యాజ్య.)

8\. వివరణము: "ప్ర ణో దేవీ సరస్వతీ" అనునది పూర్వోక్త యాగమునందలి సరస్వతీ దేవతాకమైన చతుర్థ హవిస్సు. "ఆ నో దివో బృహత" ఇత్యాదికము ఆ హవిస్సునకు యాజ్య. ఆ యాజ్యా పురోనువాక్యల కివి ప్రతీక ములు మాత్రమే. ఈ యుభయము "అగ్నా విష్ణూ మహి" త్యాది స్థలమునందు వ్యాఖ్యానింపఁబడినది.

9\. అర్థము: సరస్వతః=సరస్వన్నామక దేవునియొక్క, యః=ఏ స్తనము (యజ్ఞము), విశ్వ దర్శతః=విశ్వ విషయక దర్శనము (కలదో), పిపివాంసమ్=(మమ్ము) వృద్ధి నొందించిన, (తాదృశం) స్తనమ్=అటువంటి స్తనమును, ప్రజామ్=పుత్రాది రూప ప్రజను, ఇషమ్=అన్నమును, ధుక్షీమహి=పితుకుదుము గాక.

తాత్పర్యము: సరస్వన్నామక దేవునియొక్క విశ్వవిషయక దర్శనము గల యజ్ఞ లక్షణమైన అటువంటి స్తనమునుండి (యజ్ఞమునుండి) పుత్రాది రూప ప్రజను అన్నమును పితుకుదుము గాక. ఆ స్తనము మమ్ము వృద్ధి నొందించినది. (విశ్వదర్శతః=ఆఁకలి గొన్న బాలురనువలె పాలించుటను తెలిసినది. "గాం దోగ్ధి పయః" అను ప్రయోగమువలె "స్తనం ప్రజాం ధుక్షీమహి" అను ప్రయోగము కూడ ద్వికర్మకము. గోవునుండి పాలను పితుకు విధముగ సరస్వద్దేవతాక యాగము ననుష్ఠించి ప్రజాదికమును పొందితిమని భావము. ఇచట స్తన మనఁగా యజ్ఞమని తాత్పర్యము. (సరస్వన్=సరస్సులుకలది సముద్రము. ఇది చిత్రయాగము నందలి పంచమ హవిస్సుయొక్క పురోనువాక్య.)

10\. అర్థము: హే సరస్వః!=ఓ సముద్రమా!, యే ఊర్మయః=ఏ తరంగములు, మధుమన్తః=మాధుర్యము కలవియై, ఘృతశ్చుతః=ఆజ్య సమానమైన ఉదకమును స్రవించుచున్నవో, తే=నీయొక్క, తేషామ్=ఆ ఊర్ముల సంబంధమైన, సుమ్నమ్=సుఖమును, ఈమహే=పొందుదుము గాక. ('సరస్వః'=' సరస్వన్').

తాత్పర్యము: ఓ సముద్రదేవతా! నీ యలలు మాధుర్యము కలవి. ఆజ్య సమానమైన ఉదకమును స్రవించునవి. అట్టి నీ యలలయొక్క సుఖమును పొందుదుము గాక. (ఇది చిత్ర యాగమునందలి పంచమ హవిస్సునకు యాజ్య).

11\. అర్థము: యస్య=ఏ సరస్వద్దేవునియొక్క, వ్రతమ్=వ్రతమును (కర్మను), సర్వే పశవః=పశువులు, మనుష్యులు అందఱు, యన్తి=పొందుచున్నారో, యస్య=ఏ సరస్వద్దేవునియొక్క, వ్రతమ్=కర్మను, ఆపః=వృష్టి రూపములైన ఉదకములు, ఉప తిష్ఠన్తే=సేవించుచున్నవో, యస్య=ఏ సరస్వద్దేవుని సంబంధమైన, వ్రతే=కర్మయందు, పుష్టిపతిః=ధనపుష్టికి పాలకుఁడైన యజమానుఁడు, నివిష్టః=నిమగ్నుఁడై యుండెనో, తం సరస్వన్తమ్=ఆ సరస్వద్దేవుని, అవసే=రక్షణము కొఱకు, హువేమ=ఆహ్వానింతుము.

తాత్పర్యము: సరస్వద్దేవతాక కర్మచే పశువులు పుత్రాది ప్రజలు లభించుచున్నారు. తదీయ కర్మచే వృష్టి లభించుచున్నది. "అగ్నౌ ప్రాస్తా ఽఽహుతి స్సమ్య గాదిత్య ముప తిష్ఠతే" అను న్యాయముచే వృష్టి సముద్ర దేవతాక

కర్మచేత సాధ్య మగునని తాత్పర్యము. తదీయ కర్మచే యాగకర్త ధనపుష్టిని పొందుచున్నాఁడు. అట్టి సరస్వద్దేవుని రక్షణ నిమిత్తము మేము ఆహ్వానింతుము. (పూర్వోక్త యాగమునందలి సరస్వద్దేవతాక పంచమ హవిస్సున కిది యాజ్య.)

12. అర్థము: దివ్యమ్=ద్యులోకమున కర్హుఁడును, సుపర్ణమ్=మంచి ఱెక్కలు కలవాఁడును, (సముద్రుఁడు పక్షిరూపమును ధరించి ద్యులోకమునకు పోవునపుడు అతనికి ఱెక్కలుండును.) వయసమ్=పక్షిరూపుఁడును, బృహన్తమ్=గొప్పవాఁడును, అపాం వృషభమ్=ఉదకములను వర్షించువాఁడును, ఓషధీనాం గర్భమ్=వ్రీహ్యాది మఞ్జరీ రూపుఁడును, వృష్ట్యా=వర్షరూపముచేత, అభీపతః=అంతటను పడుటవలన, తర్పయన్తమ్=(అందఱకు) తృప్తిహేతువును అగు, తం సరస్వన్తమ్=ఆ సరస్వంతుఁడైన సముద్రుని, అవసే=రక్షణముకొఱకు, హువేమ=ఆహ్వానింతుము.

తాత్పర్యము: సముద్రుఁడు వాయువుచే తీసికొనిరాఁబడిన ఱెక్కలవంటి జలబిందువులచే పక్షివలె మేఘమండలములోనికి పోయి జలబాహుళ్యము నొంది స్వయముగానే వర్షమును వర్షించి సర్వప్రాణులను తృప్తిపఱచుచు ఓషధులందు వ్రీహ్యాది రూపమున గర్భ మగుచున్నాఁడను నర్థము "అపాం గర్భం వృషభ మోషధీనామ్" అను దానివలన వ్యక్త మగుచున్నది. అట్టి సరస్వంతుఁడైన సముద్రుని రక్షణముకొఱకు ఆహ్వానించెదము. (ఇదియుఁ బూర్వోక్త హవిస్సునకే యాజ్య.)

13. అర్థము: హే సినీవాలి!=ఓ సినీవాలి దేవతా!, యా=ఏ నీవు, దేవానామ్=దేవతలకు, స్వసా=చెల్లెలివి (చెల్లెలువలె హితకారిణివి), అసి=అగుచున్నావో, హే పృథుష్టుకే!=గొప్ప స్తోత్రము గల ఓ సినీవాలి దేవతా!, ఆహుతమ్=(మాచే) అంతటను సమర్పింపఁబడిన, హవ్యమ్=హవిస్సును, జుషస్వ=సేవించుము. హే దేవి!=ఓ దేవీ!, నః=మాయొక్క, ప్రజామ్=సంతానమును, దిదిడ్ఢి=వృద్ధి నొందించుము.

తాత్పర్యము: అమావాస్యా తిథ్యభిమాని దేవత సినీవాలి యనఁబడును. ఓ సినీవాలి దేవతా! నీవు దర్శేష్టి సాధన మగుటచే దేవతలకు చెల్లెలివలె హితకారిణివి. గొప్ప స్తోత్రము కల ఓ దేవి! మేము సమర్పించు హవిస్సును సేవించుము. మా సంతానమును వృద్ధి నొందించుము. (చిత్రయాగమునందు సినీవాలీ దేవతాకమైన షష్ఠ హవిస్సున కిది పురోనువాక్య.)

14. అర్థము: యా=ఏ సినీవాలి దేవత, సుపాణిః=మంచి హస్తములు కలదియో, స్వఙ్గురిః=మంచి వ్రేళ్లు కలదియో, సుషూమా=బాగుగా ప్రేరణ చేయునదియో, బహుసూవరీ=అనేక యజ్ఞములను ప్రేరణ చేసినదియో, విశ్పత్నియై=ప్రజలను పాలించునదియగు, తస్యై సినీవాల్యై=ఆ సినీవాలి దేవతకొఱకు, (హే ఋత్విగ్యజమానాః!=ఓ ఋత్విగ్యజమానులారా!) హవిః=హవిస్సును, జుహోతన=హోమము చేయుఁడు. (జుహోతన= ఇది వైదికైక ప్రయోగము. 'జుహుత' అని యుండవలెను. స్వఙ్గురిః=స్వఙ్గుళిః. ఇచట ళకారమునకు రేఫాదేశము.)

తాత్పర్యము: ఓ ఋత్విగ్యజమానులారా! సుపాణిత్వాది విశేష విశిష్టయైన సినీవాలిదేవతకై హవిస్సును హోమము చేయుఁడు. (ఇది పూర్వోక్త హవిస్సునకు యాజ్య.)

15. అర్థము: [1]"ఇన్ద్రం వో విశ్వతస్పరి" [2]"ఇన్ద్రం నరః" ఇవి రెండును "ఐన్ద్ర ఉత్తమో భవతి" అని చెప్పఁబడిన సప్తమ హవిస్సుయొక్క పురోనువాక్యకు యాజ్యకు ప్రతీకములు. ఈ ఉభయము ప్రథమకాండము, షష్ఠ ప్రపాఠకమునందు వ్యాఖ్యానించఁబడినది.

16. అర్థము: (యే=ఏ ధూమములు) అసితవర్ణాః=నల్లని రంగు కలవియు, హరయః=మేఘ నిష్పాదనమునకై రసహరణ శీలము కలవియు, సుపర్ణాః=చాఁచబడిన ఱెక్కలవంటివియు, మిహః=మేఘములుగా (భూత్వా=అయి), వసానాః=సూర్యమండలము నాచ్ఛాదించుచున్నవియో, తే=అవి, దివమ్=ద్యులోకమును గూర్చి, ఉత్పతన్ని=పైకెగురుచున్నవి. తే=ధూమనిష్పాద్యములైన అవి, (స్వోదరేషు=తమ మధ్య భాగములందు, జలస్య

చ=నీటికిఁ గూడ), సదనాని=స్థానములను, కృత్వా=చేసి, ఆవవృత్రన్=ఇచట వర్షించుటకు తిరుగుచున్నవి. ఆదిత్=తదనంతరమే, పృథివీ=భూమి, ఘృతైః=ఘృతమువలె స్రవించుచున్న జలములచేత, వ్యుద్యతే= విశేషముగ తడుపఁబడుచున్నది.

**తాత్పర్యము:** (ఇటనుండి కారీరీష్టికి సంబంధించిన మంత్రములు చెప్పఁబడుచున్నవి. "కారీర్యా వృష్టికామో యజేత" వృష్టికాముఁడు కారీరి నామక యాగము చేయవలెను అని కామ్యయాగము విధింపఁబడినది. ఈ యాగము నందు వెదురు బియ్యపు పిండి పేలాలపిండి అగ్నియందు హోమము చేయఁబడును. ఆ పిష్టములు అగ్నిచే దగ్ధమగునప్పుడు బయలువెడలిన ధూమములు ఇట వర్ణింపఁబడినవి.) పూర్వోక్తములైన ధూమములు నల్లని వర్ణము కలిగి మేఘము నుత్పత్తి చేయుటకై ఉదక రసమును గొనిపోవు స్వభావము కలిగి యున్నవి. ఱెక్కలు చాఁచినట్లుగాఁ గనఁబడుచున్నవి. అవి మేఘములుగానై సూర్యమండలము నాచ్ఛాదించుచు ద్యులోకమున ఎగురుచున్నవి. ఆ ధూమముల నుండి యేర్పడిన మేఘములు తమ లోపల నీటికి స్థావరముల నేర్పఱచుకొని వర్షించుటకు ఆవృత్తము అగుచున్నవి. తదనంతరమే భూమి ఆజ్యమువలె స్రవించు నుదకములచే తడుపఁబడుచున్నది. (ఈ మంత్రముచే పూర్వోక్త ధూమముల నభిమంత్రించ వలెను.)

**17. అర్థము:** హిరణ్యకేశః=హిరణ్యవర్ణముతోఁ గూడిన అగ్ని కేశ స్థానీయము లయిన జ్వాలలు కల ధూమము, రజసః= మేఘరూప రంజనముయొక్క, విసారే సతి=ప్రసారణము కలుగుచుండఁగా, అహిః=మేఘ రూపమైన ఆకాశ రంజనమును ప్రసరింపఁజేయుటకుఁ బోవునదియు, వాతః ఇవ=వాయువువలె, ధునిః=కంపము కలదై, ధ్రజీమాన్=శీఘ్ర గమనము కలదియు, శుచిభ్రాజాః=విద్యుద్రూప కాంతి కలదియు, ఉషసః=ఉషఃకాలమును, న వేదాః=తెలియపఱచనిదియునై, అస్తు=అగుఁగాక. (సస్యనిష్పాదకాః భూమయః=సస్యమును గలుగఁజేయు భూములు,) యశస్వతీః=(సస్యనిష్పాదనముచే) కీర్తిమంతములు, (భవన్తు=అగుఁగాక). అపస్యువః న=తమకు ఉదకములు కావలెనని కోరుచున్నవి వలెనున్న ఆ భూములు, సత్యాః=అమోఘారంభము కలవి (సుక్షేత్రములు), (భవన్తు=అగుఁగాక).

**తాత్పర్యము:** పునర్నవా జన్య ధూమము హిరణ్యవర్ణ యుక్తములైన అగ్నికేశ స్థానీయములైన జ్వాలలు కలది. మేఘరూప కాంతి ప్రసరించుచుండఁగా ఆకాశరూపమును గనపఱచుటకుఁ బోవుచున్నది. వాయువువలె కంపము కలిగి శీఘ్ర గమనము కలిగినది. విద్యుత్కాంతితోఁ గూడియున్నది. అటువంటి యీ ధూమము మా నిమిత్తము వర్షమును కురియుఁగాక. ఉషఃకాలము కనఁబడని విధముగ మేఘసమృద్ధి అగుఁగాక. సస్యము పండునట్టి భూములు సస్యనిష్పాదనముచేత కీర్తిమంతము లగుఁగాక. తమకు ఉదకము కావలెనని కోరుచున్నవివలె నున్న భూములు అమోఘారంభములు అనఁగా సుక్షేత్రము లగుఁగాక. (ఈ భూముల ననుగ్రహించుటకై పునర్నవా ధూమము వృష్టినిఁ బుట్టించుఁగాక అని అదనముగఁ జెప్పుకొనవలెను. ఈ మంత్రముచే పునర్నవా స్తంబమును ఆహవనీయాగ్నియందు పడవైచి అనుమంత్రించవలెను. పునర్నవా స్తంబము=గల్జేరు మొక్క.)

**18. అర్థము:** హే పునర్నవేః=ఓ పునర్నవమాః, (గల్జేరు మొక్క) తే=నియొక్క, (ధూమాః=ధూమములు), సుపర్ణాః= మంచి ఱెక్కలవంటివై, ఏవైః=పునర్గమనములచే, ఆమినన్త=అంతట నుదకమును వెదఁజల్లినవి. (తతః= వానినుండి, మేఘః=మేఘము), కృష్ణః=నీలవర్ణము కలదియు, వృషభః=వర్షించునదియు, (భూత్వా అయి), నోనావ=మాటిమాటికి గర్జించెను. యది=ఏ సమయమునందు, ఇదమ్=ఈ సర్వము, (ప్రవర్తతే= జరుగుచున్నదో, తదా=అప్పుడు), శివాభిర్న=అనుగ్రహముతోఁ గూడినవి వలె నున్నవియు, స్మయమానాభిః=నవ్వుచున్నవి వలె నున్నవియు నగు వర్షములతో, (యుక్తః=కూడిన), మిహః=మేఘము, ఆగాత్=వచ్చుచున్నది. (ఆగాత్=ఆగచ్ఛతి, వర్తమానార్థమున భూతార్థక లుఙ్ ఛాందసము. తతః ఊర్ధ్వమ్= అటుపిమ్మట, వృష్టిధారాః=వర్షధారలు) పతన్తి=పడుచున్నవి. అభ్రా (అభ్రాః, లుప్తవిభక్త్యంతము)= మబ్బులు, స్తవయన్తి=గర్జించుచున్నవి.

తాత్పర్యము: ఓ పునర్నవమా! నీ ధూమములు సువర్ణములై పునర్గమనములచే సంతతను నీటిని వెదఁజల్లుచున్నవి. వాని నుండి మేఘము నీలవర్ణము కలదియు వర్షించునదియునై మాటిమాటికి గర్జించెను. ఇది జరుగుచున్న సమయమున అనుగ్రహముతోఁ గూడిన మేఘము వచ్చుచున్నది. అటుపిమ్మట వర్షధారలు పడుచున్నవి. మబ్బులు గర్జించుచున్నవి. (పునర్నవా ధూమాభిమంత్రణమునందు మూఁడు ఋక్కులు చెప్పఁబడినవి. వానిలో నిది మొదటి ఋక్కు.)

19. అర్థము: ఏషామ్=ఈ వాయువుల(యొక్క) సంబంధమైన, వృష్టిః=వర్షము, యత్=ఎప్పుడు, అసర్జి=సృష్టింపఁబడినదో, (తదా=అప్పుడు) విద్యుత్=(గర్జన సహితమైన) మెఱుపు, వాశ్రేవ=(వాయువులను గూర్చి) ధ్వని చేయుచున్నది వలె, మిమాతి=ప్రకాశించుచున్నది. (అపి చ=మఱియు), మాతా వత్సం న=తల్లి వత్సను వలె, సిషక్తి=(వాయువులతో) కలియుచున్నది.

తాత్పర్యము: ఈ వాయువుల సంబంధమైన వర్షము కురిసినపుడు గర్జనముతోఁ గూడిన విద్యుత్తు ధ్వని చేయుచున్నదివలె ప్రకాశించుచున్నది. మఱియు తల్లి దూడనువలె వాయువులతోఁ గలియుచున్నది. క్షీరమును స్రవించుచున్న గోవు తన దూడను గూర్చి అమ్మాఁరవము చేయుచు మనుష్యులచేఁ జూడఁబడుచు దూడను గలియుచున్న విధముగ వర్షము కురియునపుడు మెఱుపు ధ్వని చేయుచు వాయువుతోఁ గలియుచున్నదని భావము. (ఇది రెండవ ఋక్కు. ఉపరితన మంత్రమునందలి 'మరుతః' అను శబ్దముయొక్క అర్థమే ఈ మంత్రమునందలి 'ఏషామ్' అను ఇదం శబ్దార్థము.)

20. అర్థము: హే మరుతః=ఓ వాయువులారా ఋష్టిమన్తః=వజ్రాయుధ వంతులైన, (యూయమ్=మీరు), యత్=ఎప్పుడు, క్రీడథ=క్రీడింతురో, (తదా=అప్పుడు), వః=మీయొక్క, స్వనే సతి=గర్జనము కలుగుచుండఁగా, మహి=తిర్యక్ప్రమాణముచే గొప్పదియు, వృద్ధః=ఊర్ధ్వ ప్రమాణముచేత ఉన్నతము నగు, పర్వతశ్చిత్=పర్వతము కూడ, బిభాయ=భయపడుచున్నది. (బిభాయ=బిభేతి. వర్తమానార్థమున లిట్ ఛాందసము.) దివశ్చిత్=ఉన్నత మగుటచే ద్యులోకమునకంటె ఉపరితలమున నున్న, సాను=కొండచఱియ, రేజత=కంపించుచున్నది. (రేజత=రేజతే=కమ్పతే ఇతి విద్యారణ్యమ్.) (కిం చ=మఱియు, యూయమ్=మీరు), అప ఇవ=ఉదకములవలె, సధ్రియఞ్చః=వ్యాపకులువలె నున్నవా రగుచుఁ గ్రీడించుచున్నవారునై, ధవధ్వే=పరుగిడుఁడు.

తాత్పర్యము: ఓ వాయువులారా: వజ్రాయుధము కలిగియున్న మీరు క్రీడించుసమయమున గర్జనము కలుగుచుండఁగా గొప్పదియు, ఉన్నతమునైన పర్వతము కూడ భయపడుచుండును. ఉన్నత మగుటచే నూర్ధ్వలోకమున కుపరితలమున నున్న పర్వత సానువు కూడ కంపించుచుండును. మఱియు మీరు ఉదకములవలె వ్యాపించుచున్నవారువలె క్రీడించుచున్నవారలై పరుగిడుఁడు. ఇటువంటి వాయువులతోఁ గూడియున్న పునర్నవా ధూమము వృష్టిని గలిగించుఁగాక యని తాత్పర్యార్థము. (ఇది మూఁడవ ఋక్కు. క్రీడథ=క్రీడత. సాను శబ్దము పుంలిఙ్గమైనను ఇచట నపుంసకముగా ప్రయుక్తమైనది.)

21. అర్థము: (హే అశ్వ! ఓ గుఱ్ఱమా!), అభిక్రన్ద=అంతటను శబ్దము చేయుము. స్తనయ=మేఘ గర్జితమువలె నున్నత ధ్వనిని జేయుము. (కించ=మఱియు), ఉదన్వతా=ఉదకము కలిగియున్న, రథేన=రథ సదృశ మేఘముతోఁ గూడ, పరిదీయ=అంతటను వెళ్లుము. గర్భమ్ అధాః=(మేఘముయొక్క ఉదరమునందు) జలరూప గర్భమును గలుగఁజేయుము. విషితమ్=విముక్త ద్వారము కలదియు, న్యఞ్చమ్=అడ్డముగాఁ జేయఁబడినదియునగు, దృతిమ్=చర్మమయ జలాధార సదృశమైన మేఘమును, సుకర్ష=సుఖముగ నాకర్షింపఁబడినదిగఁ జేయుము. నిపాదాః=పల్లపుఁ బ్రదేశములు, (ఉదకపూర్ణాః=నీటితో నిండినవై), ఉద్వతా=ఉన్నత స్థలముతో, సమాః=సమానములు, భవన్తు=అగుఁగాక.

తాత్పర్యము: ఓ యశ్వమా! అంతటను శబ్దము చేయుము. మేఘ గర్జితమువలె ఉచ్చధ్వని చేయుము. మేఘము యొక్క ఉదరమునందు జలరూప గర్భమును గలుగఁజేయుము. మఱియు ఉదకము కలిగియున్న రథ

సదృశ మేఘముతోఁ గూడ సంతతను పొమ్ము. విముక్త ద్వారము కలదియు, అడ్డముగాఁ జేయఁబడి నదియునగు మేఘమును సుఖముగ నాకర్షితముగఁ జేయుము. నిమ్నప్రదేశములు కూడ ఉదకములతో నిండినవై ఉన్నత ప్రదేశముతో సమానము లగుఁగాక. అధిక వర్షము కలుగుఁగాక యని భావము. (తూర్పుదిక్కునందు పశ్చిమ ముఖముగానున్న నల్లని గుఱ్ఱమును ఈ మంత్రము చెప్పుచు కృష్ణవస్త్రముతో నాచ్ఛాదించవలెను.)

22. అర్థము: అజర!=వినాశ రహితుఁడవైన, హే అగ్నే!=ఓ యగ్నీ!, యత్ వనా=ఏ ఉదకములు, తే=నీకు, ధామాహ=స్థానములై, శిక్వసః=కాంతులను, వృశ్చన్తి=నశింపఁజేయుచున్నవో, త్వమ్=నీవు, త్యాచిత్=ఆ ఉదకములను గూడ, అచ్యుతా=నాశ రహితములనుగా, యవసే=తృణము (గడ్డి), భక్షితే సతి=భక్షింపఁబడిన దగుచుండఁగా, పశుర్న=పశువువలె, (కురు=చేయుము.) (వనా=వనాని, ధామా=ధామాని. 'వనా' 'ధామా' త్యా=త్యాని, అచ్యుతా=అచ్యుతాని, ఇత్యాది పదములు లుప్త విభక్త్యంతములు.)

తాత్పర్యము: నాశ రహితుఁడవైన ఓ యగ్నీ! ఏ ఉదకములు నీకు స్థానము లైనను కాంతులను నశింపఁజేయుచున్నవో, నీవు ఆ యుదకములను గూడ గడ్డిని మేయుచున్న పశువువలె నాశ రహితములుగాఁ జేయుము. పశువు గడ్డి తిని (నశింపఁజేసి) క్షీరమును నశింపఁజేయని విధముగా నీకు స్థానములైన ఉదకములు నీ కాంతులను నశింపఁజేయుచున్నను, నీవు మాత్రము ఆ యుదకములను నశింపఁజేయుట లేదని దృష్టాంతము. ("అథాగ్నయే ధామచ్ఛదే పురోడాశ మష్టాకపాల" మిత్యాదికముచే విధింపఁబడిన హవిస్సుల కిచట యాజ్య పురోనువాక్యలు చెప్పఁబడుచున్నవి. వానిలో ప్రథమ హవిస్సున కిది పురోనువాక్య.)

23. అర్థము: జాతవేదః!=జాతమైన సర్వజగత్తును దెలిసినవాఁడవును, దేవ!=ప్రకాశించు స్వభావము కలవాఁడవును, స్వధావః!=అన్నము కలవాఁడవు నగు, హే అగ్నే!=ఓ యగ్నీ!, అమృతస్య=మరణరహితుఁడవైన, తవ=నీయొక్క, ధామ (ధామాని) స్థానములు, భూరీణి=అనేకములు. చ=మఱియు, విశ్వమిన్వ!=విశ్వమును తృప్తిపఱచువాఁడవును, హే పృష్టబంధో!=అడుగఁబడినవాఁడవై బంధువుగానైన ఓ యగ్నీ! మాయినామ్=ఐన్ద్రిజాలికులకు, యాః మాయాః=ఏ మాయలు, (సన్తి=కలవో) పూర్వీః=అనాది సంప్రదాయాగతములైన, (తాః=ఆ మాయలు), త్వే=నీయందు, సందధుః=బాగుగ స్థాపించఁబడియున్నవి.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు నాశము లేనివాఁడవు. నీ కనేక స్థానములు కలవు. పుట్టినజగత్తు నంతటిని తెలిసినవాఁడవు. స్వధా శబ్ద వాచ్యమైన అన్నము కలవాఁడవు. విశ్వమును తృప్తిపఱచువాఁడవు. "నీ మహిమ యెట్టిది?" అని యడిగినవానితో స్నేహము చేయువాఁడవు. అట్టి నీయందు ఐన్ద్రిజాలికులకుఁ గల అనాది సంప్రదాయాగతములైన మాయ లన్నియుఁ గలవు. (పూర్వోక్త హవిస్సున కిది యాజ్య.)

24. అర్థము: హే మరుతః!=ఓ వాయువులారా!, నః=మాకొఱకు, దివః=స్వర్గమునుండి, వృష్టిమ్=వర్షమును, రరీధ్వమ్=ప్రవింపఁజేయుఁడు. అశ్వస్య=వ్యాప్తిమంతుఁడును, వృష్ణః=వర్షింపఁజేయువాఁడునగు నింద్రుని (యొక్క) సంబంధములైన, ధారాః=ఉదక ధారలను, ప్రపిన్వత=ఎక్కువగ స్రవింపఁజేయుఁడు. హే వృషన్!=ఓ యింద్రా!, అసురః=ప్రాణముల నొసఁగువాఁడవును, నః=మాకు, పితా=పాలకుఁడవునగు నీవు, అపః=ఉదకములను, నిషిఞ్చన్=మిక్కిలి స్రవింపఁజేయుచు, ఏతేన=ఈ, స్తనయిత్నునా=గర్జించుచున్న మేఘముతోఁ గూడ, అర్వాఙ్=అంబరమునుండి అభిముఖముగా, ఏహి=రమ్ము. (అసూన్ రాతీతి 'అసురః', 'రా'=దానే, ప్రాణముల నొసఁగువాఁడని వ్యుత్పత్త్యర్థము.)

తాత్పర్యము: ఓ వాయువులారా! మీరు మాకై ద్యులోకమునుండి వర్షము స్రవింపఁజేయుఁడు. పిమ్మట వ్యాప్తిమంతుఁడును వర్షింపఁజేయువాఁడును నగు నింద్రుని సంబంధములైన ఉదక ధారలను స్రవింపఁజేయుఁడు. ఓ యింద్రుఁడా! ప్రాణముల నొసఁగువాఁడవును, మాకు పాలకుఁడవు నగు నీవు ఉదకములను మిక్కిలి స్రవింపఁజేయుచు ఈ గర్జించుచున్న మేఘముతోఁ గూడ అంబరమునుండి అభిముఖముగ రమ్ము. (ఇది ద్వితీయ హవిస్సునకు పురోనువాక్య.)

25. అర్థము: సుదానవః=బాగుగ దానమునం దాసక్తములైన, మరుతః=వాయువులు, విదథేషు=యజ్ఞములందు, అభువః=ఋత్విగ్యజమానులు, పయోవత్=ఉదకమువలెను, ఘృతవత్=నేయివలెను, అపః=ఉదకములను, పిన్వన్తి=స్రవింపఁజేయుచున్నవి. అత్యం న=అశ్వమునువలె, మిహే=సేచనమునకై, వాజినమ్=వేగవంతమైన మేఘమును, వినయన్తి=విధేయముగాఁ జేయుచున్నవి. (విధేయీకృత్య=విధేయముగాఁ జేసి), అక్షితమ్=నాశరహితముగ, స్తనయన్తమ్=గర్జించుచున్న మేఘమును, ఉత్సం దుహన్తి=నిరంతర జలస్రావ మగునట్లుగ వర్షింపఁజేయుచున్నవి.

తాత్పర్యము: బాగుగ దానము చేయుటయం దాసక్తములైన వాయువులు యజ్ఞములందు నీటిని నేతిని ఋత్విగ్యజమానులు స్రవింపఁజేయు విధముగ ఉదకములను స్రవింపఁజేయుచున్నవి. అశ్వ శిక్షకులు అశ్వమును శిక్షించి విధేయముగఁ జేసికొనువిధముగ వాయువులు వర్షమునకై మేఘమును విధేయముగఁ జేసికొని, గర్జించుచున్న మేఘమును క్షయ రహితముగ నిరంతర జలస్రావము కలుగునట్లు వర్షింపఁజేయుచున్నవి. (అత్యేతి సర్వాన్ పశూనితి అత్యః, అని బ్రాహ్మణమునందు నిర్వచించఁబడినది. సర్వ పశువుల నతిక్రమించునది యని అత్య శబ్ద వ్యుత్పత్తి. పూర్వోక్త హవిస్సున కిది యాజ్య.)

26. అర్థము: హే ఋత్విగ్యజమానాః!=ఓ ఋత్విగ్యజమానులారా!, యే విశ్వే మరుతః=ఏ సమస్తమైన వాయువులు, జునన్తి=వర్షము నిచ్చుచున్నవో, ఉదప్రుతః=ఉదకదాతలైన, తాన్ మరుతః=ఆ వాయువులను, గర్దా కన్యా=బుభుక్షితయైన కన్య, తున్నా=(ఆఁకలి) బాధ కలదై, క్రోశాతీవ=ఏడ్చుచున్నదివలె, ఇయర్త=ప్రార్థించుఁడు. పేరుమ్=పానాది కామయైన కన్యను, తుఞ్జానా=ఏడువకుము, నీకేమి కావలెను? అని అడుగుచున్న, పత్యా సహ జాయేవ=భర్తతోఁ గూడిన భార్యవలె, (మరుతః=వాయువులు, ఋత్విగ్యజమానాన్=ఋత్విగ్యజమానులను, అను గృహ్ణన్తి=అనుగ్రహించుచున్నవి).

తాత్పర్యము: ఓ ఋత్విగ్యజమానులారా! మీరు ఉదకదానము చేయు సర్వ వాయువులను ఆఁకలిగొని బాధపడుచున్న కన్య ఆక్రోశించుచున్నవిధముగ ప్రార్థించుఁడు. పానాదులందు కోరిక కలిగి యేడ్చుచున్న కన్యను 'ఏడువకు. నీకేమి కావలెను?' అని అడుగుచున్న తల్లిదండ్రులవలె వాయువులు ప్రార్థించుచున్న ఋత్విగ్యజమానుల ననుగ్రహించు నని భావము. (క్రోశాతి=క్రోశతి. పూర్వోక్త హవిస్సునకే యిది మఱొకపురోనువాక్య.)

27. అర్థము: హే మరుతః!=ఓ వాయువులారా!, ఘృతేన=ఆజ్య సదృశమైన, మధునా=మధురమైన జలముతో, ద్యావా పృథివీ=ద్యావా పృథివీ లోకములను, సముక్షత=బాగుగ సేచనము చేయుఁడు. (తడుపుఁడు. యాః) అపః=ఏ ఉదకములు. (భూమౌ ఉక్షితాః=భూమియందు చల్లఁబడినవో, తాభిః=ఆ ఉదకములచే), ఓషధీః=ఓషధులను, పయస్వతీః=సారము కలవిగా, కృణుత=చేయుఁడు. నరః!=జలమునకు నాయకులైన (జలమును పొందించునట్టి), హే మరుతః!=ఓ వాయువులారా!, యత్రా=ఏ ప్రదేశమునందు, మధు=మధురమైన ఉదకమును, పిన్వథ=స్రవింపఁజేయుచున్నారో, తత్ర=ఆ దేశమునందు, ఊర్జమ్=సారవంతమైన అన్నమును, చ=మఱియు, సుమతిమ్=శోభన బుద్ధియుక్త ప్రజను, పిన్వథ=సంపాదింపఁ జేయుఁడు. (యత్రా=యత్ర.)

తాత్పర్యము: ఓ వాయువులారా! మీరు మధుర జలముతో ద్యావాభూములను దడుపుఁడు. భూమియందు స్రవించిన జలముచే నోషధులను సారవంతములుగాఁ జేయుఁడు. జలమునకు నాయకు లయిన వాయువులారా! మధురోదకమును వర్షించిన దేశమునందు సారవంతమైన యన్నమును, మంచి బుద్ధి కలిగిన ప్రజను సంపాదింపఁ జేయుఁడు. (పూర్వోక్త హవిస్సునకే యిది మఱొక యాజ్య.)

28. అర్థము: తృతీయ హవిస్సునకు "ఉదుత్యమ్". "చిత్రమ్" అనునవి యాజ్యా పురోనువాక్యలకు ప్రతీకములు. అనఁగా "ఉదుత్యం జాతవేదసమ్" ఇత్యాది మంత్రమునకు "ఉదుత్యమ్" అనునది ప్రతీకము. "చిత్రం దేవానామ్" ఇత్యాది మంత్రమునకు "చిత్రమ్" అనునది ప్రతీకము. ఈ ఉభయము ప్రథమ కాండము యొక్క చతుర్థ ప్రపాఠకమునందు వ్యాఖ్యాతము.

29. అర్థము: ఔర్వ భృగువత్=ఔర్వ భృగు మహర్షులవలెను, అప్రవానవత్=అప్రవాన మహర్షివలెను, శుచిమ్=శుచియైన వాఁడును, సముద్రవాససమ్=సముద్రమునందు నివసించుచున్న వాఁడునగు, అగ్నిమ్=అగ్నిని, (ఉద్దిశ్య=ఉద్దేశించి), ఆహువే=అంతటను హోమము చేయుచున్నాను.

తాత్పర్యము. ఔర్వాది మహర్షులవలె శుచియైన వాఁడును, సముద్ర నివాసియు నగు నగ్ని నుద్దేశించి అంతటను హోమము చేయుచున్నాను. (స్విష్టకృదగ్ని కెదుట స్రువాహుతులను ఈ మంత్రము చెప్పుచు హోమము చేయవలెను. ఇట్లు మూఁడు ఆహుతులను హోమము చేయవలెను. వానిలో నిది మొదటి యాహుతి.)

30. అర్థము: సవితుః=సూర్యునియొక్క, సవమివ=సంతానమువలెను, భగస్య=ఐశ్వర్యముయొక్క, భుజిమివ=భోగము వలెను ఉన్న వాఁడును, సముద్రవాససమ్=సముద్రమునందు నివసించుచున్న వాఁడునగు, అగ్నిమ్=అగ్నిని (ఉద్దేశించి), ఆహువే=అంతటను హోమము చేయుచున్నాను.

తాత్పర్యము: సూర్యునియొక్క సంతానమువలె నున్న వాఁడును, ఐశ్వర్యముయొక్క భోగమువలె నున్న వాఁడును, సముద్ర నివాసియు నగు నగ్ని నుద్దేశించి అంతటను హోమము చేయుచున్నాను. (పూర్వోక్తములైన ఆహుతులలో నిది రెండవది.)

31. అర్థము: వాతస్వనమ్=వాయువువలె జ్వాలాది ధ్వని కలవాఁడును, కవిమ్=విద్వాంసుఁడును, పర్జన్యక్రంద్యమ్=మేఘమువలె (నందఱిచే) అపేక్షణీయుఁడును, సహః=బలవంతుఁడును, సముద్రవాససమ్=సముద్ర నివాసియు నగు, అగ్నిమ్=అగ్ని నుద్దేశించి, హువే=హోమము చేయుచున్నాను.

తాత్పర్యము: అగ్ని జ్వలించునపుడు ధ్వని యేర్పడును కనుక వాయువువలె జ్వాలాది ధ్వని కలవాఁడు. విద్వాంసుఁడు. సర్వప్రాణులు మేఘము నపేక్షించునట్లు అగ్ని నపేక్షించుదురు. బలవంతుఁడు. సముద్ర నివాసి. అట్టి అగ్ని నుద్దేశించి హోమము చేయుచున్నాను. (పూర్వోక్తములైన ఆహుతులలో నిది మూఁడవది.)

ఏకాదశానువాకము సమాప్తము.

తృతీయకాండమునందు ప్రథమ ప్రపాఠకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ద్వితీయః ప్రపాఠకః।

### తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]యో వై పవమానానా మన్వారోహా న్విద్వా న్యజతే ఽను పవమానా నారోహతి న పవమానేభ్యో ఽవచ్ఛిద్యతే శ్యేనోఽసి గాయత్రచ్ఛన్దా అను త్వా ఽఽరభే స్వస్తి మా సం పారయ సువర్ణో ఽసి త్రిష్టుప్ఛన్దా అను త్వా ఽఽరభే స్వస్తి మా సం పారయ సఘాఽసి జగతీచ్ఛన్దా అను త్వా ఽఽరభే స్వస్తి మా సం పారయేత్యాహైతే (౧)వై పవమానానా మన్వారోహాస్తాన్య ఏవం విద్వా న్యజతే ఽను పవమానా నారోహతి న పవమానేభ్యో ఽవచ్ఛిద్యతే [2]యో వై పవమానస్య సంతతిం వేద సర్వ మాయు రేతి న పురా ఽఽయుషః ప్ర మీయతే పశుమా న్భవతి విన్దతే ప్రజాం పవమానస్య గ్రహా గృహ్యన్తే ఽథ వా అస్యైతే ఽగృహితా ద్రోణకలశ ఆధవనీయః పూతభృ త్తాన్యదగృహీత్వోపాకుర్యా త్పవమానం వి(౨)ఛిన్ద్యాత్తం విచ్ఛిద్యమాన మధ్వర్యోః ప్రాణో ఽను విచ్ఛిద్యేతో[3]పయామగృహీతో ఽసి ప్రజాపతయే త్వేతి ద్రోణకలశ మభి మృశే దిన్ద్రాయ త్వేత్యాధవనీయం విశ్వేభ్య స్త్వా దేవేభ్య ఇతి పూతభృతం పవమాన మేవ తత్సం తనోతి సర్వ మాయు రేతి న పురా ఽఽయుషః ప్ర మీయతే పశుమా న్భవతి విన్దతే ప్రజామ్ ॥౩॥ (ఏతే వి ద్విచత్వారిగ్ంశచ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠకే ప్రథమోఽనువాకః।

### వేదార్థదీపిక

అవతారిక: ప్రకృతి యాగమునందు దీక్ష నారంభించి బహిష్పవమానాంతము వఱకుఁ గల కర్మ కలాపము ప్రథమ ప్రపాఠకము నందు విహిత మైనది. ఈ ద్వితీయ ప్రపాఠకమునందు పవమాన గ్రహాదికము తెల్పఁబడుచున్నది.

1. **అర్థము:** యో వై=ఏ యజమానుఁడైతే, పవమానానామ్=పవమాన స్తోత్రములయొక్క, అన్వారోహాన్=అనుక్రమముగ పొందుటలను, విద్వాన్=తెలిసికొనినవాఁడై, యజతే=యాగము చేయుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు), పవమానాన్=పవమాన స్తోత్రములను, అన్వారోహతి=అనుక్రమముగ పొందుచున్నాఁడు. పవమానేభ్యః=పవమానములనుండి, నావచ్ఛిద్యతే=విచ్ఛిన్నుఁడగుట లేదు. (హే బహిష్పవమాన!=ఓ, బహిష్పవమానమా!, త్వమ్=నీవు), శ్యేనః అసి=డేఁగవలె శీఘ్రగతి వగుచున్నావు. గాయత్రీచ్ఛన్దాః=గాయత్రీ చ్ఛన్దస్సు కలదానవు (కూడ), అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన), త్వా=నిన్ను, అన్వారభే=అనుక్రమముగ పొందుచున్నాను. స్వస్తి=నిర్విఘ్నముగ, మామ్=నన్ను, సంపారయ=బాగుగ పారము నొందించుము. (హే మాధ్యందిన పవమాన!=ఓ మాధ్యందిన పవమానమా! త్వమ్=నీవు), సుపర్ణః అసి=గరుత్మంతుఁడువలె పైకెగురుటకు సమర్థ మగుచున్నావు. త్రిష్టుప్ఛన్దాః=త్రిష్టుప్ ఛన్దస్సు కలదానవు (కూడ), అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, అన్వారభే=అనుక్రమముగ పొందుచున్నాను. స్వస్తి=నిర్విఘ్నముగ, మా=నన్ను సంపారయ=బాగుగ పారము నొందించుము. (హే అర్భవ పవమాన!=ఓ అర్భవ పవమాన స్తోత్రమా!, త్వమ్=నీవు, సఘా అసి=ఖాస నామక పక్షివలె పడుటకు సమర్థ మగుచున్నావు. జగతీచ్ఛన్దాః=జగతీ చ్ఛన్దస్సు కలదానవు (కూడ), అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, అన్వారభే=అనుక్రమముగ పొందుచున్నాను. స్వస్తి=నిర్విఘ్నముగ, మామ్=నన్ను, సంపారయ=బాగుగ పారము నొందించుము. ఇతి ఆహ=అని 'శ్యేనోఽసీ'త్యాది మంత్ర త్రయము చెప్పెను. ఏతే వై=ఇవియే, పవమానానామ్=పవమాన స్తోత్రములయొక్క, అన్వారోహాః=అనుక్రమముగ పొందుటలు. తాన్=ఆ అన్వారోహములను, యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ పూర్వోక్త విధముగ, విద్వాన్=తెలిసికొనినవాడై, యజతే=యాగము చేయుచున్నాఁడో, (సః=అతఁడు), పవమానాన్=పవమాన స్తోత్రములను, అన్వారోహతి=అనుక్రమముగ పొందును. పవమానేభ్యః=పవమానములనుండి, న అవచ్ఛిద్యతే=విచ్ఛిన్నుఁడగుటలేదు.

**తాత్పర్యము:** బహిష్పవమానము, మాధ్యందిన పవమానము, అర్భవ పవమానము అని పవమాన స్తోత్రములు మూఁడు విధములుగా సామవేదమునందు చెప్పఁబడినవి. ఆ పవమాన స్తోత్రములను "శ్యేనోఽసీ"త్యాది మంత్రములచే ననుక్రమముగ పొందు యజమానుఁడు పవమాన స్తోత్రములనుండి విచ్ఛిన్నుఁడు కాఁడు. తదనుగ్రహము కలవాఁ డగును. [1]ఓ బహిష్పవమాన స్తోత్రమా! నీవు డేఁగవలె శీఘ్రగమనము కలదానవు, గాయత్రీ చ్ఛన్దస్కము నగుచున్నావు. నిన్ను నే ననుక్రమముగ పొందుచున్నాను. నిర్విఘ్నముగ నన్ను ఈ కర్మయొక్క పారమును పొందించుము. [2]ఓ మాధ్యందిన పవమాన స్తోత్రమా! నీవు గరుత్మంతునివలె పైకెగురుటకు సమర్థ మగుచున్నావు. త్రిష్టుప్ ఛన్దస్సు కలదానవు. నిర్విఘ్నముగ నన్ను ఈ కర్మయొక్క పారమును పొందించుము. [3]ఓ అర్భవ పవమాన స్తోత్రమా! నీవు ఖాసనామక పక్షివలె పడుటకు సమర్థ మగుచున్నావు. జగతీ చ్ఛన్దస్సు కలదానవు. శేషము పూర్వవత్తు. పవమానముల అన్వారోహముల నీ విధముగ తెలిసికొని యాగము చేసిన యజమానుఁడు పవమానములను అనుక్రమముగ పొందును. పవమానములనుండి విచ్ఛిన్నుఁడుఁ కాఁడు. (యజమానుఁడు బహిష్పవమాన స్తోత్రమునకు ముందు "వసైవ్య హిం కురు" ఇత్యాది మంత్రమును జపించవలెను. పిమ్మట "శ్యేనోఽసీ" త్యాది మంత్రమును "ఉపాస్మై గాయతే"త్యాది స్తోత్రీయములైన ఋక్కులు తొమ్మిదింటిలో నైదవదియైన మధ్యమ స్తోత్రీయము గానము చేయఁబడుచుండఁగా జపించవలెను. [2]"సుపర్ణోఽసీ"త్యాది రెండవ మంత్రమును "ఉచ్చాతే జాత"మిత్యాది మాధ్యందిన పవమాన స్తోత్రమునందు అయిదవదైన మధ్యమ ఋక్కు గానము చేయఁబడుచుండఁగా జపించవలెను. [3]"సఘాఽసీ"త్యాది తృతీయ మంత్రమును "స్వాదిష్ఠయే"త్యాద్యార్భవ పవమాన స్తోత్రమునందు అయిదవదైన మధ్యమ ఋక్కు గానము చేయఁబడుచుండఁగా గానము చేయవలెనని కల్పసూత్రోక్తి.)

2. **అర్థము:** యో వై=ఏ యజమానుఁడైతే, పవమానస్య=బహిష్పవమాన మాధ్యందిన పవమానేత్యాది శబ్దములచేఁ జెప్పఁబడు స్తోత్ర విశేష త్రయ రూపమైన పవమానముయొక్క, సంతతిమ్=అవిచ్ఛేద ప్రకారమును, వేద=**తెలిసికొనుచున్నాఁడో, సః=ఆ** యజమానుఁడు, సర్వమ్ ఆయుః=నిర్దిష్టమైన సంపూర్ణాయువును, ఏతి=

పొందుచున్నాఁడు. ఆయుషః పురా=విధి లిఖితమైన ఆయుః పరిమితికి ముందు, న ప్ర మీయతే=మరణించుట లేదు. పశుమాన్=పశు సంపద కలవాఁడు, భవతి=అగుచున్నాఁడు. ప్రజామ్=సంతానమును, విన్దతే=పొందుచున్నాఁడు. పవమానస్య=పవమాన సంబంధములైన, గ్రహాః=ద్రోణకలశాది గ్రహములు, గృహ్యన్తే=(ఐన్ద్రి వాయవాది గ్రహములవలె మంత్రములచే) గ్రహించఁబడుచున్నవి. అథవా=లేదా, అస్య=ఈ పవమాన సంబంధములైన, ఏతే=ఈ, ద్రోణకలశః, ఆధవనీయః, పూతభృత్=ద్రోణకలశము, ఆధవనీయము, పూతభృత్తు అనెడి గ్రహములు, అగృహీతాః=మంత్రములచే గ్రహింపఁబడనివి. (కిం తు=కాని) అగృహీత్వా=మంత్రములచే గ్రహించక, యదుపాకుర్యాత్=ఉపాకరణము (అభిమర్శనము) చేయుచో, (సః=ఆ అధ్వర్యుఁడు), పవమానమ్=పవమానమును, విచ్ఛిన్ద్యాత్=విచ్ఛిన్నము చేసినవాఁడగును. తం విచ్ఛిద్యమానమ్ అను=విచ్ఛిన్న మగుచున్న ఆ పవమానము ననుసరించి, అధ్వర్యోః ప్రాణః=అధ్వర్యునియొక్క ప్రాణము, విచ్ఛిద్యేత=విచ్ఛిన్న మగును.

**తాత్పర్యము:** బహిష్పవమానాది శబ్దములచేఁ జెప్పఁబడు స్తోత్ర విశేష త్రయ రూపమైన పవమానముయొక్క అవిచ్ఛేద ప్రకారమును తెలిసికొనిన యజమానుఁడు విధి లిఖితమైన సంపూర్ణాయువును పొందును. మధ్యకాలమున అపమృత్యువుచే మరణించఁడు. అతఁడు పశుమంతుఁడు ప్రజావంతుఁడు నగును. పవమాన సంబంధములైన ద్రోణకలశాది గ్రహములు మూఁడింటిని ఐంద్ర వాయవాది గ్రహములవలె మంత్రములచే గ్రహించవలెను. లేదా ద్రోణకలశము, ఆధవనీయము, పూతభృత్తు అను నీ మూఁడు గ్రహముల గ్రహణమునకు ప్రత్యేకముగ మంత్రములు లేవు కనుక మంత్రములచే గ్రహించ నవసరము లేదు. అయినను మంత్రములచే గ్రహించనిచో నధ్వర్యుఁడు పవమానమును విచ్ఛిన్నము చేసినవాఁడగును. విచ్ఛిన్న మగుచున్న పవమానము ననుసరించి అధ్వర్యుని ప్రాణము విచ్ఛిన్న మగును. కావున ద్రోణకలశాది పవమాన గ్రహములను మంత్రములచే గ్రహించవలెను. (ద్రోణకలశాదుల యభిమర్శనమును విధించుటకు ముందు ఇచట తత్ప్రస్తుతి చేయఁబడినది.)

3. **అర్థము:** (హే సోమరస!=ఓ సోమరసమా! త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=మృణ్మయమైన ద్రోణకలశముచే గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, ప్రజాపతయే=ప్రజాపతికొఱకు, అభి మృశామి=అభిమర్శించుచున్నాను. (తాఁకుచున్నాను.) ఇతి=అను మంత్రముచే, ద్రోణకలశమ్=ద్రోణకలశమును, అభిమృశేత్=అభిమర్శించవలెను. (హే సోమరస!=ఓసోమరసమా!, త్వమ్=నీవు), ఉపయామ గృహీతః=మృణ్మయమైన ఆధవనీయ పాత్రముచేత గ్రహింపఁబడినదానవు, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, (అభి మృశామి=అభిమర్శించుచున్నాను), ఇతి=అను మంత్రముచే, ఆధవనీయమ్=ఆధవనీయ పాత్రమును. అభి మృశేత్=అభిమర్శించవలెను. (హే సోమరస!=ఓ సోమరసమా!, త్వమ్=నీవు), ఉపయామ గృహీతః=మృణ్మయమైన పూతభృత్పాత్రముచేత గ్రహించఁబడిన దానవు, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, విశ్వేభ్యః దేవేభ్యః=విశ్వేదేవతలకొఱకు, (అభి మృశామి=అభిమర్శించుచున్నాను. ఇతి=అనెడి మంత్రముచేత, పూతభృతమ్=పూతభృత్పాత్రమును, అభి మృశేత్=అభిమర్శించవలెను. తత్=ఆ పాత్ర త్రయాభిమర్శనముచేత, అధ్వర్యుః=అధ్వర్యుఁడు), పవమానమ్=పవమానమును, సంతత్యేవ=అవిచ్ఛిన్నముగనే చేసినవాఁడగును. (తదా=అప్పుడు), సర్వమ్=సమస్త (సంపూర్ణ) మైన, ఆయుః=ఆయువును, ఏతి=పొందును. ఆయుషః పురా=విధిలిఖితాయుః పరిసమాప్తికి పూర్వము, న ప్రమీయతే=మరణించుట లేదు. పశుమాన్=పశువులు కలవాఁడు, భవతి=అగును. ప్రజామ్=సంతానమును, విన్దతే=పొందును.

**తాత్పర్యము:** ఇచట మంత్రములచే ద్రోణకలశాది పాత్రత్రయాభిమర్శనము విధింపఁబడుచున్నది. ఓ సోమరసమా! నీవు మృణ్మయమైన ద్రోణకలశముచే గ్రహింపఁబడినదాన వగుచున్నావు. అట్టి నిన్ను ప్రజాపతికొఱకు అభిమర్శించుచున్నాను, అను మంత్రముచేత ద్రోణకలశము నభిమర్శించవలెను. ఇట్లే ఇంద్రునికొఱకు ఆధవనీయమును, విశ్వేదేవతలకొఱకు పూతభృత్పాత్రమును అభిమర్శించుచున్నాను, అను మంత్రములచే వరుసగా ఆధవనీయమును పూతభృత్తును అభిమర్శించవలెను. ఆ యభిమర్శనముచే నధ్వర్యుఁడు పవమానము నవిచ్ఛిన్నముగఁ జేసినవాఁడగును. అప్పు డతఁడు సంపూర్ణాయువును పొందును. ఆయుః పరిమితికి పూర్వము మరణించఁడు. పశుమంతుఁడు ప్రజావంతుఁడు కూడ నగును.

ప్రథమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

మూలము: [1]త్రీణి వావ సవనాన్యథ తృతీయగ్ం సవనమవ లుమ్పన్త్యనగ్ంశు కుర్వన్త ఉపాగ్ంశుగ్ం హుత్వోపాగ్ంశుపాత్రే ఽగ్ంశు మవాస్య తం తృతీయసవనే ఽపిసృజ్యాభిషుణుయా ద్యదాప్యాయ యతి తేనాగ్ంశుమ ద్యదభిషుణోతి తేనర్జీషి సర్వాణ్యేవ తత్సవనాన్యగ్ంశుమన్తి శుక్రవన్తి సమావద్వీర్యాణి కరోతి [2]ద్వౌ సముద్రౌ వితతావజూర్యౌ పర్యావర్తేతే జఠరేవ పాదాః। తయోః పశ్యన్తో అతి యన్త్యన్య మపశ్యన్తః (౧)సేతునాఽతి యన్త్యన్యమ్। ద్వే ద్రధసీ సతతీ వస్త ఏకః కేశీ విశ్వా భువనాని విద్వాన్। తిరోధాయైత్యసితం వసానః శుక్రమా దత్తే అను హాయ జార్యై।[3]దేవా వై యద్యజ్ఞే ఽకుర్వత తదసురా అకుర్వత తే దేవా ఏతం మహాయజ్ఞ మపశ్యన్త మతన్వతాగ్నిహోత్రం వ్రత మకుర్వత తస్మాద్ద్వివ్రతః స్యాద్ద్విర్హ్యగ్నిహోత్రం జుహ్వతి పౌర్ణమాసం యజ్ఞ మగ్నీషోమీయమ్ (౨)పశు మకుర్వత దార్శ్యం యజ్ఞ మాగ్నే యం పశు మకుర్వత వైశ్వదేవం ప్రాతఃసవన మకుర్వత వరుణప్రఘాసా న్మాధ్యందినగ్ం సవ నగ్ం సాకమేధా న్పితృయజ్ఞం త్ర్యమ్బకాగ్ం స్తృతీయసవన మకుర్వత తమేషా మసురా యజ్ఞ మన్వవాజిగాగ్ంసన్తం నాన్వవాయన్తే ఽబ్రువన్నధ్వర్తవ్యా వా ఇమే దేవా అభూ వన్నితి తదధ్వరస్యాధ్వరత్వం తతో దేవా అభవన్పరా ఽసురా [4]య ఏవం విద్వా న్త్సోమేన యజతే భవత్యాత్మనా పరాఽస్య భ్రాతృవ్యో భవతి ॥౩॥

(అపశ్యన్తో ఽగ్నీషోమీయ మాత్మనా పరా త్రీణి చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

## వేదార్థదీపిక

**అవతారిక:** ఈ ద్వితీయానువాకమునందు సవనములు నిరూపింపఁబడుచున్నవి.

1. **అర్థము:** సవనాని=సవనములు, త్రీణి వావ=మూఁడే కదా!. తృతీయం సవనమ్=తృతీయ సవనమును, అనంశు=సోమాంశు రహితముగ, కుర్వన్తః=చేయుచున్నవారై, అప ఘ్నన్తి=నశింపఁజేయుచున్నారు. (తతః=అందువలన), ఉపాంశుమ్=ఉపాంశు గ్రహమును, హుత్వా=హోమము చేసి, ఉపాంశుపాత్రే=ఉపాంశు పాత్రమునందు, అంశుమ్=సోమలతయొక్క అంశువును, అవాస్య=ఉంచి, తమ్=దానిని, తృతీయసవనే=తృతీయ సవనమునందు, అపిసృజ్య=(ఋజీషియందు వసతీవరీ నామక జలములతో) కలిపి, అభి షుణుయాత్=అభిషవము (నలఁగఁగొట్టి రసము తీయుట) చేయవలెను. యత్=ఎప్పుడు, ఆప్యాయయతి=(అధ్వర్యుఁడు వసతీవర్యుదకములతో), తడుపుచున్నాఁడో, తేన=ఆ ఆప్యాయనముచేత, అంశుమత్=(తృతీయ సవనము) సోమాంశు యుక్తము, (భవతి=అగుచున్నది.) యత్ అభిషుణోతి=సోమాంశువు నభిషవము చేసిన చో, తేన=ఆ అభిషవముచేత, ఋజీషే=ఋజీషియందు, సర్వాణ్యేవ తత్ సవనాని=సమస్తములైన ఆ సవనములనే, అంశుమన్తి=సోమాంశువు కలవిగాను, శుక్రవన్తి=సూయమాన సోమాంశు గత రసము కలవిగాను, సమావద్వీర్యాణి=తుల్యవీర్యము కలవిగాను, కరోతి=చేసినవాఁ డగును.

**తాత్పర్యము:** ప్రాతః సవనము, మాధ్యందిన సవనము, తృతీయ సవనము అని మూఁడు సవనములు కలవు. వానిలో ప్రాతః సవన, మాధ్యందిన సవనములందు సోమము అభిషవము చేయఁబడును. తృతీయ సవనమునందు సోమము అభిమతము కాదు. అట్లు సోమాంశు రహితముగ తృతీయ సవనమును చేసినవారు తృతీయ సవనమును నశింపఁజేసినవా రగుచున్నారు. తృతీయ సవనమునందు సోమము అభిషుతము కాదు కావున అది సవన పద వాచ్య మగుటకే అర్హము కాదు. ఈ దోషమును నివారించుటకై ఉపాంశు గ్రహమును హోమము చేసి ఆ ఉపాంశు పాత్రమందు అభిషుతము కాని సోమలతయొక్క అంశువు నుంచి దానిని తృతీయ సవనము నందు ఋజీషియందు వసతీవరీ సంజ్ఞక జలములతో కలిపి అభిషవము చేయవలెను. వసతీవర్యుదకములచే ఆప్యాయనము (తడుపుట) చేసినచో ఆ ఆప్యాయనముచేత తృతీయ సవనము అంశుమ న్త మగును. ఆ సోమాంశువును అభిషవము చేసినచో ఋజీషియందు సమస్త సవనములు అంశుమన్తములు, తద్గత రసవంతములు, తుల్య వీర్యవంతములుగాఁ జేసిన ట్లగును. (ప్రాతఃసవన గతమైన ఉపాంశు గ్రహ (పాత్ర) మందు సోమాంశు ప్రక్షేపము, తదంశువునకు తృతీయ సవనగతమైన అభిషవ సంసర్గము ఈ మంత్రముచే విధించఁబడినవి.)

2. **అర్థము:** ద్వౌ=ఆధవనీయ, పూతభృత్తులు రెండు, సముద్రౌ=సముద్రమువంటివి. వితతౌ=విస్తీర్ణములు. అజూర్యౌ=నాశనము లేనివి. జఠరాః=సముద్రముయొక్క ఉదరమునందలి, పాదాః ఇవ=పాదములవంటి తరంగముల వలె, ఆ వర్తేతే=ఆవృత్తము లగుచున్నవి. తయోః=అహోరాత్రములవంటి ఆ రెండింటిలో, అన్యమ్=అహస్సువంటి యితరమును, పశ్యన్తః=(ప్రేక్షకులు) చూచుచున్నవారై, అతియన్తి=దాఁటిపోవుచున్నారు. అన్యమ్=రాత్రివంటి ఇతరమును, అపశ్యన్తః=చూడనివారై, సేతునా=సేతువువంటి సాధనముచేత, అతి యన్తి=అతిక్రమించుచున్నారు. కేశీ=కేశసమాన రశ్మివంతుఁడైన, ఏకః=ఒక సూర్యుఁడు, విశ్వా భువనాని=సర్వ లోకములను, విద్వాన్=(తన కిరణములచే) ప్రకాశింపఁజేయుచున్నవాఁడై, సతతీ=సతతము అవిచ్ఛిన్నముగ నుంటున్న, ద్వే ద్రధసీ=రెండు అహోరాత్ర రూప వస్త్రములను, వస్తే=ఆచ్ఛాదనము చేయుచున్నాఁడు. తిరోధాయ=స్వాత్మరూపమును తిరోహితము చేసి, అసితమ్=రాత్రి రూపమైన నల్లని వస్త్రమును, వసానః=ఆచ్ఛాదించుచున్నవాఁడై, ఏతి=పోవుచున్నాఁడు. జార్యై=జీర్ణమైన రాత్రి యనంతరము, అనుహాయ=ఆ రాత్రిరూపమైన (మలిన) నల్లని వస్త్రమును విడచి, శుక్రమ్=అహోరూపమైన శ్వేత వస్త్రమును, ఆదత్తే=తీసికొనుచున్నాఁడు. ఏకః=ఒకటియైన ద్రోణకలశము అనియు నర్థము స్ఫురించుటచే నిచట ద్రోణకలశము ఆదిత్య రూపముగ స్తుతింపఁబడినది.

**తాత్పర్యము:** ద్రోణకలశాదులైన మూఁడు పాత్రములలోను ఆధవనీయ పూతభృ త్పాత్రములు రెండును రెండు సముద్రములు గాను, రెండు అహోరాత్ర రూపములుగాను ఆరోపింపఁబడినవి. చమస గణమునం దీ రెండు పాత్రములు పయస్సుతో నిండియుండును గాన వానియందు సముద్రత్వము ఆరోపింపఁబడినది. సముద్రముల వలె నవియు విస్తీర్ణము లైనవి. నాశము లేనివి. అనఁగా సముద్రమున పయస్సు శుష్కించదు. ఆధవనీయ పూతభృత్తులందుఁ గూడ నశించదు. సముద్రము మధ్యమున అలలు ఒకదానివెంట మఱియొకటి ఆవృత్త మగుచుండును. ఆధవనీయ పూతభృత్తులు కూడ ఒకటి ఒక పర్యాయము, ఇంకొకటి మఱియొక పర్యాయము ఉపయోగింపఁబడుచు నావృత్తము లగుచుండును. ఇట్లీ ఈ ఆధవనీయ పూతభృత్తులు అహోరాత్రములుగా నారోపింపఁబడినవి. అహోరాత్రములలో అహస్సునందు జనులు సర్వ పదార్థములను జూచుచున్నవారై గమ్యమును పొందుచున్నారు. రాత్రియందు పదార్థములను చూడలేనివారై ఏదియేని సేతువువంటి సాధనముచేత గమ్యముఁ జేరుకొనుచున్నారు. ఇటులనే హవిర్ధానమునకు పై భాగమున నీడమునం దుంచఁబడిన ఆధవనీయము తిరోహితమై యుండుటచే కనుపించుట లేదు. ఆ హవిర్ధానముయొక్క ఆచ్ఛాదనము లేని పై భాగమున నున్న పూతభృత్తు కనుపించుచుండుటచే అది యహస్సువంటిది. ఆధవనీయము రాత్రివంటిది. ఇఁక ద్రోణకలశము ఒకటి మాత్రము సూర్యుఁడుగా వర్ణింపఁబడినది. సూర్యుఁ డొక్కఁడు కేశ సదృశములైన కిరణములు కలవాఁడై, స్వరశ్మిచే సర్వలోకములను ప్రకాశింపఁజేయుచు అహోరాత్ర రూపములైన రెండు వస్త్రముల నాచ్ఛాదించుచున్నాఁడు. అందొకటి రాత్రిరూపమైన మలిన వస్త్రము. తాను అంతర్ధానుఁడై దాని నాచ్ఛాదించుచున్నాఁడు. రాత్రి గడచిన పిమ్మట దానిని పరిత్యజించి అహోరూప శ్వేత వస్త్రమును తీసికొనుచున్నాఁడు. ద్రోణకలశము సూర్యునివంటిదై హవిర్ధానమునకుఁ గ్రిందిభాగమున నున్నపుడు తిరోహిత మగుచున్నది. హారియోజన గ్రహణమునకై ఆ ప్రదేశమునుండి వెలుపలకుఁ దెచ్చినపుడు అవిర్భవించుచున్నది. సూర్యుఁడు రాత్రియందు తిరోహితుఁడు. అహస్సునందు ఆవిర్భవించుచున్నాఁడు. ఇట్లీ ద్రోణకలశము హవిర్ధానమునకు క్రింద నున్నపుడు తిరోహితము. వెలుపలకు తెచ్చినపుడు ఆవిర్భవించుచుండును. ఈ విధముగ ఆ ద్రోణకలశము ఆదిత్యరూపముగాను, ఆధవనీయ పూతభృత్తులు రెండు సముద్రములుగాను, రెండు అహోరాత్రములుగాను వర్ణింపఁబడినవి. ("ద్వౌ సముద్రా"విత్యాది మంత్రభాగముచే ఆధవనీయ పూతభృత్తులను, "ద్వే ద్రధసీ"త్యాది మంత్రభాగముచే ద్రోణకలశమును జూడవలెను. వస్తే– "వస–ఆచ్ఛాదనే"అను ధాతువు లడన్తము. ఉగ్వికరణి.)

3\. **అర్థము:** దేవాః వై–పూర్వము దేవతలు, యజ్ఞే–యజ్ఞమునందు, యత్–ఏ యంగమును, అకుర్వత–చేసిరో, తత్–దానిని, అసురాః–రాక్షసులు, అకుర్వత–చేసిరి. తే దేవాః–ఆ దేవతలు, ఏతమ్–ఈ సోమాఖ్యమైన, మహాయజ్ఞమ్–మహాయజ్ఞమును, అపశ్యన్–(అసురవిజయ సాధనముగా తెలిసికొనిరి) చూచిరి. తమ్–ఆ సోమ యాగమును, అతన్వత–(అసురులకుఁ దెలియనివిధముగ, ప్రచ్ఛన్నముగ) అనుష్ఠించిరి. అగ్నిహోత్రమ్–(జుహుమ ఇతి బహిః ప్రసిద్ధం కృత్వా) అగ్నిహోత్ర యాగమును జేయుదుమని బహిర్గతము చేసి, (రహసి) వ్రతమ్–రహస్యముగ దీక్షా వ్రతమును, అకుర్వత–చేసిరి. హి–ఎందువలన, ద్విః–రెండు మారులు (సాయం ప్రాత స్సమయములందు, బహిః–ప్రత్యక్షమున), అగ్నిహోత్రం జుహ్వతి–అగ్నిహోత్రము ననుష్ఠించుచున్నాఁడో, తస్మాత్–అందువలన, ద్వివ్రతః–సాయం ప్రాతః కాలములందు క్షీరపాన రూప వ్రతము కలవాఁడు, స్యాత్–అగును. (తథా–ఆ విధముగ), పౌర్ణమాసం యజ్ఞమ్–(ప్రసార్య)పౌర్ణమాస యాగము చేయుచున్నామని ప్రకటించి, అగ్నిషోమీయం పశుమ్ (రహసి) అకుర్వత–రహస్యముగ అగ్నిషోమీయ క్రతువు ననుష్ఠించిరి. (బహిః–ప్రత్యక్షముగ,) దార్శ్యం యజ్ఞమ్–దర్శయాగమును, (ప్రసార్య–చేయుచున్నామని ప్రకటించి), ఆగ్నేయం పశుమ్–ఆగ్నేయ క్రతువును, (రహసి–ప్రచ్ఛన్నముగ), అకుర్వత–చేసిరి. వైశ్వదేవమ్–చాతుర్మాస్యరూప వైశ్వదేవమును, (బహిః ప్రసార్య–బహిర్గతము చేసి,) ప్రాతః సవనమ్–ప్రాతః సవనమును, (రహసి–రహస్యముగ), అకుర్వత–చేసిరి. వరుణ ప్రఘాసాన్–వరుణ ప్రఘాసలను, బహిః ప్రసార్య–బహిర్గతము చేసి)మాధ్యం దినం సవనమ్, (రహసి)అకుర్వత–రహస్యముగ మాధ్యందిన సవనమును జేసిరి. సాకమేధాన్ పితృయజ్ఞం త్ర్యమ్బకాన్––సాకమేధ పితృయజ్ఞ త్ర్యంబకములను, (బహిః ప్రసార్య–బహిర్గతము చేసి), తృతీయసవనం రహసి అకుర్వత–రహస్యమున తృతీయ

సవనమును చేసిరి. అసురాః=అసురులు, ఏషామ్=ఈ దేవతల యొక్క, తం యజ్ఞమ్=ఆ యజ్ఞమును, అన్వవాజిగాంసన్=అనుక్రమముగఁ దెలిసికొనఁగోరిరి. తమ్=ఆ దేవతల యజ్ఞమును, నాన్వవాయన్=తెలిసికొనలేకపోయిరి. ఇమే దేవాః=ఈ దేవతలు, అ ధ్వర్తవ్యాః=హింసింప నశక్యులు, అభూవన్=అయిరి, ఇతి=అని, తే=ఆ యసురులు, అబ్రువన్=పరస్పరము అనుకొనిరి. తత్=ఆ కారణమువలన, అధ్వరస్య=అధ్వరమునకు (సోమయాగమునకు) అధ్వరత్వమ్=(న ధ్వర్యన్తే అనేన సోమేన అను వ్యుత్పత్తిచే) అధ్వరత్వము, సంపన్నమ్=సంపన్న మైనది. తతః=అధ్వరానుస్ఠానమువలన, దేవాః=దేవతలు, (విజయినః) అభవన్=విజయవంతులు అయిరి. అసురాః=అసురులు, పరా అభవన్=పరాభూతులు అయిరి.

తాత్పర్యము: పూర్వము దేవతలు అసురులను జయించుటకై యజ్ఞము చేసిరి. వా రా యజ్ఞమునం దే యే యంగము నుపయోగించిరో అసురులు కూడ విజయము నొందుటకై యజ్ఞము చేసి దేవతలు ఆచరించిన ప్రతి యంగమును ఆచరించిరి. అప్పుడు దేవతలు తమకు జయము కలుగకపోవుటచే జయోపాయమైన సోమ మనెడి ఒక మహాయజ్ఞమును కనుఁగొనిరి. వా రాయజ్ఞమును అసురులకు తెలియకుండునట్లు రహస్యముగ చేసిరి. మఱియు వారు అగ్నిహోత్ర క్రతువును జేయుచున్నామని బహిరంగముగఁ జెప్పి దీక్షా వ్రతమును జేసిరి. అగ్నిహోత్రమును ప్రాత స్సాయం సమయములు రెండింటియందును చేయవలెను. కావున తన్మధ్యకాలమున క్షీరపానరూప వ్రతమును సాయం ప్రాత స్సమయములం దనుష్ఠించవలెను. అప్పుడతఁడు ద్వివ్రతుఁ డగుచున్నాఁడు. అట్లే ఆ దేవతలు పౌర్ణమాస యజ్ఞము నాచరించుచున్నామని ప్రకటించి రహస్యముగ అగ్నీషోమీయ పశుకర్మ నాచరించిరి. దర్శయాగము చేయుచున్నామని బహిరంగముగ ప్రకటించి రహస్యముగ ఆగ్నేయ పశుకర్మ ననుష్ఠించిరి. చాతుర్మాస్య రూప వైశ్వదేవమును జేయుచున్నామని ప్రకటించి ప్రచ్ఛన్నముగ ప్రాతః సవనము నాచరించిరి. వరుణ ప్రఘాసలను జేయుచున్నామని బహిర్గతము చేసి రహస్యముగ మాధ్యందిన సవనము నాచరించిరి. అట్లే సాకమేధ, పితృయజ్ఞ, త్ర్యంబకముల నాచరించుచున్నామని చెప్పి రహస్యముగ తృతీయ సవనము నాచరించిరి. అప్పుడసురులు దేవతలు చేయుచున్న యజ్ఞము ననుక్రమముగ తెలిసికొనవలెనని తలంచిరి. కాని తెలిసికొనలేకపోయిరి. అప్పుడా యసురులు "దేవతలను హింసింప మనకు సాధ్యము కాదు" అని తమలోఁ దాము పరస్పరము చెప్పుకొనిరి. సోమయాగముచే నశింపఁజేయ నసాధ్యులు కావున సోమయాగమునకు అధ్వరత్వము సిద్ధించినది. ఆ యధ్వరము ననుష్ఠించుటవలన దేవతలు విజయులైరి. అసురులు పరాభూతులైరి. (సోమయాగ విధికి ముందుగా నిచట సోమయాగ ప్రశంస చేయఁబడినది.)

4. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, సోమేన యజతే=సోమయాగము చేయుచున్నాఁడో, అస్య=ఈ యజమానునియొక్క, భ్రాతృవ్యః=శత్రువు, ఆత్మనా=స్వయముగ, పరాభవతి=పరాభూతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ విధముగ తెలిసికొని సోమయాగము చేసిన యజమానునియొక్క శత్రువు పరాభూతుఁ డగును. కావున సోమయాగము చేయవలెను. (ఇది సోమయాగ విధాయకము.)

ద్వితీయానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే తృతీయోఽనువాకః

**మూలము:** [1]పరిభూరగ్నిం పరిభూరిన్ద్రం పరిభూర్విశ్వాన్దేవా న్పరిభూర్మాగ్ంసహ బ్రహ్మవర్చసేన స
నః పవస్వ శం గవే శం జనాయ శమర్వతే శగ్ంరాజ న్నోషధీభ్యో ఽచ్ఛిన్నస్య తే రయిపతే
సువీర్యస్య రాయస్పోషస్య దదితారః స్యామ। తస్య మే రాస్వ తస్య తే భక్షీయ తస్య త
ఇద మున్మృజే [2]ప్రాణాయ మే వర్చోదా వర్చసే పవస్వాపానాయ వ్యానాయ వాచే (౧)
దక్షక్రతుభ్యాం చక్షుర్భ్యాం మే వర్చోదౌ వర్చసే పవేథాగ్ం శ్రోత్రాయా ఽఽత్మనే ఽఙ్గేభ్య
ఆయుషే వీర్యాయ విష్ణో రిన్ద్రస్య విశ్వేషాం దేవానాం జఠరమసి వర్చోదా మే వర్చసే
పవస్వ కోఽసి కో నామ కస్మై త్వా కాయ త్వా యం త్వా సోమేనాతీతృపం యం త్వా
సోమేనామీమదగ్ం సుప్రజాః ప్రజయా భూయాసగ్ం సువీరో వీరైః సువర్చా వర్చసా
సుపోషః పోషై ర్విశ్వేభ్యో మే రూపేభ్యో వర్చోదాః (౨)వర్చసే పవస్వ తస్య మే రాస్వ
తస్య తే భక్షీయ తస్య త ఇద మున్మృజే।[3]బుభూష న్నవేక్షేతైష వై పాత్రియః ప్రజాపతి
ర్యజ్ఞః ప్రజాపతి స్తమేవ తర్పయతి స ఏనం తృప్తో భూత్యాఽభి పవతే బ్రహ్మవర్చసకామో
ఽవేక్షేతైష వై పాత్రియః ప్రజాపతి ర్యజ్ఞః ప్రజాపతి స్తమేవ తర్పయతి స ఏనం తృప్తో
బ్రహ్మవర్చసేనాభి పవత ఆమయావీ (౩)అవేక్షేతైష వై పాత్రియః ప్రజాపతి ర్యజ్ఞః ప్రజా
పతి స్తమేవ తర్పయతి స ఏనం తృప్త ఆయుషాఽభి పవతే ఽభిచర న్నవేక్షేతైష వై
పాత్రియః ప్రజాపతి ర్యజ్ఞః ప్రజాపతి స్తమేవ తర్పయతి స ఏనం తృప్తః ప్రాణాపానాభ్యాం

వాచో దక్షక్రతుభ్యాం చక్షుర్భ్యాగ్ం శ్రోత్రాభ్యా మాత్మనో ఉజ్జేభ్య ఆయుషో ఉన్తరేతి

తాజక్ప్ల ధన్వతి ॥ ౪॥ (వాచే రూపేభ్యో వర్చోదా ఆమయావీ పఞ్చచత్వారిగ్ంశచ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠకే తృతీయోఽనువాకః ॥

## వేదార్థదీపిక

**అవతారిక:** ద్వితీయానువాకమునందు సోమయాగ విధి స్మరింపఁబడినది. ఈ యనువాకమున సోమావేక్షణము విధింపఁబడుచున్నది.

1\. **అర్థము:** (హే సోమ!=ఓ సోమమా!, త్వమ్=నీవు,) అగ్నిమ్=అగ్నిని, పరిభూః=అంతటను వ్యాపించినదానవు, (అసి=అగుచున్నావు.) ఇన్ద్రమ్=ఇంద్రుని, పరిభూః=అంతటను వ్యాపించినదానవు, (అసి=అగుచున్నావు.) విశ్వాన్ దేవాన్=సర్వ దేవతలను, పరిభూః, (అసి.) బ్రహ్మవర్చసేన సహ=బ్రహ్మవర్చస్సుతోఁ గూడ, (తిష్ఠన్తమ్=ఉంటున్న,) మామ్=నన్ను, పరిభూః, (అసి.) సః=ఆ నీవు, నః=మమ్ము, పవస్వ=శోధింపుము. హే రాజన్!=ఓ సోమరాజా!, (త్వమ్=నీవు,) గవే=మా గోజాతికొఱకు, శమ్=సుఖమును, (ప్ర యచ్ఛ=ఇమ్ము). జనాయ=మా జనముకొఱకు, శమ్, (ప్రయచ్ఛ). అర్వతే=అశ్వజాతికొఱకు, శమ్, (ప్రయచ్ఛ=ఇమ్ము). ఓషధీభ్యః=ఓషధులకొఱకు, శమ్, (ప్రయచ్ఛ). హే రయిపతే!=ఓ ధనపతీ!, (త్వత్ప్రసాదాత్=నీ యనుగ్రహమువలన, వయమ్=మేము,) అచ్ఛిన్నస్య=ధ్వంసము కాని, సువీర్యస్య=శోభన పుత్రోపేతమైన, రాయస్పోషస్య=ధనసమృద్ధికి, దదితారః=దాతలము, స్యామ=అగుదుము గాక. తస్య=అటువంటి దానార్థినైన, మే=నాకు, రాస్వ=ధనము నొసఁగుము. తస్య తే=అటువంటి నీయొక్క, (రసమ్=రసమును,) భక్షీయ=(సమయము ప్రాప్తమైనపుడు,) భక్షింతును. తస్య తే=త్రాగఁబడిన నీయొక్క, (ప్రసాదాత్=అనుగ్రహమువలన,) ఇదమ్=ఈ అపేక్షిత ఫలమును, ఉన్మృజే=ఉత్కర్షతో ఉజ్జ్వలముగాఁ జేయుచున్నాను.

**తాత్పర్యము:** ఓ సోమమా! నీవు అగ్నీంద్రవిశ్వదేవతలను బ్రహ్మవర్చస్సుతోఁ గూడియున్న నన్ను అంతటను వ్యాపించియున్నావు. అటువంటి నీవు నన్ను శోధింపుము. ఓ సోమరాజా! మాకు సంబంధించిన గో జనాశ్వౌషధులకు సుఖము నిమ్ము. ఓ ధనపతీ! నీ యనుగ్రహమువలన మేము శోభన పుత్రోపేతమైన ధనసమృద్ధికి దాతలమగుదుము గాక. అట్టి దానార్థినైన నాకు ధనము నొసఁగుము. అటువంటి నీ యొక్క రసమును సమయము వచ్చినపుడు త్రాగుదును. త్రాగఁబడిన ని యనుగ్రహమువలన అపేక్షిత ఫలము నధికముగ నుజ్జ్వలము చేయుచున్నాను. (ఈ మంత్రముచే సోమమును సర్వమును సామాన్యాకారముగను, ఆ యా పాత్రములందలి సోమమును "ప్రాణాయ మే" ఇత్యాద్యుపరితన మంత్ర విశేషములచే ప్రత్యేకముగను చూడవలెను. "తస్య మే రాస్వ"-ఇచట తస్య మే అనుటకు బదులు "తస్మై మే" అని చతుర్థ్యంతముగ నుండవలెను. ఇది ఛాందసము.)

2\. **అర్థము:** హే ఉపాంశు పాత్ర!=ఓ ఉపాంశు పాత్రమా!, త్వమ్=నీవు, వర్చోదాః=బలము నిచ్చుదానవు, అసి=అగుచున్నావు. అతః=ఇందువలన, మే=నాయొక్క, ప్రాణాయ=ఉచ్ఛ్వాస రూప ప్రాణముకొఱకు, వర్చసే=బలముకొఱకు, (మామ్=నన్ను), పవస్వ=శోధింపుము. హే అంతర్యామ పాత్ర!=ఓ అంతర్యామనామక పాత్రమా!, త్వమ్=నీవు, వర్చోదాః=బలము నొసఁగుదానవు, అసి=అగుచున్నావు. అతః=ఇందువలన, మే=నాయొక్క, అపానాయ=నిశ్వాసరూప వాయువుకొఱకు, వర్చసే=బలముకొఱకు, మామ్=నన్ను, పవస్వ=శోధింపుము. హే ఉపాంశు సవన!=ఓ ఉపాంశు సవన పాత్రమా! త్వమ్, వర్చోదాః=బలము

నొసంగుదానవు, అసి=అగుచున్నావు. అతః=ఇందువలన, మే=నాయొక్క, వ్యానాయ=సర్వ శరీర వృత్తి యగు వ్యాన వాయువుకొఱకు, వర్చస్సుకొఱకు, మామ్=నన్ను, పవస్వ=శోధించుము. హే ఐన్ద్రవాయవః=ఓ ఐన్ద్రవాయవ పాత్రమా! త్వమ్, వర్చోదాః అసి. అతః, మే, వాచే=వాక్కుకొఱకు, వర్చసే, మామ్, పవస్వ. హే మైత్రావరుణ!=ఓ మైత్రావరుణ పాత్రమా!, త్వమ్, వర్చోదాః, అసి, అతః, మే దక్షక్రతుభ్యామ్=ప్రాణాపానములకొఱకు, వర్చసే, మామ్, పవస్వ. హే శుక్రామన్థినౌ!=ఓ శుక్రామన్థి పాత్రములారా! యువామ్=మీరు, వర్చోదౌ=బలము నిచ్చువారు, స్థః=అగుచున్నారు. అతః, మే, చక్షుర్భ్యామ్=చక్షువులకొఱకు, వర్చసే, మామ్, పవేథామ్=శోధించుఁడు. హే ఆశ్విన!=ఓ ఆశ్విన గ్రహమా, త్వమ్=నీవు, వర్చోదాః. అతః, మే, శ్రోత్రాయ=శ్రోత్రముకొఱకు, వర్చసే, మామ్, పవస్వ. హే అగ్రయణ!=ఓ అగ్రయణ పాత్రమా!, త్వమ్, వర్చోదాః, అతః, మే, ఆత్మనే=జీవాత్మకొఱకు, వర్చసే, మామ్, పవస్వ. హే ఉక్థ్య!=ఓ ఉక్థ్య పాత్రమా!, త్వమ్, వర్చోదాః. అతః, మే, అఙ్గేభ్యః=హస్తపాదాద్యంగములకొఱకు, వర్చసే, మామ్, పవస్వ. హే ధ్రువ!=ఓ ధ్రువ పాత్రమా!, త్వమ్, వర్చోదాః, అతః, మే, ఆయుషే=ఆయువుకొఱకు, వర్చసే, మామ్, పవస్వ. హే షోడశిన్!=ఓ షోడశి గ్రహమా!, త్వమ్, వర్చోదాః, అసి. అతః, మే, వీర్యాయ=సామర్థ్యముకొఱకు, వర్చసే, మామ్, పవస్వ. హే ద్రోణకలశ!=పాత్రమా!, త్వమ్, విష్ణోః=విష్ణువుయొక్క, జఠరమ్=జఠరము (కడుపు) అసి=అగుచున్నావు. అతః, వర్చోదాః=బలము నిచ్చునట్టి, త్వమ్=నీవు, మే, వర్చసే, పవస్వ. హే అధవనీయ!=ఓ అధవనీయ పాత్రమా!, త్వమ్=నీవు, ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, జఠరమ్, అసి, అతః, వర్చోదాః, త్వమ్, మే, వర్చసే, మామ్, పవస్వ. హే పూతభృత్!=ఓ పూతభృత్పాత్రమా!, త్వమ్, విశ్వేషాం దేవానామ్=విశ్వేదేవ దేవతలయొక్క, జఠరమ్, అసి. అతః, వర్చోదాః, త్వమ్, మే, వర్చసే, మామ్, పవస్వ. హే ఆహవనీయ!=ఓ ఆహవనీయమా!, త్వమ్=నీవు, కః=ప్రజాపతిరూపము, అసి=అగుచున్నావు. కో నామ='కః' అను శబ్దము, (తవ నామ=నీకు పేరు.) అతః=ఇందువలన, కస్మై=ప్రజాపతి తుష్టికొఱకు, త్వామ్=నిన్ను, అవేక్షే=చూచుచున్నాను. కాయ=సుఖముకొఱకు, త్వామ్=నిన్ను, అవేక్షే=చూచుచున్నాను. హే ఆహవనీయ!=ఓ ఆహవనీయమా, యమ్=ఇటువంటి, త్వా=నిన్ను, సోమేన=సోమముచేత, అతీతృపమ్=తృప్తి పఱచితిని. తథా=ఆ విధముగా, యమ్=ఇటువంటి, త్వా=నిన్ను, సోమేన=సోమముచేత, అమీమదమ్=హర్షింపఁజేసితిని. అతః=ఇందువలన, త్వత్ప్రసాదాత్=నీ యనుగ్రహము వలన, ప్రజయా=భృత్యరూప ప్రజచేత, సప్రజాః=శోభన భృత్యవంతుఁడను, వీరైః=పుత్రపౌత్రాది వీరులచేత, సువీరః=శోభన పుత్ర పౌత్రాదులు కలవాఁడను, వర్చసా=బలముచేత, సువర్చాః=శోభన బల యుక్తుఁడను, పోషైః=ధనాది పుష్టులచేత, సుపోషః=శోభన ధనాది పుష్టి కలవాఁడను, భూయాసమ్=అగుదును గాక. హే సర్వ సమష్టి రూప సోమ=సర్వపాత్రములందు సమష్టి రూపమున నున్న సోమమా!, మే=నాయొక్క, విశ్వేభ్యః రూపేభ్యః=నాయొక్క ప్రాణాపానాది సర్వఫల సిద్ధికొఱకు, వర్చోదాః=బలము నిచ్చునట్టి, త్వమ్=నీవు, వర్చసే=బలముకొఱకు, మామ్=నన్ను, పవస్వ=శోధించుము. "మే రాస్వ" ఇత్యాదికము ఒకటవ మంత్ర వ్యాఖ్యానమున వ్యాఖ్యాతము.

తాత్పర్యము: "పరిభూరగ్ని" మిత్యాది ప్రథమ మంత్రముచే సోమమును సామాన్యాకారముగఁ జూడవలెనని ఒకటవ మంత్ర వ్యాఖ్యానమునఁ జెప్పఁబడినది. ఉపాంశ్వాది పాత్రములందలి సోమములను రెండవ మంత్రము నందలి ఆ యా మంత్ర విశేషములచేఁ జూడవలెను. శేష తాత్పర్యము సుగ్రాహ్యము. కల్పసూత్రము ననుసరించి యిందు పాత్రవిశేషములు సంబోధింపఁబడినవి. "వర్చోదాః, వర్చసే, పవస్వ" అను పదములు 'అపానాయే' త్యాది మంత్రములందు అనువృత్తి చేయఁబడినవి. అసి, అతః, త్వత్ప్రసాదాత్ ఇత్యాది పదములు మూలములో లేకున్నను సందర్భమును బట్టి అధ్యాహారము చేయఁబడినవి. కాని ఇవి అనేక పర్యాయములు ఆవృత్తము లగుటచే కుండలితములు (( )) కాలేదు.

3. అర్థము: బుభూషన్=ఐశ్వర్యవంతుఁడను కావలయునని కోరిక గల యజమానుఁడు ఏతం (సోమమ్=ఈ పాత్రమందలి సోమమును) అవేక్షేత=చూడవలెను. ఏషః పాత్రియః=పాత్రమునందున్న ఈ సోమము, ప్రజాపతి

ర్వై=ప్రజాపతి స్వరూపము కదా!. యజ్ఞః=యజ్ఞము, ప్రజాపతిః=ప్రజాపతి స్వరూపము. (అతః=ఇందు వలన, అనేన=ఈ అవేక్షణముచేత,) తమేవ=ఆ ప్రజాపతినే, తర్పయతి=తృప్తిపఱచుచున్నాఁడు. తృప్తః సః=తృప్తుఁడైన ఆ ప్రజాపతి, ఏనమ్=ఈ యజమానుని, భూత్యా=ఐశ్వర్యముకొఱకు, అభిపవతే=అంతటను శోధించుచున్నాఁడు. బ్రహ్మవర్చసకామః=బ్రహ్మవర్చస్సును గోరు యజమానుఁడు, (ఏతమ్=ఈ పాత్రమందలి సోమమును,) అవేక్షేత=చూడవలెను. పాత్రియః ఏషః=పాత్రము నందున్న ఈ సోమము, ప్రజాపతిః=ప్రజాపతి స్వరూపము. యజ్ఞః=యజ్ఞము, ప్రజాపతిః=ప్రజాపతి స్వరూపము. (అతః=ఇందు వలన, అనేన=ఈ అవేక్షణముచేత,) తమేవ=ఆ ప్రజాపతినే, తర్పయతి=తృప్తిపఱచుచున్నాఁడు. తృప్తః సః=తృప్తుఁడైన ఆ ప్రజాపతి, ఏనమ్=ఈ యజమానుని, బ్రహ్మవర్చసేన=బ్రహ్మవర్చస్సుకొఱకు, అభి పవతే=అంతటను శోధించుచున్నాఁడు. అమయావీ=ఆరోగ్యమును గోరు యజమానుఁడు, (ఏనమ్=ఈ పాత్ర మందలి సోమమును), అవేక్షేత=చూడవలెను. పాత్రియః ఏషః=పాత్రమందున్న ఈ సోమము, ప్రజాపతిః వై=ప్రజాపతి స్వరూపమే. యజ్ఞః ప్రజాపతిః=యజ్ఞము ప్రజాపతిస్వరూపము. (అతః=ఇందు వలన, అనేన=ఈ అవెక్షణముచేత) తమేవ=ఆ ప్రజాపతినే, తర్పయతి=తృప్తిపఱచుచున్నాఁడు. తృప్తః సః=తృప్తుఁడైన ఆ ప్రజాపతి, ఏనమ్=ఈ యజమానుని, ఆయుషా=ఆయువుకొఱకు, అభి పవతే=అంతటను శోధించుచున్నాఁడు. అభిచరన్=శత్రువును హింసింపఁగోరు యజమానుఁడు, (ఏనమ్=ఈ పాత్రము నందున్న సోమమును), అవేక్షేత=చూడవలెను. పాత్రియః, ఏషః ప్రజాపతిః వై. యజ్ఞః, ప్రజాపతిః, (అతః, అనేన,) తమేవ, తర్పయతి. తృప్తః, సః, ఏనమ్=ఈ అభిచార విషయుఁడైన శత్రువును, ప్రాణాపానాభ్యామ్=ప్రాణాపానములనుండి, వాచః=వాక్కునుండి, దక్షక్రతుభ్యామ్=యోగ క్షేమములనుండి, చక్షుర్భ్యామ్=చక్షువులనుండి, శ్రోత్రాభ్యామ్=శ్రోత్రములనుండి, ఆత్మనః=ఆత్మనుండి, అఙ్గేభ్యః=అంగముల నుండి, ఆయుషః=ఆయువునుండి, అన్తరేతి=వియోజింప (వేఱు) చేయుచున్నాఁడు. (స చ వైరీ=ఆ వైరియు,) తాజక్=అప్పుడే, ప్ర ధన్వతి=మరణించుచున్నాఁడు. (భూత్యా, బ్రహ్మవర్చసా, ఆయుషా=ఈ పదములు చతుర్థ్యర్థమున తృతీయాంతములు ఛాందసములు.)

**తాత్పర్యము:** ఇచట బుభూషన్నిత్యాది మంత్రములచే ఐశ్వర్యము, బ్రహ్మవర్చస్సు, ఆయువు, శత్రుమరణము (అభిచారము) కోరువారికి సోమావేక్షణము విధింపఁబడినది. ఐశ్వర్యము కోరు యజమానుఁడు ఈ పాత్ర మందలి సోమమును చూడవలెను. ఈ పాత్రమునందున్న సోమము ప్రజాపతి స్వరూపమే. ప్రజాపతిచే సాధ్యమగు యజ్ఞము కూడ ప్రజాపతి స్వరూపమే. కావున ఈ సోమమును జూచుటచే యజమానుఁడు ఆ ప్రజాపతినే తృప్తిపఱచినవాఁ డగును. తృప్తిపడిన ఆ ప్రజాపతి ఈ యజమానుని ఐశ్వర్యముకొఱకు శోధించును. ఇట్లే బ్రహ్మవర్చసాది విషయమునఁ గూడ తాత్పర్యము గ్రహించవలసినది. అభిచార విషయమున యజ్ఞాత్మయైన ప్రజాపతి అభిచారవిషయుఁడైన వైరిని ప్రాణాపానవాక్కులనుండి యోగక్షేమములనుండి శ్రోత్రాదులనుండి వేఱుచేయును. అప్పుడే వైరి మరణించునని భావము. "ప్రాణాపానాభ్యా" మను పద ముండుటచే "దక్షక్రతుభ్యా" మను పదమునకు "యోగక్షేమములనుండి" అని అర్థము వ్రాయఁబడినది.

తృతీయానువాకము సమాప్తము.

అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే చతుర్థోఽనువాకః। (స్ఫ్యాద్యుపస్థాన మంత్రములు)

మూలము: [1]స్ఫ్యః స్వస్తిర్విఘనః స్వస్తిః పర్శుర్వేదిః పరశుర్నః స్వస్తిః। యజ్ఞియా యజ్ఞకృతః స్థ తే మాఽస్మిన్యజ్ఞ ఉప హ్వయధ్వ[2]ముప మా ద్యావాపృథివీ హ్వయేతాముపా ఽఽస్తావః కలశః సోమో అగ్నిరుప దేవా ఉప యజ్ఞ ఉప మా హోత్రా ఉపహవే హ్వయన్తాం [3]నమోఽగ్నయే మఖఘ్నే మఖస్య మా యశో ఽర్యాదిత్యాహవనీయ ముప తిష్ఠతే యజ్ఞో వై మఖః (౧) యజ్ఞం వావ స తద్ధన్తస్మా ఏవ నమస్కృత్య సదః ప్రసర్పత్యాత్మనో ఽనార్త్యై [4]నమో రుద్రాయ మఖఘ్నే నమస్కృత్యా మా పాహీత్యాగ్నీధ్రం తస్మా ఏవ నమస్కృత్య సదః ప్ర సర్పత్యాత్మనో ఽనార్త్యై [5]నమ ఇన్ద్రాయ మఖఘ్న ఇన్ద్రియం మే వీర్యం మా నిర్వ ధీరితి హోత్రీయ మాశిష మేవైతామా శాస్త ఇన్ద్రియస్య వీర్యస్యానిర్ఘాతాయ [6]యా వై (౨)దేవతాః సదస్యార్తి మార్పయన్తి యస్తా విద్వా న్ప్రసర్పతి న సదస్యార్తి మార్ఛతి నమోఽగ్నయే మఖఘ్న ఇత్యాహైతా వై దేవతాః సదస్యార్తి మాఽర్పయన్తి తా య ఏవం విద్వా న్ప్రసర్పతి న సదస్యార్తి మార్ఛతి [7]దృఢే స్థః శిథిరే సమీచీ మాఽగంహసస్పాతగం [8]సూర్యో మా దేవో దివ్యాదగంహసస్పాతు [9]వాయు రన్తరిక్షాత్ (౩)అగ్నిః పృథివ్యా యమః పితృభ్యః సరస్వతీ మనుష్యేభ్యో దేవీ ద్వారౌ మా మా సం తాప్తం [10]నమః సదసే నమః సదసస్పతయే నమః సఖీనాం పురోగాణాం చక్షుషే నమో దివే నమః పృథివ్యా [11]అహే దైధిషవ్యోదత స్తిష్ఠాన్యస్య సదనే సీద యోఽస్మత్పాకతర [12]ఉన్నివత ఉదుద్వతశ్చ గేషం

[13]పాతం మా ద్యావాపృథివీ అద్యాహ్నః [14]సదో వై ప్రసర్పన్తమ్ (౪)పితరోఽను ప్ర సర్పన్తి త ఏన మీశ్వరా హిగ్ంసితోః సదః ప్రసృప్య దక్షిణార్ధం పరేక్షేతాఽగన్త పితరః పితృమానహం యుష్మాభి ర్భూయాసగ్ం సుప్రజసో మయా యూయం భూయాస్తేతి తేభ్య ఏవ నమస్కృత్య సదః ప్రసర్పత్యాత్మనో ఽనార్త్యై ॥ ౩ ॥

(మఖో హా అన్తరిక్షా త్ప్రసర్పన్తం త్రయస్త్రిగ్ంశచ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదియ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠకే చతుర్థోఽనువాకః

## వేదార్థదీపిక

**అవతారిక:** తృతీయానువాకమునందు సోమావేక్షణము చెప్పఁబడినది. ఈ చతుర్థానువాకమునందు స్ఫ్యాది వేదికరణ సాధనముల ఉపస్థానము చెప్పఁబడుచున్నది. (ఉపస్థానము=ప్రార్థన.)

1\. **అర్థము:** స్ఫ్యః=(ఖనన సాధనమైన స్ఫ్య మను నాయుధ విశేషము, స్వస్తిః=అవినాశ హేతువు, (అస్తు=అగుఁగాక). విఘనః=(నేలను చదును చేయుట కుపయోగించు) సాధన విశేషము, (స్వస్తిః=అవినాశ హేతువు, (అస్తు=అగుఁగాక). పర్శుః=(తృణాదులను ఛేదించుటకు సాధనమైన) కొడవలి, స్వస్తిః=అవినాశ హేతువు, (అస్తు=అగుఁగాక). పరశుః=(వృక్షాదులను ఛేదించుటకు హేతువైన) గొడ్డలి, స్వస్తిః, (అస్తు). వేదిః=(స్ఫ్యాదులచే నిష్పన్నమైన) వేది, నః=మాకు, స్వస్తిః=అవినాశ హేతువు, (అస్తు=అగుఁగాక). (హే స్ఫ్యాదయః=ఓ స్ఫ్యాదులారా!, యూయమ్=మీరు), యజ్ఞియాః=యజ్ఞార్హములు. (అతః=ఇందువలన,) యజ్ఞకృతః=యజ్ఞసంపాదకములు, స్థ=కండు. (లోడర్థమున లట్ ప్రయోగము.) తే (యూయమ్) అటువంటి మీరు, మా=నన్ను, అస్మిన్ యజ్ఞే=ఈ యజ్ఞమునందు, ఉపహ్వయధ్వమ్=గుర్తించుఁడు.

**తాత్పర్యము:** స్ఫ్యాది తత్తత్సాధన విశేషములు, వానిచే నిష్పన్నమైన వేదియు, మాకు అవినాశ హేతువు లగుఁగాక. ఓ స్ఫ్యాదులారా! మీరు యజ్ఞార్హములు కావున యజ్ఞ సంపాదకములు కండు. అటువంటి మీరు ఈ యజ్ఞము నందు నన్ను గుర్తించుఁడు. (అధ్వర్యుఁడు స్ఫ్యాదులను ఉత్కరమునందు పడవైచి ఈ మంత్రములచే నమస్కారము చేయవలెను.)

2\. **అర్థము:** ద్యావాపృథివీ=(ఈ) ద్యావాపృథువులు, మా=నన్ను, ఉపహ్వయేతామ్=గుర్తించుఁగాక. ఆస్తావః=బహిష్పవమానదేశము, ఉపహ్వయతామ్=గుర్తించుఁగాక. కలశః=ద్రోణకలశము, సోమః=సోమము, అగ్నిః=అగ్ని, దేవాః=దేవతలు, యజ్ఞః=యజ్ఞము, హోత్రాః=ప్రశాస్తృ బ్రాహ్మణాచ్ఛంస్యాది ఋత్విజులు, ఉపహవే=(ఈ) యజ్ఞమునందు, మా=నన్ను ఉపహ్వయన్తామ్=గుర్తించుదురు గాక.

**తాత్పర్యము:** ఈ ద్యావాపృథువులు, బహిష్పవమాన దేశము, ద్రోణకలశాదులు, హోత్రాది ఋత్విజులు ఈ యజ్ఞమునందు నన్ను గుర్తించుదురు గాక. ("ఉపమా ద్యావాపృథివీ" అని ద్యావాపృథువులను, "ఉపహ్వయతా మాస్తావః" అని బహిష్పవమానదేశమును, "కలశః ఉపహ్వయతామ్" అని ద్రోణకలశమును, ఇట్లే సోమాదులను గూడ ఆ యా మంత్రభాగములచే ఉపస్థానము చేయవలెను.)

3. అర్థము: మఖఘ్నే-(నమస్కారము చేయనపుడు) యజ్ఞమును నశింపఁజేయునట్టి, అగ్నయే=అగ్నికొఱకు, నమః= నమస్కారము. మఖస్య=యజ్ఞముయొక్క, యశః=కీర్తి, మా=నన్ను, అర్యాత్=పొందుఁగాక, ఇతి=అని, ఆహవనీయమ్=ఆహవనీయాగ్నిని, ఉపతిష్ఠతే=ఉపస్థానము (ప్రార్థన) చేయవలెను. యజ్ఞః వై=యజ్ఞమే మఖః=మఖ శబ్దార్థము. సః=ఆ యగ్ని, యజ్ఞం వావ=యజ్ఞమునే, తదా=నమస్కారము చేయనపుడు, అహన్=నాశము చేయుచున్నాఁడు, (వర్తమానార్థమున భూతార్థక లఙ్ ప్రయుక్తమైనది. ఛాందసము. 'హన్తి' అని యర్థము). ఆత్మనః=తనకు, అనార్త్యై=పీడ లేకుండుటకై, నమస్కృత్యైవ=(అగ్నిని) నమస్కరించియే, సదః=సదస్సును, ప్రసర్పతి=పొందుచున్నాఁడు (పొందవలెను).

తాత్పర్యము: నమస్కారము చేయనపుడు యజ్ఞమును ధ్వంసము చేయునట్టి అగ్నికొఱకు నమస్కారము. యజ్ఞానుష్ఠానమువలన కీర్తి మాకు లభించుఁగాక, అని యీ మంత్రముచే నాహవనీయాగ్నిని నమస్కరించవలెను. ఇచట యజ్ఞమే మఖ శబ్దార్థము. ఆ యగ్ని నమస్కారము చేయనపుడు యజ్ఞమునే నశింపఁజేయును. అధ్వర్యుఁడు తనకు హాని కలుగకుండుటకై అగ్నిని నమస్కరించియే సదస్సును పొందవలెను. (ఈ మంత్రముచే అధ్వర్యుఁడు ఆహవనీయాగ్నిని నమస్కరించవలెను.)

4. అర్థము: మఖఘ్నే=నమస్కారము చేయనపుడు యజ్ఞమును నశింపఁజేయునట్టి, రుద్రాయ=రుద్రదేవునికొఱకు, (నమః=నమస్కారము). (హే రుద్ర!=ఓ రుద్రదేవా!) "నమస్కృత్యా=నమస్కారముచేత, మా=నన్ను, పాహి=రక్షించుము." ఇతి=అనుమంత్రముచేత, ఆగ్నీధ్రమ్=ఆగ్నీధ్ర స్థానీయాగ్నిని, ఉపతిష్ఠేత= సేవించవలెను. ఆత్మనః=తనకు, అనార్త్యై=హాని లేకుండుటకై, తస్మై ఏవ=ఆ యగ్ని దేవునికొఱకే, నమస్కృత్య=నమస్కరించి, సదః=సదస్సును, ప్రసర్పతి=పొందవలెను.

తాత్పర్యము: నమస్కారము చేయనిచో యజ్ఞమును నశింపజేయునట్టి రుద్రదేవునకు నమస్కారము. "ఓ రుద్రదేవా! నన్ను రక్షింపుము" అను మంత్రముచే అధ్వర్యుఁడు ఆగ్నీధ్ర స్థానీయాగ్నిని నమస్కరించవలెను. అధ్వర్యుఁడు తనకు హాని కలుగకుండుటకై ఆ యగ్ని దేవునకు నమస్కరించియే సదస్సును పొందవలెను.

5. అర్థము: "మఖఘ్నే, ఇన్ద్రాయ=అగ్నికొఱకు, నమః. (హే ఇన్ద్ర=ఓ అగ్నిదేవా!, త్వమ్=నీవు), మే=నాయొక్క, ఇన్ద్రియమ్=ఇంద్రియమును, వీర్యమ్=సామర్థ్యమును, మా నిర్వధీః=నశింపఁజేయకుము" ఇతి=అను మంత్రముచేత, హోత్రీయమ్=హోతృ స్థానీయాగ్నిని గూర్చి, ఏతామ్=ఈ ప్రార్థనను, ఆశిషమేవ= ఆశీస్సునే, (యజమానః=యజమానుఁడు) ఇన్ద్రియస్య=ఇంద్రియముయొక్క, వీర్యస్య=సామర్థ్యము యొక్క, అనిర్ఘాతాయ=అవినాశముకొఱకు, ఆశాస్తే=కోరుచున్నాఁడు.

తాత్పర్యము: నమస్కరించనిచో యజ్ఞ విఘాతము చేయునట్టి హోతృస్థానీయాగ్నికొఱకు నమస్కారము. ఓ యింద్రా! నా యింద్రియమును, సామర్థ్యమును నశింపఁజేయకుము. ఈ మంత్రముచేత యజమానుఁడు హోత్రీయాగ్నికి ఉపస్థానము జరుగుచుండఁగా ఆశీస్సునే కోరినవాఁడగును. ఆ యాశీస్సు ఇంద్రియము, సామర్థ్యము నశింపకుండుటకై సంపన్నమగుచున్నది. ("ఇది=పరమైశ్వర్యే" అను ధాతువునుండి పుట్టిన ఇంద్ర శబ్దము ఇచట పరమైశ్వర్యవంతుఁడైన హోతృ స్థానీయాగ్నిని జెప్పుచున్నది. కావున ఇంద్రుఁ డనఁగా ఐశ్వర్యవంతుఁడైన అగ్ని యని యిచట అర్థము.)

6. అర్థము: యాః దేవతాః వై=ఏ అగ్ని రుద్రేంద్ర రూప దేవతలు, సదసి=సదస్సునందు (అవస్థితాన్=ఉన్నటువంటి, యజమానాదీన్=యజమానాదులను,) ఆర్తిమ్=వ్యథను, అర్పయన్తి=పొందించుచున్నారో, యః=ఏ యజమానుఁడు, విద్వాన్=(ఆ దేవతలు చేసిన దానిని,) తెలిసికొనినవాఁడై, తాః ప్రసర్పతి=ఆ దేవతలను నమస్కారముతో సేవించుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, సదసి=సదస్సునందు, ఆర్తిమ్=ఆర్తిని, నార్ఛతి=పొందఁడు. (తతః=అందువలన,) "నమోఽగ్నయే మఖఘ్నే" ఇతి ఆహ="నమోఽగ్నయే" ఇత్యాది పూర్వోక్త మంత్రములను పఠించవలెను. ఏతాః దేవతాః వై=ఈ అగ్ని రుద్రేంద్ర దేవతలే, సదసి= సదస్సునందు (ఉన్న యజమానాదులను), ఆర్తిమ్=బాధను, అర్పయన్తి=పొందించుచున్నారు. తాః=

ఆ దేవతలను గూర్చి, యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ పూర్వోక్త విధముగ, విద్వాన్=తెలిసికొనిన వాఁడై, ప్రసర్పతి=నమస్కారముతో సేవించుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) సదసి=సదస్సునందు ఆర్తిమ్=బాధను, నార్ఛతి=పొందఁడు.

తాత్పర్యము: పూర్వోక్తులైన అగ్ని రుద్రేంద్ర దేవతలు నమస్కరింపఁబడనప్పుడు సదస్సునందున్న యజమానాదులను బాధింపఁజేయుదురు. ఆ విధమును తెలిసికొనిన యజమానుఁడు ఆ దేవతలను నమస్కార పూర్వకముగ సేవించినచో సదస్సునం దా యజమానుఁడు బాధను పొందఁడు. కావున యజమానుఁడు "నమోఽగ్నయే" ఇత్యాది పూర్వోక్త మంత్రములను పఠించవలెను. (అని యిచట పూర్వోక్త మంత్రత్రయోపస్థానము ప్రశంసింపఁబడినది.)

7. అర్థము: (హే ద్యావాపృథివీ!=ఓ ద్యావాభూములారా!, యువామ్=మీరు) శిథిరే (అపి)=(నమస్కారము చేయని వానిని గూర్చి) ప్రతికూలురై యున్నను, (ఉపస్థాతారమ్=నమస్కారము చేయుచున్న, మాం ప్రతి=నన్నుఁగూర్చి,) సమీచీ=అనుకూలురై, దృఢే స్థః=స్థిరత్వము కలవారై యుండుఁడు. (లోడర్థమున లట్ ప్రయోగము ఛాందసము.) మా=(నమస్కరించుచున్న) నన్ను, అంహసః=ప్రతిబంధక పాపమునుండి, పాతమ్=రక్షింపుఁడు.

తాత్పర్యము: ఓ ద్యావా పృథువులారా! మీరు నమస్కరించనివారి విషయమున తీవ్రముగ నున్నను నమస్కరించుచున్నా నా విషయమై అనుకూలురై దృఢముగ నుండుఁడు. కావున నమస్కరించుచున్న నన్ను ప్రతిబంధకము నుండి రక్షించుఁడు. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు ద్యావాభూములను నమస్కరించవలెను.)

8. అర్థము: దివ్యాత్=ద్యులోక విషయమైన, అంహసః=మత్కృత దురితమునుండి, సూర్యః దేవః=ద్యులోకస్థుఁడైన సూర్యుఁడు (సూర్య దేవుఁడు), మా=నన్ను, పాతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: నేను చేసిన ద్యులోక విషయ దురితమునుండి సూర్యదేవుఁడు నన్ను రక్షించుఁగాక.

9. అర్థము: వాయుః=వాయుదేవుఁడు, అంతరిక్షాత్=అంతరిక్ష సంబంధమైన మత్కృత దురితమునుండి, మా=నన్ను, (పాతు=రక్షించుఁగాక). అగ్నిః=అగ్నిదేవుఁడు, పృథివ్యాః=పృథివీ సంబంధమైన మత్కృత దురితము నుండి, మా, (పాతు.) యమః=యముడు, పితృభ్యః=పితృదేవతల సంబంధమైన మత్కృత దురితము నుండి, మా, (పాతు). సరస్వతీ=సరస్వతీదేవి, మనుష్యేభ్యః=మనుష్య సంబంధి మత్కృత దురితమునుండి, మా, (పాతు.) హే ద్వారౌ దేవీ=ఓ ద్వారరూప దేవతలారా! (యువామ్=మీరు,) మా=నన్ను, మా సంతాప్తమ్=సంతాపయుక్తుని చేయకుఁడు.

తాత్పర్యము: వాయువు అంతరిక్ష సంబంధమైన మత్కృత దురితమునుండి నన్ను రక్షించుఁగాక. ఇట్లే అగ్ని యమ సరస్వతులు పృథివ్యాదుల విషయమున నేను చేసిన దురితమునుండి నన్ను రక్షింతురు గాక. సదస్సునకు ద్వారరూపులైన దేవతలారా! మీరు నమస్కారము చేయుచున్న నన్ను సంతాపయుక్తునిఁ జేయకుఁడు.

10. అర్థము: సదసే=సదస్సుకొఱకు, నమః=నమస్కారము. సదసస్పతయే=సదసస్పతియగు బ్రహ్మకొఱకు, నమః=నమస్కారము. సఖీనామ్=మిత్రులును, పురోగాణామ్=స్వ స్వ వ్యాపారమునందు పురోగాములునగు ఋత్విజుల యొక్క, చక్షుషే=చక్షుఃస్థానీయమైన స్వ స్వ ప్రయోగాభిజ్ఞకొఱకు, నమః=నమస్కారము. దివే=దివికొఱకు, నమః=నమస్కారము. పృథివ్యై=పృథివికొఱకు, నమః=నమస్కారము.

తాత్పర్యము: సదస్సునకు, సదసస్పతియైన బ్రహ్మకు ఋత్విజులయొక్క చక్షుఃస్థానమైన స్వ స్వ ప్రయోగాభిజ్ఞకు, దివికి, పృథివికి నమస్కారము. ("సదసే నమః" అని సదస్సునకు యజమానుఁడు నమస్కారము చేయవలెను. ఇట్లే "సదసస్పతయే నమః" అని బ్రహ్మకు, "సఖీనా" మిత్యాది మంత్రములచే చక్షుఃస్థానీయ స్వ స్వ ప్రయోగాభిజ్ఞాదులకు నమస్కారము చేయవలెను. ఋత్విజులు యజ్ఞప్రయోగమునందు యజమానునకు సహాయకులు కావున వారు యజమానునకు మిత్రులు. ఆ ఋత్విజుల యభిజ్ఞ యజ్ఞప్రయోగమునందు

చక్షుస్సువంటిది అని భావము. 'అభిజ్ఞ' అభితః జానాతీతి=అభిజ్ఞః. అంతటను వస్తుతత్త్వమును దెలిసిన వాఁడు. 'అభిజ్ఞా'=నై పుణ్యము. జ్ఞా=అవబోధనే.)

11. అర్థము: దైధిషవ్య!=యజమాన స్థానమునం దుత్పన్నమైన, హే అహే!=ఓ తృణమా!, (త్వమ్=నీవు), అతః=ఈ స్థానమునుండి, ఉత్తిష్ఠ=లెమ్ము. యః=ఏ, అన్యః=ఇతరుఁడు, అస్మత్=మాకంటె, పాకతరః=మిక్కిలి బాలుఁడో (అప్రబుద్ధుఁడో!), సదనే=(అతని) స్థానమునందు, సీద=ఉండుము.

తాత్పర్యము: (ధిధిష వనగా స్థానము. ధిధిషవునం దుత్పన్నమైనది దైధిషవ్యము. సదస్సునందు ఔదుంబరికి దక్షిణ భాగము యజమానుని స్థానము. ఆ స్థానమునందు మొలచిన తృణాదికము బాధాకరము కావున దానిని తొలఁగించుచు అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పవలెను.) యజమాన స్థానమునందు మొలచిన తృణమా! నీవు ఇటనుండి తొలఁగిపోయి నాకంటె బాలతరుఁడైన మఱియొక పురుషుని స్థానమునం దుండుము.

12. అర్థము: ఉన్నివతః=నాకంటెఁ క్రిందుగా నున్నవారిని, ఉద్దేషమ్=అతిక్రమించి పైకి పోవుచున్నాను. ఉద్వతః చ=నాకంటె పై భాగమున నున్నవారిని గూడ, ఉద్దేషమ్=అతిక్రమించి పోవుచున్నాను.

తాత్పర్యము: నాకు అధస్థితులుగా నున్నవారిని, ఉపరిస్థితులుగా నున్నవారిని గూడ నేను అతిక్రమించి ముందుకుఁ బోవుచున్నాను. (అని ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు తన స్థానమునందు కూర్చుండవలెను.)

13. అర్థము: ద్యావాపృథివీ=ద్యావాభూములు, అద్య=ఈ దినమున, అహ్నః=అహశ్శబ్ద వాచ్యమైన అగ్నిష్టోమానుష్ఠానము నుండి, మా=నన్ను, పాతమ్=రక్షించుఁ గాక.

తాత్పర్యము: నేను ఈ నాఁడు చేయు నగ్నిష్టోమానుష్ఠానము వికలము కాకుండునట్లు ద్యావాపృథివీ దేవతలు నన్ను కాపాడుదురుగాక. (యజమానుఁడు తన స్థానమునం దుపవిష్టుఁడైన పిమ్మట ఈ మంత్రమును జపించవలెను.)

14. అర్థము: సదః=సదస్సును, ప్రసర్పన్తమ్=ప్రవేశించుచున్న యజమానుని, అను=అనుసరించి, పితరః=పితృదేవతలు ప్రసర్పన్తి వై=(సదస్సును) ప్రవేశించుచున్నారు కదా! తే=ఆ పితృదేవతలు, (అనమస్కృతాశ్చేత్=నమస్కరింపఁబడనివారైనచో,) ఏనమ్=ఈ యజమానుని, హింసితోః=హింసించుటకు, ఈశ్వరాః=సమర్థులు, (భవన్తి=అగుచున్నారు. అతః=ఇందువలన,) సదః=సదస్సును, ప్రసృప్య=ప్రవేశించి, ("అగన్త పితరః" ఇత్యాది మంత్రము నుచ్చరించుచు,) దక్షిణార్ధమ్=యజమానునకు దక్షిణమున నున్న ప్రదేశమును, పరేక్షేత=అంతటను చూడవలెను. మంత్రార్థము—హే పితరః=ఓ పితృదేవతలారా! అగన్త=(మా సదస్సు యొక్క స్థానమునకు) రండు. అహమ్=నేను, (తదా=అప్పుడు,) యుష్మాభిః=మీచేత, పితృమాన్=పితృమంతుఁడను, భూయాసమ్=అగుదును. యూయమ్=మీరు, మయా=నాచేత, సుప్రజసః=శోభన సంతానవంతులు, భూయాస్త=అగుదురు, ఇతి=అని, ఆత్మనః=తనకు (యజమానునకు), అనార్త్యై=బాధ లేకుండుటకై, తేభ్యః ఏవ=ఆ పితృదేవతలకొఱకే, నమస్కృత్య=నమస్కరించి, (యజమానః=యజమానుఁడు) ప్రసర్పతి=ప్రవేశించవలెను.

తాత్పర్యము: సదస్సులోనికిఁ బోవుచున్న యజమాను ననుసరించి పితృదేవతలు కూడఁ బోవుదురు కదా! వారిని నమస్కరించనిచో ఆ పితృదేవతలు యజమానుని హింసించుటకు సమర్థు లగుదురు. యజమానుఁడు తన కట్టి హింస జరుగకుండుటకై "అగన్త పితరః" ఇత్యాది మంత్రమును పఠించుచు తనకు దక్షిణముననున్న అర్ధ భాగమును బాగుగఁ జూడవలెను. "ఓ పితృదేవతలారా! మీరు ఈ సదస్సుయొక్క స్థానమునకు రండు. అప్పుడు మీచేత నేను పితృమంతుఁడ నగుదును. మీరు నాచేత శోభన ప్రజావంతు లగుదురు" అని మంత్రార్థము. (యజమానుఁడు "అగన్త పితరః" ఇత్యాది మంత్రపాఠమును పఠించుచు తనకు దక్షిణార్ధమును జూడవలెను.)

చతుర్థానువాకము సమాప్తము.

అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: [1]భక్షేహి మాఽఽవిశ దీర్ఘాయుత్వాయ శంతనుత్వాయ రాయస్పోషాయ వర్చసే సుప్రజాస్త్వా యేహి వసో పురోవసో ప్రియో మే హృదో ఽస్యశ్వినో స్త్వా బాహుభ్యాగ్ం సధ్యాసం [3]నృచక్షసం త్వా దేవ సోమ సుచక్షా అవ ఖ్యేషం [4]మన్ద్రాఽభిభూతిః కేతు ర్యజ్ఞానాం వాగ్జుషాణా సోమస్య తృప్యతు మన్ద్రా స్వర్వాచ్యదితి రనాహతశీర్ష్ణీ వాగ్జుషాణా సోమస్య తృప్య త్వేహి విశ్వచర్షణే (౧)శంభూర్మయోభూః స్వస్తి మా హరివర్ణ ప్ర చర క్రత్వే దక్షాయ రాయస్పోషాయ సువీరతాయై మా మా రాజన్వి బీభిషో మా మే హార్ది త్విషా వధీః। వృషణే శుష్మాయా ఽఽయుషే వర్చసే। వసుమద్గణస్య సోమ దేవ తే మతివిదః ప్రాతఃసవనస్య గాయత్రచ్ఛన్దస ఇన్ద్రపీతస్య నరాశగ్ంసపీతస్య పితృపీతస్య మధుమత ఉపహూతస్యోపహూతో భక్షయామి రుద్రవద్గణస్య సోమ దేవ తే మతివిదో మాధ్యందినస్య సవనస్య త్రిష్టుప్ఛన్దస ఇన్ద్రపీతస్య నరాశగ్ంసపీతస్య (౨)పితృపీతస్య మధుమత ఉపహూతస్యోపహూతో భక్షయా మ్యాదిత్యవద్గణస్య సోమ దేవ తే మతివిద స్తృతీయస్య సవనస్య జగతీఛన్దస ఇన్ద్రపీతస్య నరాశగ్ంసపీతస్య పితృపీతస్య మధుమత ఉపహూతస్యోపహూతో భక్షయామి। [5]ఆ ప్యాయస్వ సమేతు తే విశ్వతః సోమ వృష్ణియమ్। భవా వాజస్య సంగథే। [6]హిన్వ మే గాత్రా హరివో గణాన్మే మా వి తీతృషః। శివో మే సప్తర్షీ నుప తిష్ఠస్వ మా మే ఽవాఙ్నాభిమతి (౩)గాః। [7]అపామ సోమ మమృతా అభూమాదర్శ్మ జ్యోతిరవిదామ దేవాన్। కిమస్మా న్కృణవదరాతిః

కిము ధూర్తిరమృత మర్త్యస్య। [8]యన్మ ఆత్మనో మిన్దాఽభూదగ్ని స్తత్పున రాఽహార్జాత వేదా విచర్షణిః। [9]పునరగ్ని శ్చక్షురదా త్పునరిన్ద్రో బృహస్పతిః। పునర్మే అశ్వినా యువం చక్షురా ధత్తమక్ష్యోః। [10]ఇష్టయజుషస్తే దేవ సోమ స్తుతస్తోమస్య (౪)శస్త్రోక్థస్య హరివత ఇన్ద్రపీతస్య మధుమత ఉపహూతస్యోపహూతో భక్షయామి। [11]ఆపూర్యాః స్థాఽఽమా పూరయత ప్రజయా చ ధనేన చ। [12]ఏతత్తే తత యే చ త్వామన్వేతత్తే పితామహ ప్రపితామహ యే చ త్వామన్వత్ర పితరో యథాభాగం మన్దధ్వం [13]నమో వః పితరో రసాయ నమో వః పితరః శుష్మాయ నమో వః పితరో జీవాయ నమో వః పితరః (౫)స్వధాయై నమో వః పితరో మన్యవే నమో వః పితరో ఘోరాయ పితరో నమో వో య ఏతస్మిల్లోకే స్థ యుష్మాగ్ంస్తేఽను యే ఽస్మిల్లోకే మాం తేఽను య ఏతస్మిల్లోకే స్థ యూయం తేషాం వసిష్ఠా భూయాస్త యేఽస్మిల్లోకేఽహం తేషాం వసిష్ఠో భూయాసం [14]ప్రజాపతే న త్వదేతాన్యన్యో విశ్వా జాతాని పరి తా బభూవ (౬)యత్కామా స్తే జుహుమ స్తన్నో అస్తు వయగ్ం స్యామ పతయో రయీణామ్। [15]దేవకృత స్యైనసో ఽవయజనమసి మనుష్యకృతస్యైనసోఽవయజనమసి పితృకృతస్యైనసో ఽవయజనమ[16]స్యప్సు ధౌతస్య సోమ దేవ తే నృభిః సుతస్యేష్టయజుషః స్తుతస్తోమస్య శస్త్రోక్థస్య యో భక్షో అశ్వసని ర్యో గోసని స్తస్య తే పితృభి ర్భక్షంకృతస్యోపహూతస్యోపహూతో భక్షయామి ॥ ౭ ॥ (విశ్వచర్షణే త్రిష్టుప్ఛన్దస ఇన్ద్రపీతస్య నరాశగ్ంసపీతస్యాతి స్తుతస్తోమస్య జీవాయ నమో వః పితరో బభూవ చతుశ్చత్వారిగ్ంశచ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయ ప్రశ్నే పఞ్చమోఽనువాకః॥

# వేదార్థదీపిక

**అవతారిక:** స్ఫ్యాద్యుపస్థానమంత్రములు చతుర్థానువాకమునఁ జెప్పఁబడినవి. ఈ పంచమానువాకమునందు భక్షమంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము:** హే భక్ష!=భక్షయోగ్యమైన ఓ సోమరసమా!, (త్వమ్=నీవు,) దీర్ఘాయుత్వాయ=దీర్ఘాయుత్వముకొఱకు, శంతనుత్వాయ=దేహమునందు సుఖకారిత్వముకొఱకు, రాయస్పోషాయ=ధన సమృద్ధికొఱకు, వర్చసే=తేజస్సుకొఱకు, సుప్రజాస్త్వాయ=శోభన సంతానముకొఱకు, ఏహి=రమ్ము. మా=నన్ను, ఆ విశ=ప్రవేశించుము. హే వసో!=నివాస హేతువైన ఓ సోమ రసమా!, (అస్మాన్ వాసయితుమ్=మమ్ము వసింపఁజేయుటకొఱకు), ఏహి=రమ్ము. హే పురోవసో!=నివసింపఁజేయు ధనాదికములలో ప్రథమమున నివసింపఁజేయు సోమ రసమా!, (త్వమ్=నీవు,) మే=నాయొక్క, హృదః=చిత్తమునకు, ప్రియః=ఇష్ట మైనదానవు, అసి=అగుచున్నావు.

**తాత్పర్యము:** భక్షించుటకు యోగ్యమైన ఓ సోమరసమా! మేము సంపూర్ణమైన ఆయువు కలిగియుండుటకు, మా దేహమునందు సుఖమును కలుగఁజేయుటకు, ధన సమృద్ధికొఱకు, తేజస్సుకొఱకు, యోగ్య సంతానము సిద్ధించుటకును వచ్చి నాలో ప్రవేశించుము. మమ్ము వసింపఁ జేయునట్టి సోమరసమా! మమ్ము వసింపఁ జేయుటకు రమ్ము. వసింపఁజేయు ధనాదులలో ప్రథమమైన సోమరసమా! నీవు నా మనస్సునకు ప్రియమైనదాన వగుచున్నావు. (ఈ మంత్రముచే సోమరసమును జూడవలెను. (ఇచట సోమరసమును భక్షించుట యనఁగా త్రాగుట అని భావము.)

2. **అర్థము:** (హే భక్ష!=భక్షణ యోగ్యమైన ఓ సోమరసమా!) త్వా=నిన్ను, అశ్వినోః=(దేవ వైద్యులైన) అశ్వినీ దేవతలయొక్క, బాహుభ్యామ్=బాహువులచేత, సాధ్యాసమ్=గ్రహించుచున్నాను.

**తాత్పర్యము:** భక్షణ యోగ్యమైన ఓ సోమరసమా! దేవ వైద్యు లయిన అశ్వినీ దేవతలయొక్క బాహువులతో నిన్ను గ్రహించుచున్నాను. (ఈ మంత్రముచే సోమరసమును హస్తములలోనికి గ్రహించవలెను.)

3. **అర్థము:** హే సోమ దేవ!=ఓ సోమ దేవతా!, నృచక్షసమ్=నరులను జూచునట్టి, త్వా=నిన్ను, సుచక్షాః=బాగుగఁ జూచునట్టి, (అహమ్=నేను,) అవఖ్యేషమ్=చూచుచున్నాను.

**తాత్పర్యము:** దేవతాత్మకమైన సోమ రసమా! మనుష్యులను జూచునట్టి నిన్ను యోగ్య ద్రష్టనైన నేను చూచుచున్నాను. (ఈ మంత్రముచే హస్తములలోని సోమరసమును జూడవలెను.)

4. **అర్థము:** మన్ద్రా=హర్ష హేతువును, అభిభూతిః=విఘ్నముల నభిభవించునదియు, యజ్ఞానామ్=యజ్ఞములకు, కేతుః=కారణమైనదియునగు, వాక్=వాగ్దేవత, సోమస్య=సోమరసమును. జుషాణా=సేవించుచున్నదై, తృప్యతు=తృప్తిచెందుఁగాక. మన్ద్రా=హర్షహేతువును, స్వర్వాచీ=బాగుగ ఎదుట నుండునదియు, అదితిః=అఖండనీయమును, అనాహతశీర్ష్ణీ=అప్రతిహత ప్రారంభము కలదియునగు, వాక్=వాగ్దేవత, సోమస్య=సోమరసమును, జుషాణా=సేవించుచున్నదియై, తృప్యతు=సంతోషించుఁ గాక. హే విశ్వచర్షణే!=సర్వ మనుష్యులు తనవారుగాఁగల ఓ సోమమా! (త్వమ్=నీవు), శంభూః=శాంతిని గలుగఁజేయుదానవును, మయోభూః=సుఖమును కలుగఁజేయుచున్నదానవునగుచు, ఏహి=రమ్ము. హే హరివర్ణ!=ఆకుపచ్చని వర్ణము గల ఓ సోమరసమా!, క్రత్వే=యజ్ఞముకొఱకు, దక్షాయ=ఉత్సాహముకొఱకు, రాయస్పోషాయ=ధన సమృద్ధికొఱకు, సువీరతాయై=యోగ్య వీర సంతానముకొఱకు, స్వస్తి=వాంతి రూప వినాశము కలుగకుండునట్లు, మా=నన్ను, ప్రచర=ప్రవేశించుము. హే రాజన్!=ఓ సోమరాజా!, మా=నన్ను, మా వి బీభిషః=(వాంత్యుపద్రవముచేత) విశేషముగ భయపెట్టవలదు. మే=నాయొక్క, హార్ది=హృదయ పుండరీకమునందున్న మనస్సును, త్విషా=నీ దీప్తిచే, వృషతే=ఇంద్రియముకొఱకు, శుష్మాయ=బలముకొఱకు, ఆయుషే=దీర్ఘాయువు

కొఱకు, వర్చసే=కాంతికొఱకు, మా వధీః=హింసింపకుము. (మనస్సు హింసా రహిత మైనపుడు వృషాదులు సిద్ధించునని తాత్పర్యము.) హే సోమదేవ!=ఓ సోమదేవా!, వసుమద్గణస్య=అష్టవసు గణము కలిగిన దానవును, మతివిదః=శ్రద్ధాళురైన యజమానుల మతిని దెలిసికొనినదానవునగు, తే=నీకు సంబంధించిన దియు, గాయత్రచ్ఛన్దసః=బహిష్పవమానాది మంత్రములందు గాయత్రీ చ్ఛందస్సు కలదియు, ఇన్ద్రపీతస్య=ఇంద్రునిచే త్రాగఁబడిన సోమరసము కలదియు, నరాశంస పీతస్య=నరాశంసు లనెడి పితృదేవత లచే త్రాగఁబడిన సోమము కలదియు, పితృ పీతస్య=పితృ దేవతలచే త్రాగఁబడిన సోమము కలదియునగు, ప్రాతఃసవనస్య=ప్రాతఃసవన సంబంధియగు, ఉపహూతస్య=ఇతరులచే ననుజ్ఞాత మయిన, మధుమతః=మధుర రసమును, ఉపహూతః=ఇతరులచే ననుజ్ఞాతుఁడనై, (అహమ్=నేను,) భక్షయామి=భక్షించు (త్రాగు) చున్నాను. (మధుమతః=కర్మణి షష్ఠి కనుక ద్వితీయార్థము చెప్పఁబడినది.) (ఇట్లే) హే సోమదేవ!, రుద్రవద్గణస్య=ఏకాదశ రుద్రుల గణము కల, మతివిదః, తే, త్రిష్టుప్ఛన్దసః ఇన్ద్రపీతస్య, నరాశంస పీతస్య పితృపీతస్య, మాధ్యందిన సవనస్య=మాధ్యందిన సవన సంబంధియగు, ఉపహూతస్య, మధుమతః=మధుర రసమును, ఉపహూతః, అహమ్, భక్షయామి. (ఇట్లే) హే సోమదేవ!, ఆదిత్యవద్గణస్య=ద్వాదశాదిత్యుల గణము కలదియు, మతివిదః, తే, జగతీ చ్ఛన్దసః=జగతీ చ్ఛందస్సు కలదియు, ఇన్ద్రపీతస్య, నరాశంస పీతస్య, పితృపీతస్య, తృతీయ సవనస్య=తృతీయ సవన సంబంధియగు, ఉపహూతస్య, మధుమతః, ఉపహూతః, అహమ్, భక్షయామి.

**తాత్పర్యము:** మంద్రాది విశేషణ విశిష్టయైన వాగ్దేవత సోమరసమును త్రాగి తృప్తిచెందుఁగాక యని మొదటి భాగము నకు తాత్పర్యము. క్రత్వాది సిద్ధికై, శంభూరిత్యాది విశేషణ విశిష్టమైన సోమరసము త్రాగు సమయ మున వాంత్యాద్యుపద్రవము కలుగఁజేయకుండ తనలోపల ప్రవేశించుటకు ప్రార్థించఁబడినది. ఇది రెండవ భాగము. ప్రాతఃసవనమునందు, మాధ్యందిన సవనమునందు, తృతీయ సవనమునందును సోమరసము యజమానాదులచే భక్షింపఁ (త్రాగఁ) బడును కావున ఆ మూఁడు సవనములు సోమ సంబంధులుగా వర్ణింపఁ బడినవి. ఆ సవనములందు ఉపయోగింపఁబడు మంత్రములు గాయత్ర్యాది ఛందస్సులు కలవి. ఆ సవనము లలో ఇంద్రునకు, నరాశంసాది పితృదేవతలకు సోమరసము సమర్పింపఁబడును. కావున ఇన్ద్రపీతస్యేత్యాది విశేషణములు ఆ మూఁడు సవనములకు సమన్వయించును. ఆ సవనములలో సేవింపఁబడు సోమముయొక్క మధురరసము ఇతరులచే ననుజ్ఞాతమై ఇతరులచే ననుజ్ఞాతుఁడయిన యజమానునిచే త్రాగఁబడుచున్నదని ఈ మంత్రముయొక్క సారాంశము. (ఈ మంత్రమునందలి చివరి మూఁడు భాగముల నుచ్చరించుచు యథాక్రమముగ ప్రాతఃసవనాదులందు సోమరసమును యజమానుఁడు త్రాగవలెను.)

5\. **అర్థము:** హే సోమ!=ఓ సోమమా!, త్వమ్=నీవు, ఆప్యాయస్వ=అంతటను వృద్ధి నొందుము. తే=నీయొక్క, వృష్ణియమ్=వీర్యము, విశ్వతః=అంతటను, సమేతు=కలిసికొనుఁగాక. (త్వమపి=నీవు కూడ,) వాజస్య=అన్నముయొక్క, సంగథే=సంగమనమునందు, భవ=నిమిత్త మగుము.

**తాత్పర్యము:** ఓ సోమమా! నీ వంతటను వృద్ధి నొందుము. నీ వీర్యము అంతటఁగలయుఁగాక. నీవు కూడ అన్నము యొక్క సంగమునందు నిమిత్త మగుము. (సోమరసమును త్రాగిన వెంటనే ఈ మంత్రమును చదివి నాభి దేశమును తాఁకవలెను.)

6\. **అర్థము:** హే హరివః!=హరిత వర్ణము కల ఓ సోమమా!, (త్వమ్=నీవు), మే=నాయొక్క, గాత్రా=అంగములను, హిన్వ=సంతోషపఱచుము. మే=నాయొక్క, గణాన్=పుత్ర పౌత్రాది సమూహములను, మావి తీతృషః=తృష్ణా రహితులనుగాఁ జేయవలదు. (కించ=మఱియు, త్వమ్=నీవు,) శివః=మంగళకరమై, మే=నాయొక్క, సప్తర్షీన్=శిరస్సునందలి సప్త రంధ్రములం దుండునట్టి సప్త ప్రాణములను, ఉపతిష్ఠస్వ=తృప్తి పఱచుము. (కించ=మఱియు,) మే=నాయొక్క, నాభిమ్=నాభిని, మా అతిగాః=అతిక్రమించి పోవలదు.

**తాత్పర్యము:** హరిత వర్ణము గల ఓ సోమరసమా! నీవు నా యంగములను తృప్తిపఱచుము. నాయొక్క పుత్ర పౌత్రాదు లను సోమపానమునందు ఇచ్ఛ లేనివారినిగాఁ జేయవలదు. నా శిరోభాగమునందలి సప్త రంధ్రముల

దుండు సప్త ప్రాణములను తృప్తిపఱచుము: మఱియు నా నాభి నతిక్రమించి అధోరంధ్రము మూలమున వెలుపలకుఁ బోవలదు. (ఈ మంత్రమును చెప్పుచు నాభిదేశమును స్పృశించవలెను. "గాత్రా" ఇతి ఛాందస ప్రయోగః. గాత్రాదీత్యర్థః.)

7. అర్థము: (వయం సర్వే=మే మందఱము), సోమమ్=సోమ రసమును, అపామ=త్రాగితిమి. (తేన=ఆ త్రాగుటచే,) అమృతాః=దేవతలము, అభూమ=అయితిమి. (ఆశంసను దెలియఁజేయుటకై భూతార్థ నిర్దేశము చేయఁబడినది.) జ్యోతిః=ఆదిత్య రూపమును, అదర్శ్మ=చూచితిమి. (దృష్టవన్తః=చూచినవారమై), దేవాన్=ఇంద్రాది దేవతలను, అవిదామ=పొందితిమి. అస్మాన్=(ఇటువంటి) మమ్ము, అరాతిః=పాపరూప శత్రువు, కిం కృణవత్=ఏమి చేయఁగలదు? మర్త్యస్య=మనుష్య శరీర ధారియొక్క, ధూర్తిః=హింస, అమృత=మరణము లేని మమ్ము, కిము=ఏమి చేయఁగలదు? అని వేఱుగఁ జెప్పవలెనా?

తాత్పర్యము: మే మందఱము సోమరసమును త్రాగి దేవతల మైతిమి. జ్యోతి స్స్వరూపమైన సూర్యుని జూచి యింద్రాది దేవతలను పొందితిమి. ఇటువంటి మమ్ము పాపరూప శత్రువు ఏమి చేయఁగలదు? మనుష్య శరీర ధారి యొక్క హింస అమృత రూపులమైన మమ్ము ఏమి చేయఁగలదు? అని వేరుగఁజెప్పవలెనా? (సమిధలను హస్తములందు పట్టుకొనిన ఋత్విజులు తమ యజమానుని బురస్కరించుకొని ఈ మంత్రమును జదువుచు రావలెను. అమృత=అమృతాన్ అస్మాన్ ఇత్యర్థః.)

8. అర్థము: మే=(ఋత్విజుఁడనైన) నాయొక్క, యత్=ఏ యంగము, ఆత్మనః=స్వరూపమునుండి, మిన్దా అభూత్=హింసిత మయ్యెనో, జాతవేదాః=యజ్ఞమునం దేర్పడిన లోపమును దెలిసికొనువాఁడును, విచర్షణిః=(ఆ లోపమును సరి చేయుటకు) విచక్షణ కలవాఁడునగు, అగ్నిః=అగ్ని, తత్=హింసితమైన ఆ యజ్ఞాంగమును, పునః=మఱల, ఆ అహాః=తీసికొనివచ్చుఁ గాక.

తాత్పర్యము: లుప్తమైన నా యజ్ఞాంగమును అగ్ని మఱలఁ దీసికొనివచ్చుఁ గాక. అగ్ని యజ్ఞమునం దేర్పడిన లోపమును దెలిసికొనువాఁడు. ఆ లోపమును సరి చేయుటలో విచక్షణ కలవాఁడు. (ఋత్విజు లందఱు ఆహవనీయాగ్నిని ప్రార్థించవలెను.)

9. అర్థము: అగ్నిః=అగ్ని, పునః=మఱల, మే=నాకొఱకు, చక్షుః=చక్షుస్సును, అధాత్=ఇచ్చెను. ఇన్ద్రః=ఇంద్రుఁడు, పునః=మఱల, మే=నాకొఱకు, చక్షుః=చక్షుస్సును, అదాత్=ఇచ్చెను, బృహస్పతిః=బృహస్పతి, మే, పునః, చక్షుః, అదాత్. హే అశ్వినా=ఓ అశ్వినీ దేవతలారా!, యువమ్=మీరు, అక్ష్యోః=(నా) కన్నులకు, చక్షుః=దర్శన సామర్థ్యమును, అధత్తమ్=కలుగఁజేసిరి. (యువమ్=యువామ్. అశ్వినా=అశ్వినౌ.)

తాత్పర్యము: "యజ్ఞం పరాభవన్తం యజమానోఽను పరాభవతి" అను శ్రుత్యంతరము ననుసరించి యజ్ఞాంగము న్యూనమైనప్పుడు యజమానుని చక్షువులు చెడిపోవును. దీనివలన ఈ అగ్ని యజ్ఞాంగమును సమకూర్చుటచే నాకు చక్షువు నిచ్చినవాఁ డయ్యెను. ఇట్లే ఇంద్ర బృహస్పతులు, అశ్వినీదేవతలు చక్షువులను, ఆ చక్షువులకు దర్శన సామర్థ్యమును సమకూర్చిరి. (8వ మంత్రమునకు బదులుగాఁ పక్షాంతరమున ఈ మంత్రము చెప్పఁబడినది. వినియోగము పూర్వవత్తు.)

10. అర్థము: హే సోమదేవ!=ఓ దేవతారూపమైన సోమమా!, ఇష్టయజుషః=యాగ సాధనము లయిన యజుస్సులు కలదానవును, స్తుతస్తోమస్య=స్తుతింపఁబడిన సామావృత్తి లక్షణ స్తోత్రములు కలదానవును, శస్తోక్థస్య=శంసితములైన శస్త్రములు (మంత్ర విశేషములు) కలదానవును, హరివతః=హరిత వర్ణము కలదానవును, ఇన్ద్రపీతస్య=ఇంద్రునిచే త్రాగఁబడినదానవును, మధుమతః=మాధుర్యము కలదానవును, ఉపహూతస్య=ఇతరులచే ననుజ్ఞాతవునగు, తే=నీయొక్క, (రసమ్=రసమును, అహమ్=నేను,) ఉపహూతః=అనుజ్ఞాతుఁడనై, భక్షయామి=భక్షించు (త్రాగు) చున్నాను.

తాత్పర్యము: దేవతా స్వరూపమైన ఓ సోమమా! ఇష్టయజు రిత్యాది విశేషణ విశిష్టమైన నీ రసమును అనుజ్ఞాతుఁడనై నేను త్రాగుచున్నాను. (ఋత్విజు లందఱు సోమరసమును ఈ మంత్రమును చెప్పుచు త్రాగవలెను. ఉక్థ శస్త్రాది పదములు పూర్వము వివరింపఁబడినవి.)

11. అర్థము: (హే ధానాః=ఓ సోమ శేషములైన ధానములారా! యూయమ్=మీరు,) అపూర్యాః=అంతటను పూరింపఁబడినవారు, స్థ=అగుచున్నారు. (అతః=ఇందువలన), మా=నన్ను, ప్రజయా చ=సంతానముతోను, ధనేన చ=ధనముతోను, ఆ పూరయత=అంతటను పూరించుఁడు. (ధానాః=పేలాలు.)

తాత్పర్యము: ఓ ధానములారా! మీ రంతటను పూరింపఁబడియుండిరి. కావున నన్ను సంతానముతోను, ధనముతోను పూరింపుఁడు. (ఈ మంత్రమును చెప్పుచు ఉత్తర వేదియందు సోమ శేషములైన ధానముల నుంచవలెను.)

12. అర్థము: హే తత!=ఓ పితృదేవా!, ఏతత్=ఈ పురోడాశ శకలము, తే=నీకు, (అన్నమ్=అన్నము). యే చ=ఏ యితరులైతే, త్వామను=నిన్ననుసరించినారో, (తేషామపి=వారికిఁగూడ,) ఏతత్=ఈ పురోడాశ శకలము, (అన్నమ్=అన్నము). హే పితామహ!=ఓ పితామహా! (తండ్రియొక్కతండ్రి), ఏతత్=ఈ పురోడాశ శకలము, తే=నీకు, (అన్నమ్=అన్నము). యే చ=ఏ యితరులైతే, త్వామను=నిన్ననుసరించినారో, (తేషామపి=వారికిఁగూడ,) ఏతత్=ఈ పురోడాశ శకలము, (అన్నమ్=అన్నము). హే ప్రపితామహ!=ఓ పితామహుని తండ్రీ!, ఏతత్=ఈ పురోడాశ శకలము, తే=నీకు, (అన్నమ్=అన్నము). యే చ=ఏ యితరులైతే, త్వామను=నిన్ననుసరించినారో, (తేషామపి=వారికిఁగూడ,) ఏతత్=ఈ పురోడాశ శకలము, (అన్నమ్=అన్నము). హే పితరః!=ఓ పితృదేవతలారా!, (యూయం సర్వేఽపి=మీ రందఱు,) అత్ర=ఈ కర్మయందు, యథాభాగమ్=మీ మీ భాగముల ననుసరించి, మన్దధ్వమ్=తృప్తి నొందుఁడు.

తాత్పర్యము: ఓ పితృ పితామహ ప్రపితామహులారా! మీకును, మిమ్మనుసరించిన యితరులకును ఈ పురోడాశ శకలములు అన్నములు. మీ మీ భాగముల ననుసరించి తృప్తి నొందుఁడు. (ఋత్విజులందఱు తమ తమ చమస పాత్రముల సమీపమున మూఁడేసి పురోడాశ శకలరూప అన్నపు ముద్దలను పితృ పితామహ ప్రపితామహుల నుద్దేశించి ఈ మంత్రము నుచ్చరించుచు నుంచవలెను.)

13. అర్థము: హే పితరః!=ఓ పితృదేవతలారా! వః=మీయొక్క, రసాయ=సారముకొఱకు, నమః=నమస్కారము. హే పితరః!, వః, శుష్మాయ=బలముకొఱకు, నమః. హే పితరః, వః, జీవాయ=జీవాత్మకొఱకు, నమః. హే పితః, వః, స్వధాయై=భవదీయ హవిర్ధాత్రియగు స్వధకొఱకు, (పితృదేవతలకు హవిస్సు స్వధా శబ్దము నుచ్చరించుచు నర్పింపఁబడును.) నమః. హే పితరః, వః, మన్యవే=కోపముకొఱకు, నమః. హే పితరః! వః, ఘోరాయ=శిక్షా రూపమైన ఉగ్రకార్యముకొఱకు, నమః. హే పితరః! వః=మీకొఱకు, నమః. యే=ఏ మీరు, (అన్యైస్సహ=ఇతరులతోఁగూడ) ఏతస్మిన్ లోకే=ఈ పితృలోకమునందు, స్థ=ఉంటున్నారో, తే=వారు, యుష్మాన్=మిమ్ము, అను (వర్తన్తామ్)=అనుసరింతురు గాక. యే (యూయమ్)=ఏ మీరు, అస్మిన్ లోకే=ఈ లోకమునందు, స్థ=ఉంటున్నారో, తే (యూయమ్)=ఆ మీరు, మామ్=నన్ను, అను (వర్తధ్వమ్)=అనువర్తించుఁడు. (అన్యైః బహుభిస్సహ=ఇతరులైన అనేకులతోఁ గూడ,) యే యూయమ్=ఏ మీరు, ఏతస్మిన్=ఈ పితృలోకమునందు, స్థ=ఉంటున్నారో, తేషామ్ అన్యేషామ్=ఆ యితరులను, యూయమ్=మీరు, వసిష్ఠాః=బాగుగ నివసింపఁజేయువారుగా, భూయాస్త=కండు. యే=ఏ మనుష్యులు, అస్మిన్ లోకే=ఈ లోకమునందు, (మయా సహ=నాతోఁ గూడ, స్థితాః=ఉందిరో,) తేషామ్=వారిని, అహమ్=నేను, వసిష్ఠః=నివసింపఁజేయువాఁడను, భూయాసమ్=అగుదును.

తాత్పర్యము: ఓ పితృదేవతలారా! మీయొక్క రసాదులకు మీకు నమస్కారము. పితృలోకమునందు మీతోఁ గూడ నుంటున్న యితరులు మిమ్మనుసరించి వర్తింతురు గాక. ఈ లోకమున నున్న మీరు నన్ను అనుసరింతురు గాక. పితృలోకమున మీతోఁ గూడ నున్న యితరుల ననేకులను మీరు వసింపఁజేయువారు కండు. ఈ లోకమున నాతో నున్న వారిని నేను నివసింపఁజేయువాఁడ నగుదును. (యజమానుఁడు ఈ నమస్కార మంత్రమును జపించవలెను.)

14. అర్థము: హే ప్రజాపతే!=ఓ ప్రజాపతీ! త్వత్=నీకంటె, అన్యః=ఇతరుఁడు, జాతాని=ఉత్పన్నములైన, తా ఏతాని విశ్వా=ఆ ఈ భువనములను, న పరి బభూవ=పరిభవించుటకు సమర్థుఁడు కాలేదు. (అతః=ఇందువలన)

వయమ్=మేము, యత్కామాః=ఏ ఫలమును కోరినవారమై, తే=నీకు, జుహుమః=హోమము చేయుచున్నామో, తత్=ఆ ఫలము, నః=మాకు, అస్తు=అగుఁగాక. వయమ్=మేము, రయీణామ్=ధనములకు, పతయః=ప్రభువులము, స్యామ=అగుదుము గాక.

తాత్పర్యము: ఓ ప్రజాపతీ! నీకంటె నితరుఁ డొక్కఁడు కూడ ఈ యుత్పన్న భువనములను పరిభవించుటకుఁ గాని, ఆ లోకములను సృష్టించుటకుఁగాని సమర్థుఁడు కాఁడు. సృష్టి సంహారములకు నీవే సమర్థుఁడవు (పరిభవము సృష్టికిఁ గూడ నుపలక్షణము). కావున మేము ఏ ఫలము నాశించి నీకు హోమము చేయుచున్నామో, ఆ ఫలము మాకు సిద్ధించుఁ గాక. మేము ధనవంతుల మగుదుము గాక. (ఋత్విజులు ఈ మంత్రము నుచ్చరించుచు ఎవరికి వారు విడిపోవలయును.)

15. అర్థము: (హే పురోడాశ శకల!=ఓ పురోడాశ శకలమా! త్వమ్=నీవు,) దేవకృతస్య=దేవతల విషయమున మాచేఁ జేయఁబడిన, ఏనసః=పాపమునకు, అవయజనమ్=వినాశకము, అసి=అగుచున్నావు. మనుష్య కృతస్య=మనుష్యుల విషయమునఁ జేయఁబడిన, ఏనసః=పాపమునకు, అవయజనమ్=వినాశకము, అసి=అగుచున్నావు. పితృ కృతస్య=పితృ దేవతల విషయమునఁ జేయఁబడిన, ఏనసః=పాపమునకు, అవయజనమ్=వినాశకము, అసి=అగుచున్నావు. ఆత్మకృతస్య=స్వ విషయమునఁ జేయఁబడిన, ఏనసః, అవయజనమ్, అసి. అన్య కృతస్య=ఇతరుల విషయమునఁ జేయఁబడిన, ఏనసః, అవయజనమ్, అసి. ఏనసఏనసః=సర్వపాపమునకు, అవయజనమ్, అసి. (స్వాహా=అర్పిత మగుఁగాక.) "ఆత్మకృతస్యే" త్యాది మంత్రత్రయము శాఖాంతరములోనిది.)

తాత్పర్యము: ఓ పురోడాశ శకలమా! నేను దేవ మనుష్యాదుల విషయమై చేసిన పాపమును నశింపఁజేయుదాన వగుచున్నావు. (ఇది అర్పిత మగుఁగాక అని ఆయు పురోడాశ శకలములను ఆహవనీయమునం దంతట నుంచవలయును.)

16. అర్థము: హే సోమదేవ!, అప్సు=ఉదకములందు, ధౌతస్య=కడుగఁబడినదానవును, నృభిః=నరులచే, సుతస్య=నలగఁ గొట్టఁబడినదానవును, ఇష్ట యజుషః, స్తుతస్తోమస్య, శస్తోక్థస్య, (ఈ మూటి యర్థము 10వ మంత్రమునఁ జెప్పఁబడినది.) తే=నీ యొక్క, యః భక్షః=ఏ భక్షణ భాగము, అశ్వసనిః=అశ్వ ప్రదమో, యః=ఏ భక్షణ భాగము, గో సనిః=గో ప్రదమో, తే=నీకు సంబంధించిన, తస్య=ఆ, పితృభిః భక్షంకృతస్య=పితృదేవతలచే స్వభక్ష్యముగాఁ జేయఁబడిన, ఉపహూ తస్య=ఇతరులచే ననుజ్ఞాతమైన భక్షణ భాగముయొక్క, (అంశమ్=అంశమును,) ఉపహూతః=ఇతరులచే అనుజ్ఞాతుఁడనైన నేను, (ఆఘ్రాణేన=వాసన చూచుటచే,) భక్షయామి=భక్షించుచున్నాను.

తాత్పర్యము: దేవతాత్మకమైన ఓ సోమమా! ప్రక్షాళనాభిషవాది విశేషణోపేతమైన నీకు సంబంధించిన అశ్వప్రదము గోప్రదము ఉపహూతమునైన భక్షణ భాగముయొక్క అంశమును ఇతరులచే ననుజ్ఞాతుఁడనైన నేను ఆఘ్రాణ రూపమున భక్షించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు చమసములు గలిగియున్న ఋత్విజులు తమ తమ చమసములలోని రసమును ఆఘ్రాణించవలెను.)

పంచమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే షష్ఠోఽనువాకః। (పృషదాజ్యాభిధానము)

మూలము: [1]మహీనాం పయోఽసి విశ్వేషాం దేవానాం తనూర్ఋధ్యాసమద్య పృషతీనాం గ్రహం పృషతీనాం గ్రహోఽసి విష్ణోర్హృదయ మస్యేకమిష విష్ణుస్త్వాఽను వి చక్రమే భూతిర్దధ్నా ఘృతేన వర్ధతాం తస్య మేష్టస్య వీతస్య ద్రవిణమా గమ్యాజ్జ్యోతిరసి వైశ్వానరం పృశ్నియై దుగ్ధం [2]యావతీ ద్యావాపృథివీ మహిత్వా యావచ్చ సప్త సిన్ధవో వితస్థుః। తావన్తమిన్ద్ర తే (౧)గ్రహగ్ం సహోర్జా గృహ్ణామ్యస్తృతమ్। [3]యత్కృష్ణశకునః పృషదాజ్య మవమృశేచ్ఛూద్రా అస్య ప్రమాయుకాః స్యు ర్యచ్ఛ్వాఽవమృశే చ్చతుష్పాదోఽస్య పశవః ప్రమాయుకాః స్యు ర్యత్స్కన్దే ద్యజమానః ప్రమాయుకః స్యాత్పశవో వై పృషదాజ్యం పశవో వా ఏతస్య స్కన్దన్తి యస్య పృషదాజ్యగ్ం స్కన్దతి యత్పృషదాజ్యం పునర్గృహ్ణాతి పశూనేవాస్మై పునర్గృహ్ణాతి [4]ప్రాణో వై పృషదాజ్యం ప్రాణో వై (౨)ఏతస్య స్కన్దతి యస్య పృషదాజ్యగ్ం స్కన్దతి యత్పృష దాజ్యం పునర్గృహ్ణాతి ప్రాణమేవాస్మై పునర్గృహ్ణాతి [5]హిరణ్యమవధాయ గృహ్ణాత్యమృతం వై హిరణ్యం ప్రాణః పృషదాజ్య మమృత మేవాస్య ప్రాణే దధాతి శతమానం భవతి శతాయుః పురుషః శతేన్ద్రియ ఆయుష్యేవేన్ద్రియే ప్రతి తిష్ఠత్యశ్వమవ ఘ్రాపయతి ప్రాజాపత్యో వా అశ్వః ప్రాజాపత్యః ప్రాణః స్వాదేవాస్మై యోనేః ప్రాణం నిర్మిమీతే [7]వి వా ఏతస్య యజ్ఞ శ్ఛిద్యతే యస్య పృషదాజ్యగ్ం స్కన్దతి వైష్ణవ్యర్చా పునర్గృహ్ణాతి యజ్ఞో వై విష్ణు ర్యజ్ఞేనైవ యజ్ఞగ్ం సం తనోతి ॥౩॥ (తే పృషదాజ్యం ప్రాణో వై యోనేః ప్రాణం ద్వావిగ్ంశతిశ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠకే షష్ఠోఽనువాకః

## వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు భక్ష మంత్రము లభిహితములైనవి. ఈ షష్ఠానువాకమునందు వృషదాజ్యము చెప్పఁబడు చున్నది. (వృషదాజ్యము—పెరుగులో కలపఁబడిన నేయి.)

1. అర్థము: హే పృషదాజ్య!—ఓ పృషదాజ్యమా!, త్వమ్=నీవు, మహీనామ్—గోవులయొక్క, పయః=క్షీరము, అసి—అగు చున్నావు. విశ్వేషాం దేవానామ్—సర్వ దేవతలయొక్క, తనూః=శరీరము, అసి—అగుచున్నావు. అద్య—ఈ దినమున, పృషతీనామ్—దేవాశ్వములయొక్క, గ్రహమ్—గ్రహస్థానీయమైన నిన్ను, ఋధ్యాసమ్—వృద్ధి పొందించుచున్నాను. (త్వమ్—నీవు,) పృషతీనామ్—దేవాశ్వములయొక్క, గ్రహః=గ్రహస్థానీయము, అసి—అగుచున్నావు. విష్ణోః—యజ్ఞమునకు, హృదయమ్—ప్రియము, అసి—అగుచున్నావు. హే ఇషః—సర్వదేవత లచే కోరఁబడునట్టి ఓ పృషదాజ్యమా!, విష్ణుః—విష్ణువు, త్వా—నిన్ను, ఏకమ్—ముఖ్యమైనదానినిగా, విచ క్రమే—విశేషముగ స్వీకరించెను. దధ్నా=(ఇక్కడనున్న) పెరుగుచేతను, ఘృతేన—నేతిచేతను, భూతిః— (నీ)మహిమ, వర్ధతామ్—వృద్ధి నొందుఁగాక. ఇష్టస్య—(దేవతలకొఱకు)హుత మైనదియు, వీతస్య—(దేవత లచే) భక్షింపఁబడినదియునగు, తస్య—అట్టి పృషదాజ్యముయొక్క, ద్రవిణమ్—ఫలము, మా—నన్నుఁగూర్చి, ఆగమ్యాత్—వచ్చుఁగాక. త్వమ్—నీవు, వైశ్వానరం జ్యోతిః—సర్వ నరుల హితమును ప్రకాశింపఁజేయు దానవు, అసి—అగుచున్నావు. పృశ్నియై—శ్వేత గోవుయొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ), దుగ్ధమ్—క్షీరము, అసి— అగుచున్నావు.

తాత్పర్యము: ఓ వృషదాజ్యమా! నీవు గోవుల క్షీర మగుచున్నావు. దేవతల శరీరస్థితికి కారణ మగుచున్నావు. ఈ దిన మున దేవతాశ్వముల గ్రహస్థానీయమైన నిన్ను వృద్ధి నొందించుచున్నాను, దేవతాశ్వముల గ్రహస్థానీయ మగుచున్నావు. యజ్ఞమునకు ఇష్టమైనదానవు. సర్వదేవతలచే కోరఁబడుచున్న వృషదాజ్యమా! విష్ణువు నిన్ను ముఖ్య మైనదానినిగా గ్రహించెను. దేవతలకొఱకు హుతమును దేవతలచే భక్షితమునైన అటువంటి నీకుఁ గల ఫలము నాకుఁ జెందుఁ గాక. నీవు పెరుగుచేతను ఘృతముచేతను వృద్ధి నొందుదువు గాక. నీవు సర్వనరుల హితమును భాసింపఁజేయుదానవు. శ్వేతవర్ణము గల గోవుయొక్క క్షీర మగుచున్నావు. (జుహూపభృత్తులలోని పెరుగులోనికి నాలుగేసి మారులు ఆజ్యమును గ్రహించుచు ఈ మంత్రమును పఠించవలెను.)

2. అర్థము: హే ఇన్ద్ర!—ఓ యింద్రుఁడా! ద్యావాపృథివీ—ద్యావాభూములు, మహిత్వా—స్వ మహిమచేత, యావతీ—ఎంత పరిమాణము కలవియై, (వర్తేతే=ఉంటున్నవో,) చ—మరియు, సప్తసిన్ధవః—ఏడు సముద్రములు, యావత్— ఎంత కాలము, వితస్థుః—ఉన్నవో, తే—నీ యొక్క, తావన్తం గ్రహమ్—అంతటి గ్రహమును, ఊర్జా సహ— సారముతోఁ గూడ, అక్షితమ్—వినాశము చెందనివిధముగ, గృహ్ణామి—గ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఓ యింద్రా! ద్యావాభూములు వ్యాపించియున్న మేరవఱకు, సప్త సముద్రములు ఉన్నంత కాలమువఱకు నీ గ్రహమును సారముతోఁ గూడ నశింపకుండునట్లు గ్రహించుచున్నాను. (ప్రతిప్రస్థాత ఆగ్నీధ్రస్థానమందు ఔదుంబర స్రుక్కునందు ఈ మంత్రముచే దధిని గ్రహించి ఆజ్యముచే నభిఘారము చేసి తీసికొనవలెను.)

3. అర్థము: కృష్ణశకునిః—నల్లని వలనుపక్షి, పృషదాజ్యమ్—పృషదాజ్యమును, యత్ అవ మృశేత్—స్పృశించుచో, అన్యే— ఈ యజమాన సంబంధులగు, శూద్రాః—శూద్రులు, ప్రమాయుకాః స్యుః—మరణింతురు. శ్వా—శునకము, అవ మృశేత్—స్పృశించుచో, అన్య—ఈ యజమానునియొక్క, చతుష్పాదః పశవః—నాలుగు కాళ్ల పశువులు, ప్రమాయుకాః స్యుః—మరణించును. స్కన్దేత్ యత్—పృషదాజ్యము హోమ పాత్రమునుండి జాఱిపడినచో, యజమానః—యజమానుఁడు, ప్రమాయుకః స్యాత్—మరణించును. పశవః వై—పశువులే, పృషదాజ్యమ్— పృషదాజ్యము. యస్య—ఏ యజమానునియొక్క, పృషదాజ్యమ్—పృషదాజ్యము, స్కన్దతి—జాఱిపడుచున్నదో, ఏతస్య—ఈ యజమానునియొక్క, పశవః వా—పశువులే, స్కన్దన్తి—పడిపోవుచున్నవి. (తదా—అప్పుడు

యజమానః=యజమానుఁడు,) పృషదాజ్యమ్=పృషదాజ్యమును, పునః గృహ్ణాతి యత్=మఱల గ్రహించుచున్నచో, అస్మై=ఈ యజమానునికొఱకు, పశూనేవ=పశువులనే, పునః గృహ్ణాతి=మఱల గ్రహించినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: నల్లని వలనువక్షి పృషదాజ్యమును స్పృశించినచో యజమాన సంబంధులగు శూద్ర జనులు మరణింతురు. శునకము స్పృశించినచో యజమాన సంబంధములైన చతుష్పాత్పశువులు మరణించును. హోమ పాత్రము నుండి పృషదాజ్యము జాఱి పడినచో యజమానుఁడు మరణించును. పశువులే పృషదాజ్యము కనుక (గో క్షీరమునుండి ఏర్పడిన దధ్యాజ్యమిశ్రమమే పృషదాజ్యము కనుక పృషదాజ్యము పశుస్వరూపముగ వర్ణింపఁబడినది.) యజమానుఁడు గ్రహించిన పాత్రమునుండి పృషదాజ్యము జాఱిపడినచో అతని పశువులే పడిపోవును. అందుకు ప్రాయశ్చిత్తముగ మఱియొక పృషదాజ్యమును గ్రహించవలెను. అప్పుడా యజమానుఁడు తన నిమిత్తము పశువులనే మఱల గ్రహించినవాఁ డగును, (ఇది పృషదాజ్య పునర్గ్రహణ విధాయక మంత్రము. ఈ పునర్గ్రహణము పశు వినాశరూప దోష పరిహారార్థము ప్రశంసింపఁబడినది.)

4. అర్థము: ప్రాణః వా=ప్రాణమే, పృషదాజ్యమ్=పృషదాజ్యము. యస్య=ఏ యజమానునియొక్క, పృషదాజ్యమ్=పృషదాజ్యము, స్కన్దతి=జాఱిపడుచున్నదో, ఏతస్య=ఈ యజమానునియొక్క, ప్రాణః వా=ప్రాణమే, స్కన్దతి=పడుచున్నది. పృషదాజ్యమ్=పృషదాజ్యమును, పునః గృహ్ణాతి యత్=మఱల గ్రహించినచో, అస్మై=ఈ యజమానునికొఱకు, పునః=మఱల, ప్రాణమేవ=ప్రాణమునే, గృహ్ణాతి=గ్రహించుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: ప్రాణమే పృషదాజ్యము కావున, ఏ యజమానుని పృషదాజ్యము స్కన్న మగునో, అతని ప్రాణమే స్కన్న మగును. ఆ దోషము పోవుటకై మఱియొక పృషదాజ్యమును గ్రహించినచో యజమానుఁడు తనకై మఱల ప్రాణమును గ్రహించినవాఁ డగును. (ఇచట ప్రాణ వినాశ రూప దోషపరిహారముచేతఁ గూడ పృషదాజ్య పునర్గ్రహణము ప్రశంసింపఁబడినది.)

5. అర్థము: హిరణ్యమ్=బంగారమును, అవధాయ=(గ్రహణ పాత్రమునందు) ఉంచి, గృహ్ణాతి=గ్రహించవలెను. అమృతం వై=అమృతమే, హిరణ్యమ్=బంగారము. పృషదాజ్యమ్=పృషదాజ్యము, ప్రాణః=ప్రాణము. (తదా=అప్పుడు, ఇత్థం కృతవాన్ యజమానః=ఈ విధముగఁ జేసిన యజమానుఁడు,) అస్య=ఈ యజమానునియొక్క (తనయొక్క), ప్రాణే=ప్రాణమునందు, అమృతమేవ=అమృతమునే, దధాతి=ఉంచినవాఁ డగుచున్నాఁడు. (హిరణ్యమ్=గ్రహణ పాత్రమునం దుంచఁబడు బంగారము,) శతమానమ్=శత పరిమాణము కలదిగా, భవతి=అగుచున్నది. పురుషః=పురుషుఁడు, శతాయుః=శత సంవత్సర పరిమితమైన ఆయువు కలవాఁడు, శతేన్ద్రియః=శత సంఖ్యాకములైన ఇంద్రియములు కలవాఁడును, భవతి=అగుచున్నాఁడు. (తదా=అప్పుడు, యజమానః=యజమానుఁడు,) ఆయుషి=సంపూర్ణాయువునందు, ఇన్ద్రియే=ఇంద్రియ శతకమునందును, ప్రతితిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడు పృషదాజ్య గ్రహణ పాత్రమునందు బంగారము నుంచి దానిలోనికి పృషదాజ్యమును గ్రహించవలెను. హిరణ్య మమృతమే. పృషదాజ్యము ప్రాణ స్వరూపము. ఇట్లు చేసిన యజమానుఁడు తన ప్రాణమునందు అమృతమునే ఉంచినవాఁ డగును. ఆ బంగారము శత పరిమాణము కలదిగ నుండవలెను. మానవుని ఆయువు శత సంవత్సర పరిమితి కలది. అతని యింద్రియములు శత సంఖ్యాకములు. (ఈ విషయము ప్రథమకాండమున వివరింపఁబడినది. శతసంఖ్యా సాదృశ్యము ఇచటఁజెప్పఁబడినది.)

6. అర్థము: (పునర్గృహీతం పృషదాజ్యమ్=పునర్గృహీతమైన పృషదాజ్యమును,) అశ్వమ్=అశ్వమును (అశ్వముచేత,) అవ ఘ్రాపయతి=వాసన చూపించవలెను. అశ్వః=గుఱ్ఱము. ప్రాజాపత్యః వా=(ప్రజాపతియొక్క అక్షి జన్యము కావున,) ప్రాజాపత్యము కదా!, ప్రాణః=ప్రాణము, ప్రాజాపత్యః=(ప్రజాపతి సృష్ట మగుటచే), ప్రాజాపత్యము. (ఏవం కృతం చేత్=ఇట్లు చేయఁబడినచో,) అస్మై=ఈ యజమానునికొఱకు, స్వాత్ యోనేః ఏవ=స్వకీయ యోని రూపమైన అశ్వమునుండియే, ప్రాణమ్=ప్రాణమును, (యజమానః=యజమానుఁడు,) నిర్మిమీతే=నిర్మించినవాఁ డగును.

**తాత్పర్యము:** పూర్వోక్త దోష పరిహారమునకై గ్రహణ పాత్రమునందు పునర్గృహీతమైన పృషదాజ్యమును అశ్వముచే నాఘ్రాణము చేయించవలెను. అశ్వము ప్రజాపతి యక్షినుండి పుట్టినది కావున ప్రాజాపత్య మగును. ప్రాణమును ప్రజాపతి సృష్టించెను. కావున ప్రాజాపత్య మగును. రెండును ఏక కార్యములే కావున యజమానుఁడు స్వకీయ యోని రూపాశ్వమునుండియే ప్రాణనిర్మాణము చేసినవాఁ డగును.

7. **అర్థము:** యస్య=ఏ యజమానునియొక్క, పృషదాజ్యమ్=పృషదాజ్యము, స్కన్దతి=హోమసాధవమునుండి జాతి వడునో, ఏతస్య=ఈ యజమానునియొక్క, యజ్ఞః=యజ్ఞము, విచ్ఛిద్యతే వా=విచ్ఛిన్న మగుచున్నది కదా!. (తద్దోష నివారణాయ=ఆ దోషమును నివారించుటకై), వైష్ణవ్యర్చా="విష్ణో త్వం వ" ఇత్యాది విష్ణుపద ఘటితమైన ఋక్కుచే, పునర్గృహ్ణాతి=పృషదాజ్యమును పునర్గ్రహించవలెను. యజ్ఞః=యజ్ఞము, విష్ణుః వై=విష్ణు స్వరూపమే. (ఏవం చేత్=ఇట్లైనచో, యజమానః=యజమానుఁడు,) యజ్ఞమ్=యజ్ఞమును, యజ్ఞేనైవ=యజ్ఞముచేతనే, సం తనోతి=బాగుగ విస్తరింపఁజేసినవాఁ డగుచున్నాఁడు.

**తాత్పర్యము:** ఏ యజమానుని పృషదాజ్యము హోమ సాధనమునుండి జాతి వడునో, అతని యజ్ఞము విచ్ఛిన్న మగును కదా! తద్దోష పరిహారమునకై పృషదాజ్యమును "విష్ణో త్వం న" ఇత్యాది విష్ణుపద ఘటిత ఋక్కును పఠించుచు పునర్గ్రహణము చేయవలెను. ఆ ఋక్కు "జుష్టోవాచ" ఇత్యాద్యనువాకమునందు వ్యాఖ్యానింపఁబడినది. ఆపస్తంబులు "ఇదం విష్ణు ర్విచక్రమే" ఇత్యాది విష్ణు పద ఘటిత ఋక్కుచే పునర్గ్రహణము చేయవలెనని చెప్పినారు. ఆ ఋక్కు "యుఞ్జతే మన" ఇత్యాద్యనువాకమునందు వ్యాఖ్యాతము. యజ్ఞము విష్ణు స్వరూపమే కావున ఇట్లు చేసిన యజమానుఁడు యజ్ఞమును యజ్ఞముచేతనే విస్తరింపఁజేసినవాఁ డగును.

(జాతి వడిన పృషదాజ్యము నభిమంత్రించి ఉదకమును చల్లి స్రుచమును శుభ్రము చేసి దానియందు శత పరిమిత హిరణ్యము నుంచి మఱియొక పృషదాజ్యమును దానిలోనికి గ్రహించి దానిని అశ్వముచే నాఘ్రాణము చేయించి ఆయుతనమునం దుంచవలెను. 3, 4, 5, 6, 7వ మంత్రముల కన్నిటికి ఇదియే వినియోగము.)

షష్ఠానువాకము సమాప్తము.

---

## అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే సప్తమోఽనువాకః ।

మూలము: [1]దేవ సవితరేతత్తే ప్రాఽఽహ తత్ప్ర చ సువ ప్ర చ యజ బృహస్పతి ర్బ్రహ్మాఽఽయుష్మత్యా ఋచో మా గాత తనూపాత్సామ్నః సత్యా వ ఆశిషః సన్తు సత్యా ఆకూతయ ఋతం చ సత్యం చ వదత స్తుత దేవస్య సవితుః ప్రసవే [2]స్తుతస్య స్తుతమస్యూర్జం మహ్యగ్ం స్తుతం దుహామా మా స్తుతస్య స్తుతం గమ్యాచ్ఛస్త్రస్య శస్త్రమ్ (౧)అస్యూర్జం మహ్యగ్ం శస్త్రం దుహామా మా శస్త్రస్య శస్త్రం గమ్యాదిన్ద్రియావన్తో వనామహే ధుక్షీమహి ప్రజామిషమ్। సా మే సత్యాఽఽశీర్దేవేషు భూయా ద్బ్రహ్మవర్చసం మాఽఽగమ్యాత్। యజ్ఞో బభూవ స ఆ బభూవ స ప్ర జజ్ఞే స వావృధే। స దేవానా మధిపతి ర్బభూవ సో అస్మాగ్ం అధిపతీన్కరోతు వయగ్ం స్యామ పతయో రయీణామ్। [3]యజ్ఞో వా వై (౨)యజ్ఞపతిం దుహే యజ్ఞపతిర్వా యజ్ఞం దుహే స యః స్తుతశస్త్రయో ర్దోహమవిద్వా న్యజతే తం యజ్ఞో దుహే స ఇష్ట్వా పాపీయాన్భవతి స ఏనయోర్దోహం విద్వాన్యజతే స యజ్ఞం దుహే స ఇష్ట్వా వసీయా న్భవతి స్తుతస్య స్తుతమస్యూర్జం మహ్యగ్ం స్తుతం దుహామా మా స్తుతస్య స్తుతం గమ్యాచ్ఛస్త్రస్య శస్త్రమస్యూర్జం మహ్యగ్ం శస్త్రం దుహామా మా శస్త్రస్య శస్త్రం గమ్యాదిత్యాహైష వై స్తుతశస్త్రయో ర్దోహ స్తం య ఏవం విద్వా న్యజతే దుహ ఏవ యజ్ఞమిష్ట్వా వసీయాన్భవతి ॥ ౩ ॥

(శస్త్రం వై శస్త్రం దుహాం ద్వావిగ్ంశతిశ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠకే సప్తమోఽనువాకః ।

## వేదార్థదీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు పృషదాజ్య మభిహితమైనది. ఈ సప్తమానువాకమునందు స్తుతస్తోత్రములు చెప్పఁబడుచున్నవి. ఉద్గాతలచే గానము చేయఁబడు స్తోత్రములు స్తుతము లనఁబడును. హోతలచే గానము చేయఁబడు స్తోత్ర విశేషములు శస్త్రము లనఁబడును.

1. అర్థము: హే సవితః దేవ!=ప్రేరకుఁడవైన ఓ సవితృదేవా!, (అయమ్=ఈ ఉద్గాత,) ఏతత్="స్తోష్యామః"="స్తోత్రము చేయఁగలము" అనెడి ఈ వాక్యమును, తే=నీకొఱకు, ప్రాహ=పలికెను. తత్=ఆ స్తోత్రమును, (త్వమ్=నీవు,) ప్రసువ చ=ప్రకర్షతో అనుమతించుము. చ=మఱియు, ప్ర యజ=ఘనముగ యాగమును నిష్పాదింపఁజేయుము. (హే ఉద్గాతారః=ఓ ఉద్గాతలారా!,) బృహస్పతిః=బృహస్పతియేయైన (అహమ్=నేను,) బ్రహ్మ=(ఈ యజ్ఞమునందు) బ్రహ్మను. (మనుష్యమాత్రుఁడను గాను అని భావము. సః అహమ్=అటువంటి నేను, వః=మిమ్ముఁగూర్చి, బ్రవీమి=చెప్పుచున్నాను. యూయమ్=మీరు.) ఆయుష్మత్యాః=ఆయుస్థ్సానీయమైన నిర్వాహము కల, ఋచః=ఋక్కునుండి, మా గాత=తొలఁగి పోవలదు. తనూపాత్సామ్నః=స్తోత్ర శరీరమైన ఋక్కును రక్షించునట్టి సామమునుండి, మా గాత=తొలఁగి పోవలదు. (స్తోత్రే గీయమానే=స్తోత్రము గానము చేయఁబడుచుండఁగా,) వః=మీకు సంబంధించిన, ఆశిషః=యజమాన విషయములైన ఆశీస్సులు, ఆకూతయః=అభిప్రాయములు, సత్యాః=యథార్థములు, సన్తు=అగుఁగాక. (యూయమ్=మీరు, మనసా=మనస్సుచే,) ఋతమ్=యథార్థమును, (స్మరత=స్మరించుఁడు. వాచా=వాక్కుచేత,) సత్యమ్=యథార్థమును, వదత=చెప్పుఁడు. సవితుః దేవస్య=సవితృదేవునియొక్క, ప్రసవే సతి=అనుజ్ఞ కలుగుచుండఁగా, స్తుత=స్తోత్రమును పఠించుఁడు.

తాత్పర్యము: ఓ సవితృదేవా! "బ్రహ్మన్ స్తోష్యామః" అని యుద్గాత నీకొఱకు పలికియున్నాఁడు. ఆ స్తోత్రమును నీ వనుమతించుము. ఈ యజ్ఞమును ఘనముగ నిర్వర్తింపఁజేయుము. ఓ ఉద్గాతలారా! బృహస్పతియే అయిన నేను బ్రహ్మను. మనుష్యమాత్రుఁడను గాను. అటువంటి నేను చెప్పుచున్నాను. మీరు ఆయుష్మతి ఋక్కునుండి తొలఁగి పోవలదు. అనఁగా ఋగక్షరముల నుచ్చరించుటయందు సావధానులై యుండుఁడు. స్తోత్రముయొక్క శరీరమే ఋక్కు. అట్టి ఋక్కును రక్షించునది సామము. అట్టి సామమునందు మీరు అప్రమత్తులై యుండుఁడు. (ఋగక్షరాభివ్యక్తి సామముచేతనే చేయఁబడుచున్నది కదా!) మీరు గానము చేయుచుండఁగా యజమానునకు మీ రొసఁగిన ఆశీస్సులు, మీ యొక్క సంకల్ప రూపములైన తలఁపులు యథార్థము లగుఁగాక. మీరు మనస్సుచే యథార్థమును స్మరించుఁడు. వాక్కుచే సత్యమును బలుకుఁడు. సవితృదేవుని యనుజ్ఞ ననుసరించి స్తోత్రమును పఠించుఁడు. ("బ్రహ్మన్ స్తోష్యామః ప్రశాస్తః" అని యుద్గాత వలుకఁగా బ్రహ్మ "దేవ సవిత రేతత్తే" ఇత్యాదికమును జెప్పి "రశ్మిరసి క్షయాయ త్వా క్షయం జిన్వ" అని పలికి 'ఓం స్తుత' అని అనుజ్ఞ నీయుపలెను.)

2. అర్థము: (హే స్తోత్ర!=ఉద్గాతలచే గానము చేయఁబడుచున్న ఓ స్తోత్రమా!, త్వమ్=నీవు,) స్తుతస్య=స్తోత్రమునకు, స్తుతమ్=స్తోత్రము, అసి=అగుచున్నావు, (నీవు స్తోత్రములలో నుత్తమ స్తోత్రమవు అని అర్థము.) స్తుతమ్=(అటువంటి) స్తోత్ర రూపమైన, (త్వామ్=నిన్ను,) మహ్యమ్=నా కొఱకు (యజమానునికొఱకు), ఊర్జమ్=సారమును, దుహామ్=పితుకుచున్నాను. (ద్వికర్మక ప్రయోగము.) స్తుతస్య స్తుతమ్=ఉత్తమ స్తోత్రము, మా=నన్నుఁ గూర్చి, ఆగమ్యాత్=వచ్చుఁగాక. (హే శస్త్ర!=హోతలచే కీర్తింపఁబడుచున్న శస్త్రమా!, త్వమ్=నీవు,) శస్త్రస్య=శస్త్రమునకు, శస్త్రమ్=శస్త్రము, అసి=అగుచున్నావు. (ఉత్తమశస్త్రమని యర్థము.) శస్త్రమ్=అటువంటి శస్త్రమైన, (త్వామ్=నిన్ను,) మహ్యమ్=(యజమానుఁడనైన) నా కొఱకు, ఊర్జమ్=సారమును, దుహామ్=పితుకుచున్నాను. శస్త్రస్య శస్త్రమ్=ఉత్తమశస్త్రము, మా=నన్నుఁగూర్చి, ఆగమ్యాత్=వచ్చుఁగాక. ఇన్ద్రియావన్తః=(స్తుతశస్త్రము లయిన మీ యనుగ్రహమువలన మేము), వికలములు కాని యింద్రియములు కలవార మగుచు, వనామహే=స్వాపేక్షిత ఫలమును పొందుచున్నాము. ప్రజామ్=పుత్ర పౌత్రాది ప్రజను, ఇషమ్=అన్నమును, ధుక్షీమహి=సంపాదించుచున్నాము. దేవేషు=దేవతల విషయమై, మే=నాయొక్క, సా ఆశీః=యాగము చేయుచున్నా ననెడి ఆ యాశీస్సు, సత్యా భూయాత్=సత్య మగుఁగాక. బ్రహ్మవర్చసమ్=యజ్ఞానుష్ఠానురూప బ్రహ్మవర్చస్సు, మా=నన్నుఁగూర్చి, ఆగమ్యాత్=వచ్చుఁగాక.

(ఉత్తరోత్తర మభివృద్ధి నొందుఁగాక యని యర్థము.) యజ్ఞః=ఇప్పు డనుష్ఠింపఁబడుచున్న యజ్ఞము, బభూవ=సంపూర్ణ మైనది. సః=ఆ యజ్ఞము, ఆ బభూవ=మఱల అవృత్త మగుఁగాక. (లోడర్థమున లిట్.) సః=ఆ యజ్ఞము, ప్రజజ్ఞే=మమ్ము ఆలస్యము లేకుండ ననుష్ఠించువారినిగాఁ దెలిసికొనినది. (అత ఏవ=కనుకనే,) సః=ఆ యజ్ఞము, వావృధే=మా గృహమునందు పునఃపున రనుష్ఠానముచేత వృద్ధి నొందుఁగాక. (లోడర్థమున లిట్.) సః=ఆ యజ్ఞము, దేవానామ్=అస్మద్యాగోద్దిష్టులైన దేవతలకు, అధిపతిః=అధిపతి (పాలయిత), బభూవ=అగుఁగాక. (లోడర్థే లిట్.) సః=ఆ యజ్ఞము, అస్మాన్=మమ్ము, అధిపతీన్=అధికముగ అనుష్ఠానమునకు పాలకులనుగా, కరోతు=చేయుఁగాక. వయమ్ (అపి)=మేము కూడ, (యజ్ఞపురుషుని అనుగ్రహమువలన) రయీణామ్=ధనములకు, పతయః=ప్రభువులము, స్యామ=అగుదుము గాక.

**తాత్పర్యము:** ఓ స్తోత్రమా! నీవు ఉత్తమ స్తోత్రమవు. ఓ శస్త్రమా! నీవు ఉత్తమ శస్త్రమవు. మీ నుండి నేను నాకొఱకు సారమును సంపాదించుచున్నాను. మీ ఉభయుల అనుగ్రహమువలన మేము ఇంద్రియ వైకల్యము లేనివారమై అభీష్ట ఫలము నొందుచున్నాము. పుత్ర పౌత్రాది ప్రజను, అన్నమును సంపాదించుచున్నాము. దేవతల విషయమై యాగము చేయుచున్నా నవెడి ఆశీస్సు సత్య మగుఁగాక. యజ్ఞానుష్ఠాన రూప బ్రహ్మవర్చస్సు నాయందు ఉత్తరోత్తరాభివృద్ధి నొందుఁగాక. ఇప్పుడు మే మనుష్ఠించుచున్న యజ్ఞము సంపూర్ణ మైనది. అది పునరావృత్త మగుఁగాక. ఆ యజ్ఞము అస్మద్యాగోద్దిష్టులైన దేవతలను పాలించుఁగాక. మేము అనుష్ఠానమునకు అధికముగ పాలకుల మగుదుము గాక. యజ్ఞపురుషుని అనుగ్రహమువలన మేము యజ్ఞ సాధనములైన ధనముల కధిపతుల మగుదుము గాక. (యజమానుఁ డీ మంత్రమును పఠించుచు స్తుతశస్త్రముల ననుమంత్రించవలెను. స్తుతశస్త్రముల దోహమే అనుమంత్రణమని వైదికుల పరిభాష. ఆ దోహము "యజ్ఞో వా" ఇత్యాది శ్రుతియందు వివరింపఁబడినది.)

3. **అర్థము:** యజ్ఞః వై=యజ్ఞమే, యజ్ఞపతిమ్=యజ్ఞకర్తను, దుహే వా=రిక్తునిగాఁ (శూన్యునిగా) జేయుచున్నదా?, యజ్ఞపతిః=యజ్ఞకర్త, యజ్ఞమ్=యజ్ఞమును, దుహే వా=రిక్తముగాఁ జేయుచున్నాఁడా? (యజ్ఞ ఫలమును శూన్యముగాఁ జేయుట యనఁగా=యజ్ఞమునుండి సంపూర్ణ ఫలము నొందుట. యజమానుని శూన్యునిగాఁ జేయుట యనఁగా=దరిద్రునిగాఁ జేయుట యని యర్థము. "గాం దోగ్ధి పయః" అనుచోట గోవునుండి పాలు పితికినపుడు గోవు క్షీరశూన్య యగుచున్నది కదా! అట్లే "యజ్ఞం దుహే" అనుచోట కూడ యజ్ఞమునుండి ఫలము నొందినపుడు యజ్ఞము శూన్య మగునని భావము.) యః=ఏ యజమానుఁడు, స్తుతశస్త్రయోః=స్తుత శస్త్రములయొక్క, దోహమ్=దోహమును, అవిద్వాన్=తెలియనివాఁడై, యజతే=యాగము చేయుచున్నాఁడో, తమ్=ఆ యజమానుని, యజ్ఞః=యజ్ఞము, దుహే=రిక్తునిగాఁ జేయుచున్నది. సః=ఆ యజమానుఁడు, ఇష్ట్వా=(ఆ విధముగ) యజ్ఞము చేసి, పాపీయాన్=దరిద్రుఁడు, భవతి=అగుచున్నాఁడు. (యజ్ఞఫలమును పొందకుండుటయే గాక యజ్ఞమునకై ఉన్న ధనమును వినియోగించుటచే దరిద్రుఁ డగుచున్నాఁడు.) యః=ఏ యజమానుఁడు, ఏనయోః=ఈ స్తుతశస్త్రములయొక్క, దోహమ్=దోహమును, విద్వాన్=తెలిసికొనినవాఁడై, యజతే=యాగము చేయుచున్నాఁడో, సః=అతఁడు, యజ్ఞమ్=యజ్ఞమును, దుహే=రిక్తముగాఁ జేయుచున్నాఁడు. సః=అతఁడు, ఇష్ట్వా=యాగము చేసి, వసీయాన్=ధనవంతుఁడు, భవతి=అగుచున్నాఁడు. "స్తుతస్య స్తుతమస్యూర్జం.... ...శస్త్రం గమ్యాత్" ఇతి=అని, (ఈ మంత్ర భాగము 2వ మంత్రమునందుఁ గలదు. అచటనే వ్యాఖ్యానింపఁబడినది కూడ.) ఆహ=చెప్పెను. ఏషః వై=ఇదియే, స్తుతశస్త్రయోః దోహః=స్తుతశస్త్రములయొక్క దోహము (అనుమంత్రణము). యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, యజతే=యాగము చేయుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, యజ్ఞమ్=యజ్ఞమును, దుహే ఏవ=నిశ్చయముగ రిక్తముగాఁ జేయుచున్నాఁడు. (యజ్ఞమునుండి ఫలమును సంపాదించుచున్నాఁడు.) ఇష్ట్వా=యాగము చేసి, వసీయాన్=ధనవంతుఁడు, భవతి=అగుచున్నాఁడు. (ఇచట స్తుతశస్త్రముల దోహమనెడి అనుమంత్రణము విధింపఁబడినది. తాత్పర్యము అర్థమునందే వివరింపఁబడినది.)

సప్తమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

మూలము: [1]శ్యేనాయ పత్వనే స్వాహా వట్ట్స్వయ మభిగూర్తాయ నమో విష్టమ్భాయ ధర్మణే స్వాహా వట్ట్స్వయ మభిగూర్తాయ నమః పరిధయే జనప్రథనాయ స్వాహా వట్ట్స్వయ మభిగూర్తాయ నమ ఊర్జే హోత్రాణాగ్ం స్వాహా వట్ట్స్వయ మభిగూర్తాయ నమః పయసే హోత్రాణాగ్ం స్వాహా వట్ట్స్వయ మభిగూర్తాయ నమః ప్రజాపతయే మనవే స్వాహా వట్ట్స్వయ మభిగూర్తాయ నమ ఋతమృతపాః సువర్వాట్స్వాహా వట్ట్స్వయ మభిగూర్తాయ నమ [2]స్తృమ్పన్తాగ్ం హోత్రా మధోర్ఘృతస్య [3]యజ్ఞపతి మృషయ ఏనసా (౧)ఆహుః। ప్రజా నిర్భక్తా అనుతప్య మానా మధవ్యౌ స్తోకావప తౌ రరాధ। సం నస్తాభ్యాగ్ం సృజతు విశ్వకర్మా [4]ఘోరా ఋషయో నమో అస్త్వేభ్యః। చక్షుష ఏషాం మనసశ్చ సంధౌ బృహస్పతయే మహి షద్ద్యుమన్నమః। నమో విశ్వకర్మణే స ఉ పాత్వస్మా [5]ననన్యా న్సోమపా న్మన్యమానః। ప్రాణస్య విద్వాన్త్స మరే న ధీర ఏన శ్చకృవాన్మహి బద్ధ ఏషామ్। తం విశ్వకర్మన్ (౨)ప్ర ముఞ్చా స్వస్తయే [6]యే భక్షయన్తో న వసూన్యానృహుః। యానగ్నయో ఽన్వతప్యన్త ధిష్ణియా ఇయం తేషా మవయా దురిష్ట్యై స్విష్టిం నస్తాం కృణోతు విశ్వకర్మా। [7]నమః పితృభ్యో అభి యే నో అఖ్యన్యజ్ఞకృతో యజ్ఞకామాః సుదేవా అకామా వో దక్షిణాం న నీనిమ మా నస్తస్మాదేనసః పాపయిష్ట। [8]యావన్తో వై సదస్యాస్తే సర్వే దక్షిణ్యాస్తేభ్యో యో దక్షిణాం న (౩)నయేదైభ్యో వృశ్చ్యేత యద్వైశ్వకర్మణాని జుహోతి సదస్యానేవ తత్ప్రీణాత్యస్మే దేవాసో వపుషే చికిత్సత

యమాశిరా దంపతీ వామమశ్ఞుతః। పుమాన్పుత్రో జాయతే విన్దతే వస్వథ విశ్వే అరపా ఏధతే గృహః। [10]ఆశీర్దాయా దంపతీ వామమశ్నుతా మరిష్టో రాయః సచతాగ్ం సమోకసా। య ఆఽసిచ త్సందుగ్ధం కుమ్భ్యా సహేష్టేన యామన్నమతిం జహాతు సః। [11]సర్పిర్గ్రీవీ (౪)పీవర్యస్య జాయా పీవానః పుత్రా అకృశాసో అస్య। సహజానిర్యః సుమఖస్యమాన ఇన్ద్రాయా ఽఽశిరగ్ం సహ కుమ్భ్యాఽదాత్। [12]ఆశీర్మ ఊర్జముత సుప్రజాస్త్వమిషం దధాతు ద్రవిణగ్ం సవర్చసమ్। సంజయన్క్షేత్రాణి సహసాఽహమిన్ద్ర కృణ్వానో అన్యాగ్ం అధరా న్త్సపత్నాన్। [13]భూతమసి భూతే మా ధా ముఖమసి ముఖం భూయాసం [14]ద్యావాపృథివీభ్యాం త్వా పరి గృహ్ణామి [15]విశ్వే త్వా దేవా వైశ్వానరాః (౫)ప్ర చ్యావయన్తు దివి దేవా న్దృగ్ంహాన్తరిక్షే వయాగ్ంసి పృథివ్యాం పార్థివా [16]స్ధ్రువం ధ్రువేణ హవిషాఽవ సోమం నయామసి। యథా నః సర్వమిజ్జగదయక్ష్మగ్ం సుమనా అసత్। యథా న ఇన్ద్ర ఇద్విశః కేవలీః సర్వాః సమనసః కరత్। యథా నః సర్వా ఇద్విశోఽస్మాకం కేవలీ రసన్ ॥ ౬ ॥

(ఏనసా విశ్వకర్మన్యో దక్షిణాం న సర్పిర్గ్రీవీ వైశ్వానరా శ్చత్వారిగ్ంశచ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

## వేదార్థదీపిక

అవతారిక: సప్తమానువాకమునందు స్తుతశస్త్రముల అష్టమానుమంత్రణము చెప్పఁబడినది. ఈ అనువాకమునందు తృతీయ సవన మాధ్యందిన సవన గత హోమవిశేష మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: శ్యేనాయ-శ్యేనరూపమును, పత్వనే-పతన శీలము కలిగినదియునగు "ఇన్ద్ర ఋభుభిః" అను యాజ్యచే ప్రతిపాద్యమైన దేవతకొఱకు, స్వాహా-ఈ హవిస్సు హుత మగుఁగాక. వట్-అవశ్యము, స్వయమ్-స్వయముగా, అభిగూర్తాయ-సోమసమీపమునకుఁ బోవుటకు ఉద్యతమైన దేవతకొఱకు, నమః-నమస్కారము.

విష్టమ్భాయ=శత్రు వినాశకమును, ధర్మణే=అస్మత్పోషకమునగు, "ఇన్ద్రావరుణా సుతపా"విత్యాది యాజ్యాభి హిత దేవతకొఱకు, స్వాహా=ఇది హుత మగుఁగాక. వట్, స్వయమ్, అభిగూర్తాయ, నమః. (వీని యర్థము అన్ని వాక్యములందు పూర్వోక్తమే.) పరిధయే=అంతటను ధరింపఁజేయునదియు, జనప్రథనాయ=జనులను ప్రఖ్యాపన చేయునదియునగు, "ఇంద్రశ్చ సోమం పిబాతా" మిత్యాది యాజ్యా ప్రతిపాద్య దేవతకొఱకు, స్వాహా. వట్, స్వయమ్, అభిగూర్తాయ, నమః. హోతౄణామ్=హోమకర్తలకు, ఊర్జే=ఊర్గ్రూపమైన అన్నము నిచ్చునట్టి, "ఆ వో వహన్తు సప్తయే" ఇత్యాది యాజ్యా ప్రతిపాద్యమైన దేవతకొఱకు, స్వాహా. వట్, స్వయమ్, అభిగూర్తాయ, నమః. హోతౄణామ్=హోమకర్తలకు, పయసే=క్షీరప్రదుఁడైన, ప్రజా పతయే=ప్రజా పాలకుఁడును, మనవే=మంతవ్యుఁడునగు, "ఇన్ద్రావిష్ణూ పిబతమ్" ఇత్యాది యాజ్యా ప్రతి పాద్య దేవునికొఱకు, స్వాహా. వట్, స్వయమ్, అభిగూర్తాయ, నమః. హే ఋతపాః!=సత్యపాలకుఁడవును, హే సువర్వాట్!=స్వర్గప్రాపకుఁడవునగు ఓ దేవా!, ఋతమ్=మా యజ్ఞమును, (పాలయ=పాలించుము.) "ఇమం స్తోమ మర్హతే" ఇత్యాది యాజ్యా ప్రతిపాద్యుఁడవైన, తస్మై తుభ్యమ్=అటువంటి నీ కొఱకు, స్వాహా=ఇది హుతమగుఁగాక. వట్, స్వయమ్, అభిగూర్తాయ, నమః.

**తాత్పర్యము:** "ఇన్ద్రఋభుభిః" ఇత్యాది యాజ్యలచే ప్రతిపాద్యులయిన దేవతలకొఱకు ఈ హవిస్సు హుత మగుఁగాక యని సారాంశము. ఈ మంత్రములందుఁ జెప్పఁబడిన తత్తద్యాజ్యా ప్రతిపాద్యులైన దేవతలకొఱకు చమసములను హోమము చేయవలెను. ఇవి ప్రస్థిత యాజ్యా హోమములు.

2. **అర్థము:** హోత్రా=హోతచే, హూయమానాః దేవాః=ఆహ్వానింపఁబడుచున్న దేవతలు, మధోః=మధువుచేతను, ఘృతేన=ఆజ్యముచేతను, తృమ్పన్తామ్=తృప్తినొందుదురు గాక. ('మధోః' 'ఘృతస్య'– ఇవి తృతీయార్థమున షష్ఠ్యంతములు.)

**తాత్పర్యము:** హోతచే నాహ్వానింపఁబడిన దేవతలు మదువుచేతను ఆజ్యముచేతను తృప్తి నొందుదురు గాక. (ఇవి తృతీయ సవనగత మంత్రములు.)

3. **అర్థము:** యదా=ఎప్పుడు, ప్రజాః=ప్రజలు, నిర్భక్తాః=అన్నము లేనివారు, అనుతప్యమానాః=అనుక్షణము తపింపఁబడినవారును, (భవన్తి=అగుచున్నారో, తదానీమ్=అప్పుడు,) ఋషయః=ఋషులు, యజ్ఞపతిమ్=యజ్ఞకర్తను, ఏనసా(యుక్తమ్)=పాపముతోఁ గూడినవానినిగా, ఆహుః=చెప్పిరి (ప్రకటించిరి). మధవ్యౌ=వసన్తఋతు సంబంధములైన చైత్ర వైశాఖ మాసములు, స్తోక్యౌ=జ్యోతిష్టోమముచే స్తుతింప యోగ్యములైనవి. తౌ=అటువంటి చైత్ర వైశాఖములను, (యజమానః=యజమానుఁడు,) స్తుతిమకృత్వా=జ్యోతిష్టోమముచే స్తుతింపక,) అపరరాధ=అపరాధము చేసెను. (అనేన అపరాధేన పాపీ యజమానః ఇతి ఋషయః అహుః=ఈ అపరాధముచే యజమానుఁడు పాపి యయ్యెనని ఋషులు ప్రకటించిరి. అతః=ఇందువలన,) విశ్వకర్మా=విశ్వకర్మ, నః=(యజ్ఞపతులమైన)మమ్ము, తాభ్యామ్=ఆ చైత్ర వైశాఖములతో, సంసృజతు=కలుపుఁగాక (ఆ మాసములయందు జ్యోతిష్టోమము ననుష్ఠించువారినిగా మమ్ముఁ ప్రేరణచేయుఁగాక).

**తాత్పర్యము:** యజ్ఞపతి చైత్ర వైశాఖ మాసములందు జ్యోతిష్టోమ యాగము చేయకుండుటచే ప్రజలు అన్నము లేనివారై బాధపడుచున్నారనియు, అందువలన ఈ యజమానుఁడు పాపి యనియు ఋషులు ఉద్ఘాటించుచున్నారు. కావున విశ్వకర్మ యజ్ఞపతులమైన మమ్ము చైత్ర వైశాఖ మాసములందు జ్యోతిష్టోమము ననుష్ఠించుటకు ప్రోత్సహించుఁ గాక. (ఈ ఋక్కు మొదలుకొని అయిదు ఋక్కులతో ఆగ్నీధ్ర స్థానమునందలి యగ్ని యందు అయిదు వైశ్వకర్మ హోమములను జేయవలెను. ఇది మొదటి ఋక్కు.)

4. **అర్థము:** ఋషయః=పూర్వోక్త ఋషులు, ఘోరాః=ఉగ్రులు. (అతః=ఇందువలన,) ఏభ్యః=ఈ ఋషులకొఱకు, నమః=నమస్కారము, అస్తు=అగుఁగాక. ఏషామ్=ఈ ఋషులయొక్క, చక్షుషః=చక్షుస్సునకు, (అస్మాకమ్=మాయొక్క, మనసశ్చ=మనస్సునకును, సంధౌ=సంధాననిమిత్తము, మహి=గొప్పదియు, సత్=పొందునదియు, ద్యుమత్=(భక్తిభావముతో నావిర్భవించుటచే భక్తిరూప) కాంతి కలదియునగు, నమః=నమస్కారము. విశ్వకర్మణే=ప్రజాపతికొఱకు, నమః=నమస్కారము, స ఉ=ఆ విశ్వకర్మ కూడ, అస్మాన్=మమ్ము, పాతు=రక్షించుఁ గాక. (ఇది రెండవ ఋక్కు.)

**తాత్పర్యము:** మా యపరాధము నన్వేషించి యీ యజమానుఁడు పాపి యని జనులయెదుట నిందించుటవలన పూర్వోక్త ఋషులు ఉగ్రులు. అట్టి ఋషులకు నమస్కారము. ఈ నమస్కారముచే ఋషులు శాంతులై మమ్ము నిందింపకుందురు గాక. ఋషులు మమ్ము అనుగ్రహయుక్త మయిన కటాక్షముతోఁ జూచునట్లును, మేము కర్మానుష్ఠానముచే అపరాధ రహితులమై మనస్సునందు భక్తి కలవార మగునట్లును బృహస్పతి అనుగ్రహించుటకై ఆ బృహస్పతికి నమస్కారము. ఈ నమస్కార మష్టాంగోపేత మైనది. భక్తి యుక్తమైనది. విశ్వమును సృష్టించునట్టి ప్రజాపతికి నమస్కారము. ఆ విశ్వకర్మయు మమ్ము అనుష్ఠాన ప్రవర్తనచేత రక్షించుఁ గాక. (సీదతీతి='సత్'. 'షద్ల్=విశరణ గత్యవసాదనేషు' అను ధాతువునుండి పుట్టిన 'సత్' అను శబ్దమునకు బొందునది యని యర్థము చెప్పఁబడినది.)

5. **అర్థము:** హే విశ్వకర్మన్!=ఓ ప్రజాపతీ! (త్వమ్=నీవు,) అనన్యాన్=నిన్నుఁగాక గత్యంతరము లేనివారమగు, (నః=మమ్ము,) సోమపాన్=సోమపానము చేయువారినిగా, మన్యమానః=తలఁచుచున్నవాఁడవై, సమరే=యుద్ధమునందు, ప్రాణస్య=(పరునియొక్క) ప్రాణమునకు, (ఆపదమ్=ఆపదను,) విద్వాన్=తెలిసికొనిన, ధీరః న=ధీరపురుషుఁడువలె, (పాతుమ్=రక్షించుటకు, అర్హసి=తగియున్నావు, అయమ్=ఈ యజమానుఁడు,) బద్ధః=తమో గుణావృతుఁడై, ఏషామ్=ఈ ఋషులకు, మహి=గొప్పదియైన, ఏనః=అపరాధమును, చకృవాన్=చేసినవాఁడు. తమ్=ఆ అపరాధిని, స్వస్తయే=వినాశము లేకుండుటకై, (తస్మాత్=ఆ యపరాధము నుండి,) ప్రముఞ్చ=విముక్తునిఁ జేయుము. (ప్రముఞ్చ=ప్రముఞ్చ.)

**తాత్పర్యము:** ఓ విశ్వకర్మవైన ప్రజాపతీ! నిన్నుఁగాక గత్యంతరము లేని మమ్ము సోమపానము చేయువారినిగాఁ దలఁచుచున్నవాఁడవై యుద్ధమునందు పరుని ప్రాణమున కపాయము గ్రహించిన ధీరపురుషుఁ డతని రక్షించు విధముగ రక్షించుట కర్హుఁడవు. ఈ యజమానుఁడు అజ్ఞానావృతుఁడై ఈ మహర్షులకు మహాపరాధమును జేసెను. అతనికి నాశము లేకుండుటకై ఆ యపరాధమునుండి అతనిని విముక్తునిఁ జేయుము. (ఇది మూఁడవ ఋక్కు.)

6. **అర్థము:** యే=ఏ యష్టలు (యాగము చేయువారు), భక్షయన్తః న=భక్షించుచున్నవారువలె, వసూని=ధనములను, ఆనృహుః=పూజించిరో, యాన్=ఏ యష్టలను గూర్చి, ధిష్ణియాః=ఆ యా ఆగ్నీధ్రాదుల స్థానములం దున్నట్టి, అగ్నయః=అగ్నులు, అన్వతప్యన్త=ఖేదపడెనో, తేషామ్=ఆ యష్టల సంబంధమైన, దురిష్ట్యై=దుష్టయాగమునకు (యాగాభావమునకు), అవయాః=వినాశకమైన, ఇయమ్=ఈ యిష్టి, యా అస్తి=ఏది కలదో, తామ్=ఆ యీ యిష్టిని, నః=మాకు, విశ్వకర్మా=ప్రజాపతి, స్విష్టిమ్=మంచి యాగమునుగా, కృణోతు=చేయుఁగాక.

**తాత్పర్యము:** కొందఱు యాగకర్తలు యాగము చేయుదుమని చెప్పి ధనము సంపాదించి యాగము చేయక ఆ ధనమును భోగమునకై ఉపయోగించుచుందురు. అట్టివారిని జూచి ఆ యా ఆగ్నీధ్రాది స్థానములందలి యగ్నులు, వీరు మిక్కిలి శోచింపఁదగినవారని ఖేదపడుచున్నవి. అట్టివారియొక్క దురిష్టిని నశింపఁజేయునట్టి యీ మా యిష్టిని విశ్వకర్మ మంచి యిష్టిగాఁ జేయుఁగాక. (ఇది నాల్గవ ఋక్కు.)

7. **అర్థము:** యే=ఏ పితృదేవతలు, నః=మమ్ము, అభ్యఖ్యన్=అభిముఖముగఁ జూచుచున్నారో, (వర్తమానార్థే లఙ్ ప్రయోగః ఛాన్దసః.) యజ్ఞకృతః=యజ్ఞమును జేయించువారును, యజ్ఞకామాః=మా యజ్ఞమును గోరుచున్నవారునగు, (తేభ్యః) పితృభ్యః=ఆ పితృదేవతలకొఱకు, నమః=నమస్కారము. హే పితరః!=ఓ పితృదేవతలారా!, (వయమ్=మేము,) అకామాః=యజ్ఞము చేయుటకు ఇచ్ఛా రహితులమై, వః=మీ కొఱకు, దక్షిణామ్=దక్షిణోపలక్షితమైన యజ్ఞమును, న నీనిమ=పొందింపలేకపోయితిమి. తస్మాత్=ఆ, ఏనసః=పాపమువలన, నః=మమ్ము, మా పాపయిష్ట=పాపులనుగాఁ జేయవలదు.

**తాత్పర్యము:** యజ్ఞము చేయించువారును, మా యజ్ఞమును గోరువారును, బాగుగ ప్రకాశించువారునగు పితృదేవతలు మమ్ము అభిముఖముగఁ జూచుచున్నారు. అట్టి పితృదేవతలకు నమస్కారము. ఓ పితృదేవతలారా! మేము

ప్రమాదాలస్యాదులవలన యజ్ఞము చేయుటయం దిచ్ఛ లేనివారమై మీకు యజ్ఞము చేయమైతిమి. ఆ పాపమువలన మమ్ము పాపులనుగాఁ జేయకుఁడు. (ఇది పంచమ ఋక్కు.)

8. అర్థము: యావన్తః వై=ఎంతమందియైతే, సదస్యాః=(యజ్ఞమును జూచుటకు వచ్చి,) సభయం దున్నవారో, తే సర్వే=వా రందఱు, దక్షిణ్యాః=దక్షిణార్హులు. తేభ్యః=ఆ సదస్యులకొఱకు, యః=ఏ యజమానుఁడు, దక్షిణామ్=దక్షిణను, న నయేత్=పొందించలేదో (ఈయలేదో), సః=అతఁడు, ఏభ్యః=ఈ సదస్యులనుండి, వృశ్చ్యేత=వేఱుచేయఁబడిన వాఁ డగుచున్నాఁడు. వైశ్వకర్మణాని జుహోతి యత్=వైశ్వకర్మణ హోమములను జేసినచో, (సః=అతఁడు,) తత్=ఆ హోమముచేత, సదస్యాన్=సభయం దున్నవారిని, ప్రీణాత్యేవ=నిశ్చయముగ సంతోషపఱచుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞమును జూచుటకై వచ్చి సభయం దున్నవా రందఱు దక్షిణ పొందుట కర్హులు. వారికి దక్షిణ నొసఁగని యజమానుఁడు వీరి నుండి వేఱు చేయఁబడినవాఁ డగును. వైశ్వకర్మణము లనెడి హోమములు చేసినచో నతఁ డా హోమముచేత నిశ్చయముగ సదస్యులను సంతోషపఱచును.

9. అర్థము: హే దేవాసః=ఓ దేవతలారా!, (యూయమ్=మీరు,) అస్మే=మాయొక్క, వపుషే=శరీరముకొఱకు, చికిత్సత=చికిత్స చేయుఁడు. దంపతీ=పత్నీ యజమానులు, ఆశిరా=(దోహనపాత్రమందు అక్షతాదుల నుంచుటచే) ఘనీభూతమైన దధిచే, యమ్=ఏ, వామమ్=సౌందర్యమును, అశ్నుతః=పొందుచున్నారో, తేన=దానిచేత, పుమాన్ పుత్రః=పురుష సంతానము, జాయతే=పుట్టుచున్నది. (సః=ఆ పురుషుఁడు,) వసు=ధనమును, విన్దతే=పొందుచున్నాఁడు. అథ=మఱియు, విశ్వే=ఏతత్సంబంధు లందఱు, అరపాః=జ్ఞానవంతులై, గృహాః=ఇతని గృహమునందు (సప్తమ్యర్థే ప్రథమా). ఏధతే=వృద్ధి నొందుచున్నారు. (ఇచట రేఫాంతమైన ఆశీర్శబ్దమునకు మథిత దధి యని యర్థము. ఇది సకారాంతము కాదు.

తాత్పర్యము: ఓ దేవతలారా! మీరు మా శరీరము పాపరహిత మగునట్లు చికిత్స చేయుఁడు. పాలు పితుకు పాత్రమందలి పాలు అక్షతాదుల నుంచుటచే ఘనీభవించిన (గడ్డకట్టిన) దధి యగును. అట్టి దధిచేత పత్నీయజమానులు సౌందర్యవంతు లగుదురు. ఆ సౌందర్యముచే వారికి పుత్రుఁడు కలుగును. అతఁడు ధనము నొందును. మఱియు నతనికి సంబంధించినవా రందఱు జ్ఞానవంతులై అతని యింటియందు వృద్ధి పొందుదురు. (ఆశిర మనఁగా మథితమైన దధి యని యర్థము. యజమానపత్ని ఆశిరమును మథించవలెను. పూతభృత్తనెడి పాత్రమందు ఉత్తర దిశకు అంచులు వచ్చునట్లుగా పవిత్రమును పఱచి దానిని తూర్పుదిక్కునందు యజమానుఁడు పశ్చిమ దిగభిముఖుఁడై యుండి భార్యతోఁ గూడ ఆ పాత్రమందు ఆశిరమును ఈ మంత్రమును పఠించుచు పోయవలెను. ఇట్లు నాలుగు ఋక్కులతోఁ జేయవలెను. ఇది మొదటి ఋక్కు.)

10. అర్థము: ఆశీర్దాయా=ఆశీర్దధి నిచ్చుచున్నవారును, సమోకసా=బాగుగా ఒక గృహమునం దుండువారునగు, దంపతీ=పత్నీయజమానులు, వామమ్=మంగళమును, అశ్నుతామ్=పొందుదురు గాక. అరిష్టః=హింసారహితుఁడైన పత్నీసహిత యజమానుఁడు, రాయః=ధనములను, సచతామ్=పొందుఁగాక. యః=ఏ యజమానుఁడు, ఇష్టేన సహ=ప్రీతియుక్తుఁడై, యామన్=ఆధారమైన సోమమునందు, సందుగ్ధమ్=ఆశీర్దధిభావము నొందిన మంచి పాలను, కుమ్భ్యా=సంపూర్ణ ఘటముచేత, అసిచత్=అంతటను చల్లెనో (తడిపెనో), సః=ఆ యజమానుఁడు, అమతిమ్=రోగమును, దుర్బుద్ధిని, జహాతు=విడుచుఁగాక. (ఇష్టేన మహ=ఇష్టేన సహితః అని యర్థము.)

తాత్పర్యము: ఆశీర్దధి నిచ్చువారును, ఏక గృహ నివాసులునైన పత్నీయజమానులు మంగళము నొందుదురు గాక. హింసారహితుఁడైన పత్నీ సహిత యజమానుఁడు ధనముల నొందుఁగాక. ప్రీతియుక్తుఁడై ఆధారభూత సోమమునందు ఆశీర్దధి భావము నొందిన మంచి పాలను సంపూర్ణ ఘటముచే నంతటను చల్లిన యజమానుఁడు రోగమును దుర్బుద్ధిని విడుచుఁగాక. "ఆశీర్దాయౌ", 'సమోకసౌ' అని యుండవలెను. ఆశీర్దాయా, సమోకసా అను ప్రయోగములు ఛాందసములు. ఇది ద్వితీయ ఋక్కు.)

11. అర్థము: సహజానిః=పత్నీ సహితుఁడైన, యః=ఏ యజమానుఁడు, సుమఖస్యమానః=బాగుగ యజ్ఞము చేయ నిచ్ఛ కలవాఁడై, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, కుమ్భ్యా సహ=పూర్ణకుంభముతోఁ గూడ, ఆశిరమ్=ఆశీర్దధిని, అదాత్=ఇచ్చెనో, అస్య=ఈ యజమానునియొక్క, జాయా=భార్య, సర్పిర్గ్రీవీ=స్నిగ్ధకంఠయు (కోమల ధ్వని కలదియు), పీవరీ=సర్వావయవపుష్టి కలదియు, (భవతు=అగుఁగాక.) అస్య=ఈ యజమానుని యొక్క, పుత్రాః=కుమారులు, పీవానః=సర్వాంగపుష్టి కలవారును, అకృశాసః=కృశింపనివారును, భవన్తు= అగుదురుగాక.)

తాత్పర్యము: భార్యాసహితుఁడై బాగుగ యజ్ఞము చేయ నిచ్ఛయించినవాఁడై యింద్రునకు సంపూర్ణ కుంభముతోఁ గూడ ఆశీర్దధి నిచ్చిన యజమానునియొక్క భార్య సర్వాంగ సౌష్ఠవము కలదియు, కోమల కంఠస్వరము కలదియు నగుఁగాక. అతని కుమారులు సర్వాంగపుష్టి కలవారును, వ్యాధ్యాది జనిత కార్శ్యము లేనివారు నగుదురు గాక. (ఇది తృతీయ ఋక్కు.)

12. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, (భవాన్=నీవు, మదర్థమ్=నాకొఱకు,) ఊర్జమ్=బలమును, దధాతు=ధరింపఁ జేయుము (నాకు బలము నొసఁగుము). ఉత=మఱియు, సవర్చసమ్=వర్చస్సహితమైన, సుప్రజాస్త్వమ్= శోభన సంతానవత్త్వమును, ఇషమ్=అన్నమును, ద్రవిణమ్=ధనమును, దధాతు=ధరింపఁజేయుము (ఒసఁగుము). అహమ్=నేను, క్షేత్రాణి=వైరిసంబంధములైన క్షేత్రములను, సహసా=బలముచేత, సంజ యన్=జయించుచున్నవాఁడనై, అన్యాన్ సపత్నాన్=ఇతర శత్రువులను, అధరాన్=అస్మదాజ్ఞాబద్ధులనుగా, కుర్వాణః=చేయుచున్నవాఁడను, భూయాసమ్=అగుదును గాక, (ఇతి=అని,) మే=నాయొక్క, ఆశీః= ప్రార్థన.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు బలమును వర్చస్సుతోఁ గూడిన శోభనసంతానవత్త్వమును ధనమును నా కొసఁగుదువు గాక. నేను శత్రు క్షేత్రములను బలముతో స్వాధీనముగాఁ జేసికొనుచు ఇతర శత్రువులను అస్మదాజ్ఞాబద్ధుల నుగాఁ జేయుచున్నవాఁడ నగుదును గాక యని నా ప్రార్థన. (ఇది చతుర్థ ఋక్కు.)

13. అర్థము: (హే ధ్రువః=ఓ ధ్రువపాత్రమా!, త్వమ్=నీవు,) భూతమ్=నిత్య సిద్ధ స్వరూపము, అసి=అగుచున్నావు. భూతే=నిత్యసిద్ధ స్వరూపమైన స్వర్గాదియందుఁ గాని, పరమాత్మయందుఁ గాని, మా=నన్ను, ధాః=స్థాపిం చుము. (కించ=మఱియు,) ముఖమ్=(సర్వ గ్రహములలో) ముఖ్యమైనదానవు. అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన, త్వత్ప్రసాదాత్=నీ యనుగ్రహము వలన,) ముఖమ్=(అందఱిలో) ముఖ్యుఁడను, భూయాసమ్=అగుదును గాక.

తాత్పర్యము: ఓ ధ్రువగ్రహమా! నీవు నిత్య సిద్ధ స్వరూప మగుచున్నావు. నిత్య సిద్ధ స్వరూపమైన స్వర్గాదికమునందుఁ గాని, పరమాత్మయందుఁ గాని, నన్ను స్థాపించుము. మఱియు నీవు సర్వ గ్రహములలో ముఖ్యమైనదానవు. కావున నీ యనుగ్రహమువలన నేను అందఱిలో ముఖ్యుఁడను అగుదును గాక. (ప్రతిప్రస్థాత ఈ మంత్ర మును పఠించుచు ధ్రువపాత్రమును జూడవలెను.)

14. అర్థము: (హే ధ్రువ!=ఓ ధ్రువ గ్రహమా!) ద్యావా పృథివీభ్యామ్=ద్యావా భూములవంటి అంజలి పుటముల (దోసిలి) చే, త్వా=నిన్ను పరిగృహ్ణామి=స్వీకరించుచున్నాను.

తాత్పర్యము: ఓ ధ్రువపాత్రమా! ద్యావా భూములవంటి అంజలి పుటములచే నిన్ను స్వీకరించుచున్నాను. (ఈ మంత్ర మును చెప్పుచు దోసిలిచే ధ్రువ పాత్రమును గ్రహించవలెను.)

15. అర్థము: హే ధ్రువః=ఓ ధ్రువ గ్రహమా!, వైశ్వానరాః=విశ్వమానవ సంబంధులయిన, విశ్వే దేవాః=దేవత లందఱు త్వా=నిన్ను, ప్రచ్యావయన్తు=(స్వస్థానమునుండి) చలింపఁజేయుదురు గాక. (త్వమ్=నీవు) దివి=స్వర్గము నందు, దేవాన్=దేవతలను, అన్తరిక్షే=ఆకాశమునందు, వయాంసి=పక్షులను, పృథివ్యామ్=భూమియందు, పార్థివాన్=పర్వతాదులను, దృంహ=దృఢముగాఁ జేయుము.

తాత్పర్యము: ఓ ధ్రువ గ్రహమా! విశ్వ మానవ సంబంధులగు సర్వ దేవతలు నిన్ను స్వస్థానమునుండి కదలింతురు గాక. నీవు స్వర్గమునందు దేవతలను, ఆకాశమునందు పక్షులను, భూమియందు పర్వతాదులను దృఢముగాఁ జేయుము. నీ చలనముచే సర్వజగత్తును చలింపఁజేయకుము. (ఈ మంత్రము పఠించుచు ధ్రువ పాత్ర మును కదలించవలెను.)

16. అర్థము: యథా=ఏ విధముగ, నః=మాయొక్క, సర్వమ్ ఇత్ జగత్=సమస్తమైన గవాది జంగమ జగత్తు, అయక్ష్మమ్=రోగ రహితము, సుమనాః=శోభన మనస్సు కలదియు, అసత్-(భవేదిత్యర్థః.) అగునో, యథా చ=ఏ విధముగనైతే, నః=మాయొక్క, విశః=ప్రజలను, సర్వాః ఇత్=అందఱిని గూడ, కేవలీః=రోగరహితులనుగాను, సమనసః=అనుకూల మనస్సు కలవారినిగాను, ఇన్ద్రః=ఇంద్రుఁడు, కరత్ (కుర్యాత్) =చేయునో, యథా=ఏ విధముగా, నః=మాకు, సర్వాః దిశః ఇత్=సర్వ దిక్కులందలి ప్రజలు కూడ, (అధీనాః స్యుః=అధీను లగుదురో, కిం చ=మఱియు,) అస్మాకమ్=మాకు, కేవలీః అసన్=అసాధారణముగనుందురో, తథా=అవిధముగ, (వయమ్=మేము,) ధ్రువేణ హవిషా=ధ్రువస్థాలీ గత సోమరసముచేత, ధ్రువం సోమమ్=(పూర్వము హోతృ చమసమునందున్న) ధ్రువగత సోమరసమును, అవనయామి=అధోభాగమునకు పొందించుచున్నాను.

తాత్పర్యము: గవాది జంగమ స్వరూపమైన మా సర్వజగత్తు రోగ రహితముగను, శోభన మనస్సు కలదిగను అగు విధముగను, మా ప్రజ అందఱిని రోగ రహితులుగను సుమనస్కులుగను ఇంద్రుఁడు చేయువిధముగను, సర్వదిక్కులందలి మా ప్రజలు అధీను లగువిధముగను, మఱియు వారు మాకే యుండువిధముగను (అనఁగా ఇదియంతయు సిద్ధించునట్లు,) ధ్రువ పాత్ర గత సోమరసముతో పూర్వము హోతృ చమసమునందున్న ధ్రువస్థాలీ గత సోమరసము అధోభాగమునకు పోవునట్లు చేయుచున్నాను. (ఈ మంత్రముచే హోతృ చమసమునందు ధ్రువగత సోమరసమును పోయవలెను.)

అష్టమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]యద్వై హోతా ఽధ్వర్యు మభ్యాహ్వయతే వజ్రమేన మభిప్ర వర్తయత్యుక్థశా ఇత్యాహ ప్రాతఃసవనం ప్రతిగీర్య త్రీణ్యేతాన్యక్షరాణి త్రిపదా గాయత్రీ గాయత్రం ప్రాతఃసవనం గాయత్రియైవ ప్రాతఃసవనే వజ్రమన్తర్ధత్త [2]ఉక్థం వాచీత్యాహ మాధ్యందినగ్ం సవనం ప్రతిగీర్య చత్వార్యేతాన్యక్షరాణి చతుష్పదా త్రిష్టుప్త్రైష్టుభం మాధ్యందినగ్ం సవనం త్రిష్టుభైవ మాధ్యందినే సవనే వజ్ర మన్తర్ధత్తే (౧)[3]ఉక్థం వాచీన్ద్రాయేత్యాహ తృతీయసవనం ప్రతిగీర్య సప్తైతాన్యక్షరాణి సప్తపదా శక్వరీ శాక్వరో వజ్రో వజ్రేణైవ తృతీయసవనే వజ్ర మన్తర్ధత్తే [4]బ్రహ్మవాదినో వదన్తి స త్వా అధ్వర్యుః స్యాద్యో యథాసవనం ప్రతిగరే ఛన్దాగ్ంసి సంపాదయేత్తేజః ప్రాతఃసవన ఆత్మ న్దధీతేన్ద్రియం మాధ్యందినే సవనే పశూగ్ం స్తృతీయసవన ఇ[5]త్యుక్థశా ఇత్యాహ ప్రాతఃసవనం ప్రతిగీర్య త్రీణ్యేతాన్యక్షరాణి (౨)త్రిపదా గాయత్రీ గాయత్రం ప్రాతఃసవనం ప్రాతఃసవన ఏవ ప్రతిగరే ఛన్దాగ్ంసి సంపాదయత్యథో తేజో వై గాయత్రీ తేజః ప్రాతఃసవనం తేజ ఏవ ప్రాతఃసవన ఆత్మన్ధత్త [6]ఉక్థం వాచీత్యాహ మాధ్యందినగ్ం సవనం ప్రతిగీర్య చత్వార్యేతాన్యక్షరాణి చతుష్పదా త్రిష్టుప్త్రైష్టుభం మాధ్యందినగ్ం సవనం మాధ్యందిన ఏవ సవనే ప్రతిగరే ఛన్దాగ్ంసి సం పాదయత్యథో ఇన్ద్రియం వై త్రిష్టుగిన్ద్రియం మాధ్యందినగ్ం సవనమ్(౩)ఇన్ద్రియమేవ మాధ్యందినే సవన ఆత్మన్ధత్తే [7]ఉక్థం వాచీన్ద్రాయేత్యాహ తృతీయసవనం ప్రతిగీర్య సప్తైతాన్యక్షరాణి సప్తపదా శక్వరీ

శాక్వరాః పశవో జాగతం తృతీయసవనం తృతీయసవన ఏవ ప్రతిగరే ఛన్దాగ్ంసి సం పాద

యత్యథో పశవో వై జగతీ పశవ స్తృతీయసవనం పశూనేవ తృతీయసవన ఆత్మన్ధత్తే [8]యద్వై

హోతా ఽధ్వర్యు మభ్యాహ్వయత అవ్యమస్మి న్దధాతి తద్యన్న (४)అపహనీత పురాఽస్య

సంవత్సరాద్గృహ ఆ వేవీరన్ఛోగ్ంసా మోద ఇవేతి ప్రత్యాహ్వయతే తేనైవ తదపహతే [9]యథా

వా ఆయతాం ప్రతీక్షత ఏవ మధ్వర్యుః ప్రతిగరం ప్రతీక్షతే [10]యదభి ప్రతిగృణీయాద్యథా

ఽఽయతయా సమృచ్ఛతే తాదృగేవ త[11]ద్యదర్ధర్చా ల్లుప్యేత యథా ధావద్భ్యో హీయతే

తాదృగేవ త[12]త్ప్రబాహుగ్వా ఋత్విజా ముద్గీథా ఉద్గీథ ఏవోద్గాతృణామ్ (౫)ఋచః ప్రణవ

ఉక్థశగ్ంసినాం ప్రతిగరో ఽధ్వర్యూణాం [13]య ఏవం విద్వా న్ప్రతిగృణాత్యన్నాద ఏవ

భవత్యాఽస్య ప్రజాయాం వాజీ జాయత [14]ఇయం వై హోతా ఽసావధ్వర్యు ర్యదాసీనః

శగ్ంసత్యస్యా ఏవ తద్ధోతా నైత్యాస్త ఇవ హీయమథో ఇమామేవ తేన యజమానో దుహే

యత్తిష్ఠ న్ప్రతిగృణాత్యముష్యా ఏవ తదధ్వర్యుర్నైతి (౬)తిష్ఠతీవ హ్యసావథో అమూమేవ

తేన యజమానో దుహే [15]యదాసీనః శగ్ంసతి తస్మాదితః ప్రదానం దేవా ఉప జీవన్తి యత్తిష్ఠ

న్ప్రతిగృణాతి తస్మా దముతః ప్రదానం మనుష్యా ఉప జీవన్తి [16]యత్ప్రాజాసీనః శగ్ంసతి

ప్రత్య ఙ్తిష్ఠ న్ప్రతిగృణాతి తస్మాత్ప్రాచీనగ్ం రేతో ధీయతే ప్రతీచీః ప్రజా జాయన్తే [17]యద్వై

హోతా ఽధ్వర్యు మభ్యాహ్వయతే వజ్రమేనమభి ప్ర వర్తయతి పరాజావర్తతే వజ్రమేవ

తన్ని కరోతి ॥ ౭ ॥

(సవనే వజ్రమన్తర్ధత్తే త్రీణ్యేతాన్యక్షరాణీన్ద్రియం మాధ్యందినగ్ం సవనం నోద్గాతృణా మధ్వర్యు రైన్తి వర్తయత్యష్టౌ చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠకే నవమోఽనువాకః।

## వేదార్థదీపిక

**అవతారిక:** అష్టమానువాకమునందు ప్రస్థితయాజ్యాఖ్య హోమాదులు (తృతీయసవన మాధ్యందినసవన గత హోమ మంత్రములు) చెప్పఁబడినవి. ఈ నవమానువాకమునందు ప్రతిగరానంతర భావి మంత్రములు చెప్పఁబడుచున్నవి. మంత్రముచేత ప్రోత్సాహము చేయుట ప్రతిగర మనఁబడును.

1. **అర్థము:** హోతా=హోత, అధ్వర్యుమ్=అధ్వర్యుని, (ఆశంసనకాలే=ప్రశంసించుకాలమునందు), అభ్యాహ్వయతే యత్ వై=అభిముఖముగ నాహ్వానించుచున్నయెడల, తత్=ఆ యాహ్వానము, ఏనమ్=ఈ యధ్వర్యుని, వజ్రమభి=వజ్రప్రహారమున కభిముఖముగ, ప్రవర్తయతి=ప్రవర్తింపఁ జేయుచున్నది. (అతః=ఇందువలన,) ప్రాతఃసవనం ప్రతిగీర్య=ప్రాతఃసవన గత శస్త్రములకు ప్రతిగరము చెప్పి, "ఉక్థశాః" ఇతి ఆహ="ఉక్థశాః" అను మంత్రముచేత, (హోతారమ్=హోతను, అధ్వర్యుః=అధ్వర్యుఁడు, స్తువీత=స్తుతించవలెను. ఉక్థశాః=శస్త్రమును బాగుగ ప్రశంసించినవాఁడవు. అని 'ఉక్థశాః' అను మంత్రమున కర్థము.) ఏతాని అక్షరాణి=ఈ "ఉక్థశాః" అను మంత్రమునందలి అక్షరములు, త్రీణి=మూఁడు. (అనయా త్రిత్వ సంఖ్యచేత,) త్రిపదా=మూఁడు పాదములు గల, గాయత్రీ=గాయత్రి, (స్మార్యతే=స్మరింపఁజేయఁ బడుచున్నది. తయా=ఆ గాయత్రిచే, తద్యుక్తమ్=తద్గాయత్రీ యుక్తమైన,) ప్రాతః సవనమ్=ప్రాతఃసవనము, (స్మర్యతే=స్మరింపఁబడుచున్నది. ప్రాతః సవనే=ప్రాతఃసవనమునందు, (స్మృతయా=స్మరింపఁబడిన,) గాయత్రియైవ=గాయత్రిచేతనే, వజ్రమ్=వజ్ర (ప్రహార) మును, అంతర్ధత్తే=అంతర్ధానము చేయుచున్నాఁడు. (గాయత్రియా=గాయత్ర్యా.)

**తాత్పర్యము:** ప్రశంసచేయు సమయమునందు హోత అధ్వర్యు నాహ్వానించినచో ఆ యాహ్వానమును హోత వజ్రప్రహరమయముగఁ జేసినవాఁ డగును. అందువలన ప్రాతఃసవనమునందలి శస్త్రముల కన్నిటికి ప్రతిగరము చెప్పి "ఉక్థశాః" అను మంత్రముచేత హోతను స్తుతించవలెను. 'శస్త్రమును బాగుగ ప్రశంసించినవాఁడవు' అని మంత్రమున కర్థము. ఈ మంత్రమునందు మూఁ డక్షరములు గలవు. ఇందలి త్రిత్వ సంఖ్యచేత మూఁడు పాదములు గల గాయత్రి స్మరింపఁజేయఁ బడుచున్నది. ఆ గాయత్రిచే గాయత్రీ చ్ఛన్దోయుక్తమైన ప్రాతఃసవనము స్మరింపఁబడుచున్నది. ప్రాతః సవన గత గాయత్రిచేత వజ్ర (ప్రహార) మంతర్ధాన మగును. (ప్రతిగరానంతర భావి మంత్రములలో "ఉక్థశాః" అను మంత్రము మొదటిది. దీని వినియోగ మిచటఁ జెప్పఁబడినది.)

2. **అర్థము:** మాధ్యందినమ్=మాధ్యందిన సవనగత శస్త్రములకు, ప్రతిగీర్య=ప్రతిగరము చెప్పి, "ఉక్థం వాచి" ఇతి ఆహ="ఉక్థం వాచి" అను మంత్రముచేత, (హోతారమ్=హోతను, స్తువీత=స్తుతించవలెను. "వాచి=నీ వాక్కునందు, ఉక్థమ్=శస్త్రము, సమ్యక్ ప్రవృత్తమ్=బాగుగ ప్రవర్తించఁబడినది" అని ఈ మంత్రమున కర్థము.) ఏతాని అక్షరాణి="ఉక్థం వాచి" అను మంత్రము నందలి అక్షరములు, చత్వారి=నాలుగు. (అనయా సంఖ్యయా=ఈ అక్షరములందలి చతుష్ట్వ సంఖ్యచేత,) చతుష్పదా=నాలుగు పాదములు గల, త్రిష్టుప్=త్రిష్టుప్ ఛన్దస్సు. (స్మార్యతే=స్మరింపఁజేయఁ బడుచున్నది. అనయా=ఈ త్రిష్టుప్పుచేత)

మాధ్యందినం సవనమ్-త్రిష్టుప్‌యుక్తమైన మాధ్యందిన సవనము, (స్మర్యతే-స్మరింపఁబడుచున్నది.) మాధ్యందినే సవనే-మాధ్యందిన సవనమునందలి, త్రిష్టుభైవ-త్రిష్టుప్పుచేతనే, వజ్రమ్-వజ్ర (ప్రహార) మును, అంతర్ధత్తే-అంతర్హితముగాఁ జేయుచున్నాఁడు.

**తాత్పర్యము:** హోత ప్రశంసన సమయమునందు అధ్వర్యు నాహ్వానించినచో, ఆ యాహ్వానమును హోత అధ్వర్యునకు వజ్రప్రహారమునుగాఁ జేసినవాఁ డగును. అందువలన మాధ్యందిన సవనమునందలి శస్త్రముల కన్నిటికి ప్రతిగరము చెప్పి పిమ్మట "ఉక్థం వాచి" (నీవాక్కునందు శస్త్రము బాగుగ ప్రవర్తింపఁ జేయఁబడినది.) అను మంత్రముచే హోతను అధ్వర్యుఁడు స్తుతించవలెను. "ఉక్థం వాచి" అను మంత్రమునందు నాలుగక్షరములు గలవు. అందలి చతుష్ట్వసంఖ్యచే నాలుగు పాదములు గల త్రిష్టుప్ ఛన్దస్సు స్మరింపఁజేయఁబడుచున్నది. ఆ త్రిష్టుప్పుచేత తద్యుక్తమైన మాధ్యందిన సవనము స్మరింపఁబడుచున్నది. అధ్వర్యుఁడు ఆ మాధ్యందిన సవనమునందలి త్రిష్టుప్పుచేత వజ్ర (ప్రహార) ము నంతర్హితముగాఁ జేసినవాఁ డగును. (ఈ "ఉక్థం వాచి" అనునది రెండవ మంత్రము. ఈ మంత్ర మిచట వినియోగింపఁ బడినది.)

3. **అర్థము:** తృతీయ సవనం ప్రతిగీర్య-తృతీయ సవనగత శస్త్రములకు ప్రతిగరము చెప్పి, (తతః-పిమ్మట,) "ఉక్థం వాచి, ఇన్ద్రాయ" ఇతి ఆహ-"ఉక్థం వాచి ఇన్ద్రాయ" అను మంత్రముచేత, (హోతారమ్-హోతను, స్తువీత-స్తుతించవలెను.) ఏతాని అక్షరాణి-ఈ మంత్రమునందలి అక్షరములు, సప్త-ఏడు. (అనయా సంఖ్యయా-ఈ అక్షరముల సప్తత్వ సంఖ్యచేత,) సప్తపదా శక్వరీ-ఏడు పాదములు గల శక్వరీ ఛ్ఛందస్సు, (స్మార్యతే-స్మరింపఁజేయఁ బడుచున్నది.) శాక్వరః-శాక్వరము, వజ్రః-వజ్రస్వరూపము. తృతీయసవనే-తృతీయ సవనమునందలి, వజ్రేణైవ-శాక్వర వజ్రముచేతనే, (అధ్వర్యుః-అధ్వర్యుఁడు,) వజ్రమ్-హోతృ ప్రయుక్త వజ్ర (ప్రహార) మును, అన్తర్ధత్తే-అంతర్హితముగాఁ జేయుచున్నాఁడు.

**తాత్పర్యము:** ప్రశంసా సమయమునందు హోత అధ్వర్యు నాహ్వానించినచో ఆ యాహ్వానము అధ్వర్యునకు వజ్ర ప్రహారమగును. అందువలన తృతీయ సవనమునందలి శస్త్రముల కన్నిటికి ప్రతిగరము చెప్పి యనంతరము "ఉక్థం వాచి ఇన్ద్రాయ" అను మంత్రముచే నధ్వర్యుఁడు హోతను స్తుతించవలెను. ఈ మంత్రమునందలి అక్షరములు సప్త సంఖ్యాకములు. ఇందలి సప్తత్వ సంఖ్యచేత సప్తపదయైన శక్వరి స్మరింపఁజేయఁ బడుచున్నది. "వజ్రో వై శక్వరీ" అను శ్రుతి ననుసరించి శాక్వరము వజ్రము కనుక, తృతీయ సవనమునందలి శాక్వర వజ్రముచేతనే అధ్వర్యుఁడు హోతృ ప్రయుక్త వజ్ర (ప్రహార) ము నంతర్హితముగాఁ జేయును. (మూఁడవదియైన "ఉక్థం వాచీన్ద్రాయ" అను మంత్ర మిచట వినియుక్త మైనది.)

4. **అర్థము:** యః-ఏ పురుషుఁడు, యథాసవనమ్-సవనానుసారముగ, ప్రతిగరే అభిహితే సతి-ప్రతిగరము చెప్పఁబడినదగుచుండఁగా, ఛన్దాంసి-గాయత్ర్యాది ఛందస్సులను, సంపాదయేత్-సంపాదించునో, (కిం చ-మఱియు) ప్రాతఃసవనే-ప్రాతఃసవనము, (సమాప్తే సతి-సమాప్త మగుచుండఁగా), ఆత్మన్-తనయందు, తేజః-తేజస్సును, మాధ్యందినే సవనే (సమాప్తే సతి)-మాధ్యందిన సవనము సమాప్త మగుచుండఁగా, ఆత్మన్-తనయందు, ఇన్ద్రియమ్-ఇంద్రియమును, తృతీయసవనే (సమాప్తే సతి)-తృతీయ సవనము సమాప్త మగుచుండఁగా, పశూన్-పశువులను, దధీత-ధరింపఁజేయునో (సంపాదించునో), సః త్వా-అతఁడే, అధ్వర్యుః-ముఖ్యుఁడైన అధ్వర్యుఁడు, ఇతి-అని, బ్రహ్మవాదినః-మంత్రవేత్తలు, వదన్తి-పరస్పరము చెప్పుకొనుచున్నారు.

**తాత్పర్యము:** ప్రాతఃసవనానుసారముగ గాయత్ర్యాది ఛ్ఛందస్సులను ప్రతిగరము చెప్పఁబడిన యనంతరము సంపాదించుట యందు సమర్థుఁడైన పురుషుఁడు ముఖ్యుఁడైన అధ్వర్యుఁడు. మఱియు ప్రాతఃసవనము సమాప్త మయిన పిమ్మట తనయందు తేజస్సును, మాధ్యందిన సవనము సమాప్తము కాఁగానే ఇంద్రియ సామర్థ్యమును, తృతీయ సవనము సమాప్తము కాఁగానే పశువులను, సంపాదించిన పురుషుఁడు ముఖ్యాధ్వర్యుఁడని మంత్రవేత్తలు పరస్పరము చెప్పుకొనుచున్నారు. (పూర్వోక్త మంత్ర త్రయమును మఱియొక విధముగ ప్రశంసించుటకు ఇచట ఉపోద్ఘాతము చెప్పఁబడినది.)

5\. **అర్థము :** "ఉక్థశా ఇత్యాహ ....గాయత్రం ప్రాతః సవనమ్" -ఈ మంత్రభాగము ఒకటవ మంత్ర వ్యాఖ్యానమున వివరింపఁబడినది. ప్రాతఃసవనే=ప్రాతః సవనమునందు, ప్రతిగరే ఏవ=ప్రతిగరము చెప్పఁబడిన దగు చుండఁగనే, (అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) ఛన్దాంసి గాయత్రీ చ్ఛన్దస్సు గల స్తోత్ర శస్త్రములను, సంపాద యేత్=సంపాదించవలెను (ఉపయోగించవలెను). అథో=అప్పుడు, తేజః ఏవ=తేజస్సే, గాయత్రీ= గాయత్రి, ప్రాతఃసవనమ్=ప్రాతఃసవనము, తేజః=తేజస్స్వరూపము. (అతః=ఇందువలన అధ్వర్యుః= అధ్వర్యుఁడు,) ప్రాతఃసవనే=ప్రాతఃసవనము, (సమాప్తే సతి=సమాప్త మగుచుండఁగా,) తేజఏవ=తేజ స్సునే, ఆత్మన్=తనయందు, ధత్తే=ధరించుచున్నాఁడు.

**తాత్పర్యము :** ప్రాతః సవనమునందు ప్రతిగరము చెప్పిన పిమ్మట ''ఉక్థశాః'' అను మంత్రముచే హోతను స్తుతించ వలెను. ఈ మంత్రమునందు మూఁ డక్షరములు కలవు. అందలి త్రిత్వ సంఖ్యచేత త్రిపదయైన గాయత్రి స్మరింపఁజేయఁబడును. ప్రాతఃసవనమునందు ప్రతిగర మభిహితమయినప్పుడే గాయత్రీ చ్ఛందో బద్ధము అయిన స్తోత్ర శస్త్రములను సంపాదించినవాఁ డగును. తేజస్సే గాయత్రి. ప్రాతఃసవనము తేజస్సు. కావున అప్పుడు అధ్వర్యుఁడు ప్రాతఃసవనము సమాప్తము కాఁగానే తనయందు తేజస్సును ధరించును (తేజస్వంతుఁ డగును). ఇచట ''ఉక్థశాః'' అను ప్రథమ మంత్రముచేత సవనోచిత ఛందస్సంపత్తి, తేజోధారణము చూపఁబడినవి.

6\. **అర్థము :** 'ఉక్థం వాచీత్యాహ - - - త్రైష్టుభం మాధ్యందినగ్ం సవనమ్" – ఈ మంత్రభాగము రెండవ మంత్ర వ్యాఖ్యానమున వివరించఁబడినది, మాధ్యందినే సవనే ఏవ=మాధ్యందిన సవనమునందే, ప్రతిగరే (ఉక్తే సతి)=ప్రతిగరము చెప్పఁబడిన దగుచుండఁగా, ఛన్దాంసి=త్రిష్టుప్ ఛందోబద్ధములైన స్తోత్ర శస్త్రములను, సంపాదయతి=సంపాదించవలెను (ఉపయోగించవలెను). అథో=అప్పుడు, త్రిష్టుక్=త్రిష్టుప్ ఛన్దస్సు, ఇన్ద్రియం వై=ఇంద్రియ స్వరూపమే. మాధ్యందినం సవనమ్=మాధ్యందిన సవనము, ఇన్ద్రియమ్=ఇంద్రి యము. (అతః=ఇందువలన,) మాధ్యందినే సవనే ఏవ=మాధ్యందిన సవనమునందే, ఇన్ద్రియమ్=ఇంద్రియ సామర్థ్యమును, (అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) ఆత్మన్=తనయందు, ధత్తే=ధరించును.

**తాత్పర్యము :** ప్రశంసా సమయమున హోత అధ్వర్యు నాహ్వానించుచున్నచో ఆ యాహ్వానము అధ్వర్యునకు వజ్రప్రహార మయి మగును. కావున అధ్వర్యుఁడు మాధ్యందిన సవనమునందలి శస్త్రములకు ప్రతిగరము చెప్పి "ఉక్థం వాచి" అను మంత్రముచే హోతను స్తుతించవలెను. ఈ మంత్రమునందలి అక్షరములు నాలుగు. ఇందలి చతుష్ట్వ సంఖ్యచేత చతుష్పదయగు త్రిష్టుప్ ఛందస్సు స్మరింపఁజేయఁబడుచున్నది. త్రిష్టుప్ ఛందో యుక్తములయిన శస్త్రములు మాధ్యందిన సవనమునం దుపయోగింపఁబడును గావున త్రిష్టుప్ఛందస్సుచే మాధ్యందిన సవనము స్మరింపఁబడును. మాధ్యందిన సవనమునందే ప్రతిగరము చెప్పి త్రిష్టుప్ ఛందోబద్ధము అయిన శస్త్రములను సంపాదించవలెను. అప్పుడు ఇంద్రియమే త్రిష్టుప్పు. మాధ్యందిన సవనము ఇంద్రియము. కావున అధ్వర్యుఁడు మాధ్యందిన సవనమునందే ఆత్మయందు ఇంద్రియమును ధరించును (ఇంద్రియ వంతుఁడగును). మాధ్యందిన పవమానగత ''ప్రతు ద్రవేతి'' సూక్తము త్రిష్టుప్ ఛందస్కము కావున మాధ్యందిన సవనము త్రైష్టుభ మైనది. ద్వితీయ మంత్రోచిత ఛందస్సంపత్తి ఇంద్రియ ధారణము ఇచటఁ జూపఁబడినవి.

7\. **అర్థము :** "ఉక్థం వాచీన్ద్రాయేత్యాహ.... సప్తపదా శక్వరీ'' – ఈ మంత్రభాగము మూఁడవ మంత్ర వ్యాఖ్యానమున వివరింపఁబడినది. పశవః=పశువులు, శాక్వరాః=శక్వరీ చ్ఛందోబద్ధ శస్త్ర లభ్యములు. తృతీయ సవనమ్= తృతీయ సవనము, జాగతమ్=జగతీ చ్ఛందోబద్ధ శస్త్రములు కలది. (అతః=ఇందువలన,) తృతీయ సవనే ఏవ= తృతీయ సవనమునందే, ప్రతిగరే=ప్రతిగరము, (ఉక్తే సతి=చెప్పఁబడిన దగుచుండఁగా,) ఛన్దాంసి= చ్ఛందో బద్ధములైన జగతీ శస్త్రములను, సంపాదయతి=సంపాదించవలెను. అథో=అప్పుడు, పశవః=పశువులు, జగతీ వై=జగతీ చ్ఛందోబద్ధ శస్త్రప్రాప్యములే. పశవః=పశువులు, తృతీయ సవనమ్=తృతీయ సవనానుష్ఠాన ప్రాప్యములు. (అతః=ఇందువలన,) తృతీయ సవనే ఏవ=తృతీయ సవనమునందే, అధ్వర్యుః=అధ్వర్యుఁడు పశూన్=పశువులను, ఆత్మన్=తనయందు (తనకై), ధత్తే=ధరించును (సంపాదించును).

**తాత్పర్యము:** హోత ప్రశంసా సమయమునందు అధ్వర్యు నాహ్వానించుచున్నచో ఆ యాహ్వాన మధ్వర్యునకు వజ్ర ప్రహారమయ మగును. కావున తృతీయ సవనమునందు ప్రతిగరము చెప్పి "ఉక్థం వాచీన్ద్రాయ" అను మంత్రముచే నధ్వర్యుఁడు హోతను స్తుతించవలెను. ఈ మంత్రమునందలి అక్షరములు సప్త సంఖ్యాక ములు. సప్తత్వ సంఖ్యచే సప్తపదయైన శక్వరి స్మరింపఁబడుచున్నది. పశువులు శక్వరీ చ్ఛన్దోబద్ధ శస్త్ర ప్రాప్యములు. తృతీయ సవనము జగతీ చ్ఛన్దస్సు కలది. తృతీయ సవనమందే ప్రతిగరమును జెప్పి అధ్వర్యుఁడు జగతీ చ్ఛన్దోబద్ధము లయిన శస్త్రములను సంపాదించును. పశువులే జగతి. పశువులు తృతీయ సవనము. కావున తృతీయ సవనమునందే పశువులను తనకై సంపాదించును. (ఇచట తృతీయ సవనోచిత ఛన్దస్సంపత్తి పశుప్రాప్తియుఁ జూపఁబడినవి.)

8. **అర్థము:** హోతా=హోత, అధ్వర్యుమ్=అధ్వర్యుని, (ప్రష్టుమ్=ప్రశ్నించుటకు,) అభ్యాహ్వయత యత్ వై=అభి ముఖముగ నాహ్వానించుచున్నచో, అస్మిన్=ఈ అధ్వర్యునియందు, ఆవ్యమ్=అంతటను పీడించు రోగ విశేష మును, దధాతి=స్థాపించుచున్నవాఁ డగుచున్నాఁడు. తత్=ఆ రోగ స్థాపనమును, నాపహనీత యత్=నిరా కరించనిచో, అస్య=ఈ అధ్వర్యునియొక్క, గృహే=గృహమునందు, సంవత్సరాత్పురా=సంవత్సరముకంటె పూర్వమే, (ప్రజాః=ప్రజలు,) ఆ వేవీరన్=సర్వ రోగాదులచే పీడింపఁబడుదురు. (తత్పరిహారాయ=ఆ బాధను పరిహరించుటకొఱకు,) "శోగ్ంసామోద ఇవేతి"="శోగ్ంసా మోద ఇవ" అను మంత్రముచేత, (అధ్వర్యుః=అధ్వర్యుఁడు, హోతారమ్=హోతను,) ప్రత్యాహ్వయతే=ప్రత్యాహ్వానము చేయవలెను. తేనైవ =ఆ ప్రత్యాహ్వానముచేతనే, తత్=ఆ అభ్యాహ్వానకృత రోగ జాతమును, అపహతే=నశింపఁజేయుచున్నాఁడు.

**తాత్పర్యము:** హోత ప్రశ్నించుటకై అధ్వర్యు నభిముఖముగ నాహ్వానించుచున్నచో ఆ హోత ఈ యధ్వర్యునియందు 'ఆవ్య' మనెడి రోగవిశేషమును స్థాపించుచున్నవాఁ డగును. అధ్వర్యుఁడు ఆ రోగ స్థాపనమును నిరాకరిం చనిచో ఇతని యింటియందు ప్రజలు సంవత్సరములోపల సర్వరోగాదులచే బాధింపఁబడుదురు. అందువలన తత్పరిహారమునకై "శోగ్ంసా మోద ఇవ" అను మంత్రముచే నధ్వర్యుఁడు హోతను ప్రత్యాహ్వానము చేయ వలెను. అధ్వర్యుఁ డా ప్రత్యాహ్వానముచేతనే ఆ రోగ సముదాయమును నశింపఁజేయును. ప్రశ్న రూప మైన అభిముఖాహ్వానమునకు ప్రత్యుత్తర రూపాహ్వానము పరిహారమని భావము. హే హోతః=ఓ హోతా!, త్వమ్=నీవు, శోంసా=అన్ని విధముల ప్రశంసా రూపుఁడవే. మోద ఇవ=మాకు సంతోషమే అని ఆ మంత్ర మున కర్థము. (ఇచట ప్రత్యాహ్వానము విధింపఁబడినది.)

9. **అర్థము:** యథా వా=ఏ విధముగ నైతే, (ప్రతివాదీ=ప్రతివాది, పృచ్ఛన్తం వాదినం ప్రతి=ప్రశ్నించుచున్న వాదిని గూర్చి,) ఆయతామ్=నియమితమైన, (వాచమ్=వాక్కును, వక్తుమ్=చెప్పుటకు,) ప్రతీక్షతే=(సావధా నుఁడై) నిరీక్షించుచున్నాఁడో, (తథా=ఆ విధముగ,) అధ్వర్యుః=అధ్వర్యుఁడు, ప్రతిగరం (వక్తుమ్)= ప్రత్యుత్తరమును జెప్పుటకు, ప్రతీక్షతే=(సావధానుఁడై) నిరీక్షించవలెను.

**తాత్పర్యము:** లోకమునం దేవిధముగఁ బ్రశ్నించుచున్న వాది కభిముఖముగ నియతమైన వాక్కును సమాధానముగాఁ జెప్పుటకు సావధానుఁడై యుండునో, అట్లే ఈ అధ్వర్యుఁడు ప్రత్యుత్తరము చెప్పుటకు అప్రమత్తుఁడై నిరీ క్షించవలెను. (ఇచట అధ్వర్యునకు అప్రమత్తత విధించఁబడినది.)

10. **అర్థము:** అభి ప్రతి గృణీయాత్ యత్=ప్రతిగర సమయమున కంతటను ప్రతిగరము చెప్పినచో, యథా=ఏవిధముగ, (ప్రాక్, అతీతకాలే వా=ముందుగఁ గాని, అతీతకాలమునందుఁ గాని, ప్రత్యుత్తర మాభాషమాణః పురుషః= ప్రత్యుత్తరము చెప్పుచున్న పురుషుఁడు,) ఆయతయా=అభిముఖముగఁ జెప్పఁదగిన నియతవాక్కుచేత, సమృచ్ఛతే=హీనుఁడగుచున్నాఁడో, తత్=ప్రతిగర కాలము నతిక్రమించి చెప్పుట, తాదృగేవ=అటువంటిదియే, భవతి=అగుచున్నది.

**తాత్పర్యము:** అర్ధర్చ సమాప్తి ప్రతిగర కాలము. ఆ కాలము నతిక్రమించి ప్రతిగరము చెప్పినచో, ప్రత్యుత్తరము చెప్పు టకుఁ దగిన కాలము నతిక్రమించి సమాధానము చెప్పుచున్న పురుషుఁడు సమాధానము చెప్పఁదగిన నియత

మైన వాక్కును జెప్పలేని విధము వంటిదియే అతిక్రమణ కాలమునందు ప్రతిగరము చెప్పుట కూడ. (అకాల ప్రతిగరోచ్చారణమువలనఁ గలుగు నష్టము ఇచటఁ జెప్పఁబడినది.)

11. అర్థము: అర్ధర్చాత్=అర్ధర్చ సమాప్తినుండి, ఉప్యేత యత్=ప్రతిగరము లోపించినచో, యథా=ఏ విధముగ, ధావద్భ్యః=(మహారణ్యమునందు క్రూరమృగములవలన భయపడి) పరుగిడుచున్న గుంపులనుండి, హీయతే=పరుగిడుట కశక్తుఁడైన పురుషుఁడు హీనుఁడగుచున్నాఁడో, తత్=ఆ ప్రతిగర లోపనము (విస్మరణము). తాదృగేవ=అటువంటిదియే.

తాత్పర్యము: అర్ధర్చ సమాప్తినుండి ప్రతిగరము లోపించినచో (అధ్వర్యుఁడు అర్ధర్చ సమాప్త్యనంతరము ప్రతిగరము చెప్పుట స్మరించినచో) భయంకరారణ్యమునందు చోరాదులవలన భయపడి పాఱిపోవుచున్న గుంపులనుండి పరుగిడుట కశక్తుఁడైన పురుషుఁడు హీనుఁడుగాఁ బోవుచు చోరాదులవలన నుపద్రవమునకు గుఱియగు విధమువంటిదియే ప్రతిగర విస్మరణము కూడ. అందువలన అధ్వర్యుఁడు సావధానుఁడై ప్రతిగర కాలమును నిరీక్షించవలెను.

12. అర్థము: ఋత్విజామ్=ఋత్విజులైన ఉద్గాతృ హోత్రధ్వర్యులయొక్క, ఉద్గీథాః=ఉత్కృష్ట గానవిశేషములు, ప్రతాహృగ్వై=సమానములే. (కథ మితిచేత్=ఎట్లనఁగా) ఉద్గాతౄణామ్=సామగానము చేయువారికి, ఋచః=ఏవ=ఋక్కులే, ఉద్గీథః=ఉద్గీథము. ఉక్థశంసినామ్=శస్త్రములను స్తుతించునట్టి హోతలకు, ప్రణవః='ఓమ్' అను ప్రణవము. ఉద్గీథః=ఉద్గీథము. అధ్వర్యూణామ్=అధ్వర్యులకు, ప్రతిగరః=ప్రతిగరము, ఉద్గీథః=ఉద్గీథము.

తాత్పర్యము: ఋత్విజు లయిన ఉద్గాతృ హోత్రధ్వర్యులయొక్క ఉత్కృష్ట గానవిశేషములు సమానములే. ఎట్లనఁగా – సామగులకు ఋక్కులే ఉద్గీథము. శస్త్రములను స్తుతించు హోతలకు ప్రణవము ఉద్గీథము. అధ్వర్యులకు ప్రతిగరము ఉద్గీథము. కనుకనే "ఓమితి సామాని గాయన్తి। ఓగ్ం శోమితి శస్త్రాణి శగ్ంసన్తి। ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతి గృణాతి" ఇతి. ఓం శోగ్ంసామోద ఇవేతి బ్రువన్ సామవదుచ్చారయతి" అని వినఁబడుచున్నది. (ఉద్గాతృ హోతృ సామ్యముచే అధ్వర్యుని ప్రతిగర మిచట ప్రశంసింపఁబడినది.)

13. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, ప్రతిగృణాతి=ప్రతిగరము చెప్పునో, సః=అతఁడు, అన్నాదః=అన్నము తినువాఁడు (అన్నసమృద్ధి కలవాఁడు), భవత్యేవ=నిశ్చయముగ అగును. అస్య=ఈ యజమానునియొక్క, ప్రజాయామ్=ప్రజయందు (సంతానమునందు), వాజీ=అన్నసమృద్ధి కలవాఁడు, జాయతే=పుట్టును.

తాత్పర్యము: పూర్వోక్తవిధముగఁ ప్రతిగరవిధానమును దెలిసికొని ప్రతిగరము చెప్పిన యజమానుఁడు నిశ్చయముగ అన్నసమృద్ధి కలవాఁ డగును. ఇతని సంతానములో అన్నసమృద్ధి కలవాఁడు పుట్టును. ఇచట ప్రతిగర వేదనము ప్రశంసింపఁబడినది.)

14. అర్థము: ఇయం వై=ఈ భూమియే, హోతా=హోత. అసౌ=ఈ ద్యులోకము, అధ్వర్యుః=అధ్వర్యుఁడు. (హోతా=హోత), ఆసీనః=(భూమియందు) కూర్చున్నవాఁడై, శంసతి యత్=స్తుతించుచున్నచో, తత్=ఆ ఉపవేశనముచే, హోతా=హోత, అస్యాః ఏవ=ఈ భూమినుండియే, నైతి=తొలఁగి పోవుటలేదు. ఇయమ్=ఈ భూమి, ఆస్తే ఇవ=ఆసీనయై యున్నదివలె, (దృశ్యతే) హి=కనఁబడుచున్నది కదా! తేన=దానిచేత, యజమానః=యజమానుఁడు, ఇమామ్=ఈ భూమిని. దుహే ఏవ=నిశ్చయముగ ఫలమును పితుకును (సారమును గ్రహించును). అధ్వర్యుః=అధ్వర్యుఁడు, తిష్ఠన్=నిలుచున్నవాఁడై, ప్రతిగృణాతి యత్=ప్రతిగరము చెప్పుచున్నచో, తత్=ఆ ప్రతిగరముచేత, అముష్యాః ఏవ=దివినుండియే, నైతి=తొలఁగిపోవుటలేదు. అసౌ=ఈ దివి, తిష్ఠతీవ=నిలుచున్నదివలె, (దృశ్యతే) హి=కనఁబడుచున్నది కదా. అథో=అప్పుడు, తేన=ఆ నిలుచుండుటచేత, యజమానః=యజమానుఁడు అమూమ్=ఈ దివిని, దుహే ఏవ=నిశ్చయముగ (సారమును) పితుకును (గ్రహించును).

**తాత్పర్యము:** హోత భూమిస్వరూపుఁ డగుటచేత నతఁడు కూర్చుండి స్తోత్రము చేసినచో నతఁడు భూమినుండి తొలఁగి పోఁడు. ఈ భూమియు ఆసీనయై యున్నట్లు కనఁబడుచున్నది. అందుచే యజమానుఁడు భూమినుండి సారమును గ్రహించును. అధ్వర్యుఁడు ద్యులోక స్వరూపుఁ డగుటచే నతఁడు నిలుచుండి ప్రతిగరము చెప్పినచో దివినుండి తొలఁగిపోఁడు. దివి ఉపరిభాగమున నుండుటచే నిలుచున్నదివలెఁ గనబడుచున్నది కదా! అందుచే యజమానుఁడు దివినుండి సారమును గ్రహించును. (ఈ మంత్రము హోత భూమియందుఁ గూర్చుండి స్తోత్రము చేయుటను, అధ్వర్యుఁడు నిలుచుండి ప్రతిగరము చెప్పుటను విధించుచున్నది.)

15. **అర్థము:** (హోతా=హోత,) ఆసీనః=కూర్చున్నవాఁడై, శంసతి యత్=స్తోత్రము చేయుచున్నచో, తస్మాత్=ఆ స్తోత్రమువలన, ఇతః ప్రదానం ఉప=ఇచటనుండి ఈయఁబడు హవిరాదికము నాధారముగఁ జేసికొని, దేవాః=దేవతలు, జీవన్తి=జీవించుచున్నారు. (అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) తిష్ఠన్=నిలుచున్నవాఁడై, ప్రతిగృణాతి యత్=ప్రతిగరము చెప్పుచున్నచో, తస్మాత్=ఆ ప్రతిగరమువలన, అముతః ప్రదానం ఉప=స్వర్గమునుండి (దేవతలు) ప్రదానముచేసిన వర్షము నాధారముగఁ జేసికొని, మనుష్యాః=మనుష్యులు, జీవన్తి=జీవించుచున్నారు.

**తాత్పర్యము:** హోత ఆసీనుఁడై స్తోత్రము చేయుచున్నచో, దానివలన ఈ భూలోకమునుండి ప్రదానము చేయఁబడిన హవిరాదికము నాధారముగఁ గైకొని దేవతలు జీవించుచున్నారు. అధ్వర్యుఁడు నిలుచుండి ప్రతిగరము చెప్పుచున్నచో దానివలన ద్యులోకమునుండి దేవతలు ప్రదానము చేయు వర్షము నాధారముగఁ గైకొని మనుష్యులు జీవించుచున్నారు. (ఇచట ఉపవేశనోత్థానములు మరియొక విధముగ ప్రశంసింపఁబడినవి.)

16. **అర్థము:** యత్=ఏ కారణమువలన, (హోతా=హోత,) ప్రాఙ్ ఆసీనః=తూర్పుదిశయందు ఆసీనుఁడై, శంసతి=స్తోత్రము చేయుచున్నాఁడో, (అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) ప్రత్యఙ్ తిష్ఠన్=పశ్చిమ దిశయందు నిలుచున్నవాఁడై, ప్రతిగృణాతి=ప్రతిగరము చెప్పుచున్నాఁడో, తస్మాత్=అందువలన, ప్రాచీనమ్=పత్నీ క్షేత్రాభిముఖముగ, రేతః=వీర్యము, ధీయతే=స్థాపించఁబడుచున్నది. ప్రజాః=ప్రజలు, ప్రతీచీః=క్షేత్ర విముఖులుగా, జాయన్తే=పుట్టుచున్నారు.

**తాత్పర్యము:** హోత ప్రాఙ్ముఖుఁడై స్తోత్రము చేయుటవలన రేతస్సు పత్నీ క్షేత్రాభిముఖముగ నుంచఁబడుచున్నది. అధ్వర్యుఁడు ప్రత్యఙ్ముఖుఁడై ప్రతిగరము చెప్పుటవలన ప్రజలు క్షేత్రవిముఖులుగ పుట్టుచున్నారు. (ఇచట హోతకు ప్రాఙ్ముఖత్వము, అధ్వర్యునకు ప్రత్యఙ్ముఖత్వము విధించఁబడినవి. క్షేత్రవిముఖులు=క్షేత్రమున కభిముఖులు కానివారు. పశ్చిమ ముఖులని యర్థము.)

17. **అర్థము:** హోతా=హోత, అధ్వర్యుమ్=అధ్వర్యుని, అభ్యాహ్వయతే యత్ వై=అభిముఖముగ నాహ్వానించుచున్నచో, (తత్=ఆ యాహ్వానము,) ఏనమ్=ఈ అధ్వర్యుని, వజ్రమభి ప్రవర్తయతి=వజ్రప్రహారమున కభిముఖముగ ప్రవర్తింపఁజేయుచున్నది. (అభ్యాహ్వానా దూర్ధ్వమ్=అభ్యాహ్వానమున కనంతరము, అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) పరాఙ్ ఆవర్తతే=ప్రత్యఙ్ముఖముగ తిరుగవలెను. తత్=ఆ పరాఙ్ఙావర్తనము, వజ్రమేవ=వజ్రప్రహారమునే, నిరాకరోతి=నిరాకరించును.

**తాత్పర్యము:** ప్రాఙ్ముఖుఁడై "ఇడా దేవహూః" అను మంత్రమును జపించుచున్న అధ్వర్యుని హోత అభిముఖముగ నాహ్వానించుచున్నచో ఆ యాహ్వాన మధ్వర్యునకు వజ్రప్రహారమయి మగును. అభ్యాహ్వానానంతరము అధ్వర్యుఁడు ప్రత్యఙ్ముఖముగ తిరుగవలెను. ఆ పరాఙ్ఙావర్తనము వజ్రప్రహారమును నిరాకరించును. (ఇచట ప్రాఙ్ముఖుడై యున్న అధ్వర్యునకు అభ్యాహ్వానానంతరము పరాఙ్ఙావర్తనము విధించఁబడినది.)

నవమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే దశమోఽనువాకః

మూలము: [1]ఉపయామ గృహీతోఽసి వాక్షసదసి వాక్పాభ్యాం త్వా క్రతుపాభ్యామస్య యజ్ఞస్య ధ్రువస్యా ధ్యక్షాభ్యాం గృహ్ణా[2]మ్యుపయామ గృహీతోఽస్యృతసదసి చక్షుష్పాభ్యాం త్వా క్రతుపాభ్యామస్య యజ్ఞస్య ధ్రువస్యాధ్యక్షాభ్యాం గృహ్ణా[3]మ్యుపయామ గృహీతోఽసి శ్రుతసదసి శ్రోత్రపాభ్యాం త్వా క్రతుపాభ్యామస్య యజ్ఞస్య ధ్రువస్యాధ్యక్షాభ్యాం గృహ్ణామి [4]దేవేభ్యస్త్వా విశ్వదేవేభ్యస్త్వా విశ్వేభ్యస్త్వా దేవేభ్యో [5]విష్ణవురుక్రమైష తే సోమ స్తగ్ం రక్షస్వ (౧)తం తే దుశ్చక్షా మాఽవఖ్య [6]న్మయి వసుః పురోవసుర్వాక్పా వాచం మే పాహి [7]మయి వసుర్విదద్వసు శ్చక్షుష్పా శ్చక్షుర్మే పాహి మయి వసుః సంయద్వసుః శ్రోత్రపాః శ్రోత్రం మే పాహి [8]భూరసి శ్రేష్ఠో రశ్మీనాం ప్రాణపాః ప్రాణం మే పాహి [9]ధూరసి శ్రేష్ఠో రశ్మీనా మపానపా అపానం మే పాహి [10]యో న ఇన్ద్రవాయూ మిత్రావరుణా వశ్వినావభి దాసతి భ్రాతృవ్య ఉత్పిపీతే శుభస్పతీ ఇదమహం తమధరం పాదయామి యథేన్ద్రాహ ముత్తమ శ్చేతయాని ॥ ౨ ॥

(రక్షస్వ భ్రాతృవ్య స్త్రయోదశ చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయ ప్రపాఠకే దశమోఽనువాకః॥

### వేదార్థదీపిక

**అవతారిక:** నవమానువాకమునందు ప్రతిగరము సాంగముగ వివరింపబడినది. ఈ దశమానువాకమునందు ప్రతినిర్గ్రాహ్య మంత్రములు చెప్పబడుచున్నవి. ప్రతినిర్గ్రాహ్య మనునది ఒకానొక గ్రహము (పాత్రము)నకు పేరు.

1. **అర్థము:** (హే ప్రతినిర్గ్రాహ్య!-ఓ ప్రతినిర్గ్రాహ్య గ్రహమా!, త్వమ్-నీవు,) ఉపయామ గృహీతః-పార్థివపాత్ర ముచే గ్రహింపబడినదానవు, అసి-అగుచున్నావు. వాక్షసత్-వాగింద్రియమునం దున్న దానవు, అసి-అగుచున్నావు. త్వా-(అటువంటి) నిన్ను, వాక్పాభ్యామ్-వాక్పాలకులును, క్రతుపాభ్యామ్-యజ్ఞపాలకు

లును, ధ్రువస్య=అవినాశియగు, అస్య యజ్ఞస్య=ఈ యజ్ఞమునకు, అధ్యక్షాభ్యామ్=అధ్యక్షులునగు ఇంద్ర వాయు దేవతలకొఱకు, గృహ్ణామి=గ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఓ ప్రతి నిర్గ్రాహ్యగ్రహమా! నీవు పార్థివపాత్రముచే గ్రహింపఁబడినదానవు, వాగింద్రియమునం దుంటున్న దానవు అగుచున్నావు. అట్టి నిన్ను ఇంద్రవాయుదేవతల నిమిత్తము గ్రహించుచున్నాను. ఇంద్రవాయువులు వాగింద్రియ పాలకులు. యజ్ఞపాలకులు. అవినాశియైన ఈ యజ్ఞమున కధ్యక్షులు. (అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు ప్రతినిర్గ్రాహ్య గ్రహమును స్వీకరించవలెను. ఇచట ఐన్ద్రి వాయవ ప్రతినిర్గ్రాహ్య గ్రహ గ్రహణ మంత్రము చెప్పఁబడినది.)

2. అర్థము: (హే ప్రతినిర్గ్రాహ్య!=ఓ ప్రతినిర్గ్రాహ్యగ్రహమా!, త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః, అసి. ఋతసత్=సత్యమునందు లేక యజ్ఞమునందు ఉంటున్నదానవు, అసి=అగుచున్నావు, త్వా=(అటువంటి) నిన్ను, చక్షుష్పాభ్యామ్=చక్షుష్పాలకులును, క్రతుపాభ్యామ్=యజ్ఞ పాలకులును, ధ్రువస్య=అవినాశియైన, అస్య యజ్ఞస్య=ఈ యజ్ఞమునకు, అధ్యక్షాభ్యామ్=అధ్యక్షులునైన మైత్రావరుణ దేవతలకొఱకు, గృహ్ణామి=గ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఓ ప్రతినిర్గ్రాహ్య గ్రహమా! నీవు ప్రార్థివ పాత్రముచే గ్రహింపఁబడినదానవు అగుచున్నావు. సత్యమునందు, లేక యజ్ఞమునం దుంటున్నావు. అటువంటి నిన్ను మైత్రావరుణ దేవతలకొఱకు గ్రహించుచున్నాను. ఆ మైత్రావరుణ దేవతలు చక్షుష్పాలకులు. యజ్ఞపాలకులు. అవినాశియైన ఈ యజ్ఞమున కధ్యక్షులు. (ఇది మైత్రావరుణ దేవతాక ప్రతినిర్గ్రాహ్య గ్రహ గ్రహణ మంత్రము. ఈ మంత్రముచే మైత్రావరుణ దేవతాక ప్రతినిర్గ్రాహ్య గ్రహమును గ్రహించవలెను.)

3. అర్థము: హే ప్రతినిర్గ్రాహ్య!, త్వమ్, ఉపయామ గృహీతః, అసి. శ్రుతసత్=శ్రోత్రేంద్రియమునందు ఉంటున్నదానవు, అసి=అగుచున్నావు. త్వా, శ్రోత్రపాభ్యామ్=శ్రోత్రపాలకులు, క్రతుపాభ్యామ్, ధ్రువస్య, అస్య, యజ్ఞస్య, అధ్యక్షాభ్యామ్,=అధ్యక్షులునైన అశ్వినీ దేవతలకొఱకు, గృహ్ణామి. (ఇది అశ్విన ప్రతినిర్గ్రాహ్య గ్రహ గ్రహణ మంత్రము. ఈ మంత్రము చెప్పుచు అశ్విన ప్రతినిర్గ్రాహ్య గ్రహమును గ్రహించవలెను.)

4. అర్థము: (హే ఐన్ద్రవాయవ ప్రతినిర్గ్రాహ్య!=ఇంద్ర వాయు దేవతా సంబంధమగు ఓ ప్రతినిర్గ్రాహ్య గ్రహమా!) దేవేభ్యః=దేవతలకొఱకు, త్వా=నిన్ను, (అదిత్యస్థాల్యామ్=అదిత్య దేవతాక పాత్రమందు, అవనయామి=వంచుచున్నాను). విశ్వదేవేభ్యః=విశ్వే దేవతలకొఱకు, త్వా=నిన్ను, (అవనయామి=వంచుచున్నాను.) విశ్వేభ్యః దేవేభ్యః=సమస్త దేవతలకొఱకు, త్వా=నిన్ను, (అదిత్యస్థాల్యా మవనయామి).

తాత్పర్యము: ఓ ఐన్ద్రి వాయవ ప్రతినిర్గ్రాహ్య గ్రహమా! దేవతలకొఱకు, విశ్వేదేవతలకొఱకు, సర్వదేవతలకొఱకు నిన్ను అదిత్యస్థాలియందు అవనతము చేయుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు అధ్వర్యుఁడు ఐన్ద్రి వాయవ ప్రతినిర్గ్రాహ్య గ్రహమునందలి సంపాతము నవనతము చేయవలెను.)

5. అర్థము: ఉరుక్రమః=గొప్ప పాదవిన్యాసము గల, హే విష్ణో!=ఓ విష్ణూ!, ఏషః సోమః=ఈ సోమము, తే=నీకు, (అధీనః=అధీన మైనది. అతః=ఇందువలన,) తమ్=ఆ సోమమును, రక్షస్వ=రక్షించుము. తే=నీ (సంబంధమైన) యొక్క, తమ్=ఆ సోమమును, దుశ్చక్షాః=పాపదృష్టి కల పురుషుఁడు, మా౽వఖ్యత్=చూడకుండుఁగాక.

తాత్పర్యము: గొప్ప పాదవిన్యాసము గల విష్ణూ! ఈ సోమము రక్షణార్థము నీయధీన మైనది. ఆ సోమరసమును రక్షించుము. నీ సంబంధమైన ఆ సోమరసమును పాపదృష్టికల పురుషుఁడు చూడకుండుఁ గాక. (ప్రతిప్రస్థాత ఈ మంత్రము నుచ్చరించుచు ఆదిత్య పాత్రముచేత ఆదిత్య స్థాలిని మూసివేయవలెను.)

6. అర్థము: పురోవసుః=ముందుగాఁ జేయఁబడిన ఇతర సమస్త ధనము కల, లేదా ముందుగా ప్రాణాదులను వసింపఁ జేయునట్టి, వసుః=ధనరూప సోమము, మయి=నాయందు, (వర్తతే=ఉంటున్నది). "వాక్పాః=వాక్పాలక మైన, త్వమ్=నీవు, మే=నాయొక్క, వాచమ్=వాక్కును, పాహి=రక్షించుము.

తాత్పర్యము: ఇతర సమస్త ధనమును ముందుండునట్లుగాఁ జేసికొనిన ధనరూప సోమము నాయం దుంటున్నది. ఓ ఐన్ద్రవాయవ గ్రహమా! నీవు వాక్పాలకమవు. అటువంటి నీవు నా వాక్కును పాలించుము. (అధ్వర్యుఁడు మంత్రము చెప్పుచు ఐన్ద్రవాయవ గ్రహమును తీసికొని హోత కీయవలెను.)

7. అర్థము: [1]విదద్వసుః=లబ్ధ సమస్త ధనము గల, వసుః=ధనరూప సోమము, మయి=నాయందు, వర్తతే=ఉంటున్నది. (హే మైత్రావరుణ గ్రహ! త్వమ్=నీవు,) చక్షుష్పాః=చక్షువులను పాలించుదానవు. (అతః=ఇందువలన, త్వమ్=నీవు,) మే=నాయొక్క, చక్షుః=చక్షుస్సును, పాహి=పాలించుము. [2]సంయద్వసుః=ప్రాప్త సమస్త ధనము కల, వసుః=ధనరూప సోమము, మయి=నాయందు, వర్తతే=ఉంటున్నది. (హే ఆశ్విన గ్రహ! త్వమ్=నీవు,) శ్రోత్రపాః=శ్రోత్రములను పాలించుదానవు. (అతః=ఇందువలన, త్వమ్=నీవు,) మే=నాయొక్క, శ్రోత్రమ్=శ్రోత్రమును, పాహి=పాలించుము.

తాత్పర్యము: [1]సమస్త ధనమును పొందిన ధనరూప సోమము నాయం దున్నది. ఓ మైత్రావరుణ గ్రహమా! నీవు చక్షుస్సును పాలించుదానవు. కావున నా చక్షుస్సును పాలించుము. [2]ప్రాప్తమైన సమస్త ధనము గల ధనరూప సోమము నాయం దున్నది. ఓ ఆశ్విన గ్రహమా! నీవు శ్రోత్రపాలకమవు కావున నా శ్రోత్రమును పాలించుము. (అధ్వర్యుఁడు ఇందలి 1వ మంత్రము పఠించుచు మైత్రావరుణ గ్రహమును, 2వ మంత్రము పఠించుచు ఆశ్విన గ్రహమును తీసికొని హోత కీయవలెను.)

8. అర్థము: (హే హస్తస్థ సోమ!=చేతియందున్న ఓ సోమమా! త్వమ్=నీవు,) భూః=సుఖములను గలుగఁజేయుదానవు, అసి=అగుచున్నావు. రశ్మీనామ్=సుఖప్రకాశక వస్తువులలో, శ్రేష్ఠః=శ్రేష్ఠమైనదానవు, అసి=అగుచున్నావు. (త్వమేవ=నీవే), ప్రాణపాః=ప్రాణమును కాపాడుదానవు. (తస్మాత్=ఆ కారణమువలన), మే=నాయొక్క, ప్రాణమ్=ప్రాణమును, పాహి=రక్షించుము.

తాత్పర్యము: చేతియందున్న ఓ సోమమా! నీవు సుఖములను కలుగఁజేయుదానవు. సుఖప్రకాశక వస్తువులలో శ్రేష్ఠమైన దానవు. నీవే ప్రాణములను కాపాడుదానవు. కావున నా ప్రాణమును రక్షించుము. (ఐన్ద్రవాయవ గ్రహ హోమానంతరము అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు ఆదిత్యోపస్థానము చేయవలెను.)

9. అర్థము (హే మైత్రావరుణ గ్రహ! త్వమ్,) ధూః=దుఃఖములను నశింపఁజేయుదానవు అసి=అగుచున్నావు. రశ్మీనామ్, శ్రేష్ఠః. అపానపాః=అపాన మనెడి వాయువును రక్షించుదానవు. మే, అపానమ్, పాహి. (అర్థము పూర్వోక్తము.)

తాత్పర్యము: ఓ మైత్రావరుణ గ్రహమా! నీవు దుఃఖముల నశింపఁజేయుదానవు. సుఖప్రకాశక వస్తువులలో శ్రేష్ఠమైన దానవు. నీవే అపానమును రక్షించుదానవు కావున నా యపానమును రక్షించుము. (మైత్రావరుణ గ్రహ హోమానంతరము అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు ఆదిత్యోపస్థానము చేయవలెను. ఆశ్విన గ్రహ హోమా నంతరము అందలి ఆదిత్యోపస్థాన మంత్రము శాఖాంతరమునందు కలదు. అది యచటనే ద్రష్టవ్యము.)

10. అర్థము: హే ఇన్ద్రవాయూ!=ఓ ఇంద్రవాయు దేవతలారా!, యః భ్రాతృవ్యః=ఏ శత్రువు, నః=మమ్ము, అభిదాసతి=హింసించుచున్నాఁడో, ఉత్పిపీతే=మమ్ము ఉల్లంఘించి సోమమును త్రాగుచున్నాఁడో, హే శుభస్పతీ!=శుభకర్మకు పాలకులైన ఓ ఇంద్రవాయువులారా!, తమ్=ఆ శత్రువును, అహమ్=నేను, ఇదం పాదయామి=ఇదిగో పడవేయుచున్నాను. హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, యథా=ఏ విధముగ, అహమ్=నేను, ఉత్తమః (సన్)=(శత్రువుకంటె) శ్రేష్ఠుఁడ నగుచు, చేతయాని=ఇహలోక పరలోక విషయక జ్ఞానవంతుఁడ నగుదునో, (తథా=ఆ విధముగ, త్వమ్=నీవు, అను గృహాణ=అనుగ్రహించుము).

**తాత్పర్యము:** శుభకర్మపాలకులగు ఓ ఇంద్రవాయు దేవతలారా! మమ్ము హింసించుచు మమ్ము ఉల్లంఘించి సోమము త్రాగుచున్న శత్రువు నిదిగో క్రిందఁ బడవేయుచున్నాను. (ఈ పలుకులు పలుకుచు తర్జనిత్రేవేలితో అంగుష్ఠమును పట్టుకొనుట నభినయింపవలెను.) ఓ యింద్రా! నేను శత్రువుకంటె నుత్తముఁడ నగుచు ఇహలోక పరలోక విషయక జ్ఞానము కలవాఁడ నగునట్లు అనుగ్రహించుము. హే మిత్రావరుణౌ=ఓ మిత్రావరుణులారా!, హే అశ్వినౌ!=ఓ యశ్వినీ దేవతలారా! అని యీ విధముగ సంబోధించి "యో భ్రాతృవ్యః" ఇత్యాది పదములను పూర్వమువలెనే సమన్వయము చేసికొనవలెను. ఇట్లు చేయుటచే నిందు మూఁడు మంత్రభాగములు ఏర్పడుచున్నవి. (తన శత్రువుకంటెఁ దాను అధికుఁడను గావలెనని యజమానుఁడు తలఁచినచో ఈ మంత్రము చెప్పుచు తర్జనితో నంగుష్ఠమును పట్టుకొనవలెను.)

దశమానువాకము సమాప్తము.

---

అథ తృతీయకాణ్డే ద్వితీయ ప్రపాఠక ఏకాదశోఽనువాకః

మూలము: [1]ప్ర నో అగ్నే తవోతిభిః సువీరాభి స్తరతి వాజకర్మభిః। యస్య త్వగ్ం సఖ్యమావిథ। [2]ప్ర హోత్రే పూర్వ్యం వచోఽగ్నయే భరతా బృహత్। విపాం జ్యోతీగ్ంషి బిభ్రతే న వేధసే। [3]అగ్నే త్రీ తే వాజినా త్రీ షధస్థా తిస్రస్తే జిహ్వా ఋతజాత పూర్వీః। తిస్ర ఉ తే తనువో దేవవాతా స్తాభిర్నః పాహి గిరో అప్రయచ్ఛన్। [4]సం వాం కర్మణా సమిషా (౧)హినోమీన్ద్రా విష్ణూ అపసస్పారే అస్య। జుషేథాం యజ్ఞం ద్రవిణం చ ధత్త మరిష్టైర్నః పథిభిః పార యన్తా। [5]ఉభా జిగ్యథుర్న పరా జయేథే న పరా జిగ్యే కతరశ్చనైనోః। ఇన్ద్రశ్చ విష్ణో యదపస్పృధేథాం త్రేధా సహస్రం వి తదైరయేథామ్। [6]త్రీణ్యాయూగ్ంషి తవ జాతవేద స్తిస్ర ఆజానీ రుషసస్తే అగ్నే। తాభి ర్దేవానామవో యక్షి విద్వానథ (౨)భవ యజమానాయ శం యోః। [7]అగ్ని స్త్రీణి త్రిధాతూన్యా క్షేతి విదథా కవిః। స త్రీగ్ంరేకాదశాగ్ం ఇహ। [8]యక్షచ్చ పిప్రయచ్చ నో విప్రో దూతః పరిష్కృతః। నక్షన్తామన్యకే సమే। [9]ఇన్ద్రావిష్ణూ దృగ్ంహితాః శమ్బరస్య నవ పురో నవతిం చ శ్నథిష్టమ్। శతం వర్చినః సహస్రం చ సాకగ్ంహథో అప్రత్యసురస్య వీరాన్। [10]ఉత మాతా మహిష మన్వవేనదమీ త్వా జహతి పుత్ర దేవాః। అథాబ్రవీ ద్వృత్రమిన్ద్రో హనిష్య న్త్సఖే విష్ణో వితరం విక్రమస్వ ॥౩॥

(ఇషాఽథ త్వా త్రయోదశ చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయప్రపాఠక ఏకాదశోఽనువాకః ॥౧౧॥

యో వై పవమానానాం త్రీణి పరిభూః స్ఫ్యః స్వస్తి ర్ఋక్షైహి మహినాం పయోఽసి దేవ సవితరే

తత్తే శ్యేనాయ యద్వై హోతోపయామగృహీతోఽసి వాక్షసదసి ప్ర నో అగ్న ఏకాదశ ॥౧౧॥

యో వై స్ఫ్యః స్వస్తిః స్వధాయై నమః ప్ర ముఞ్చ తిష్ఠతీవ షట్చత్వారింశత్। ॥౪౬॥

హరిః ఓమ్॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ద్వితీయః ప్రపాఠకః।।

## వేదార్థదీపిక

అవతారిక: దశమానువాకమునందు ప్రతినిర్గ్రాహ్య మంత్రము లభిహితము లైనవి. ఈ ఏకాదశానువాకమునందు త్రైధాతవీయేష్టి మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: హే అగ్నే!–ఓ యగ్నీ!, యస్య–ఏ యజమానునకు, త్వమ్–నీవు, సఖ్యమ్–స్నేహమును, ఆవిధ–పాలించితివో, సః–ఆ యజమానుఁడు, సువీరాభిః–శోభన పుత్రాద్యపత్య హేతువులును, వాజకర్మభిః–అన్ననిమిత్తములైన కర్మలు (ప్రయత్నములు) కలవియునగు, తవ–నీయొక్క, ఊతిభిః–రక్షణములచేత, ప్రతరతి–సంసారక్లేశము నధికముగ నతిక్రమించుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీతో సఖ్యమును పాటించుచున్న యజమానుఁడు నీ రక్షణములచేత సంసారక్లేశము నధికముగ నతిక్రమించుచున్నాఁడు. నీ రక్షణములు సుపుత్రాద్యపత్య హేతువులు, అన్ననిమిత్తములునైన ప్రయత్నములు కలవి. (అగ్నిప్రజ్వలనము చేయు ఋక్కులలో నిది మొదటి ఋక్కు.)

2. అర్థము: (హే ఋత్విజః!–ఓ ఋత్విజులారా!, యూయమ్–మీరు,) హోత్రే–హోమనిష్పాదకుఁడును, వేధసే–మనకు హితమును గలుగఁజేయువాఁడునగు, అగ్నయే–అగ్ని హోత్రునికొఱకు, పూర్వ్యమ్–పూర్వము ఋషులచే పఠింపఁబడినదియు, విపామ్–విశేషముగ మమ్ము పాలించునదియునగు, వచః–స్తుతిరూప వాక్కును, జ్యోతీంషి–రశ్మిరూప జ్యోతిస్సులను, బిభ్రతే న–ధరించునట్టి సూర్యునికొఱకు వలె, ప్రభరతా–అధికముగ పోషించుఁడు.

తాత్పర్యము: ఓ ఋత్విజులారా! మీరు సూర్యునివలె అగ్నిని స్తుతించుఁడు. ఆ స్తుతి పూర్వము ఋషులు చేసినట్టిది. మమ్ము విశేషముగఁ బోషించునది. అగ్ని హోమ నిష్పాదకుఁడు. మనకు హితమును గల్పించువాఁడు. (ఇది రెండవ ఋక్కు.)

3. అర్థము: హే అగ్నే!–ఓ యగ్నీ!, తే–నీకు, త్రీ–మూఁడు, వాజినా–అన్నములు, (భవన్తి–ఉంటున్నవి). త్రీ–మూఁడు, షధస్థా–సహస్థానములు (పరస్పర సంబంధము కలిగిన ముల్లోక రూపములు), (భవన్తి–ఉంటున్నవి). హే ఋతజాతః–జ్ఞాన స్వరూప ఋతమునుండి పుట్టిన ఓ యగ్నీ!, తే–నీకు, తిస్రః–మూఁడు, పూర్వీః–పూర్వసిద్ధములైన, జిహ్వాః–సాత్త్విక రాజస తామస రూపములైన నాలుకలు, (భవన్తి). ఉ–మఱియు, దేవవాతాః–దేవతలచే పొందఁబడిన, తనువః–శరీరములు. తిస్రః–మూఁడు, (భవన్తి). తాభిః–

అగ్ని విద్యుదాదిత్య రూపములైన ఆ శరీరములచేత, గిరః=మా సంబంధములైన స్తుతిరూప వాక్కులను, అప్రయచ్ఛన్=ప్రమాదరహితములుగఁ జేయుచు, నః=మమ్ము, పాహి=రక్షించుము. (త్రీ=త్రీణి. వాజినా=వాజీని. ఇవి ఛాందస ప్రయోగములు.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీకు పురోడాశ రూపములైన లేదా- సోమౌషధి సాన్నాయ్య రూపములైన మూఁడన్నములు కలవు. నీకు పరస్పరయుక్త లోకత్రయ రూపములైన -లేదా- ఆహవనీయ, గార్హపత్య, దాక్షిణాగ్ని రూపములైన మూఁడు సహస్థానములు కలవు. జ్ఞానమునుండి పుట్టిన ఓ యగ్నీ! నీకు పూర్వసిద్ధములైన సాత్త్విక రాజస తామస రూపములైన నాలుకలు మూఁడు కలవు. అవి ఇష్టప్రాప్త్యనిష్ట పరిహారాభిచార హేతువులైనవి. మఱియు దేవతలచే పొందఁబడిన మూఁడు శరీరములు కలవు. అగ్ని విద్యుదాదిత్య రూపములైన ఆ శరీరములచే మా స్తుతిరూప వాక్కులను ప్రమాదరహితములుగఁ జేయుచు మమ్ము రక్షించుము.

4\. అర్థము: హే ఇన్ద్రావిష్ణూ!=ఓ ఇంద్ర విష్ణు దేవతలారా!, వామ్=మిమ్ము, అస్య అపసః పారే=ఈ యనుష్ఠింపఁబడుచున్న కర్మయొక్క పరిసమాప్తి నిమిత్తము, కర్మణా=ఈ కర్మచేత, సంహినోమి=సంతోషింపఁజేయుచున్నాను. ఇషా=హవిర్లక్షణమైన అన్నముచేత, సంహినోమి=సంతోషింపఁజేయుచున్నాను. చ=మఱియు, అరిష్టైః=వినాశరహితములైన, పథిభిః=అనుష్ఠాన మార్గములచేత, నః=మమ్ము, పారయన్తా=కర్మయొక్క పారమును పొందించుచున్నవార లగుచు, యజ్ఞమ్=ఈ మా యజ్ఞమును, జుషేథామ్=సేవించుఁడు. ("జుషీ=ప్రీతి సేవనయోః") అస్మభ్యమ్=మాకొఱకు, ద్రవిణమ్=ధనమును, ధత్తమ్=ఒసఁగుఁడు (సంపాదించుఁడు).

తాత్పర్యము: ఓ ఇంద్రావిష్ణు దేవతలారా! ఈ యనుష్ఠించఁబడుచున్న కర్మ నిర్విఘ్నముగ పరిసమాప్తి నొందుటకై మిమ్ము ఈ కర్మచేత, హవిర్లక్షణమైన అన్నముచేతను సంతోషపఱచుచున్నాను. మఱియు నాశరహితములైన అనుష్ఠాన మార్గములచేత మమ్ము కర్మయొక్క పారమును పొందించుచున్నవార లగుచు ఈ యజ్ఞమును సేవించుఁడు. మాకు ధనమును సంపాదించుఁడు. (ఇది పురోనువాక్య.)

5\. అర్థము: హే విష్ణో!=ఓ విష్ణూ!, ఇన్ద్రశ్చ=ఇంద్రుఁడును, (త్వమ్=నీవు,) ఉభా=ఉభయులు, జిగ్యథుః=జయమును పొందిరి. న పరాజయేథే=ఒకప్పుడును పరాజయమును పొందలేదు. ఏనోః (ఏనయోః)=ఈ ఇద్దఱిలో, కతరశ్చ=ఒక్కరును, న పరాజిగ్యే=పరాజయమును పొందలేదు. యత్=ఎప్పుడు, (ఉభౌ యువామ్=మీరుభయులు,) అపస్పృధేథామ్=స్పర్ధను జేయుదురో (పరస్పరము స్పర్ధ వహింతురో), తదా=అప్పుడు, సహస్రమ్=(దక్షిణగా నీయఁదగిన) గో సహస్రమును, త్రేధా=మూఁడు విధములుగా, విభజ్య=విభజించి, ఐరయేథామ్=పొందించుఁడు.

తాత్పర్యము: ఓ విష్ణూ! ఇంద్రుఁడు నీవు, ఉభయులును జయము నొందిరి. ఒకప్పుడును పరాజయము నొందలేదు. ఈ యుభయులలో ఒక్కరు కూడ పరాజయము నొందలేదు. మీ రుభయులు పరస్పరము స్పర్ధవహించి నప్పుడు దక్షిణగా నీయఁదగిన గో సహస్రమును మూఁడు భాగములు చేయుఁడు. (ఈ విభాగము సప్తమ కాండమునందు స్పష్టముగఁ జెప్పఁబడినది. ఇది యాజ్య. ఉభా=ఉభౌ, వి=విభజ్య. ఏనోః=ఏనయోః.)

6\. అర్థము: హే జాతవేదః!=ఓ యగ్నీ!, తవ=నీకు, ఆయూంషి=ఆయుర్వృద్ధి కారణములైన హవిస్సులు, త్రీణి=సోమ సాంనాయ్య పురోడాశ రూపముచే మూఁడు, (సన్తి=కలవు). హే అగ్నే!=ఓ యగ్నీ!, తే=నీయొక్క, ఉషసః=ఉషఃకాల సదృశములైన, ఆజానీః=ఆవిర్భావరూప జ్వాలలు, తిస్రః=(ఆహవనీయాది స్థానములు మూఁడింటియందు) మూఁడు విధము లైనవి. తాభిః=ఆ జ్వాలలచేత, దేవానామ్=దేవతలకు, అవః=రక్షక మైన హవిస్సును, విద్వాన్=తెలిసికొనినవాఁడవై, యక్షి=యాగము చేయుము. అథ=అనంతరము, యజమానాయ=యజమానునికొఱకు, శమ్=సుఖప్రదుఁడవు, భవ=అగుము. యోః=దుఃఖ వియోజకుఁడవు, భవ=అగుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీకు ఆయుర్వృద్ధి కారణములైన హవిస్సులు సోమ సాన్నాయ్య పురోడాశ రూపముచే మూఁడు కలవు. ఓ యగ్నీ! నీయొక్క ఉషఃకాల సదృశములైన ఆవిర్భావరూప జ్వాలలు ఆహవనీయాది స్థానము

లందు మూఁడు విధములుగా నున్నవి. ఆ జ్వాలలచేత దేవతలకు రక్షకమైన హవిస్సును దెలిసికొనినవాఁడవై యాగము చేయుము. - అనంతరము యజమానునికొఱకు సుఖప్రదుఁడ వగుము. దుఃఖమును పోఁగొట్టువాఁడవు కమ్ము. (ఇది స్విష్టకృదగ్నికి పురోనువాక్యా రూపమైన సంయాజ్య.)

7. అర్థము: కవిః=విద్వాంసుఁడైన, (అయమ్)అగ్నిః=ఈ యగ్ని, విదథా(విదథేషు)=యజ్ఞములందు, త్రిధాతూని=త్రిప్రకారములైన, త్రీణి=మూఁడు హవిస్సులను, ఆక్షేతి=అంతటను పొందుచున్నాఁడు. సః=ఆ యగ్ని, ఇహ=ఈ కర్మయందు, ఏకాదశాన్ త్రీన్=పదునొకండుగురు దేవతలతోఁ గూడిన మూఁడు గణములను, తర్పయతు=తృప్తిపఱచుఁగాక.

తాత్పర్యము: విద్వాంసుఁడైన ఈ యగ్ని మూఁడు విధములైన మూఁడు హవిస్సులను అంతటను పొందుచున్నాఁడు. ఆ యగ్ని ఈ కర్మయందు పదునొకండుగురేసి దేవతలు గల మూఁడు గణములను సంతోషపఱచుఁగాక. (ఇది స్విష్టకృదగ్నికి యాజ్యారూపమైన సంయాజ్య.)

8. అర్థము: పరిష్కృతః=దూతత్వ చిహ్నములచే నలంకృతుఁడైన, దూతః=దూతరూపుఁడైన, (అయమగ్నిః=ఈ యగ్ని,) యక్షచ్చ=దేవతల నుద్దేశించి యాగము చేయుఁగాక. విప్రః=బ్రాహ్మణ జాత్యభిమానియగు ఈ యగ్ని, నః=మమ్ము, పిప్రయచ్చ=సంతోషపఱచుఁగాక. అన్యకే=మా కంటె నితరులైన కుత్సితులగు శత్రువులు, సమే=అందఱు, నభన్తామ్=నశింతురు గాక.

తాత్పర్యము: ''అగ్నిర్దేవానాం దూత ఆసీత్'' అని యుండుటచే అగ్ని దేవతలకు దూత. దూతత్వ లక్షణములతోఁ గూడియున్న దూతయగు ఈ యగ్ని దేవతల నుద్దేశించి యజ్ఞము చేయుఁగాక. బ్రాహ్మణ జాత్యభిమానియగు నీ యగ్ని మమ్ము సంతోషపఱచుఁగాక. మా కంటె నితరులయిన కుత్సిత శత్రువు లందఱును నశింతురు గాక. (ఇది మఱియొక సంయాజ్య.)

9. అర్థము: హే ఇన్ద్రావిష్ణూ!=ఓ యింద్రావిష్ణు దేవతలారా! (యువామ్=మీరు,) శమ్బరస్య=శంబర నామకుఁడగు అసురునియొక్క, దృంహితాః=దృఢములైన, నవనవతిమ్=తొంబదితొమ్మిది, పురః=నగరములను, శ్నథిష్టమ్=నశింపఁజేసితిరి. చ=మఱియు, అసురస్య=ఆ యసురుని సంబంధులును, వర్చినః=దీప్తిమంతులునగు, శతం సహస్రం చ=శత సహస్ర సంఖ్యాకులైన, వీరాన్=ప్రధానులయిన అమాత్యాదులను, అప్రతి=పక్షరాహిత్య మగునట్లు, సాకంహథః=సంపూర్ణముగ హతులను జేసితిరి.

తాత్పర్యము: ఓ యింద్రావిష్ణు దేవతలారా! మీరు శంబరాసురుని సంబంధములైన దృఢములైన తొంబదితొమ్మిది నగరములను నశింపఁజేసితిరి. మఱియు ఆ శంబరుని సంబంధులగు దీప్తిమంతులైన శతసహస్ర సంఖ్యాకులయిన ప్రధానామాత్యాదులను పక్షరాహిత్యముగ హతులను జేసితిరి. (ఇది ప్రధానహవిస్సునకు పురోనువాక్య.)

10. అర్థము: ఉత=లేదా, మాతా=ఇంద్రుని తల్లి, మహిషమ్=గొప్పవాఁడైన యింద్రుని, అన్వవేనత్=అనుక్రమముగ జ్ఞాపనము చేసినది. –'' హే పుత్ర!=ఓ కుమారా! (త్వయి శత్రూన్ హత్వా తూష్ణీం స్థితే సతి=నీవు శత్రువులను వధించి ఉదాసీనుఁడవై యుండఁగా,) అమీ దేవాః=ఈ దేవతలు, (అందఱు) త్వా=నిన్ను, జహతి=విడుచుచున్నారు, ఇతి=అని,'' అథ=మాతృ బోధనానంతరము, ఇన్ద్రః=ఇంద్రుఁడు, వృత్రమ్=వృత్రాసురుని, హనిష్యన్=వధింప నుద్యుక్తుఁడగుచు, –'' హే సఖే విష్ణో!=మిత్రుఁడవైన ఓ విష్ణూ!, వితరమ్=విశిష్టతరముగ, విక్రమస్వ=పరాక్రమించుము. ఇతి=అని," (విష్ణుమ్=విష్ణువును గూర్చి, అబ్రవీత్=పలికెను.)

తాత్పర్యము: ఓ కుమారా! నీవు శత్రువులను జంపి ఊరకుండఁగా ఈ దేవతలు నిన్ను పరిత్యజించుచున్నారు అను విషయమును ఇంద్రమాత గుర్తింపఁజేసినది. మాతృబోధనానంతరము ఇంద్రుఁడు వృత్రవధోద్యుక్తుఁడై ''ఓ సఖుఁడవైన విష్ణూ! పరాక్రమింపుము'' అని విష్ణువుతోఁ బలికెను. అటువంటి ఇంద్రా విష్ణువులారా! మా యభీష్టమును సంపాదించుఁడు. (ఇది యాజ్య. "ఓ హాక్=త్యాగే'' ఇతి ధాతోః 'జహతి' ఇతి సిధ్యతి).

**ద్వితీయప్రపాఠకము సమాప్తము.**

## అథ తృతీయకాణ్డే తృతీయః ప్రపాఠకః।

### తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]అగ్నే తేజస్వి న్తేజస్వీ త్వం దేవేషు భూయా స్తేజస్వన్తం మామాయుష్మన్తం వర్చస్వన్తం మనుష్యేషు కురు దీక్షాయై చ త్వా తపసశ్చ తేజసే జుహోమి [2]తేజోవిదసి తేజో మా మా హాసీ న్మాఽహం తేజో హాసిషం మా మాం తేజో హాసీ [3]దిన్ద్రౌజస్వి న్నోజస్వీ త్వం దేవేషు భూయా ఓజస్వన్తం మామాయుష్మన్తం వర్చస్వన్తం మనుష్యేషు కురు బ్రహ్మణశ్చ త్వా క్షత్రస్య చ (౧)ఓజసే జుహోమ్యోజోవిద స్యోజో మా మా హాసీన్మాఽహ మోజో హాసిషం మా మామోజో హాసీ [4]త్సూర్య భ్రాజస్విన్భ్రాజస్వీ త్వం దేవేషు భూయా భ్రాజస్వన్తం మామాయుష్మన్తం వర్చస్వన్తం మనుష్యేషు కురు వాయోశ్చ త్వాఽపాం చ భ్రాజసే జుహోమి సువర్విదసి సువర్మా మా హాసీన్మాఽహగ్ం సువర్హాసిషం మా మాగ్ం సువర్హాసీ [5]న్మయి మేధాం మయి ప్రజాం మయ్యగ్ని స్తేజో దధాతు మయి మేధాం మయి ప్రజాం మయీన్ద్ర ఇన్ద్రియం దధాతు మయి మేధాం మయి ప్రజాం మయి సూర్యో భ్రాజో దధాతు ॥౧॥ (క్షత్రస్య చ మయి త్రయోవిగ్ంశతిశ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయ ప్రపాఠకే ప్రథమోఽనువాకః॥

## వేదార్థదీపిక

అవతారిక: ప్రతినిగ్రాహ్య పర్యంతములైన పవమానగ్రహాదులు సమంత్రకముగ ద్వితీయ ప్రపాఠకమునందు వివరించబడినవి. ఈ తృతీయ ప్రపాఠకమునందు అవశిష్టములైన అతిగ్రాహ్యగత మంత్రములు చెప్పబడుచున్నవి.

1. అర్థము: తేజస్విన్‌:–కాంతిమంతుడవైన, హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్–నీవు, దేవేషు–దేవతలయందు, తేజస్వీ–కాంతిమంతుడవు, భూయాః–అగుదువు గాక. మనుష్యేషు–మనుష్యులయందు, మామ్–నన్ను, ఆయు

ష్మ న్తమ్=ఆయుపు కలవానినిగాను, వర్చస్వ న్తమ్=బలము కలవానినిగాను, కురు=చేయుము. (హే అగ్నే యాతి గ్రాహ్య!=అగ్ని దేవతాకమయిన ఓ అతిగ్రాహ్యమా!) త్వా=నిన్ను, దీక్షాయై చ=దీక్షకు సంబంధించి నదియు, తపసః చ=తపస్సునకు సంబంధించినదియునగు, తేజసే=కాంతికొఱకు, జుహోమి=హోమము చేయుచున్నాను.

తాత్పర్యము: కాంతిమంతుఁడవైన ఓ యగ్నీ! నీవు దేవతలలో కాంతిమంతుఁడ వగుదువు గాక. మనుష్యులలో నన్ను ఆయుష్మంతునిగాను బలవంతునిగాను చేయుము. అగ్ని దేవతాకమైన అతిగ్రాహ్యమా! దీక్షాసంబంధియు, తపస్సంబంధియునగు, కాంతిని పొందుటకై నిన్ను హోమము చేయుచున్నాను. (ఈ హోమముచే దీక్షా నియమములు తపస్సు నిర్విఘ్నముగ సిద్ధించుఁ గాక యని తాత్పర్యము. ఇది హోమమంత్రము.)

2. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, (త్వమ్=నీవు), తేజోవిత్=కాంతిని తెలిసికొనినవాఁడవు, అసి=అగుచున్నావు. తేజః=తేజస్సు, మా=నన్ను, మా హాసీత్=విడువకుండుఁగాక, అహమ్ (అపి)=నేనుఁగూడ, తేజః=తేజస్సును, మా హాసిషమ్=విడువనివాఁడ నగుచున్నాను. (తస్మాత్=అ కారణమువలన, సర్వథా=అన్ని విధముల చేత), తేజః=తేజస్సు, మామ్=నన్ను, మా హాసీత్=విడువకుండుఁగాక. ("మా హాసీత్=మా పరిత్యజతు" అని విద్యారణ్యము).

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు కాంతిని తెలిసికొనినవాఁడవు. కాంతి నన్ను విడువకుండుఁ గాక. నేనుఁ గూడ కాంతిని విడువనివాఁడ నగుచున్నాను. కావున అన్ని విధములచేతను కాంతి నన్ను విడువకుండుఁ గాక. (ఇది అను మంత్రణ మంత్రము. ప్రతిప్రస్థాత యను ఋత్విజుఁడు అగ్ని దేవతాకమయిన అతిగ్రాహ్యమును "అగ్నే తేజస్విన్" ఇత్యాది మంత్రము పఠించుచు హోమము చేయవలెను. "తేజోవిదసి" ఇత్యాది మంత్రముచేత అనుమంత్రణము చేయవలెను.)

3. అర్థము: ఓజస్విన్!=ఓజోవంతుఁడవైన, హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, త్వమ్=నీవు, దేవేషు=దేవతలయందు, ఓజస్వీ=ఓజస్సు కలవాఁడవు, భూయాః=అగుదువు గాక. మనుష్యేషు=మనుష్యులయందు, మామ్=నన్ను, ఆయుష్మ న్తమ్=ఆయుపు కలవానినిగాను, వర్చస్వ న్తమ్=బలము కలవానినిగాను, ఓజస్వ న్తమ్=ఓజస్సు కలవానినిగాను, కురు=చేయుము. (హే ఐన్ద్ర అతిగ్రాహ్య!=ఓ యింద్రదేవతాకమైన అతిగ్రాహ్యమా!), త్వా=నిన్ను, బ్రహ్మణశ్చ=బ్రాహ్మణజాతికి సంబంధించినదియు, క్షత్రస్య చ=క్షత్రియజాతికి సంబంధించి నదియునగు, ఓజసే=ఓజస్సుకొఱకు, జుహోమి=హోమము చేయుచున్నాను. (హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా! త్వమ్=నీవు,) ఓజోవిత్=ఓజస్సును తెలిసినవాఁడవు, అసి=అగుచున్నావు. ఓజః=ఓజస్సు, మా=నన్ను, మా హాసీత్=విడువకుండుఁగాక. అహమ్ (అపి)=నేనుఁగూడ, ఓజః=ఓజస్సును, మా హాసిషమ్=విడువని వాఁడ నగుచున్నాను. (తస్మాత్=అ కారణమువలన, సర్వథా=అన్ని విధములచేత), ఓజః=ఓజస్సు, మామ్=నన్ను, మా హాసీత్=విడువకుండుఁగాక. (మా హాసీత్, మా హాసిషమ్, అను ప్రయోగములు భూత కాలికములైనను లోడర్థకములుగా నిచట సమన్వయింపఁబడినవి. నేష్ట యను ఋత్విజుఁడు ఇంద్రదేవతాక మయిన అతిగ్రాహ్యమును "ఇన్ద్రౌజస్విన్" ఇత్యాది మంత్రమును పఠించుచు హోమము చేయవలెను. "ఓజోవిదసి" ఇత్యాది మంత్రమును పఠించుచు అనుమంత్రణము చేయవలెను. ఓజః=బలహేతువైన అష్టమ ధాతువిశేషము. తాత్పర్యము సులభము.)

4. అర్థము: భ్రాజస్విన్!=దీప్తిమంతుఁడవైన, హే సూర్య!=ఓ సూర్యుఁడా!, త్వమ్=నీవు, దేవేషు=దేవతలయందు, భ్రాజస్వీ=దీప్తి కలవాఁడవు, భూయాః=అగుదువు గాక. మనుష్యేషు=మనుష్యులయందు, మామ్=నన్ను, భ్రాజస్వ న్తమ్=దీప్తిమంతుని గాను, ఆయుష్మ న్తమ్=ఆయుష్మంతుని గాను, వర్చస్వ న్తమ్=వర్చస్సు కలవానినిగాను, కురు=చేయుము. (హే సౌర్య అతిగ్రాహ్య!=సూర్యదేవతాకమైన అతిగ్రాహ్యమా!, త్వా=నిన్ను, వాయోః చ=వాయుదేవతకు సంబంధించినదియు, అపాం చ=ఉదకములకు సంబంధించి నదియునగు, భ్రాజసే=దీప్తికొఱకు, జుహోమి=హోమము చేయుచున్నాను. (హే సూర్య!=ఓ సూర్యుఁడా,

త్వమ్=నీవు), సువర్విత్=స్వర్గమార్గమును తెలిసినవాఁడవు, అసి=అగుచున్నావు. సువః=స్వర్గము, మా=నన్ను, మా హాసిత్=విడువకుండుఁ గాక. అహమ్ (అపి)=నేనుఁ గూడ, సువః=స్వర్గమును, మా హాసిషమ్=విడువనివాఁడ నగుచున్నాను. (తస్మాత్=ఆ కారణమువలన, సర్వథా=అన్ని విధములచేతను), సువః=స్వర్గము, మామ్=నన్ను, మా హాసిత్=విడువకుండుఁగాక. (భ్రాజః=శరీరకాంతికి బహిర్భూతమైన రశ్మిరూప దీప్తి. ఉన్నేత యను ఋత్విజుఁడు "సూర్య భ్రాజస్విన్" ఇత్యాది మంత్రమును జదువుచు సూర్య దేవతాకమైన అతిగ్రాహ్యమును హోమము చేసి, "సువర్విదసి" ఇత్యాది మంత్రమును చదువుచు అనుమంత్రణము చేయవలెను. తాత్పర్యము సులభము.)

5. అర్థము! అగ్నిః=అగ్నిదేవుఁడు, మయి=నాయందు, మేధామ్=మేధను, దధాతు=ధరింపఁజేయుఁగాక. (ఉంచుఁగాక.) మయి=నాయందు, ప్రజామ్=సంతానమును, దధాతు=ధరింపఁజేయుఁగాక. మయి=నాయందు, తేజః=కాంతిని, దధాతు=ధరింపఁజేయుఁగాక. ఇన్ద్రః=ఇంద్రుఁడు, మయి=నాయందు, ఇన్ద్రియమ్=ఇంద్రియ సామర్థ్యమును, మేధామ్, ప్రజామ్, దధాతు=ధరింపఁజేయుఁగాక. సూర్యః=సూర్యుఁడు, మయి=నాయందు, మేధామ్, ప్రజామ్, భ్రాజః=దీప్తిని, దధాతు=ధరింపఁజేయుఁగాక. (మేధా=మంత్ర, మంత్రార్థములను ధారణ చేయఁగల సామర్థ్యము. ప్రతిప్రస్థాత్రాది ఋత్విజులు పూర్వోక్తవిధముగ హోమము చేసిన పిమ్మట "మయి మేధామ్" ఇత్యాది మంత్రమును పఠించుచు సదస్సునందు ప్రత్యఙ్ముఖులై హోమశేషమును భక్షించవలెను. తాత్పర్యము సులభము. "మయి మేధా" మిత్యాది మంత్రములు అగ్నీంద్ర సూర్య దేవతా ప్రతిపాదకములుగ నుండుటచే మూఁడు భాగములు. అగ్నిః, మయి, మేధామ్, దధాతు. అగ్నిః, మయి, ప్రజామ్, దధాతు. ఈ విధముగ మిగిలినవానిని గూడ సమన్వయము చేయవలెను.

ప్రథమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే ద్వితీయోఽనువాకః ।

మూలము: [1]వాయు ర్హింకర్తాఽగ్నిః ప్రస్తోతా ప్రజాపతిః సామ బృహస్పతి రుద్గాతా విశ్వే దేవా ఉపగాతారో మరుతః ప్రతిహర్తార ఇన్ద్రో నిధనం తే దేవాః ప్రాణభృతః ప్రాణం మయి దధ[2]త్వేతద్వై సర్వ మధ్వర్యు రుపాకుర్వ న్నుద్గాతృభ్య ఉపాకరోతి తే దేవాః ప్రాణభృతః ప్రాణం మయి దధత్విత్యాహైతదేవ సర్వ మాత్మన్ధత్త [3]ఇడాదేవహూ ర్మనుర్యజ్ఞనీ ర్బృహస్పతి రుక్థామదాని శగ్‍ంసిషద్విశ్వే దేవాః (౧)సూక్తవాచః పృథివి మాతర్మా మా హిగ్‍ంసీ ర్మధు మనిష్యే మధు జనిష్యే మధు వక్ష్యామి మధు వదిష్యామి మధుమతీం దేవేభ్యో వాచముద్యాసగ్‍ం శుశ్రూషేణ్యాం మనుష్యేభ్య స్తం మా దేవా అవన్తు శోభాయై పితరోఽను మదన్తు ॥ ౨ ॥

(శగ్‍ంసిషద్విశ్వే దేవా అష్టావిగ్‍ంశతిశ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే ప్రథమప్రపాఠకే ద్వితీయోఽనువాకః ।

## వేదార్థదీపిక

**అవతారిక:** అతిగ్రాహ్యగత మంత్రములు ప్రథమానువాకమునఁ జెప్పఁబడినవి. ఈ ద్వితీయానువాకమునందు స్తోత్రోపాకరణ ప్రతిగరాంగ మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము:** వాయుః—వాయువు, హింకర్తా—గానము చేయఁదగిన సామముయొక్క అయిదు భాగములలో మొదటిదైన హింకారమును గానము జేయువాఁడు. అగ్నిః—అగ్ని రూపుఁడైన, ప్రస్తోతా—ప్రస్తోత యను ఋత్విజుఁడు, (ప్రస్తావమ్—ప్రస్తావ మను సామభాగమును, గాయతి—గానముచేయును.) ప్రజాపతిః—ప్రజాపతి, సామ—సంపూర్ణ సామ స్వరూపము. బృహస్పతిః—బృహస్పతి రూపుఁడైన, ఉద్గాతా—ఉద్గాత యనుఋత్విజుఁడు. (ఉద్గీథమ్—ఉద్గీథ మను తృతీయ సామభాగమును, గాయతి—గానము చేయును.) మరుతః—మరుద్రూపులైన, ప్రతిహర్తారః—ప్రతిహర్తృనామక ఋత్విజులు, (ప్రతిహారమ్—సామముయొక్క నాల్గవదియైన ప్రతిహార భాగమును, గాయన్తి—గానముచేయుదురు.) ఇన్ద్రః—ఇంద్రుఁడు, నిధనమ్—పంచమమైన నిధన భాగమును గాయతి—గానముచేయును. విశ్వే దేవాః ఉపగాతారః—ఇతర సర్వదేవతలు ఉపగాయకులు. తే దేవాః—ఆ వాయ్వాది ఇంద్రాంత దేవతలు, ప్రాణభృతః—ప్రాణపోషకులు. (తతః—అందువలన, తే—వారు,) మయి—నాయందు, ప్రాణమ్—ప్రాణమును, దధతు—ధరింపఁజేయుదురుగాక (స్థాపింతురు గాక).

తాత్పర్యము: యజ్ఞమునందు గానము చేయఁదగిన సామమునకు హింకారము, ప్రస్తావము, ఉద్గీథము, ప్రతిహారము, నిధనము అను అయిదు భాగములు కలవు. వీనిలో హింకార నిధన రూపములైన ఆద్యంత భాగములు ఋత్విజు లందఱచేతను గానము చేయఁదగినవి. ప్రస్తావోద్గీథ ప్రతిహార భాగములు వరుసగ ప్రస్తోత, ఉద్గాత, ప్రతిహర్త అను ఋత్విజులు గానము చేయఁదగినవి. వీరు ఈ సామభాగములను గానము చేయు చుండఁగా అధ్వర్యుభిన్నులయిన ఋత్విజు లందఱు "ఓమ్" అని ఉపగానము చేయవలెను. అప్పుడు యజమానుఁడు 'హో' అని ఉపగానము చేయవలెను. ఈ ఋత్విజులు వాయ్వాది దేవతారూపమున ఇచటఁ జెప్పఁబడిరి. సర్వదేవతా జనకుఁడగు ప్రజాపతి సమష్టిరూపుఁ డగుటచే సంపూర్ణ సామరూపుఁడు. వాయ్వాది దేవతలు ప్రజాపత్యేకదేశ లగుటచే సామైకదేశ హింకారాదికర్త లగుచున్నారు. "ఈ వాయ్వాది దేవతలు ప్రాణపోషకు లగుటచే అధ్వర్యుఁడనైన నాయందు ప్రాణమును స్థాపింతురు గాక." (అధ్వర్యుఁడు స్తోత్రము నుపాకరణము చేయవలెను. పవమాన స్తోత్రము లన్నిటియందు ఉపాకరణము జరుగుచుండఁగా "వాయు ర్హింకర్తా" అను మంత్రమును చెప్పుచు నధ్వర్యుఁడు ప్రస్తోతకు బర్హిర్ముష్టి నీయవలెను. "తే దేవాః" ఇత్యాది మంత్రభాగము నధ్వర్యుఁడు పఠించవలెను.)

2. అర్థము: అధ్వర్యుః=అధ్వర్యుఁడు, ఏతత్సర్వమ్=ఈ వాయ్వాదిరూప హింకర్తృత్వాదికము సర్వమును, ఉపాకుర్వన్=స్తోత్రపాఠానుజ్ఞ నిచ్చుచు, ఉద్గాతృభ్యః=సామగానము చేయువారికొఱకు, ఉపాకరోతి=బర్హిర్ముష్టి ప్రదానరూపమైన ఉపాకరణమును చేయవలెను. "తే దేవాః ప్రాణభృతః....దధత్విత్యాహ"= 'తే దేవా' ఇత్యాది మంత్రపాఠముచేత, (అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) ఏతత్సర్వమ్=ఈ వాయ్వాదిరూప హింకర్తృత్వాదికము సర్వమును, ఆత్మన్=తనయందు, ధత్తే=స్థాపించుకొనినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: అధ్వర్యుఁడు ఉద్గాతలకు (సామగానము చేయువారికి) స్తోత్రపాఠానుజ్ఞ నిచ్చిన సమయముననే వాయ్వాదిరూప హింకర్తృత్వాదికము సర్వమునకు అభ్యనుజ్ఞ నిచ్చినవాఁ డగుచున్నాఁడు. కావున "వాయు ర్హింకర్తా" ఇత్యాది మంత్రముచేత బర్హిర్ముష్టిప్రదాన రూపమైన ఉపాకరణము చేయవలెనని తాత్పర్యము. ఆ మంత్రమునందలి "తే దేవాః" ఇత్యాది భాగమును అధ్వర్యుఁడు పఠించవలెను. దానిచేత వాయ్వాదిరూప హింకర్తృత్వాదికము సర్వమును అధ్వర్యుఁడు తనయందు స్థాపించుకొనినవాఁ డగుచున్నాఁడు. (ఉపాకరణము=స్తోత్రపాఠమును గానము చేయుటకు అనుజ్ఞ నిచ్చుట. అధ్వర్యుఁడు ప్రస్తోతకు బర్హిర్ముష్టి ప్రదానము చేయుట కూడ ఉపాకరణమే.)

3. అర్థము: ఇడా=దేవ గో రూపమైన యిడ, దేవహూః=దేవతల నాహ్వానించునది. మనుః=మనువు, యజ్ఞనీః=యజ్ఞప్రవర్తకుఁడు. (యజ్ఞం నయతీతి=యజ్ఞనీః. అని వ్యుత్పత్తి.) బృహస్పతిః=బృహస్పతి, ఉక్థామదాని=మంత్రవాక్య విశేషములను, శంసిషత్=ప్రశంసించువాఁడు. విశ్వేదేవాః=విశ్వేదేవతలు, సూక్తవాచః=సూక్తవక్తలు. హే పృథివి! మాతః!=మాతృరూపయైన ఓ పృథివీ!, మాఁ=నన్ను, మా హింసీః=హింసింపకుము. (త్వదనుగ్రహాత్=నీయనుగ్రహమువలన, అహమ్=నేను, మధు=తేనెవలె ప్రియమైన కార్యమునే, మనిష్యే=మనస్సుచే నాలోచింపఁగలను. (తథా=ఆ విధముగ), మధు=మధువువలె ప్రియమైన కర్మఫలమును, జనిష్యే=ఉత్పాదనము చేయఁగలను. (తథా=ఆ విధముగ), మధు వక్ష్యామి=మధువువలె ప్రియమైన హవిస్సును దేవతల నుద్దేశించి వహింపఁగలను. (తథా=అట్లు,) మధు వదిష్యామి=మధువువలె ఇష్టమైన ప్రతిగర రూప వాక్యమును ఉచ్చరింపఁజేయఁగలను. (తథా=ఆ విధముగ,) దేవేభ్యః=దేవతలకొఱకు, మధుమతీమ్=మధువువలె ప్రియమైనదియు, మనుష్యేభ్యః=మనుష్య(హోత్రాదు)లచే, శుశ్రూషేణ్యామ్=(వినుటకు)కోరఁబడునదియునగు, వాచమ్="ఉక్థశాః" ఇత్యాదిరూప వాక్కును, ఉద్యాసమ్=సవనత్రయమునందుఁ జెప్పుచున్నాను. తమ్=ఆ విధముగ వాక్కును పలుకుచున్నట్టి, మాఁ=నన్ను, శోభాయై=వాచికప్రమాదా భావ రూప శోభకొఱకు, దేవాః=పూర్వోక్తులైన దేవతలు, అవన్తు=రక్షింతురు గాక. పితరః (చ)=పితృదేవతలు కూడ, అనుమదన్తు=(ఈ వాక్కు సమీచీనమైనదని) వెంటనే సంతోషింతురు గాక (లాలింతురు గాక).

**తాత్పర్యము:** దేవ గో రూపమైన యిడ దేవతల నాహ్వానించునది. మనువు యజ్ఞప్రవర్తకుఁడు. బృహస్పతి మంత్రవాక్య విశేషములను ప్రశంసించువాఁడు. విశ్వేదేవతలు సూక్తవక్తలు. మాతృస్వరూపిణివైన ఓ పృథివీ! నన్ను హింసింపకుము. నీ యనుగ్రహమువలన మధువువలె ప్రియమైన కార్యమునే మనస్సుచే నాలోచింపఁ గలను. ఆ విధముగ మధువువలె ఇష్టమైన కర్మఫలము నుత్పాదనము చేయఁగలను. అట్లే మధువువలె ఇష్టమైన హవిస్సును దేవతలకొఱకు వహించఁగలను. మధువువలె ప్రియమైన ప్రతిగర రూప వాక్యము నుచ్చరింపఁ గలను. ఆ విధముగ దేవతలకు ప్రియమైనదియు, హోత్రాది మనుష్యులు వినఁగోరునదియు నగు "ఉక్థశాః" ఇత్యాది రూప వాక్కును శస్త్రాంతమందు సవనత్రయమునందును చెప్పుచున్నాను. అట్టి వాక్కును పలుకుచున్న నన్ను ఇడాదిదేవతలు ఉచ్చారణాదులందు దోషము లేకుండునట్టి శోభకొఱకు రక్షింతురు గాక. పితృదేవతలు కూడ ఈ వాక్కు సమీచీనమైనదే యని అనుమోదింతురు గాక. (ఉక్థామదాని–ఉక్థైః–శస్త్రైః, జాయమానః మదః–హర్షః యేషు మంత్రవాక్యేషు తాని మంత్ర వాక్యాని ఉక్థామదాని· శస్త్రములచేఁ గలుగు హర్షము కలిగిన మంత్రవాక్యములు ఉక్థామదములని సమాసార్థము. అధ్వర్యుఁడు పదోబిలమునందు ప్రాఙ్ముఖముగ కూర్చుండి "ఇడా దేవహూః" ఇత్యాది శస్త్రమును జపించవలెను.)

ద్వితీయానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే తృతీయోఽనువాకః।

మూలము: [1]వసవస్త్వా ప్రవృహన్తు గాయత్రేణ ఛన్దసాఽగ్నేః ప్రియం పాథ ఉపేహి రుద్రాస్త్వా ప్రవృహన్తు త్రైష్టుభేన ఛన్దసేన్ద్రస్య ప్రియం పాథ ఉపేహ్యాదిత్యాస్త్వా ప్రవృహన్తు జాగతేన ఛన్దసా విశ్వేషాం దేవానాం ప్రియం పాథ ఉపేహి [2]మాన్దాసు తే శుక్ర శుక్రమా ధూనోమి భన్దనాసు కోతనాసు నూతనాసు రేశీషు మేషీషు వాశీషు విశ్వభృత్సు మాధ్వీషు కకుహాసు శక్వరీషు (౧) శుక్రాసు తే శుక్ర శుక్రమా ధూనోమి [3]శుక్రం తే శుక్రేణ గృహ్ణామ్యహ్నో రూపేణ సూర్యస్య రశ్మిభిః। [4]ఆఽస్మిన్నుగ్రా అచుచ్యవుర్దివో ధారా అసశ్చత। [5]కకుహగ్ం రూపం వృషభస్య రోచతే బృహత్సోమః సోమస్య పురోగాః శుక్రః శుక్రస్య పురోగాః। [6]యత్తే సోమాదాభ్యం నామ జాగృవి తస్మై తే సోమ సోమాయ స్వాహా[7]శిత్ర్వం దేవ సోమ గాయత్రేణ ఛన్దసాఽగ్నేః (౨)ప్రియం పాథో అపీహి వశీ త్వం దేవ సోమ త్రైష్టుభేన ఛన్దసేన్ద్రస్య ప్రియం పాథో అపీహ్యస్మత్సఖా త్వం దేవ సోమ జాగతేన ఛన్దసా విశ్వేషాం దేవానాం ప్రియం పాథో అపీ[8]హ్యా నః ప్రాణ ఏతు పరావత ఆఽన్తరిక్షా ద్దివస్పరి। ఆయుః పృథివ్యా అధ్యమృతమసి ప్రాణాయ త్వా। [9]ఇన్ద్రాగ్నీ మే వర్చః కృణుతాం వర్చః సోమో బృహస్పతిః। వర్చో మే విశ్వే దేవా వర్చో మే ధత్తమశ్వినా। [10]దధన్వే వా యదీమను వోచ ద్బ్రహ్మాణి వేరు తత్। పరి విశ్వాని కావ్యా నేమి శ్చక్రమివాభవత్ ॥ ౩॥

(శక్వరీష్వగ్నే ర్బృహస్పతిః పఞ్చవిగ్ంశతిశ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయ ప్రపాఠకే తృతీయోఽనువాకః।

# వేదార్థ దీపిక

**అవతారిక:** ద్వితీయానువాకమునందు ఉపాకరణము, ప్రతిగరజపము చెప్పఁబడినవి. ఈ తృతీయానువాకమునందు రెండు అదాభ్యాంశు గ్రహములకు సంబంధించిన మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము:** (హే సోమాంశో!–ఓ సోమలతయొక్క అంశువా!), వసవః–వసునామక దేవతలు, త్వా–నిన్ను, గాయత్రేణ ఛన్దసా–గాయత్రీచ్ఛన్దస్సుచేత, ప్రవృహన్తు–(వస్త్రముచేఁ గట్టఁబడిన సోమలతా సమూహమునుండి) వేరుచేయుదురు గాక. (త్వమ్–అటువంటి నీవు), అగ్నేః–అగ్నికి, ప్రియమ్–ఇష్టమైన, పాథః–అన్నరూపమును, ఉపేహి–పొందుము. రుద్రాః–రుద్రనామక దేవతలు, త్వా–నిన్ను, త్రైష్టుభేన ఛన్దసా–త్రిష్టుప్ ఛన్దస్సుచేత, ప్రవృహన్తు–(సోమలతా సమూహమునుండి) వేరుచేయుదురు గాక. (త్వమ్–అటువంటి నీవు), ఇన్ద్రస్య–ఇంద్రునకు, ప్రియమ్–ఇష్టమైన, పాథః–అన్నరూపమును, ఉపేహి–పొందుము. ఆదిత్యాః–ఆదిత్యనామక దేవతలు, త్వా–నిన్ను, జాగతేన ఛన్దసా–జగతీ ఛ్ఛన్దస్సుచేత, ప్రవృహన్తు–(సోమలతా సమూహమునుండి) వేరుచేయుదురు గాక. (సః త్వమ్–అటువంటి నీవు), విశ్వేషాం దేవానామ్–విశ్వేనామక దేవతలకు, ప్రియమ్–ఇష్టమైన, పాథః–అన్నరూపమును, ఉపేహి–పొందుము.

**తాత్పర్యము:** ఓ సోమలతయొక్క అంశువా! వసు రుద్రాదిత్యనామక దేవతలు నిన్ను వరుసగ గాయత్ర్యాది ఛన్దస్సులచే (సాధనములచేత) వస్త్రముచేఁ గట్టఁబడిన సోమలతా సమూహమునుండి వేరుచేయుదురు గాక. అటువంటి నీవు అగ్నీంద్ర విశ్వేదేవతలకు ఇష్టమైన అన్నభావ (రూప) మును పొందుము. (వస్త్రముచేఁ గట్టఁబడిన సోమలతల సమూహమునుండి మూఁడు అంశువులను వరుసగా "వసవస్త్వా" ఇత్యాది మంత్రములను యథాక్రమముగ పఠించుచు విడఁదీయవలెను. ఇచట అంశువులు మూఁడింటిని విడఁదీయుటకు గాయత్ర్యాది ఛన్దస్సులు మూఁడు వేరు వేరు సాధనములుగాఁ జెప్పఁబడినవి. వసు రుద్రాదిత్య దేవతలు మూఁడు విధములుగ వేరు వేరుగఁ జెప్పఁబడిరి. ఈ సోమాంశురూపాన్నమును పొందు దేవతలు గూడ అగ్నీంద్ర విశ్వేదేవతలు ముగ్గురు చెప్పఁబడిరి.)

2. **అర్థము:** హే శుక్ర!–ప్రకాశించుచున్న ఓ సోమమా!, తే–నీకు సంబంధించిన, శుక్రమ్–ప్రకాశించుచున్న సారమును, మాన్దాసు–మంద్రగతి గల ఉదకములందు, ఆధూనోమి–అంతటను కంపింపఁజేయుచున్నాను. భన్దనాసు–మంగళకరములైన ఉదకములందు, ఆధూనోమి. కోతనాసు–జ్ఞానకారులగు నుదకములందు, ఆధూనోమి. నూతనాసు–అభినవములైన ఉదకములందు, ఆధూనోమి. రేశీషు–(శీఘ్రగమనముచే భూమికి) హింసకములయిన ఉదకములందు, ఆధూనోమి. మేషీషు–స్పర్ధ వహించుచున్న ఉదకములందు, ఆధూనోమి. వాశీషు–శబ్దవంతములైన ఉదకములందు, ఆధూనోమి. విశ్వభృత్సు–విశ్వమును ధరించునట్టి ఉదకములందు, ఆధూనోమి. మాధ్వీషు–మధుర రసము గల ఉదకములందు, ఆధూనోమి. కకుహాసు–దిక్కులవలె ప్రధానములైన ఉదకములందు, ఆధూనోమి. శుక్రాసు–దీప్యమానములైన ఉదకములందు, తే–త్వత్సంబంధియగు, శుక్రమ్–ప్రకాశించుచున్న సారమును, ఆధూనోమి–అంతటను కంపింపఁజేయుచున్నాను.

**తాత్పర్యము:** ఓ ప్రకాశించుచున్న సోమమా! ప్రకాశించుచున్న నీ సారమును మాందాదులైన ఉదకములందు అంతటను కంపింపఁజేయుచున్నాను. "మాన్దాసు" ఇత్యాది సప్తమ్యంతపదము లిచట పదునొకండు కలవు. ప్రతియొక సప్తమ్యంతముతోను హేశుక్ర! తే, శుక్రమ్, మాన్దాసు, ఆధూనోమి, అనువిధముగ, శుక్ర, తే, శుక్రమ్, ఆధూనోమి అనుపదములను అనుషంగము చేసి అర్థము చెప్పవలెను. 'మాన్దాది' సప్తమ్యంత పదములు ఉదకములకు గోప్యములైన వేరు వేరు నామధేయములు. వాని వ్యుత్పత్త్యర్థములు వివరింపఁబడినవి. హోతృ చమసమునందు వసతీవరీ సానుకము అయిన ఉదకములనుండి కొంత ఉదకమును ఉంచి పూర్వోక్తములైన సోమాంశుత్రయముచే ఆ యుదకమును ఈ మంత్రములు చెప్పుచు ఐదు పర్యాయములు గాని, ఏడు పర్యాయములు గాని కదలించవలెను.

3. అర్థము: హే దధిద్రవ్య!=ఓ దధిద్రవ్యమా!, తే=నీయొక్క, శుక్రమ్=సారమును, శుక్రేణ=సోమాదిరూప సారముతోఁ గూడ, సూర్యస్య=సూర్యునియొక్క, అహ్నః రూపేణ=పగటి రూపమైన, రశ్మిభిః=కిరణములచేత, గృహ్ణామి=గ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఓ దధిద్రవ్యమా! నీ సారమును సోమాదిరూప సారముతోఁ గూడ సూర్యుని పగటిరూపమైన కిరణములచే గ్రహించుచున్నాను. (అధ్వర్యుఁడు ఈ మంత్రమును జెప్పుచు మొదటి అంశుమదదాభ్యగ్రహమును గ్రహించవలెను. దధి=పెరుగు)

4. అర్థము: అస్మిన్=ఈ పాత్రమునందు, ఉగ్రాః=తీవ్రములైన, ధారాః=సోమరస ధారలు, దివః=స్వర్గమునుండి, అచుచ్యవుః=వచ్చి పడినవి. (చ=మఱియు, తాః=ఆ ధారలు), అసశ్చత=పాత్రమునందు సంగతములైనవి.

తాత్పర్యము: ఈ అంశుమదదాభ్య గ్రహమునందు తీవ్రములైన సోమరస ధారలు ద్యులోకమునుండి వచ్చి పడి సంగతములైనవి. (ఈ మంత్రము చెప్పుచు పాత్రమును తీసికొనవలెను.)

5. అర్థము: వృషభస్య=వర్షమును గురియించునట్టి యింద్రునియొక్క, బృహత్=ప్రౌఢమైన, కకుహం రూపమ్=కకుత్తువలె ప్రధానమైన వృష్టిలక్షణ స్వరూపము, రోచతే=ప్రకాశించుచున్నది. సోమః=(ఈ) వల్లీరూప సోమము, సోమస్య=దేవతాస్వరూపమైన సోమరాజునకు, పురోగాః=ప్రథమగామి. శుక్రః=ప్రకాశించుచున్న సోమరసము, శుక్రస్య=ప్రకాశించుచున్న యింద్రునకు, పురోగాః=ప్రథమగామి.

తాత్పర్యము: వర్షింపఁజేయు నింద్రునియొక్క గొప్పదియగు మూఁపువలె ప్రధానమైన వృష్టిలక్షణ స్వరూపము ప్రకాశించుచున్నది. ఈ లతారూపమైన సోమము దేవతా స్వరూప సోమరాజునకు ప్రథమగామి. ప్రకాశించుచున్న ఈ సోమరసము ప్రకాశించుచున్న యింద్రునకు ప్రథమగామి.

6. అర్థము: హే సోమ!=ఓ సోమమా!, తే=నీయొక్క, యత్ నామ=ఏ పేరు, అదాభ్యమ్=(ఎవరిచేతను) తిరస్కరింపఁదగనిదియై, జాగృవి=జాగృతమై యున్నదో, హే సోమ!=ఓ సోమమా!, తే=నీయొక్క, తస్మై సోమాయ=ఆ సోమనామముకొఱకు, స్వాహా=(ఇది) హుత మగుఁగాక.

తాత్పర్యము: ఓ సోమమా! ఎవరిచేతను తిరస్కరింపఁదగని నీ సోమనామముకొఱకు ఇది హుత మగుఁగాక. (ఈ మంత్రముచే హోమము చేయవలెను.)

7. అర్థము: హే సోమ దేవ!=దేవతాస్వరూపమైన ఓ సోమమా!, త్వమ్=నీవు, ఉశిక్=మనోహరమైనదానవు. (తథా విధః ప్రథమాంశురూపః త్వమ్=అటువంటి ప్రథమాంశు రూపమైన నీవు), అగ్నేః=అగ్నికి, ప్రియం పాథః=ప్రియమైన అన్నభావమును, (యథా ప్రతిపద్యసే=ఎట్లు పొందుచున్నావో, తథా=ఆ విధముగ), గాయత్రేణ ఛన్దసా=గాయత్రీచ్ఛందస్సుచే, (సోమ సమూహాత్ పృథక్కృతః త్వమ్=సోమ సమూహమునుండి వేరు చేయఁబడిన నీవు), అపి=మఱల కూడ, ఇహి=సోమసమూహము నొందుము. హే సోమదేవ!=దేవతాస్వరూపమైన ఓ సోమమా!, త్వమ్=నీవు, వశీ=సర్వప్రాణులకు స్వాధీనమైనదానవు. (తథావిధః ద్వితీయాంశురూపః త్వమ్=అటువంటి ద్వితీయాంశురూపమైన నీవు), ఇన్ద్రస్య=ఇంద్రునకు, ప్రియం పాథః=ఇష్టమైన అన్నరూపమును, (యథా ప్రతిపద్యసే=ఎట్లు పొందుచున్నావో, తథా=ఆ విధముగ) త్రైష్టుభేన ఛన్దసా=త్రిష్టుప్ ఛందస్సుచే, (సోమసమూహాత్=సోమసమూహమునుండి, పృథక్ కృతః=వేరుగాఁ జేయఁబడిన, త్వమ్=నీవు), అపి=మఱల కూడ, ఇహి=సోమసమూహము నొందుము. హే సోమదేవ!, త్వమ్, అస్మత్సఖా=మాకు స్నేహపాత్రమైనదానవు. (తథావిధః తృతీయాంశురూపః త్వమ్=అటువంటి తృతీయాంశురూపమైన నీవు), విశ్వేషాం దేవానామ్=విశ్వేదేవతలకు, ప్రియం పాథః=ఇష్టమైన అన్నరూపమును, (యథా ప్రతిపద్యసే=ఎట్లు పొందుచున్నావో, తథా=ఆ విధముగ), జాగతేన ఛన్దసా=జగతీ చ్ఛందస్సుచే, (సోమసమూహాత్ పృథక్కృతః త్వమ్=సోమసమూహమునుండి వేఱు చేయఁబడిన నీవు), అపి=మఱల కూడ, ఇహి=సోమసమూహము నొందుము.

తాత్పర్యము: ఈ యనువాకమునందలి ఒకటవ మంత్రమున సోమలతా సమూహమునుండి గాయత్ర్యాది ఛందస్త్రయముచే యథాక్రమముగ మూఁడు అంశువులు వేఱుచేయుట విధింపఁబడినది. ఆ వేఱుచేయఁబడిన అంశుత్రయము ఇచట కమనీయముగను, వశిగను, అస్మత్సఖిగను యథాక్రమముగ వర్ణింపఁబడి ఆ త్రయము మఱల సోమ లతా సమూహము నొందుట విధించబడినది. (ఈ మంత్రమునందలి మూఁడు భాగములలో నొక్కొక్క మంత్రము చెప్పుచు వరుసగాఁ ప్రథమ, ద్వితీయ తృతీయాంశువులను మహా సోమాభిషవమునందు విడువ వలెను).

8. అర్థము పరావతః=దూరదేశమునుండి, ప్రాణః=ప్రాణము, నః=మమ్ముఁగూర్చి, ఆ ఏతు=వచ్చుఁగాక. అంతరిక్షాత్ (అపి)=అంతరిక్షమునుండి కూడ, నః=మమ్ముఁగూర్చి, ఆ ఏతు=వచ్చుఁగాక. దివస్పరి=స్వర్గమునకు పై భాగమున, (స్థితోఽపి=ఉన్నదైనను), నః=మమ్ముఁగూర్చి, ఆ ఏతు=వచ్చుఁగాక. హే హిరణ్య!=ఓ హిరణ్యమా!, పృథివ్యాః అధి=భూమి పైని, (త్వమ్=నీవు), ఆయుః=ఆయుఃకారణము, అమృతమ్= అమృతత్వ (మరణరాహిత్య) హేతువు, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, ప్రాణాయ= ప్రాణముయొక్క స్థితికొఱకు, (ఏవం క్షిపామి=ఈ విధముగ నుంచుచున్నాను.)

తాత్పర్యము: ప్రాణము దూరదేశమునుండి, అంతరిక్షమునుండి కూడ మా యొద్దకు వచ్చుఁగాక. స్వర్గముపైని ఉన్నను మా యొద్దకు వచ్చుఁగాక. ఓ హిరణ్యమా! భూమిపైని నీవు ఆయుర్హేతువు అమృతత్వ హేతువు అగు చున్నావు. అటువంటి నిన్ను ప్రాణస్థితికై ఈ విధముగ ఉంచుచున్నాను. (సోమాంశువును మహాభిషవము నందుంచునపుడు అధ్వర్యుయజమానులు ఈ మంత్రము చదువుచు శతసంఖ్యా పరిమితి గల హిరణ్యమును గూడ నుంచవలెను.)

9. అర్థము: ఇన్ద్రాగ్నీ=ఇంద్రాగ్ని దేవతలు, మే=నాకు, వర్చః=బలమును, కృణుతామ్=చేయుదురు గాక. సోమః బృహస్పతిః (చ ఉభౌ)=సోమ బృహస్పతి దేవతలు ఉభయులును, వర్చః=బలమును, కృణుతామ్=చేయు దురు గాక. విశ్వే దేవాః (చ)=విశ్వేదేవతలు కూడ, మే=నాకు, వర్చః బలమును, (కుర్వన్తు=చేయుదురు గాక.) హే అశ్వినా!=ఓ అశ్వినీ దేవతలారా!, (ద్వివచన లోపము ఛాందసము.) వర్చః=బలమును, ధత్తమ్=సంపాదించుఁడు.

తాత్పర్యము: ఇంద్రాగ్ని సోమ బృహస్పతి దేవతలు, విశ్వేదేవ దేవతలును నాకు బలమును కలుగఁజేయుదురు గాక. ఓ అశ్వినీదేవతలారా! నాకు బలమును గలుగఁజేయుఁడు. (ఈ మంత్రము చదువుచు ఉదకమును స్పృశించ వలెను.)

10. అర్థము: వేః=వెళ్లఁదగిన యజ్ఞమునకు సంబంధించిన, బ్రహ్మాణి=పరిపృఢములైన (నియమబద్ధములైన) దీక్షాద్యం గములను, అనువోచత్=అనుక్రమముగ వేదము చెప్పుచున్నది. ఈమ్=ఇటువంటిది, యత్ (అస్తి)=ఏది కలదో, తత్ ఉ=దానిని గూడ, (అహమ్=నేను), దదన్వే=మనస్సునందు ధరించుచున్నాను. (వేదోక్త మును దేనిని గూడ విస్మరించుట లేదు.) (అయమ్=ఈ యజ్ఞము), కావ్యా=కావ్య సదృశములైన (స్పష్ట ముగఁ జెప్పఁబడని), విశ్వాని=సర్వాంగములను, నేమిః చక్ర మివ=బండికంటికమ్మి చక్రమునువలె, పర్య భవత్=అంతటను వ్యాపించియుండెను.

తాత్పర్యము: చేయవలసిన యజ్ఞమునకు సంబంధించిన దీక్షాద్యంగములను వేదము అనుక్రమముగఁ జెప్పినది. ఇటువంటి విషయమును నేను మనస్సునందు ధారణ చేయుచున్నాను. వేదోక్తమయిన దేనిని గూడ నేను విస్మరిం చుట లేదు. కావ్యములవలె వాచ్యముగఁ జెప్పనట్టి సర్వాంగముల నంతటను ఈ యజ్ఞము బండికంటికమ్మి చక్రమును వ్యాపించియుండు విధముగ వ్యాపించి యున్నది. (ఈ మంత్రము చెప్పుచు హోమము చేయవలెను.)

**తృతీయానువాకము సమాప్తము.**

## అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే చతుర్థోఽనువాకః ।

**మూలము:** [1]ఏతద్వా అపాం నామధేయం గుహ్యం యదాధావా మాన్దాసు తే శుక్ర శుక్రమా ధూనోమీత్యాహాపామేవ నామధేయేన గుహ్యేన దివో వృష్టిమవ రున్ద్దే [2]శుక్రం తే శుక్రేణ గృహ్ణామీత్యాహైతద్వా అహ్నో రూపం యద్రాత్రిః సూర్యస్య రశ్మయో వృష్ట్యా ఈశతేఽహ్న ఏవ రూపేణ సూర్యస్య రశ్మిభి ర్దివో వృష్టిం చ్యావయ[3]త్యాఽస్మిన్నుగ్రాః (౧)అచుచ్యవు రిత్యాహ యథా యజు రేవైత త్కకుహగ్ం రూపం వృషభస్య రోచతే బృహదిత్యాహైతద్వా అస్య కకుహగ్ం రూపం యద్వృష్టిరూపేణైవ వృష్టిమవ రున్ద్ధే [5]యత్తే సోమాదాభ్యం నామ జాగృవీత్యాహైష హ వై హవిషా హవిర్యజతి యోఽదాభ్యం గృహీత్వా సోమాయ జుహోతి [6]పరా వా ఏతస్యాఽఽయుః ప్రాణ ఏతి (౨)యోఽగ్ంశుం గృహ్ణాత్యా నః ప్రాణ ఏతు పరావత ఇత్యాహాఽఽయురేవ ప్రాణ మాత్మన్ధత్తే [7]ఽమృతమసి ప్రాణాయ త్వేతి హిరణ్యమభి వ్యనిత్యమృతం వై హిరణ్యమాయుః ప్రాణోఽమృతేనైవాఽఽయు రాత్మన్ధత్తే [8]శతమానం భవతి శతాయుః పురుషః శతేన్ద్రియ ఆయుష్యేవేన్ద్రియే ప్రతి తిష్ఠత్యప ఉప స్పృశతి భేషజం వా ఆపో భేషజమేవ కురుతే ॥౩॥ (ఉగ్రా ఏత్యాప స్త్రీణి చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయ ప్రపాఠకే చతుర్థోఽనువాకః॥

### వేదార్థదీపిక

**అవతారిక:** తృతీయానువాకమునందు అదాభ్యాంశుగ్రహ మంత్రములు చెప్పబడినవి. ఈ చతుర్థానువాకమునందు ఆ మంత్రములకు వ్యాఖ్యాన రూపమైన బ్రాహ్మణము చెప్పబడుచున్నది.

1. అర్థము: "మాన్థాసు తే శుక్ర శుక్రమా ధూనోమి" ఇతి ఆధావాః—"మాన్థాసు....అధూనోమి" అనెడి మంత్రములు యత్—'మాన్థా' ఇత్యాదికమైన ఏ పద జాతమును, ఆహ=చెప్పెనో, ఏతత్ వా=ఈ పదసమూహమే, అపామ్=ఉదకములకు, గుహ్యం నామధేయమ్=గోప్యమైన నామధేయము. (తత్—అందువలన, అపాం ప్రీత్యై=అభిమాన దేవతల ప్రీతికై, మాన్థాది మన్త్రాన్=మాందాది మంత్రములను, పఠేత్=పఠించవలెను. తతః=ఆ పాఠమువలన) అపామ్=ఉదకములయొక్క, గుహ్యేన=గోప్యమైన, నామధేయేనైవ=నామధేయము చేతనే, (యజమానః=యజమానుఁడు), దివః=ద్యులోకమునుండి, వృష్టిమ్=వర్షమును, అవరున్ద్ధే=పొందును.

తాత్పర్యము: 'మాన్థాసు' ఇత్యాది మంత్రములు చెప్పిన పదసమూహమే ఉదకములయొక్క గోప్యమైన నామధేయము. (ఉదకములకు "మాన్థ", "ఖన్థన" ఇత్యాది నామధేయములు కలవని తృతీయానువాకమునఁ జెప్పఁబడినది. ఈ నామధేయములు లోకమున ప్రసిద్ధముగ లేవు. వేదమునందు మాత్రము కలవు. అందువలన ఈ నామములు గోప్యము లనఁబడుచున్నవి.) ఉదకాభిమానదేవతల ప్రీతికై "మాన్థాసు తే శుక్రే"త్యాది మంత్రములను పఠించవలెను. అట్లు పఠించుటచే యజ్ఞకర్త గోప్యమైన ఆ యుదకముల నామధేయముచేతనే అభిమాన దేవతలను సంతోషపఱచి ద్యులోకమునుండి వర్షమును సంపాదించును.

2. అర్థము: (హే దధిద్రవ్య!=ఓ దధిద్రవ్యమా!), తే=నీయొక్క, శుక్రమ్=సారమును, శుక్రేణ=సోమాదిరూప సారముతోఁగూడ, సూర్యస్య=సూర్యునియొక్క, అహ్నః రూపేణ=పగటిరూపమైన, రశ్మిభిః=కిరణములచేత, గృహ్ణామి=గ్రహించుచున్నాను, ఇతి=అని, ఆహ="శుక్రం తే" ఇత్యాది మంత్రము చెప్పెను. యత్ రాత్రిః=రాత్రి యనునది ఏది కలదో, ఏతత్ వా=ఇదియే, అహ్నః=పగటియొక్క, రూపమ్=రూపమును, (నిరూపయతి=నిరూపించుచున్నది.) సూర్యస్య రశ్మయః=సూర్యునియొక్క కిరణములు, వృష్ట్యాః=వర్షమునకు, ఈశతే=ప్రభువు లగుచున్నవి. (తస్మాత్=అందువలన, ఏతం మంత్రభాగమ్=ఈ 'శుక్రం తే' ఇత్యాది మంత్రభాగమును, పఠన్=పఠించుచున్న, యజమానః=యజమానుఁడు), అహ్నః రూపేణ=అహో నిరూపక రాత్రిలక్షణ కాలముచేతను, సూర్యస్య రశ్మిభిః ఏవ=సూర్యునియొక్క కిరణములతోఁగూడిన కాలముచేతను, దివః=ద్యులోకమునుండి, వృష్టిమ్=వర్షమును, చ్యావయతి=(భూమియందు) పడఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ దధిద్రవ్యమా! ప్రకాశించుచున్న నీ సారమును సోమసారముతోఁ గూడ సూర్యునియొక్క పగటిరూపమైన కిరణములచే గ్రహించుచున్నాను" అని 'శుక్రం తే' ఇత్యాది మంత్రము చెప్పినది. రాత్రి యనునది సూర్యునియొక్క పగటిరూపమును నిరూపించునది. సూర్యుని కిరణములు వర్షమును కురియించుటకు సమర్థములైనవి. కావున యజమానుఁడు ఈ "శుక్రం తే" ఇత్యాది మంత్రమును పఠించుచు అహస్సు నిరూపించునట్టి రాత్రిలక్షణ కాలముచేతను సూర్యుని కిరణములచేతను ద్యులోకమునుండి వర్షమును భూమియందు పడవేయుచున్నాఁడు. రాత్రియు, సూర్యకిరణములును వృష్టికి స్వామిభూతములు. సూర్యరశ్మియుక్త కాలము, రాత్రికాలము గాక వృష్టికి మఱియొక కాలము లేదు.

౩. అర్థము: అస్మిన్=ఈ అంశుమదాభ్యగ్రహమునందు, ఉగ్రాః=తీవ్రములైన సోమరస ధారలు, (దివః=ద్యులోకమునుండి), ఆ అచుచ్యవుః=వచ్చి పడినవి, ఇతి=అని, ఆహ="అఽస్మిన్నుగ్రా" ఇత్యాది మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, యథా యజురేవ=మంత్రోక్త విధమే.

తాత్పర్యము: ఈ అంశుమదాభ్యపాత్రమునందు తీవ్రములయిన సోమరస ధారలు ద్యులోకమునుండి వచ్చిపడినవను అర్థము మంత్రము ననుసరించియే యున్నది. ఇంక అధికముగ వ్యాఖ్యానించఁ దగినది లేదు.

4. అర్థము: వృషభస్య=వర్షమును కురియించునట్టి యింద్రునియొక్క, బృహత్=ప్రౌఢమైన, కకుహం రూపమ్=కకుత్తువలె ప్రధానమైన వృష్టిలక్షణ స్వరూపము, రోచతే=ప్రకాశించుచున్నది, ఇతి=అని, ఆహ="కకుహగ్ం రూప"మిత్యాది మంత్రము చెప్పినది. వృష్టిరూపేణైవ=వృష్టిలక్షణమైన "కకుగ్ం రూప" మిత్యాది మంత్ర

పాఠముచేతనే, (యజమానః=యజమానుఁడు), వృష్టిమ్=వర్షమును, అవరున్ధే యత్=పొందుచున్నాఁడనుట ఏది కలదో, ఏతత్ వా=ఇదియే, అస్య=ఈ యింద్రునియొక్క, కకుహం రూపమ్=ముఖ్యమైన ప్రధానమైన వృష్టిలక్షణ రూపము.

**తాత్పర్యము:** "కకుహగ్ం రూపం వృషభస్య రోచతే" ఇత్యాది మంత్రమునందలి "కకుహమ్" "రూపమ్" అను పదములచే వృష్టివివక్ష చేయఁబడినదను నర్థమును ఈ బ్రాహ్మణము వివరించినది. యజమానుఁడు ఏతన్మంత్రపాఠముచే వర్షమును పొందును.

**5. అర్థము:** హే సోమ!=ఓ సోమమా!, తే=నీయొక్క, యత్ నామ=ఏ నామము, అదాభ్యమ్=తిరస్కరింపఁదగనిదియై, జాగృవి=ప్రకాశించుచున్నదో, ఇతి=అని, ఆహ="యత్తే సోమాదాభ్యం నామ" ఇత్యాది మంత్రము చెప్పినది. యః=ఏ యజమానుఁడు, అదాభ్యమ్=అదాభ్యనామక పాత్రమును, గృహీత్వా=గ్రహించి, సోమాయ=సోమనామముకొఱకు, జుహోతి=హోమము చేయుచున్నాఁడో, ఏషః వై=ఈ యజమానుఁడే, హవిషా=దధిరూప హవిస్సుచే, హవిః=హవి స్స్వరూపమైన దేవతాత్మక సోమము నుద్దేశించి, యజతి హ=యాగము చేయుచున్నాఁడు కదా!

**తాత్పర్యము:** అదాభ్యగ్రహమును తీసికొని సోమనామముకొఱకు హోమము చేయు యజమానుఁడే దధిరూప హవిస్సుచే దేవతాత్మక హవిస్స్వరూప సోమము నుద్దేశించి యాగము చేయుచున్నాఁడని "యత్తే సోమాదాభ్యమ్" ఇత్యాది మంత్ర తాత్పర్యము.

**6. అర్థము:** యః వా=ఏ యజమానుఁడు అయితే, అంశుమ్=అంశునామక సోమరసమును, (పాత్రే=పాత్రమునందు), గృహ్ణాతి=తీసికొనుచున్నాఁడో, అస్య=ఈ యజమానునియొక్క, ఆయుః=ఆయువు రూపమైన, ప్రాణః=ప్రాణము, పరైతి=పోవుచున్నది. (అతః=ఇందువలన), "ప్రాణః=ప్రాణము, పరావతః=దూరదేశమునుండి (పోయినదేశమునుండి), నః=మమ్ముఁగూర్చి, ఆ ఏతు=వచ్చుఁగాక, ఇతి=ఆహ=అను మంత్రముచే, (యజమానః=యజమానుఁడు), ఆయుః ప్రాణమ్=ఆయూరూపమైన ప్రాణమునే, ఆత్మన్=తనయందు, ధత్తే=స్థాపింపఁజేయుచున్నాఁడు.

**తాత్పర్యము:** అంశునామక సోమరసమును పాత్రములోనికి గ్రహించిన యజమానుని యొక్క ఆయూరూప ప్రాణము పోవును. కావున యజమానుఁడు "ఆ నః ప్రాణం" ఇత్యాది మంత్రపాఠముచే ఆయూరూప ప్రాణమును తనయందే స్థాపించుకొనుచున్నాఁడు.

**7. అర్థము:** హే హిరణ్య!=ఓ హిరణ్యమా!, త్వమ్=నీవు, అమృతమ్=అమృతత్వ (మరణరాహిత్య) కారణము, అసి=అగుచున్నావు. (త్వా=అటువంటి) నిన్ను, ప్రాణాయ=ప్రాణస్థితికొఱకు, క్షిపామి=(సోమాభిషవమునందు), ఉంచుచున్నాను, ఇతి=అని, ("ఆయుః పృథివ్యా అధ్యమృతమసి ప్రాణాయ త్వా" అను మంత్రమును జెప్పి) హిరణ్యమ్=బంగారమును, అభివ్యనితి=అంతటను శ్వాస నుంచవలెను. హిరణ్యమ్=బంగారము, అమృతం వై=అమృతత్వ హేతువు కదా! ఆయుః=ఆయువు, ప్రాణః=ప్రాణ స్వరూపము. (అతః=ఇందువలన, యజమానః=యజమానుఁడు), అమృతేనైవ=అమృతత్వ కారణమైన హిరణ్యముచేతనే, (హిరణ్యముపైని శ్వాస నుంచుటచేతనే), ఆయుః=ఆయూరూప ప్రాణమును, ఆత్మన్=తన యాత్మయందు, ధత్తే=ధరింపఁజేయుచున్నాఁడు.

**తాత్పర్యము:** "ఓ హిరణ్యమా! నీవు అమృతత్వ కారణ మగుచున్నావు. అటువంటి నిన్ను ప్రాణముయొక్క స్థితికొఱకు సోమాభిషవమునం దుంచుచున్నాను" అను ఈ మంత్రమును చెప్పి సోమాభిషవమునందు పడవేయు హిరణ్యముపైని శ్వాసను విడువవలెను. బంగారము అమృతత్వ హేతువు కదా! ఆయువు ప్రాణ స్వరూపము. కావున యజమానుఁడు అమృతత్వ హేతువైన హిరణ్యముపైని శ్వాస నుంచుటచేతనే ఆయూరూపమైన ప్రాణమును తన యాత్మయందు స్థాపింపఁజేసినవాఁ డగుచున్నాఁడు. (శ్వాసను వెలుపలకు విడుచుట ప్రాణనము.

శ్వాసను లోపలికిఁ బోనిచ్చుట అపానము. శ్వాసను మధ్యమున ధారణ చేయుట వ్యానము. ప్రాణాపానముల సంధి వ్యానమని వేదమునందుఁ గలదు. ఇచట హిరణ్యముపైని వ్యానము చేయవలెనని చెప్పఁబడినది.)

8. అర్థము: హిరణ్యమ్–(సోమాభిషవమునం దుంచవలసిన) హిరణ్యము శతసంఖ్యాక పరిమితి కలది, భవతి–అగుచున్నది. పురుషః–పురుషుఁడు, శతాయుః–నూఱు సంవత్సరముల ఆయువు కలవాఁడు, శతేన్ద్రియః–నూఱు ఇంద్రియములు కలవాఁడును, భవతి–అగుచున్నాఁడు. (అతః–ఇందువలన, యజమానః–యజమానుఁడు), ఆయుషి–(శతసంవత్సర పరిమితి గల) ఆయువునందు, ఇన్ద్రియే–శత సంఖ్యాకమైన ఇంద్రియ సముదాయమునందు, ప్రతితిష్ఠత్యేవ–నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగును.

తాత్పర్యము: సోమాభిషవమునం దుంచఁబడు హిరణ్యము శత సంఖ్యాక మైనది. పురుషుఁడు శతసంవత్సరముల ఆయువు కలవాఁడు. మఱియు పది యింద్రియములు శరీరమునందలి శతనాడులందు సంచరించుటచే శతేంద్రియుఁడు నగుచున్నాఁడు. ఇచ్చట హిరణ్యమునకు మానవుని ఆయురింద్రియములకు శతసంఖ్యా విషయమున సాదృశ్య ముండుటచే అట్టి హిరణ్యమును సోమాభిషవమునం దుంచిన యజమానుఁడు నూఱు సంవత్సరముల ఆయువునందును, నూఱు ఇంద్రియములందును ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. హిరణ్యమునకు ఆయుష్పరిమాణము విధింపఁబడినది.

9. అర్థము: ("ఇన్ద్రాగ్నీ" ఇతి మంత్రేణ–తృతీయానువాకమునందలి "ఇన్ద్రాగ్నీ" అను మంత్రముచేత, యజమానః–యజమానుఁడు), అపః–ఉదకములను, ఉపస్పృశతి–తాఁకవలెను. ఆపః–ఉదకములు, భేషజం వా–ఔషధము కదా! (అతః–ఇందువలన, యజమానః–ఉదకస్పర్శ చేసిన యజమానుఁడు.) భేషజమేవ–చికిత్సనే, కురుతే–చేయుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: తృతీయానువాక గతమైన "ఇన్ద్రాగ్నీ" ఇత్యాది మంత్రమును పఠించుచు యజమానుఁడు ఉదకములను స్పృశించవలెను. ఉదకములు ఔషధమువంటివి కావున, ఇట్లు చేసిన యజమానుఁడు చికిత్స చేసినవాఁడే యగుచున్నాఁడు. "భిషజ్–చికిత్సాయామ్" అను ధాతువునుండి 'భేషజ' శబ్దము ఉత్పన్న మైనది.

చతుర్థానువాకము సమాప్తము.

అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే పఞ్చమోఽనువాకః ।

మూలము : [1]వాయురసి ప్రాణో నామ సవితు రాధిపత్యే ఽపానం మే దాశ్చక్షురసి శ్రోత్రం నామ ధాతు రాధిపత్య ఆయుర్మే దా రూపమసి వర్ణో నామ బృహస్పతే రాధిపత్యే ప్రజాం మే దా ఋతమసి సత్యం నామేన్ద్రస్యాఽఽధిపత్యే క్షత్రం మే దా భూతమసి భవ్యం నామ పితృణా మాధిపత్యే ఽపామోషధీనాం గర్భం ధా ఋతస్య త్వా వ్యోమన ఋతస్య (౧)త్వా విభూమన ఋతస్య త్వా విధర్మణ ఋతస్య త్వా సత్యాయర్తస్య త్వా జ్యోతిషే [2]ప్రజాపతి ర్విరాజ మపశ్యత్తయా భూతం చ భవ్యం చాసృజత తామృషిభ్య స్తిరో ఽదధాత్తాం జమదగ్ని స్తపసా ఽపశ్యత్తయా వై స పృశ్నీ న్కామా నసృజత తత్పృశ్నీనాం పృశ్నిత్వం [3]యత్పృశ్నయో గృహ్యన్తే పృశ్నీనేవ తైః కామాన్యజమానోఽవ రున్ధే [4]వాయురసి ప్రాణః (౨)నామేత్యాహ ప్రాణాపా నావేవావ రున్ధే [5]చక్షురసి శ్రోత్రం నామేత్యాహ ఽఽయురేవావ రున్ధే [6]రూపమసి వర్ణో నామే త్యాహ ప్రజామేవావ రున్ధ [7]ఋతమసి సత్యం నామేత్యాహ క్షత్రమేవావ రున్ధే [8]భూతమసి భవ్యం నామేత్యాహ పశవో వా అపామోషధీనాం గర్భః పశూనేవ (౩)అవ రున్ధ [9]ఏతావద్వై పురుషం పరిత స్తదేవావ రున్ధ [10]ఋతస్య త్వా వ్యోమన ఇత్యాహేయం వా ఋతస్య వ్యోమే మామేవాభి జయత్యృతస్య త్వా విభూమన ఇత్యాహా న్తరిక్షం వా ఋతస్య విభూమా న్తరిక్షమేవాభి జయత్యృతస్య త్వా విధర్మణ ఇత్యాహ ద్యౌర్వా ఋతస్య విధర్మ దివమేవాభి జయత్యృతస్య (౪)త్వా సత్యాయేత్యాహ దిశో వా ఋతస్య సత్యం దిశ ఏవాభి జయత్యృతస్య త్వా

జ్యోతిష ఇత్యాహ సువర్గో వై లోక ఋతస్య జ్యోతిః సువర్గమేవ లోకమభి జయత్యేతావన్తో వై దేవలోకా స్తానేవాభి జయతి [11]దశ సం పద్యన్తే దశాక్షరా విరాడన్నం విరాడ్విరాజ్యే వాన్నాద్యే ప్రతి తిష్ఠతి ॥ ౫॥

(వ్యోమన ఋతస్య ప్రాణః పశూనేవ విధర్మ దివమేవాభి జయత్యృతస్య షట్చత్వారిగ్ంశచ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

## వేదార్థదీపిక

**అవతారిక:** చతుర్థానువాకమునందు అదాభ్యాంశుగ్రహ మంత్రములకు వ్యాఖ్యానరూపమైన బ్రాహ్మణము చెప్పఁబడినది. పంచమానువాకమునందు అగ్నిష్టోమమును విడిచి వికృతిరూప ద్వాదశాహ శేషములైన పృశ్నిగ్రహములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: హే సోమ!=ఓ సోమమా!, (త్వమ్=నీవు), వాయుః=(సామాన్యాకారమున) వాయుస్వరూపము, ప్రాణః నామ=(విశేషాకారమున) ప్రాణరూపమును, అసి=అగుచున్నావు. (బహిర్నిర్గమన శీలము గల ఉచ్ఛ్వాస రూపము అగుచున్నావు. తాదృశః త్వమ్=అటువంటి నీవు), సవితుః=ప్రేరకుఁడైన పరమేశ్వరునియొక్క, ఆధిపత్యే=ఆధిపత్యమునందు, (స్థిత్వా=ఉండి), మే=నాకొఱకు, అపానమ్=అంతఃప్రవేశము కలిగిన వాయు విశేషమును, దాః=ఇమ్ము, [2](త్వమ్=నీవు), చక్షుః=చక్షుస్స్వరూపము, శ్రోత్రం నామ=శ్రోత్ర స్వరూపమును, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన,) ధాతుః=దేహేంద్రియాది స్రష్టయగు ధాతయొక్క, ఆధిపత్యే=అధిపత్యమునందు, (స్థిత్వా=ఉండి,) మే=నాకొఱకు, ఆయుః=ఆయువును, దాః=ఒసఁగుము. [3]త్వమ్=నీవు, రూపమ్=శరీరావయవ సౌష్ఠవ లక్షణము గల రూపము, వర్ణః నామ=కాంతిలక్షణమైన వర్ణమును, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన), బృహస్పతేః=(తదుభయకారియగు) బృహస్పతియొక్క, ఆధిపత్యే=అధిపత్యమునందు, (స్థిత్వా=ఉండి), మే=నాకొఱకు, ప్రజామ్=పుత్ర పౌత్రాది రూప ప్రజను, దాః=ఇమ్ము. [4](త్వమ్=నీవు), ఋతమ్=మనస్సుచే ఆలోచింపఁబడుచున్న సత్యస్వరూపము, సత్యం నామ=వాక్కుచే ఉచ్చరింపఁబడుచున్న సత్యస్వరూపమును, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన), ఇన్ద్రస్య=(తదుభయము పాలకుఁడైన) ఇంద్రునియొక్క, ఆధిపత్యే=ఆధిపత్యమునందు, స్థిత్వా=ఉండి, మే=నాకొఱకు, క్షత్రమ్=బలమును, దాః=ఒసఁగుము. [5](త్వమ్=నీవు), భూతమ్=పూర్వము సిద్ధమైయున్న ధాతు వైషమ్య స్వరూపము, భవ్యం నామ=భావికాలమున రాఁబోవు ధాతువైషమ్య స్వరూపమును, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన), పితృణామ్=తదుభయ సమాధాతలైన పితృదేవతలయొక్క, ఆధిపత్యే=ఆధిపత్యమునందు, (స్థిత్వా=ఉండి), మే=నాకొఱకు, అపామ్=ఉదకములకు, ఓషధీనాం చ=ఓషధులకును సంబంధించిన, గర్భమ్=పశురూప గర్భమును, ధాః=సంపాదించుము. [6](హే సోమ!=ఓ సోమమా!), ఋతస్య=సత్యముయొక్క, వ్యోమనే=విశేష రక్షణముకొఱకు, త్వా=నిన్ను, (మిమే=కొలుచుచున్నాను.) [7]ఋతస్య=సత్యముయొక్క, విభూమనే=విశేష బాహుళ్యమునకై, త్వా=నిన్ను, (మిమే=కొలుచుచున్నాను.) [8]ఋతస్య=సత్యముయొక్క, విధర్మణే=విశేష ధారణమునకై, త్వా=నిన్ను, (మిమే=కొలుచుచున్నాను.) [9]ఋతస్య=సత్యము యొక్క, సత్యాయ=అనృతరాహిత్యమునకై, త్వా=నిన్ను, (మిమే=కొలుచుచున్నాను.) [10]ఋతస్య=సత్యముయొక్క, జ్యోతిషే=ప్రకాశముకొఱకు, త్వా=నిన్ను, మిమే=కొలుచుచున్నాను.

తాత్పర్యము: ఓ సోమమా! నీవు యజమానునిచే త్రాగఁబడినదాన వగుచు శరీరమునం దుండుటచే వాయువునకుఁ గూడ ఆప్యాయనకారి వగుటచే సామాన్యాకారమున వాయురూపమై విశేషాకారమున ప్రాణరూప మగుచున్నావు. అట్టివంటి నీవు ప్రేరకుఁడైన పరమేశ్వరునియొక్క ఆధిపత్యమునందుండి అంతఃప్రవేశము కల అపాన వాయువిశేషమును నా కొసఁగుము. (శేషము సులభ గ్రాహ్యము. "ఇన్ద్రాయ త్వా వృత్రఘ్న" ఇత్యాదు లయిన ప్రకృతియాగ మంత్రములు సోమోన్మాన కరణములు. ఆ మంత్రజాతము నుచ్చరించి "వాయురసీ" త్యాదులయిన పది మంత్రములచేతను-వృశ్ని గ్రహముల పదింటితో సోమమును కొలువవలెను. ఉన్మానము=కొలచుట).

2. అర్థము: ప్రజాపతిః=ప్రజాపతి, విరాజమ్=విరాట్ ఛన్దస్సును, అపశ్యత=(సృష్టిసాధనముగ) చూచెను(తెలిసికొనెను). తయా=ఆ విరాట్ ఛన్దస్సుచేత, భూతమ్=భూతకాలికము, చ=మఱియు, భవ్యమ్=భవిష్యత్కాలికమునగు జగత్తును, అసృజత=సృజించెను. తామ్=ఆ విరాట్ఛందస్సును, ఋషిభ్యః=ఋషులనుండి, తిరోఽదధాత్=తిరోధానము చేసెను (దాఁచెను). జమదగ్నిః=జమదగ్నిమహర్షి, తపసా=తపస్సుచేత, తామ్=ఆ విరాట్ఛందస్సును, అపశ్యత్=చూచెను. సః=ఆ జమదగ్ని, తయా వై=ఆ విరాట్ఛందస్సుచేతనే, వృశ్నీన్=ధేను స్వరూపములైన, కామాన్=భోగములను, అసృజత=సృజించెను. తత్=వాయురసీత్యాదికములైన పది మంత్రములచేత వృశ్నిశబ్దాభిధేయములైన ధేనురూప భోగములను సృజించుటవలన, వృశ్నీనామ్=వృశ్ని నామకములైన 'వాయురసీ'త్యాది మంత్రములకు, వృశ్నిత్వమ్='వృశ్ని' యను పేరు, (సిద్ధ్యతి=సిద్ధించుచున్నది. వృశ్నయః=కామధేనవః, సృష్టాః యైః మంత్రైః తే మంత్రాః వృశ్నయః అని చెప్పఁదగును.)

తాత్పర్యము: పూర్వము ప్రజాపతి ఆలోచించి సృష్టికి సాధనమైన విరాట్ఛందస్సును దెలిసికొనెను. (వాయురసీత్యాది మంత్రములు దశసంఖ్యాకములు. అనఁగా ఆ మంత్రములు మొత్తము దశసంఖ్యోపేతములు. విరాట్ఛందస్సు దశాక్షర యుక్తము. ఈ దశాక్షరయుక్త ఛన్దస్సామ్యముచే వాయురసీత్యాదికముల సమష్టి విరాట్టుగా నిచట వర్ణింపఁబడినది.) ప్రజాపతి ఈ విరాట్టుచే సమస్త జగత్తును సృష్టించి అందు కొంత భూతముగాను, కొంత భవిష్యత్తుగాను విభజించెను. కాని ప్రజాపతి ఆ విరాట్టును ఋషులకుఁ దెలియఁజేయలేదు. జమదగ్ని మహర్షి మాత్రము తపస్సు చేసి ప్రజాపతి యనుగ్రహమువలన ఆ విరాట్టును తెలిసికొని దానిచేత ధేనురూప భోగములను సృజించెను. వాయురసీత్యాది మంత్రములచేత వృశ్నిశబ్దాభిధేయములైన ధేనురూప భోగములు సృజింపఁబడినవి కావున ఆ మంత్రములకు 'వృశ్ని' అను పేరు ఏర్పడినది. వృశ్నులు (కామధేనువులు) వాయురసీత్యాది మంత్రములచే సృజింపఁబడినవి కనుక మంత్రములకుఁ గూడ 'వృశ్ని' యను పేరు కలుగుట సమంజసమే.

3. అర్థము: వృశ్నయః=వాయురసీత్యాది మంత్రములచే గ్రహింపఁదగిన సోమభాగములు, గృహ్యన్తే యత్=గ్రహింపఁబడుచున్నచో, (యజమానః=యజమానుఁడు), తైః=ఉన్మానలక్షణములు కల ఆ గ్రహములచేత, కామాన్=కామధేను సదృశములైన, వృశ్నీనేవ=భోగములనే, అవరున్ద్ధే=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడు వృశ్నిశబ్దాభిధేయములైన వాయురసీత్యాది మంత్రములచే గ్రహింపఁదగిన సోమభాగమును గ్రహములచేత కొలిచి గ్రహింపవలెను. అట్లుచేసిన యజమానుఁడు కామధేను సదృశములైన భోగములను ఆ గ్రహములచేత పొందుచున్నాఁడు. (ఇచట గ్రహణ మనఁగా సోమరసమును పాత్రములలోనికిఁ దీసికొనుట కాదు. కట్టగా కట్టఁబడియున్న సోమలతా సముదాయమును పాత్రములచే గ్రహించుట యని యర్థము.)

4. అర్థము: వాయురసి ప్రాణో నామేతి ఆహ='వాయురసి ప్రాణో నామ' అను మంత్రముచే, (యజమానః=యజమానుఁడు), ప్రాణాపానావేవ=ప్రాణాపానములనే, అవరున్ద్ధే=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ యనువాకమునందలి ప్రథమ మంత్రసముదాయమునందలి వాయురసీత్యాది ప్రథమ మంత్రముచేత యజమానుని ప్రాణాపాన పోషణ లక్షణమైన కామము వివరింపఁబడినది. ప్రాణాపానములను పొందుచున్నాఁడనఁగా-ప్రాణాపానములను పోషించుచున్నాఁడని భావము.

5. అర్థము: "చక్షురసి శ్రోత్రం నామేతి" ఆహ–'చక్షురసీ'త్యాది ద్వితీయ మంత్రముచే, (యజమానః) ఆయురేవ–యజమానుఁడు చక్షు శ్శ్రోత్ర స్థైర్య హేతువైన ఆయువునే, అవరున్ధే–పొందుచున్నాఁడు.

తాత్పర్యము: తాత్పర్యము సుగమము.

6. అర్థము: "రూపమసి వర్ణో నామేతి" ఆహ–రూపమసీత్యాది తృతీయ మంత్రముచేత, (యజమానః–యజమానుఁడు), ప్రజామేవ–అవయవ సౌష్ఠవ కాంతులతోఁ గూడిన ప్రజను, అవరున్ధే–పొందుచున్నాఁడు. (తాత్పర్యము సులభము).

7. అర్థము: "ఋతమసి సత్యం నామేతి" ఆహ–'ఋతమసీ'త్యాది చతుర్థ మంత్రముచేత, (యజమానః–యజమానుఁడు), క్షత్త్రమేవ–మానస వాచిక సత్యసాధనముయొక్క సంపత్తినే, అవరున్ధే–పొందుచున్నాఁడు. తాత్పర్యము సులభము.

8. అర్థము: "భూతమసి భవ్యం నామేతి" ఆహ–భూతమసీత్యాది పంచమ మంత్రముచేత, (యజమానుఁడు), పశూనేవ–పశువులనే, అవరున్ధే–పొందుచున్నాఁడు. పశవః–పశువులు, అపామ్–ఉదకములకు, ఓషధీనామ్–ఓషధులకు, గర్భః వా–గర్భము కదా!

తాత్పర్యము: పశువులు తృణోదక పరిణామ రూపము లగుటచే తాదృశ పశురూప గర్భమే "అపా మోషధీనాం గర్భః" అను మంత్రమునందు వివక్ష చేయఁబడినది. శేషము సుగమము.

9. అర్థము: ఏతావత్ వై–ప్రాణాపానస్వాస్థ్యము మొదలు పశుప్రాప్తి పర్యంతము కల యీ చెప్పఁబడిన ఫలమే, పురుషం పరితః (వర్తతే)–పురుషున కంతటను అపేక్షితమైన ఫలము (ఉంటున్నది). తదేవ–దానినే, అవరున్ధే–పొందుచున్నాఁడు.

తాత్పర్యము: ప్రాణాపాన స్వాస్థ్యము ప్రభృతి పశుప్రాప్తి పర్యంతము కల ఫలము వాయుర్సీత్యాది పంచ మంత్రముల చేతఁజెప్పఁబడినది. యజమానుఁడు ఆ ఫలమునే పొందుచున్నాఁడు.

10. అర్థము: "ఋతస్య త్వా వ్యోమనే" ఇతి ఆహ–ఓ సోమమా! నిన్ను సత్యముయొక్క రక్షణముకొఱకు (కొలుచుచున్నాను) అని 'ఋతస్యే'త్యాది షష్ఠమంత్రము (ఉత్తర మంత్రపంచకమునందలి ప్రథమ మంత్రము)చెప్పినది. ఇయం వా–ఈ భూమియే, ఋతస్య–సత్యమునకు, వ్యోమ–రక్షకము. (యజమానః) ఇమామేవ–ఈ భూమినే, అభిజయతి–అంతటను జయించుచున్నాఁడు. "ఋతస్య త్వా విభూమనే" ఇతి ఆహ–ఓ సోమమా! నిన్ను సత్యముయొక్క బాహుళ్యముకొఱకు (కొలుచుచున్నాను) అని ఉత్తర మంత్రపంచకమునందలి ద్వితీయ మంత్రము చెప్పినది. అంతరిక్షం వా–ఆకాశమే, ఋతస్య–సత్యముయొక్క, విభూమ–బాహుళ్యము. (యజమానః) అంతరిక్షమేవ–ఆకాశమునే, అభిజయతి–అంతటను జయించుచున్నాఁడు. "ఋతస్య త్వా విధర్మణే" ఇతి ఆహ–ఓ సోమమా! నిన్ను సత్యముయొక్క విశేష ధారణముకొఱకు (కొలుచుచున్నాను,) అని ఉత్తర మంత్రపంచకమునందలి తృతీయ మంత్రము చెప్పినది. ద్యౌః వా–ద్యులోకమే, ఋతస్య–సత్యముయొక్క, విధర్మ–విశేషధారకము. (యజమానః) దివమేవ–ద్యులోకమునే, (అభిజయతి). "ఋతస్య త్వా సత్యాయ" ఇతి ఆహ–(ఓ సోమమా!) నిన్ను సత్యముయొక్క అనృతరాహిత్యమునకై (కొలుచుచున్నాను) అని చతుర్థ మంత్రము చెప్పినది. దిశః ఏవ–దిక్కులే, ఋతస్య–సత్యమునకు, సత్యమ్–అనృతరాహిత్య రూపములు. (యజమానః), దిశః ఏవ–దిక్కులనే, అభిజయతి–అంతటను జయించుచున్నాఁడు. "ఋతస్య త్వా జ్యోతిషే" ఇతి ఆహ–ఓ సోమమా! నిన్ను సత్యముయొక్క ప్రకాశము కొఱకు (కొలుచుచున్నాను) అని పంచమ మంత్రము చెప్పినది. సువర్గః లోకః వై–స్వర్గలోకమే, ఋతస్య–సత్యమునకు, జ్యోతిః–ప్రకాశము. (యజమానః), సువర్గం లోకమేవ–స్వర్గలోకమునే, అభిజయతి. ఏతావన్తః వై–ఈ మాత్రము పరిమితి కలవియే, దేవలోకాః–దేవలోకములు. (యజమానః) తానేవ–ఆ దేవలోకములనే, అభిజయతి–అంతటను జయించుచున్నాఁడు. అనఁగా వశపఱచుకొనుచున్నాఁడు.

**తాత్పర్యము:** వాయురసీత్యాది మంత్ర దశకమునందలి ఉత్తర మంత్రపంచకమునకు లోకత్రయము. దిక్కులు స్వర్గముల జయము ఫలముగా నిచటఁ జెప్పఁబడినది. పూర్వ మంత్ర పంచకము కామ ప్రాపకము. ఉత్తర మంత్ర పంచకము లోకజయ హేతువు.

10. **అర్థము:** దశ సంపద్యన్తే=వాయురసీత్యాది మంత్రములు దశ సంఖ్యాకము లగుచున్నవి. విరాట్=విరాట్ ఛన్దస్సు, దశాక్షరా=పది అక్షరములు కలది. విరాట్=విరాట్ ఛందస్సు, అన్నమ్=అన్నస్వరూపము, (అతః=ఇందువలన, యజమానః=యజమానుఁడు), అన్నాద్యే=అన్నస్వరూపమైన, విరాజ్యేవ=విరాట్ ఛందస్సునందే, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు.

**తాత్పర్యము:** వాయురసీత్యాది మంత్రములు దశ సంఖ్యాకములు. విరాట్ ఛన్దస్సు దశాక్షరములు కలది. విరాట్ ఛందస్సు అన్నస్వరూపము కావున యజమానుఁడు అన్నస్వరూపమైన (అన్నదాయకమైన) విరాట్ ఛందస్సునందే ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు.

పంచమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే షష్ఠోఽనువాకః ।

మూలము: [1]దేవా వై యద్యజ్ఞేన నావరున్ధత తత్పరై రవారున్ధత తత్పరాణాం పరత్వం [2]యత్పరే గృహ్యన్తే యదేవ యజ్ఞేన నావరున్ధే తస్యావరుద్ధ్యై [3]యం ప్రథమం గృహ్ణాతీమమేవ, తేన లోకమభి జయతి యం ద్వితీయ మన్తరిక్షం తేన యం తృతీయ మముమేవ తేన లోకమభి జయతి యదేతే గృహ్యన్త ఏషాం లోకానా మభిజిత్యై (౧)[4]ఉత్తరేష్వహః స్వముతోఽర్వాఞ్చో గృహ్యన్తే ఽభిజిత్యైవేమాల్లోఁకా న్పునరిమం లోకం ప్రత్యవ రోహన్తి [5]యత్పూర్వేష్వహః స్వితః పరాఞ్చో గృహ్యన్తే తస్మాదితః పరాఞ్చ ఇమే లోకా యదుత్తరేష్వహః స్వముతో ఽర్వాఞ్చో గృహ్యన్తే తస్మాదముతో ఽర్వాఞ్చ ఇమే లోకా స్తస్మాదయాతయామ్నో లోకా న్మనుష్యా ఉప జీవన్తి [6]బ్రహ్మవాదినో వదన్తి కస్మాత్సత్యాదద్భ్య ఓషధయః సంభవన్త్యోషధయః (౨)మనుష్యాణామన్నం ప్రజాపతిం ప్రజా అను ప్ర జాయన్త ఇతి పరానన్వితి బ్రూయా [7]ద్యద్గృహ్ణాత్యద్భ్య స్త్వౌషధీభ్యో గృహ్ణామీతి తస్మాదద్భ్య ఓషధయః సం భవన్తి [8]యద్గృహ్ణాత్యోషధీభ్యస్త్వా ప్రజాభ్యో గృహ్ణామీతి తస్మాదోషధయో మనుష్యాణామన్నం [9]యద్గృహ్ణాతి ప్రజాభ్యస్త్వా ప్రజాపతయే గృహ్ణామీతి తస్మాత్ప్రజాపతిం ప్రజా అను ప్ర జాయన్తే ॥ ౩ ॥

(అభిజిత్యా ఓషధయో ఽష్టాచత్వారిగ్ంశచ్చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయ ప్రపాఠకే షష్ఠోఽనువాకః ।

## వేదార్థ దీపిక

అవతారిక: ఉన్మాన విశేషములైన పృశ్నిగ్రహములు పంచమానువాకమునఁ జెప్పఁబడినవి. ఈ షష్ఠానువాకమున 'పర' సంజ్ఞకములైన అతిగ్రాహ్యవిశేషములు చెప్పఁబడుచున్నవి. అతిగ్రాహ్యములు–(సోమరసముతో నిండిన) పాత్రవిశేషములు.

**విశేషములు:** 'గవామయన' మను పేరు గల సంవత్సరయాగ మొకటి కలదు. పూర్వమాస షట్కమనియు, ఉత్తర మాస షట్కమనియు ఆ యాగమునకు రెండు భాగములు కలవు. ఆ రెండు షట్కముల మధ్యమున "విషువత్" అను పేరు గల ఒక ప్రధానమైన అహస్సు కలదు. ఆ అహస్సునకు పూర్వము 'పర' స్సామము లనెడి మూఁడు అహస్సులు కలవు. ఈ మూఁడు అహస్సులు పూర్వమాస షట్కమున కంతమున నుండును. ఈ విధముగనే 'విషువత్త'నెడి అహస్సునకు పరమున అర్వాక్సామ నామకములైన మూఁడు అహస్సులు కలవు. అవి ఉత్తరమాస షట్కమున కాదియం దుండును. వానిలో పరస్సామ నామకములైన మూఁడు అహస్సులందు వరుసగఁ జెప్పఁబడిన [1]"అద్భ్యస్త్వౌషధీభ్యః" [2]"ఓషధీభ్యస్త్వా ప్రజాభ్యః" [3]"ప్రజాభ్యస్త్వా ప్రజాపతయే" ఇత్యాదులైన మూఁడు మంత్రములచేత మూఁడు అతిగ్రాహ్య నామక సోమరసము లను గ్రహించవలెను. ఇట్లే అర్వాక్సామ నామకము అయిన మూఁడు అహస్సులందు విపరీత క్రమమున ఆ మంత్రములచేతనే మూఁడు అతిగ్రాహ్యనామక సోమరసములను గ్రహించవలెను. ముఖ్యమైన విషువన్నామక దినమునందు యథోక్త క్రమమునను, విపరీతక్రమమునను అతిగ్రాహ్య సోమరసములను గ్రహించ వలెను.

**1. అర్థము:** దేవాః=దేవతలు, యజ్ఞేన=(అతిగ్రాహ్య రహిత కేవల) యజ్ఞముచేత, యత్=ఏ ఫలమును, నావరున్ధత=పొందలేకపోయిరో, తత్=ఆ ఫలమును, పరైః=పరనామక గ్రహములచే, అవరున్ధత వై=పొందిరఁట. తత్=ఆ కారణముచే, పరాణామ్=పరనామకములైన అతిగ్రాహ్య గ్రహములకు, పరత్వమ్=పరనామసిద్ధి. (పారయన్తి=అభీష్ట సమాప్తిం గమయన్తీతి పరాః=అభీష్ట సమాప్తిని పొందించునవి అని వ్యుత్పత్త్యర్థము).

**తాత్పర్యము:** పూర్వము యజ్ఞము ననుష్ఠించుచున్న దేవతలు ఈ యనువాకమునందు విధింపఁబడఁబోవు అతిగ్రాహ్యములు లేని కేవలయజ్ఞముచేత పొందలేని ఫలమును పరసంజ్ఞకములైన అతిగ్రాహ్యగ్రహములచే పొందిరి. కావున ఆ గ్రహములకు పూర్వోక్త వ్యుత్పత్తిచే పరసంజ్ఞ సార్థక మైనది. (ఈ మంత్రమున అతిగ్రాహ్య గ్రహ ప్రశంస చేయఁబడినది.)

**2. అర్థము:** యజ్ఞేన=అతిగ్రాహ్యగ్రహ రహిత కేవల యజ్ఞముచే, యత్=ఏ ఫలమును. నావరున్ధే ఏవ=పొందుటయే లేదో, తస్య=ఆ ఫలముయొక్క, అవరుద్ధ్యై=పొందుటకొఱకు, పరే=పర సంజ్ఞకము లయిన అతిగ్రాహ్య గ్రహములు, గృహ్యన్తే యత్=(యజ్ఞమునందు) గ్రహింపఁబడవలెను.

**తాత్పర్యము:** కేవల యజ్ఞముచే పొందఁబడని ఫలము నొందుటకై పర సంజ్ఞకములైన అతిగ్రాహ్యములను గ్రహింపవలెను. ఇది అతిగ్రాహ్య గ్రహణ విధి మంత్రము (ఇచట 'యత్' అనునది విధ్యర్థ సూచకము).

**3. అర్థము:** యజమానః=యజమానుఁడు. యం ప్రథమమ్=ఏ ప్రథమ గ్రహమును, గృహ్ణాతి=గ్రహించుచున్నాఁడో, తేన=ఆ ప్రథమ గ్రహముచేత, ఇమం లోకమేవ=ఈ భూలోకమునే, అభిజయతి=అంతటను జయించుచున్నాఁడు. యం ద్వితీయమ్=ఏ ద్వితీయ గ్రహమును, గృహ్ణాతి=గ్రహించుచున్నాఁడో, తేన=ఆ ద్వితీయ గ్రహముచేత, అన్తరిక్షమ్=అంతరిక్ష లోకమును, అభిజయతి=అంతటను జయించుచున్నాఁడు. యం తృతీయమ్=ఏ మూఁడవ గ్రహమును, గృహ్ణాతి=గ్రహించుచున్నాఁడో, తేన=ఆ మూఁడవ గ్రహముచేత, అముం లోకమేవ=ఆముష్మికమైన స్వర్గలోకమునే, అభిజయతి=అంతటను జయించుచున్నాఁడు. ఏషాం లోకానామ్=ఈ ముల్లోకములయొక్క, అభిజిత్యై=అభిజయముకొఱకు, ఏతే=ఈ అతిగ్రాహ్య గ్రహములు, గృహ్యన్తే యత్=(యజ్ఞమునందు) గ్రహించవలెను.

**తాత్పర్యము:** యజ్ఞకర్త తన యజ్ఞమునందు ప్రథమమైన అతిగ్రాహ్య గ్రహమును గ్రహించినచో ఆగ్రహముచేత లోకములలో మొదటిదైన భూలోకమును జయించును. రెండవ అతిగ్రాహ్య గ్రహమును గ్రహించినచో దానిచేత అంతరిక్ష లోకమును జయించును. మూఁడవ అతిగ్రాహ్య గ్రహమును గ్రహించినచో దానిచే స్వర్గలోకమును జయించును. కావున ఈ ముల్లోకములను జయించుటకై ఈ మూఁడు అతిగ్రాహ్య గ్రహములను యజ్ఞమునందు గ్రహించవలెను. (ప్రథమ మంత్రమున సముదాయాకారమున ప్రశంసింపఁబడిన అతిగ్రాహ్య గ్రహములు ఇచట విశేషాకారమున ప్రశంసింపఁబడినవి.)

4. అర్థము: ఉత్తరేషు అహస్సు=విషువద్దినమునకు ఉత్తరములైన మూఁడు అహస్సులందు, అముతః=చివరి (మూఁడవ) అహస్సునుండి, అర్వాఞ్చః=వ్యుత్క్రమముగనున్న గ్రహములను, గృహ్యన్తే=గ్రహించవలెను. (తథా సతి=అట్లుకాఁగా, యజమానాః=యజమానులు), ఇమాన్ లోకాన్=ఈ లోకములను, అభిజిత్యైన=అంతటను జయించియే, పునః=మఱల, ఇమం లోకం ప్రతి=ద్యులోకమునుండి భూలోకమును గూర్చి, అవరోహన్తి= ఆరూఢవన్తు లగుచున్నారు (వచ్చుచున్నారు).

తాత్పర్యము: విషువదహస్సునకు ఉత్తరములైన మూఁడు అహస్సులలో మూఁడవ అహస్సునుండి వ్యుత్క్రమముగనున్న గ్రహములను గ్రహించవలెను. అట్లు చేసిన యజమానులు పూర్వానుష్ఠితములైన అనులోమ గత గ్రహముల చేత పృథివ్యంతరిక్ష ద్యులోకములను జయించియే మఱల ద్యులోకమునుండి భూలోకమును గూర్చి వచ్చుచున్నారు. (ఇచట ఉత్తరాహస్సులందు విపరీతక్రమము విధింపఁబడినది. అనఁగా ద్యులోకము నుండి భూలోకమువఱకు విజయమును సంపాదించుచున్నారని భావము).

5. అర్థము: పూర్వేషు అహస్సు=విషువదహస్సునకు పూర్వాహస్సులందు, ఇతః=ప్రథమ గ్రహమునుండి, పరాఞ్చః= వరుసగ రెండు మూఁడు గ్రహములు, గృహ్యన్తే యత్=గ్రహింపఁబడినచో, తస్మాత్=దానివలన, ఇతః=ఈ భూలోకమునుండి, ఇమే లోకాః=ఈ పృథివ్యంతరిక్ష ద్యులోకములు, పరాఞ్చః=ఉత్తరోత్తరము పొందఁ దగిన వగుచున్నవి. ఉత్తరేషు అహస్సు=విషువదహస్సునకు ఉత్తరములైన మూఁడు అహస్సులందు, అముతః=తృతీయ గ్రహమునుండి, అర్వాఞ్చః=అధస్తనములు, గృహ్యన్తే యత్=గ్రహింపఁబడినచో, తస్మాత్=దానివలన, అముతః=ద్యులోకమునుండి, ఇమే లోకాః=ఈ లోకములు, అర్వాఞ్చః=అర్వాఞ్చములు, (భవన్తి=అగుచున్నవి). తస్మాత్=అందువలన, మనుష్యాః=మనుష్యులు, అయాతయామ్నః=అగత సారములైన, లోకాన్=లోకములను, ఉపజీవన్తి=ఆశ్రయించి జీవించుచున్నారు.

తాత్పర్యము: ఇచట ఆమ్నాత క్రమము విపరీత క్రమము ప్రశంసింపఁబడినవి. విషువదహస్సునకు పూర్వాహస్సులలో ప్రథమాహస్సునందు ప్రథమ గ్రహమును, ద్వితీయాహస్సునందు ద్వితీయ గ్రహమును, తృతీయాహస్సు నందు తృతీయ గ్రహమును గ్రహించవలెను. ఇది ఆమ్నాత క్రమము. ఇట్లు గ్రహింపఁబడిన గ్రహములు పరాఞ్చము లనఁబడును. పరం=ఉత్తమం, అఞ్చన్తీతి=పరాఞ్చః. ఈ విధముగ అతిగ్రాహ్య గ్రహము లను గ్రహించిన యజమానుఁడు ఈ వరుసలోనే పృథివ్యంతరిక్ష ద్యులోకములను జయించును కావున ఈ లోకములు కూడ పరాఞ్చము లనఁబడును. విషువదహస్సునకు ఉత్తరాహస్సులలో ప్రథమాహస్సునందు తృతీయ గ్రహమును, ద్వితీయాహస్సునందు ద్వితీయ గ్రహమును, తృతీయాహస్సునందు ప్రథమ గ్రహమును గ్రహింపవలెను. ఇది విపరీతక్రమము. ఇట్లు గ్రహింపఁబడిన అతిగ్రాహ్య గ్రహములు అర్వాఞ్చము లనఁబడును. ద్యులోకమునుండి, అంతరిక్షలోకము, అధస్తన మగును. అంతరిక్షము నుండి పృథివీలోకము అధస్తనము. ఈ వరుసలో ఈ లోకములు అర్వాఞ్చము లగును. పరాఞ్చము అర్వాఞ్చము పరస్పర విలక్షణము లైనవి. కనుకనే పునరావృత్తి రహితము లగుటచే నివి అగతసారములు. అందువలన మనుష్యులు అగతసారములైన లోకముల నాశ్రయించియే జీవించుచున్నారు. (అగతసారములు= సారము నశించనివి).

6. అర్థము: కస్మాత్ సత్యాత్=ఏ కారణమువలన, అద్భ్యః=ఉదకములనుండి, ఓషధయః=ఓషధులు, సంభవన్తి=పుట్టు చున్నవి. కస్మాత్ సత్యాత్=ఏ కారణమువలన? ఓషధయః=ఓషధులు, మనుష్యాణామ్=మనుష్యులకు, అన్నమ్=అన్నము, భవన్తి=అగుచున్నవి. కస్మాత్ సత్యాత్=ఏ కారణమువలన?, ప్రజాః=ప్రజలు, ప్రజా పతిమ్ అను=ప్రజాపతి ననుసరించి, ప్రజాయన్తే=ప్రకర్షగ పుట్టుచున్నారు, ఇతి=అని, బ్రహ్మవాదినః= మంత్రజ్ఞులు, వదన్తి=చెప్పుచున్నారు. (అడుగుచున్నారు. బుద్ధిమాన్=బుద్ధిమంతుఁడు), పరాన్ అను ఇతి=అతిగ్రాహ్య గ్రహణ మంత్రముల ననుసరించి అని, (ఉత్తరమ్=సమాధానమును), బ్రూయాత్=పలుక (చెప్ప) వలెను.

**తాత్పర్యము:** లోకమునందు ఉదకములనుండి ఓషధులు పుట్టుచుండుట, మనుష్యులకు ఓషధులు అన్నముగా ఏర్పడుట, ప్రజలు ప్రజాపతి ననుసరించి ఉద్భవించుచుండుట ఏ కారణమువలన? అని మంత్రజ్ఞులు కొందఱు ప్రశ్నించుచుండఁగా ఒక బుద్ధిమంతుఁడు అతిగ్రాహ్య గ్రహణ మంత్రముల ననుసరించి ఈ త్రయము జరుగుచున్నదని సమాధానము చెప్పవలెను. (అతిగ్రాహ్య గ్రహణ మంత్రములు వరశబ్దాభిధేయములు. ఆ అతిగ్రాహ్య గ్రహణ మంత్రానుపారముగ ఈ పూర్వోక్తత్రయము సంభవించుచున్నదని భావము. అతిగ్రాహ్య గ్రహణ మంత్ర త్రయమును విధించుటకు ముందు ఇచట తన్మంత్రత్రయస్తుతి చేయఁబడినది).

7\. **అర్థము:** (హే ప్రథమాతిగ్రాహ్య!=ఓ ప్రథమాతిగ్రాహ్య గ్రహమా!), త్వా=నిన్ను, ఓషధీభ్యః=ఓషధుల (ఉత్పత్తి) కొఱకు, అద్భ్యః=ఉదకముల సకాశమునుండి, గృహ్ణామి=గ్రహించుచున్నాను. ఇతి=అని, ప్రథమమ్=ప్రథమాతిగ్రాహ్య గ్రహమును, గృహ్ణాతి=గ్రహించవలెను. యత్=ఏ కారణమువలన, (ఏవం గృహ్ణాతి=ఈ విధముగ గ్రహించుచున్నాఁడో), తస్మాత్=అందువలన, అద్భ్యః=ఉదకములనుండి, ఓషధయః=ఓషధులు, సంభవన్తి=కలుగుచున్నవి.

**తాత్పర్యము:** ఓ ప్రథమాతిగ్రాహ్య గ్రహమా! ఓషధుల ఉత్పత్తికొఱకు నిన్ను ఉదకముల సమీపమునుండి గ్రహించుచున్నానని ప్రథమాతిగ్రాహ్య గ్రహమును గ్రహించవలెను. ఈ ప్రథమాతిగ్రాహ్య గ్రహమును గ్రహించుట వలన ఉదకములనుండి ఓషధులు సంభవించుచున్నవి. (ఇది మొదటి ప్రథమాతిగ్రాహ్య గ్రహణ విధి మంత్రము).

8\. **అర్థము:** "(హే ద్వితీయాతిగ్రాహ్య!=ఓ ద్వితీయాతిగ్రాహ్య గ్రహమా!,) త్వా=నిన్ను, ప్రజాభ్యః=ప్రజల (జీవనము) కొఱకు, ఓషధీభ్యః=ఓషధుల సమీపమునుండి, గృహ్ణామి=గ్రహించుచున్నాను" ఇతి=అని, గృహ్ణాతి=(ద్వితీయాతిగ్రాహ్య గ్రహమును) గ్రహించవలెను. యత్ ఏ కారణమువలన, (ఏవం గృహ్ణాతి=ఈ విధముగ గ్రహించుచున్నాఁడో.) తస్మాత్=ఆ కారణమువలన, ఓషధయః=ఓషధులు, మనుష్యాణామ్=మనుష్యులకు, అన్నమ్=అన్నము, (భవన్తి=అగుచున్నవి).

**తాత్పర్యము:** "ఓ ద్వితీయాతిగ్రాహ్యమా! ప్రజల జీవనమునకై ఓషధుల సమీపమునుండి నిన్ను గ్రహించుచున్నాను." అని యీ మంత్రముచే ద్వితీయాతిగ్రాహ్యమును గ్రహించవలెను. యజ్వ ఈ మంత్రము చెప్పుచు ద్వితీయాతిగ్రాహ్య గ్రహమును గ్రహించుటవలన ఓషధులు మనుష్యులకు అన్నము అయినవి. (ఇది రెండవ ద్వితీయాతిగ్రాహ్యగ్రహ గ్రహణ విధిమంత్రము.)

9\. **అర్థము:** "(హే తృతీయాతిగ్రాహ్య!=ఓ తృతీయాతిగ్రాహ్య గ్రహమా!), త్వా=నిన్ను, ప్రజాభ్యః=ప్రజలకొఱకు, ప్రజాపతయే (చ)=ప్రజాపతికొఱకును, గృహ్ణామి=గ్రహించుచున్నాను, ఇతి=అని, (యజమానః=యజమానుఁడు, తృతీయాతిగ్రాహ్యమ్=తృతీయాతిగ్రాహ్య గ్రహమును), గృహ్ణాతి=గ్రహించవలెను. (యత్ ఏవం గృహ్ణాతి=ఎందువలన ఈ విధముగ గ్రహించుచున్నాఁడో), తస్మాత్=ఆ కారణమువలన, ప్రజాః=ప్రజలు, ప్రజాపతి మను=ప్రజాపతి ననుసరించి, ప్రజాయన్తే=ప్రకర్షగ పుట్టుచున్నారు.

**తాత్పర్యము:** ఓ తృతీయాతిగ్రాహ్య గ్రహమా! నిన్ను ప్రజలకొఱకు, ప్రజాపతికొఱకును ప్రజలందఱు కూడ ప్రజాపతి నాశ్రయించి జనియింపవలెననెడి ఆశయముతో గ్రహించుచున్నాను అని ఈ మంత్రముచే యజ్వ తృతీయాతిగ్రాహ్య గ్రహమును గ్రహించపలెను. ప్రజలు ప్రజాపతి నాశ్రయించి జనియింపవలె ననెడి ఆశయముతో యజ్వ తృతీయాతిగ్రాహ్య గ్రహమును గ్రహించుటవలన ప్రజలు ప్రజాపతి నాశ్రయించి పుట్టుచున్నారు. (ఇది తృతీయాతిగ్రాహ్యగ్రహ గ్రహణ విధిమంత్రము.)

షష్ఠానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే సప్తమోఽనువాకః।

మూలము: [1]ప్రజాపతి ర్దేవాసురా నసృజత తదను యజ్ఞోఽసృజ్యత యజ్ఞం ఛన్దాగ్ంసి తే విష్వఞ్చో వ్యక్రామ న్త్సోఽసురానను యజ్ఞోఽపాక్రామద్యజ్ఞం ఛన్దాగ్ంసి తే దేవా అమన్యన్తామీ వా ఇదమభూవ న్యద్వయగ్ం స్మ ఇతి తే ప్రజాపతి ముపాధావ న్త్సోఽబ్రవీ త్ప్రజాపతి శ్ఛన్దసాం వీర్యమాదాయ తద్వః ప్ర దాస్యామీతి స ఛన్దసాం వీర్యమ్ (౧)ఆదాయ తదేభ్యః ప్రాయచ్ఛ త్తదను ఛన్దాగ్ంస్యపాక్రామ న్ఛన్దాగ్ంసి యజ్ఞ స్తతో దేవా అభవ న్పరాఽసురా [2]య ఏవం ఛన్దసాం వీర్యం వేదాఽఽశ్రావయాస్తు శ్రౌషడ్యజ యే యజామహే వషట్కారో భవత్యాత్మనా పరాఽస్య భ్రాతృవ్యో భవతి [3]బ్రహ్మవాదినో వదన్తి కస్మై కమధ్వర్యు రాశ్రావయతీతి ఛన్దసాం వీర్యాయేతి బ్రూయాదేతద్వై (౨)ఛన్దసాం వీర్యమా శ్రావయాస్తు శ్రౌషడ్యజ యే యజామహే వషట్కారో [4]య ఏవం వేద స వీర్యైరేవ ఛన్దోభి రర్చతి యత్కించార్చతి [5]యదిన్ద్రో వృత్రమహన్నమేధ్యం తద్యద్యతీ నపావప దమేధ్యం తదథ కస్మాదైన్ద్రో యజ్ఞ ఆ సగ్ం స్థాతోరిత్యాహు రిన్ద్రస్య వా ఏషా యజ్ఞియా తనూ ర్యజ్ఞ స్తామేవ తద్యజన్తి [6]య ఏవం వేదోపైనం యజ్ఞో నమతి ॥3॥ (ఛన్దసాం వీర్యం వా ఏవ తదష్టౌ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయప్రపాఠకే సప్తమోఽనువాకః

## వేదార్థదీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు 'గవామయన' మను క్రతువునకు సంబంధించిన మూఁడు అతి గాహ్య గ్రహములు చెప్పఁబడినవి ఈ సప్తమానువాకమునందు సోమాంగముగా "అశ్రావయే"త్యాది మంత్రములు విధింపఁబడుచున్నవి.

1. అర్థము: (పురా–పూర్వము), ప్రజాపతిః–ప్రజాపతి, దేవాసురాన్–దేవతలను, అసురులను, అసృజత–సృజించెను. తదను–ఆ దేవాసురుల సృష్టి ననుసరించి, యజ్ఞః–యజ్ఞము, (ప్రజాపతినా–ప్రజాపతిచేత), అసృజ్యత–సృజింపఁబడెను. యజ్ఞమను–యజ్ఞము ననుసరించి, (సః=ఆ ప్రజాపతి), ఛన్దాంసి–ఛందస్సులను, అసృజత–సృజించెను. తే=ఆ దేవతలు, విష్వఞ్చః–వివిధగతులు కలవారై, (పరస్పరము ఐకమత్యము లేక పోవుటచేత), వ్యక్రామన్–వివిధ దేశములకు పోయిరి. (అథ–పిమ్మట), సః–ఆ యజ్ఞము, (అసురాన్ అను–అసురుల ననుసరించి, దేవేభ్యః–దేవతలనుండి), అపాక్రామత్–తొలఁగిపోయెను. యజ్ఞమను–యజ్ఞము ననుసరించి, ఛన్దాంసి–ఛందస్సులు, అపాక్రామన్–తొలఁగిపోయినవి. (తదా–అప్పుడు), తే దేవాః–ఆ దేవతలు, (ఏవమ్) అమన్యన్త–(పరస్పరైకమత్యమును పొంది) ఈ విధముగ నాలోచించిరి. "వయమ్–మనము (యత్=ఏ ఐశ్వర్యమును, ప్రాప్య=పొంది, స్థితాః స్మ–ఉంటిమో), అమీ–ఈ యసురులు, ఇదమ్–ఈ మన ఐశ్వర్యమును, (ప్రాప్య–పొంది,) అభూవన్ వా–ఉండిరి కదా!", ఇతి–అని, తే–ఆ దేవతలు, ప్రజాపతిమ్ ఉపధావన్వా=ప్రజాపతి సమీపమునకు పోయిరి. సః ప్రజాపతిః–ఆ ప్రజాపతి, ఛన్దసామ్–ఛందస్సులయొక్క, వీర్యమ్–సారమును, ఆదాయ–తీసికొని, తత్–దానిని, వః–మీకొఱకు, ప్రదాస్యామి–ఈయఁగలను, ఇతి–అని, అబ్రవీత్–(దేవతలకు) చెప్పెను. (ఉక్త్వా–చెప్పి), సః–ఆ ప్రజాపతి, ఛన్దసామ్–వైదికమంత్రములయొక్క, వీర్యమ్–సారమును, ఆదాయ=తీసికొని, తత్–ఆ సారమును, ఏభ్యః–ఈ దేవతలకొఱకు, ప్రాయచ్ఛత్–ఇచ్చెను. తదను–ఆ సారముననుసరించి, ఛన్దాంసి–ఛందస్సులు, (అసురేభ్యః–అసురులనుండి), అపాక్రామన్–తొలఁగినవి. ఛన్దాంసి అను–ఛందస్సుల ననుసరించి, యజ్ఞః–యజ్ఞము, అపాక్రామత్–(అసురులనుండి) తొలఁగిపోయెను. తతః–పిమ్మట, దేవాః–దేవతలు, (విజయినః–విజయము కలవారు), అభవన్–అయిరి. అసురాః–రాక్షసులు, పరాభవన్=తిరస్కృతులైరి.

తాత్పర్యము: పూర్వము ప్రజాపతి దేవతలను అసురులను సృష్టించెను. వారిసృష్టి ననుసరించి యజ్ఞమును, ఛన్దస్సులను సృష్టించెను. పిమ్మట దేవతలు పరస్పరము ఐకమత్యము లేనివా రగుటచేత నానాగతులై వివిధ ప్రాంతములకు పోయిరి. వారి ననుసరించి యజ్ఞము ఛందస్సులు దేవతలనుండి తొలఁగిపోయినవి. అప్పుడు దేవతలు పరస్పరము ఐకమత్యము కలవారై ఇదివరలో తాము అనుభవించిన ఐశ్వర్యమును ఇప్పుడు అసురులు అనుభవించుచున్నారని తలంచి ప్రజాపతియొద్దకు పోయి విన్నవించుకొనిరి. అప్పుడు ప్రజాపతి వైదిక మంత్రముల సారమును తీసి వారి కిచ్చెదనని చెప్పి ఆ వైదిక మంత్రముల సారమును దేవతల కొసఁగెను. పిమ్మట ఆ వైదిక మంత్రముల సారము ననుసరించి ఛందస్సులు అసురులనుండి తొలఁగి దేవతలను పొందినవి. ఆ ఛందస్సుల ననుసరించి యజ్ఞము కూడ అసురులనుండి తొలఁగి దేవతలను పొందెను. అప్పుడు దేవతలు విజయులు, అసురులు పరాభూతులు నైరి.

2. అర్థము: "[1]ఆ శ్రావయ, [2]అస్తు శ్రౌషట్, [3]యజ, [4]యే యజామహే, [5]వషట్కారః (వౌషట్)" ఏతత్–ఈ (మంత్రపంచక రూపమైన), ఛన్దసాం వీర్యమ్–వైదిక మంత్రములయొక్క సారమును, యః=ఏ యజమానుఁడు, ఏవమ్–ఈ పూర్వోక్తవిధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, (విదిత్వా ప్రయుఙ్క్తే–తెలిసికొని ప్రయోగించుచున్నాఁడో, సః–ఆ యజమానుఁడు), ఆత్మనా=స్వయముగ, (విజయీ) భవతి=విజయము కలవాఁ డగుచున్నాఁడు. అస్య=ఈ యజ్వయొక్క, భ్రాతృవ్యః=శత్రువు, పరాభవతి=పరాభూతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వోక్తమయిన ఆ శ్రావయేత్యాది మంత్రపంచకమే వైదిక మంత్రముల సారము. ఈ వైదికమంత్రముల సారమును పూర్వోక్త విధముగ తెలిసికొని ప్రయోగించిన యజ్ఞకర్త స్వయముగనే విజయవంతుఁ డగును. ఇతని శత్రువు పరాభూతుఁ డగును. (ఆ శ్రావయేత్యాది మంత్రముల యర్థ తాత్పర్యములు "యో వై సప్తదశమ్" అను అనువాక వ్యాఖ్యానమున (సం. 1 కాం. 6 ప్ర. 11 అ.) వివరింపఁబడినవి. అచట ఆ శ్రావయేత్యాది మంత్రములు ఇష్ట్యంగములుగా విధింపఁబడినవి. ఇచట సోమాంగముగ విధింపఁబడినవి.

3. అర్థము: కస్మై కమ్=ఏ ప్రయోజనముకొఱకు, అధ్వర్యుః=అధ్వర్యుఁడు, ఆ శ్రావయతి=ఆశ్రావణము చేయుచున్నాఁడు, ఇతి=అని, బ్రహ్మవాదినః=మంత్రజ్ఞులు, వదన్తి=చెప్పుచున్నారు. (ప్రశ్నించుచున్నారు). ఛన్దసామ్=(ప్రజాపతిచే సారము తీసివేయఁబడిన) వైదిక మంత్రములయొక్క, వీర్యాయ=సారముకొఱకు, ఇతి=అని, బ్రూయాత్=సమాధానము చెప్పవలెను. ఆ శ్రావయ, అస్తు శ్రౌషట్, యజ, యే యజామహే, వషట్కారః (వౌషట్) ఏతద్వై=ఈ ఆశ్రావయేత్యాది మంత్రపంచకమే, ఛన్దసామ్=వైదికమంత్రములయొక్క, వీర్యమ్=సారము.

తాత్పర్యము: ఏ ప్రయోజనమునకై అధ్వర్యుఁడు ఆశ్రావణము చేయుచున్నాఁడని బ్రహ్మవాదులచే ప్రశ్నించఁబడిన బుద్ధిమంతుఁడు ప్రజాపతిచే సారము తీసివేయఁబడిన వైదిక మంత్రములకు మఱల సారము లభించుటకై అధ్వర్యుఁడు ఆశ్రావణము చేయుచున్నాఁడని సమాధానము చెప్పవలెను. "ఆ శ్రావయ, అస్తు శ్రౌషట్, యజ, యే యజామహే, వౌషట్" అను ఈ మంత్ర పంచకమే వైదిక మంత్రముల సారము.

4. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ పూర్వోక్తవిధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, (విదిత్వా=తెలిసికొని) యత్కించిత్ అర్చతి=ఏ కొంచెమైనను దేవతాదికమును పూజించుచున్నాఁడో, (సః=అతఁడు), సవీర్యైః ఛన్దోభిరేవ=సార సహితములయిన వైదిక మంత్రములచేతనే, అర్చతి=పూజించుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ పూర్వోక్తవిధముగ వైదిక మంత్రముల సారమును తెలిసికొని ఈ యజ్ఞమునందుఁగాని లోకవ్యవహారమునందుఁగాని ఏ కొంచెము దేవతాపూజ చేసినవాఁడైనను అతఁడు వీర్యవంతములయిన వైదికమంత్రములచే పూజించినవాఁ డగును.

5. అర్థము: ఇన్ద్రః=ఇంద్రుఁడు, వృత్రమ్=వృత్రాసురుని, అహనత్ యత్=సంహరించె ననుట యేది కలదో, తత్=ఆ వధరూపము, అమేధ్యమ్=(పాపము సంక్రమించుటవలన) యజ్ఞార్హము కానిది. యతీన్=యతులను, అపావపత్ యత్=సాలావృకముల కప్పగించె ననుట యేది కలదో, తత్=ఆ యప్పగించుట, (పాపరూపమగుటచే), అమేధ్యమ్=యజ్ఞార్హము కానిది. అథ=అట్టిస్థితిలో, కస్మాత్=ఏ కారణము వలన, యజ్ఞః=యజ్ఞము, ఆ సంస్థాతోః=సమాప్తిపర్యన్తము, ఐన్ద్రః=ఇంద్రసంబంధి, ఇతి=అని, ఆహుః=బ్రహ్మవాదులు పలికిరి. (ప్రశ్నించిరి). యజ్ఞః యత్=యజ్ఞమనునది యేది కలదో, ఏషా=ఇది, ఇన్ద్రస్య వా=ఇంద్రుని యొక్కయే, యజ్ఞియా తనూః=యజ్ఞార్హమైన శరీరము. తత్=ఆ కారణమువలన, తామేవ=ఆ తనువును గూర్చియే, యజన్తి=యాగము చేయుచున్నారు.

తాత్పర్యము: ఇంద్రుఁడు వృత్రుని సంహరించెను. యతులను సాలావృకములకు అప్పగించెను. ఇది యంతయు పాపరూపము. ఇంద్రుఁడు అట్టి పాపకారి యగుటచే సంపూర్ణ మగునంతవఱకు యజ్ఞము ఐన్ద్రి మెట్లగుచున్నది? అని వేదార్థవిదులు ప్రశ్నించుచున్నారు. ఇంద్రునకు రాజసి, సాత్త్వికి యని రెండు తనువులు కలవు. రాజ్యమును పాలించుచు శత్రాదులను హింసించునట్టి తనువు రాజసి. అది యజ్ఞార్హము కానిది. యజ్ఞమునందు హవిస్సుచే పూజింపఁదగినదియు, యజ్ఞాంగ దేవతారూపమునైన శరీరము సాత్త్వికము. యజ్వలు ఆ సాత్త్విక శరీరము నుద్దేశించియే యజ్ఞము చేయుచున్నారని పూర్వోక్త ప్రశ్నకు సమాధానము.

6. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనెనో, ఏనమ్=వీనిని, యజ్ఞః=యజ్ఞము, ఉపనమతి=అనుసరించుచున్నది.

తాత్పర్యము: పూర్వోక్తవిధముగ తెలిసికొనిన యజమానునకు యజ్ఞము స్వాధీన మగును. యజ్ఞఫలము లభించునని భావము.

సప్తమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే ఽష్టమోఽనువాకః ।

మూలము: [1]ఆయుర్దా అగ్నే హవిషో జుషాణో ఘృతప్రతీకో ఘృతయోని రేధి। ఘృతం పీత్వా మధు చారు గవ్యం పితేవ పుత్రమభి రక్షతా దిమమ్। [2]ఆ వృశ్చ్యతే వా ఏతద్యజమానో ఽగ్నిభ్యాం యదేనయోః శృతంకృత్యాథాన్యత్రావభృథ మవైత్యాయుర్దా అగ్నే హవిషో జుషాణ ఇత్యవ భృథ మవైష్య న్జుహుయా దాహుత్యైవైనౌ శమయతి నాఽఽర్తి మార్ఛతి యజమానో [3]యత్కుసీదమ్ (౧)అప్రతీత్తం మయి యేన యమస్య బలినా చరామి। ఇహైవ సన్నిరవదయే తదేత త్తదగ్నే అనృణో భవామి। [4]విశ్వలోప విశ్వదావస్య త్వా ఽఽస న్జుహోమ్యగ్ధాదేకో ఽహుతాదేకః సమసనాదేకః। తే నః కృణ్వన్తు భేషజగ్ం సదః సహో వరేణ్యమ్। [5]అయం నో నభసా పురః సగ్ంస్ఫానో అభి రక్షతు। గృహాణా మసమర్త్యై బహవో నో గృహా అసన్। [6]స త్వం నః (౨)నభసస్పత ఊర్జం నో ధేహి భద్రయా। పునర్నో నష్టమా కృధి పునర్నో రయి మా కృధి। [7]దేవ సగ్ంస్ఫాన సహస్రపోషస్యేశిషే స నో రాస్వాజ్యానిగ్ం రాయస్పోషగ్ం సువీర్యగ్ం సంవత్సరీణాగ్ం స్వస్తిమ్। [8]అగ్నిర్వావ యమ ఇయం యమీ కుసీదం వా ఏత ద్యమస్య యజమాన ఆ ధత్తే యదోషధీభి ర్వేదిగ్ం స్తృణాతి యదనుపోష్య ప్రయాయా ద్గ్రీవబద్ధ మేనమ్ (౩)అముష్మిన్లోకే నేనీయేర [9]న్యత్కుసీద మప్రతీత్తం మయీత్యుపోషతీ హైవ సన్యమం కుసీదం నిరవదాయానృణః సువర్గం లోకమేతి [10]యది మిశ్రమివ చరేదఞ్జలినా సక్తూన్ప్రదావ్యే జుహుయా దేష వా అగ్ని ర్వైశ్వానరో యత్ప్రదావ్యః స ఏవైనగ్ం స్వదయ

11 త్ర్యహ్ణం విధాన్యా మేకాష్టకాయా మపూపం చతుఃశరావం పక్త్వా ప్రాత రేతేన కక్షముపోషే ద్యది (४)దహతి పుణ్యసమం భవతి యది న దహతి పాపసమ 12 మేతేన హ స్మ వా ఋషయః పురా విజ్ఞానేన దీర్ఘసత్రముప యన్తి 13 యో వా ఉపద్రష్టార ముపశ్రోతార మను ఖ్యాతారం విద్వాన్యజతే సమముష్మిల్లోక ఇష్టాపూర్తేన గచ్ఛతే ఽగ్నిర్వా ఉపద్రష్టా వాయు రుపశ్రోతా ఽఽదిత్యోఽనుఖ్యాతా తాన్య ఏవం విద్వాన్యజతే సమముష్మిల్లోక ఇష్టాపూర్తేన గచ్ఛతే 14 ఽయం నో నభసా పురః (౫)ఇత్యాహాగ్నిర్వై నభసా పురో ఽగ్నిమేవ తదాహై తస్మై గోపాయేతి స త్వం నో నభసస్పత ఇత్యాహ వాయుర్వై నభసస్పతి ర్వాయుమేవ తదాహైతస్మై గోపాయేతి దేవసగ్ంస్ఫానేత్యాహాసౌ వా ఆదిత్యో దేవః సగ్ంస్ఫాన ఆదిత్యమేవ తదాహైతస్మై గోపాయేతి ॥౬॥

[కుసీదం త్వం న ఏనమోషేద్యది పుర ఆదిత్యమేవ తదాహైతస్మై గోపాయేతి।]

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయప్రపాఠకే ఽష్టమోఽనువాకః॥

## వేదార్థదీపిక

**అవతారిక:** సప్తమానువాకమునందు సోమాంగములైన అశ్రావణాది మంత్రములు చెప్పఁబడినవి. ఈ యష్టమానువాకమునందు అవభృథాంగ హోమాదులు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము:** హే అగ్నే!–ఓ యగ్నీ!, హవిషః–హవిస్సును, జుషాణః–సేవించుచున్నవాఁడవును, ఘృతప్రతీకః–ఘృతోపక్రమము కలవాఁడవును, ఘృతయోనిః–ఘృతమే జ్వాలోత్పత్తి కారణముగాఁ గలవాఁడవునగు, (త్వమ్–నీవు) ఆయుర్దాః ఏధి–యజమానునకు ఆయుష్ప్రదుఁడవు కమ్ము. (సః–అటువంటి నీవు), మధు–మధురమైనదియు, చారు–నిర్మల మైనదియునగు, గవ్యమ్–ఘృతమును, పీత్వా–త్రాగి, పితా పుత్రమివ–తండ్రి కుమారునివలె, ఇమమ్–ఈ యజమానుని, అభిరక్షతాత్–అంతటను రక్షించుము.

**తాత్పర్యము:** ఓ యగ్నీ! ఆఘార ప్రయాజాదులు ఘృతముచే హూయమానము అగుటచే నీవు ఉపక్రమమునందే ఘృతము కలవాఁడవు. అవసానమునందుఁగూడ అనూయాజాదులందు ఘృతమే జ్వాలోత్పత్తికి కారణముగాఁ గలవాఁడవు. అట్టి నీవు యజమానున కాయువు నొసఁగుము. మఱియు స్వాదుతమమును శోధిత మగుటచే నిర్మలమునగు ఘృతమును త్రాగి తండ్రి కుమారుని రక్షించు విధమున నీ వీ యజమానుని అన్ని సమయములందు రక్షించుము.

2. **అర్థము:** యజమానః=యజమానుఁడు, ఏనయోః=ఈ ఆహవనీయ గార్హపత్యాగ్నులయందు, శృతంకృత్య=హవిస్సును పక్వము చేసి, (వారుణ పురోడాశ రూపమైన అవభృథ హవిస్సును హోమము చేయక), అన్యత్ర=జలసమీపమునందు, అవభృథమ్=అవభృథకర్మను గూర్చి, అపైతీతి యత్=వెళ్లుచున్నాఁ డనుట యేది కలదో, ఏతత్=ఈ అపరాధముచేత, అగ్నిభ్యామ్=ఆహవనీయ గార్హపత్యాగ్నులచేత, ఆవృశ్చ్యతే వా=విచ్ఛిన్నుఁ డగుచున్నాఁడు కదా!. (అతః=ఇందువలన), అవభృథమ్ అపైష్యన్=అవభృథకర్మను గూర్చి పోఁబోవుచు, "ఆయుర్దా అగ్నే హవిషో జుషాణః" ఇతి="ఆయుర్దా అగ్నే" ఇత్యాది మంత్రముచేత, జుహుయాత్=(ఆహవనీయాగ్నియందు ఆజ్యమును) హోమము చేయవలెను. (తదా=అప్పుడు), యజమానః=యజమానుఁడు, ఆహుత్యైవ=ఈ ఆహుతిచేతనే, ఏనౌ=ఈ ఆహవనీయ గార్హపత్యాగ్నులను, శమయతి=శమింపఁజేయుచున్నాఁడు. ఆర్తిమ్=దుఃఖమును, నార్ఛతి=పొందుట లేదు.

**తాత్పర్యము:** యజమానుఁడు ఆహవనీయ గార్హపత్యాగ్నులయందు హవిస్సును పక్వము చేసి వరుణదేవతాక పురోడాశ రూపమైన అవభృథహవిస్సును హోమము చేయకయే జలసమీపమున అవభృథకర్మకొఱకు పోవుట అపరాధమగును. ఆ యపరాధముచే యజమానుఁడు ఆహవనీయ గార్హపత్యాగ్నులచే విచ్ఛిన్నుఁ డగును. ఆ దోషము రాకుండుటకై యజమానుఁడు అవభృథకర్మకై పోఁబోవుచు "ఆయుర్దా అగ్నే" ఇత్యాది మంత్రముచేత ఆహవనీయాగ్నియందు ఆజ్యమును హోమము చేయవలెను. ఈ ఆజ్యాహుతిచేత యజమానుఁడు ఈ యాహవనీయ గార్హపత్యాగ్నులను శాంతింపఁజేసినవాఁ డగును. ఆర్తిని పొందఁడు.

3. **అర్థము:** యత్ కుసీదమ్=ఏ ఋణము, అప్రతీత్తమ్=తీర్చనిది, మయి=నాయందు, (వర్తతే=ఉంటున్నదో,) యేన=ఏ, యమస్య=ఋణము నిచ్చిన ఉత్తమర్ణుఁడైన యమునియొక్క, బలినా=తిరిగి ఈయఁదగిన (ప్రత్యర్పణీయమైన) ఋణముతో, (యుక్తః=కూడినవాఁడనై), అహమ్=నేను, చరామి=సంచరించుచున్నానో, తత్ ఏతత్=ఆ యీ ఋణమును, ఇహైవ సన్=ఈ జన్మయందే (యజ్ఞప్రదేశమునం దున్నవాఁడనై), నిరవదయే=నిశ్శేషముగ తొలఁగించుకొనుచున్నాను. తత్=ఆ కారణముచేత, హే అగ్నే!=ఓ యగ్నీ! (యమాత్ ఉత్తమర్ణాత్=యముఁ డనెడి ఉత్తమర్ణునినుండి, అహమ్=నేను), అనృణః=ఋణరహితుఁడను, భవామి=అగుచున్నాను.

**తాత్పర్యము:** యమునకు నేను బాకీపడియున్న ఋణమును ఈ జన్మయందే ఈయజ్ఞ ప్రదేశమునం దుంటున్నవాఁడనై నిశ్శేషముగఁ దీర్చుకొనుచున్నాను. ఆ కారణముచేత ఓ యగ్నీ! ఉత్తమర్ణుఁడైన యమునినుండి నేను ఋణవిముక్తుఁడ నగుచున్నాను. (ఉత్తమర్ణుఁడు=ఋణము నిచ్చినవాఁడు. ఆహవనీయమునుండి కొఱవిని తీసికొని ఈ మంత్రమును పఠించుచు దానిచే వేదిని కాల్చవలెను. అవభృథ, ఉదయనీయానుబన్ధ్య కర్మలకు పిమ్మట ఈ వేదిదాహము చేయవలెను.)

4. **అర్థము:** హే విశ్వలోప!=సమస్తపాప వినాశకమైన ఓ సక్తువంజలీ!, విశ్వదావస్య=సర్వపాప దహనమునకై ప్రవృత్తమైన దావాగ్నియొక్క, ఆసన్=ఆస్యము (ముఖము)నందు, త్వా=నిన్ను, జుహోమి=హోమము చేయుచున్నాను. అగ్ధాత్=హోమముచే వచ్చినదానిని భక్షించునగ్ని, ఏకః=ఒకఁడు. అహుతాత్=హోమరహితమును తినునగ్ని, ఏకః=ఒకఁడు. సమసనాత్=సమస్తమును భక్షించునగ్ని, ఏకః=ఒకఁడు. తే=ఆ ముువ్వురు, (అనేన సంతుష్టాః=ఈ హోమముచే సంతుష్టులై), నః=మాకొఱకు భేషజమ్=క్షుత్పరిహారమును, (ఆఁకలి తీరువిధమును), సహః=బలమును, సదః=నివాసస్థానమును, వరేణ్యమ్=శ్రేష్ఠమైన ధనమును, కృణ్వన్తు=చేయుదురు గాక.

**తాత్పర్యము:** సమస్త పాపమును నశింపఁజేయునట్టి ఓ సక్తువంజలీ! సమస్త పాపమును దహింపఁజేయఁ బూనుకొనిన దావాగ్నిముఖమునందు నిన్నుంచుచున్నాను. ఈ సక్తుహోమముచేత సంతుష్టులైన 'అగ్ధాత్' 'అహుతాత్' "సమసనాత్" అను ముువ్వ రగ్నులు మాకు (ఆఁకలి తీరుటను) క్షుత్పరిహారమును, నివాసస్థానమును, బలమును, శ్రేష్ఠధనమును చేయుదురు గాక. (అగ్ని మూఁడు విధములుగా నుండును. హోమమువలన

ప్రాప్తమైన దానిని భక్షించునగ్ని 'అద్గాత్' అని వ్యవహరించఁబడును. హోమరహితమైన దానిని భక్షించు నగ్ని 'అహుతాత్' అని వ్యవహరించఁబడును. సమస్తమును గూడ భక్షించునగ్ని 'సమసనాత్' అని వ్యవహరించఁబడును. హోమేన ఆగతమ్ అత్తీతి అద్గాత్. ''అద=భక్షణే''. హోమరహిత మత్తీతి 'అహుతాత్'. సమసనమ్-సమస్తమపి, అత్తీతి='సమసనాత్'. అని వ్యుత్పత్తి. యజమానుఁడు అవభృథాంగ కర్మను సంకీర్ణముగ చేసిన పక్షమున తత్సాంకర్య దోష పరిహారమునకై వేదిదాహకమైన దావాగ్నియందు దోసిలితో సక్తువులను హోమము చేయవలెను. హే సక్త్వంజలే-దోసిలియందలి సక్తువులకు ఇది సంబోధనము.)

5. అర్థము: అయం పురః (పర్తమానః)-ఈ యెదుట ఉంటున్న అగ్ని, నభసా=తేజస్సుచే, సంస్థానః-వృద్ధినొందుచున్నవాఁడై, గృహాణామ్-(మా) గృహములయొక్క, అసమర్త్యై=నాశము లేకుండుటకై, నః-మమ్ము, అభిరక్షతు-అంతటను రక్షించుఁగాక. తతః=ఆ యగ్నిరక్షణమువలన, నః-మాకు, బహవః గృహాః=అనేక గృహములు, అసన్-ఉండుఁగాక.

తాత్పర్యము: ఈ యెదుట ఉంటున్న అగ్ని గృహములు నశింపకుండుటకై మమ్ము అంతటను రక్షించుఁగాక. ఆ యగ్ని రక్షణమువలన మా కనేకగృహము లుండుఁగాక. (ఈ మంత్రముచే నగ్నిని నమస్కరించవలెను.)

6. అర్థము: హే నభసస్పతే-ఆకాశపాలకుఁడవైన ఓ వాయుదేవా!, సః త్వమ్-ప్రసిద్ధుఁడవైన నీవు, నః=మాకొఱకు, భద్రయా-అనుగ్రహరూప వాక్కుచే, ఊర్జమ్-అన్నాది రసమును, ధేహి=ఉంచుము. (ఒసఁగుము. కించ-మఱియు), నః-మాయొక్క, నష్టమ్-నష్టమైన అన్నాదిరసమును, పునః=మఱల, ఆకృధి-తెచ్చి యిమ్ము. పునః-ఇంకను, నః-మాకొఱకు, రయిమ్-అపేక్షిత ధనమును, ఆకృధి-తెచ్చి యిమ్ము.

తాత్పర్యము: ఆకాశపాలకుఁడవైన ఓ వాయుదేవా! ప్రసిద్ధుఁడవైన నీవు వాక్కుచే ననుగ్రహించి మాకు అన్నాది రసము నొసఁగుము. మఱియు నష్టమైన మా యన్నాది రసమును మఱల తెచ్చి యిమ్ము. ఇంకను మా కపేక్షితమైన ధనమును తెచ్చి యిమ్ము. (ఈ మంత్రముచే వాయుదేవుని నమస్కరించవలెను.)

7. అర్థము: హే సంస్థాన! దేవ!-మంచి యభివృద్ధితో కూడిన ఓ ఆదిత్యదేవా!, (త్వమ్=నీవు), సహస్రపోషస్య-సహస్ర సంఖ్యాక ధన పశ్వాది సమృద్ధికి, ఈశిషే=ప్రభు వగుచున్నావు. సః=ఆ నీవు, నః=మాకొఱకు, అజ్యానిమ్=దారిద్ర్యాభావమును, రాయస్పోషమ్-ధనపుష్టిని, సువీర్యమ్-మంచిసంతానమును, సంవత్సరీణామ్-తత్తత్సంవత్సర సంబద్ధమైన, స్వస్తిమ్-అనిష్టనాశరూప సంపదను, రాస్వ-ఇమ్ము.

తాత్పర్యము: మంచి యభివృద్ధితో కూడియున్న ఓ ఆదిత్యదేవా! నీవు సహస్ర సంఖ్యాక ధన పశు సమృద్ధికి ప్రభు వగుచున్నావు. అటువంటి నీవు మాకు దారిద్ర్యము లేకుండుటను, ధనపుష్టిని, ఆ యా సంవత్సరములకు సంబంధమైన అనిష్టనాశరూప సంపద నొసఁగుము. (ఈ మంత్రముచే ఆదిత్యుని నమస్కరించవలెను.)

8. అర్థము: యమః-''యమస్య బలినా చరామి''త్యాది మంత్రమునందుఁ జెప్పఁబడిన యముఁడు, అగ్నిః వావ-అగ్నియే. ఇయమ్-ఈ వేదిరూప భూమి, యమీ-యమి. (అగ్నిసంబంధమైనది). యజమానః-యజమానుఁడు. ఓషధీభిః-ఓషధులచేత, వేదిమ్-వేదిని, స్తృణాతి యత్=అచ్ఛాదింపఁజేయుచున్నాఁ డనుట యేది కలదో, ఏతత్-దీనిచేత, యమస్య-యమునియొక్క (అగ్నియొక్క), కుసీదం వా-వడ్డియొక్క మూలధనమునే, ఆదత్తే-స్వీకరించుచున్నవాఁ డగుచున్నాఁడు. అనుపోష్య-వేదిని దగ్ధము చేయక, యజమానః=యజమానుఁడు, ప్రయాయాత్ యత్-ప్రయాణము చేయునెడల, (తదానీమ్-అప్పుడు) గ్రీవబద్ధమ్-కంఠమునందు పాశముచే బద్ధుఁడైన, ఏనమ్-ఈ యజమానుని, భృత్యాః-భృత్యులు, అముష్మిన్ లోకే-స్వర్గలోకమునందు, నేనీయేరన్-ఎక్కువగా పొందింతురు.

తాత్పర్యము: ''యమస్య బలినా చరామి'' అను మంత్రమునందుఁ జెప్పఁబడిన యముఁడు అగ్నియే. ఈ వేదిభూమి యమి. యజమానుఁడు వేదిని ఓషధులచే నాచ్ఛాదనము చేసినచో అప్పు డతఁడు యమునియొక్క వడ్డికి

సంబంధించిన మూలధనమునే (కుసీదమునే) తీసికొనినవాఁ డగును. యజమానుఁడు వేదిని దగ్ధము చేయకుండ భూమినుండి బయలుదేరి ప్రయాణము చేయునెడల అప్పుడు యమభృత్యులు పాశముచే కంఠమునందు బంధించిన యీ యజమానుని స్వర్గమున కత్యంతము కొనిపోవుదురు.

9. అర్థము: మయి=నాయందు, యత్ కుసీదమ్=ఏ ఋణము, అప్రతీత్తమ్=తీర్చనిది, (వర్తతే=ఉంటున్నదో), ఇతి=అని, ఉపోషతి=వేదిని దగ్ధము చేయవలెను. ఇహైవ=ఈ జన్మమునందే, ఈ యజ్ఞప్రదేశమునందే, సన్=ఉంటున్నవాఁ డగుచు, యమమ్=యముని గూర్చి, (విద్యమానమ్=ఉంటున్న), కుసీదమ్=ఆ ఋణమును, నిరవదాయ=నిశ్శేషముగ ఈ వేదిదాహముచే పోఁగొట్టి, అనృణః=ఋణరహితుఁడై, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, ఏతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: యమునకుఁ దీర్చని ఋణ మేది నాయందు కలదో, యని యజమానుఁడు వేదిని దగ్ధము చేయవలెను. అప్పు డా యజమానుఁడు ఈ జన్మమునందే, ఈ యజ్ఞప్రదేశమునందే, ఉంటున్నవాఁ డగుచు యముని గూర్చియున్న ఋణమును ఈ వేదిదాహముచే పోఁగొట్టి ఋణవిముక్తుఁ డగుచు పిమ్మట స్వర్గలోకమును పొందును.

10. అర్థము: యజమానః=యజమానుఁడు, అఙ్గజాతమ్=యజ్ఞాంగ సముదాయమును, మిశ్రమివ=సంకీర్ణమైనదివలె, చరేత్ యది=ఆచరించునెడల, అఞ్జలినా=దోసిలితో, సక్తూన్=సక్తువులను (పేలపిండిని), జుహుయాత్=హోమము చేయవలెను. ఏషః అగ్నిః ఏవ=ఈ యగ్నియే, వైశ్వానరః=(సర్వపురుషాపేక్షిత వ్యవహారమునకై పర్యాప్తుఁ డగుటవలన) సర్వపురుష సంబద్ధుఁడు. యత్ప్రదావ్యః=వేదిదాహకాగ్ని యెవరు కలరో, స ఏవ=ఆ యగ్నియే, ఏనమ్=అంగజాతమును సంకీర్ణముగ ననుష్ఠించిన ఈ యజమానుని, స్వదయతి=మిశ్రణదోష రహితునిగాఁ జేయుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞాంగ సముదాయమును యజమానుఁడు సంకీర్ణముగ ననుష్ఠించినచో తత్సాంకర్యదోష పరిహారమునకై వేదిదాహక దావాగ్నియందు అంజలితో పేలపిండిని హోమము చేయవలెను. ఈ యగ్నియే వైశ్వానరాగ్ని. ఆ యగ్ని సక్తుహోమముచే సంతుష్టుఁడై ఈ యజమానుని మిశ్రణదోష రహితునిగాఁ జేయును.

11. అర్థము: అహ్నాం విధాన్యామ్=ప్రతిపదాది తిథులను ప్రవర్తింపఁ జేయునట్టి, ఏకాష్టకాయామ్=మాఘ కృష్ణాష్టమియందు, చతుఃశరావమ్=నాలుగు మూఁకుళ్ల పరిమితి గల ద్రవ్యముచే నిర్మితమైన, అపూపమ్=అపూపము (అనెడి పిండివంట) ను, పక్త్వా=పక్వము చేసి, ఏతేన=ఈ అపూపముచేత, ప్రాతః=మరునాటి ప్రాతః కాలమున, కక్షమ్=కక్షను, ఉపోషేత్=దగ్ధముచేయవలెను. దహతి యది=అపూపాగ్ని సర్వకక్షను దహింపఁ జేసినచో, పుణ్యసమం భవతి=ఉద్దేశించిన కార్యము పుణ్యసమ మగుచున్నది. న దహతి యది=దగ్ధము చేయనిచో, పాపసమం భవతి=పాపసమ మగుచున్నది.

తాత్పర్యము: గవామయన మనెడి సంవత్సర క్రతువునందు అనుష్ఠింపవలసిన ఆహ్నిక కర్మలు మాఘబహుళ అష్టమినాఁడు ప్రారంభింతురు. అందువలన ప్రతిపదాది తిథులకు ఈ యేకాష్టక ప్రవర్తక మగుచున్నది. యజమానుఁడు గల ఏదేని కార్యము సాధింపవలెనని కోరుకొను పక్షమున మాఘ కృష్ణాష్టమినాఁడు నాలుగు మూఁకుళ్ల పరిమితి ద్రవ్యముతో అపూపము చేసి దానిని పక్వము చేసి బాగుగ వేఁడిగనున్న ఆ యపూపముచేత మరునాటి యుదయమున అడవియందలి పొదను దగ్ధము చేయవలెను. అనఁగా అపూపమును పొదయొక్క మధ్యమందుంచి దానిపై కొఱవిని పెట్టి ఆ నిప్పుపైని ఎండుగడ్డి నుంచవలెను. దానిచే కక్షయంతయు దగ్ధమైనచో యజమానుఁడు తలఁచిన కార్యము నెరవేరును. సంపూర్ణముగా దగ్ధము కానిచో ఆ కార్యము నెరవేరదని భావము. వేదిదాహ ప్రసంగమువలన దాహరూపమైన కర్మాంతర మిచటఁ జెప్పఁబడినది.

12. అర్థము: పురా=పూర్వము, ఋషయః=ఋషులు, ఏతేన విజ్ఞానేన=ఈ కక్ష దాహరూప విజ్ఞానముచేత, దీర్ఘమ్=సంవత్సర సత్రాదికమైన ప్రౌఢకర్మను, ఉపయన్తి స్మ హ=ప్రారంభించుచుండెడివా రఁట.

తాత్పర్యము: పూర్వము మహర్షులు సంవత్సర సత్త్రాదిరూప ప్రౌఢకర్మ ప్రారంభించుటకు ముందు పూర్వోక్తమైన కక్షదాహరూపమైన నిర్విఘ్న పరిసమాప్తి సూచకమగు కర్మను జేసి దానివలన తాము సంకల్పించిన కార్యము నిర్విఘ్నముగ సమాప్తమగునని తోఁచినచో ఆ ప్రౌఢకర్మను ప్రారంభించెడివారఁట.

13. అర్థము: యః వా=ఏ యజమానుఁడైతే, ఉపద్రష్టారమ్–ఉపద్రష్టను (కార్యమును విచారించుకొనువానిని), ఉపశ్రోతారమ్–ఉపశ్రోతను (కార్యమును బలపఱచువానిని), అనుఖ్యాతారమ్–అనుఖ్యాతను (కార్యమును వ్యాప్తి చేయువానిని), విద్వాన్–తెలిసికొనినవాఁడై, యజతే–యాగము చేయుచున్నాఁడో, (సః–అతఁడు), ఇష్టాపూర్తేన–శ్రౌత స్మార్తము లనెడి ఉభయ కర్మల ఫలముచేత, అముష్మిన్ లోకే–స్వర్గలోకమునందు, సంగచ్ఛతే–కలసికొనుచున్నాఁడు. (శ్రౌత స్మార్త కర్మల ఫలమును స్వర్గమునందు పొందుచున్నాఁడని భావము.) అగ్నిర్వా–అగ్నియే, ఉపద్రష్టా–ఉపద్రష్ట. వాయుః=వాయువు, ఉపశ్రోతా–ఉపశ్రోత. ఆదిత్యః–ఆదిత్యుఁడు, అనుఖ్యాతా–అనుఖ్యాత. యః–ఏ యజమానుఁడు, తాన్–ఆ అగ్న్యాదులను, ఏవమ్–ఉపద్రష్ట్రాదులనుగా, విద్వాన్–తెలిసికొనుచున్నవాఁడై, యజతే–యాగము చేయుచున్నాఁడో, (సః–ఆ యజమానుఁడు), ఇష్టాపూర్తేన, అముష్మిన్ లోకే, సంగచ్ఛతే–స్వర్గలోకమునందు శ్రౌత స్మార్త కర్మల ఫలమును పొందుచున్నాఁడు.

తాత్పర్యము: ఇష్ట మనఁగా శ్రౌతకర్మ. పూర్త మనఁగా స్మార్తకర్మ. ఉపద్రష్ట యనఁగా కార్యమును విచారించుకొనువాఁడు. ఉపశ్రోత=ఆ కార్యము నంగీకరించి బలపఱచువాఁడు. అనుఖ్యాత=ఆ కార్యమును వ్యాప్తి చేయువాఁడు. ఇచట అగ్ని ఉపద్రష్ట యనియు, వాయువు ఉపశ్రోత యనియు, ఆదిత్యుఁడు అనుఖ్యాత యనియుఁ జెప్పఁబడిరి. ''అయం నో నభసా'' ఇత్యాది మంత్రత్రయమునందలి అగ్న్యాదులు ఇచట ప్రశంసింపఁబడిరి.

14. అర్థము: పురః–ఎదుట, అగ్నిః వై–అగ్నియే, నభసా–తేజస్సుతో, యుక్తః–కూడినవాఁడై, దృశ్యతే–కనఁబడుచున్నాఁడు, (అను నర్థమును) "అయం నో నభసా" ఇతి–'అయం నో నభసా' అను మంత్రము, ఆహ–చెప్పినది. తత్=ఆ కారణమువలన, ఉపస్థాతా–నమస్కారము చేయు యజమానుఁడు, అగ్నిమేవ–ఆ యగ్నిని గూర్చియే, మే–నాయొక్క, ఏతత్–ఈ కర్మఫలమును, గోపాయ–రక్షింపుము, ఇతి=అని, ప్రార్థితవాన్ భవతి–ప్రార్థించినవాఁ డగుచున్నాఁడు. వాయుః వై–వాయువే, నభసస్పతిః–(ఆకాశమున సంచరించుటచే తత్పాలకుఁడు కావున) నభసస్పతి, ఇతి–అని, "స త్వం నో నభసస్పతే" ఇతి–"స త్వం నో నభసస్పతే" అను మంత్రము, ఆహ–చెప్పినది. అసౌ ఆదిత్యః దేవః ఏవ–ఈ ఆదిత్య దేవుఁడే, (రశ్మిభిః సర్వత్ర అభివర్ధమానత్వాత్–కిరణములచే సంతత సభివృద్ధి నొందుచున్నవాఁ డగుటచే), సంస్థానః–అభివృద్ధితోఁ గూడియున్నవాఁడు, ఇతి=అని, "దేవ సగ్ంస్ఫాన" ఇతి–దేవ సంస్ఫాన' అను మంత్రము, ఆహ–చెప్పినది. తత్–ఆ కారణమువలన, (ఉపస్థాతా యజమానః–ప్రార్థించుచున్న యజమానుఁడు), మే–నాయొక్క, ఏతత్=ఈ కర్మఫలమును, గోపాయ ఇతి–రక్షించుమని, ప్రార్థితవాన్ భవతి–ప్రార్థించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: "స త్వం నో నభసా" ఇత్యాద్యుపస్థాన మంత్ర త్రయమునకు ఈ మంత్రము వ్యాఖ్యానరూపము. తాత్పర్యము అర్థమునందే వివరించఁబడినది.

అష్టమానువాకము సమాప్తము

## అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]ఏతం యువానం పరి వో దదామి తేన క్రీడన్తీ శ్చరత ప్రియేణ। మా నః శాప్త జనుషా
సుభాగా రాయస్పోషేణ సమిషా మదేమ। [2]నమో మహిమ్న ఉత చక్షుషే తే మరుతాం పిత
స్తదహం గృణామి। అను మన్యస్వ సుయజా యజామ జుష్టం దేవానా మిదమస్తు హవ్యమ్।
[3]దేవానామేష ఉపనాహ ఆసీదపాం గర్భ ఓషధీషు న్యక్తః। సోమస్య ద్రప్సమవృణీత పూషా
(౧)బృహన్నద్రి రభవ త్తదేషామ్। [4]పితా వత్సానాం పతి రఘ్నియానా మథో పితా మహతాం
గర్గరాణామ్। వత్సో జరాయు ప్రతిధుక్పీయూష ఆమిక్షా మస్తు ఘృతమస్య రేతః। [5]త్వాం
గావో ఽవృణత రాజ్యాయ త్వాగ్ం హవన్త మరుతః స్వర్కాః। వర్ష్మన్క్షత్రస్య కకుభి శిశ్రియాణ
స్తతో న ఉగ్రో వి భజా వసూని। [6]వ్యృద్ధేన వా ఏష పశునా యజతే యస్యైతాని న క్రియన్త
ఏష హ త్వై సమృద్ధేన యజతే యస్యైతాని క్రియన్తే ॥౨॥

(పూషా క్రియన్త ఏషో౽ష్టౌ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయ ప్రపాఠకే నవమోఽనువాకః॥

### వేదార్థదీపిక

అవతారిక: అష్టమానువాకమునందు వేదిదాహము ప్రధానముగ వివరించఁబడినది. ఈ నవమానువాకమునందు వృషాలంభ మనెడి కర్మ చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే గావః!-ఓ గోవులారా!), వః-మీకొఱకు, యువానమ్-యౌవనవంతమైన, ఏతమ్-ఈ వృషభమును, (అహమ్-నేను), పరి దదామి-అంతటను ఇచ్చుచున్నాను. తేన ప్రియేణ-ఆ ప్రియునితో, క్రీడన్తీః-క్రీడించుచున్నవారై, చరన్త-సంచరించుఁడు. (యూయమ్-మీరు), జనుషా-జన్మచేత, సుభాగాః-బాగుగ భాగము కలవారు. (అతః-ఆ కారణమువలన), నః-మమ్ము, మా శాప్త-శపింపకుఁడు. (యుష్మాకం ప్రసాదాత్-మీయొక్క అనుగ్రహమువలన, వయమ్-మేము), రాయస్పోషేణ-ధనపుష్టిచేతను, ఇషా-అన్నముచేతను, సంమదేమ-బాగుగ చూడఁబడినవార మగుదుము.

తాత్పర్యము: ఓ గోవులారా! నేను మీకు యౌవనము కలిగియున్న వృషభము నొసఁగుచున్నాను. మీరు ఆ ప్రియునితో క్రీడించుచున్నవారై సంచరించుఁడు. పుట్టుకచేతనే మీరు బాగుగ భాగము కలవారు. కావున మమ్ము శపింప కుఁడు. మరేమనఁగా— తరుణ వృషభము నొసఁగినందుకు మమ్మనుగ్రహించుఁడు. మీ యనుగ్రహమువలన మేము ధనపుష్టిచేతను, అన్నముచేతను బాగుగ చూడఁబడువార మగుదుము. (వృషాలంభ కర్మ చేయు యజమానుఁడు గోవులలో ఒక వృషభము ముసలిది కాఁగా తరుణవయస్సు కల వృషభముయొక్క చెవిదగ్గర "పిశఙ్గరూప స్తన్న స్తురీపమ్" అను మంత్రములను జపించుచు, "ఏతం యువానమ్" అను ఈ మంత్రము పఠించి తరుణవృషభమును గోవులలో విడువవలెను.)

2. అర్థము: హే మరుతాం పితః—దేవజనకుఁడవైన ఓ ప్రజాపతీ!, తే—నీయొక్క, మహిమ్నే—సృష్ట్యాదిరూప మహిమ కొఱకు, ఉత—మఱియు, చక్షుషే—దృష్టిరూపమైన సర్వగోచర జ్ఞానముకొఱకు, నమః—నమస్కారము. అహమ్—నేను, తత్—నా వివక్షితమును, గృణామి—(నీకు)చెప్పుచున్నాను. (త్వంచ—నీవును, మదుక్తమ్—నేఁ జెప్పినదానిని), అనుమన్యస్వ—అంగీకరించుము. సుయజా—శోభన యజ్ఞ సాధనమైన, (వృషభేణ—వృషభముతో), యజామ—యజ్ఞము చేయుదుము. ఇదమ్—ఈ వృషభ రూపమైన, హవ్యమ్—హవిస్సు, దేవానామ్—దేవతలకు, జుష్టమ్—ప్రీతికరము, అస్తు—అగుఁగాక.

తాత్పర్యము: ఓ దేవజనకుఁడవైన ప్రజాపతీ! సృష్ట్యాది రూపమైన నీ సర్వగోచర జ్ఞానముకొఱకు నమస్కారము. నేను నిర్ణయించుకొనిన విషయమును నీకు చెప్పుచున్నాను. నేను చెప్పినదానిని నీ వంగీకరించుము. మంచి యజ్ఞ సాధనమైన వృషభముతో యజ్ఞము చేయుదుము. ఈ వృషభరూప హవ్యము దేవతలకు ప్రీతికర మగుఁగాక.

3. అర్థము: ఏషః—ఈ వృషభము, దేవానామ్—దేవతలకు, ఉపానహః—బంధన హేతువు, ఆసీత్—అయినది. (సః—ఆ వృషభము, హుతస్సన్—హుత మగుచు, మేఘేషు—మేఘములందు), అపామ్—ఉదకముల సంబంధియైన, గర్భః—గర్భము, (భూత్వా—అయి), ఓషధీషు—ఓషధులందు, న్యక్తః—వృష్టిరూపమున అధోముఖముగ పడినది. (సః జలరూపో గర్భః కథం సంపన్నః? ఇతి చేత్—ఆ హుతమైన వృషభము జలరూప గర్భము ఎట్లైనది? అనినచో, —ఉచ్యతే—సమాధానము చెప్పఁబడుచున్నది.) పూషా—సూర్యుఁడు, సోమస్య—చంద్ర సంబంధి యగు, ద్రప్సమ్—జలబిందువును, అవృణీత—కిరణములచే గ్రహించెను. తత్—ఆ బిందురూప జలము, ఏషామ్—ఈ కిరణములయొక్క, బృహన్ అద్రిః—పర్వతసదృశ మేఘము, అభవత్—అయినది.

తాత్పర్యము: ఈ వృషభమునందు దేవతలకు అధికమైన ప్రీతి యుండుటచే బంధనహేతు వైనది. దేవతలకు ప్రీతికరమైన ఈ వృషభము ఆహుతిరూపమున అగ్నియందు హుతమై ఆదిత్యుని పొంది రశ్మిరూపమున భూమియందున్న చంద్రసంబంధి జలమును గ్రహించి మేఘరూపము నవలంబించి మేఘోదరమున జలరూప గర్భముగ నయి వృష్టిరూపమున ఓషధులందు పడినదని భావము. "అగ్నౌ ప్రాస్తాఽఽహుతిః సమ్యగాదిత్య ముపతిష్ఠతి" అను శ్రుత్యర్థము ఈ మంత్రముచే సంగృహీత మైనది. (ఇది వపాహోమ మంత్రము.)

4. అర్థము: (అయమ్—ఈ వృషభము), వత్సానామ్—గోవత్సములకు, పితా—తండ్రి. అఘ్నియానామ్—ఆవులకు, పతిః—భర్త. అథో—మఱియు, మహతామ్—పెద్దవియైన, గర్గరాణామ్—గంభీరధ్వని కలిగిన వృషభములకు (కూడ), పితా—తండ్రి. (కించ—మఱియు, గవాముదరే—గోవుల యుదరమునందలి,) వత్సః—గర్భరూపమైన వత్సము జరాయు—మావి, ప్రతిధుక్—దోహన పాత్రమునందలి పయస్సు, పీయూషః—పాలపొదుగునందలి అమృత, సమానమైన క్షీరము, ఆమిక్షా—పాలవిఱుగుడు, మస్తు—వెన్న(నవనీతము), ఘృతమ్—ఆజ్యము, (ఏతత్సర్వమ్—ఇది యంతయు), అస్య—ఈ వృషభముయొక్క, రేతః—ఏతదీయ సారభూత రస పరిణామ రూపము.

తాత్పర్యము: ఈ వృషభము గోవత్సములకు తండ్రి. గోవులకు భర్త. మఱియు శరీరవృద్ధిచే పెద్దవియైన గంభీరధ్వని గల వృషభములకు కూడ తండ్రి. ఇంకను గోవుల యుదరమున గర్భరూపముననున్న వత్సము, గర్భాధికరణమైన జరాయువు (మావి), దోహన పాత్రమునందు పిండిన పాలు, పాలపొదుగునందలి అమృత

సమానమైన క్షీరము, పాలవిఱుగుడు, నవనీతము, ఆజ్యము ఈ సర్వము ఈ వృషభ సంబంధియైన సారభూత రస పరిణామ రూపము. (ఇటువంటి గొప్పదియగు వృషభము దేవతలను తృప్తిపఱచుఁగాక అని భావము. ఇది హృదయాద్యంగ హోమ మంత్రము.)

5. అర్థము: (హే వృషభః=ఓ వృషభమా!), గావః=గోవులు, (అన్నియు), త్వామ్=నిన్ను, రాజ్యాయ=రాజ్యముకొఱకు (రాజుగా), అవృణత=వరించినవి. స్వర్కాః=బాగుగ పూజింపఁదగిన, మరుతః=దేవతలు, త్వామ్=నిన్ను, (హవిస్స్వరూపమునుగా), హవన్త (ఆహ్వయన్తి)=ఆహ్వానించుచున్నారు. క్షత్త్రస్య=క్షత్త్రియజాతియొక్క, కకుభి=(ఆఁబోతు మూఁపురముతో సమానమైన) ప్రధానమయిన, వర్ష్మన్=శరీరమునందు, (త్వమేవ=నీవే), శ్రిశ్రియాణః=ఆశ్రయించి బలరూపమున నున్నదానవు, (అసి=అగుచున్నావు). తతః=ఆ కారణమువలన, (రాజసదృశః త్వమ్=రాజ సమానమైన నీవు), ఉగ్రః=తీవ్రమై, నః=మాకొఱకు, వసూని=(శత్రు)ధనము లను, (తేభ్యః=వారినుండి), విభజా(విభజ)=విభజించుము.

తాత్పర్యము: ఓ వృషభమా! గోవు లన్నియు నిన్ను రాజ్యమునకు రాజుగా వరించినవి. బాగుగ పూజింపఁదగిన దేవతలు నిన్నే హవి స్స్వరూపమునుగా నాహ్వానించుచున్నారు. నీవు క్షత్త్రియజాతియొక్క ప్రధాన శరీరమునందు (రాజవిగ్రహమునందు) ఉంటున్నదాన వగుచున్నావు. అందువలన రాజ సదృశమైన నీవు ఉగ్రమై మాకొఱకు శత్రుధనములను వారినుండి విభజించుము.

8. అర్థము: యస్య=ఏ యజమానునకు, ఏతాని="ఏతం యువాన" మిత్యాది మంత్రములచే సాధ్యములయిన కర్మలు, న క్రియన్తే=చేయఁబడుట లేదో, ఏషః=ఈ యజమానుఁడు, వ్యృద్ధేన=సర్వాంగ సమృద్ధి రహితమైన, పశునా వా=పశువుతోనే, యజతే=యాగము చేయుచున్నవాఁ డగుచున్నాఁడు. యస్య=ఏ యజమానునకు, ఏతాని=''ఏతం యువాన'' మిత్యాది మంత్రములచే సాధ్యము లయిన కర్మలు, క్రియన్తే=ఆచరింపఁబడు చున్నవో, ఏషః=ఈ యజమానుఁడు, సమృద్ధేన=సర్వాంగ సమృద్ధమైన, పశునా=పశువుతో, యజతే= యాగము చేయుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: ఏ యజమానుని నిమిత్తము ఈ యనువాకారంభమునుండి చెప్పఁబడిన "ఏతం యువాన" మిత్యాది మంత్రములచే సాధ్యము లయిన కర్మలు చేయఁబడుట లేదో, ఆ యజమానుఁడు సర్వాంగ సమృద్ధి లేని పశువుతో యజ్ఞము చేయుచున్నవాఁడగును. ఏ యజమానుని నిమిత్తము పూర్వోక్త మంత్రములచే సాధ్యము లయిన కర్మలు చేయఁబడుచున్నవో, ఆ యజమానుఁడు సర్వాంగ సమృద్ధమైన పశువుతో యజ్ఞము చేయుచున్నవాఁ డగును.

నవమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే దశమోఽనువాకః।

మూలము: [1]సూర్యో దేవో దివిషద్భ్యో ధాతా క్షత్త్రాయ వాయుః ప్రజాభ్యః। బృహస్పతిస్త్వా ప్రజాపతయే జ్యోతిష్మతీం జుహోతు। [2]యస్యాస్తే హరితో గర్భోఽథో యోని ర్హిరణ్యయీ। అఙ్గాన్యహ్రుతా యస్యై తాం దేవైః సమజీగమమ్। [3]ఆ వర్తన వర్తయ ని నివర్తన వర్తయేన్ద్ర నర్దబుద। భూమ్యాశ్చతస్రః ప్రదిశ స్తాభి రావర్తయా పునః। [4]వి తే భినద్మి తకరీం వి యోనిం వి గవీన్యౌ। వి (౧)మాతరం చ పుత్రం చ వి గర్భం చ జరాయు చ। [5]బహిస్తే అస్తు బాలితి। [6]ఉరుద్రప్సో విశ్వరూప ఇన్దుః పవమానో ధీర ఆనఞ్జ గర్భమ్। [7]ఏకపదీ ద్విపదీ త్రిపదీ చతుష్పదీ పఞ్చపదీ షట్పదీ సప్తపద్యష్టాపదీ భువనాఽను ప్రథతాగ్ం స్వాహా [8]మహీ ద్యౌః పృథివీ చ న ఇమం యజ్ఞం మిమిక్షతామ్। పిపృతాం నో భరీమభిః ॥ ౨ ॥

(గవీన్యౌ వి చతుశ్చత్వారిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయప్రపాఠకే దశమోఽనువాకః।

## వేదార్థదీపిక

అవతారిక: పపమానువాకమునందు జీర్ణవృషాలంభము విహిత మైనది. ఈ దశమానువాకమునందు పశుప్రాయశ్చిత్త విశేషము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే ఛాగి!=ఓ ఛాగీ! (మేఁక!) సూర్యః దేవః=సూర్యదేవుఁడు, దివిషద్భ్యః=దేవతల యభివృద్ధికొఱకు, ధాతా=బ్రహ్మదేవుఁడు, క్షత్త్రాయ=క్షత్రియ జాత్యభివృద్ధికొఱకు, వాయుః=వాయుదేవుఁడు, ప్రజాభ్యః=ప్రజల అభివృద్ధికొఱకు, బృహస్పతిః=బృహస్పతి, ప్రజాపతయే=ప్రజాపతి ప్రాప్తికొఱకు, జ్యోతిష్మతీమ్=తేజస్వంత మైన, త్వా=నిన్ను, జుహోతు=హోమము చేయుఁగాక.

తాత్పర్యము: (అతిరాత్రాది కర్మలయందు తత్తద్దోష పరిహారమునకై ప్రాయశ్చిత్తము చేయునప్పుడు మేఁకను ఆలంభనము చేసి దాని వపారూపమైన హవిస్సును హోమము చేయవలెను. ఆ మేఁక ఇచట సంబోధింపఁబడినది. ఆ మేఁక సంజ్ఞపనము చేయఁబడినపిమ్మట అది (అష్టాపదీ) గర్భిణియని తెలిసినచో ఈ మంత్రముచే రెండు

హోమములు చేయవలెను.) ఓ ఛాగీ! సూర్యదేవాదులు దేవతాదుల అభివృద్ధ్యాదులకొఱకు తేజస్వంతమైన నిన్ను హోమము చేయుదురు గాక. అని తాత్పర్యము.

2. అర్థము: (హే అజే!=ఓ మేఁకా!) యస్యాః తే=ఏ నీయొక్క, గర్భః=గర్భము, హరితః=హరితవర్ణము కలదో, లేక హరింపఁబడిన సారము కలదో, అథో=మఱియు, యోనిః=యోని, హిరణ్యయీ=హరితవర్ణము కలదో, లేక హరింపఁబడిన సారము కలదో, యస్యై=ఏ నీయొక్క (షష్ఠ్యర్థే చతుర్థీ), అఙ్గాని=అవయవములు, అహ్రుతా= (లుప్త విభక్త్యన్తము) కుటిలములో, తామ్=(ఇమామ్) ఆ ఈ నిన్ను, దేవైః=దేవతలతో, సమజీగమమ్= సంగతముగాఁ జేయుచున్నాను.

తాత్పర్యము: ఓ మేఁకా! నీ గర్భము హృతసార మైనది. యోనియు సారమును కోల్పోయినది. నీ అవయవములు కుటిలము లైనవి. అటువంటి నిన్ను దేవతలతో కలుపుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు మేఁకను అభిమంత్రించవలెను.)

3. అర్థము: హే వర్తన!=ఓ గర్భప్రవర్తకుఁడవైన దేవా!, అవర్తయ=గర్భమును ప్రవర్తింపఁజేయుము. హే నివర్తన!=గర్భమును నివర్తింపఁజేయునట్టి ఓ దేవా!, నివర్తయ=గర్భమును నివర్తింపఁజేయుము. హే ఇన్ద్రి!=ఓ యీశ్వరా! హే నర్దబుద!=గర్భమును ధ్వనిరింపఁజేయు దేవా!, భూమ్యాః=భూమికి, యాః=ఏ, చతస్రః ప్రదిశః=నాలుగు దిక్కులు. (సన్తి=కలవో), తాభిః=ఆ దిక్కులతో, పునః=మఱల, ఆవర్తయా= వ్యాప్తముగాఁ జేయుము.

తాత్పర్యము: ఓ గర్భప్రవర్తకుఁడవైన దేవా! ఈ ఛాగియొక్కగర్భమును కదలింపఁజేయుము. ఓ గర్భనివర్తక దేవా! దీని గర్భమును నివర్తింపఁజేయుము. గర్భమును శబ్దింపఁజేయు నీశ్వరా! భూమియొక్క నాలుగు దిక్కులతో మఱల గర్భమును వ్యాప్తము చేయుము. (ఈ మంత్రము చెప్పుచు మేఁకయొక్క గర్భమును ప్రదక్షిణముగ త్రిప్పవలెను.)

4. అర్థము: హే అజే!=ఓ ఛాగీ!, తే=నీయొక్క, తకరీమ్=తకరిని, విభినద్మి=విచ్ఛిన్నము చేయుచున్నాను. యోనిమ్ చ=యోనిని కూడ, విభినద్మి=విచ్ఛిన్నము చేయుచున్నాను. గవీన్యౌ=వృషణ స్థానీయములైన యోన్యంతర్గత ప్రదేశములను, విభినద్మి. మాతరమ్=తల్లిని, చ=మఱియు, పుత్రమ్=పుత్రుని, చ=మఱియు, గర్భమ్=గర్భమును, చ=మఱియు, జరాయు=గర్భాశయమును, విభినద్మి=విచ్ఛిన్నము చేయుచున్నాను.

తాత్పర్యము: ఓ ఛాగీ! నీయొక్క గర్భము మున్నగువానిని విచ్ఛిన్నము చేయుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు ఛాగియొక్క గర్భాదులను కోయవలెను.)

5. అర్థము: (హే అజే!=ఓ ఛాగీ!) తే=నీయొక్క, బాల్=బాల హేతు ప్రాణవృత్తి రూపమైన ఆత్మ, బహిః అస్తు=వెలుపల నుండుఁగాక. (సర్వవ్యాపి అగుఁగాక), ఇతి=అని, (సక్థినీ అన్తరా=తొడల మధ్యభాగమును, ఛినద్మి= ఛేదించుచున్నాను.)

తాత్పర్యము: ఓ ఛాగీ! నీ యాత్మ సర్వవ్యాపి యగుఁగాక యని తొడల మధ్యభాగమును ఛేదించుచున్నాను. (అని ఈ మంత్రము చెప్పుచు మేఁకయొక్క తొడల మధ్యభాగమును ఛేదించవలెను.)

6. అర్థము: ఉరుద్రప్సః=బహు సారవంతములయిన అవయవములు కలదియు, విశ్వరూపః=నానారూపములు కలదియు, ఇన్దుః=తెల్లనిదియు, పవమానః=శుద్ధమైన రూపము కలదియు, ధీరః=స్థిర మైనదియునగు, (ప్రజాపతిరూపమైన అవయవ సంఘాతము), గర్భమ్=(మఱియొక) జన్మను, అనక్షు=పొందుఁగాక.

తాత్పర్యము: ఈ మేఁకయొక్క అవయవ సంఘాతము మిక్కిలి సారవంతము, నానారూపములు కలది. శుభ్ర మైనది. శుద్ధరూపము కలది. స్థిర మైనది. ఇట్టి ఈ అవయవ సంఘాతము మఱియొక జన్మను పొందుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు గర్భరసముకొఱకు పాత్రము నుంచవలెను.)

7. అర్థము: ఏకపదీ=ఒక పాదము కలదియు, ద్విపదీ=రెండు పాదములు కలదియు, త్రిపదీ=మూఁడు పాదములు కలదియు, చతుష్పదీ=నాలుగు పాదములు కలదియు, పఞ్చపదీ=ఐదు పాదములు కలదియు, షట్పదీ=ఆఱు పాదములు కలదియు, సప్తపదీ=ఏడు పాదములు కలదియు, అష్టాపదీ=ఎనిమిది పాదములు కలదియునగు ఛాగి, భువనాని=భువనములను, అనుప్రథతామ్=వరుసగా వ్యాపించుఁగాక.

తాత్పర్యము: ఆలంభనము చేయఁబడిన ఛాగి గర్భిణి యైనచో గర్భస్థ శిశు పాదములతోఁగలసి అష్టపది యగును. అట్టి యీ మేఁక లోకము లన్నిటిని వ్యాపించుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు ఆజ్యమును హోమము చేయవలెను.)

8. అర్థము: మహీ=గొప్పదియైన, ద్యౌః=దివి, చ=మఱియు పృథివీ=భూమి, నః=మాయొక్క, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, మిమిక్షతామ్=ఆసేచనము చేయుఁగాక. నః=మమ్ము, భరీమభిః=భరణ ప్రకారములచేత, పిపృతామ్=పాలించుఁగాక.

తాత్పర్యము: గొప్పదియగు దివి భూమియు మా యీ యజ్ఞమును ఆసేచనము చేయుఁగాక. భరించు పద్ధతులచే మమ్ము పాలించుఁగాక. (గర్భమును, పురోడాశమును చల్లని భస్మముతో సంతటను ఆచ్ఛాదించవలెను. ఇది అభిసమూహన మంత్రము).

దశమానువాకము సమాప్తము.

అథ తృతీయకాణ్డే తృతీయప్రపాఠక ఏకాదశోఽనువాకః।

మూలము: ఇదం వామాస్యే హవిః ప్రియ మిన్ద్రాబృహస్పతీ। ఉక్థం మదశ్చ శస్యతే। [2]అయం వాం పరి షిచ్యతే సోమ ఇన్ద్రాబృహస్పతీ। చారుర్మదాయ పీతయే। [3]అస్మే ఇన్ద్రాబృహస్పతీ రయిం ధత్తగ్ం శతగ్విన్మ్। అశ్వావన్తగ్ం సహస్రిణమ్। [4]బృహస్పతిర్నః పరిపాతు పశ్చాదుతోత్తరస్మా దధరాదఘాయోః। ఇన్ద్రః పురస్తాదుత మధ్యతో నః సఖా సఖిభ్యో వరివః కృణోతు। [5]వి తే విష్వగ్వాతజూతాసో అగ్నే భామాసః (౧)శుచే శుచయశ్చరన్తి। తువిమ్రక్షాసో దివ్యా నవగ్వా వనా వనన్తి ధృషతా రుజన్తః। [6]త్వామగ్నే మానుషీ రీడతే విశో హోత్రావిదం వివిచిగ్ం రత్నధాతమమ్। గుహా సన్తగ్ం సుభగ విశ్వదర్శతం తువిష్మణసగ్ం సుయజం ఘృతశ్రియమ్। [7]ధాతా దదాతు నో రయిమీశానో జగతస్పతిః। స నః పూర్ణేన వావనత్। [8]ధాతా ప్రజాయా ఉత రాయ ఈశే ధాతేదం విశ్వం భువనం జజాన। ధాతా పుత్రం యజమానాయ దాతా (౨)తస్మా ఉ హవ్యం ఘృతవద్విధేమ। [9]ధాతా దదాతు నో రయిం ప్రాచీం జీవాతు మక్షితామ్। వయం దేవస్య ధీమహి సుమతిగ్ం సత్యరాధసః। [10]ధాతా దదాతు దాశుషే వసూని ప్రజాకామాయ మీఢుషే దురోణే। తస్మై దేవా అమృతాః సం వ్యయన్తాం విశ్వే దేవాసో అదితిః సజోషాః। [11]అను నోఽద్యానుమతిర్యజ్ఞం దేవేషు మన్యతామ్। అగ్నిశ్చ హవ్యవాహనో భవతా దాశుషే మయః। [12]అన్విదనుమతే త్వమ్ (౩)మన్యాసై శం చ నః కృధి। క్రత్వే దక్షాయ నో హిను ప్ర ణ ఆయూగ్ంషి తారిషః। [13]అను మన్యతా మనుమన్యమానా ప్రజావన్తగ్ం రయిమక్షీయ

మాణమ్। తస్యై వయగ్ం హేడసి మాఽపిభూమ సా నో దేవీ సుహవా శర్మ యచ్ఛతు।
[14]యస్యామిదం ప్రదిశి యద్విరోచతే ఽనుమతిం ప్రతి భూషన్త్యాయవః। యస్యా ఉపస్థ
ఉర్వన్తరిక్షగ్ం సా నో దేవీ సుహవా శర్మ యచ్ఛతు (౪) [15]రాకామహగ్ం సుహవాగ్ం
సుష్టుతీ హువే శృణోతు నః సుభగా బోధతు త్మనా। సీవ్యత్వపః సూచ్యాఽచ్ఛిద్యమానయా
దదాతు వీరగ్ం శతదాయముక్థ్యమ్। [16]యాస్తే రాకే సుమతయః సుపేశసో యాభిర్దదాసి
దాశుషే వసూని। తాభిర్నో అద్య సుమనా ఉపాగహి సహస్రపోషగ్ం సుభగే రరాణా। [17]సినీవాలి
యా సుపాణిః। [18]కుహూమహగ్ం సుభగాం విద్మనాపస మస్మిన్యజ్ఞే సుహవాం జోహవీమి। సా
నో దదాతు శ్రవణం పితౄణాం తస్యాస్తే దేవి హవిషా విధేమ। [19]కుహూ ర్దేవానా మమృతస్య
పత్నీ హవ్యా నో అస్య హవిష శ్చికేతు। సం దాశుషే కిరతు భూరి వామగ్ం రాయస్పోషం
చికితుషే దధాతు ॥౨॥ (ధామానో దాతా త్వమన్తరిక్షగ్ం సా నో దేవీ సుహవా శర్మ యచ్ఛతు
శ్రవణం చతుర్విగ్ంశతిశ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే తృతీయప్రపాఠక ఏకాదశోఽనువాకః॥

## వేదార్థ దీపిక

అవతారిక: దశమానువాకమునందు పశుప్రాయశ్చిత్త విశేషము చెప్పఁబడినది. ఈ ఏకాదశానువాకమునందు యాజ్యాపురోను వాక్యలు చెప్పఁబడుచున్నవి.

1\. అర్థము: హే ఇన్ద్రాబృహస్పతీ!—ఓ యింద్ర బృహస్పతులారా!, ఇదం హవిః—ఈ హవిస్సు, వామ్—మీయొక్క, ఆస్యే—ముఖమునందు, ప్రియమ్—ఇష్టమైనది, (అస్తు—అగుఁగాక. లేదా, హూయతే—హోమము చేయఁబడుచున్నది.) ఉక్థమ్—శస్త్రము, చ—మఱియు, మదః—హర్షహేతువైన ప్రతిగరము. (వాం ప్రతి—మిమ్ముఁగూర్చి) శస్యతే—కీర్తింపఁబడుచున్నది.

తాత్పర్యము: ఓ యింద్ర బృహస్పతులారా! ఈ హవిస్సు మీ కిష్టమగుఁగాక. శస్త్రము, హర్షహేతువైన ప్రతిగరము మిమ్ముఁ గూర్చి చెప్పఁబడుచున్నది. (ఇది పురోనువాక్య.)

2. అర్థము: హే ఇన్ద్రాబృహస్పతీ!=ఓ యింద్ర బృహస్పతులారా!, అయం సోమః=హవీరూప సోమము, వామ్=మీకొఱకు, పరిషిచ్యతే=పరిత్యజింపఁబడుచున్నది. చారుః అయమ్=సుందరమైన (రుచికరమైన) ఈ హవిస్సు, వామ్ మీ యుభయులయొక్క, పీతయే=త్రాగుటకొఱకు, మదాయ సంతోషముకొఱకు, పరిషిచ్యతే=పరిత్యజింపఁ బడుచున్నది (విడువఁబడుచున్నది).

తాత్పర్యము: ఓ యింద్ర బృహస్పతులారా! ఈ సుందరమైన హవీరూప సోమము మీ యొక్క సంతోషమునకై, త్రాగుట కొఱకు పరిత్యజింపఁబడుచున్నది. (ఇది యాజ్య).

3. అర్థము: హే ఇన్ద్రాబృహస్పతీ!=ఓ యింద్ర బృహస్పతులారా! (యువామ్=మీరు), అస్మే=మాకొఱకు, శతగ్వినమ్=శత సంఖ్యాకమైన, అశ్వావన్తమ్=అశ్వములు కలిగినదియు, సహస్రిణమ్=సహస్ర సంఖ్యాకమైన, రయిమ్=ధన మును, ధత్తమ్=ఒసఁగుఁడు.

తాత్పర్యము: ఓ యింద్ర బృహస్పతులారా! మీరు మాకు శతసంఖ్యాకముగ అశ్వములను, సహస్రసంఖ్యాకముగ ధనము నొసఁగుఁడు. (ఇది పురోనువాక్య).

4. అర్థము: బృహస్పతిః=బృహస్పతి, నః=మమ్ము, పశ్చాత్=పశ్చిమ దిక్కున నున్నట్టియు, ఉత=మఱియు, ఉత్తర స్మాత్=ఉత్తర దిక్కున నున్నట్టియు, అధరాత్=అధోదిక్కున నున్నట్టియు, అఘాయోః=హింసకునినుండి, పరిపాతు=అంతటను రక్షించుఁగాక. ఇన్ద్రః=ఇంద్రుఁడు, పురస్తాత్=తూర్పుదిక్కున నున్నట్టియు, ఉత=మఱియు, మధ్యతః=మధ్యదిక్కున నున్నట్టియు, అఘాయోః=హింసకునినుండి, పాతు=రక్షించుఁగాక. సఖా సఖిభ్యః=మిత్రులమైన మాకు మిత్రుఁడైన బృహస్పతి, యింద్రుఁడును, నః=మాకు, వరివః=సుఖము, కృణోతు=చేయుఁగాక.

తాత్పర్యము: బృహస్పతి మమ్ము పశ్చిమాది దిక్కులనున్న హింసకునినుండియు, ఇంద్రుఁడు ప్రాచీ మధ్యమ దిక్కుల నున్న హింసకునినుండియు రక్షింతురు గాక. మిత్రులమైన మాకు మిత్రులయిన ఇంద్ర బృహస్పతులు మాకు సుఖమును కలుగఁజేయుదురు గాక. (ఇది యాజ్య).

5. అర్థము: హే శుచే అగ్నే!=ఓ పరిశుద్ధుఁడవైన అగ్నీ!, విష్వక్=అంతటను, వాతజూతాసః=వాయువుచే ప్రేరితము లును, భామాసః=(ఇతరాగ్ని మిశ్రణముచే) కోపించు స్వభావము కలవియు, తువిమ్రక్షాసః=అనేకము లను శోధించునవియు, దివ్యాః=ద్యులోక స్థానార్హములును, నవగ్వాః=నూతన గతులు కలవియు (నిత్య నూతనములు,) ధృషతా రుజన్తః=బలాత్కారముగ వైగుణ్యభంగము చేయునవియునగు, తే=నీయొక్క, శుచయః=దీప్తులు, విచరన్తి=అంతటను సంచరించుచున్నవి. (తథావిధాః దీప్తయః=అటువంటి దీప్తులు), వనా=సేవింపఁదగిన మా హవిస్సులను, వనన్తి=బాగుగ సేవించుఁగాక.

తాత్పర్యము: పరిశుద్ధుఁడవైన ఓ యగ్నీ! నీ దీప్తులు అంతటను సంచరించుచున్నవి. ఆ దీప్తులు వాయువుచే ప్రేరిత ములు. ఇతరాగ్ని సంపర్కము కలిగినపుడు కోపించునవిగ నుండును. అనేకములను శోధించునవి. ద్యులోకమునందుండుట కర్హములు. నిత్యనూతనములు. బలవంతముగ వైగుణ్యమును పోఁగొట్టునవి. అట్టి నీ దీప్తులు సేవింపఁదగిన మా హవిస్సులను బాగుగ సేవించుఁగాక. (ఇది పురోనువాక్య.)

6. అర్థము: హే సుభగే అగ్నే!=సౌభాగ్యయుక్తుఁడవైన ఓ యగ్నీ!, మానుషీః విశః=మనుష్యరూప ప్రజలు, హోత్రా విదమ్=హోమవిశేషమును తెలిసినవాఁడవును, వివిచిమ్=మిశ్రితములయిన అగ్నులను వేరుచేయువాఁడ వును, రత్నధాతమమ్=రత్నమట్యాది ధనములను అతిశయముగ సంపాదించువాఁడవును, గుహా=గోప్యము లైన మంత్రములందు, సన్తమ్=ఉంటున్నవాఁడవును, విశ్వదర్శతమ్=విశ్వమును ప్రదర్శింపఁజేయువాఁడ వును, తువిష్మణసమ్=మిక్కిలి ప్రవృద్ధమైన మనస్సు కలవాఁడవును, సుయజమ్=బాగుగ యాగము చేయుట

కర్తుఁడవును, ఘృతశ్రియమ్–ఘృతమును సేవించువాఁడవుననగు, త్వామ్–నిన్ను, ఈడతే–స్తుతించుచున్నారు.

తాత్పర్యము: సౌభాగ్యయుక్తుఁడవైన ఓ యగ్నీ! మనుష్యరూప ప్రజలు నిన్ను స్తుతించుచున్నారు. నీవు హోమవిశేషమును తెలిసినవాఁడవు. నీతో మిశ్రితములైన అగ్నులను వేరుచేయువాఁడవు. రత్నములు మున్నగు ధనములను సంపాదించువాఁడవు. గోప్యములైన మంత్రములయం దుంటున్నవాఁడవు. విశ్వప్రదర్శకుఁడవు. మిక్కిలి వృద్ధినొందిన మనస్సు కలవాఁడవు. బాగుగ యాగము చేయుట కర్తుఁడవు. ఘృతమును సేవించువాఁడవు.

7. అర్థము: ధాతా–విశ్వమును ధరింపఁజేయువాఁడును, జగతస్పతిః=జగత్తునకు పాలకుఁడునగు పరమేశ్వరుఁడు, నః–మాకొఱకు, రయిమ్=ధనమును, దదాతు=ఒసఁగుఁగాక. సః=ఆ పరమేశ్వరుఁడు, నః–మమ్ము, పూర్ణేన–సంపూర్ణ ధనముతో, వావనత్=బాగుగ కలుపుఁగాక.

తాత్పర్యము: విశ్వధాతయు, జగత్పాలకుఁడునగు పరమేశ్వరుఁడు మాకు ధనము నొసఁగుఁగాక. ఆ పరమేశ్వరుఁడు మమ్ము సంపూర్ణ ధనముతో బాగుగ కలుపుఁగాక. (సంపూర్ణ ధనవంతుని జేయుఁగాక అని యర్థము. ఇటనుండి దేవికాఖ్య హవిస్సులకు యాజ్యానువాక్యలు చెప్పఁబడుచున్నవి. "దేవికా నిర్వపే త్ప్రజాకామః" ఇత్యాదులందు దేవికా హవిస్సులు చెప్పఁబడినవి. తత్ప్వరూప మచటనే చెప్పఁబడినది. ఇది పురోనువాక్య.)

8. అర్థము: ధాతా=విశ్వధాతయైన పరమేశ్వరుఁడు, ప్రజాయాః–పుత్రాదులయిన ప్రజలకు, ఉత–మఱియు, రాయః–ధనమునకు, ఈశే–స్వామి యగుచున్నాఁడు. ధాతా=ధాత, ఇదం విశ్వం భువనమ్–ఈ సర్వప్రాణిజాతమును, జజాన–పుట్టించెను. (సః)ధాతా=ఆ ధాత, యజమానాయ–యజమానునికొఱకు, పుత్రమ్=పుత్రుని, దాతా–ఈయఁగలఁడు. తస్మై ఉ=ఆ ధాతకొఱకే, హవ్యమ్=(ఈ) హవిస్సును, ఘృతవత్=ఘృతయుక్తముగా, విధేమ–చేయుదుము. (దాతా="డు–దాఞ్=దానే" అను ధాతువునకు ఇది లుడ స్తరూపము.)

తాత్పర్యము: విశ్వధాతయైన పరమేశ్వరుఁడు పుత్రాది ప్రజానీకమునకు, ధనమునకు స్వామి. ఆ ధాత ఈ సమస్త ప్రాణిజాతమును పుట్టించెను. అతఁడు యజమానునకు పుత్రు నీయఁగలఁడు. అటువంటి దేవునికొఱకే ఈ హవిస్సును ఘృతయుక్తముగఁ జేయుదుము. (ఇది యాజ్య.)

9. అర్థము: ధాతా=ధాతయైన యీశ్వరుఁడు, జీవాతుమ్–జీవనమునకు సరిపోవునట్టియు, అక్షితామ్–క్షీణము కానిదియు, ప్రాచీమ్–మా కెక్కువ అనుకూలమైనదియునగు, రయిమ్–ధనమును, నః–మాకొఱకు, దదాతు–ఒసఁగుఁగాక. సత్యరాధసః=యజ్ఞముచే నారాధించునట్టి, వయమ్–మేము, దేవస్య–(అటువంటి)దేవునియొక్క, సుమతిమ్=అనుగ్రహ యుక్తమైన చిత్తమును, ధీమహి=ప్రార్థింతుము.

తాత్పర్యము: విశ్వధాతయైన యీశ్వరుఁడు జీవనమునకు సరిపోవునదియు, క్షీణించనిదియు, మాకు ఎక్కువ అనుకూలమైనదియునగు ధనమును మా కొసఁగుఁగాక. యజ్ఞముచే నారాధించునట్టి మేము అటువంటి దేవునియొక్క అనుగ్రహయుక్త చిత్తమును ప్రార్థింతుము. (ఇదియు పురోనువాక్యయే.)

10. అర్థము: ధాతా=ధాత, ప్రజాకామాయ–సంతానకాముఁడును, దురోణే=(స్వ)గృహమునందు, మీఢుషే–(ఆజ్యముచే దేవతలను) సేవించుచున్న వాఁడును, దాశుషే=హవిస్సు నిచ్చుచున్నవాఁడునగు యజమానునికొఱకు, వసూని=ధనములను, దదాతు–ఒసఁగుఁగాక. అమృతాః–మరణ రహితులైన, విశ్వే దేవాసః–సర్వ దేవతలు, సజోషాః–సమాన ప్రీతి గల, అదితిః=అదితి దేవత, దేవాశ్చ=దేవతలును, తస్మై–ఆ యజమానుని కొఱకు, సంవ్యయన్తామ్–(ఆ యజమాన గృహమునందు) కూడియుందురు గాక.

తాత్పర్యము: ధాత సంతానకాముఁడును, స్వగృహమునందు దేవతల నాజ్యముచే సేవించుచున్న వాఁడును, హవిస్సు నిచ్చుచున్నవాఁడునగు యజమానుని కొఱకు ధనముల నొసఁగుఁగాక. మరణము లేనివారైన సర్వ దేవతలు

సమానప్రీతి గల అదితి దేవతయు అటువంటి యజమానునికొఱకు అతని గృహమునందు కూడియుండురు గాక. (ఇది యాజ్య.)

11. అర్థము: అద్య=ఈ యజ్ఞమునందు, (ఇయమ్) అనుమతిః=ఈ అనుమతి శబ్దాభిధేయ దేవత, నః=మాయొక్క, యజ్ఞమ్=యజ్ఞమును. దేవేషు=దేవతలయందు (దేవతల యెదుట), అనుమన్యతామ్=ప్రశంసించుఁగాక. హవ్యవాహనః=హవిస్సును వహించునట్టి, అగ్నిశ్చ=అగ్నియు, దాశుషే=హవిస్సు నొసఁగు యజమానుని కొఱకు, మయః=సుఖమును, భవతామ్=భావన చేయుఁగాక.

తాత్పర్యము: అనుమతి శబ్దాభిధేయయగు దేవత మా యీ యజ్ఞమును దేవతల యెదుట ప్రశంసించుఁగాక. హవ్యవాహనుఁడగు నగ్నియు హవిస్సు నొసఁగు యజమానునికొఱకు సుఖమును భావన చేయుఁగాక. (భవతామ్=భవతాత్ అని యర్థము. ఏకత్వార్థే ద్వివచనము ఛాందసము. ఇది పురోనువాక్య.)

12. అర్థము: హే అనుమతే!=ఓ అనుమతి దేవతా!, త్వమ్=నీవు, అన్విత్ మాన్యాసై=అన్ని విధముల ననుమతించుము. చ=మఱియు, నః=మాకు, శమ్=సుఖమును, కృధి=చేయుము. (కించ=మఱియు), నః=మాయొక్క, దక్షాయ క్రత్వే=సమృద్ధమైన క్రతువునందు, హిను=ప్రీతియుక్త వగుము. (కించ=మఱియు), నః=మాకు ఆయూంషి=చిరకాల జీవనములను, ప్రతారిషః=గొప్పగా సంపాదించుము.

తాత్పర్యము: ఓ అనుమతి దేవతా! నీవు అన్ని విధముల ననుమతించుము. మఱియు మాకు సుఖమును కలుగఁజేయుము. మా సమర్థమైన యజ్ఞమునందు ప్రీతితో నుండుము. మాకు చిరకాల జీవనములను గొప్పగా సంపాదించుము. (దక్షాయ=దక్షే. క్రత్వే=క్రతౌ అని యర్థము. ఇది యాజ్య.)

13. అర్థము: అనుమన్యమానా=అనుమతించుచున్న, (సా ఇయమ్=ఆ యీ అనుమతిదేవి), ప్రజావన్తమ్=పుత్రాది ప్రజలు కలదియు, అక్షీయమాణామ్=క్షయరహితమునగు, రయిమ్=ధనమును, అనుమన్యతామ్=అనుమతించుఁ గాక. వయమ్=మేము, తస్యై=ఆ అనుమతిదేవియొక్క (షష్ఠ్యర్థే చతుర్థీ), హేడసి అపి=క్రోధము నందుఁ గూడ (అపి శబ్దమువలన ఔదాసీన్యమునందు కూడ), మా భూమ=ఉండకుందుము గాక. సా దేవీ=ఆ అనుమతిదేవి, సుహవా=బాగుగ నాహ్వానించుటకు సాధ్యయగుచు, నః=మాకొఱకు, శర్మ=సుఖ మును, యచ్ఛతు=ఒసఁగుఁగాక.

తాత్పర్యము: అనుమతించుచున్న ఆ ఈ యనుమతి దేవి పుత్రాది ప్రజలు కలదియు, క్షీణించనిదియునగు ధనపుష్టిని అనుమ తించుఁగాక. మేము ఆ యనుమతిదేవియొక్క కోపమునందుఁగూడ పడకుందుము గాక. అపిశబ్ద సామర్థ్యము వలన ఆమె యౌదాసీన్యమునకును గుఱికాకుందుము గాక. అనఁగా ఆమె యనుగ్రహమునకు పాత్రుల మగుదుము గాక యని భావము. ఆ యనుమతిదేవి బాగుగ నాహ్వానించుటకు సాధ్యయై మాకు సుఖము నొసఁగుఁగాక. (ఇది పురోనువాక్య.)

14. అర్థము: యత్=ఏ జగత్తు, విరోచతే=అనేక విధములుగ ప్రకాశించుచున్నదో, (తత్) ఇదమ్=ఆ యీ జగత్తు, ప్రదిశి=గొప్పగా ఆజ్ఞాపించునట్టి, యస్యామ్=ఏ యనుమతి దేవియందు, (వర్తతే=ఉంటున్నదో, తామ్=ఆ), అను మతిం ప్రతి=అనుమతీదేవిని గూర్చి, ఆయవః=వెళ్లుచున్నట్టి యజమానులు, భూషన్తి=(హవిస్సులచే) అలంకరించుచున్నారు. యస్యాః=ఏ యనుమతీదేవియొక్క, ఉపస్థే=శరీరైక దేశమునందు, ఉరు=మహాంతమైన, అన్తరిక్షమ్=ఆకాశము, (వర్తతే=ఉంటున్నదో), సా దేవీ=ఆ యనుమతీదేవి, సుహవా=బాగుగ నాహ్వానించుటకు సాధ్యయగుచు, నః=మాకొఱకు, శర్మ=సుఖమును, యచ్ఛతు=ఒసఁగుఁగాక.

తాత్పర్యము: వివిధముగ భాసించుచున్న జగత్తు అనుమతీదేవ్యాజ్ఞాబద్ధమై యున్నది. అట్టి అనుమతీదేవియొద్దకు యాగ కర్తలు వచ్చి ఆమెను హవిస్సులచే నలంకరించుచున్నారు. (ఆమె నుద్దేశించి హవిస్సులను హోమము చేయుచున్నారని భావము). ఈ మహాంతమైన యంతరిక్ష మంతయు ఆ యనుమతీదేవి శరీరైకదేశస్థానీ

యమే. అట్టి ఆ యనుమతీదేవి బాగుగ నాహ్వానించుటకు సాధ్యయై మాకు సుఖము నొసఁగుఁగాక. (ఇది యాజ్య.)

15. అర్థము: సుహవామ్=సుఖముగ ఆహ్వానించుటకు శక్యయైన, రాకామ్=రాకాదేవిని, అహమ్=నేను, సుష్టుతీ=మంచి స్తుతిచేత, (తృతీయార్థే ప్రథమా.) హువే=ఆహ్వానించుచున్నాను. సుభగా=సౌభాగ్య యుక్తయైన, (సౌ-ఆ రాకాదేవి), నః=మాయొక్క, (ఆహ్వానమ్=ఆహ్వానమును), శృణోతు=వినుఁగాక. (శ్రుత్వా చ-వినియు), త్మనా=స్వయముగా, బోధతు=మా అభిమతమును తెలిసికొనుఁగాక. (కించ=మఱియు), అచ్ఛిద్యమానయా=అవిచ్ఛిన్నమైన, సూచ్యా=సూచీసదృశమైన అనుగ్రహబుద్ధిచే, అవః=కర్మను, సీవ్యతు=నిబిడముగ (నిర్దోషముగ) చేయుఁగాక. (తతః=పిమ్మట), శతదాయమ్=బహుధనమును, ఉక్థ్యమ్=స్తోత్రశస్త్రాది సహితుఁడగు, వీరమ్=వీరుఁడైన పుత్రుని, దదాతు=ఒసఁగుఁగాక.

తాత్పర్యము: సుఖముగ నాహ్వానించుటకు సాధ్యయైన రాకాదేవిని నేను ఆహ్వానించుచున్నాను. సౌభాగ్యయుక్తయగు ఆ రాకాదేవి మా యాహ్వానము నాలకించుఁగాత. ఆలకించి మా యభీష్టమును తెలిసికొనుఁగాక. మఱియు అవిచ్ఛిన్నమైన సూచీసదృశమైన అనుగ్రహబుద్ధితో మా యీ కర్మను నిర్దోషముగఁ జేయుఁగాక. పిమ్మట బహుధనమును, స్తోత్రశస్త్రాది సహితపుత్రుని ఒసఁగుఁగాత. (ఇది తృతీయ హవిస్సునకు పురోనువాక్య.)

16. అర్థము: సుభగే!=సౌభాగ్యవతివియైన, హే రాకే!=ఓ రాకాదేవీ!, తే=నీయొక్క, యాః సుమతయః=ఏ మంచి బుద్ధులు, సుపేశసః=శోభన క్రియాయుక్తములై, (సన్తి=ఉంటున్నవో, కించ=మఱియు), యాభిః=ఏ సుమతులచేత, దాశుషే=హవిర్దాతయగు యజమానునికొఱకు, వసూని=ధనములను, దదాసి=ఇచ్చుచున్నావో, (అథ=పిమ్మట), అద్య=ఈ యజ్ఞమునందు, సుమనా=సౌమనస్యము కలదానవై, తాభిః=ఆ యనుగ్రహరూపములైన సుమతులచేత, సహస్రపోషమ్=సహస్ర సంఖ్యాకముగ పుష్టిని, రరాణా=ఇచ్చుచు, నః=మమ్ము, ఉపాగహి=అనుగ్రహించుము.

తాత్పర్యము: సౌభాగ్యవతివగు ఓ రాకాదేవీ! నీ మంచిబుద్ధులు శోభన క్రియాయుక్తములైయుంటున్నవి. నీవు ఆ సుమతులతో యజమానునకు ధనముల నొసఁగుచున్నావు. ఈ యజ్ఞమునందు సౌమనస్యము కలదానవై అనుగ్రహ రూపములయిన ఆ సుమతులచే సహస్రసంఖ్యాకముగ పుష్టిని కలుగఁజేయుచు మమ్మనుగ్రహించుము. (ఇది యాజ్య.)

17. అర్థతాత్పర్యములు: సినీవాలి అనునది "సినీవాలి పృథుష్టుకే" ఇత్యాది పురోనువాక్యకు ప్రతీక. "యా సుపాణిః" అనునది, "యా సుపాణిః స్వఙ్గురిః" అను యాజ్యకు ప్రతీక. ఈ యుభయము "అగ్నినా రయిమశ్నవత్" అను అనువాకమునందు వ్యాఖ్యానింపఁబడినది. చతుర్థ హవిస్సునందలి యాజ్యాపురోనువాక్యల కివి రెండును ప్రతీకలు.

18. అర్థము: సుభగామ్=సౌభాగ్యయుక్తయు, విద్మనాపసమ్=కర్మలను తెలిసినదియు, సుహవామ్=సుఖముగ నాహ్వానించుటకు సాధ్యయైనదియునగు, కుహూమ్=కుహూ శబ్దాభిధేయయగు దేవతను, అహమ్=నేను, అస్మిన్ యజ్ఞే=ఈ యజ్ఞమునందు, జోహవీమి=ఎక్కువగ ఆహ్వానించుచున్నాను. సా=ఆ కుహూదేవి, నః పితౄణామ్=మా పూర్వులయొక్క, శ్రవణమ్=వినుటకు యోగ్యమైన, (యశః=కీర్తిని), దదాతు=ఇచ్చుఁగాక. హే దేవి!=ఓ కుహూదేవీ!. తస్యాః=(అటువంటి) ఆ, తే=నీకు, హవిషా=హవిస్సుచేత, విధేమ=పరిచర్య చేయుదుము.

తాత్పర్యము: నేను ఈ యజ్ఞమునందు 'కుహూ' అనెడి దేవత నత్యంతము ఆహ్వానించుచున్నాను. ఆ కుహూదేవత సౌభాగ్యయుక్త కర్మలను తెలిసినది. సుఖముగ నాహ్వానించుటకు సాధ్య యైనది. ఆ కుహూదేవత మా పూర్వులయొక్క శ్రవణయోగ్యమైన కీర్తి నొసఁగుఁగాక. ఓ కుహూదేవీ! అటువంటి నీకు మేము హవిస్సుచే పరిచర్య చేయుదుము. (ఇది పంచమ హవిస్సునకు పురోనువాక్య.)

19. అర్థము: దేవానామ్=దేవతల సంబంధియగు, అమృతస్య=దర్శపూర్ణమాసాది హవీరూపమైన అమృతమును, (కర్మణి షష్ఠీ.) పత్నీ=పాలించునదియు, హవ్యా=ఆహ్వానము నడుగుట కర్హమైనదియునగు, కుహూః=కుహూ దేవత, నః=మాయొక్క, అస్య హవిషః=ఈ హవిస్సుయొక్క, చికేతు=సారమును తెలిసికొనుగాక. (తాదృశీ దేవీ=అటువంటి కుహూదేవి), దాశుషే=హవిస్సు నిచ్చు యజమానునికొఱకు, భూరి=గొప్పదియైన, వామమ్=భజనీయమైన పారలౌకిక ఫలమును, సంకిరతు=బాగుగ నొసఁగుగాక. (కిం చ=మఱియు), చికితుషే=నీ మహిమను తెలిసికొనిన యజమానునికొఱకు, రాయస్పోషమ్=ధనపుష్టిని, దధాతు=సంపాదించుఁ గాక.

తాత్పర్యము: కుహూదేవత మా యీ హవిస్సుయొక్క సారమును తెలిసికొనుఁగాక. ఆ కుహూ దేవత దేవతల దర్శపూర్ణ మాసాది హవీరూపమైన అమృతమును పాలించునది. ఆహ్వానమును గూర్చి అడుగుటకు అర్హమైనది. అటువంటి కుహూదేవి హవిర్దాతయగు యజమానునకు గొప్పదియైన భజనీయ పారలౌకిక ఫలమును బాగుగ నొసఁగుఁగాక. మఱియు ఓ దేవీ! నీ మహిమను తెలిసికొనిన యజమానునకు ధనపుష్టిని సంపాదించుము. (ఇది పంచమ హవిస్సునకు యాజ్య.)

ఏకాదశానువాకము సమాప్తము.

తృతీయప్రపాఠకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే చతుర్థః ప్రపాఠకః।

### తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]వివా ఏతస్య యజ్ఞ ఋధ్యతే యస్య హవిరతిరిచ్యతే సూర్యో దేవో దివిషద్భ్య ఇత్యాహ బృహస్పతినా చైవాస్య ప్రజాపతినా చ యజ్ఞస్య వ్యృద్ధమపి వపతి [2]రక్షాగ్ంసి వా ఏతత్పశుగ్ం సచన్తే యదేకదేవత్య ఆలబ్ధో భూయాన్భవతి యస్యాస్తే హరితో గర్భ ఇత్యాహ దేవత్రైవైనాం గమయతి రక్షసా మపహత్యా [3]ఆ వర్తన వర్తయేత్యాహ (౧)బ్రహ్మణైవైనమా వర్తయతి [4]వి తే భినద్మి తకరీమిత్యాహ యథాయజురేవైత [5]దురుద్రప్సో విశ్వరూప ఇన్దురిత్యాహ ప్రజా వై పశవ ఇన్దుః ప్రజయైవైనం పశుభిః సమర్ధయతి [6]దివం వై యజ్ఞస్య వ్యృద్ధం గచ్ఛతి పృథివీ మతిరిక్తం తద్యన్న శమయే దార్తిమార్ఛే ద్యజమానో మహీ ద్యౌః పృథివీ చ న ఇతి (౨)ఆహ ద్యావాపృథివీభ్యామేవ యజ్ఞస్య వ్యృద్ధం చాతిరిక్తం చ శమయతి నాఽఽర్తి మార్ఛతి యజమానో [7]భస్మనాఽభి సమూహతి స్వగాకృత్యా అథో అనయోర్వా ఏష గర్భో ఽనయో రేవైనం దధాతి [8]యదవద్యేదతి తద్రేచయే ద్యన్నావద్యే త్పశోరాలబ్ధస్య నావద్యే త్పురస్తాన్నాభ్యా అన్యదవద్యే దుపరిష్టా దన్యత్పురస్తాద్వై నాభ్యై (౩)ప్రాణ ఉపరిష్టా దపానో యావానేవ పశు స్తస్యావద్యతి [9]విష్ణవే శిపివిష్టాయ జుహోతి యద్వై యజ్ఞస్యాతిరిచ్యతే యః పశోర్భూమా యా పుష్టిస్తద్విష్ణుః శిపివిష్టోఽతిరిక్త ఏవాతిరిక్తం దధాత్యతిరిక్తస్య శాన్త్యై [10]అష్టాప్రూడ్ఢిరణ్యం దక్షిణా ఽష్టాపదీ హ్యేషాఽఽత్మా నవమః పశో రాప్త్యై [11]అన్తరకోశ

ఉష్ణీషేణాఽఽవిష్టితం భవత్యేవమివ హి పశురుల్బమివ చర్మేవ మాగ్ంసమివాస్థీవ యావానేవ

పశు స్తమాప్త్వాఽవ రున్ధే[2]యస్యైషా యజ్ఞే ప్రాయశ్చిత్తిః క్రియత ఇష్ట్వా వసీయాన్భవతి ॥ ౪॥

(వర్తయేత్యాహ న ఇతి వై నాభ్యా ఉల్బమివేకవిగ్ంశతిశ్చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థ ప్రపాఠకే ప్రథమోఽనువాకః ।

## వేదార్థదీపిక

**అవతారిక:** తృతీయ ప్రపాఠకమునందు సోమయాగశేషము కొంతయు, కర్మాంతరమును చెప్పఁబడినవి. ఈ చతుర్థ ప్రపాఠకము నందు నైమిత్తికకర్మ, పశ్విష్టి దర్వీహోమములు చెప్పఁబడుచున్నవి. ఈ యనువాకమునందు తృతీయ ప్రపాఠకగత దశమానువాక మంత్రములు వ్యాఖ్యానింపఁబడుచున్నవి.

1. **అర్థము:** యస్య—ఏ యజమానునియొక్క, హవిః—హవిస్సు, అతిరిచ్యతే—అధిక మగుచున్నదో, ఏతస్య—ఈ యజమానునియొక్క, యజ్ఞః—యజ్ఞము, వ్యృధ్యతే వా—విగుణమే యగుచున్నది. "సూర్యో దేవో దివిషద్భ్యః" ఇత్యాహ—"సూర్యోదేవ" ఇత్యాది మంత్రముచే, హోమే కృతే సతి—హోమము చేయఁబడిన దగుచుండఁగా, బృహస్పతినా ప్రజాపతినా చ—"సూర్యో దేవ" ఇత్యాది మంత్రోక్తులయిన బృహస్పతి ప్రజాపతులచే, అస్య యజ్ఞస్య—ఈ విగుణమైన యజ్ఞముయొక్క, వ్యృద్ధమపి—వైగుణ్యము కూడ, వపతి—సవరింపఁజేయఁబడిన దగుచున్నది.

**తాత్పర్యము:** ప్రాయశ్చిత్త విశేష కర్మయందు ఆలంభనము చేయఁబడు మేఁకయొక్క శరీరము హవిస్సుగా సంకల్పింపఁబడియున్నది. ఆలంభనానంతరము అది చూఁడిది యని నిశ్చిత మైనపుడు గర్భస్థ శిశువు కూడ నుండుటచే సంకల్పిత హవిస్సుకంటె నధికముగ హవిస్సు ఏర్పడుచున్నది. అట్టి సమయమున ఆ యజమానుని యజ్ఞము విగుణ మగును. తద్దోష పరిహారమునకై "సూర్యో దేవ" ఇత్యాది మంత్రముచే హోమము చేయవలెను. ఆ మంత్రమునందలి 'బృహస్పతి' 'ప్రజాపతి' శబ్దములచే యజ్ఞముయొక్క వైగుణ్యదోషము పరిహృత మగును.

2. **అర్థము:** ఏకదేవత్యః ఆలబ్ధః—ఒక దేవత నుద్దేశించి ఉపాకృతమైన పశువు, భూయాన్ భవతి యత్—(గర్భధారణము చేత) అధికమైన దగుట యేది కలదో, ఏతత్—ఇందువలన, రక్షాంసి వా—రాక్షసులే, పశుమ్—(పూర్వోక్త) పశువును, సచన్తే—సంపూర్ణముగఁబొందుచున్నారు. రక్షసామ్—రాక్షసులయొక్క, అపహత్యై—నాశముకొఱకు, "యస్యాస్తే హరితో గర్భః" ఇత్యాహ—'యస్యాస్తే' ఇత్యాది మంత్రముచే (పశువు ననుమంత్రించుటచే), దేవత్రైవ—దేవతల యందే, (యజమానః—యజమానుఁడు) ఏనామ్—ఈ పశను (పశువిశేషమును), గమయతి—పొందించుచున్నాఁడు.

**తాత్పర్యము:** ఒక దేవత నుద్దేశించి ఉపాకృతమైన పశువు గర్భధారణముచేత అధికమైన హవిస్సు అగుటవలన రాక్షసులే ఆ పశువును పొందుదురు. రాక్షస నాశమునకై "యస్యాస్తే హరితో గర్భః" ఇత్యాది మంత్రముచే ఆ పశువు ననుమంత్రించుటచే యజమానుఁడు ఆ పశువును దేవతలకుఁ జెందునట్లు చేసిన వాఁ డగుమ.

3. అర్థము: (యజమానః—యజమానుఁడు), "ఆవర్తన వర్తయేత్యాహ"="అవర్తన వర్తయ" అనెడి, బ్రహ్మణైవ—మంత్రముచేతనే, ఏనమ్—ఈ పశుగర్భమును, ఆవర్తయతి—ఆవర్తనము చేయవలెను.

తాత్పర్యము: యజమానుఁడు "ఆవర్తన వర్తయ" ఇత్యాది మంత్రము నుచ్చరించుచు పశుగర్భ పర్యావర్తనము చేయవలెను. (ఆవర్తనము—చుట్టు కదలించుట)

4. అర్థము: "ప్రజాః—ప్రజలు, పశవః—పశువులు, ఇన్దురైవ—ఐశ్వర్యరూపములే. "ఉరుద్రప్సో విశ్వరూప ఇన్దుః" ఇత్యాహ—ఆలభ్యమాన పశువుయొక్క అవయవ సంఘాతము బహుసారము కలది, నానారూపములు కలది, శుక్ర మైనది యని "ఉరుద్రప్స" ఇత్యాది మంత్రము చెప్పుటచే, (యజమానః—యజమానుఁడు), ఏనమ్—ఈ రసమును, ప్రజయా—ప్రజచేతను, పశుభిః—పశువులచేతను, సమర్ధయత్యేవ—నిశ్చయముగ సమృద్ధముగ జేయుచున్నాఁడు.

తాత్పర్యము: "ఇది—పరమైశ్వర్యే" అను ధాతువునుండి ఇందు శబ్దము ఉత్పన్న మగుటచేత పశువుయొక్క అవయవ సంఘాతము ఐశ్వర్యరూపము అని ఈ మంత్రమునందలి ఇందు శబ్దమువలన స్పష్ట మగుచున్నది. ఇచట ఇందుశబ్ద ప్రయోగముచేత యజమానుఁడు ప్రజాపశువులచే ఈ రసమును సమృద్ధముగఁ జేయుచున్నవాఁ డగును.

5. అర్థము: యజ్ఞస్య—యజ్ఞముయొక్క, యత్—ఏ యంగము, వ్యృద్ధమ్—న్యూన (అల్ప) మైనదో (తత్—ఆ యంగము), దివం వై—స్వర్గమునే, గచ్ఛతి—పొందుచున్నది. అతిరిక్తమ్—అధికమైన యంగము, పృథివీమ్—భూమిని, గచ్ఛతి—పొందుచున్నది. తత్—దానిని, న శమయేత్ యత్—శమింపఁజేయనిచో, యజమానః—యజమానుఁడు, ఆర్తిమ్—పీడను, ఆర్ఛేత్—పొందును. "మహీ ద్యౌః పృథివీ చ న" ఇత్యాహ—"మహీ ద్యౌః" ఇత్యాదికమైన అభిసమూహన మంత్రముచేత, యజమానః—యజమానుఁడు, యజ్ఞస్య—యజ్ఞముయొక్క, వ్యృద్ధం చ—అల్ప మైనదియు, అతిరిక్తం చ—అధిక మైనదియునగు నంగమును, ద్యావాపృథివీభ్యామేవ—ద్యావాభూములచేతనే, శమయతి—శమింపఁ (సమముగఁ) జేయుచున్నాఁడు. యజమానః—యజమానుఁడు, ఆర్తిమ్—పీడను, న ఆర్ఛతి—పొందుట లేదు.

తాత్పర్యము: యజ్ఞాంగము అల్పమైనచో అది స్వర్గమును పొందును. అతిరిక్తమైన యంగము భూమినే చెందును. ఆ న్యూనాతిరిక్తత్వమును సరిచేయనిచో యజమానుఁడు వ్యథ నొందును. అందువలన యజమానుఁడు "మహీ ద్యౌః పృథివీ చ నః" ఇత్యాది మంత్రముచే అభిసమూహనము చేసినచో యజమానుఁడు న్యూనాతిరిక్తమైన యజ్ఞాంగమును ద్యావాభూములచేతనే శమింపఁజేసినవాఁడగును. అప్పుడు యజమానుఁడు వ్యథ చెందఁడు.

6. అర్థము: యజమానః—యజమానుఁడు, (గర్భమ్—ఛాగియొక్క గర్భమును), స్వగాకృత్యై—ఆత్మసాత్కారముకొఱకు, భస్మనా—(చల్లని) బూడిదతో, అభిసమూహతి—అంతటను ఆచ్ఛాదించవలెను. అథో—మఱియు, ఏషః గర్భః—ఈ గర్భము, అనయోర్వా—ఈ ద్యావాపృథువులయందే, (సముత్పన్నః—బాగుగ పుట్టినది. అతః—ఇందువలన,) అనయోరేవ—ఈ ద్యావాభూములయందే, ఏనమ్—ఈ గర్భమును, దధాతి—స్థాపించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: ఛాగియొక్క ఆత్మసాత్కారముకొఱకు దాని గర్భమును చల్లని బూడిదతో నంతటను ఆచ్ఛాదించవలెను. ఈ గర్భము ద్యావాభూములయందే సముత్పన్నమైనది కావున ఈ అభిసమూహన మంత్రముచే భస్మముతో నాచ్ఛాదనము చేయుటవలన ద్యావాభూములయందే యజమానుఁడు ఈ గర్భమును స్థాపించినవాఁ డగును.

7. అర్థము: గర్భస్య హృదయాద్యంగమ్—గర్భముయొక్క హృదయాద్యంగమును, అవద్యేత్ యత్—అవదానము చేయునెడల, తత్—ఆ హవిస్సు, అతిరేచయేత్—అతిరిక్త మగును. నావద్యేత్ యత్—అవదానము చేయనిచో, ఆలబ్ధస్య పశోః—ఆలంభనము చేయఁబడిన పశువునకు, (వపాదికము) నావద్యేత్—అవదానము చేయనట్లగును. (అతః—ఇందువలన, తదుభయదోష పరిహారాయ—ఆ రెండుదోషముల పరిహారమునకై), నాభ్యాః—నాభియొక్క, పురస్తాత్—ముందుభాగమునుండి, అన్యత్—కొంచె మంగమును, అవద్యేత్—అవదానము చేయు

వలెను. ఉపరిష్టాత్=పై భాగమునుండి, అన్యత్=కొంచె మంగమును, అపద్యేత్=అవదానము చేయవలెను. నాభ్యై=నాభియొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ.) పురస్తాత్ ముందుభాగమునుండి, ప్రాణః=ప్రాణవాయువు, ముఖే=ముఖమునందు, సఞ్చరతి వా=సంచరించుచున్నది కదా! ఉపరిష్టాత్=పై భాగమునుండి, అపానః=అపాన వాయువు, (పుచ్ఛే=పుచ్ఛ భాగమునందు, సఞ్చరతి=సంచరించుచున్నది. (ఏవం కృతే=ఇట్లు చేయఁబడినది కాఁగా), యావానేవ పశుః=పశువు ఎంత కలదో, తస్య=ఆ సర్వపశువుయొక్క (అంగమును), అవద్యతి=అవదానము చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: అలబ్ధ పశుగర్భముయొక్క హృదయాద్యంగమును అవదానము చేసినచో, పశుహృదయాదికమునుబట్టి హవిస్సు అతిరిక్త మగును. తద్దోష పరిహారమునకై అవదానమే చేయనిచో అలబ్ధమైన పశువునుండి అవదానము చేయనట్లే యగును. కావున ఏతదుభయ దోష పరిహారమునకై అలబ్ధ పశువుయొక్క నాభియొక్క ముందుభాగమునుండి కొంచె మంగమును, నాభియొక్క పై భాగమునుండి కొంచె మంగమును అవదానము చేయవలెను. తిర్యక్కులకు నాభి ముందుభాగమునుండి ప్రాణవాయువు ముఖమునందు సంచరించుచుండును. నాభికి పై భాగమునుండి అపానవాయువు పుచ్ఛభాగమునందు సంచరించుచుండును. కావున అట్లు చేసిన యజమానుఁడు సర్వావదానము చేసినవాఁ డగును.

8. అర్థము: శిపివిష్టాయ=పశుస్వామియగు, విష్ణవే=విష్ణువుకొఱకు, జుహోతి=హోమము చేయవలెను. యజ్ఞస్య=యజ్ఞ (ముయొక్క) సంబంధియగు, యత్ వై=ఏ యంగమైతే, అతిరిచ్యతే=(ఉపాకృత పశువుకంటె) అతిరిక్త మగుచున్నదో, పశోః=పశువుయొక్క, యః భూమా=హవిరాధిక్య హేతువు ఏది కలదో, యా పుష్టిః=శరీరమునందు ఆధిక్య హేతువైన పుష్టి యేది కలదో, తత్=ఆ సర్వము, శిపివిష్టః=పశుస్వామియగు, విష్ణుః=విష్ణుస్వరూపము (విష్ణ్వధీనము). (విష్ణుముద్దిశ్య తద్ధోమే సతి=విష్ణువు నుద్దేశించి హోమము చేసినచో, యజమానః=యజమానుడు,) అతిరిక్తే ఏవ=అతిరిక్త హేతువునందే, అతిరిక్తమ్=అతిరిక్తమును, దధాతి=స్థాపించినవాఁ డగుచున్నాఁడు. తత్=అది, అతిరిక్తస్య=అతిరిక్తముయొక్క, శాన్త్యై=శాంతికొఱకు, (భవతి=అగుచున్నది.)

తాత్పర్యము: "యజ్ఞో వై విష్ణుః", "పశవః శిపిః" అను శ్రుత్యంతరము ననుసరించి, పశుస్వామియగు యజ్ఞదేవుఁడు విష్ణువు. అట్టి విష్ణువు నుద్దేశించి పశుగర్భముయొక్క దక్షిణ పూర్వపాదమును ఛేదించి హోమము చేయవలెను. పశువుయొక్క ఆధిక్య హేతువైనది యేది కలదో, యజ్ఞమునకు సంబంధించిన యే యంగము ఉపాకృత పశువుకంటె నధికమైనది ఏది కలదో, అది యంతయు విష్ణ్వధీనము. ఇట్లు హోమము చేసిన యజమానుఁడు అతిరిక్త హేతువునందే అతిరిక్తమును స్థాపించినవాఁ డగును. అది అతిరిక్తముయొక్క శాంతికొఱ కగును.

9. అర్థము: అష్టాప్రూట్=ఎనిమిది బిందువుల పరిమాణము గల, హిరణ్యమ్=బంగారము, దక్షిణా=(ఈ పశాలంభనము కల ప్రాయశ్చిత్తేష్టియందు) దక్షిణ (ఈయవలెను). ఏషా=ఈ పశయైన ఛాగి, అష్టాపదీ హి=(గర్భ సహిత కావున), ఎనిమిది పాదములు కలది కదా! ఆత్మా=(పశుదేహముకంటె భిన్నమైన) ఆత్మ, నవమః=తొమ్మిదవది. (ఏషా=ఈ దక్షిణ), పశోః=పశువుయొక్క, ఆప్త్యై=ప్రాప్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము: ఈ ప్రాయశ్చిత్తేష్టియందు ఎనిమిది బిందువుల పరిమాణము గల బంగారమును దక్షిణగా నీయవలెను. ఈ యిష్టియందు అలబ్ధమైన పశువు గర్భ సహితము కావున ఎనిమిది పాదములు కలది యగును. అష్టత్వసంఖ్య పశువునకు దక్షిణగా నీయఁబడు హిరణ్యమునకు సమానము. ఈ దక్షిణ పశుప్రాప్తి కారణ మగును.

10. అర్థము: (హిరణ్యమ్=దక్షిణగా నీయఁదగిన బంగారము) అన్తరకోశే=లోపలి భాగమున, ఉష్ణీషేణ=శిరోవేష్టనము (తలపాగా) చేత, ఆవిష్టితమ్=చుట్టఁబడినది, భవతి=కావలెను. ఏవమివ హి=ఈ విధముగానే, పశుః=గర్భ రూప పశువు, ఉల్బమివ=మావివలెను. చర్మేవ=చర్మమువలెను, మాంసమివ=మాంసమువలెను, అస్థీవ=ఎముక వలెను, అస్తి=ఉంటున్నది. (గర్భము ఉల్బాదుల నాల్గింటిచేతను ఆవరింపఁబడియుండునని భావము.)

పశుః=పశువు, యావాన్ ఏవ=ఎంత పరిమాణము కలదియో, తమ్=అంతటి పశువును, ఆప్త్వా=పొంది, అవరున్ధే=స్వాధీనము చేసికొనుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ ప్రాయశ్చిత్తేష్టియందు దక్షిణగా నీయఁదగిన బంగారమును యజమానుఁడు తలపాగాలో నాల్గవ మడతలో నుంచవలెను. అనఁగా పై పొరనుండి మూఁడవ పొర యేది కలదో దానియందు బంగారమునుంచి తలపాగాతో చుట్టవలెను. గర్భరూప పశువునకు పైని ఎముక, దానిపైని మాంసము, దానిపైని చర్మము, దానిపైని మావియు ఉండును కావున గర్భమునకుఁ బైని మూఁడు కోశము లుండును. గర్భము నాల్గవ కోశములో నుండును. తలపాగాలో నాల్గవ మడత లోపలనున్న హిరణ్యమునకు, నాల్గవ కోశముననున్న గర్భరూప పశువునకు ఈ విధముగ సాదృశ్య ముండుటచే ఆ హిరణ్యమును దక్షిణగా నిచ్చిన యజమానుఁడు సంపూర్ణ పశువును పొంది దానిని స్వాధీనము చేసికొనినవాఁ డగును.

11. అర్థము: యస్య=ఏ యజమానునియొక్క, యజ్ఞే=యజ్ఞమునందు, ఏషా ప్రాయశ్చిత్తిః=(వశాగర్భమును అపరాధ నిమిత్తముగాఁ జేసికొని) పూర్వోక్త హోమరూప ప్రాయశ్చిత్తి, క్రియతే=చేయఁబడుచున్నదో, (సః=ఆ యజమానుఁడు), ఇష్ట్వా=(ప్రాయశ్చిత్తముతో ప్రకృత) యజ్ఞము చేసి, వసీయాన్=మిక్కిలి ధనవంతుఁడు అగుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వోక్త విధముగ ప్రాయశ్చిత్త సహితముగ యజ్ఞము చేసిన యజమానుఁడు అత్యంత ధనవంతుఁ డగును.

ప్రథమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ద్వితీయోఽనువాకః ।

మూలము: [1]ఆ వాయో భూష శుచిపా ఉప నః సహస్రం తే నియుతో విశ్వవార। ఉపో తే అన్ధో మద్యమయామి యస్య దేవ దధిషే పూర్వపేయమ్। [2]ఆకూత్యై త్వా కామాయ త్వా సమృధే త్వా కిక్కిటా తే మనః ప్రజాపతయే స్వాహా కిక్కిటా తే ప్రాణం వాయవే స్వాహా కిక్కిటా తే చక్షుః సూర్యాయ స్వాహా కిక్కిటా తే శ్రోత్రం ద్యావాపృథివీభ్యాగ్ం స్వాహా కిక్కిటా తే వాచగ్ం సరస్వత్యై స్వాహా। (౧)[3]త్వం తురీయా వశినీ వశాఽసి సకృద్యత్త్వా మనసా గర్భ ఆశయత్। వశా త్వం వశినీ గచ్ఛ దేవాన్త్సత్యాః సన్తు యజమానస్య కామాః। [4]అజోఽసి రయిష్ఠా పృథివ్యాగ్ం సీదోర్ధ్వా ఽన్తరిక్షముప తిష్ఠస్వ దివి తే బృహద్భాః। [5]తన్తుం తన్వన్రజసో భానుమన్విహి జ్యోతిష్మతః పథో రక్ష ధియా కృతాన్। [6]అనుల్బణం వయత జోగువామపో మనుర్భవ జనయా దైవ్యం జనమ్। [7]మనసో హవిరసి ప్రజాపతేర్వర్ణో గాత్రాణాం తే గాత్రభాజో భూయాస్మ ॥ ౨ ॥ (సరస్వత్యై స్వాహా మనుస్త్రయోదశ చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

## వేదార్థదీపిక

అవతారిక: వశాగర్భ నిమిత్త హోమము ప్రథమానువాకమునందు చెప్పఁబడినది. ఈ ద్వితీయానువాకమునందు భూత్యాదులను కోరువానికి వశాలంభమునకై మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1\. అర్థము: హే వాయో!-ఓ వాయుదేవా!, (త్వమ్-నీవు, ఆగత్య-వచ్చి, పశుమ్-పశువును,) భూష-అలంకరించుము. హే శుచిపాః!-శుద్ధహవిః పాలకుఁడవైన ఓ దేవా!, (త్వమ్-నీవు), నః-మమ్ము, ఉపగచ్ఛ-(పొందుము) సమీపించుము. హే విశ్వవార!-విశ్వవ్యాపకుఁడవైన ఓ దేవా!, తే-నీకు, సహస్రమ్-సహస్ర సంఖ్యాకములైన, నియుతః-వాహనములైన అశ్వములు, (సన్తి=కలవు.) తే-నీకు, అన్ధః-పశురూపమైన అన్నము, మద్యమ్-సంతోషకరము. హే దేవ!-ఓ దేవా!, యస్య-ఏ పశువు (యొక్క) సంబంధమైన, (హవిః-

హవిస్సు, పూర్వపేయమ్ (ఇతి)–సోమరస సదృశమని, మనః–మనస్సును, దధిషే–ధరించితివో, (తాదృశేన హవిషా–అటువంటి హవిస్సుతో, త్వామ్–నిన్ను), అయామి–పొందుచున్నాను.

**తాత్పర్యము:** ఓ వాయుదేవా! నీవు వచ్చి పశువు నలంకరింపుము. శుద్ధహవిస్సును పాలించునట్టి ఓ దేవా! నీకు సహస్ర సంఖ్యాకముగ వాహనములైన అశ్వములు కలవు. నీకు పశురూపమైన అన్నము సంతోషకరము. ఓ దేవా! ఏ పశు సంబంధియగు హవిస్సు సోమసదృశమని మనస్సున భావించుచున్నావో, అటువంటి హవిస్సుతో నేను నిన్ను పొందుచున్నాను. (వాయుదేవతాకమైన పశువును ఈ మంత్రము చెప్పుచు నలంకరించవలెను.)

2. **అర్థము:** హే పశో!–ఓ పశువా!, ఆకూత్యై–మదీయ సంకల్పసిద్ధికొఱకు, త్వా–నిన్ను, (ప్రాప్య–పొంది), కామాయ–మదభీష్ట పాలనమునకై, త్వా–నిన్ను, (ప్రాప్య–పొంది), సమృధే–సమృద్ధి (సిద్ధించుట) కొఱకు, కిక్కిటా–కిక్కిటాకార పూర్వకముగ, తే–నీయొక్క, మనః–మనస్సును, ప్రీణయిత్వా–సంతోషపఱచి, ప్రజాపతయే–ప్రజాపతికొఱకు, స్వాహా–హోమము చేయఁబడుచున్న యీ హవిస్సు హుత మగుఁగాక. [2]ఆకూత్యై త్వా, ప్రాప్య కామాయ, త్వా, ప్రాప్య, సమృధే, త్వా, ప్రాప్య, కిక్కిటా, తే, ప్రాణమ్–ప్రాణమును, ప్రీణయిత్వా, వాయవే–వాయువుకొఱకు, స్వాహా. [3]ఆకూత్యై, త్వా, ప్రాప్య, కామాయ, త్వా, ప్రాప్య, కిక్కిటా, తే, చక్షుః–చక్షురింద్రియమును, ప్రీణయిత్వా, సూర్యాయ–సూర్యదేవునికొఱకు, స్వాహా, [4]ఆకూత్యై, త్వా, ప్రాప్య, కామాయ, త్వా, ప్రాప్య, సమృధే, త్వా, ప్రాప్య, కిక్కిటా, తే, శ్రోత్రమ్–శ్రోత్రేంద్రియమును, ప్రీణయిత్వా, ద్యావాపృథివీభ్యామ్–ద్యావాపృథివీ దేవతలకొఱకు, స్వాహా. [5]కామాయ, త్వా, ప్రాప్య, సమృధే, త్వా, ప్రాప్య, కిక్కిటా, తే, వాచమ్–వాగింద్రియమును, ప్రీణయిత్వా, సరస్వత్యై–సరస్వతీదేవతకొఱకు, స్వాహా.

**తాత్పర్యము:** ఓ పశువా! మదీయ సంకల్పసిద్ధికొఱకు, అభీష్టసిద్ధినిమిత్తము, సమృద్ధికొఱకును, నిన్ను పొంది నీదగ్గఱకుఁ జేరి నీయొక్క మనస్సును, ప్రాణమును, చక్షుశ్శ్రోత్ర వాగింద్రియములను కిక్కిటాకార పూర్వకముగ సంతోషపఱచి ప్రజాపత్యాది దేవతలకొఱకు హోమము చేయఁబడుచున్న యీ హవిస్సు హుత మగుఁగాక. (లోకమున మనుష్యులు పశువులను తమ కనుకూలము అగునట్లు చేసికొనుటకు ముఖము మధ్యనుందు తమ నాలుకను పైకి చాఁచి ఒకవిధమైన ధ్వని చేయుచుందురు. ఆ ధ్వని విశేషమునకు ఈ కిక్కిటశబ్దము అనుకరణము. ఈ మంత్రమును పఠించుచు అగ్నియందు హవిస్సును హోమము చేయవలెను.)

3. **అర్థము:** (హే వశే:–ఓ వశాపశూ!), త్వమ్–నీవు, తురీయా–లోకత్రయముకంటె మిగిలిన నాల్గపదానవు, వశా–వంధ్యవు, భవసి–అగుచున్నావు. యత్–ఏ కారణమువలన, మనసా–పురుషాభిలాషయుక్త మనస్సుచేత, సకృత్ (ఏవ)–ఒక్క పర్యాయమే, గర్భః–గర్భము, త్వా–నిన్ను, ఆశయత్–(పొంది నీయుదరమునందు) శయనించెనో, (తత్–ఆ కారణమువలన), త్వమ్–నీవు, వశినీ–(ద్వితీయ తృతీయాది పురుషసంయోగేచ్ఛ లేనిదాన వగుటచే) ఇంద్రియ నిగ్రహము కలదానవు. వశా–(అపత్యాంతరము లేకుండుటచే), వంధ్యవు. (తాదృశీ త్వమ్–అటువంటి నీవు), దేవాన్–దేవతలను గూర్చి, గచ్ఛ–హవీరూపముగ వెళ్లుము. (తేన–ఆ వెళ్లుటచేత), యజమానస్య–యజమానునియొక్క, కామాః–కోరికలు, సత్యాః–సత్యములు, సన్తు–అగుఁగాక.

**తాత్పర్యము:** ఓ వశాపశూ! నీవు లోకత్రయాపేక్షచే చతుర్థవు. వృషభసంయోగాపేక్ష లేకుండుటచే ఇంద్రియ నిగ్రహము కలదానవు, వంధ్యవు అగుచున్నావు. ఒక్క పర్యాయమే పురుషాభిలాషయుక్త మనస్సుచే నీ యుదరము నందు గర్భము శయనించెను. ద్వితీయ తృతీయాది పురుషసంయోగేచ్ఛ లేకుండుటచే నీవు వశినివి. అపత్యాంతరము కలుగకుండుటచే వశవు. అటువంటి నీవు హవీరూపమున దేవతలను పొందుము. ఆ విధముగ దేవతలను పొందుటచే యజమానుని కోరికలు ఫలించును. (ఈ మంత్రము చెప్పుచు ఉత్తరదిక్కునకుఁ గొంపోవఁబడుచున్న వశను అనుమంత్రించవలెను.)

4. అర్థము: (హే పశో!-ఓ పశువా!, త్వమ్-నీవు), అజా-(జాతిచే) మేఁకవు, అసి-అగుచున్నావు. రయిష్ఠా-ధనము నందున్నదానవై హవిస్స్వరూపముచే దేవతలకు ధనభూతవు, అసి-అగుచున్నావు. (తాదృశీ త్వమ్-అటువంటి నీవు, ఆదౌ-ప్రథమమున), పృథివ్యామ్-భూమియందు, సీద-కూర్చుండుము. (తతః-పిమ్మట), ఊర్ధ్వా-పైకిఁ దీసికొనఁబడినదానవై, అన్తరిక్షమ్-ఆకాశమును, ఉపతిష్ఠస్వ-పొందుము. దివి-ద్యులోకమునందు, తే-నీకు, బృహద్భాః-ప్రౌఢతేజస్సు, భవిష్యతి-ఉండఁగలదు. ఈ విధముగ ముల్లోకములందు ఉండుము.

తాత్పర్యము: ఓ పశూ! నీవు జాతిచే మేఁక వగుచున్నావు. హవిస్స్వరూపముగ నీవు దేవతలకు ధన మగుచున్నావు. అటువంటి నీవు ప్రథమమున పృథివియందుండుము. పిమ్మట పైకిఁ గొంపోఁబడినదానవై అంతరిక్షమున నుండుము. ద్యులోకమునందు నీకు ప్రౌఢతేజస్సు ఉండఁగలదు. ఈ విధముగ ముల్లోకములందు ఉండుము. (నిహన్యమాన వశాపశువును ఈ మంత్రముచే అనుమంత్రించవలెను.)

5. అర్థము: (హే పశో!-ఓ పశూ!), రజసః-రజస్స్వరూపమైన హవిస్సుయొక్క, తన్తుమ్-అంశమును, తన్వన్-విస్తరింపఁజేయుచు, భానుమ్ అను-సూర్యుననుసరించి, ఇహి-పొమ్ము. (కించ-మఱియు), ధియా-ప్రజ్ఞచే, కృతాన్-సంపాదించఁబడిన, జ్యోతిష్మతః పథః-ప్రకాశవంతములైన (అస్మదీయ స్వర్గ) మార్గములను, రక్ష-రక్షించుము.

తాత్పర్యము: ఓ పశూ! రజస్స్వరూప హవిస్సుయొక్క అంశమును విస్తరింపఁజేయుచు ఆదిత్యు ననుసరించి పొమ్ము మఱియు ప్రజ్ఞచే సంపాదింపఁబడిన ప్రకాశవంతములైన (మా స్వర్గ) మార్గములను రక్షించుము. (ఈ మంత్రమును పఠించుచు వశాపశువుయొక్క వపను హోమము చేయవలెను.)

6. అర్థము: (హే హృదయాదీని పశ్వఙ్గాని!-పశువుయొక్క హృదయాద్యంగములారా!), జోగువామ్-(నిర్విఘ్నముగ సమాప్త మగుటకు) త్వరపడుచున్న మాయొక్క, అపః-కర్మను, అనుల్బణమ్-అతిరిక్తము కానిదానినిగా, వయత-చేయుఁడు. (హే పశో!-ఓ పశువా!), త్వమ్-నీవు), మనుః-మనువువలె ఉత్పత్తి చేయుదానవు, భవ-అగుము. తతః-పిమ్మట, దైవ్యమ్-దేవతా సంబంధమైన, జనమ్-జనమును, జనయా-పుట్టించుము. (జనయా-జనయ.)

తాత్పర్యము: పశువుయొక్క హృదయాద్యంగములారా! నిర్విఘ్నముగ సమాప్త మగుటకై త్వరపడుచున్న మా యొక్క కర్మను అతిరిక్తము కానివిధముగఁజేయుఁడు. ఓ పశూ! మనువువలె నుత్పత్తిచేయుదాన వగుము. పిమ్మట ఈ యజమానుఁడు జన్మాంతరమున దేవజనుఁ డగు విధముగ దేవతా సంబంధమైన జనమును ఉత్పత్తి చేయుము. (ఈ మంత్రముచే హవిస్సును హోమము చేయవలెను.)

7. అర్థము: (హే పశో!-ఓ పశూ!, త్వమ్-నీవు), మనసః-మననము చేయఁదగిన దేవునకు, హవిః-హవిస్సువు, అసి-అగుచున్నావు. ప్రజాపతేః-ప్రజాపతియొక్క, వర్ణః-స్వరూపము, అసి-అగుచున్నావు. తే గాత్రాణామ్-అటువంటి నీ యంగములయొక్క, (ప్రాశనాత్-భక్షణమువలన, వయమ్-మేము), గాత్రభాజః-పరిపుష్టములైన అంగములు కలవారము, భూయాస్మ-అగుదుము.

తాత్పర్యము: ఓ పశూ! నీవు మననము చేయఁదగిన దేవునకు హవిస్సు వగుచున్నావు. (ప్రజాపతిచే సృష్టింపఁబడుటచే) ప్రజాపతి స్వరూప మగుచున్నావు. అటువంటి నీ యంగములను (భక్షించుట) ప్రాశన చేయుటవలన మేము గాత్రపుష్టి కలవార మగుదుము. (ఈ మంత్రమును పఠించుచు యజమానసహిత ఋత్విజులు హవిశ్శేషము లను ప్రాశన చేయవలెను.)

ద్వితీయానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే తృతీయోఽనువాకః।

మూలము: [1]ఇమే వై సహాఽఽస్తాం తే వాయు ర్వ్యవా త్తే గర్భ మదధాతాం తగ్ం సోమః ప్రాజనయ
దగ్ని రగ్రసత స ఏతం ప్రజాపతి రాగ్నేయ మష్టాకపాల మపశ్య త్తం నిరవప త్తేనైవైనా
మగ్నే రధి నిరక్రీణా [2]త్తస్మాదప్యన్యదేవత్యా మాలభమాన ఆగ్నేయ మష్టాకపాలం పురస్తా
న్నిర్వపే దగ్నే రేవైనామధి నిష్క్రీయాఽఽలభతే [3]యత్ (౧)వాయుర్వ్యవా త్తస్మాద్వా
యవ్యా యదిమే గర్భ మదధాతాం తస్మాద్ద్యావాపృథివ్యా యత్సోమః ప్రాజనయదగ్ని రగ్ర
సత తస్మాదగ్నీషోమీయా యదనయోర్వియత్యో ర్వాగవద త్తస్మాత్సారస్వతీ యత్ప్రజాపతి
రగ్నేరధి నిరక్రీణా త్తస్మాత్ప్రాజాపత్యా సా వా ఏషా సర్వదేవత్యా యదజా వశా [4]వాయవ్యా
మాలభేత భూతికామో వాయుర్వై క్షేపిష్ఠా దేవతా వాయుమేవ స్వేన (౨)భాగధేయేనోప
ధావతి స ఏవైనం భూతిం గమయతి [5]ద్యావాపృథివ్యామా లభేత కృషమాణః ప్రతిష్ఠాకామో
దివ ఏవాస్మై పర్జన్యో వర్షతి వ్యస్యామోషధయో రోహన్తి సమర్ధుకమస్య సస్యం భవ [6]త్యగ్నీ
షోమీయామా లభేత యః కామయేతాన్నవా నన్నాదః స్యామిత్యగ్నినైవాన్నమవ రున్ధే సోమే
నాన్నాద్య మన్నవానేవాన్నాదో భవతి [7]సారస్వతీమా లభేత యః (౩)ఈశ్వరో వాచో వదితోః
సన్వాచం న వదేద్వాగ్వై సరస్వతీ సరస్వతీమేవ స్వేన భాగధేయేనోప ధావతి సైవాస్మిన్వా
చం దధాతి [8]ప్రాజాపత్యామా లభేత యః కామయేతానభిజితమభి జయేయమితి ప్రజాపతిః
సర్వా దేవతా దేవతాభి రేవానభిజితమభి జయతి [9]వాయవ్యయోపాకరోతి వాయోరేవైనా

మవరుద్ధ్యాఽఽలభత [10]ఆకూత్యై త్వా కామాయ త్వా (౪)ఇత్యాహ యథాయజురేవైత
[11]త్కిక్కిటాకారం జుహోతి కిక్కిటాకారేణ వై గ్రామ్యాః పశవో రమన్తే ప్రాఽఽరణ్యాః పతన్తి
యత్కిక్కిటాకారం జుహోతి గ్రామ్యాణాం పశూనాం ధృత్యై [12]పర్యగ్నౌ క్రియమాణే జుహోతి
జీవన్తీమేవైనాగ్ం సువర్గం లోకం గమయతి త్వం తురీయా వశినీ వశాఽసీత్యాహ దేవత్రైవైనాం
గమయతి[13]సత్యాః సన్తు యజమానస్య కామా ఇత్యాహైష వై కామః (౫)యజమానస్య
యదనార్త ఉదృచం గచ్ఛతి తస్మాదేవ మాహా[14]ఽజాఽసి రయిష్ఠేత్యాహైష్వేవైనాం లోకేషు
ప్రతిష్ఠాపయతి [15]దివి తే బృహద్భా ఇత్యాహ సువర్గ ఏవాస్మై లోకే జ్యోతి ర్దధాతి [16]తన్తుం
తన్వన్రజసో భాను మన్విహీత్యాహేమానేవాస్మై లోకాఞ్జ్యోతిష్మతః కరో[17]త్యనుల్బణం వయత
జోగువామప ఇతి (౬)ఆహ యదేవ యజ్ఞ ఉల్బణం క్రియతే తస్యైవైషా శాన్తి [18]ర్మనుర్భవ
జనయా దైవ్యం జనమిత్యాహ మానవ్యో వై ప్రజాస్తా ఏవాఽఽద్యాః కురుతే [19]మనసో
హవిరసీత్యాహ స్వగాకృత్యై [20]గాత్రాణాం తే గాత్రభాజో భూయాస్మేత్యాహాఽఽశిష మేవై
తామా శాస్తే [21]తస్యైవా ఏతస్యా ఏకమేవాదేవయజనం యదాలబ్ధాయామభ్రః (౭)భవతి
[22]యదాలబ్ధాయామభ్రః స్యాదప్సు వా ప్రవేశయేత్సర్వాం వా ప్రాశ్నీయా[23]ద్యదప్సు ప్రవేశయే
ద్యజ్ఞవేశసం కుర్యాత్సర్వామేవ ప్రాశ్నీయా దిన్ద్రియ మేవాఽఽత్మన్ధత్తే [24]సా వా ఏషా
త్రయాణా మేవావరుద్ధా సంవత్సరసదః సహస్రయాజినో గృహమేధిన స్త ఏవైతయా యజే
రన్తేషా మేవైషాఽఽప్తా ॥ ౮ ॥

(యస్త్వైన సారస్వతీమా లభేత యః కామాయ త్వా కామోఽప ఇత్యష్టౌ ద్విచత్వారిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థ ప్రపాఠకే తృతీయోఽనువాకః।

## వేదార్థ దీపిక

**అవతారిక:** ద్వితీయానువాకమునందు కామ్యపశువునకు సంబంధించిన మంత్రములు చెప్పఁబడినవి. ఈ తృతీయానువాకమునందు కామ్య పశ్వాలంభనవిధి చెప్పఁబడుచున్నది. అందు ప్రథమమున ఆ కామ్యపశువు నాలంభనము చేయునతఁడు ముందుగాఁ జేయఁదగిన అష్టాకపాలపురోడాశమును విధించుటకు స్తుతి చేయఁబడుచున్నది.

1. **అర్థము:** (పురా=పూర్వము), ఇమే=ఈ ద్యావాభూములు, సహ ఆస్తాం వై=కలసియున్నవఁట, తే=ఆ కలసియున్న ద్యావాభూములను, వాయుః=వాయువు, వ్యవాత్=విడఁదీసెను. (వియుక్తములుగాఁ జేసెను.) తే=ఆ ద్యావాపృథువులు, (పునః తేన సంపరిష్వక్తౌ=మఱల ఆ వాయువుచే కలపఁబడినవై), గర్భమ్=(వశారూప) గర్భమును, అదధాతామ్=ధరించినవి. తమ్=ఆ గర్భమును, సోమః=సోముఁడు (చంద్రుఁడు), ప్రాజనయత్=ప్రకర్షగా జనింపఁజేసెను. (తమ్=ఆ పుట్టింపఁబడిన దానిని), అగ్నిః=అగ్ని, అగ్రసత=గ్రమింగెను, (తతః=పిమ్మట), సః ప్రజాపతిః=ఆ ప్రజాపతి, ఏతమ్=ఈ, ఆగ్నేయమ్=అగ్నిదేవతాకమైన, అష్టాకపాలమ్=అష్టాకపాల సంస్కృత పురోడాశమును, అపశ్యత్=చూచెను (తెలిసికొనెను). తమ్=ఆ పురోడాశమును, నిరవపత్=ఉంచెను. తేనైవ=ఆ నిరుప్త పురోడాశముచేతనే, అగ్నేః=అగ్నినుండి, ఏనామ్=ఈ వశారూప సంతతిని, అధినిరక్రీణాత్=కొనెను.

**తాత్పర్యము:** పూర్వము ద్యావాభూములు కలిసియుండఁగా, వానిని వాయువు విడఁదీసెనఁట. మఱల వానిని కలుపగా నవి వశారూప గర్భమును ధరించెను. సోమదేవుఁ డా గర్భమును సంతానముగా జనింపఁజేయఁగా ఆ సంతానమును అగ్ని కబళించెను. అప్పుడు ప్రజాపతి అగ్నిదేవతాకమైన అష్టాకపాల సంస్కృత పురోడాశమును దెలిసికొని దానిని నిర్వాపము చేసి దానిచే నగ్నినుండి ఆ వశారూప సంతానమును కొనెను. (అగ్నికి పురోడాశము నిచ్చి అగ్నినుండి వశను తీసికొనెనని భావము.)

2. **అర్థము:** తస్మాదపి=ఆ అగ్నికంటెను, అన్యదేవత్యామ్= ఇతర దేవతాకమైన వశను, ఆలభమానః=ఆలంభముచేయునతఁడు, పురస్తాత్=ముందుగా, ఆగ్నేయమ్=అగ్నిదేవతాకమైన, అష్టాకపాలమ్=అష్టాకపాల సంస్కృత పురోడాశమును, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. (తదా=అప్పుడు), అగ్నేరేవ=అగ్నినుండియే, ఏనామ్=ఈ వశను, అధినిష్క్రీయ=క్రయము చేసి, ఆలభతే=ఆలంభము చేసినవాఁ డగును.

**తాత్పర్యము:** అగ్నిదేవతాకము కానిదైనను, ఇతరదేవతాకమైన వశను ఆలంభము చేయునతఁడు మొదట అగ్నిదేవతాకము, అష్టాకపాల సంస్కృతమును అగు పురోడాశమును నిర్వాపము చేయవలెను. అప్పు డతఁడు అగ్ని నుండియే ఈ వశను క్రయము చేసి ఆలంభక్రియయందు ప్రవృత్తుఁడైన వాఁడగును.

3. **అర్థము:** వాయుః=వాయుదేవుఁడు, యత్=ఏ కారణమువలన, వ్యవాత్=ద్యావాభూములను విడఁదీసెనో, తస్మాత్=ఆ కారణమువలన, వాయవ్యా=ఈ వశ వాయుదేవతాకము, (భవతి=అగుచున్నది). యత్=ఏకారణమువలన, ఇమే=ఈ ద్యావాపృథివీ దేవతలు, గర్భమ్=వశారూప గర్భమును, అదధాతామ్=ధరించినవో, తస్మాత్=ఆ కారణము వలన, ద్యావాపృథివ్యా=(ఈ వశ) ద్యావాపృథివీ దేవతాకము, (భవతి=అగుచున్నది.) యత్=ఏ కారణమువలన, సోమః=సోమదేవుఁడు, ప్రాజనయత్=(ఈ వశను) ప్రకర్షగా పుట్టించెనో, అగ్నిః=అగ్ని దేవుఁడు, అగ్రసత=(ఈ వశను) గ్రమింగెనో, తస్మాత్=ఆ కారణమువలన, అగ్నీషోమీయా=(ఈ వశ)

అగ్నీషోమ దేవతాకము. (భవతి=అగుచున్నది.) యత్=ఏ కారణమువలన, అనయోః=ఈ ద్యావాపృథువులు, వియతోః సతోః=వియుక్తము లగుచుండఁగా, వాక్=వాక్కు (సరస్వతి), అవదత్=పలికెనో; తస్మాత్=ఆ కారణమువలన, సారస్వతీ=(ఈ వశ), సరస్వతీదేవతాకము, (భవతి=అగుచున్నది.) యత్=ఏ కారణమువలన, ప్రజాపతిః=ప్రజాపతి, అగ్నేః=అగ్ని దేవునినుండి, అధినిరక్రీణాత్=(పురోడాశమును మూల్యముగా నిచ్చి ఈ వశను) నిష్క్రయము చేసెనో, తస్మాత్=ఆ కారణమువలన, ప్రాజాపత్యా=(ఈ వశ) ప్రజాపతి దేవతాకము, (భవతి=అగుచున్నది.) వశా అజా యత్=వశయైన మేఁక యేది కలదో, సా ఏషా=ఆ యీ మేఁక, సర్వదేవత్యా=పూర్వోక్త విధముగ సర్వదేవ దేవతాకము, (భవతి=అగుచున్నది.)

తాత్పర్యము: వశాపశువునకుఁ గల ఇతరదేవతాకత్వము ఇచట వివరింపఁబడినది. వాయువు వశారూప గర్భమును ధరించిన ద్యావాపృథువులను విడఁదీయుటచే వశాపశువు వాయుదేవతాక మైనది. ద్యావాపృథువులు వశారూప గర్భమును ధరించుటచే వశ ద్యావాపృథివీ దేవతాక మైనది. ఆ వశను సోమదేవుఁడు జనియింపఁజేయుటచేతను, అగ్ని ఆ వశను మ్రింగుటచేతను అది అగ్నీషోమ దేవతాక మైనది. వశారూప గర్భమును ధరించిన ద్యావాపృథువులు విడివడినపుడు వేణుదళను విభాగ ధ్వని (వెదురుటాకులు చీలినపు డేర్పడిన ధ్వని) యేర్పడుటచే ఆ ధ్వని వాక్కుధర్మ మగుటవలన వశ సరస్వతీదేవతాక మైనది. దానిని ప్రజాపతి అగ్నినుండి క్రయము చేయుటచే ప్రజాపతిదేవతాక మైనది. వశయైన అజ ఈ విధముగ సర్వదేవ దేవతాకము అయినది.

4. అర్థము: భూతికామః=ఐశ్వర్యమును కోరునతఁడు, వాయవ్యామ్=వాయుదేవతాకమైన వశారూపమైన మేఁకను, ఆలభేత=ఆలంభము చేయువలెను. వాయుః=వాయువు, క్షేపిష్ఠా దేవతా వై=శీఘ్రగామియగు దేవత కదా! (సః=ఆ యాలంభము చేసిన యజమానుఁడు), స్వేన భాగధేయేన=తన భాగధేయముచేత, వాయుమేవ=వాయువునే, ఉపధావతి=పొందుచున్నాఁడు. సః ఏవ=ఆ వాయువే, ఏనమ్=ఈ యజమానుని, భూతిమ్=ఐశ్వర్యమును, గమయతి=పొందించుచున్నాఁడు.

తాత్పర్యము: ఐశ్వర్యమును కోరునతఁడు వాయుదేవతాక వశాపశువును (అజను) ఆలంభము చేయువలెను. వాయువు శీఘ్రగామియగు దేవత కదా! ఆ వశాలంభముచేసిన యజమానుఁడు స్వీయ భాగధేయముచేత వాయువునే పొందును. ఆ వాయువు ఈ వశాలంభముచేసిన యజమానుని ఐశ్వర్యవంతుని చేయును.

5. అర్థము: ప్రతిష్ఠాకామః=సస్య సమృద్ధిరూప ప్రతిష్ఠను కోరునట్టి, కృషమాణః=కృషీవలుఁడు, ద్యావాపృథివ్యామ్=ద్యావాపృథివీ దేవతాకమైన వశాపశువును, ఆలభేత=ఆలంభము చేయువలెను. అస్మై=ఈ వశాలంభము చేసిన యజమానునికొఱకు, పర్జన్యః=పర్జన్యదేవుఁడు (మేఘము), దివః ఏవ=దివినుండియే, వర్షతి=వర్షమును వర్షించుచున్నాఁడు. అస్యామ్=ఈ భూమియందు, ఓషధయః=ఓషధులు, విరోహన్తి=విశేషముగ మొలచుచున్నవి. (తతః=అందువలన), అస్య=ఈ యజమానునియొక్క, సస్యమ్=సస్యము, సమర్ధుకమ్=సమృద్ధిశీలము, భవతి=అగుచున్నది.

తాత్పర్యము: సస్య సమృద్ధిరూప ప్రతిష్ఠ నపేక్షించు కృషీవలుఁడు ద్యావాపృథివీ దేవతాకమైన వశాపశువు నాలంభము చేయవలెను. ఈ యాలంభము చేసిన యజమానునికొఱకు పర్జన్యదేవుఁడు దివినుండియే వర్షించును. అప్పుడు ఈ భూమియందు ఓషధులు మొలచును. ఇతని సస్యము సమృద్ధ మగును.

6. అర్థము: యః=ఏ యజమానుఁడు, అన్నవాన్=(తాను) అన్నము కలవాఁడను, అన్నాదః=అన్నము తినుటకు సమర్థుఁడను, స్యామ్=అగుదును గాక, ఇతి=అని, కామయేత=కోరునో, (సః=ఆ యజమానుఁడు), అగ్నినైవ=అగ్నిచేతనే, అన్నమ్=అన్నమును, అవరున్ధే=పొందుచున్నాఁడు. సోమేన=సోమదేవునిచేత, అన్నాద్యమ్=అన్నభక్షణ సామర్థ్యమును, అవరున్ధే=పొందుచున్నాఁడు. (తదా=అప్పుడు), అన్నవాన్=అన్నము కలవాఁడు, అన్నాదః=అన్నమును తిను సామర్థ్యము కలవాఁడును, భవత్యేవ=నిశ్చయముగ నగును.

తాత్పర్యము: తనకు అన్నసమృద్ధియు, అన్నభక్షణ సామర్థ్యమును కావలెనని కోరునతఁడు అగ్నీషోమ దేవతాకమైన వశాపశువును ఆలంభము చేయువలెను. అతఁడు అగ్నిచేత అన్నమును, సోమునిచే అన్నభక్షణ సామర్థ్యమును పొందును. అప్పు డతఁడు నిశ్చయముగ అన్నవంతుఁడు, అన్నభక్షణ సమర్థుఁడు నగును.

7. **అర్థము:** యః=ఎవఁడు, వాచః వదితోః (వక్తుమ్)=వాక్కును పలుకుటకు, ఈశ్వరః సన్=సమర్థుఁ డగుచు, వాచమ్=వాక్కును, న వదేత్=పలుకుట లేదో, (సః=అతఁడు), సారస్వతీమ్=సరస్వతీ దేవతాకమైన వశాపశువును, ఆలభేత=ఆలంభము చేయవలెను. వాక్=వాక్కు, సరస్వతీ వై=సరస్వతి కదా! (తదా=అప్పుడు, సః=ఆ యజమానుఁడు), స్వేన భాగధేయేన=స్వీయ భాగధేయముచేత, సరస్వతీమేవ=సరస్వతినే, ఉపధావతి=పొందుచున్నాఁడు. సైవ=ఆ సరస్వతియే, వాచమ్=వాక్కును, అస్మిన్=ఈ యజమానునియందు, దధాతి=ధరింపఁజేయుచున్నది (ఉంచుచున్నది).

**తాత్పర్యము:** లోకమున వేదశాస్త్రపారంగతుఁడైన ఒకానొక విద్వాంసుఁడు రాజసభాదులయం దుపన్యసించుటకు సమర్థుఁడైనను, సభాకంపాది ప్రతిబంధముచే ఉపన్యసించలేకపోవును. అట్టి విద్వాంసుఁడు సరస్వతీ దేవతాక వశాపశువు నాలంభము చేయవలెను. ఆలంభము చేసిన యతఁడు స్వీయభాగధేయముచేత సరస్వతినే పొందును. వాక్కే సరస్వతి కదా! ఆ సరస్వతియే ఈ విద్వాంసుని వక్తృత్వ సామర్థ్యము కలవానినిగాఁ జేయును.

8. **అర్థము:** యః=ఎవఁడు, అనభిజితమ్=జయింపఁబడనివానిని, అభిజయేయమ్ ఇతి=జయింపవలెనని, కామయేత=కోరునో, (సః=అతఁడు), ప్రాజాపత్యామ్=ప్రజాపతి దేవతాకమైన వశాపశువును, ఆలభేత=ఆలంభము చేయవలెను. ప్రజాపతిః=ప్రజాపతి, సర్వాః దేవతాః=సర్వదేవతా స్వరూపుఁడు. (తదా=అప్పుడు, సః=ఆ యాలంభము చేసిన యజమానుఁడు), అనభిజితమ్=జయింపఁబడనివానిని, దేవతాభిరేవ=సర్వదేవతలచేతనే, అభిజయతి=అంతటను జయించుచున్నాఁడు.

**తాత్పర్యము:** తనచే జయింపఁబడని వానిని జయింపవలెనని కోరునతఁడు ప్రజాపతిదేవతాకమైన వశాపశువును ఆలంభము చేయవలెను. ప్రజాపతి సర్వదేవతా స్వరూపుఁడు. కావున ఆ యజమానుఁడు తాను జయించలేని వానిని సర్వదేవతలచేతనే జయించును.

9. **అర్థము:** వాయవ్యయా="ఆ వాయో భూష శుచిపాః" ఇత్యాది ఋక్కుచేత, ఏనామ్=ఈ వశను, ఉపాకరోతి=ఉపాకరణము చేయవలెను. (తదా=అప్పుడు, సః=ఆ యుపాకరణము చేసిన యజమానుఁడు), వాయోరేవ=వాయువు వలననే, ఏనామ్=ఈ వశను, అవరుధ్య=సంపాదించి, ఆలభతే=ఆలంభము చేసినవాఁ డగుచున్నాఁడు.

**తాత్పర్యము:** ("ఆ వాయో భూష శుచిపాః" ఇత్యాది ఋక్కు ద్వితీయానువాకారంభమునఁ గలదు. ఆ ఋక్కు ఇచట వినియోగింపఁబడుచున్నది.) వశాలంభము చేయునతఁడు ప్రథమమున "ఆ వాయో భూష" ఇత్యాది ఋక్కుచే వశను ఉపాకరణము చేయవలెను. అప్పు డితఁడు వాయువునుండియే వశను సంపాదించి ఆలంభము చేసినవాఁడగును.

10. **అర్థము:** "ఆకూత్యై త్వా కామాయ త్వా" ఇతి ఆహ="ఓ పశూ! సంకల్పసిద్ధికొఱకు, అభీష్ట పాలనముకొఱకు" ఇత్యాద్యర్థమును 'ఆకూత్యై' ఇత్యాది మంత్రము చెప్పెను. ఏతత్=ఇది, యథాయజు రేవ=మంత్రోక్తప్రకారముగనే గ్రహింపవలసియున్నది.

**తాత్పర్యము:** ద్వితీయానువాకమునందలి "ఆకూత్యై త్వా" ఇత్యాది మంత్రముల స్పష్టార్థము ఇటనుండి వివరింపఁబడుచున్నది. ఆ మంత్రముల అర్థతాత్పర్యములు ద్వితీయానువాకమునందే వ్రాయఁబడినవి.

11. **అర్థము:** కిక్కిటాకారమ్=("ఆకూత్యై త్వా" ఇత్యాది మంత్రము నుచ్చరించి), జిహ్వాగ్రముతో ధ్వనివిశేషమును చేసి, (పశ్చాత్=పిమ్మట), జుహోతి=హోమము చేయవలెను. గ్రామ్యాః పశవః=గో మహిషాది గ్రామ్యపశువులు, కిక్కిటాకారేణ వై=కిక్కిటాకార ధ్వనిచేతనే, రమన్తే=క్రీడించుచున్నవి. ఆరణ్యాః=అరణ్యమున సంచరించు మృగములు, ప్రపతన్తి=ఎక్కువగ పరుగిడుచున్నవి. కిక్కిటాకారం జుహోతి యత్=కిక్కిటాకార ధ్వని పూర్వకముగ=హోమము చేయుచో, (తత్=అది,) గ్రామ్యాణాం పశూనామ్=గ్రామ్యపశువులయొక్క, ధృత్యై=ధృతికొఱకు, (భవతి=అగుచున్నది).

**తాత్పర్యము:** జిహ్వాగ్రమును పైకి చాచి ఇటునటు కదలించినపుడు ఏర్పడు ధ్వనివిశేషమునకు కిక్కిట శబ్దము అనుకరణము. ఆ ధ్వని చేయుచు, గ్రామ్యపశువులైన గో మహిషాదులను వశ్యములుగఁ జేసికొనుట లోకప్రసిద్ధము. అట్టి ధ్వని చేయుచు హోమము చేయవలెను. ఆ ధ్వనిచే గ్రామ్యపశువులు పశుస్వామికి వశ్యములై క్రీడించుచుండును. అరణ్య మృగములు ఆ ధ్వనిని వినఁగానే పరుగిడిపోవును. కావున కిక్కిటాకార పూర్వకముగ హోమము చేయుట గ్రామ్యపశువుల ధృతికి సాధన మగును. ఈ విషయము ద్వితీయానువాకమునందుఁ గూడ వివరింపఁబడినది. ఇచట కిక్కిటాకారపూర్వక హోమము విధింపఁబడినది.

**12. అర్థము:** (యజమానః=యజమానుఁడు), పర్యగ్నౌ=కొఱవితో పశువునకు ప్రదక్షిణావృత్తి, క్రియమాణే సతి=చేయఁబడుచుండఁగా, జుహోతి=పూర్వోక్తమైన ఆజ్యహోమము చేయవలెను. (తథా కృతే సతి=అట్లుచేయఁబడినదగుచుండఁగా,) ఏనామ్=ఈ పశను, జీవన్తీమేవ=జీవముతోఁ గూడినదిగానే, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, గమయతి=పొందించుచున్నవాఁడగుచున్నాఁడు. "త్వం తురీయా వశినీ వశాఽసీ"త్యాహ="త్వం తురీయా" ఇత్యాది మంత్రముచే, ఏనామ్=ఈ అజను, దేవత్రైవ=దేవలోకమునందే, గమయతి=పొందించుచున్నాఁడు.

**తాత్పర్యము:** యజమానుఁడు కొఱవితో పశువునకు ప్రదక్షిణము చేయుచుండునపుడు పూర్వోక్తమైన ఆజ్యహోమము చేయవలెను. అట్లు చేసినచో ఈ పశను సజీవముగానే స్వర్గమునకు పంపినవాఁడగును. "త్వం తురీయా" ఇత్యాది మంత్రముచే ఈ మేఁకను స్వర్గమును పొందించువాఁ డగును. ("త్వం తురీయా" ఇత్యాది మంత్రము 2 వ అనువాకమున వ్యాఖ్యాతము.)

**13. అర్థము:** "సత్యాః సన్తు యజమానస్య కామాః" ఇత్యాహ=యజమానుని కోరికలు సత్యములు అగుఁగాక, అని "సత్యాః సన్తు" ఇత్యాది మంత్రము చెప్పినది. (అయం యజ్ఞః=ఈ యజ్ఞము), అనార్తః=విఘ్నరహితమై, ఉదృచమ్=ఉత్తమమైన సమాప్తిని, గచ్ఛతి=పొందవలెను. ఏషః వై=ఇదియే, యజమానస్య=యజమానుని యొక్క, కామః=కోరిక, తస్మాత్=అందువలన, ఏవమ్=ఈ విధముగ, ఆహ="సత్యాస్సన్తు" ఇత్యాది మంత్రము చెప్పినది.

**తాత్పర్యము:** యజమానుని కోరికలు సత్యములు అగుఁగాక అని 'సత్యాస్సన్తు' ఇత్యాది మంత్రము చెప్పినది. ఈ యజ్ఞము విఘ్నరహితమై ఉత్తమ సమాప్తి నొందుఁగాక యనియే యజమానుని కోరిక. ఆ కారణమువలన పై మంత్రము ఈ విధముగఁ జెప్పినది.

**14. అర్థము:** "అజాఽసి రయిష్ఠేత్యాహ" ఓ పశూ! నీవు జాతిచే మేఁక వగుచున్నావు. ధనమునం దున్నదానవై హవిస్స్వరూపమున దేవతలకు ధనము అగుచున్నావు, అని చెప్పుటచే, (యజమానః=యజమానుఁడు), ఏనామ్=ఈ యజమును, లోకేషు=మూఁడులోకములందు, ప్రతిష్ఠాపయతి=ప్రతిష్ఠింపఁజేయుచున్నాఁడు.

**తాత్పర్యము:** "అజాఽసి రయిష్ఠా" ఇత్యాదికము యజమానుఁడు ఈ యజను ముల్లోకములందు ప్రతిష్ఠింపఁ జేయుచున్నాఁడని చెప్పుచున్నది. ("ఇత్యాహ" అనునంతవఱకుఁ గల మంత్రభాగములు ద్వితీయానువాకములోనివి).

**15. అర్థము:** అస్మై=ఈ యజమానునికొఱకు, (ఏషా=ఈ మేఁక), సువర్గే లోకే ఏవ=స్వర్గలోకమునందే, జ్యోతిః=ప్రకాశమును, దధాతి=ఉత్పాదింపఁజేయుచున్నది (అని), "దివి తే బృహద్భాః" ఇతి="దివి తే బృహద్భాః" అనెడి పూర్వోక్త మంత్ర చరమభాగము, ఆహ=చెప్పుచున్నది.

**తాత్పర్యము:** ఈ మేఁక ఈ యజమానునికై స్వర్గలోకమునందే ప్రకాశము నుత్పాదింపఁజేయుచున్నదని "అజాఽసి రయిష్ఠా" అను మంత్రములోని చరమభాగమైన "దివి తే బృహద్భాః" అను మంత్రము చెప్పుచున్నది. (ఇది హన్యమాన పశువు ననుమంత్రించు మంత్రము.)

16. అర్థము: "తస్తుం తన్వ ద్రజసో భానుమన్విహి" ఇత్యాహ=అని చెప్పుటచే, (ఏషా=ఈ యజ), అస్మై=ఈ యజమానునికొఱకు, ఇమాన్ లోకానేవ=ఈ ముల్లోకములనే, జ్యోతిష్మతః=ప్రకాశవంతములుగ, కరోతి=చేయుచున్నది.

తాత్పర్యము: ఈ యజ ఈ యజమానునికై ఈ ముల్లోకములనే ప్రకాశవంతములుగఁ జేయుచున్నదని "తన్తుం తన్వ"న్నిత్యాది మంత్రము చెప్పుచున్నది. (ఇది వపాహోమ మంత్రము).

17. అర్థము: యజ్ఞే=యజ్ఞమునందు, యదేవ ఉల్బణమ్=ఏదియైతే విధి నతిక్రమించి అనుష్ఠింపఁబడిన అంగము, (అస్తి=కలదో), తస్య=దానికి, ఏషా=ఈ అజ, శాన్తిః=శాన్తిప్రదము (ఇతి=అని), "అనుల్బణం వయత జోగువామపః" ఇతి ఆహ=అనుల్బణమిత్యాది హవిర్హోమ మంత్రము చెప్పుచున్నది.

తాత్పర్యము: "అనుల్బణం వయత జోగువామపః" అను మంత్రమునందు 'అనుల్బణమ్' అను పదము నుచ్చరించుటచే విధి నతిక్రమించి యనుష్ఠింపఁబడిన యజ్ఞాంగమునకు శాన్తి యేర్పడుచున్నది.

18. అర్థము: ప్రజాః=ప్రజలు, మానవ్యాః వై=మనుప్రజాపతి సంబంధులు కదా!, (అతః=ఈ కారణమువలన), "మనుర్భవ జనయా దైవ్యం జనమ్" ఇతి ఆహ='అనుల్బణ' మిత్యాది మంత్ర చరమభాగమైన "మనుర్భవ జనయా" ఇత్యాది మంత్రభాగముచేత, తాః ఏవ=ఆ ప్రజలనే, ఆద్యాః=భోగ్యములుగా, కురుతే=చేయుచున్నాఁడు.

తాత్పర్యము: మనువు ప్రజాపతిరూపుఁ డగుటచే ప్రజాపతిచే సృజింపఁబడిన దైవ్యజనాదు లందఱు మనుసంబంధులే యగుచున్నారు. కావున ఈ మంత్రభాగముచే వారినందఱిని భోగ్యులుగాఁ జేయుచున్నాఁడు.

19. అర్థము: "మనసో హవిరసీ"త్యాహ=ఓ పశూ! నీవు మననము చేయఁదగిన దేవునకు హవిస్సు వగుచున్నావు అని యీ మంత్రము చెప్పినది. (ఇది) స్వగాకృత్యై=స్వగాకారముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము: 'మనసో హవిరసీ'త్యాది మంత్రార్థము స్వగాకారముకొఱ కగుచున్నది.

20. అర్థము: "గాత్రాణాం తే గాత్రభాజో భూయాస్మ" ఇత్యాహ=ఓ పశూ! నీ యంగములను ప్రాశనము చేయుటవలన మేము పరిపుష్టములైన అవయవములు కలవారము అగుదుము, అని చెప్పుటచే, (యజమానః=యజమానుఁడు), ఏతామ్=ఈ మంత్రార్థమును, ఆశిషమేవ=ఆశీస్సుగానే, ఆశాస్తే=కోరుచున్నాఁడు.

తాత్పర్యము: "గాత్రాణాం తే గాత్రభాజః" ఇత్యాది మంత్రార్థమును యజమానుఁడు ఆశీస్సునుగానే కోరుచున్నాఁడు.

21. అర్థము: ఆలబ్ధాయాం సత్యామ్=వశ ఆలంభము చేయఁబడిన దగుచుండఁగా, అభ్రః భవతి యది=మేఘము ఆకాశమున ఆవరించిన దగుచున్నచో, తస్యై ఏతస్యై=ఆ యీ వశకు, (షష్ఠ్యర్థే చతుర్థీ.) ఏకమేవ=ఈ ఒక్కటియే, అదేవయజనం వా=దేవయాగానర్హ మైనది కదా!.

తాత్పర్యము: వశాపశువు ఆలంభము చేయఁబడుచున్ననాఁడు గగనము మేఘావృత మైనచో, ఈ పశువు ఆ దినమున దేవయాగార్హ మైనది కాదు. ఆకాశము మేఘావృతముకాదను నిశ్చయజ్ఞానము ఉన్నప్పుడే ఈ పశువును ఆలంభము చేయవలెనని భావము.

22. అర్థము: ఆలబ్ధాయాం (వశాయాం) సత్యామ్=వశాపశువు ఆలంభము చేయఁబడిన దగుచుండఁగా, అభ్రః స్యాద్యది=(ఆకాశమున) మేఘము ఆవరించినచో, (తాం) సర్వామ్=ఆలబ్ధమైన ఆ వశాపశువు నంతటిని, అప్సు=ఉదకములందు, ప్రవేశయేత్=ప్రవేశ పెట్టవలయును. వా=లేదా, సర్వామ్=సమస్తమును, ప్రాశ్నీయాత్ వా=ప్రాశన మైనను చేయవలెను.

తాత్పర్యము: వశాపశువును ఆలంభము చేసినప్పుడు ప్రమాదవశమున ఆకాశము మేఘావృత మైనచో, ఆ యాలబ్ధమైన పశువును జలమున ప్రవేశపెట్టవలెను. లేదా, ఆ సర్వపశువును ప్రాశనము చేయవలెను. (ఇది నైమిత్తిక ప్రయోగము).

అర్థము: అప్సు-ఉదకములందు, ప్రవేశయేద్యత్-(ఆలబ్ధ పశువును) ప్రవేశపెట్టుచో, (యజమానః-యజమానుఁడు) యజ్ఞవేశసమ్-యజ్ఞవిఘాతమును, కుర్యాత్-చేసినవాఁడగును. సర్వమేవ-సమస్తమునే, ప్రాశ్నీయాత్ యత్-ప్రాశనము చేయుచో, ఆత్మని-తనయందు, ఇన్ద్రియమేవ-ఇంద్రియ సామర్థ్యమునే, ధత్తే-ధరింపఁ జేసినవాఁ డగుచున్నాడు.

తాత్పర్యము: ఆలబ్ధ పశువును జలప్రవేశము చేయించినచో ఆ యజమానుఁడు యజ్ఞవిఘాతము చేసినవాఁ డగును. సర్వమునే ప్రాశనము చేయుచో నతఁడు తనయందు ఇంద్రియ సామర్థ్యమును ధరింపఁజేసినవాఁ డగును. కమకనే కల్పసూత్రకారుఁడు "సర్వం వా యజమాన ఏవాన్వహం ప్రాశ్నీయాత్" యజమానుఁడు సర్వమునే ప్రతిదినము ప్రాశనము చేయవలెనని చెప్పియుండెను.

24. అర్థము: సా ఏషా-అ యీ వశాపశువు, సంవత్సరసదః-గవామయనాదిరూప సంవత్సరసత్ర (యాగ)ము ననుష్ఠించిన సంవత్సరసత్రజిత్తునకు, సహస్రయాజినః-సహస్ర సంఖ్యాక దక్షిణా యుక్తమైన యాగము చేసిన సహస్ర యాజికి, గృహమేధినః-సహస్ర సదర్వాచీన యాగములందుఁ గూడ గృహపతిగా దీక్ష వహించిన గృహమేధికి, త్రయాణామేవ-ఈ ముువ్వురకే, అవరుద్ధా-అధీన యైనది. తే ఏవ-అ ముువ్వురే, ఏతయా-ఈ వశచే, యజేరన్-యాగము చేయవలెను. తేషామేవ-ఆ సత్రజి త్సహస్రయాజి గృహమేధులకే, ఏషా-ఈ వశ, అప్తా-యుక్తమైనది.

తాత్పర్యము: సంవత్సరసత్ర మనెడి యాగము చేసిన సంవత్సరసత్తు, సహస్రసంఖ్యాక దక్షిణాయుక్తమైన యాగము చేసిన సహస్రయాజి, సంవత్సరసదర్వాచీన యాగములందుఁ గూడ గృహపతిగా దీక్షనొందిన గృహమేధి అను ముగ్గురు మాత్రము ఈ వశచే యాగము చేయుట కర్హులు. వారికే యిది యోగ్య మైనది. పొందఁ దగినదియు నగుచున్నది.

తృతీయానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే చతుర్థోఽనువాకః।

మూలము: [1]చిత్తం చ చిత్తిశ్చాఽఽకూతం చాఽఽకూతిశ్చ విజ్ఞాతం చ విజ్ఞానం చ మనశ్చ శక్వరీశ్చ దర్శశ్చ పూర్ణమాసశ్చ బృహచ్చ రథన్తరం చ ప్రజాపతి ర్జయానిన్ద్రాయ వృష్ణే ప్రాయచ్ఛ దుగ్రః పృతనాజ్యేషు తస్మై విశః సమనమన్త సర్వాః స ఉగ్రః స హి హవ్యో బభూవ [2]దేవాసురాః సంయత్తా ఆసన్త్స ఇన్ద్రః ప్రజాపతి ముపాధావ త్తస్మా ఏతాఞ్జయా న్ప్రాయచ్ఛ త్తానజుహో త్తతో వై దేవా అసురా నజయ న్యదజయ న్తజ్జయానాం జయత్వగ్ం స్పర్ధ మానేనైతే హోతవ్యా జయత్యేవ తాం పృతనామ్ ॥౧॥ (ఉప పఞ్చవిగ్ంశతిశ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థప్రపాఠకే చతుర్థోఽనువాకః॥

## వేదార్థదీపిక

అవతారిక: తృతీయానువాకమునందు కామ్యపశ్వాలంభనవిధి చెప్పఁబడినది. ఈ చతుర్థానువాకమునందు జయసంజ్ఞకములైన పదుమూఁడు మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: చిత్తమ్=సామాన్యాకారముగ నిర్వికల్పక జ్ఞానముచే గోచరమగు వస్తువు, (మయి=నాయందు, అస్తు=ఉండుఁ గాక.) చిత్తిః=నిర్వికల్పక జ్ఞానము. ఆకూతమ్=సంకల్పితమైన వస్తువు. ఆకూతిః=సంకల్పము. విజ్ఞాతమ్=విశేషాకారముగ నిశ్చయింపఁబడిన వస్తువు. విజ్ఞానమ్=విశేషాకారముగ నిశ్చయించుట. మనః=జ్ఞానసాధనమైన అంతఃకరణము. శక్వరీః=చక్షురాది బాహ్యేంద్రియ శక్తులు. దర్శః=దర్శయాగము. పూర్ణమాసః=పూర్ణమాసయాగము. బృహత్=బృహన్నామక సామవిశేషము. రథన్తరమ్=రథన్తరనామక సామవిశేషము. ('చిత్తి' రిత్యాది ప్రతిపదమునకును పిమ్మట 'మయి', 'అస్తు' అని సమన్వయము చేయవలెను. చ శబ్దము సముచ్చయార్థకము.) పృతనాజ్యేషు=యుద్ధాభిగమనములందు, ఉగ్రః=శిక్షకుఁడైన, ప్రజాపతిః=ప్రజాపతి, వృష్ణే=వర్షింపఁజేయునట్టి, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, జయాన్=జయ హేతు మంత్రములను, ప్రాయచ్ఛత్=ఇచ్చెను. తస్మై=ఆ యింద్రునికొఱకు, విశః=ప్రజలు, సర్వాః=అందఱు, సమనమన్త=విధేయులైరి. (బాగుగ అనతులైరి.) సః=ఆ యింద్రుఁడు, (స్వాసు ప్రజాసు=తన ప్రజలయందు) ఉగ్రః=శిక్షకుఁడు, (అభవత్=ఆయెను.) సః=ఆ యింద్రుఁడు, హవ్యః=హోమయోగ్యుఁడు, బభూవ హి=ఆయెను కదా!

తాత్పర్యము: చిత్తము, చిత్తి మొదలగు పదుమూఁడును నాయం దుండుఁగాక. ఇంద్రుఁడు యుద్ధములకు వెళ్లునపుడు శిక్షకుఁడైన ప్రజాపతి వర్షింపఁజేయునట్టి ఆ యింద్రునకు జయ హేతువులైన మంత్రముల నొసఁగెను. ఇంద్రుఁడు హోమయోగ్యుఁడు కావున అతనియందు ప్రజాపతి కనుగ్రహము కలుగుట యుక్తము. ఆ యింద్రునకు ప్రజలందఱు విధేయులైరి. అతఁడు తన ప్రజలయందు శిక్షకుఁడుగా నుండెను.

2. అర్థము: దేవాసురాః-దేవతలు, అసురులు, సంయత్తాః-యుద్ధసన్నద్ధులు, ఆసన్-అయిరి. సః ఇన్ద్రః-ఆ యింద్రుఁడు, ప్రజాపతిమ్-ప్రజాపతిని, ఉపాధావత్-సమీపించెను. (ప్రజాపతిః-ప్రజాపతి), తస్మై-ఆ యింద్రునకై, ఏతాన్ జయాన్-ఈ జయహేతువులైన మంత్రములను, ప్రాయచ్ఛత్-బాగుగ నొసఁగెను. (సః-ఆ యింద్రుఁడు), తాన్-ఆ జయహేతు మంత్రములను, (ఉచ్చార్య-ఉచ్చరించి), అజుహోత్-హోమము చేసెను. తతః వై-అందువలననే, దేవాః-దేవతలు, అసురాన్-అసురులను, అజయన్-జయించిరి. యత్ అజయన్-జయించిరి కావున, జయానామ్-జయహేతు మంత్రములకు, జయత్వమ్-జయశబ్దాభిధేయత్వము, సిద్ధ్యతి-సిద్ధించుచున్నది.

తాత్పర్యము: పూర్వము దేవాసురులు యుద్ధసన్నద్ధులు కాఁగా ఇంద్రుఁడు ప్రజాపతియొద్దకు వెళ్లెను. ప్రజాపతి యతనికి జయహేతు మంత్రముల నొసఁగెను. ఇంద్రుఁడు ఆ జయహేతు మంత్రములను పఠించుచు హోమము చేసెను. దేవతలు అసురులను జయించిరి. జయహేతు మంత్రములచే జయించిరి కావున, ఆ మంత్రములకు జయాభిధేయత్వము సిద్ధించినది. జయన్తి ఏభిః ఇతి జయాః-ఈ మంత్రములచే జయించుచున్నారు కావున ఇవి జయశబ్ద వాచ్యములు.

3. అర్థము: స్పర్ధమానేన-స్పర్ధ కలవానిచే, ఏతే-ఈ జయ మంత్రములు, హోతవ్యాః-హోమము చేయఁదగినవి. తాం పృతనామ్-ఆ శత్రుసైన్యమును, జయత్యేవ-నిశ్చయముగ జయించును.

తాత్పర్యము: స్పర్ధ కల యజమానుఁడు ఈ జయాఖ్య మంత్రములచే హోమము చేయవలెను. అతఁడు తప్పక శత్రు సైన్యమును జయించును. [స్పర్ధ-ఒకరికంటె నొకరు మించవలెనను బుద్ధి. పోటీ.]

చతుర్థానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: 'అగ్ని ర్భూతానా మధిపతిః స మాఽవత్విన్ద్రో జ్యేష్ఠానాం యమః పృథివ్యా వాయు రన్త రిక్షస్య సూర్యో దివ శ్చన్ద్రమా నక్షత్రాణాం బృహస్పతి ర్బ్రహ్మణో మిత్రః సత్యానాం వరుణోఽపాగ్ం సముద్రః స్రోత్యానా మన్నగ్ం సామ్రాజ్యానా మధిపతి తన్మాఽవతు సోమ ఓషధీనాగ్ం సవితా ప్రసవానాగ్ం రుద్రః పశూనాం త్వష్టా రూపాణాం విష్ణుః పర్వతానాం మరుతో గణానామధిపతయ స్తే మాఽవన్తు పితరః పితామహాః పరేఽవరే తతా స్తతామహా ఇహ మాఽవత। అస్మిన్బ్రహ్మ న్నస్మిన్క్షత్రేఽస్యా మాశిష్యస్యాం పురోధాయా మస్మిన్కర్మన్నస్యాం దేవహూత్యామ్ ॥౧॥ (అవరే సప్తదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థప్రపాఠకే పఞ్చమోఽనువాకః॥

## వేదార్థదీపిక

అవతారిక: చతుర్థానువాకమునందు జయాఖ్య మంత్రములు, తన్మంత్రోచ్చారణ పూర్వక హోమములు చెప్పఁబడినవి. ఈ పంచమానువాకమునందు అభ్యాతాన మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: అగ్నిః=అగ్ని, భూతానామ్=ప్రాణులకు, అధిపతిః=స్వామి. సః=(అ) అటువంటి యగ్ని, మా=నన్ను, (యజమానుని), అవతు=రక్షించుఁగాక. జ్యేష్ఠానామ్=వృద్ధతములైన లోకపాలురకు, ఇన్ద్రః=ఇంద్రుఁడు, అధిపతిః=స్వామి. సః=(అ) అటువంటి యింద్రుఁడు, మా=నన్ను, అవతు=రక్షించుఁగాక. (ముందుఁజెప్పఁబోవు షష్ఠ్యంతములకు పిమ్మట, అధిపతిః, సః, మా, అవతు, అను నాలుగు పదముల ననువర్తింపఁజేసి సమన్వయము చేయవలెను.) యమః=అగ్నివిశేషము, పృథివ్యాః=భూమికి, వాయుః=వాయువు, అన్తరిక్షస్య=అంతరిక్షమునకు, సూర్యః=సూర్యుఁడు, దివః=దివికి, చన్ద్రమాః=చంద్రుఁడు, నక్షత్రాణామ్=నక్షత్రములకు, బృహస్పతిః=బృహస్పతి, బ్రహ్మణః=బ్రాహ్మణజాతికి, మిత్రః=మిత్ర దేవుఁడు, సత్యానామ్=సత్య వచనములకు, వరుణః=వరుణ దేవుఁడు, అపామ్=స్థిరములైన కూపాది గతములైన ఉదకములకు, సముద్రః=సముద్రుఁడు, స్రోత్యానామ్=ప్రవహించునట్టి నదీప్రవాహ గతములైన ఉదకములకు, అన్నమ్=అన్నము, సామ్రాజ్యానామ్=సార్వభౌమ రాజ భోగ్యములైన ద్రవ్యములకు, అధిపతి=స్వామి. (ఇచట అన్నశబ్దము నపుంసకలింగము కావున అనువర్త్యమానమైన అధిపతి శబ్దమునకు లింగవ్యత్యయమును సూచించుటకు 'అధిపతి' అని ఉపాత్తమైనది.) తత్=ఆ యన్నము, మా=నన్ను, అవతు=రక్షించుఁగాక. సోమః=సోముఁడు, ఓషధీనామ్=ఓషధులకు, సవితా=సూర్యుఁడు, ప్రసవానామ్=అనుజ్ఞలకు, రుద్రః=రుద్రుఁడు, పశూనామ్=

పశువులకు, త్వష్టా=త్వష్టృదేవుడు, రూపాణామ్=రూపములకు, విష్ణుః=విష్ణువు, పర్వతానామ్=గోవర్ధనాది పర్వతములకు, మరుతః=మరుత్తులు, గణానామ్=ఆదిత్య వస్వాది గణదేవతలకు, అధిపతయః=అధిపతులు. తే=ఆ మరుత్తులు, మా=నన్ను, అవన్తు=రక్షింతురు గాక. ఇచట 'మరుతః' అను పదము బహువచనాంతము కావున, లింగవ్యత్యయమును దెలుపుటకు 'అధిపతయః' అని ప్రయుక్తమైనది. హే పితరః!=ఓ పితరులారా! (జీవించియున్న తండ్రులు,) హే పితామహాః!=ఓ పితామహులారా! (జీవించియున్న తాతలు) పరే=పీడవ తరమునకు పూర్వులు, అపరే=ఏడవ తరమునకు అర్వాచీనులునగు, హే తతాః!=ఓ చనిపోయిన తండ్రులారా!, హే తతామహాః!=ఓ చనిపోయిన తాతలారా!, ఇహ=ఇచటనే, (తేషు తేషు=ఆ యా విషయములందు), మా=నన్ను, అవత=రక్షింపుడు, అస్మిన్=ఈ, బ్రహ్మన్=బ్రాహ్మణజాతియందు, అస్మిన్ క్షత్రే=ఈ క్షత్రియ జాతియందు, అస్యామ్ ఆశిషి=ఆశాసనీయమైన (కోరదగిన) ప్రజా పశ్వాదిరూప ఫలమునందు, అస్యాం పురోధాయామ్=పురస్కరణరూపమైన ఈ ప్రాధాన్యమునందు, అస్మిన్ కర్మన్=ఈ చేయఁబడుచున్న అనుష్ఠాన విశేషమునందు, అస్యాం దేవహూత్యామ్=దేవతలను గూర్చి చేయుచున్న మా యీ యాహ్వానమునందును, అగ్నిః, భూతానామ్, అధిపతిః, సః, మా, అవతు అని సమన్వయము చేయవలెను, ఇట్లే అస్మిన్ బ్రహ్మన్, అస్మిన్ క్షత్రే, అస్యామ్ ఆశిషి, అస్యాం పురోధాయామ్, అస్మిన్ కర్మన్, అస్యాం దేవహూత్యామ్, ఇన్ద్రః, జ్యేష్ఠానామధిపతిః, సః, మా, అవతు. ఈ విధముగ యమాదులవిషయమునఁ గూడ సమన్వయము చేయవలెను. 'బ్రహ్మన్', 'కర్మన్' అను పదములు లుప్త సప్తమ్యంతములుగా 'శయ్యా' సౌభాగ్యమునకై ప్రయోగించుట ఛందో విశిష్టత.

తాత్పర్యము: అగ్ని ప్రాణులకు స్వామి. అట్టి యగ్ని ఈ బ్రాహ్మణజాతియందు, క్షత్రియజాతియందు, కోరఁదగిన ఈ ప్రజా పశ్వాదిరూప ఫలమునందు, పురస్కరణ (సన్మాన) రూపమైన ఈ ప్రాధాన్యమునందు, ఆచరింపఁబడుచున్న ఈ యనుష్ఠాన విశేషమునందు, మేము దేవతలను గూర్చి చేయు ఈ యాహ్వానమునందును నన్ను రక్షించుఁగాక. ఇట్లే ఇంద్రాదుల విషయమునఁ గూడ సమన్వయము. ఇవి పదునేడు మంత్రములు. ఓ పిత్రాదులారా! మీరు ఈ సర్వ విషయములందును నన్ను రక్షింపుఁడు.

పంచమానువాకము సమాప్తము.

---

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే షష్ఠోఽనువాకః ।

**మూలము:** [1]దేవా వై యద్యజ్ఞేఽకుర్వత తదసురా అకుర్వత తే దేవా ఏతా నభ్యాతానా నపశ్యన్తా నభ్యాతన్వత యద్దేవానాం కర్మాఽఽసీ దార్ధ్యత తద్యదసురాణాం న తదార్ధ్యత [2]యేన కర్మణేర్త్సే త్తత్ర హోతవ్యా ఋధ్నోత్యేవ తేన కర్మణా [3]యద్విశ్వే దేవాః సమభర న్తస్మా దభ్యాతానా వైశ్వదేవా యత్ప్రజాపతి ర్జయాన్ప్రాయచ్ఛ త్తస్మా జ్జయాః ప్రాజాపత్యాః (౧)యద్రాష్ట్రభృద్భీ రాష్ట్రమాఽదదత తద్రాష్ట్రభృతాగ్ం రాష్ట్రభృత్త్వం తే దేవా అభ్యాతానై రసురా నభ్యాతన్వత జయై రజయ న్రాష్ట్రభృద్భీ రాష్ట్రమాఽదదత యద్దేవా అభ్యాతానై రసురా నభ్యాతన్వత తదభ్యాతానానా మభ్యాతానత్వం యజ్జయై రజయ న్తజ్జయానాం జయత్వం యద్రాష్ట్రభృద్భీ రాష్ట్రమాఽదదత తద్రాష్ట్రభృతాగ్ం రాష్ట్రభృత్త్వం తతో దేవా అభవ న్పరాఽసురా [4]యో భ్రాతృవ్యవాన్త్స్యాత్స ఏతా జ్జుహుయా దభ్యాతానై రేవ భ్రాతృవ్యా నభ్యాతనుతే జయైర్జయతి రాష్ట్రభృద్భీ రాష్ట్రమా దత్తే భవత్యాత్మనా పరాఽస్య భ్రాతృవ్యో భవతి ॥ ౨ ॥

(ప్రాజాపత్యాః సోఽష్టాదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే షష్ఠోఽనువాకః

## వేదార్థదీపిక

**అవతారిక:** పంచమానువాకమునందు అభ్యాతానము లనెడి మంత్రము లభిహితము లైనవి. ఈ షష్ఠానువాకమున అభ్యాతాన హోమ విధి చెప్పఁబడుచున్నది. ప్రథమమున హోమమును విధించుటకై తత్ప్రుతి చేయఁబడుచున్నది.

1. **అర్థము:** దేవాః–దేవతలు, యజ్ఞే–యజ్ఞమునందు, యత్–దేనిని, అకుర్వత–చేసిరో, అసురాః–రాక్షసులు, తత్–దానిని, అకుర్వత వై–చేసిరఁట. తే దేవాః–ఆ దేవతలు, ఏతాన్ అభ్యాతానాన్–ఈ అభ్యాతానాఖ్య మంత్రములను, అభ్యాతన్వత–అభిముఖముగ తీసికొనివచ్చి హోమము చేసిరి. దేవానామ్–దేవతలకు, యత్ కర్మ–

ఏ కర్మ, ఆసీత్=ఉండెనో, తత్=ఆ కర్మ, ఆర్ధ్యత=సమృద్ధ మయ్యెను. అసురాణామ్=అసురులకు, యత్=ఏ కర్మ, ఆసీత్=ఉండెనో, తత్=ఆ కర్మ, నార్ధ్యత=(హోమము చేయకుండుటచే) సమృద్ధము కాలేదు.

తాత్పర్యము: పూర్వము దేవతలు యజ్ఞమునందు దేని నాచరించిరో అసురులును తమ యజ్ఞమునందు దాని నాచరించిరట. అప్పుడు దేవతలు అభ్యాతానము లనెడి మంత్రములను కర్మసమృద్ధి హేతువులనుగా కనుఁగొని ఆ మంత్రముల నభిముఖముగ తెచ్చి హోమము చేసిరి. ఆ హోమప్రభావమువలన దేవతల కర్మ సమృద్ధ మయ్యెను. హోమము చేయకుండుటచే అసురుల కర్మ సమృద్ధము కాలేదు.

2. అర్థము: యేన కర్మణా=ఏ కర్మచేత, (యజమానః=యజమానుఁడు), ఈర్త్సేత్=సమృద్ధిని కోరునో, తత్ర=ఆ కర్మ యందు, హోతవ్యాః=అభ్యాతాన మంత్రములు హోమము చేయఁదగినవి. (మంత్రములచే హోమము చేయవలెను. సః=ఆ హోమము చేసిన యజమానుఁడు), తేన కర్మణా=ఆ కర్మచే, ఋధ్నోత్యేవ=నిశ్చయముగ సమృద్ధిని పొందుచున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడు ఏ కర్మచే సమృద్ధిని కోరునో, అతఁడు అభ్యాతాన మంత్రములచే హోమము చేయవలెను. అప్పు డతఁ డా కర్మచే నిశ్చయముగ సమృద్ధి నొందును. (ఇది హోమ విధాయక మంత్రము.)

3. అర్థము: యత్=ఏ కారణమువలన, విశ్వే దేవాః=సర్వ దేవతలు, సమభరన్=(పూర్వోక్తవిధముగ అభ్యాతాన మంత్రములను) సంపాదించిరో, తస్మాత్=ఆ కారణమువలన, అభ్యాతానాః=అభ్యాతాన మంత్రములు, వైశ్వదేవాః వైశ్వదేవములు (విశ్వేదేవ దేవతాకములు, అభవన్=అయినవి). యత్=ఏ కారణమువలన, ప్రజాపతిః=ప్రజాపతి, జయాన్=జయాఖ్య మంత్రములను, ప్రాయుచ్ఛత్=ఇంద్రుని కొసఁగెనో, తస్మాత్=ఆ కారణము వలన, జయాః=జయాఖ్య మంత్రములు, ప్రాజాపత్యాః=ప్రాజాపత్యములు (ప్రజాపతి దేవతాకములు, అభవన్=అయినవి). యత్=ఏ కారణమువలన, (దేవాః=దేవతలు), రాష్ట్రభృద్భిః=రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములచేత, రాష్ట్రమ్=రాష్ట్రమును, ఆదదత=(అసురులనుండి) స్వీకరించిరో, తత్=ఆ కారణమువలన, రాష్ట్రభృతామ్=రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములకు, రాష్ట్రభృత్త్వమ్=రాష్ట్రభృత్పద వాచ్యత్వము, (సమభవత్=సంభవించినది). తే దేవాః=ఆ దేవతలు, అభ్యాతానైః=అభ్యాతాన మంత్రములచేత, అసురాన్=రాక్షసులను, అభ్యాతన్వత=స్వాధీనులనుగాఁ జేసికొనిరి. జయైః=జయాఖ్య మంత్రములచేత, అజయన్=జయించిరి. (వినష్టైశ్వర్యులుగాఁ జేసిరి). రాష్ట్రభృద్భిః=రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములచేత, రాష్ట్రమ్=(అసురుల) రాష్ట్రమును, ఆదదత=తీసికొనిరి (అపహరించిరి). దేవాః=దేవతలు, యత్=ఏ కారణమువలన, అభ్యాతానైః=అభ్యాతాన మంత్రములచేత, అసురాన్=అసురులను, అభ్యాతన్వత=వశ్యులుగాఁ జేసికొనిరో, తత్=ఆ కారణమువలన, అభ్యాతానానామ్=అభ్యాతాన మంత్రములకు, అభ్యాతానత్వమ్=అభ్యాతానసంజ్ఞ, (సమభవత్=సంభవించినది. అభ్యాతన్వత ఏభిరితి అభ్యాతానత్వమ్. వీనిచే అభిముఖులుగాఁ జేసికొందురు అని వ్యుత్పత్త్యర్థము.) యత్=ఏ కారణమువలన, జయైః=జయమంత్రములచే, అజయన్=జయించిరో, తత్=ఆ కారణమువలన, జయానామ్=జయమంత్రములకు, జయత్వమ్=జయసంజ్ఞ, (సంపన్నమ్=సిద్ధించినది. జయన్తి ఏభి రితి జయత్వమ్. ఈ మంత్రములచే జయించుచున్నారు అని వ్యుత్పత్త్యర్థము). యత్=ఏ కారణమువలన, రాష్ట్రభృద్భిః=రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములచే, రాష్ట్రమ్=రాష్ట్రమును, ఆదదత=(అపహరించిరో) తీసికొనిరో, తత్=ఆ కారణమువలన, రాష్ట్రభృతామ్=రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములకు, రాష్ట్రభృత్త్వమ్=రాష్ట్రభృత్త్వసంజ్ఞ, (సంపన్నమ్=సిద్ధించినది. రాష్ట్రం ధ్రియతే ఏభిరితి రాష్ట్రభృత్త్వమ్. ఈ మంత్రములచే రాష్ట్రము స్వీకరింపఁబడుచున్నదని వ్యుత్పత్త్యర్థము.) తతః=ఆ కారణమువలన, (ఈ త్రివిధములైన మంత్రములవలన), దేవాః=దేవతలు, అభవన్=విజయులైరి. అసురాః=అసురులు, పరాభవన్=పరాభూతులైరి.

తాత్పర్యము: శత్రువులు కలవాఁడు అభ్యాతాన జయ రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములచే హోమము చేయవలెననియు, అట్లు చేసినచో దేవతలు విజయులైన విధముగ విజయము నొందుననియు ఈ మంత్రముయొక్క సారాంశము. తాత్పర్యము అర్థమునందే వివరించఁబడినది.

4. అర్థము: యః—ఎవఁడు, భ్రాతృవ్యవాన్—శత్రువులు కలవాఁడు, స్యాత్—అగునో, సః—అతఁడు, ఏతాన్—ఈ అభ్యాతాన, జయ, రాష్ట్రభృన్మంత్రములను (మంత్రములచే), జుహుయాత్—హోమము చేయునో, (సః—అతఁడు), అభ్యాతానైరేవ—అభ్యాతాన మంత్రములచేతనే, భ్రాతృవ్యాన్—శత్రువులను, అభ్యాతమతే—వశ్యులనుగాఁ జేసికొనుచున్నాఁడు. జయైః—జయసంజ్ఞక మంత్రములచేత, జయతి—జయించుచున్నాఁడు. రాష్ట్రభృద్భిః—రాష్ట్రభృన్మంత్రములచే, రాష్ట్రమ్—రాష్ట్రమును, ఆదత్తే—స్వీకరించుచున్నాఁడు. ఆత్మనా—స్వయముగా, భవతి—విజయవంతుఁ డగుచున్నాఁడు. అస్య—ఇతనియొక్క, భ్రాతృవ్యః—శత్రువు, పరాభవతి—పరాభూతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: శత్రువులు గల యతఁడు పూర్వోక్తములైన అభ్యాతాన జయ రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెను. ఆ హోమము చేసిన యతఁడు అభ్యాతాన మంత్రములచే శత్రువులను వశపఱచుకొనును. జయ మంత్రములచే జయించును. రాష్ట్రభృన్మంత్రములచే శత్రురాష్ట్రమును (నివాసమును) స్వీకరించును. అభ్యాతతి అనఁగా వశీకారము. జయ మనఁగా అన్యదీయైశ్వర్య నాశనము. రాష్ట్రాదాన మనఁగా శత్రుభూమి నపహరించుట అని సారాంశము. ఈ మంత్రము హోమవిధాయకము.

షష్ఠానువాకము సమాప్తము.

---

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే సప్తమోఽనువాకః ।

మూలము: [1]ఋతాషాడృతధామాఽగ్నిర్గన్ధర్వస్తస్యౌషధయోఽప్సరస ఊర్జో నామ స ఇదం బ్రహ్మ క్షత్రం పాతు తా ఇదం బ్రహ్మ క్షత్రం పాన్తు తస్మై స్వాహా తాభ్యః స్వాహా [2]సగ్ంహితో విశ్వసామా సూర్యో గన్ధర్వస్తస్య మరీచయోఽప్సరస ఆయువః [3]సుషుమ్నః సూర్యరశ్మిశ్చన్ద్రమా గన్ధర్వస్తస్య నక్షత్రాణ్యప్సరసో బేకురయో [4]భుజ్యుః సుపర్ణో యజ్ఞో గన్ధర్వస్తస్య దక్షిణా అప్సరసః స్తవాః [5]ప్రజాపతిర్విశ్వకర్మా మనః (౧) గన్ధర్వస్తస్యర్క్సామాన్యప్సరసో వహ్నయ [6]ఇషిరో విశ్వవ్యచా వాతో గన్ధర్వస్తస్యాఽఽపోఽప్సరసో ముదా [7]భువనస్య పతే యస్య త ఉపరి గృహా ఇహ చ । స నో రాస్వాజ్యానిగ్ం రాయస్పోషగ్ం సువీర్యగ్ం సంవత్సరీణాగ్ం స్వస్తిమ్ । [8]పరమేష్ఠ్యధిపతిర్మృత్యుర్గన్ధర్వస్తస్య విశ్వమప్సరసో భువః [9]సుక్షితిః సుభూతిర్భద్రకృత్సువర్వాన్పర్జన్యో గన్ధర్వస్తస్య విద్యుతోఽప్సరసో రుచో [10]దూరేహేతిరమృడయః (౨) మృత్యుర్గన్ధర్వస్తస్య ప్రజా అప్సరసో భీరువ [11]శ్చారుః కృపణకాశీ కామో గన్ధర్వస్తస్యాఽఽధయోఽప్సరసః శోచయన్తీర్నామ స ఇదం బ్రహ్మ క్షత్రం పాతు తా ఇదం బ్రహ్మ క్షత్రం పాన్తు తస్మై స్వాహా తాభ్యః స్వాహా [12]స నో భువనస్య పతే యస్య త ఉపరి గృహా ఇహ చ । ఉరు బ్రహ్మణేఽస్మై క్షత్రాయ మహి శర్మ యచ్ఛ ॥ ౩ ॥

(మనోఽమృడయః షట్త్రిగ్ంశచ్చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థప్రపాఠకే సప్తమోఽనువాకః ॥

## వేదార్థదీపిక

**అవతారిక:** షష్ఠానువాకమునందు అభ్యాతాన జయ రాష్ట్రభృన్మంత్రములతోడి హోమము విధింపఁబడినది. ఈ సప్తమానువాకమునందు రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములు విధింపఁబడుచున్నవి.

1. **అర్థము:** ఋతాషాట్–సత్యముచే అసత్యము నంతటిని తిరస్కరించువాఁడును, ఋతధామా–ఋతశబ్ద వాచ్యమైన స్థానము కల వాఁడునగు, అగ్నిః–అగ్నినామకుఁడైన, గన్ధర్వః–గన్ధర్వుఁడు, (అస్తి–కలఁడు). తస్య=ఆ గంధర్వునకు, ఊర్జః నామ–'ఊర్జ' అను పేరు గలిగిన, ఓషధయః–ఓషధిదేవతలు, అప్సరసః–ప్రియభార్యలుగా, (ఆసన్–ఉండిరి). సః–ఆ గంధర్వుఁడు, ఇదం బ్రహ్మ–ఈ బ్రాహ్మణజాతిని, క్షత్రమ్–క్షత్రియజాతిని, పాతు=రక్షించుఁగాక. తాః–ఆ ఓషధిదేవతలు, ఇదం బ్రహ్మ–ఈ బ్రాహ్మణ జాతిని, క్షత్రమ్–క్షత్రియ జాతిని, పాన్తు=రక్షింతురు గాక. తస్మై–ఆ గంధర్వునికొఱకు, స్వాహా–(ఈ హవిస్సు) హుత మగుఁగాక (అర్పిత మగుఁగాక.) తాభ్యః–ఆ ఓషధిదేవతలకొఱకు, స్వాహా–(ఈ హవిస్సు) హుత మగుఁగాక.

**తాత్పర్యము:** అగ్నినామక గంధర్వుఁడు సత్యముచే నసత్యమును తిరస్కరించువాఁడు. ఋతశబ్ద వాచ్యమైన సత్యము అతని స్థానము. ఓషధి దేవతలు అతనికి ప్రియభార్యలు. 'ఊర్జ' అని ఆ భార్యల పేరు. ఆ గంధర్వుఁడు ఈ బ్రాహ్మణజాతిని క్షత్రియజాతిని రక్షించుఁగాక. అతని భార్యలు ఈ బ్రాహ్మణజాతిని క్షత్రియజాతిని రక్షింతురు గాక. ఆ గంధర్వునకు ఈ హవిస్సు అర్పింపఁబడినది. హుత మగుఁగాక. ఆ ఓషధిదేవతలకు ఈ హవిస్సు అర్పింపఁబడినది. హుతమగుఁగాక. (ఈ యనువాకమునందు పండ్రెండు రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములు చెప్పఁబడినవి. ఈ ద్వాదశమంత్రములచేతను ఆఱు పర్యాయములు హోమము చేయవలెను. 'తస్మై స్వాహా' అని ఒక ఆహుతిని, తాభ్యః స్వాహా అని రెండవ ఆహుతిని హోమము చేయవలెను. "ఋతాషాదృతధామా" ఇత్యాది మంత్రముచే ప్రథమ పర్యాయము హోమము చేయవలెను. ఈ వినియోగ విధానమును అగ్నికాండమునందు సూత్రకారులు చెప్పియుండిరి, ఇది ప్రథమ పర్యాయము.)

2. **అర్థము:** సంహితః–సర్వము ననుసంధానము చేయువాఁడును, విశ్వసామా–సమస్త సామములు తెలిసినవాఁడును నగు, సూర్యః గన్ధర్వః–సూర్యనామక గంధర్వుఁడు, (అస్తి–కలఁడు). తస్య–అతనికి, ఆయువః–ఆయు అను పేరు గల, మరీచయః–మరీచిదేవతలు, అప్సరసః–ప్రియభార్యలుగా, (ఆసన్–ఉండిరి). సః ఇదం బ్రహ్మ, క్షత్రమ్, పాతు, తాః, ఇదం బ్రహ్మ క్షత్రమ్ పాన్తు. తస్మై, స్వాహా. తాభ్యః, స్వాహా. (స ఇదం బ్రహ్మేత్యాదికము సర్వమును ఇచ్చట అనుషంజనము చేసికొని అర్థము చెప్పుకొనవలయును. దీని అర్థ తాత్పర్యములు 1 వ వాక్యమున వివరింపఁబడినవి. ఇది ద్వితీయ పర్యాయము.)

3. **అర్థము:** సుషుమ్నః–మంచి సుఖము కలవాఁడును, సూర్యరశ్మిః–సూర్యునకువలె కిరణములు కలవాఁడునునగు, చన్ద్రమాః–చంద్రమో నామకుఁడైన, గన్ధర్వః–గన్ధర్వుఁడు, (అస్తి–కలఁడు). తస్య–అతనికి, బేకురయః–బేకురి నామకులైన, నక్షత్రాణి–నక్షత్ర సదృశలైన, అప్సరసః–ప్రియభార్యలు, (ఆసన్–ఉండిరి.) "స ఇదం బ్రహ్మక్షత్ర" మిత్యాదికము 1 వ మంత్రమునందువలె సమన్వయము చేయవలెను.

**తాత్పర్యము:** చంద్రమో నామక గంధర్వుఁడు మంచి సుఖము కలవాఁడు. అతనికి బేకురినామకలైన నక్షత్రసదృశ భార్యలు కలరు. శేషము ప్రథమ మంత్రమువలెనే గ్రాహ్యము. చిత్తవికార హేతువు లగుటవలన బేకురినామ మేర్పడినది. (ఇది తృతీయ పర్యాయము.)

4. **అర్థము:** భుజ్యుః–విశ్వమును పాలించువాఁడును, సుపర్ణః–పక్షివలె ఆకాశమునందు సంచరించువాఁడునునగు, యజ్ఞః గన్ధర్వః–యజ్ఞనామక గంధర్వుఁడు, (అస్తి–కలఁడు). తస్య=అతనికి, స్తవాః–'స్తవ' అను పేరు గల, దక్షిణాః అప్సరసః–దక్షిణారూప దేవతలు భార్యలుగా, (ఆసన్–ఉండిరి). శేషము ప్రథమ మంత్రమువలె యోజన చేయవలెను.

తాత్పర్యము: యజ్ఞనామక గంధర్వుఁడు విశ్వమును పాలించువాఁడు. పక్షివలె ఆకాశమున సంచరించువాఁడు. అతనికి స్తవ నామక దక్షిణారూప దేవతలు భార్యలుగా నుండిరి. శేషము ప్రథమ మంత్రమునందువలె యోజన చేయ వలెను. (ఇది చతుర్థ పర్యాయము.)

5. అర్థము: ప్రజాపతిః=ప్రజాపాలకుఁడు, విశ్వకర్మా=చేయఁదగిన విశ్వకర్మ కలవాఁడును అగు, మనఃగన్ధర్వః=మనో నామక గంధర్వుఁడు, అస్తి=కలఁడు. తస్య=అతనికి, వహ్నయః=సౌందర్యమును వహించునట్టి, ఋక్సామాని=ఋక్సామదేవతలు, అప్సరసః=భార్యలుగా, (ఆసన్=ఉండిరి) శేషము ప్రథమ మంత్రమునందుఁ జెప్పఁబడినది.

తాత్పర్యము: ప్రజాపాలకుఁడు విశ్వకర్మ కలవాఁడునగు మనోనామక గంధర్వుఁ డుండెను. అతనికి సౌందర్యము వహించు ఋక్సామదేవతలు భార్యలుగా నుండిరి. శేషము ప్రథమమంత్రోక్తమే. (సౌందర్యం) వహన్తీతి=వహ్నయః. ఇది పంచమ పర్యాయము.

6. అర్థము: ఇషిరః=కోరఁబడుచున్న వస్తువులతోనున్నవాఁడు, విశ్వవ్యచాః=విశేషముగ విశ్వమును తిరుగువాఁడునగు, వాతః గన్ధర్వః=వాతనామక గంధర్వుఁడు, అస్తి=కలఁడు. తస్య=అతనికి, ముదాః='ముదా' నామధేయము కల, ఆపః అప్సరసః=అబ్దేవతలు భార్యలుగా, ఆసన్=ఉండిరి. 'స ఇదం బ్రహ్మ'త్యాదికము ప్రథమ మంత్రమువలె గ్రాహ్యము.

తాత్పర్యము: తాను కోరిన వస్తువుతో నుండువాఁడును, విశేషముగ విశ్వమును తిరుగువాఁడునునగు వాతనామక గంధర్వుఁ డొకఁడుండెను. అతనికి అబ్దేవతలు ముదానామక భార్యలుగా నుండిరి. శేషము ప్రథమ మంత్రమున ఉక్తము. (హర్షయుక్త లగుటచే వారికి 'ముదా' అను పేరు ఏర్పడినది. ఇది షష్ఠ పర్యాయము.)

7. అర్థము: హే భువనస్య పతే=ఓ సర్వలోక పాలకా!, యస్య తే=ఏ నీకు, ఉపరి=అంతరిక్ష ద్యులోకములందు, ఇహ చ=ఈ భూలోకమునందును, గృహాః=గృహములు, (సన్తి=కలవో,) సః=ఆ నీవు, నః=మాకొఱకు, అజ్యానిమ్=వయోహాని లేకుండుటను, రాయస్పోషమ్=ధనపుష్టిని, సువీర్యమ్=శోభన పుత్రుని, సంవత్సరీణాం స్వస్తిమ్=సంవత్సర జీవన పరిమిత సమృద్ధిని, రాస్వ=ఒసఁగుము.

తాత్పర్యము: ఓ భువనపాలకా! పృథివ్యంతరిక్ష ద్యులోకములందు గృహములు గల నీవు మాకు వయోహాని లేకుండుటను, ధనపుష్టిని, శోభన పుత్రుని, సంవత్సరజీవన పరిమితమైన సమృద్ధిని ఒసఁగుము. (ఒక్కొక్క పర్యాయము రెండేసి ఆహుతులు చొప్పున ఆఱు పర్యాయములకు పండ్రెండు ఆహుతులు చెప్పఁబడినవి. పదుమూఁడవ ఆహుతికొఱకు ఈ మంత్రము చెప్పఁబడినది. ఇది యేడవ పర్యాయము.)

8. అర్థము: పరమేష్ఠీ=సర్వోత్తమస్థానమునం దుంటున్నవాఁడును, అధిపతిః=అధికముగ ఫలము నిచ్చువాఁడునగు, మృత్యుః గన్ధర్వః=మృత్యునామక గంధర్వుఁడు (అస్తి=కలఁడు.) తస్య=అతనికి, భువః='భువ' అను పేరు గల, విశ్వమ్ అప్సరసః=విశ్వాభిమాని దేవతలు భార్యలుగా, (ఆసన్=ఉండిరి.) 'స ఇదం బ్రహ్మ'త్యాదికము ప్రథమ మంత్రోక్తము అనుషంజనీయము.

తాత్పర్యము: మృత్యునామక గంధర్వుఁడు సర్వోత్తమ స్థానమునం దుండువాఁడు. అధిక ఫలప్రదాత. అతనికి భువో నామక విశ్వాభిమాని దేవతలు భార్యలుగా నుండిరి. శేషము పూర్వోక్తము. (ఉక్తంపర్యాయ పంచకమునం దీ మంత్రము ప్రథమ పర్యాయ మంత్రము.)

9. అర్థము: సుక్షితిః=సమీచీన నివాసస్థానము కలవాఁడును, సుభూతిః=మంచి ఐశ్వర్యము కలవాఁడును, భద్రకృత్=యజమానునకు మంగళమును జేయువాఁడును, సువర్వాన్=స్వాధీనమైన స్వర్గలోకము కలవాఁడునునగు, పర్జన్యః గన్ధర్వః=పర్జన్యనామక గంధర్వుఁడు, (అస్తి=కలఁడు). తస్య=అతనికి, రుచః విద్యుతః=రుచో నామక విద్యుద్దేవతలు, అప్సరసః=భార్యలుగా, (ఆసన్=ఉండిరి.) 'స ఇదం బ్రహ్మ'త్యాదికము ప్రథమ మంత్రమునందువలె యోజన చేయవలెను.

**తాత్పర్యము:** పర్జన్యనామక గంధర్వుఁడు సమీచీన నివాసస్థానము కలవాఁడు. మంచి యైశ్వర్యము కలవాఁడు. యజమానునకు మంగళమును కలుగఁజేయువాఁడు. స్వర్గమును స్వాధీనము చేసికొనినవాఁడు. అతనికి రుచోనామక విద్యుద్దేవతలు భార్యలుగా నుండిరి. శేషము పూర్వోక్తము, ఇది ఉత్తర పర్యాయ పంచకమునందు ద్వితీయ పర్యాయము.

10. **అర్థము:** దూరేహేతిః=దూరమునం దున్నవానిని కూడ కొట్టుటకు సాధనమైన ఆయుధము కలవాఁడును, అమృడయః=నామమాత్రమును వినుటచేతనే సుఖమును పోఁగొట్టువాఁడునునగు, మృత్యుః గన్ధర్వః=మృత్యునామక గంధర్వుఁడు (అస్తి=ఉండెను). తస్య=అతనికి, భీరువః ప్రజాః=భీరునామక ప్రజాభిమాని దేవతలు, అప్సరసః=భార్యలుగా, (ఆసన్=ఉండిరి). 'స ఇదం బ్రహ్మ'ేత్యాదికము ప్రథమ మంత్రమునందువలె యోజన చేసికొనవలెను.

**తాత్పర్యము:** మృత్యునామక గంధర్వుఁడు దూరమునం దున్నవానినికూడ కొట్టుటకు సాధనమైన ఆయుధము కలవాఁడు. నామ శ్రవణముచేతనే సుఖమును పోఁగొట్టువాఁడు. అతనికి భీరువులను పేరు గల ప్రజాభిమానిదేవతలు భార్యలుగా ఉండిరి. శేషము ప్రథమ మంత్రమువలె గ్రాహ్యము.

11. **అర్థము:** చారుః=(రమణీయ శరీరము కలవాఁడగుటచే) సుందరుఁడును, కృపణకాశీ=ఇంద్రియార్థములందు (విషయములందు) మనస్సును ప్రకాశింపఁజేయువాఁడును అగు, కామః గన్ధర్వః=కాముఁడనెడి గంధర్వుఁడు, (అస్తి=కలఁడు). తస్య=అతనికి, శోచయన్తీః నామ=శోచయన్తి యను పేరు గల, ఆధయః=విషయాభిలాష నిమిత్త చిత్త క్లేశాభిమాని దేవతలు, అప్సరసః=భార్యలుగా, ఆసన్=ఉండిరి. ("స ఇదం బ్రహ్మ" త్యాదికము ప్రథమ మంత్రవ్యాఖ్యానమున వివరింపఁబడినది. ఇది సర్వత్ర అనుషంజనీయమని సూచించుటకు పునరుపాత్తమైనది.)

**తాత్పర్యము:** కామనామక గంధర్వుఁడు సుందరుఁడు. ఇంద్రియార్థము లయిన విషయములందు మనస్సును ప్రకాశింపఁజేయువాఁడు. అతని భార్యలు విషయాభిలాష నిమిత్త చిత్తక్లేశాభిమాని దేవతలు. 'శోచయన్తి' అను పేరు కలవారు. అపేక్షిత విషయము లభింపనప్పుడు మనుజులను శోకవంతులనుగాఁ జేయువారు కావున వారికి 'శోచయన్తి' అని పేరు కలిగినది. (ఇది ఉత్తర పర్యాయ పంచకమునందు చతుర్థ పర్యాయము.)

12. **అర్థము:** హే భువనస్య పతే!=ఓ సర్వలోక పాలకా!, యస్య తే=ఏ నీకు, ఉపరి=ఉపరితన లోకద్వయమునందు (అన్తరిక్ష ద్యులోకములందు), ఇహ చ=ఈ భూలోకమునందును, గృహాః=గృహములు, (సన్తి=కలవో), సః=ఆ నీవు, నః=మాకొఱకు, ఉరు=విపులమైన, శర్మ=సుఖమును, యచ్ఛ=ఒసఁగుము. తథైవ=అట్లే, అస్మై బ్రహ్మణే=ఈ బ్రాహ్మణ జాతీయునికొఱకు, క్షత్రాయ=సమర్థుఁ డయిన క్షత్త్రియునికొఱకును, మహి శర్మ=గొప్ప సుఖమును, యచ్ఛ=ఇమ్ము.

**తాత్పర్యము:** ఓ సర్వలోక పాలకా! నీకు పృథివ్యంతరిక్ష ద్యులోకములందు గృహములు కలవు. అట్టి నీవు మాకు విపులమైన సుఖము నొసఁగుము. అట్లే ఈ బ్రాహ్మణజాతీయునకు సమర్థుఁడైన క్షత్త్రియునకు గొప్ప సుఖము నిమ్ము. (ఇది పంచమ పర్యాయరూపమైన ద్వాదశాహుతి సాధన మంత్రము.)

సప్తమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ఽష్టమోఽనువాకః

మూలము: [1]రాష్ట్రకామాయ హోతవ్యా రాష్ట్రం వై రాష్ట్రభృతో రాష్ట్రేణైవాస్మై రాష్ట్రమవ రున్ధే రాష్ట్రమేవ భవ[2]త్యాత్మనే హోతవ్యా రాష్ట్రం వై రాష్ట్రభృతో రాష్ట్రం ప్రజారాష్ట్రం పశవో రాష్ట్రం యచ్ఛ్రేష్ఠో భవతి రాష్ట్రేణైవ రాష్ట్రమవ రున్ధే వసిష్ఠః సమానానాం భవతి [3]గ్రామకామాయ హోతవ్యా రాష్ట్రం వై రాష్ట్రభృతో రాష్ట్రగ్ం సజాతా రాష్ట్రేణైవాస్మై రాష్ట్రగ్ం సజాతానవ రున్ధే గ్రామీ (౧)ఏవ భవ[4]త్యధిదేవనే జుహోత్యధిదేవన ఏవాస్మై సజాతానవ రున్ధే త ఏనమ వరుద్ధా ఉపతిష్ఠన్తే [5]రథముఖ ఓజస్కామస్య హోతవ్యా ఓజో వై రాష్ట్రభృత ఓజో రథ ఓజసైవాస్మా ఓజోఽవ రున్ధ ఓజస్వ్యేవ భవతి [6]యో రాష్ట్రాదపభూతః స్యాత్తస్మై హోతవ్యా యావన్తోఽస్య రథాః స్యుస్తాన్బ్రూయాద్యుఙ్ధ్వమితి రాష్ట్రమేవాస్మై యునక్తి (౨)[7]ఆహుతయో వా ఏతస్యా క్లృప్తా యస్య రాష్ట్రం న కల్పతే స్వరథస్య దక్షిణం చక్రం ప్రవృహ్య నాడీమభి జుహుయా దాహుతీరేవాస్య కల్పయతి తా అస్య కల్పమానా రాష్ట్రమను కల్పతే [8]సఙ్గ్రామే సంయత్తే హోతవ్యా రాష్ట్రం వై రాష్ట్రభృతో రాష్ట్రే ఖలు వా ఏతే వ్యాయచ్ఛన్తే యే సఙ్గ్రామగ్ం సంయన్తి యస్య పూర్వస్య జుహ్వతి స ఏవ భవతి జయతి తగ్ం సఙ్గ్రామం [9]మాన్ధుక ఇధ్మః (౩)భవత్య ఙ్గారా ఏవ ప్రతివేష్టమానా అమిత్రాణామస్య సేనాం ప్రతివేష్టయన్తి [10]య ఉన్మాద్యేత్తస్మై హోతవ్యా గన్ధర్వాప్సరసో వా ఏతమున్మాదయన్తి య ఉన్మాద్యత్యేతే ఖలు వై గన్ధర్వాప్స రసో యద్రాష్ట్రభృత స్తస్మై స్వాహా తాభ్యః స్వాహేతి జుహోతి తేనైవైనా ఞ్ఛమయతి [11]నైయ

గ్రోధ ఔదుమ్బర అశ్వత్థః ప్లాక్ష ఇతీధ్మో భవత్యేతే వై గన్ధర్వాప్సరసాం గృహాః స్వ ఏవైనాన్

(४)ఆయతనే శమయత్య[12]భిచరతా ప్రతిలోమగ్ం హోతవ్యాః ప్రాణానేవాస్య ప్రతీచః ప్రతి

యౌతి తం తతో యేన కేన చ స్తృణుతే [13]స్వకృత ఇరిణే జుహోతి ప్రదరేవైతద్వా అస్యై

నిర్‌ఋతిగృహీతం నిర్‌ఋతిగృహీత ఏవైనం నిర్‌ఋత్యా గ్రాహయతి యద్వాచః క్రూరం తేన వషట్క

రోతి వాచ ఏవైనం క్రూరేణ ప్ర వృశ్చతి తాజగార్తి మార్ఛతి [14]యస్య కామయేతాన్నాద్యమ్

(५)ఆదదీయేతి తస్య సభాయా ముత్తానో నిపద్య భువనస్య పత ఇతి తృణాని సం గృహ్ణీయా

త్ప్రజాపతిర్వై భువనస్య పతిః ప్రజాపతినైవాస్యాన్నాద్యమా దత్త ఇదమహ మముష్యా

ఽఽముష్యాయణస్యాన్నాద్యగ్ం హరామీత్యాహాన్నాద్య మేవాస్య హరతి [15]షడ్భిర్హరతి షడ్వా

ఋతవః ప్రజాపతినైవాస్యాన్నాద్య మాదాయర్తవో ఽస్మా అను ప్ర యచ్ఛన్తి (६)[16]యో

జ్యేష్ఠబన్ధు రపభూతః స్యాత్తగ్ం స్థలేఽవసాయ్య బ్రహ్మౌదనం చతుఃశరావం పక్త్వా తస్మై

హోతవ్యా వర్ష్మ వై రాష్ట్రభృతో వర్ష్మ స్థలం వర్ష్మణైవైనం వర్ష్మ సమానానాం గమయతి

[17]చతుఃశరావో భవతి దిక్ష్వేవ ప్రతి తిష్ఠతి [18]క్షీరే భవతి రుచమేవాస్మి న్దధా[19]త్యుద్ధరతి శృత

త్వాయ [20]సర్పిష్వాన్భవతి మేధ్యత్వాయ [21]చత్వార ఆర్షేయాః ప్రాశ్నన్తి దిశామేవ జ్యోతిషి

జుహోతి ॥ ౭ ॥ (గ్రామీ యునక్తి ధ్మః స్వ ఏవైనా నన్నాద్యం యచ్ఛన్త్యేకాన్నపఞ్చాశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థప్రపాఠకే ఽష్టమోఽనువాకః॥

## వేదార్థదీపిక

అవతారిక: సప్తమానువాకమునందు రాష్ట్రభృన్మంత్రములు అన్నియుఁ జెప్పఁబడినవి. ఈ అష్టమానువాకమునందు ఆ రాష్ట్రభృన్మంత్రములకు కామ్యప్రయోగములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: రాష్ట్రభృతః=రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములు, రాష్ట్రం వై=(రాష్ట్రప్రాప్తి హేతువులు కావున) రాష్ట్రస్వరూపమే, (అతః=ఇందువలన), రాష్ట్రకామాయ=రాష్ట్రప్రాప్తిని కోరు యజమానునికొఱకు, హోతవ్యాః=హోమము చేయఁదగినవి. (అధ్వర్యుః=అధ్వర్యుఁడు, అస్మై=ఈ రాష్ట్రకాముకుఁడైన యజమానునికొఱకు, రాష్ట్రేణైవ=తన్మంత్ర హోమలక్షణమైన రాష్ట్రముచేతనే, రాష్ట్రమ్=భూమివిశేష రూపమైన రాష్ట్రమును, అవరున్ధే=సంపాదించుచున్నాఁడు. (సః=ఆ యజమానుఁడు), రాష్ట్రమ్=రాష్ట్రమును, భవత్యేవ=నిశ్చయముగ పొందినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: రాష్ట్రభృన్మంత్రములు రాష్ట్రప్రాప్తి హేతువు లగుటచే రాష్ట్రస్వరూపమే కావున రాష్ట్రప్రాప్తిని కోరువాని నిమిత్తము అధ్వర్యుఁడు రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెను. అట్టి యధ్వర్యుఁడు రాష్ట్రకాముకుఁడైన యజమానునికొఱకు రాష్ట్రభృన్మంత్ర హోమలక్షణమైన రాష్ట్రముచేతనే భూమివిశేష రూపమైన రాష్ట్రమును సంపాదించుచున్నాఁడు. ఆ యజమానుఁడు నిశ్చయముగ రాష్ట్రమును పొందుచున్నాఁడు. (రాష్ట్రము=భూమివిశేషము. ఇది యొక ప్రయోగము.)

2. అర్థము: ఆత్మనే=ఆత్మోత్కర్షకొఱకు, హోతవ్యాః=రాష్ట్రభృన్మంత్రములు హోమము చేయఁదగినవి. రాష్ట్రభృతః=రాష్ట్రభృన్మంత్రములు, రాష్ట్రం వై=(రాష్ట్రప్రాప్తి హేతువు లగుటచే) రాష్ట్రస్వరూపమే. శ్రేష్ఠః భవతి యత్=ఆత్మోత్కర్షను కోరునతఁడు శ్రేష్ఠుఁ డగుచో, తత్=అప్పుడు, ప్రజాః=ప్రజలు, (భోగహేతు వగుటచే), రాష్ట్రమ్=రాష్ట్ర స్వరూపులు. పశవః=పశువులు, రాష్ట్రమ్=రాష్ట్ర స్వరూపములు. రాష్ట్రేణైవ=రాష్ట్రరూప రాష్ట్రభృన్మంత్రముచే, రాష్ట్రమ్=ప్రజాదిరూపమైన ఆత్మోత్కర్షరూప రాష్ట్రమును, అవరున్ధే=పొందుచున్నాఁడు. (తథా) సతి=అట్లు అగుచుండఁగా, యజమానః=యజమానుఁడు), సమానానామ్=సమానులలో (ఇతరులలో), వసిష్ఠః=స్వయముగనే అతిశయముగ ఉత్తమ నివాస హేతువు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: ప్రథమ మంత్రమునఁ జెప్పఁబడినవిధముగ రాష్ట్రభృన్మంత్రములు రాష్ట్రసాధనము లగుటచే రాష్ట్రస్వరూపములు. ఆత్మోత్కర్షనిమిత్తము యజమానుఁడు రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెను. భూమివిశేషరూప రాష్ట్రము ఉన్నను ప్రజా పశుశ్రేష్ఠత్వములు లేనిచో భోగము సంభవించదు. కావున భోగహేతు వగుటచే ప్రజలు పశువులు కూడ రాష్ట్రస్వరూపములు. ఇట్టి యజమానుఁడు రాష్ట్రరూప రాష్ట్రభృన్మంత్రము చేతనే ప్రజా పశ్వాదిరూపమైన ఆత్మోత్కర్షరూప రాష్ట్రమును పొందును. అప్పు డతఁడు ఇతరులలో స్వయముగనే అతిశయముగ ఉత్తమ నివాస హేతువగుచున్నాఁడు. (ఇచట ప్రజాపశ్వాదులు రాష్ట్రస్వరూపముగ వర్ణింపఁబడినవి. ఆత్మోత్కర్షప్రాప్తికై ఈ మంత్రముచే హోమము విధింపఁబడినది.)

3. అర్థము: గ్రామకామాయ=గ్రామమును కోరు యజమానునికై, హోతవ్యాః=రాష్ట్రభృన్మంత్రములు హోమము చేయఁదగినవి. రాష్ట్రభృతః, రాష్ట్రం వై, (అర్థము పూర్వోక్తము.) సజాతాః=సహోత్పన్నులయిన జ్ఞాతులు, ఏకగ్రామ నివాసులు, రాష్ట్రమ్=రాష్ట్రస్వరూపులు. (అధ్వర్యుః=అధ్వర్యుఁడు), రాష్ట్రేణైవ=మంత్రరూప రాష్ట్రము చేతనే, రాష్ట్రమ్=సజాతరూప రాష్ట్రమును, అవరున్ధే=సంపాదించుచున్నాఁడు. (తదా=అప్పుడు, యజమానః=యజమానుఁడు), గ్రామీ=గ్రామస్వామి, భవత్యేవ=నిశ్చయముగ నగుచున్నాఁడు.

తాత్పర్యము: తనతోఁగూడఁ బుట్టినవారు, ఏకగ్రామవాసులు సజాతు లనఁబడుదురు. సజాతు లందఱు ఉన్నప్పుడే గ్రామము సంపూర్ణ మగును. గ్రామమును కోరువానికొఱకు రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలయును. రాష్ట్రభృన్మంత్రములు రాష్ట్రప్రాప్తి హేతువు లగుటచే రాష్ట్ర స్వరూపములు. సజాతులు రాష్ట్రస్వరూపులు. కావున అధ్వర్యుఁడు ఈ యజమానునికై మంత్రరూప రాష్ట్రముచేతచే సజాతరూప రాష్ట్రమును సంపాదించును. అప్పుడు యజమానుఁడు నిశ్చయముగ గ్రామస్వామి యగును. (ఈ మంత్రము గ్రామప్రాప్తికై హోమమును విధించినది.)

4. అర్థము: అధిదేవనే=జూదమాడు స్థలమునందు, జుహోతి=(పూర్వోక్తమైన) హోమము చేయవలెను. (అధ్వర్యుః=హోమము చేసిన అధ్వర్యుఁడు), అధిదేవనే ఏవ=జూదమాడు స్థలమునందే, అస్మై=ఈ యజమానునికొఱకు,

సజాతాన్–(పూర్వోక్త) సజాతులను, అవరున్ద్ధే–పొందుచున్నాఁడు, (స్వాధీనులనుగాఁ జేయుచున్నాఁడు). అవరుద్ధాః–స్వాధీనులైన, తే–ఆ సజాతులు, ఏనమ్–ఈ యజమానుని, ఉపతిష్ఠన్తి–సేవించుచున్నారు.

తాత్పర్యము: మూఁడవ మంత్రమునందు విహితమైన హోమము జూదమాడు స్థలమునందు చేయవలెను. అట్లు హోమము చేసిన అధ్వర్యుఁడు అధిదేవనమునందే ఈ యజమానునకు సజాతులను స్వాధీనులనుగాఁ జేయువాఁ డగును. అప్పుడు స్వాధీనులైన సజాతులు ఈ యజమానుని సేవింతురు. (హోమము చేయుటకు తగిన దేశవిశేష మిచట నిర్దేశింపఁబడినది.)

5. అర్థము: ఓజస్కామస్య–ఓజస్సునుకోరు యజమానునికై, (చతుర్థ్యర్థే షష్ఠీ.) రథముఖే–నాగటి యేఁడికోలయందు హోతవ్యాః–రాష్ట్రభృన్మంత్రములు హోమము చేయఁదగినవి. రాష్ట్రభృతః–రాష్ట్రభృన్మంత్రములు, ఓజః వై–ఓజస్స్వరూపములు కదా!, రథః–రథము, ఓజః–ఓజస్స్వరూపము. (అతః–ఇందువలన, సః అధ్వర్యుః–ఇట్లు హోమముచేసిన ఆ యధ్వర్యుఁడు), ఓజసైవ–మంత్ర రథోభయరూపమైన ఓజస్సుచేతనే, అస్మై–ఈ యజమానునికొఱకు, ఓజః–ఓజస్సును(బలమును,) అవరున్ద్ధే–సంపాదించుచున్నాఁడు. (తదా–అప్పుడు, సః–ఆ యజమానుఁడు యజమానుఁడు), ఓజస్వీ–బలవంతుఁడు, భవత్యేవ–నిశ్చయముగ నగుచున్నాఁడు.

తాత్పర్యము: అధ్వర్యుఁడు బలమును గోరు యజమానునికొఱకు రథముఖమునందు (నాగటి యేఁడికోల నగ్నిపైనుంచి దానియందు) రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెను. రాష్ట్రభృన్మంత్రములు, రథము క్రతు హేతువు లగుటచే ఆ యుభయము ఓజస్స్వరూపము. అట్లు హోమము చేసిన అధ్వర్యుఁడు ఈ యజమానునికై మంత్ర రథోభయ రూపమైన ఓజస్సుచేతనే బలమును సంపాదించినవాఁ డగును. అప్పుడు బలవంతుఁ డగును.

6. అర్థము: యః–ఎవఁడు, రాష్ట్రాత్–రాష్ట్రమునుండి, అపభూతః–భ్రష్టుఁడు, స్యాత్–అగునో, తస్మై–ఆ రాష్ట్రభ్రష్టుని కొఱకు, హోతవ్యాః–రాష్ట్రభృన్మంత్రములు హోమము చేయఁదగినవి. అస్య–ఈ రాష్ట్రభ్రష్టునకు, యావన్తః రథాః–ఎన్నిరథములు, స్యుః–కలవో, తాన్–ఆ రథములను, నరైః–మనుష్యులచే, యుఙ్ధ్వమ్ ఇతి–వహింపఁజేయుఁడని, బ్రూయాత్–ప్రైషను పలుకవలెను. (అనేన ప్రైషేణ హోమేన చ–ఈ ప్రైషచేతను హోమము చేతను), అస్మై–రాష్ట్రమును కోల్పోయిన ఈ యజమానునికొఱకు, (అధ్వర్యుః–అధ్వర్యుఁడు), రాష్ట్రమ్–రాష్ట్రమును, యునక్త్యేవ–నిశ్చయముగ సంపాదించుచున్నాఁడు.

తాత్పర్యము: రాష్ట్రమును కోల్పోయిన యతనికొఱకు రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెను. ఇతఁడు రాష్ట్రమును కోల్పోయియున్నను ఇతనికిఁగల రథముల నన్నిటిని నరులచే వహింపఁజేయుఁడు అని అధ్వర్యుఁడు ప్రైష చెప్పవలెను. అట్లు చేసినచో ఈ ప్రైషచేతను హోమముచేతను అధ్వర్యుఁడు ఈ రాష్ట్రభ్రష్టుఁడైన యజమానునికొఱకు నిశ్చయముగ రాష్ట్రమును సంపాదించును. (రాష్ట్రభ్రష్టుఁడు మఱల రాష్ట్రమును పొందుటకై రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెనని యిచట హోమము విధింపఁబడినది. ప్రైష–ఈ పని ఇట్లు చేయుఁడు అని అధ్వర్యుఁడు హోత్రాదుల నాదేశించుట.)

7. అర్థము: రాష్ట్రమ్–రాష్ట్రము, యస్య–ఎవనికి, న కల్పతే–భోగమునందు సమర్థ మగుట లేదో, ఏతస్య–రాష్ట్రప్రాప్తికై హోమము చేసిన యితనియొక్క, ఆహుతయః వా–ఆహుతులు కాని, అక్లపాః–స్వకార్యక్షమము లగుట లేదో, తదానీమ్–అప్పుడు, అయమ్–ఈ అధ్వర్యుఁడు, స్వరథస్య–యజమాన రథముయొక్క, దక్షిణం చక్రమ్–కుడివైపున నుండు చక్రమును, ప్రవృహ్య–అగ్నిపై భాగమున నుంచి, నాడీమ్ అభి–చక్రరంధ్రమున కభిముఖముగా, జుహుయాత్–హోమము చేయవలెను. (తదానీమ్–అప్పుడు. అధ్వర్యుః–అధ్వర్యుఁడు), అస్య–ఈ యజమానునియొక్క, ఆహుతీః–ఆహుతులను, కల్పయత్యేవ–స్వకార్య క్షమములనుగానే చేయుచున్నాఁడు. తాః–ఆ యాహుతులు, కల్పమానాః సత్యః–సమర్థము లగుచున్నవై, అస్య–ఈ యజమానుని యొక్క, రాష్ట్రమ్–రాష్ట్రమును, (భోగే క్షమం కుర్వన్తి–భోగమునందు సమర్థమైనదానినిగాఁ జేయుచున్నవి.) అను–ఆ యాహుతుల ననసరించి, కల్పతే–రాష్ట్రము సమర్థ మగుచున్నది.

తాత్పర్యము: పూర్వోక్త హోమముచేత రాష్ట్రభ్రష్టునకు రాష్ట్రము సంప్రాప్తమైనను, అది ఇష్టసాధన సమర్థము కానిదైనను, హోమము చేయఁబడిన ఆహుతులు స్వకార్య క్షమములు కానివైనను, అప్పుడు అధ్వర్యుఁడు యజమాన రథముయొక్క దక్షిణచక్రమును అగ్నిపై భాగమున నుంచి ఆ చక్రరంధ్రమున కభిముఖముగ హోమము చేయవలెను. అట్లు హోమము చేసిన అధ్వర్యుఁడు ఈ యజమానునియొక్క ఆహుతులను స్వకార్య క్షమములుగానే చేయువాఁ డగును. ఆ యాహుతులు క్షమము లగుచు రాష్ట్రమును భోగమునందు సమర్థముగాఁ జేయును. ఆ యాహుతుల ననుసరించి రాష్ట్రము ఇష్టసాధన సమర్థ మగును. (పూర్వోక్త హోమముచే రాష్ట్రభ్రష్టునకు రాష్ట్రము ప్రాప్తమైనను అది ఇష్టసాధన సమర్థము కానప్పుడు ఈ విధముగ హోమము చేయవలెనని ఈ ప్రయోగవిశేష మిచట విధింపఁబడినది.)

8. అర్థము: సఙ్గ్రామే సంయత్తే సతి=యుద్ధము సన్నద్ధ మగుచుండఁగా, హోతవ్యాః=రాష్ట్రభృన్మంత్రములు హోమము చేయఁదగినవి. రాష్ట్రభృతః=రాష్ట్రభృన్మంత్రములు, రాష్ట్రం వై=రాష్ట్ర స్వరూపము కదా!, యే=ఎవరు, సంగ్రామమ్=యుద్ధమును, సంయన్తి=పొందుచున్నారో, ఏతే వా=వీరే, రాష్ట్రే=రాష్ట్రము విషయమున, వ్యాయచ్ఛన్తే ఖలు=కలహించుచున్నారు కదా! (తేషామ్=ఆ కలహించుచున్న వారిలో), పూర్వస్య=హోమము నందు మొదట ప్రవృత్తుఁడైన, యస్య=ఎవనికి, జుహ్వతి=రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయుచున్నారో, సః ఏవ=ఆ ప్రథమ ప్రవృత్తుఁడైన యతఁడే, భవతి=(సమర్థుఁడు) అగుచున్నాఁడు. (సమర్థుఁడగుటచే), తం సంగ్రామమ్=ఆ యుద్ధమును, జయతి=జయించుచున్నాఁడు.

తాత్పర్యము: యుద్ధము సంప్రాప్తమైనప్పుడు రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెను. యుద్ధమున ప్రవృత్తులైనవారు రాష్ట్రము విషయముననే కలహించుచుందురు కదా! యుద్ధసన్నద్ధులయిన ఆ యుభయులలో హోమము చేయుటయందు మొదట ప్రవృత్తుఁడైన యతనికై రాష్ట్రభృన్మంత్రములచే అధ్వర్యుఁడు హోమము చేయవలెను. అతఁడే సమర్థుఁ డగును. సమర్థుఁ డగుటవలన యుద్ధమున విజయమును పొందును. (ఇచట యుద్ధమున జయార్థికి హోమము విధింపఁబడినది.)

9. అర్థము: (క్రౌఞ్చాగ్నిని ప్రజ్వలింపఁజేయుటకు కాష్ఠవిశేషము విధింపఁబడుచున్నది.) మాన్థుకః=మధూక వృక్ష(ఇప్ప చెట్టు) సంబంధమైన కాష్ఠము, ఇధ్మః=భవతి=(పూర్వోక్త హోమమునందు) సమిధ కావలెను. (ఆ సమిధచే శత్రువును గూర్చి అగ్నిని ప్రత్యేకముగ కల్పించి హోమము చేయవలెను.) అఙ్గారాః ఏవ=(మాన్థుక సమిధనుండి పుట్టిన) నిప్పుకణికలే, ప్రతివేష్టమానాః=ఎదురుగ చుట్టుకొనినవై, అస్య=ఈ యజమానుని యొక్క, అమిత్రాణామ్=శత్రువులయొక్క, సేనామ్=సేనను, ప్రతివేష్టయన్తి=చుట్టుకొనుచున్నవి.

తాత్పర్యము: అష్టమ మంత్రమునందుఁ జెప్పఁబడిన హోమమునందు ఇప్పచెట్టుయొక్క కాష్ఠమును సమిధగా నుంచవలెను. అనఁగా ఆ సమిధచే ప్రత్యేకముగ నగ్నిని కల్పించి హోమము చేయవలెను. ఆ సమిధనుండి పుట్టిన అగ్నికణములు ఎదురుగా చుట్టుకొనినవై ఈ యజమానునియొక్క శత్రుసేనను ప్రత్యేకముగ చుట్టుకొనును. శత్రుసేనయందు అగ్నిబాధ ఏర్పడును. లేదా — ఆ సైనికుల శరీరములందు జ్వరాది సంతాప మైనను సంభవించును.

10. అర్థము: యః=ఎవఁడు, ఉన్మాద్యేత్=పిచ్చివాఁ డగునో, ఏతస్మై=ఇతనికొఱకు, (అధ్వర్యుణా=అధ్వర్యునిచే), హోతవ్యాః=రాష్ట్రభృన్మంత్రములు హోమము చేయఁదగినవి. యః=ఎవఁడు, ఉన్మాద్యతి=పిచ్చివాఁ డగుచున్నాఁడో, ఏతమ్=ఇతనిని, గన్ధర్వాప్సరసః వా=గంధర్వులు వారిభార్యలే, ఉన్మాదయన్తి=పిచ్చివానినిగాఁ జేయుచున్నారు. యత్ రాష్ట్రభృతః=రాష్ట్రభృన్మంత్రములు ఏవి కలవో, ఏతే=ఇవి, గన్ధర్వాప్సరసః ఖలు వై=గంధర్వాప్సరసల స్వరూపములే కదా! తస్మై=ఆ గంధర్వునికొఱకు, స్వాహా=ఈ హవిస్సు (సమర్పితము) హుత మగుఁగాక, తాభ్యః=ఆ గంధర్వుని భార్యలకొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుత మగుఁగాక, ఇతి=అని, జుహోతి=హోమము చేయవలెను. తేనైవ=ఆ హోమముచేతనే, ఏనాన్=ఈ ఉన్మాదము కలిగించిన వారిని, శమయతి=(అధ్వర్యుఁడు) శాంతులనుగాఁ జేయుచున్నాఁడు

తాత్పర్యము: ఉన్మాదము కలిగినవానికొఱకు అధ్వర్యుఁడు రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెను. ఇతని నున్మత్తునిగాఁ జేసినవారు గంధర్వులు, గంధర్వభార్యలే. రాష్ట్రభృన్మంత్రములు ఈ గంధర్వ గంధర్వభార్యల స్వరూపములే. కావున ఆ గంధర్వులను, గంధర్వభార్యలను ఉద్దేశించి హోమము చేయవలెను. అట్లు హోమము చేసిన అధ్వర్యుఁడు ఈ ఉన్మాదము కలిగించినవారిని శాంతులనుగాఁ జేయుచున్నవాఁ డగును.

11. అర్థము: ఇధ్మః=పూర్వోక్తమైన సమిధ, నైయగ్రోధః=జమ్మిచెట్టు - లేక - మఱ్ఱిచెట్టునకు సంబంధించినది కాని, ఔదుమ్బరః=మేడిచెట్టునకు సంబంధించినది కాని, ఆశ్వత్థః=రావిచెట్టునకు సంబంధించినది కాని, ప్లాక్షః=జువ్విచెట్టునకు సంబంధించినది కాని, ఇతి భవతి=అయి యుండవలెను. ఏతే=ఈ నైయగ్రోధాదులు, గన్ధర్వాప్సరసామ్=గంధర్వులకు గంధర్వభార్యలకు, గృహాః వై=గృహములు కదా! (ఏవంచేత్=ఇట్లైనచో), ఏనాన్=ఈ గంధర్వాదులను, స్వే ఏవ ఆయతనే=స్వీయగృహమునందే, శమయతి=(అధ్వర్యుఁడు) శాంతింపఁజేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: దశమ మంత్రమునందుఁ జెప్పఁబడిన హోమమున వేల్చఁదగిన సమిధ ఇచట నిర్దేశించఁబడినది. ఉన్మత్తుని ఉన్మాదము పోవుటకై ఉన్మాదమును కలిగించినవారిని శాంతింపఁజేయవలెను. అందుకై దశమ మంత్రమున హోమము విధించఁబడినది. ఆ హోమమునందు నైయగ్రోధాది సమిధలలో నేదేని ఒకదానిచే ప్రత్యేకముగ అగ్నిని కల్పించి ఆ యగ్నియందు హోమము చేయవలెను. ఈ నైయగ్రోధాదులు ఉన్మాదమును కలిగించిన గంధర్వాదులకు నివాసములు కావున ఈ హోమము చేసిన అధ్వర్యుఁడు వారిని వారి స్వగృహమునందే శాంతింపఁజేసినవాఁ డగును.

12. అర్థము: అభిచరతా=హింసార్థమైన హోమకర్మ చేయువానిచేత, ప్రతిలోమమ్=ఈ రాష్ట్రభృన్మంత్రములలో చివరి మంత్రముతో నారంభించి మొదటి మంత్రముతో ముగింపు అగు విధముగ, హోతవ్యాః=హోమము చేయఁదగినవి. (సః=ఆ హోమకర్త), అస్య=ఈ అభిచరితునియొక్క, ప్రాణానేవ=ప్రాణములనే, ప్రతీచః=తద్విపరీతస్థానములు కలవానినిగా, ప్రతియౌతి=ప్రతికూలముగా కూర్చుచున్నాఁడు. తతః=పిమ్మట, తమ్=ఆ యభిచరితుఁడైన విరోధిని, యేన కేన చ=అనాయాసముగనే, స్తృణుతే=హింసించుచున్నాఁడు.

తాత్పర్యము: హింసార్థక హోమము చేయునతఁడు ఈ రాష్ట్రభృన్మంత్రములను చివరి మంత్రమునుండి మొదటి మంత్రము వరకు ఉచ్చరించుచు హోమము చేయవలెను. అట్లు హోమము చేసినయతఁడు అభిచరితుని ప్రాణాపానాదులను తద్విపరీతస్థానములందు కూర్చినవాఁ డగును. పిమ్మట అతఁ డా అభిచరితుని అనాయాసముగ హింసించును. (అభిచరితుఁడు=హింసార్థ హోమకర్మయందు విషయభూతుఁడు. రాష్ట్రభృన్మంత్రములచే అభిచార హోమము చేయవచ్చునను విషయము ఈ మంత్రమునఁ జెప్పఁబడినది).

13. అర్థము: స్వకృతే ఇరిణే=స్వయంకృతమైన చవుటినేలయందుఁగాని, ప్రదరే వా=చీలిక గల భూమియందుఁగాని, జుహోతి=పూర్వోక్తమైన అభిచారహోమము చేయవలెను. ఏతత్ వా=ఈ స్థానమే, అస్యై=ఈ అభిచారదేవతకొఱకు, నిర్ఋతి గృహీతమ్=నిర్ఋతి యను దేవతచే గ్రహింపఁబడినది. (ఏషః=ఈ హోమము చేసిన అధ్వర్యుఁడు), ఏనమ్=ఈ అభిచరితుని, నిర్ఋత్యా=నిర్ఋతి దేవతచే, గ్రాహయతి=గ్రహింపఁజేయుచున్నాఁడు. వాచః=వాక్కుయొక్క, క్రూరం యత్=క్రూర మైనది యేది కలదో, తేన=దానిచే, వషట్కరోతి='వౌషట్' అని చెప్పవలెను. (ఏవం కృతే సతి=ఈ విధముగఁ జేయఁబడిన దగుచుండఁగా), ఏనమ్=ఈ అభిచరితుని, వాచః క్రూరేణైవ=వాక్కుయొక్క క్రూరమైన వషట్కారముచేతనే, ప్రవృశ్చతి=ప్రకర్షగ ఛేదించుచున్నవాఁ డగుచున్నాఁడు. (తదా=అప్పుడు, సః=ఆ అభిచరితుఁడు, తాజక్=శీఘ్రముగ, ఆర్తిమ్=దుఃఖమును, ఆర్ఛతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: అభిచారహోమము చేయుట కర్తమైన ప్రదేశము ఇచట విధించఁబడినది. స్వకృతమైన చవుటినేలయందుఁగాని, చీలిన భూమియందుఁగాని హోమము చేయవలెను. ఈ ప్రదేశమే ఈ అభిచారదేవతకొఱకు నిర్ఋతి దేవతచే గ్రహింపఁబడినది. ఈ హోమకర్త నిర్ఋతి దేవతచే గ్రహింపఁబడిన ప్రదేశమునందే ఈ అభిచరితుని

నిర్ఋతి దేవతచే గ్రహింపఁజేయువాఁడగును. కఠినముగ 'వౌషట్' అని వషట్కారము చేయవలెను. వషట్కారము చేసిన అధ్వర్యుఁడు వషట్కారముచేతనే ఈ అభిచరితుని ఛేదించువాఁడగును. అప్పు డతఁడు శీఘ్రముగ దుఃఖమును పొందును.

14. **అర్థము:** యస్య-ఏ శత్రువుయొక్క, అన్నాద్యమ్-రాజాదులకు భోగార్థమైన అన్నమును, ఆదదీయ ఇతి-తీసికొందును (హరింతును) అని, కామయేత యది-కోరునెడల, (సః-ఆ కోరిక గల యతఁడు), తస్య-ఆ శత్రువుయొక్క, సభాయామ్-సభయందు, ఉత్తానః నిపద్య-వెలికిలిగా నుంచిన శరీరము కలవాఁడై పడి, "భువనస్య పతే' ఇతి-సప్తమానువాకమునందలి 'భువనస్య పతే" అను మంత్రముచేత, తృణాని-తృణములను, సంగృహ్ణీయాత్-సంగ్రహించవలెను. ప్రజాపతిః వై-ప్రజాపతియే, భువనస్య-విశ్వమునకు, పతిః-ప్రభువు. (సః-ఆ తృణములను సంగ్రహించిన యతఁడు), ప్రజాపతినా ఏవ-ప్రజాపతిచేతనే, అస్య-ఈ శత్రువుయొక్క, అన్నాద్యమ్-రాజాదులకు భోగార్థమైన యన్నమును, ఆదత్తే-తీసికొనుచున్నాఁడు. అహమ్-నేను, ఇదమ్-ఇదిగో, అముష్య-ఈ శత్రువుయొక్క, అముష్యాయణస్య-ఈ కలుగఁబోవు శత్రువుయొక్కయు, అన్నాద్యమ్-అన్నాద్యమును, ఆదత్తే-తీసికొనుచున్నాను. ఇతి-అని, ఆహ-చెప్పుటచే, అస్య-ఈ శత్రువుయొక్క, అన్నాద్యమ్-అన్నాద్యమును, హరత్యేవ-నిశ్చయముగ హరించుచున్నాఁడు.

**తాత్పర్యము:** తన శత్రువుయొక్క శ్రేష్ఠమైన రాజాది భోగార్థాన్నమును హరించవలెనని కోరునతఁడు ఇతని శత్రువుయొక్క సభయందు ఉత్తానశరీరుఁడుగాఁ పడి "భువనస్య పతే" అను మంత్రము చెప్పుచు తృణములను (గడ్డిపఱకలను) తీసికొనవలెను. ప్రజాపతియే భువనమునకు స్వామి కావున, అతఁడు ఆ ప్రజాపతిచేతనే తన యీ శత్రువుయొక్కయు, రాఁబోవు శత్రువుయొక్కయు అన్నాద్యమును తీసికొనుచున్నానని చెప్పుటచే ఈ యజమానుఁడు ఈ తనశత్రువుయొక్క అన్నాద్యమును నిశ్చయముగ హరించును. (శత్రువుయొక్క అన్నాద్యమును అన్నాదనశక్తిని హరింప వలెనను కోరిక కలవాఁడు చేయవలసిన కర్మవిశేషము ఈ మంత్రమున విధింపఁబడినది.)

15. **అర్థము:** (పూర్వమంత్రమున చెప్పఁబడినవిధముగ శత్రువుయొక్క అన్నాద్యమును హరించివలెనను కోరిక గల యతఁడు), షడ్భిః-సప్తమాను వాకమునందలి "భువనస్య పతే" అను మంత్రము మొదలు, "స నో భువనస్య పతే" అను మంత్రమువఱకుఁ గల షణ్మంత్రములచేత, హరతి-పూర్వమంత్రమునఁ జెప్పఁబడిన విధముగ తృణములను హరించవలెను. ఋతవః-ఋతువులు, షట్ వా-ఆఱు కదా! (తదా-అప్పుడు), ఋతవః-ఆఱు ఋతువులు, ప్రజాపతినైవ-ప్రజాపతిచేతనే, అస్య-ఇతని శత్రువుయొక్క, అన్నాద్యమ్-అన్నాద్యమును, ఆదాయ-తీసికొని, అస్మై-ఈ యజమానునికొఱకు, అను ప్రయచ్ఛన్తి-అనుక్షణముననే ఇచ్చుచున్నవి.

**తాత్పర్యము:** ఇచట మంత్రసంఖ్య విధింపఁబడినది. యజమానుఁడు "భువనస్య పతే" ఇత్యాది షణ్మంత్రములచే తృణాదికములను సంగ్రహించవలెను. ఋతువులు ఆఱే కనుక, ఆ ఋతువులు ప్రజాపతిచేతనే ఇతని శత్రువుయొక్క అన్నాద్యమును తీసికొని ఈ యజమానున కొసఁగును.

16. **అర్థము:** యః-ఎవఁడు, జ్యేష్ఠబన్ధుః-నికృష్టుఁడై, పరాభూతః స్యాత్-తిరస్కృతుఁడగునో, తమ్-అతనిని, స్థలే-ఉచ్చప్రదేశమునందు, అవసాయ్య-కూర్చుండఁజేసి, బ్రహ్మ-బ్రహ్మ యనెడి ఋత్విజుఁడు, చతుశ్శరావమ్ ఓదనమ్-నాలుగు మూకుళ్ల పరిమితి గల అన్నమును (వండి), తస్మై-తత్ఫలసిద్ధికొఱకు, హోతవ్యాః-రాష్ట్రభృన్మంత్రములు హోమము చేయఁదగినవి. వర్ష్మైవ-శరీరమే, రాష్ట్రభృతః-రాష్ట్రభృన్మంత్రములు. వర్ష్మ-శరీరము, స్థలమ్-ఉచ్చప్రదేశము (మెట్టనేల). ఏవం కృతే సతి-ఇట్లు చేయఁగా, (బ్రహ్మ-బ్రహ్మ), ఏనమ్-ఈ యజమానుని, సమానానామ్-సమానులలో, వర్ష్మ-శరీరస్థానీయునిగా, గమయతి-పొందించుచున్నాఁడు. (చేయుచున్నాఁడు).

తాత్పర్యము: పరునివలన భయము కలవానికి ఆ భయము పోవుటకై ఈ మంత్రము కర్మాంతరమును విధించుచున్నది. జ్యేష్ఠబంధు వనఁగా గొప్పవానికి బంధువు. అనఁగా తాను నికృష్టుఁడని యర్థము. అట్టి నికృష్టునకు ఆ గొప్ప వానివలన భయము కలిగినప్పుడు అనఁగా పరునివలన అవమానము కలిగినప్పుడు బ్రహ్మయను ఋత్విజుఁడు అతనిని మెట్టనేలయందు కూర్చుండఁజేసి నాలుగు మూకుళ్లతో అన్నము వండి తత్ఫలసిద్ధికై రాష్ట్రభృన్మంత్రములచే ఆ యన్నమును హోమము చేయవలెను. శరీరమే రాష్ట్రభృన్మంత్రములు. శరీరము స్థలము. ఇట్లు చేసినచో బ్రహ్మ ఉభయవిధ శరీరముచేతనే ఈ యజమానుని స్వ సమానులలో శరీర స్థానీయునిగాఁ జేసినవాఁ డగును.

17. అర్థము: చతుశ్శరావః భవతి–హోమద్రవ్యమైన అన్నము నాలుగు మూకుళ్ల పరిమితి కలదియై యుండవలెను. (దిక్కులు నాలుగు కావున ఈ యజమానుని బ్రహ్మ), దిక్ష్వేవ–దిక్కులయందే, ప్రతితిష్ఠతి–ప్రతిష్ఠితుని చేసినవాఁ డగును.

తాత్పర్యము: సులభము.

18. అర్థము: క్షీరే భవతి–(ఈ హోమద్రవ్యమైన అన్నము) పాలయందు పక్వము చేయఁబడినదియై యుండవలెను. (తదా–అప్పుడు, బ్రహ్మా–బ్రహ్మ), అస్మిన్–ఈ అన్నమునందు, రుచమేవ–స్వాదుత్వమునే, దధాతి–కలిగింపఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: హోమద్రవ్యమైన అన్నమును క్షీరముతో పక్వము చేయవలెను. అట్లు చేసిన బ్రహ్మ ఈ యన్నమును స్వాదుత్వము కలదానినిగాఁ జేసినవాఁ డగును.

19. అర్థము: శృతత్వాయ–పక్వ మగుటకై, ఉద్ధరతి–అడుగునుండి పైకి కలియఁబెట్టవలెను. తాత్పర్యము సులభము.

20. అర్థము: మేధ్యత్వాయ–పవిత్రతకొఱకు, సర్పిష్వాన్ భవతి–అన్నము నేతితోఁ గూడినదిగా నుండవలెను. (అన్న పదము నపుంసక మైనను తద్విశేషణమైన 'సర్పిష్వాన్' అను పదము పుంలింగముగా ప్రయుక్త మైనది. ఇది ఛాందసము.)

తాత్పర్యము: పవిత్రత యేర్పడుటకై ఈ యన్నమునందు ఆజ్యమును కలుపవలెను.

21. అర్థము: ఆర్షేయాః–ఋషిసమానులైన, చత్వారః–నలుగురు (బ్రాహ్మణులు), ప్రాశ్నన్తి–(హుతశేషమైన అన్నమును) భుజించవలెను. దిశామ్–నాలుగు దిక్కుల సంబంధమైన, జ్యోతిష్యేవ–అగ్నియందే, జుహోతి–హోమము చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: హుతశేషమైన యన్నమును చతుర్దిక్సంబంధి వహ్నిస్థానీయులైన నలుగురు బ్రాహ్మణులు భుజించవలెను. అట్లు భుజించినచో హోమకర్త ఆ నలుగురు బ్రాహ్మణులచే భుక్తమైన యన్నమును నాలుగు దిక్కులకు సంబంధించిన అగ్నియందే హోమము చేయుచున్నవాఁ డగును. అనఁగా ఆ నలుగురు భుజించునది అగ్ని యందు హుత మైనట్లే యని భావము.

అష్టమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]దేవికా నిర్వపే త్ప్రజాకామ శ్ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసీవ ఖలు వై ప్రజా శ్ఛన్దోభిరేవాస్మై ప్రజాః ప్ర జనయతి [2]ప్రథమం ధాతారం కరోతి మిథునీ ఏవ తేన కరోత్యన్వేవాస్మా అనుమతి ర్మన్యతే రాతే రాకా ప్ర సినీవాలీ జనయతి ప్రజాస్వేవ ప్రజాతాసు కుహ్వా వాచం దధా[3]త్యేతా ఏవ నిర్వపే త్పశుకామ శ్ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసి (౧)ఇవ ఖలు వై పశవ శ్ఛన్దోభిరేవాస్మై పశూన్ప్ర జనయతి ప్రథమం ధాతారం కరోతి ప్రైవ తేన వాపయత్యన్వేవాస్మా అనుమతి ర్మన్యతే రాతే రాకా ప్ర సినీవాలీ జనయతి పశూనేవ ప్రజాతాన్కుహ్వా ప్రతిష్ఠాపయత్యే[4]తా ఏవ నిర్వపే ద్గ్రామకామ శ్ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసీవ ఖలు వై గ్రామ శ్ఛన్దోభిరేవాస్మై గ్రామమ్ (౨)అవ రున్ధే మధ్యతో ధాతారం కరోతి మధ్యత ఏవైనం గ్రామస్య దధా[5]త్యేతా ఏవ నిర్వపే జ్జ్యోగామయావీ ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసి ఖలు వా ఏతమభి మన్యన్తే యస్య జ్యోగామయతి ఛన్దోభిరేవైన మగదం కరోతి మధ్యతో ధాతారం కరోతి మధ్యతో వా ఏతస్యార్త్తం యస్య జ్యోగామయతి మధ్యత ఏవాస్య తేన కల్పయ[6]త్యేతా ఏవ నిః (౩)వపేద్యం యజ్ఞో నోపనమే చ్ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసి ఖలు వా ఏతం నోప నమన్తి యం యజ్ఞో నోపనమతి ప్రథమం ధాతారం కరోతి ముఖత ఏవాస్మై ఛన్దాగ్ంసి దధాత్యుపైనం యజ్ఞో నమ[7]త్యేతా ఏవ నిర్వపే దీజాన శ్ఛన్దాగ్ంసి వై దేవికా యాతయామానీవ ఖలు వా ఏతస్య ఛన్దాగ్ంసి య ఈజాన ఉత్తమం ధాతారం కరోతి (౪)ఉపరిష్టాదేవాస్మై

ఛన్దాగ్ంస్యయాతయామాన్యవ రున్ధ ఉపైన ముత్తరో యజ్ఞో నమ[9]త్యేతా ఏవ నిర్వపేద్యం మేధా నోపనమే చ్ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసి ఖలు వా ఏతం నోప నమన్తి యం మేధా నోపనమతి ప్రథమం ధాతారం కరోతి ముఖత ఏవాస్మై ఛన్దాగ్ంసి దధాత్యుపైనం మేధా నమ[9]త్యేతా ఏవ నిర్వపేత్ (౩)రుక్కామ శ్ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసీవ ఖలు వై రుక్ఛన్దోభి రేవాస్మిన్రుచం దధాతి క్షీరే భవన్తి రుచమేవాస్మి న్దధాతి మధ్యతో ధాతారం కరోతి మధ్యత ఏవైనగ్ం రుచో దధాతి [10]గాయత్రీ వా అనుమతి స్త్రిష్టుగ్రాకా జగతీ సినీవాల్యనుష్టు ప్కుహూ ర్ధాతా వషట్కారః [11]పూర్వపక్షో రాకా ఽపరపక్షః కుహూరమావాస్యా సినీవాలీ పౌర్ణమాస్యను మతి శ్ఛన్దమాసా ధాతా[12]ఽష్టౌ (౬)వసవో ఽష్టాక్షరా గాయత్ర్యేకాదశ రుద్రా ఏకాదశాక్షరా త్రిష్టు బ్ద్వాదశాఽఽదిత్యా ద్వాదశాక్షరా జగతీ ప్రజాపతి రనుష్టు బ్ధాతా వషట్కారః [13]ఏతద్వై దేవికాః సర్వాణి చ ఛన్దాగ్ంసి సర్వాశ్చ దేవతా వషట్కార [14]స్తా యత్సహ సర్వా నిర్వపే దీశ్వరా ఏనం ప్రదహో ద్వే ప్రథమే నిరుప్య ధాతు స్తృతీయం నిర్వపేత్తథో ఏవోత్తరే నిర్వపే త్తథైనం న ప్రదహ న్త్యథో యస్మై కామాయ నిరుప్యన్తే తమేవాఽఽభిరుపా ఽఽప్నోతి ॥౭॥ (పశుకామ శ్ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసి గ్రామం కల్పయత్యేతా ఏవ నిరుత్తమం ధాతారం కరోతి మేధా నమత్యేతా ఏవ నిర్వపేదష్టౌ దహన్తి నవ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థప్రపాఠకే నవమోఽనువాకః।

## వేదార్థదీపిక

**అవతారిక:** అష్టమానువాకమునందు ఆ యా కోరికలు కలవాని నిమిత్తము రాష్ట్రభృద్ధోమములు వర్ణింపఁబడినవి. ఈ నవమానువాకము నందు రాజసూయ ప్రకరణోత్పన్నములైన 'ధాత్రే పురోడాశ' మిత్యాది దేవికాఖ్య పంచహవిస్సులకు ఉత్కర్షను చేసి పిమ్మట బహువిధమైన కామ్య ప్రయోగము నిరూపింపఁబడుచున్నది.

1. **అర్థము:** ప్రజాకామః=సంతానమును కోరునతఁడు, దేవికాః=ధాత్రాది దేవికేష్టుల నైదింటిని, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. దేవికాః=దేవికేష్టులు, ఛన్దాంసి వై=ఛందోరూపములు కదా!, ప్రజాః=ప్రజలు, ఛన్దాంసి ఖలు వై=ఛందస్సులవంటివారే కదా! ఏషః=ఈ దేవికేష్టులను నిర్వాపము చేసిన అధ్వర్యుఁడు, ఛన్దోభిరేవ=దేవికారూప ఛందస్సులచేతనే, అస్మై=ఈ యజమానునికొఱకు ప్రజాః=ప్రజలను, ప్రజనయతి=ప్రకర్షగా పుట్టించుచున్నాఁడు.

**తాత్పర్యము:** దీవ్యన్తి అపేక్షితం ఫలవిశేషం ప్రకాశయన్తీతి దేవికాః. ధాత్రాది పంచేష్టులు అపేక్షిత ఫలవిశేషమును ప్రకాశింపఁజేయునవి యని వ్యుత్పత్త్యర్థము. అనుమత్యాది దేవీసంబంధులు కావున ఇవి దేవికలని వ్యవహరింపఁబడుచున్నవి. ఈ యిష్టులకు సంబంధించిన పంచదేవతలలో ధాత యొక్కఁడే పురుషదేవత. అనుమతి, రాక, సినీవాలి, కుహూ అను దేవతలు నలుగురు స్త్రీ దేవతలు. ఈ దేవికేష్టులు ఛందోరూపములు. "గాయత్రీ అనుమతిః" ఇత్యాది ప్రమాణము ననుసరించి అనుమత్యాదులు ఛందోరూపములని స్పష్టమగుటచే తద్ద్వారా దేవికేష్టులు కూడ ఛందోరూపములుగా నిచట వర్ణించఁబడినవి. ఛందస్సులు ఫలహేతువు లగుటచే సుఖకరము లయినవిధముగ ప్రజలు కూడ సుఖహేతువు లగుటచే ఛందస్సమానులు. కావున అధ్వర్యుఁడు దేవికారూప ఛందస్సులచేతనే దేవికేష్టి నిర్వాపము చేసిన యజమానునకై ప్రజలను (సంతానమును) కలిగించును.

2. **అర్థము:** (యజమానః=యజమానుఁడు) ధాతారమ్=ధాతను, ప్రథమమ్=(పంచ దేవతలలో) ప్రథమునిగా, కరోతి=ఇతి యత్=స్థాపన చేయుచున్నాఁ డనుట యేది కలదో, తేన=దానిచే, మిథునీ కరోత్యేవ=ధాత నిశ్చయముగ యజమానుని స్వపత్నితో మిథునముగాఁజేయుచున్నాఁడు. అనుమతిః=అనుమతిదేవత, అస్మై=ఈ యజమానునికొఱకు, తత్=ఆ మిథునీకరణమును, అనుమన్యతే=అనుమతించుచున్నది. రాకా=రాకాదేవి, రాతే=ప్రజను ఇచ్చుచున్నది. సినీవాలీ=సినీవాలిదేవి, ప్రజనయతి=ప్రజ నుత్పత్తి చేయుచున్నది. ప్రజాతాసు ప్రజాసు=ప్రకర్షగా నుత్పన్నులైన ప్రజలయందు, కుహ్వా=కుహూదేవి ద్వారా, (యజమానుఁడు), వాచం దధాతి=సంభాషణాభ్యాసరూప వాక్కును, కరోతి=చేయుచున్నాఁడు.

**తాత్పర్యము:** పంచదేవికేష్టులకు ధాత్రాది దేవతలు అయిదుగురు కలరు. వారిలో ధాతృదేవుని ప్రథమునిగా స్థాపన చేసి ఇష్టినిర్వాపము చేయుటవలన ధాతృదేవుఁడు యజమానుని యజమానపత్నితో కలిపి మిథునముగాఁ జేసినవాఁ డగును. అనుమతీదేవి ఆ మిథునమును అనుమతించును. రాకాదేవి ఆ మిథునమునందు ప్రజ నొసఁగును. సినీవాలీదేవి గర్భస్థ ప్రజ నుత్పాదింపఁజేయును. ఉత్పన్న ప్రజలందు కుహూదేవీ మూలమున యజమానుఁడు సంభాషణాభ్యాసమును జేయును.

3. **అర్థము:** పశుకామః=పశువులను కోరునతఁడు. ఏతాః ఏవ=ఈ పూర్వోక్తములైన దేవికేష్టులనే, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. దేవికాః=దేవికేష్టులు, ఛన్దాంసి వై=ఛందోరూపములు కదా! పశవః=పశువులు. ఛన్దాంసి వై ఖలు=ఛందో రూపములవంటివే కదా! (ఏవం సతి=ఇట్లు నిర్వాపము చేయఁగా, ధాతా=ధాతృదేవుఁడు) అస్మై=ఈ యజమానునకై, పశూన్=పశువులను, ప్రజనయతి=పుట్టించును. (కథమితి చేత్=ఎట్లనినచో,) ధాతారమ్=ధాతృదేవుని, (యజమానః=యజమానుఁడు, పఞ్చానామ్=దేవికేష్టులకు సంబంధించిన అయిదుగురు దేవతలలో), ప్రథమమ్=ప్రథమునిగా, కరోతి=స్థాపనము చేయవలెను. తేనైవ=ఆ చేయుటచేతనే, (ధాతా=ధాతృదేవుఁడు, గవాదిషు=గవాది పశువులందు), ప్ర వాపయతి=బీజావాపమును జేయుచున్నాఁడు. అస్మై=ఈ యజమానునికొఱకు, అనుమతిః=అనుమతి దేవత, అనుమన్యతే ఏవ=నిశ్చయముగ అనుమతించును రాకా=రాకాదేవి, రాతే=పశురూప సంతానమును ఇచ్చును. సినీవాలీ=సినీవాలీ దేవత, ప్రజనయతి=గర్భస్థ పశువును పుట్టించును. (యజమానః=యజమానుఁడు), ప్రజాతాన్ పశూన్=పుట్టిన పశువులను, కుహ్వా=కుహూదేవత మూలమున, ప్రతిష్ఠాపయతి=తృణోదకాది పోషణముచేత ప్రతిష్ఠాపన చేయును.

**తాత్పర్యము:** ఈ మంత్రము ఫలాంతరముకొఱకు దేవికేష్టులను విధించుచున్నది. పంచదేవతలలో ప్రథముఁడైన ధాతృదేవునిచే గవాదులందు బీజావాపము సంపన్నమగును. పుట్టిన పశువులందు తృణోదకాది పోషణముచే ప్రతిష్ఠాపనము కుహూదేవత చేయును. శేషము రెండవ మంత్రమునందువలె గ్రాహ్యము.

4. అర్థము: గ్రామ కామః=గ్రామమును కోరు యజమానుఁడు, ఏతా ఏవ–ఈ దేవికేష్టులనే, నిర్వపేత్–నిర్వాపము చేయవలెను. దేవికాః, ఛన్దాంసి వై–ఛందోరూపములు కదా! గ్రామః–గ్రామము, ఛన్దాంసి వై ఖలు–ఛందోరూపముల వంటిదే కదా! ఛన్దోభిరేవ–దేవికారూప ఛందస్సులచేతనే, (ధాతా–ధాతృదేవుఁడు), అస్మై–ఈ యజమానునికొఱకు, గ్రామమ్=గ్రామమును, అవరున్ధే–పొందుచున్నాఁడు. (సంపాదించుచున్నాఁడు. యజమానః–యజమానుఁడు), ధాతారమ్–ధాతృదేవుని, మధ్యతః=అనుమత్యాది దేవతల మధ్యమందు (అనుమతి రాకాదేవతలకు పిమ్మట, సినీవాలీ కూహూదేవతలకు పూర్వము), కరోతి–స్థాపించవలెను. (తేన–ఆ చేయుటచేత, ధాతా–ధాతృదేవుఁడు), ఏనమ్–ఈ యజమానుని, మధ్యతః ఏవ–గ్రామముయొక్క మధ్యమందే, దధాతి–స్థాపించుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ మంత్రము దేవికేష్టుల నిర్వాపమువలన గ్రామాధిపత్యరూప ఫలాంతరమును విధించుచున్నది. గ్రామాధిపత్యమును కోరు యజమానుఁడు ఈ దేవికేష్టులనే చేయవలెను. ధాతృదేవుఁడు ఈ యజమానునికై గ్రామమును సంపాదించును. యజమానుఁడు ఇష్టినిర్వాపము చేయునప్పుడు అనుమత్యాది చతుర్దేవతల మధ్యమున ధాతృదేవుని స్థాపించవలెను. (ఆవాహనము చేయవలెనని భావము). అట్లు చేయుటచేత ధాత ఈ యజమానుని గ్రామాధిపత్యమునందు స్థాపించును. శేషము పూర్వోక్తము.

5. అర్థము: జ్యోక్–చిర (దీర్ఘ) కాలము, ఆమయావీ–వ్యాధిబాధ కల యతఁడు, ఏతాః ఏవ–ఈ దేవికలనే, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. దేవికాః=దేవికలు, ఛన్దాంసి వై–ఛన్దస్స్వరూపములు కదా! యస్య–ఎవనికి, జ్యోక్–దీర్ఘకాలము, ఆమయతి–వ్యాధిబాధ అగుచున్నదో, ఏతమ్=ఈ పురుషుని, ఛన్దాంసి వా–దేవికారూప ఛందస్సులే, అభిమన్యన్తే–అంతటను కోపించుచున్నవి. (ధాతా=ధాతృదేవుఁడు), ఛన్దోభిరేవ=దేవికా నిర్వాప తుష్టములైన ఛందస్సులచేతనే, ఏనమ్=ఈ పురుషుని, అగదమ్–రోగరహితునిగా, కరోతి–చేయుచున్నాఁడు. (యజమానః=యజమానుఁడు), ధాతారమ్–ధాతృదేవుని, మధ్యతః–అనుమత్యాది చతుర్దేవతల మధ్యమందు, కరోతి=స్థాపనము చేయవలెను. యస్య–ఎవనికి, జ్యోక్=చిరకాలము, ఆమయతి–వ్యాధిబాధ కలుగుచున్నదో, ఏతస్య–ఇతనియొక్క, (ఉదరమధ్యే–ఉదర మధ్యమందు), అక్షస్తమ్–అసామర్థ్యము. (భవతి–అగుచున్నది.) తేన=ధాతృదేవుని మధ్యమందు స్థాపించుటచేత, అస్య=ఈ వ్యాధిగ్రస్తునకు, కల్పయతి–ఉదర మధ్యమందే సామర్థ్యమును కలిగించుచున్నాఁడు.

తాత్పర్యము: దీర్ఘకాలము వ్యాధిగ్రస్తుఁడైన యతఁడు దేవికలను నిర్వాపము చేయవలెను. దేవికలు ఛందోరూపములు కదా! ఈ దీర్ఘవ్యాధి కల యతనికి దేవికారూప ఛందస్సులే అంతటను కోపించును. దేవికానిర్వాపము చేయుటచేత సంతుష్టములైన దేవికారూప ఛందస్సులచేతనే ధాతృదేవుఁడు ఇతనిని రోగరహితునిగాఁ జేయును. నాల్గవ మంత్రమునందుఁ జెప్పఁబడినవిధముగ యజమానుఁడు ధాతృదేవుని అనుమత్యాది దేవతల మధ్యమందు స్థాపించవలెను. ఈ వ్యాధిగ్రస్తుని ఉదర మధ్యమందు ఏదియో అసామర్థ్యము ఉండును. ధాతృదేవుఁడు ఇతని ఉదర మధ్యమందలి అసామర్థ్యమును పోఁగొట్టి సామర్థ్యమును కలిగించును. (దేవికేష్టుల కిచట ఫలాంతరము విహితమైనది.)

6. అర్థము: యమ్–ఎవనిని, యజ్ఞః–యజ్ఞము, నోపనమేత్, పొందదో, సః–అతఁడు ఏతాః ఏవ=ఈ దేవికలనే, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. దేవికాః=దేవికలు, ఛన్దాంసి వై–ఛందస్స్వరూపములు కదా! యమ్–ఎవనిని, యజ్ఞః–యజ్ఞము, నోపనమతి=పొందుట లేదో, ఏతమ్=ఇతనిని, ఛన్దాంసి వా–యజ్ఞసాధనములైన ఛందస్సులే, నోపనమన్తి=ప్రథమమున పొందుట లేదు. (తతః=అందువలన, యజమానః–యజమానుఁడు,) ధాతారమ్–ధాతృదేవుని, ప్రథమమ్=ప్రథమునిగా, కరోతి=స్థాపన చేయవలెను. (తేన–ఆ స్థాపనముచేత, ధాతా=ధాత), అస్మై=ఈ యజమానునికొఱకు, ఛన్దాంసి=ఛందస్సులను, ముఖతః ఏవ–ప్రథమముననే, దధాతి–స్థాపించును. (తదా–అప్పుడు), యజ్ఞః–యజ్ఞము, ఏనమ్=ఈ యజమానుని, ఉపనమతి–పొందును.

తాత్పర్యము: ఎవని విషయమున యజ్ఞ మనుకూలముగ నుండదో, అనఁగా యజ్ఞఫలము ఎవనికి కలుగదో, అతఁడు ఈ దేవికలనే నిర్వాపము చేయవలెను. దేవికలు ఛందస్స్వరూపములే. యజ్ఞము పొందని పురుషుని యజ్ఞ సాధనములైన ఛందస్సులే ప్రథమమున పొందుట లేదు. అందుకై యజమానుఁడు పూర్వమువలె ధాతృ దేవుని పంచదేవతలలో ప్రథమమున స్థాపించవలెను. అప్పుడు ధాతృదేవుఁడు ఈతనికై ప్రథమముననే ఛందస్సులను స్థాపించును. ఛందస్సు లనుకూలము లగుచుండఁగా యజ్ఞ మితనిని పొందును. (జ్యోతిష్టో మాది యజ్ఞప్రాప్తికై ఈ యిష్టి విధింపఁబడినది.)

7. అర్థము: ఈజానః=యజ్ఞముచేసిన యతఁడు, (ఉత్తర యజ్ఞమునకై) ఏతాః ఏవ=ఈ దేవికలనే, నిర్వపేత్=నిర్వా పము చేయవలెను. దేవికాః=దేవికలు, ఛన్దాంసి వై=ఛందస్స్వరూపములే. యః=ఏ పురుషుఁడు, ఈజానః=పూర్వము యజ్ఞము చేసినవాఁడో, ఏతస్య=ఇతనియొక్క, ఛన్దాంసి=యజ్ఞసాధనములైన ఛంద స్సులు, యాతయామానీవ ఖలు=(పూర్వయజ్ఞమునందు వ్యాపృతము లగుటచే) సారము కోల్పోయినవి వలెనే ఉంటున్నవి. (అతః=అందువలన, యజమానః=దేవికానిర్వాపము చేసిన యజమానుఁడు), ధాతా రమ్=ధాతృదేవుని, ఉత్తమమ్=చరమ స్థానమునందున్న వానినిగా, కరోతి=చేయవలెను. (ధాతా=ధాతృ దేవుఁడు), ఉపరిష్టాత్=ఇఁకముందు చేయఁబడఁబోవు యజ్ఞమునందు, అస్మై=ఈ యజమానునికొఱకు, ఛన్దాంసి=ఛందస్సులను, అయాతయామాని=సారము హీనము కాని విధముగ, అవరున్ధే=సంపాదించు చున్నాఁడు. ఏనమ్=ఈ యజమానుని, ఉత్తరః యజ్ఞః=ఇఁకముందుఁ జేయఁబోవు యజ్ఞము, ఉపైతి= పొందుచున్నది.

తాత్పర్యము: పూర్వము యజ్ఞము చేసిన యతఁడు ఈ దేవికలనే నిర్వాపము చేయవలెను. దేవికలు ఛందస్స్వరూపములే. పూర్వము యజ్ఞము చేసిన యితనియొక్క యజ్ఞసాధనములైన ఛందస్సులు పూర్వయజ్ఞమునందు వ్యాపృ తము లగుటచే సారమును కోల్పోయినవివలెనే ఉండును కావున, దేవికానిర్వాపము చేసిన యజమానుఁడు పంచ దేవతలను ఆవాహనము చేయునపుడు ధాతృదేవుని చరమ స్థానమునందు స్థాపనము చేయవలెను. అప్పుడు ధాత ఈ యజమానునికై ఉత్తరయజ్ఞమునందు ఛందస్సులను అహీన సారములనుగాఁ జేయును. అట్లు చేయుటచేత యజ్ఞము ఇతనిని పొందును. యజ్ఞఫలము లభించునని భావము. (ఉత్తరయజ్ఞ సిద్ధికై ఇచట దేవికానిర్వాపము విహిత మైనది.)

8. అర్థము: దేవికాః=దేవికలు, ఛన్దాంసి వై=ఛన్దస్స్వరూపములే. మేధా=గ్రంథ ధారణ శక్తి రూపమైన మేధ, యమ్= ఎవనిని, నోపనమతి=పొందుట లేదో, ఛన్దాంసి వా=ఛందస్సులే, ఏతమ్=ఇతనిని, నోపనమన్తి ఖలు= ప్రథమమున పొందుటలేదు కదా! (తతః=అందువలన, యజమానః=యజమానుఁడు), ధాతారమ్=ధాతృ దేవుని, ప్రథమమ్=(పంచదేవతలలో) ప్రథమునిగా, కరోతి=స్థాపనము చేయవలెను. (తేన=ఆ ప్రథమస్థాప నముచేత, ధాతా=ధాత), అస్మై=ఈ యజమానునికై, ముఖతః ఏవ=ముఖముననే, దధాతి=స్థాపించినవాఁడగు చున్నాఁడు. (తతః=పిమ్మట), మేధా=మేధ, ఏనమ్=ఇతనిని, ఉపనమతి=పొందుచున్నది.

తాత్పర్యము: మేధాశక్తి లేని యతఁడు ఈ దేవికలనే నిర్వాపము చేయవలెను. దేవికలు ఛందస్స్వరూపములే. మేధ లేని వానిని దేవికారూప ఛందస్సులే పొందవు. అందువలన ఈ దేవికానిర్వాపము చేసిన యజమానుఁడు ధాతృదేవుని ప్రథమునిగా స్థాపించవలెను. అట్లు స్థాపించుటచే ధాత ఈ యజమానునికై ఛందస్సులను ముఖమునందే స్థాపించినవాఁ డగును. అప్పుడీ యజమానుని మేధ పొందును. యజమానుఁడు మేధా వంతుఁ డగునని భావము. ఈ మంత్రము మేధాప్రాప్తికై దేవికా నిర్వాపమును విధించినది).

9. అర్థము: రుక్కామః=కాంతిని కోరునతఁడు, ఏతాః ఏవ=ఈ దేవికలనే, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. దేవికాః= దేవికలు, ఛన్దాంసి వై=ఛందస్స్వరూపములే. రుక్=కాంతి, ఛన్దాంసి ఖలు వై=ఛందస్స్వరూపమే యైనది కదా! (తేన=ఆ నిర్వాపముచేత, ధాతా=ధాత), అస్మిన్=ఈ యజమానునియందు, ఛన్దోభిరేవ=దేవికారూప ఛందస్సులచేతనే, రుచమ్=కాంతిని, దధాతి=స్థాపించుచున్నాఁడు. క్షీరే=పాలయందు, భవన్తి=(చరుపురో

డాశములు నాలుగు పక్వములై) ఉండవలెను. (ఛన్దాంసి—దేవికారూపఛందస్సులు), అస్మిన్—ఈ యజమానునియందు, రుచమ్=కాంతిని, దధతి—స్థాపించుచున్నవి. (యజమానః—యజమానుఁడు), ధాతారమ్=ధాతృదేవుని, మధ్యతః—అనుమత్యాది దేవతల మధ్యమందు, కరోతి—స్థాపనము చేయవలెను. (తదా—అప్పుడు, ధాతా—ధాత), ఏనమ్—ఈ యజమానుని, రుచః—కాంతియొక్క, మధ్యతః ఏవ=మధ్యమందే, దధాతి—స్థాపించుచున్నాఁడు.

**తాత్పర్యము:** కాంతిని కోరునతఁడు ఈ దేవికలనే నిర్వాపము చేయవలెను. దేవికలు ఛందోరూపములే. కాంతి ఛందోరూపమే. అట్లు నిర్వాపము చేయుటచేత ధాతృదేవుఁడు ఈ యజమానునియందు కాంతిని స్థాపించును. చరురూప నాలుగు పురోడాశములు క్షీరమునందు పక్వములై యుండవలెను. దేవికారూప ఛందస్సులు ఈ యజమానునియందు కాంతిని స్థాపించును. యజమానుఁడు ధాతృదేవుని అనుమత్యాది దేవతల మధ్యమందు స్థాపించవలెను. ధాత యీ యజమానుని కాంతియొక్క మధ్యమందే స్థాపించును.

10. **అర్థము:** అనుమతిః—అనుమతీదేవి, గాయత్రీ వా=గాయత్రీ చ్ఛందస్సే. రాకా—రాకాదేవి, త్రిష్టుక్—త్రిష్టుక్ఛందస్సు. సినీవాలీ—సినీవాలీదేవి, జగతీ—జగతీ చ్ఛన్దస్సు. కుహూః—కుహూదేవి, అనుష్టుప్—అనుష్టుప్ఛందస్సు. ధాతా—ధాతృదేవుఁడు, వషట్కారః—వషట్కార (వౌషట్) రూపుఁడు.

**తాత్పర్యము:** గాయత్ర్యాది ఛందస్సులవలె అనుమత్యాది దేవతలు అభీష్టమును సాధించువారు కావున అనుమత్యాదులకు గాయత్ర్యాది ఛందోరూపత్వము వర్ణించఁబడినది. తాత్పర్యము సులభము.

11. **అర్థము:** రాకా—పూర్ణచంద్రునితోఁ గూడియున్న పున్నమ, పూర్వపక్షః—శుక్లపక్ష స్వరూప మైనది. కుహూః—చంద్రకళ కానరాని అమావాస్య, అపరపక్షః—కృష్ణపక్ష స్వరూప మైనది. సినీవాలీ—సినీవాలి, అమావాస్యా—అమావాస్య. (దీనియందు చంద్రకళ లేశమై యుండును. అనఁగా కృష్ణ చతుర్దశీ మిశ్రితమైన అమావాస్య సినీవాలి యని యర్థము.) అనుమతిః—అనుమతి, పౌర్ణమాసీ—పున్నమ. (శుక్లచతుర్దశీ మిశ్రితమైన పౌర్ణమాసి అనుమతి.) ధాతా—ధాత, చన్ద్రమాః—చంద్రుఁడు. (శుక్లపక్ష కృష్ణపక్షముల నిష్పాదకుఁడు చంద్రుఁడు. ఆ చంద్రుఁడే యిచట ధాత. తాత్పర్యము సులభము. ఇచట రాకాది దేవతలు పూర్వపక్షాది రూపమున వర్ణింపఁబడిరి.)

12. **అర్థము:** వసవః—వసువులు, అష్టౌ=ఎనమండుగురు. గాయత్రీ—గాయత్రీ చ్ఛందస్సు, అష్టాక్షరా—ఎనిమిది అక్షరములు కలది. (కావున అష్ట వసుస్వరూప.) రుద్రాః—రుద్రులు, ఏకాదశ—పదునొకండుగురు. త్రిష్టుప్—త్రిష్టుప్ఛన్దస్సు, ఏకాదశాక్షరా—పదునొకండు అక్షరములు కలది. (కావున ఏకాదశరుద్ర స్వరూప.) ఆదిత్యాః—ఆదిత్యులు, ద్వాదశ—పండ్రెండు అక్షరములు కలది. (కావున ద్వాదశాదిత్య స్వరూప.) అనుష్టుప్=అనుష్టుప్ఛందోరూపముగ వర్ణింపఁబడిన కుహూదేవి, ప్రజాపతిః—ప్రజాపతిరూప మైనది. ధాతా—ధాతృదేవుఁడు, వషట్కారః—వషట్కార స్వరూపుఁడు.

**తాత్పర్యము:** గాయత్ర్యాది రూపముగ వర్ణించఁబడిన అనుమత్యాది దేవతలు ఈ మంత్రమున సంఖ్యాది సామ్యముచే వస్వాదిరూపమున వర్ణించఁబడుచున్నారు. గాయత్రీరూపమున వర్ణింపఁబడిన అనుమతి అష్టాక్షర సామ్యముచేత అష్టవసు స్వరూప, ఏకాదశాక్షర సామ్యముచే త్రిష్టుక్కుగా వర్ణింపఁబడిన రాకాదేవి ఏకాదశ రుద్ర స్వరూప. జగతీరూపమున వర్ణింపఁబడిన సినీవాలి ద్వాదశాక్షర సామ్యముచే ద్వాదశాదిత్య స్వరూప. అనుష్టుప్పుగా వర్ణింపఁబడిన కుహూదేవి సర్వోత్పాదకత్వ సామ్యముచే ప్రజాపతి స్వరూప. ముఖ్యత్వ సామ్యముచే ధాత వషట్కార స్వరూపుఁడు.

13. **అర్థము:** ఏతత్ వై—"గాయత్రీ వా అనుమతిః" ఇత్యాది నిరూపణమే, దేవికాః—దేవికలయొక్క (షష్ఠ్యర్థే ప్రథమ), సర్వాణి ఛన్దాంసి—సర్వచ్ఛందో రూపత్వము. సర్వాః దేవతాః—సర్వదేవతా రూపత్వము. వషట్కారః—వషట్కార రూపత్వము కూడ.

**తాత్పర్యము:** గాయత్రీ వా అనుమతిః ఇత్యాది నిరూపణమే దేవికలయొక్క సర్వచ్ఛందోరూపత్వము. సర్వదేవతా రూపత్వము, వషట్కార రూపత్వము కూడ. (పూర్వమంత్రములందుఁ జేయఁబడిన ప్రశంస ఇచట ముగించఁబడినది.)

14. **అర్థము:** తాః సర్వాః=ఆ సర్వదేవికలను, సహ నిర్వపేత్ యత్=ఒక్కసారిగా నిర్వాపము చేసినచో, ఏనమ్=ఈ విధముగ నిర్వాపము చేసిన యజమానుని, ప్రదహః=దగ్ధము చేయుటకు, ఈశ్వరాః=దేవికలు సమర్థము లైనవి. ద్వే=రెండు చరువులను, (అనుమతికి, రాకాదేవికి) ప్రథమే=ప్రథమమునందు, నిరుప్య=నిర్వాపము చేసి, ధాతుః=ధాతకు. తృతీయమ్=మూఁడవదైన పురోడాశమును, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. తథో ఏవ=ఆ విధముగానే, ఉత్తరే=ఉత్తరములైన చరువుల రెండింటిని, నిర్వపేత్=సినీవాలికి, కుహూదేవికి, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. తథా సతి=అట్లు కాఁగా, దేవికాః=దేవికలు, ఏనమ్=ఈ యజమానుని, న దహన్తి=దహింపఁజేయుట లేదు. అథో=అప్పుడు, యస్మై కామాయ=ఏ కోరికకై, నిరుప్యన్తే=చరురూప పురోడాశములు నిర్వాపము చేయఁబడుచున్నవో, తమేవ=ఆ కోరికనే, (యజమానః=యజమానుఁడు), అభి=అంతటను, ఉపాప్నోతి=పొందుచున్నాఁడు.

**తాత్పర్యము:** పూర్వోక్త హవిర్నిర్వాపము మూఁడు విధములుగా ఇచట విభజించఁబడినది. అనుమత్యాది పంచదేవతలకు అయిదు హవిస్సులను ఒకేసారి నిర్వాపము చేసినచో అనుమత్యాది దేవతలు ఈ యజమానుని దహింపఁజేయుదురు. ప్రథమమున అనుమతి రాకా దేవతలకు ఒక్కొక్క హవిస్సు చొప్పున రెండు చరురూప హవిస్సుల నుంచి, పిమ్మట ధాతృదేవునకు ఒక పురోడాశము నుంచి, పిమ్మట సినీవాలికి కుహూదేవికి ఒక్కొక్క చరురూప హవిస్సును నిర్వాపము చేయవలెను. ఇట్లు చేసినచో ఆ దేవతలు ఈ యజమానుని దహింపఁజేయరు. యజమానుఁడు ఏ యే కోరికలతో హవిర్నిర్వాపము చేయునో, ఆ ఫలములను సంపూర్ణముగ పొందును.

నవమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే దశమోఽనువాకః

మూలము: [1]వాస్తోష్పతే ప్రతి జానీహ్యస్మాన్త్స్వావేశో అనమీవో భవా నః। యత్త్వేమహే ప్రతి తన్నో జుషస్వ శం న ఏధి ద్విపదే శం చతుష్పదే। [2]వాస్తోష్పతే శగ్మయా సగ్ంసదా తే సక్షీమహి రణ్వయా గాతుమత్యా। ఆ వః క్షేమ ఉత యోగే వరం నో యూయం పాత స్వస్తిభిః సదా నః। [3]యత్సాయం ప్రాత రగ్నిహోత్రం జుహోత్యాహుతీష్టకా ఏవ తా ఉప ధత్తే (౧) యజమానో ఽహోరాత్రాణి వా ఏతస్యేష్టకా య ఆహితాగ్ని ర్యత్సాయం ప్రాత ర్జుహోత్యహోరాత్రాణ్యేవా ఽఽప్త్వేష్టకాః కృత్వోపధత్తే [4]దశ సమానత్ర జుహోతి దశాక్షరా విరాడ్విరాజ మేవా ఽఽప్త్వేష్టకాం కృత్వోప ధత్తేఽథో విరాజ్యేవ యజ్ఞ మాప్నోతి చిత్యశ్చిత్యోఽస్య భవతి [5]తస్మాద్యత్ర దశోషిత్వా ప్రయాతి తద్యజ్ఞవాస్త్వవాస్త్వేవ తద్యత్తతోఽర్వాచీనమ్ (౨) రుద్రః ఖలు వై వాస్తోష్పతి ర్యదహుత్వా వాస్తోష్పతీయం ప్రయాయా ద్రుద్ర ఏనం భూత్వాఽగ్ని రనూత్థాయ హన్యాద్వాస్తోష్పతీయం జుహోతి భాగధేయేనైవైనగ్ం శమయతి నాఽఽర్తి మార్చ్ఛతి యజమానో [6]యద్యుక్తే జుహుయాద్యథా ప్రయాతే వాస్తావాహుతిం జుహోతి తాదృగేవ తద్యదయుక్తే జుహుయాద్యథా క్షేమ ఆహుతిం జుహోతి తాదృగేవ తదహుత మస్య వాస్తోష్పతీయగ్ం స్యాత్ (౩) దక్షిణో యుక్తో భవతి సవ్యోఽయుక్తోఽథ వాస్తోష్పతీయం జుహోత్యుభయ మేవాక రపరివర్గ మేవైనగ్ం శమయతి [7]యదేకయా జుహుయా ద్దర్విహోమం కుర్యాత్పురోనువాక్యా మనూచ్య యాజ్యయా జుహోతి సదేవత్వాయ [8]యద్ధుత ఆదధ్యా ద్రుద్రం గృహానన్వారోహయే ద్యదవ

క్షాణ్యసంప్రక్షాప్య ప్రయాయాద్యథా యజ్ఞవేశసం వాఽదహనం వా తాదృగేవ తదయం తే

యోనిర్ ఋత్వియ ఇత్యరణ్యోః సమారోహయతి (४)ఏష వా అగ్నేర్యోనిః స్వ ఏవైనం

యోనౌ సమారోహయత్యథో ఖల్వాహు ర్యదరణ్యోః సమారూఢో నశ్యేదుదస్యాగ్నిః సీదేత్పు

నరాధేయః స్యాదితి యా తే అగ్నే యజ్ఞియా తనూ స్తయేహ్యారోహేత్యాత్మ న్త్సమారోహ

యతే యజమానో వా అగ్నేర్యోనిః స్వాయామేవైనం యోన్యాగ్ం సమారోహయతే ॥ ౧౦ ॥

(భత్తేఽర్వాచీనగ్ం స్యాత్సమారోహయతి పఞ్చచత్వారిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థప్రపాఠకే దశమోఽనువాకః

## వేదార్థదీపిక

**అవతారిక:** నవమానువాకమునందు దేవికా హవిస్సులు చెప్పఁబడినవి. ఈ దశమానువాకమునందు గ్రామాంతరమునకు ప్రయాణము చేయు నగ్నిహోత్రికి అగ్నిసమారోపణము చెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** హే వాస్తోష్పతేః=అగ్నిహోత్ర నివాసస్థానమైన గృహమునకు పాలకుఁడవైన ఓ గార్హపత్యాగ్నీ!, అస్మాన్=మమ్ము, ప్రతిజానీహి=గుర్తించుకొనుము. నః=మాకు, స్వావేశః=సుఖముగ (నుండుటకు) నివాసమును కల్పించువాఁడవు, అనమీవః=రోగనివారకుఁడవును, భవా=అగుము. ("భవ" అని యుండుటకు బదులు 'భవా' అని ప్రయుక్తమైనది. ఛాందసము.) యత్=ఏ కార్యము నుద్దేశించి, త్వా=నిన్ను, ఈమహే=పొందుచున్నామో (ప్రార్థించుచున్నామో), నః=మాయొక్క, తత్=ఆ కార్యమును, ప్రతిజుషస్వ=ప్రీతిపూర్వకముగ సేవించుము. (తతః=అందువలన), నః=మాయొక్క, ద్విపదే=మనుష్యునికొఱకు, చతుష్పదే=పశువుకొఱకు, శమ్=సుఖమును, ఏధి=వృద్ధి నొందించుము.

**తాత్పర్యము:** అగ్నిహోత్ర నివాస స్థానమైన గృహమునకు పాలకుఁడవైన ఓ గార్హపత్యాగ్నీ! నీవు గ్రామాంతరమునకు పోవు మమ్ము గుర్తుంచుకొనుము. మాకు సుఖనివాసమును కల్పించువాఁడవు కమ్ము. రోగ నివారకుఁడవును అగుము. మేము ఏ కార్యము నుద్దేశించి నిన్ను పొందుచున్నామో, నీవు ఆ కార్యమును ప్రీతిపూర్వకముగ సేవింపుము. పిమ్మట మా మనుష్యునకు పశువునకును సుఖహేతువు అగుము. ('నః ద్విపదే శమ్ ఏధి', 'నః చతుష్పదే శమ్ ఏధి' అని వాక్యభేదమును సూచించుటకై 'శమ్' అను పదము రెండు మారులు ప్రయుక్తమైనది. అగ్నిహోత్రి గార్హపత్యాగ్నిసహితుఁడై గ్రామాంతరమునకు పోవుసమయమున గార్హపత్యాగ్ని యందు ఉత్తరభాగమున హోమము చేయుటకై ఈ పురోనువాక్యను పలుకవలెను.)

2. **అర్థము:** హే వాస్తోష్పతేః=ఓ గార్హపత్యాగ్నీ! శగ్మయా=సర్వార్థ సాధన శక్తి కలదియు, రణ్వయా=రమణీయమైనదియు, గాతుమత్యా=అవగతి కలదియు (సర్వజ్ఞయు)నగు, తే సంసదా=నీయొక్క సభతో, (వయమ్=మేము), సక్షీమహి=బాగుగ కలసికొందుము గాక. యూయమ్=మీరు, నః=మమ్ము, (మాయొక్క), యోగే=

యోగము నిమిత్తము, ఉత-మఱియు, క్షేమే-క్షేమనిమిత్తము, వరమ్-బాగుగ, అవః=రక్షించుఁడు. ('అవ్' ఇత్యుపసర్గపూర్వక 'అవ'-రక్షణాదిషు, ఇతి ధాతోః లోటి మధ్యమపురుషైకవచనే —'అవ' ఇతి ప్రయోక్తవ్యమ్. 'అవః' ఇతి ఛాన్దసః ప్రయోగః.) తే-అటువంటి మీరు, నః-మమ్ము, సదా-ఎల్లప్పుడు, స్వస్తిభిః-శ్రేయస్సులతో, పాత-రక్షించుఁడు. (యూయమితి పూజాయాం బహువచనమ్.)

తాత్పర్యము: ఓ గార్హపత్యాగ్నీ! నీ సభతో మేము కలిసికొందుము గాక. (ఇది ప్రార్థన.) నీ సభ సర్వార్థసాధన సమర్థమైనది. రమణీయమైనది. సర్వజ్ఞము. నీవు మా యోగమునందు క్షేమమునందు మమ్ము రక్షింపుము. అటువంటి నీవు మమ్ము సర్వదా శ్రేయస్సులతోఁ గాపాడుము. (అపేక్షితమైనదియు లేనిదియునగు దానిని పొందుట యోగము. తనకున్న దాని నంతయుఁ గాపాడుకొనుట క్షేమము. ప్రథమ మంత్రమువలె నీ మంత్రమును గూడ హోమము చేయునపుడు పఠించవలెను.)

3. అర్థము: అగ్నిహోత్రీ=అగ్నిహోత్రకర్మము నాచరించు నతఁడు, సాయం ప్రాతః-సాయం ప్రాతః కాలములందు, అగ్నిహోత్రం జుహోతీతి యత్-అగ్నిహోత్రమునందు హోమము చేయుచున్నాఁ డనుట యేది కలదో, తాః ఆహుతీష్టకాః ఏవ- ఆ సమస్తమైన ఆహుతిరూపములైన ఇష్టకలనే (ఇటికలనే), యజమానః-యజమానుఁడు, ఉపధత్తే-కూర్చుచున్నాఁడు. ఏతస్య-ఈ నిత్యాగ్నిహోత్రికి, అహోరాత్రాణి వా-అహోరాత్రములే, ఇష్టకాః-ఇష్టకలు. యః ఆహితాగ్నిః-ఏ ఆహితాగ్ని, సాయం ప్రాతః-సాయంకాల ప్రాతఃకాలములందు, జుహోతి యత్=హోమము చేయుచున్నాఁడనుట యేది కలదో (తేన-ఆ నిత్యాగ్నిహోత్రానుష్ఠానముచేత, సః-ఆ యజమానుఁడు, తదానీమ్-అప్పుడు), అహోరాత్రాణ్యేవ=అహోరాత్రములనే, ఆప్త్వా=పొంది, ఇష్టకాః-ఇష్టకలనుగా, కృత్వా-చేసి, ఉపధత్తే-ఉపధానము చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: అగ్నిహోత్రి సాయం ప్రాతః కాలములందు అగ్నిహోత్రమునందు నియమముగ హోమము చేయుచున్నచో అతఁడా యాహుతులనే ఇష్టకలనుగాఁ జేసినవాఁడగును. ఇచట మట్టితోఁ జేసిన ఇటికలు లేవు. అయినను ఆహితాగ్నియైన యతనికి అహోరాత్రములే ఇష్టకలుగా ఏర్పడుచున్నవి. కావున సాయం ప్రాతః కాలములందు నియమముగ అగ్నిహోత్రానుష్ఠానము చేయుటచేత అహోరాత్రములే కాలరూపములైన ఇష్టక లగుచున్నవి. అప్పుడతఁ డా కాలరూపేష్టకలనే పొంది ఇష్టకోపధానము చేసినవాఁడగును. (ఇష్టకోపధానము-అగ్నిహోత్రకర్మ చేయుటకు ఇటికలను చతురస్రముగా కూర్చుట. గ్రామాంతరము పోవునపుడు అగ్నిహోత్రి మార్గమధ్యమునఁ గాని, గ్రామాంతరమునఁ గాని మృణ్మయములైన యిటికలతో నిర్మాణము చేయుట కష్టసాధ్యము కావున అతడు సాయం ప్రాతః కాలములందు నియమముగ అగ్నిహోత్రకర్మను చేయుటచే ఆ సాయం ప్రాతః కాలములనే అతడు ఇష్టకలుగ భావించి అగ్నిహోత్రకర్మను జేయవలెనని భావము. ఇచట హోమము ప్రశంసించఁబడినది.)

4. అర్థము: అగ్నిహోత్రీ-అగ్నిహోత్రి, సమానత్ర-ఒకచోట, (యదా) దశ జుహోతి-పది దినములుండి ఎప్పుడు హోమము చేయునో, విరాట్-విరాట్ఛందస్సు, దశాక్షరా-పదియక్షరములు కలది, (కావున) తదా=అప్పుడు, సః-ఆ యగ్నిహోత్రి, విరాజమేవ-విరాట్ఛందస్సునే, ఆప్త్వా-పొంది, ఇష్టకాం కృత్వా-ఆ విరాజమునే ఇష్టకనుగాఁ జేసి, ఉపధత్తే-ఇష్టకోపధానము చేసినవాఁ డగును. అథో-మఱియు, విరాజి-విరాట్టు లభ్యమగుచుండఁగా, యజ్ఞమ్-అగ్నిష్టోమ యజ్ఞమును, ఆప్నోతి-పొందుచున్నవాఁ డగును. అస్య-ఇతనికి, చిత్యః=అగ్ని, చిత్యః-చిత్య, భవతి-అగుచున్నది.

తాత్పర్యము: అగ్నిహోత్రి గ్రామాంతరమునకు వెళ్లినపుడు ఒకచోట పది దినములుండి అగ్నిహోత్ర హోమము చేసినచో, విరాట్ఛందస్సు దశాక్షరములు కలది కావున, సంఖ్యాసామ్యమువలన విరాజమునే పొంది దానిని ఇష్టకమగాఁ జేసి ఇష్టకోపధానము చేసినవాఁడగును. ఆ విరాట్టునందే అతడు అగ్నిష్టోమ యజ్ఞమును పొందుచున్నవాఁ డగును. అప్పు డితని అగ్ని చిత్య మగును. (ఇష్టకోపధానము చేసి అందు అగ్నిని ప్రతిష్ఠించి ఆ యగ్నియందు హోమము చేసినచో ఆ యగ్ని చిత్య మవఁబడును. ఆ చిత్యాగ్నులు మూఁడు విధములు. మృణ్మ

యములయిన ఇటికల నుపధానము చేసి అందు ప్రతిష్ఠితమైన అగ్ని ఒక విధమైన చిత్యము. అహోరాత్ర కాల రూపములైన ఇష్టకలచే చితమైన యగ్ని రెండవ విధమైన చిత్యాగ్ని. ఇది మూఁడవ మంత్రమునందు వర్ణింపఁబడినది. విరాడ్రూపేష్టకచే చితమైన అగ్ని మూఁడవ విధమైన చిత్యాగ్ని. ఈ చిత్యాగ్ని ఇచట వర్ణించఁబడినది. ఇచట ప్రకారాంతరమున హోమము ప్రశంసించఁబడినది.)

5. అర్థము: (అగ్నిహోత్రీ=అగ్నిహోత్రి, యస్మాత్=ఏ కారణమువలన), యత్ర=ఏ ప్రదేశమునందు, దశ=పది దినములు, ఉషిత్వా=ఉండి, ప్రయాతి=(పిమ్మట) ప్రయాణము చేయుచున్నాఁడో, తస్మాత్=ఆ కారణమువలన, తత్=అది, యజ్ఞవాస్తు=యజ్ఞభూమి. తతః అర్వాచీనమ్=ఆ పది దినములకు పిమ్మట, వసతి యత్=ఉంటున్న భూమి యేది కలదో, తత్=అది, అవాస్త్వేవ=అయజ్ఞభూమియే. వాస్తోష్పతిః=గార్హపత్యాగ్ని, రుద్రః ఖలు వై=క్రూరుఁడే కదా!, (అగ్నిహోత్రీ=అగ్నిహోత్రి), వాస్తోష్పతీయమ్=గార్హపత్యాగ్నిని, అహుత్వా=హోమము చేయక, యత్ ప్రయాయాత్=ప్రయాణము చేయునెడల, అగ్నిః=గార్హపత్యాగ్ని, రుద్రః భూత్వా=క్రూరుఁడుగా అయి, ఏనమ్=ఈ యగ్నిహోత్రిని, అనూత్థాయ=లేవకుండఁగనే, హన్యాత్=సంహరించును. (తత్=ఆ కారణమువలన, అగ్నిహోత్రీ=అగ్నిహోత్రి), వాస్తోష్పతీయమ్=గార్హపత్యాగ్నిని, జుహోతి=హోమము చేయవలెను. (తదా=అప్పుడు), యజమానః=అగ్నిహోత్రియగు యజమానుఁడు, భాగధేయేనైవ=హోమభాగముచేతనే, ఏనమ్=ఈ గార్హపత్యాగ్నిని, శమయతి=శాంతింపఁజేయుచున్నాఁడు. ఆర్తిమ్=మరణరూపమైన ఆర్తిని, నార్ఛతి=పొందుట లేదు.

తాత్పర్యము: అగ్నిహోత్రి ఏ ప్రదేశమునందు పది దినములుండి అగ్నియందు హోమము చేయునో, ఆ ప్రదేశము యజ్ఞభూమి యగును. ఆ పది దినములకు పిమ్మట ఉన్నభూమి అయజ్ఞభూమి యగును. గార్హపత్యాగ్ని క్రూరస్వరూపుఁడు. అగ్నిహోత్రి గార్హపత్యాగ్నియందు హోమము చేయక పయనించునెడల గార్హపత్యాగ్ని క్రూరుఁడై ఈ అగ్నిహోత్రిని లేవకుండఁగనే సంహరించును. కావున అగ్నిహోత్రియగు యజమానుఁడు ప్రయాణము చేయునపుడు గార్హపత్యాగ్నియందు హోమము చేయవలెను. అప్పుడు యజమానుఁడు హోమభాగముచేతనే ఈ గార్హపత్యాగ్నిని శాంతింపఁజేయును. అతఁడు ఆర్తిని (మరణమును) పొందఁడు. (ఇది హోమవిధాయక మంత్రము.)

6. అర్థము: యుక్తే సతి=అగ్నిహోత్రి ప్రయాణము చేయుటకై తానధిష్ఠించు శకటమునకు రెండు ఎద్దులు పూన్చఁబడినవి కాఁగా, జుహుయాత్ యత్=హోమము చేయుచో, ప్రయాతే సతి=ప్రయాణము చేయుచుండఁగా, వాస్తవాహుతిమ్=గార్హపత్యాగ్నిని. యథా జుహోతి=ఏ విధముగ హోమము చేయుచున్నాఁడో, తత్=శకటమునకు ఎద్దులను పూన్చఁగానే చేసిన ఆ హోమము, తాదృగేవ=ప్రయాణము చేయుచుండఁగాఁ జేసిన హోమము వంటిదే. అయుక్తే సతి=రెండెద్దులు బండికి పూన్చఁబడని వగుచుండఁగా, జుహుయాత్ యత్=హోమము చేయుచో, క్షేమే సతి=క్షేమము గలుగుచుండఁగా (ప్రయాణ ప్రసంగమే లేనప్పుడు), యథా జుహోతి=ఏ విధముగ హోమము చేయుచున్నాఁడో, తత్=ఎద్దులను బండికి పూన్చనపుడు చేసిన ఆ హోమము, తాదృగేవ=ప్రయాణ ప్రసక్తియే లేనపుడు చేసిన హోమమువంటిదే. తదా=అప్పుడు, అస్య=ఈ అగ్నిహోత్రి యొక్క, వాస్తోష్పతీయమ్=గార్హపత్యాగ్ని హోమము, అహుతమ్=హుతము కానిదియే, స్యాత్=అగును. దక్షిణః=కుడిప్రక్క ఎద్దు, యుక్తః భవతి=బండికి పూన్చఁబడినది, భవతి=కావలయును. సవ్యః=ఎడమప్రక్క ఎద్దు, అయుక్తః=పూన్చఁబడినది, భవేత్=కావలయును. అథ=అప్పుడు, వాస్తోష్పతీయమ్=గార్హపత్యాగ్నిని గూర్చి, జుహోతి=హోమము చేయవలెను. (తథా సతి=అట్లు కాఁగా), అపరివర్గమేవ=శాంతింపఁజేయఁదగిన యే ఒక అంశమును గూడ విడువకయే, ఉభయమ్=(ప్రయాణ ప్రసక్తి ఒకటి, ప్రయాణము నిష్పన్నము కాకుండుట రెండవది అను) ఉభయమును, అకః=చేసినవాఁ డగుచున్నాఁడు. (తదా=అప్పుడు, సః=ఆ యగ్నిహోత్రి), ఏనమ్=ఈ గార్హపత్యాగ్నిని, శమయతి శాంతింపఁజేయువాఁ డగును.

తాత్పర్యము: అగ్నిహోత్రి ప్రయాణము చేయుటకై ఉపయోగించు శకటమునకు కుడియెద్దును పూన్చిన పిమ్మట ఎడమ యెద్దును పూన్చకపూర్వము గార్హపత్యాగ్నియందు హోమము చేయవలె ననెడి విధి ఈ మంత్రమునఁ

జెప్పఁబడుచున్నది. బండికి రెండెద్దులను పూన్చినతరువాత అగ్నిహోత్రి గార్హపత్యాగ్నియందు హోమము చేసినచో, ఆ హోమము ప్రయాణమైనపిమ్మట చేసిన హోమమువంటిది యగును. రెండెద్దులను పూన్చక పూర్వమే హోమము చేసినచో, ఆ హోమము ప్రయాణప్రసంగమే లేనపుడు చేసిన హోమమువంటిది యగును. ఈ రెండువిధముల చేసిన హోమము అహుతమే యగును. కావున అగ్నిహోత్రి ప్రయాణము చేయఁబోవు సమయమున తానెక్కునట్టి శకటమునకు కుడియెద్దును పూన్చి, ఎడమయెద్దును పూన్చకపూర్వము గార్హపత్యాగ్ని యందు హోమము చేయవలెను. అప్పుడు పైదోషములు రెండును సంభవించవు. గార్హపత్యాగ్నిని శాంతింపఁ జేయఁదగిన యంశము నొకదానిని కూడ విడువక ప్రయాణప్రసక్తి నొకదానిని, ప్రయాణము నిష్పన్నము కాకుండుట అను రెండవదానిని చేసినవాఁడగును. ఇట్లు కాఁగా గార్హపత్యాగ్నిని సంపూర్ణముగ శాంతింపఁ జేసినవాఁ డగును.

7. అర్థము: ఏకయా—ఒక దర్వి చేత, జుహుయాత్ యత్—హోమము చేయునెడల, దర్విహోమమ్—దర్వితో హోమమును, కుర్యాత్—చేయువాఁ డగును. (తత్—ఆ కారణమువలన), సదేవత్వాయ—(దేవతాప్రీతి సిద్ధికై) దేవత్వముతోఁ గూడియుండుటకై, పురోనువాక్యామ్—"వాస్తోష్పతే ప్రతిజానీహి"త్యాది పురోనువాక్యను, అనూచ్య—ఉచ్చరించి, (తతః—పిమ్మట), యాజ్యయా—"వాస్తోష్పతే శగ్మయా" ఇత్యాది యాజ్యచేత, జుహుయాత్—హోమము చేయవలెను.

తాత్పర్యము: "ఆశ్రావయే"త్యాది పంచమంత్రముల సముదాయము యాజ్యాపురోనువాక్యలకు సహాయకారి యగుచున్నది. తత్పూర్వక హోమము దేవతలకు ఇష్టమైనది. అందు యాజ్యాపురోనువాక్యలు ప్రధానములైనవి. ఆశ్రావయేత్యాది మంత్రసంఘము లేకుండఁగ కేవలము "అగ్నయే స్వాహా" అని యుచ్చరించి చేసిన హోమము దేవతలకు ప్రీతికరము కాదు. కావున ఇచట ఒక దర్విచేతనే చేయు హోమమునందు ఆశ్రవణాది మంత్రముల కవకాశము లేకుండుటచేత అది దర్విహోమ మగును. అందువలన ఇచట దర్విహోమత్వము ఏర్పడకుండుటకై "వాస్తోష్పతే ప్రతిజానీహి" ఇత్యాది పురోనువాక్య నుచ్చరించి "వాస్తోష్పతే శగ్మయా" ఇత్యాది యాజ్యచే హోమము చేయవలెను. ఇట్లు చేయుటవలన దేవతలకు ప్రీతి కలిగి ఈ హోమమునకు దేవత్వ సాహిత్యము సిద్ధించును.

8. అర్థము: హుతే సతి—హోమము చేయఁబడిన దగుచుండఁగా, ఆదధ్యాత్ యత్—(గృహోపకరణములైన పాత్రములను శకటమునందు) ఉంచునెడల, రుద్రమ్—క్రూరరూపమైన గార్హపత్యాగ్నిని (కూడ), గృహాన్ అన్వారోహయేత్—గృహోపకరణముల ననుసరించి శకటమునందు స్థాపించవలెను. అవక్షాణాని—మండుచున్న అంగార రూప కాష్ఠములను, అసంప్రక్షాప్య—బాగుగ ఆర్పకుండఁగ, ప్రయాయాత్ యత్—అగ్నిహోత్రి ప్రయాణము చేయుచో, యథా—ఏ విధముగ, యజ్ఞవేశసం వా—యజ్ఞవిఘాతము కాని, ఆ ప్రదహనం వా—గృహదహనము కాని, కృతమ్—చేయఁబడినదియో, తత్—అది, తాదృగేవ—అటువంటిదే. (తతః—అందువలన), "అయం తే యోనిర్ ఋత్వియః" ఇతి—'అయం తే యోని'రిత్యాది మంత్రముచేత, (తమ్—ఆ యగ్నిని), అరణ్యోః—అరణులయందు, సమారోహయతి—సమారోపణము చేయవలెను. ఏషః వా—ఈ అరణియే, అగ్నేః—అగ్నికి, యోనిః—జన్మస్థానము. (తథా కృతే సతి—అట్లు చేయఁబడఁగా, అయమ్—ఈ యగ్నిహోత్రి), స్వే యోనౌ ఏవ—స్వీయ (అగ్నియొక్క) యోనియందే, సమారోహయతి—స్థాపించుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: హోమము చేసినపిమ్మట భాండాదులను శకటమునందు స్థాపించినచో, ఆ గృహోపకరణముల ననుసరించి క్రూరస్వరూపమైన అగ్నిని గూడ శకటమునందు స్థాపించవలెను. మండుచున్న అంగారరూప కాష్ఠములను బాగుగ చల్లార్పకుండ నగ్నిహోత్రి ప్రయాణము చేయునెడల, ఏదేని ఒక కారణముచే యజ్ఞవిఘాతము కాని, గృహదహనము కాని చేయుట యెటువంటిదియో, ఆ యగ్నిని శకటమునందు స్థాపించుట కూడ నటువంటిదే యగును. అనఁగా శకటము దగ్ధ మగును. కావున తత్పరిహారమునకై అగ్నిహోత్రి "అయం తే యోనిర్ ఋత్వియః" ఇత్యాది మంత్రమును పఠించుచు ఈ యగ్నిని అరణులందు సమారోపణము చేయవలెను. అట్లు చేసినచో అగ్నిహోత్రి అగ్నియొక్క జన్మస్థానమునందే ఈ అగ్నిని సమారోపణము చేయుచున్నవాఁ డగును.

(ఈ మంత్రము శకటమునందు భాండస్థానమును, అరణులందు అగ్నిసమారోపణమును విధించుచున్నది. "అయం తే యోని" రిత్యాది మంత్రము "ఉప ప్రయన్తో అధ్వర" మిత్యాదికమైన అనువాకమునం దామ్నాత మైనది. కావున అచటనే యది వ్యాఖ్యాత మైనది.)

**9. అర్థము:** అథో-పక్షాంతరమున, కేచిత్-కొందఱు, అహుః ఖలు-చెప్పుచున్నారు కదా! అరణ్యోః=అరణులందు, సమారూఢః-సమారోపింపఁబడిన యగ్ని, నశ్యేత్ యత్-(అరణిదాహముచేతఁగాని, అపహరణాదులవలనఁగాని), నశించునెడల, (తదా=అప్పుడు), అస్య=ఈ యజమానునియొక్క, అగ్నిః=(పూర్వము అరణులందు ఆరోపింపఁబడిన) అగ్ని, ఉత్సాదేత్-నశించును. (తదా-అప్పుడు), పునః-మఱల, ఆధేయః ఇతి-ఆ ధానము చేయఁదగినది కనుక, యజమానః-యజమానుఁడు, "యా తే అగ్నే యజ్ఞియా తనూ స్తయేహ్యారోహ" ఇతి-'యా తే అగ్నే' అను మంత్రముచేత, ఆత్మన్-తనయందు, సమారోహయతే-అగ్నిని సమారోపణము చేసికొనవలెను. యజమానః-యజమానుఁడు, అగ్నేః-అగ్నికి, యోనిః వా-జన్మస్థానము కదా!, (అతః-ఇందువలన), ఏనమ్-ఈ యగ్నిని, స్వాయాం యోన్యామేవ-స్వీయ జన్మస్థానమునందే, సమారోహయతి-సమారోపణము చేసినవాఁ డగుచున్నాఁడు.

**తాత్పర్యము:** కొందఱు పక్షాంతరమున ఇట్లు చెప్పుచున్నారు. అరణులందు ఆరోపితమైన యగ్ని, అరణి దగ్ధమగుట వలనఁగాని, అరణి అపహృత మగుటవలనఁగాని నశించునెడల యజమానుఁడు మఱల అగ్నిని ఆధానము చేయవలసియుండును. ఆ దోషము లేకుండుటకు యజమానుఁడు అగ్నిని 'యా తే అగ్నే' ఇత్యాది మంత్రము చేత తనయం దారోపణము చేసికొనవలెను. యజమానుఁడు కూడ శాస్త్రీయాగ్నికి ఉత్పాదకుఁడు కావున అగ్నికి జన్మస్థాన మగుచున్నాఁడు. కావున యజమానుఁడు అగ్నిని అగ్నియొక్క జన్మస్థానమునందే ఆరోపణము చేసినవాఁ డగును. "యా తే అగ్నే" అను మంత్రము. బ్రా. ద్వి. కాం. పంచమ ప్రపాఠకము నందలిది. కావున అచట వ్యాఖ్యానింపఁబడును.

దశమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ఏకాదశోఽనువాకః ।

మూలము: [1]త్వమగ్నే బృహద్వయో దధాసి దేవ దాశుషే । కవి ర్గృహపతి ర్యువా । [2]హవ్యవాడగ్ని రజరః
పితా నో విభు ర్విభావా సుదృశీకో అస్మే । సుగార్హపత్యాః సమిషో దిదీహ్యస్మద్రియక్సం
మిమీహి శ్రవాగ్ంసి । [3]త్వఞ్చ సోమ నో వశో జీవాతుం న మరామహే । ప్రియస్తోత్రో వనస్పతిః ।
[4]బ్రహ్మా దేవానాం పదవీః కవీనా మృషి ర్విప్రాణాం మహిషో మృగాణామ్ । శ్యేనో గృధ్రాణాగ్ం
స్వధితి ర్వనానాగ్ం సోమః (౧)పవిత్ర మత్యేతి రేభన్ । [5]ఆ విశ్వదేవగ్ం సత్పతిగ్ం సూక్తై
రద్యా వృణీమహే । సత్యసవగ్ం సవితారమ్ । [6]ఆ సత్యేన రజసా వర్తమానో నివేశయ న్నమృ
తం మర్త్యం చ । హిరణ్యయేన సవితా రథేనాఽఽదేవో యాతి భువనా విపశ్యన్ । [7]యథా నో
అదితిః కరత్పశ్వే నృభ్యో యథా గవే । యథా తోకాయ రుద్రియమ్ । [8]మా నస్తోకే తనయే
మా న ఆయుషి మా నో గోషు మా (౨)నో అశ్వేషు రీరిషః । వీరాన్మానో రుద్ర భామితో
వధీ ర్హవిష్మన్తో నమసా విధేమ తే । [9]ఉదప్రుతో న వయో రక్షమాణా వావదతో అభ్రియస్యేవ
ఘోషాః । గిరిభ్రజో నోర్మయో మదన్తో బృహస్పతి మభ్యర్కా అనావన్ । [10]హగ్ంసైరివ
సఖిభి ర్వావదద్భి రశ్మన్మయాని నహనా వ్యస్యన్ । బృహస్పతి రభికనిక్రదద్గా ఉత ప్రాస్తౌదుచ్చ
విద్వాగ్ం అగాయత్ । [11]ఐన్ద్ర సానసిగ్ం రయిమ్ (౩)సజిత్వానగ్ం సదాసహమ్ । వర్షిష్ఠ
మూతయే భర । [12]ప్ర ససాహిషే పురుహూత శత్రూఞ్జ్యేష్ఠస్తే శుష్మ ఇహ రాతిరస్తు । ఇన్ద్రాఽఽ
భర దక్షిణేనా వసూని పతిః సిన్ధూనామసి రేవతీనామ్ । [13]త్వగ్ం సుతస్య పీతయే సద్యో

వృద్ధో అజాయథాః। ఇన్ద్ర జ్యైష్ఠ్యాయ సుక్రతో। [14]భువస్త్వమిన్ద్ర బ్రహ్మణా మహాన్భువో విశ్వేషు సవనేషు యజ్ఞియః। భువో నృగం శ్చ్యౌత్నో విశ్వస్మిన్భరే జ్యేష్ఠశ్చ మన్త్రః (౪)విశ్వ చర్షణే। [15]మిత్రస్య చర్షణీధృతః శ్రవో దేవస్య సానసిమ్। సత్యం చిత్రశ్రవస్తమమ్। [16]మిత్రో జనాన్యాతయతి ప్రజానన్మిత్రో దాధార పృథివీముత ద్యామ్। మిత్రః కృష్టీరనిమిషాఽభిచష్టే సత్యాయ హవ్యం ఘృతవద్విధేమ। [17]ప్ర స మిత్ర మర్తో అస్తు ప్రయస్వాన్యస్త ఆదిత్య శిక్షతి వ్రతేన। న హన్యతే న జీయతే త్వోతో నైనమగంహో అశ్నోత్యన్తితో న దూరాత్। [18]యచ్ (౫)చిద్ధి తే విశో యథా ప్ర దేవ వరుణ వ్రతమ్। మినీమసి ద్యవిద్యవి। [19]యత్కిఞ్చే దం వరుణ దైవ్యే జనేఽభి ద్రోహం మనుష్యాశ్చరామసి। అచిత్తీ యత్తవ ధర్మా యుయోపిమ మా నస్తస్మాదేనసో దేవ రీరిషః। [20]కితవాసో యద్రిరిపుర్న దీవి యద్వా ఘా సత్యముత యన్న విద్మ। సర్వా తా విష్య శిథిరేవ దేవాథా తే స్యామ వరుణ ప్రియాసః ॥౬॥

(సోమో గోషు మా రయిం మన్త్రో యచ్చిథిరా సప్త చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థప్రపాఠక ఏకాదశోఽనువాకః ॥౧౧॥

వివా ఆ వాయో ఇమే వై చిత్తమగ్ని ర్యాతానాం దేవా వా ఋతాషాడ్రాష్ట్రకామాయ దేవికా వాస్తోష్పతే త్వమగ్నే బృహద్వయ ఏకాదశ ॥౧౧॥

వివా ఇత్యాహ యథాయజురేవైత న్మృత్యుర్గన్ధర్వో ఽవబన్ధే త్వమగ్నే బృహద్వయః షట్చ త్వారిగంశత్ ॥౪౬॥

హరిః ఓమ్।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే చతుర్థః ప్రపాఠకః।

## వేదార్థదీపిక

**అవతారిక:** దశమానువాకమునందు వాస్తోష్పతియుత హోమము విహిత మైనది. ఈ యేకాదశానువాకమునందు కామ్యములైన యాజ్యాపురోనువాక్యలు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము:** హే అగ్నే దేవ!–ఓ యగ్నిదేవా! కవిః–విద్వాంసుఁడవు, గృహపతిః–గృహపాలకుఁడవు, యువా–యువకుఁడవునగు, త్వమ్–నీవు, దాశుషే–హవిస్సు నిచ్చునట్టి యజమానునికొఱకు, బృహత్ వయః–దీర్ఘాయువును, దధాసి–ఇచ్చుచున్నావు.

**తాత్పర్యము:** ఓ యగ్నిదేవా! నీవు హవిస్సు నొసఁగిన యజమానునకు దీర్ఘాయువు నిచ్చుచున్నావు. నీవు విద్వాంసుఁడవు. గృహపాలకుఁడవు. నిత్యతరుణుఁడవు. ఇది "అగ్నయే గృహపతయే పురోడాశ మష్టాకపాలం నిర్వపతి కృష్ణానాం వ్రీహీణామ్" అని చెప్పఁబడిన హవిస్సునకు పురోనువాక్య.

2. **అర్థము:** యః అగ్నిః–ఏ యగ్ని, హవ్యవాట్–హవిస్సును వహించువాఁడును, అజరః–జరా రహితుఁడును, నః–మాకు, పితా–ఉత్పాదకుఁడు లేక, పాలకుఁడును, విభుః–వ్యాపియు, విభావా–విశేషముగ భాసించువాఁడును, సుదృశీకః–సుఖదర్శనుఁడును, (భవతి–అగుచున్నాఁడో, హే అగ్నే!–ఓ యగ్నీ!, సః త్వమ్–ఆ నీవు,) అస్మే–మాకొఱకు, సుగార్హపత్యాః–శోభన గార్హపత్య హేతువులగు, ఇషః–అన్నములను, సందిదీహి–బాగుగ నొసఁగుము. (కించ–మఱియు,) అస్మద్రియక్–మా కభిముఖముగ వచ్చినవాఁడ వగుచు, శ్రవాంసి–వినఁదగిన కీర్తులను, సం మిమీహి–బాగుగ నిష్పన్నము చేయుము.

**తాత్పర్యము:** ఓ యగ్నీ! నీవు హవిస్సును వహించువాఁడవు. ముసలితనము లేనివాఁడవు. మమ్ముఁబుట్టించువాఁడవు. లేదా మమ్ముఁ బాలించువాఁడవు. సర్వవ్యాపివి. విశేషముగ ప్రకాశించువాఁడవు. సుఖదర్శనుఁడవు. అట్టి నీవు మాకు మంచి గార్హపత్యమునకు హేతువులైన యన్నముల నొసఁగుము. మఱియు మా కభిముఖముగ వచ్చి వినఁదగిన యశస్సులను కలుగఁజేయుము. ఆ హవిస్సునకే ఇది యాజ్య.

3. **అర్థము:** హే సోమ!–ఓ సోమదేవా!, ప్రియస్తోత్రః–ప్రియమైన స్తోత్రములు కలవాఁడవు, వనస్పతిః–వనములకు పాలకుఁడువునగు, త్వం చ–నీవు కూడ, నః–మమ్ము, జీవాతున్–జీవింపఁజేయుటకు, వశః–కోరుచున్నవాఁడవు, (అసి–అగుచున్నావు. అతః–ఇందువలన. త్వత్ప్రసాదాత్–నీ యనుగ్రహము వలన), న మరామహే–మరణించము.

**తాత్పర్యము:** ఓ సోమదేవా! నీవు స్తోత్రప్రియుఁడవు. వనములకు పాలకుఁడవు. అట్టి నీవు కూడ మమ్ము జీవింపఁజేయవలెనని కోరుచున్నావు. కావున నీ యనుగ్రహమువలన మేము మరణించము. "సోమో వా ఓషధీనాగ్ం రాజా" ఇత్యాదులచే సోముఁడు స్తుతిప్రియుఁడని స్పష్ట మగుచున్నది. ("సోమాయ వనస్పతయే శ్యామాకం చరుమ్" అను దానికి ఇది పురోనువాక్య.)

4. **అర్థము:** దేవానామ్–దేవతలలో, బ్రహ్మా–బ్రహ్మ, (శ్రేష్ఠః–శ్రేష్ఠుఁడు.) కవీనామ్–పండితులలో, పదవీః–పద వాక్య ప్రమాణాభిజ్ఞుఁడు, (పదం వేత్తి అవగచ్ఛతీతి పదవీః, అని వ్యుత్పత్తి.) శ్రేష్ఠః–శ్రేష్ఠుఁడు. విప్రాణామ్–బ్రాహ్మణులలో, ఋషిః–అనుష్ఠాన సామర్థ్యముచే అతీంద్రియ వస్తుద్రష్ట, (శ్రేష్ఠుఁడు). మృగాణామ్–మృగములలో, మహిషః–శక్త్యాధిక్యముచే మహిషము, (శ్రేష్ఠము). గృధ్రాణామ్–పక్షులలో, శ్యేనః–డేఁగ, (శక్త్యాధిక్యముచే శ్రేష్ఠము). వనానామ్–వనములలో, స్వధితిః–కరవాలాదులవలె దృఢస్వరూపమైన కాంతిమంతమగు వృక్షవిశేషము, (శ్రేష్ఠము. తథా–ఆ విధముగ), సోమః–సోమము, రేభన్–స్తూయమానమై, పవిత్రమ్–పవిత్రమైన కుశాదికమును, అత్యేతి–అతిక్రమించుచున్నది.

**తాత్పర్యము:** బ్రహ్మాదులు స్వజాతులలో శ్రేష్ఠులయిన విధముగ సోమము కూడ స్తూయమానమై పవిత్రమైన కుశాదికము నతిక్రమించుచున్నది. (ఇది యాజ్య.)

5. అర్థము: విశ్వదేవమ్=సర్వదేవతలు తన యధీనమునఁ గలవాఁడును, సత్పతిమ్=సన్మార్గవర్తులను పాలించువాఁడును, సత్యసవమ్=అమోఘమైన అనుజ్ఞ కలవాఁడుసునగు, సవితారమ్=సవితృ (సూర్య) దేవుని, అద్య= ఈ కర్మయందు, సూక్తైః=మంచి వాక్యములచే, ఆవృణీమహే=(ఫలసాధనమునకై) ప్రార్థించుచున్నాము.

తాత్పర్యము: సూర్యునకు సర్వదేవతలు స్వాధీనులై యుందురు. అతఁడు సన్మార్గవర్తులను పాలించువాఁడు. అతని యనుజ్ఞ అమోఘమైనది. అటువంటి సూర్యదేవుని మేము ఈ కర్మయందు మంచివాక్యములచే ఫలసాధనమునకై ప్రార్థించుచున్నాము. ("సవిత్రే సత్యప్రసవే పురోడాశం ద్వాదశకపాల మాశూనాం వ్రీహీణామ్" అని విధింపఁబడిన హవిస్సున కిది పురోనువాక్య.)

6. అర్థము: సవితా=ఆదిత్యుఁడు, సత్యేన=అమోఘమైన, రజసా=రంజకాత్మకమైన మండలముతో, ఆవర్తమానః=తిరుగుచున్నవాఁడై, అమృతమ్=దేవ శరీరమును, మర్త్యం చ=మనుష్య శరీరమును, నివేశయన్=ప్రకాశముచే తత్తల్లోకములందు వ్యవహార క్షమముగాఁ జేయుచు, భువనా=లోకములను, విపశ్యన్=విశేషముగఁ జూచుచు, హిరణ్యయేన=స్వర్ణమయమైన, రథేన=రథముచే, ఆయాతి=(ప్రతిదినము తూర్పుదిక్కునందు) వచ్చుచున్నాఁడు. (భువనా=భువనాని. విభక్తిలోపము ఛాందసము.)

తాత్పర్యము: సూర్యుఁడు అమోఘము, రంజకమునైన మండలముచే ఉదయాస్తమయ కాలములందు తిరుగుచు దేవ శరీరమును దేవ లోకమునందు, మనుష్య శరీరమును మనుష్యలోకమునందును స్వప్రకాశముచే వ్యవహార క్షమముగాఁ జేయుచు లోకములను విశేషముగఁ జూచుచు బంగారపు రథము నధిరోహించి ప్రతిదినము తూర్పుదిక్కునందు వచ్చుచున్నాఁడు. (పై హవిస్సునకే ఇది యాజ్య).

7. అర్థము: అదితిః=అఖండనీయుఁడైన రుద్రుఁడు, యథా=ఏ విధముగ, నః=మాయొక్క, పశ్వే=పశువులకొఱకు, నృభ్యః=మనుష్యులకొఱకు, యథా=ఏ విధముగ, గవే=గోవులకొఱకు, యథా=ఏ విధముగ, తోకాయ=పుత్రాది సంతానముకొఱకు, రుద్రియమ్=రుద్రప్రతిపాదితమైన రక్షణమును, కరత్=చేయుచున్నాఁడో, (తథా=ఆ విధముగ, తమ్=ఆ రుద్రుని, వయమ్=మేము, అనేన హవిషా=ఈ హవిస్సుచేత, ఆరాధయామః=సేవించుచున్నాము. కరత్=కరోతి అని యర్థము.)

తాత్పర్యము: అఖండనీయుఁడైన రుద్రుఁడు మా పశ్వాదులకు రక్షణను చేయుచున్న విధముగ మేము ఆ రుద్రుని ఈ హవిస్సుచే సేవించుచున్నాము. (రుద్రాయ పశుపతయే గావీధుకం చరుమ్" అని విహితమైన హవిస్సునకు ఇది పురోనువాక్య.)

8. అర్థము: హే రుద్ర!=ఓ రుద్రదేవా!, (త్వమ్=నీవు), కామితః=క్రుద్ధుఁడ వగుచు, నః=మాయొక్క, తోకే=పుత్రాది విషయమున, తనయే=పుత్రునికుమారుని విషయమునను, మా రీరిషః=హింసను చేయవలదు. నః=మా యొక్క, ఆయుషి=ఆయువు విషయమున, మా రీరిషః. నః గోషు=మా గోవుల విషయమున, మా రీరిషః. నః అశ్వేషు=మా అశ్వముల విషయమున, మా రీరిషః. నః వీరాన్=మా భృత్యులను, మా వధీః=వధించవలదు. వయమ్=మేము, హవిష్మన్తః=హవిస్సు కలవారమై, తే=నీకొఱకు, నమసా=నమస్కారముచే, విధేమ=పరిచర్య చేయుదుము.

తాత్పర్యము: ఓ రుద్రదేవా! నీవు క్రుద్ధుఁడ వగుచు మా పుత్రపౌత్రాదుల విషయమున హింస చేయవలదు. మా భృత్యులను వధింపవలదు. మేము హవిర్యుక్తులమై నీకు పరిచర్య చేయుదుము. (ఇది పూర్వోక్త హవిస్సునకే యాజ్య.)

9. అర్థము: వయః=నా వయస్సును, రక్షమాణాః=అన్నోదక నిష్పాదన మూలమున రక్షించుచున్న, ఉదప్రుతః న=మేఘములవలెను, అభ్రియస్య=మేఘ సమూహముయొక్క, వావదతః ఘోషాః ఇవ=గర్జనము చేయుచున్న ధ్వనులవలెను, గిరిభ్రజః=కొండలను తాఁకుచున్నవై, మదన్తః ఊర్మయః న=నదీపూరణ ప్రకాశముచే హర్షమును కలిగించునట్టి నదీ తరంగములవలెను, బృహస్పతిమభి=బృహస్పతి నభిలక్షించి, అర్కాః=అర్చన హేతువులైన మా వాగ్విశేషములు, అనావన్=స్తోత్రము చేసినవి.

తాత్పర్యము: బృహస్పతిని అర్చించుటలో హేతువులైన మా వాగ్విశేషములు స్తోత్రములు చేయుచున్నవై అన్నోదకములను కల్పించుటచే నా వయస్సును రక్షించుచున్న మేఘములవలె అపమృత్యు పరిహారముచేత ఆయువును రక్షించునవి. ఉచ్చధ్వనులు గల మేఘ సముదాయముయొక్క గర్జనములవలె అధికముగ పలుకుచున్నవి. కొండలను తాఁకుచు నదీపూరక ప్రకాశముచే సంతోషమును కలిగించుచున్న నదీతరంగములవలె బృహస్పతి మహిమను ప్రకాశింపఁజేయుటచే హర్షమును కలిగించుచున్నవి. ("బృహస్పతయే వాచస్పతయే నైవారం చరుమ్" అని విహితమైన హవిస్సునకు ఇది పురోనువాక్య. ఉదకం ప్రప్లావయన్తి—భూమౌ ప్రవర్తయన్తీతి ఉద్రుతః=ఉదకమును భూమియందు ప్రవర్తింపఁజేయుచున్నవి మేఘములు, అని వ్యుత్పత్త్యర్థము. అభ్రాణాం సమూహః—అభ్రియమ్—మేఘసమూహము.)

10. అర్థము: (అయం) బృహస్పతిః—(ఈ) బృహస్పతి, అశ్మన్మయాని—పాషాణమయ ద్వార పిధాన సదృశములైన, నహనా—దురితములను, వ్యస్యన్—తొలఁగించుచు, అభి కనిక్రదత్—అంతటను మా హవిస్సును స్వీకరించుటచే కలిగిన పరితోషమును సూచించునట్టి ఉచ్చధ్వనిని గావించెను. ఉత—మఱియు, గాః—సంతోష ద్యోతకములైన వాక్యములను, ప్రాస్తౌత్—ఉచ్చరించెను. చ=మఱియు, విద్వాన్—మా పరిచర్యను (గుర్తించిన) తెలిసికొనినవాఁడై, ఉదగాయత్=ఉత్కర్షగా గానము చేసెను. హంసైరివ—చతుర్థాశ్రమ వాసులైన యతిశ్రేష్ఠులచేతవలె, వావదద్భిః—అతిశయముగ స్తుతించుచున్న, సఖిభిః—ఋత్విజులచేత, (పరితోషితః—అంతటను సంతోషించిన, బృహస్పతిః—బృహస్పతి, ప్రతిబన్ధమ్—ప్రతిబంధమును, అపాకరోతి=తొలఁగించుచున్నాఁడు.)

తాత్పర్యము: ఈ బృహస్పతి పాషాణమయ ద్వారములను మూయునట్టి తలుపులతో సమానములైన పాపములను తొలఁగించుచు మా హవిస్సును స్వీకరించుటచే కలిగిన సంతోషమును సూచించునట్టి ఉచ్చధ్వనిని చేసెను. మఱియు సంతోష ద్యోతకములైన వాక్యముల నుచ్చరించెను. ఇంకను మా పరిచర్యను గుర్తించినవాఁడై గొప్పగా గానము చేసెను. పరమేశ్వరుఁడు చతుర్థాశ్రమ వాసులైన యతిశ్రేష్ఠులచే స్తుతింపఁబడినవాఁడై పురుషార్థ ప్రతిబంధకమును తొలఁగించువిధముగ అతిశయముగ స్తుతి చేయు ఋత్విజులచే బాగుగ సంతోషించిన బృహస్పతి ప్రతిబంధమును తొలఁగించుచున్నాఁడు. (పై హవిస్సునకే ఇది యాజ్య.)

11. అర్థము: హే ఇన్ద్ర!—ఓ యింద్రా!, సానసిమ్=దానమునకు సంబంధించినదియు, (అనేకుల కొసఁగుటకు తగినంతది), సజిత్వానమ్—జయశీలురైన పుత్రాదులతో కూడినదియు, సదాసహమ్—ఎల్లప్పుడు విరోధులను సహించునదియు (విరోధులను తిరస్కరించుటకు సమర్థమైనది), వర్షిష్ఠమ్—అధికముగ వృద్ధి నొందినదియునగు, రయిమ్—ధనమును, ఊతయే—రక్షణముకొఱకు, ఆభర—తీసికొనిరమ్ము.

తాత్పర్యము: ఓ యింద్రా! అనేకులకు దానము చేయుటకు సరిపోవునదియు, జయశీలురైన పుత్రాదులతోఁ గూడినదియు, విరోధులను సహించునదియు, వృద్ధి నొందినదియునగు ధనమును రక్షణనిమిత్తము తెమ్ము. ("ఇన్ద్రాయ జ్యేష్ఠాయ పురోడాశ మేకాదశకపాలం మహావ్రీహీణామ్" అను మంత్రముచే విహితమైన హవిస్సునకు ఇది పురోనువాక్య).

12. అర్థము: హే పురుహూత!—అనేక యజ్ఞములందు ఆహ్వానింపఁబడునట్టి ఓ యింద్రా!, శత్రూన్—శత్రువులను, ప్రసహిషే—ప్రకర్షతో సర్వదా సహించుచున్నావు (తిరస్కరించుచున్నావు). తే=నీయొక్క, శుష్మః—బలము, జ్యేష్ఠః—ప్రశస్తమైనది. ఇహ—ఈ కర్మయందు, రాతిః=ఫలదానము, అస్తు—ఉండుఁగాక. హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, దక్షిణేన—దక్షిణహస్తముతో, వసూని—ధనములను, ఆభర—తెమ్ము. (త్వమ్—నీవు), సిన్ధూనామ్—సముద్రసమానులైన, రేవతీనామ్—ప్రజలకు, పతిః—స్వామివి, అసి—అగుచున్నావు.

**తాత్పర్యము:** (పురుషు-బహుషు యజ్ఞేషు, హూత-ఆహూయమాన!) అనేక యజ్ఞములందు ఆహ్వానింపఁబడుచున్న యింద్రా! శత్రువులను ప్రకర్షతో సర్వదా సహించుచున్నావు (తిరస్కరించుచున్నావని భావము). నీ బలము ప్రశస్తమైనది. ఈ కర్మయందు ఫలదానము చేయుదుఁగాక. ఓ యింద్రా! కుడిచేతితో ధనములను తీసికొనిరమ్ము. నీవు సముద్రసదృశులైన ప్రజలకు స్వామివి (పాలకుఁడవు) అగుచున్నావు. (పై హవిస్సునకు ఇది యాజ్య.)

**13. అర్థము:** హే సుక్రతో ఇన్ద్ర!-మంచికర్మలు గల ఓ యింద్రా!, త్వమ్-నీవు, సుతస్య-అభిషుతమైన సోమము యొక్క, పీతయే-పానముకొఱకు, సద్యః-వెంటనే, వృద్ధః అజాయథాః-ప్రవృద్ధుఁడవుగా పుట్టినవాఁడ వగుచున్నావు. (ఏతచ్చ-ఇదియు), జ్యైష్ఠ్యాయ-సర్వదేవతలలో నీయొక్క జ్యేష్ఠత్వముకొఱకు, సంపద్యతే-సంపన్న మగుచున్నది.

**తాత్పర్యము:** మంచికర్మలు కల ఓ యింద్రా! నీవు అభిషుతమైన సోమమును త్రాగుటకై అప్పుడే మిక్కిలి వృద్ధి నొందిన వాఁడవుగా పుట్టితివి. ఇది దేవతలలో నీయొక్క జ్యేష్ఠత్వ (గొప్పతన) మున కుపయోగపడుచున్నది. (ఇది పూర్వోక్త హవిస్సునకు వికల్పముగాఁ జెప్పఁబడిన పురోనువాక్య).

**14. అర్థము:** హే ఇన్ద్ర!-ఓ యింద్రా!, త్వమ్-నీవు, బ్రహ్మణా-స్తుతిరూప వేదవాక్యముచేత, మహాన్-అభివృద్ధుఁడవు, భువః-అగుచున్నావు. విశ్వేషు సవనేషు-ప్రాతస్సవనాదు లన్నిటియందు, యజ్ఞియః-యజ్ఞయోగ్యుఁడవు, భువః-అగుచున్నావు. నౄన్-ప్రతికూల శత్రువులను, చ్యౌత్నః-నశింపఁజేయుచున్నవాఁడ వగుచు, భువః-ఉంటున్నావు. హే విశ్వచర్షణే!-సర్వ మనుష్యులు కలవాఁడవైన (సర్వ మనుష్య స్వామివైన) ఓ యింద్రా! త్వమ్-నీవు, విశ్వస్మిన్ భరే-సర్వ యాగమునందు, మన్త్రిః-మననీయుఁడవు, చ-మఱియు, జ్యేష్ఠః-ప్రశస్తుఁడవు, భువః-అగుచున్నావు. ("భువః" ఇది ఛాందసము. 'భవసి' అను ప్రయోగము పాణినీయము.)

**తాత్పర్యము:** ఓ యింద్రా! నీవు స్తుతిరూప వేదవాక్యముచేత అభివృద్ధుఁడవు, మూఁడు ప్రాతస్సవనాదులందు యజ్ఞయోగ్యుఁడవు, ప్రతికూల శత్రువులను నశింపఁజేయువాఁడవు నగుచున్నావు. సర్వ మనుష్య స్వామివైన ఓ యింద్రా! నీవు సర్వయాగమునందు మననీయుఁడవు (చింతనీయుఁడవు), ప్రశస్తుఁడవు నగుచున్నావు. (పూర్వోక్త హవిస్సునకే ఇది వికల్పితమైన యాజ్య).

**15. అర్థము:** చర్షణీధృతః-మనుష్యులను నిలుపువాఁడగు, మిత్రస్య దేవస్య-మిత్రదేవునకు, శ్రవః-శ్రవణయోగ్యమైన కీర్తి, (మహత్-గొప్పది, అస్తి-కలదు). సానసిమ్-ఫలదానశీలుఁడును, చిత్రశ్రవస్తమమ్-అతిశయముగ చిత్రమైన కీర్తి కలవాఁడును, సత్యమ్-సత్యవాదియునగు మిత్రదేవుని ఉద్దేశించి, (యజామహే-యాగము చేయుచున్నాము).

**తాత్పర్యము:** మనుష్యులకు ధారకుఁడగు మిత్రదేవునకు వినఁదగిన గొప్ప కీర్తి కలదు. మిత్రదేవుఁడు ఫలము నిచ్చుస్వభావము కలవాఁడు. సత్యవాది: అతిశయముగ చిత్రమైన కీర్తి కలవాఁడు. అట్టి మిత్రదేవు నుద్దేశించి యాగము చేయుచున్నాము. ("మిత్రాయ సత్యాయాఽఽమ్బానాం చరుమ్" అను హవిస్సున కిది పురోనువాక్య.)

**16. అర్థము:** (అయం) మిత్రః-ఈ మిత్రదేవుఁడు, జనాన్-సర్వజనులను, ప్రజానన్-వారివారి యధికారములను తెలిసికొనినవాఁడై, యాతయతి-వారివారి వ్యాపారములయందు ప్రయత్నయుక్తులనుగాఁ జేయుచున్నాఁడు. (కించ-మఱియు,) మిత్రః-మిత్రదేవుఁడు, పృథివీమ్-భూమిని, ఉత-మఱియు, ద్యామ్-దివిని, దాధార-ధరించెను. (కించ-ఇంకను), కృష్టీః-మనుష్యులను, అని మిషా-తప్పపాటులేనట్టి దేవతలను, అభిచష్టే-

అంతటను – చూచుచున్నాఁడు. సత్యాయ–అమోఘ ఫలము గల ఆ మిత్రదేవునికొఱకు, ఘృతవత్–నేతితోఁగూడిన, హవ్యమ్–చరులక్షణమైన హవిస్సును, విధేమ–చేయుచున్నాము.

తాత్పర్యము: ఈ మిత్రదేవుఁడు సర్వజనులను వారివారి యధికారములను తెలిసికొనినవాఁడై వారివారి వ్యాపారములందు ప్రయత్నయుక్తులనుగాఁ జేయుచున్నాఁడు. మఱియు మిత్రదేవుఁడు పృథివిని దివిని ధరించెను. మనుష్యులను దేవతలను అంతటను చూచుచున్నాఁడు. అమోఘ ఫలము గల ఆ మిత్రదేవునికొఱకు ఆజ్యముతోఁ గూడిన చరులక్షణ హవిస్సును చేయుచున్నాము. (ఇది పూర్వోక్త హవిస్సునకు యాజ్య.)

17. అర్థము: హే మిత్ర–ఓ ఆదిత్య దేవా!, యః–ఏ యజమానుఁడు, తే–నీకు సంబంధించిన, వ్రతేన–కర్మచే, శిక్షతి–అనుష్ఠించుటకు సమర్థుఁ డగుటకు ఇచ్ఛయించుచున్నాఁడో, సః మర్తః–ఆ మనుష్యుఁడు (యజమానుఁడు), ప్రయస్వాన్–కర్మఫలయుక్తుఁడై, ప్ర అస్తు–ప్రకర్షతో నుండుఁగాక. త్వోతః–నీచే రక్షింపఁబడిన, సః–ఆ యజమానుఁడు, న హన్యతే–రోగాదులచే పీడింపఁబడుట లేదు. న జీయతే–శత్రువులచే తిరస్కృతుఁ డగుట లేదు. ఏనమ్–నీచే రక్షింపఁబడిన ఈ యజమానుని, అంహః–పాపము, అన్తితః–సమీపమునందు, నాశ్నోతి–పొందుట లేదు. దూరాత్–దూరమునందును, నాశ్నోతి–పొందుట లేదు.

తాత్పర్యము: ఓ మిత్రదేవా! త్వత్సంబంధికర్మ ననుష్ఠించుటకు సమర్థుఁడను కావలెనని కోరు యజమానుఁడు కర్మఫలయుక్తుఁడై ప్రకర్షతో నుండుఁగాక. నీవు రక్షించిన యజమానుఁడు రోగాదులచే పీడితుఁడు కాఁడు. శత్రువులచే అవమానింపఁబడఁడు. నీవు రక్షించిన ఈ యజమానుని పాపము సమీపమునఁగాని, దూరమునఁగాని పొందదు. (పూర్వోక్త హవిస్సునకే యిది వికల్పితమైన యాజ్య.)

18. అర్థము: హే వరుణ! దేవ!–ఓ వరుణదేవా!, తే–నీయొక్క, యచ్చిత్ వ్రతమ్–ఏ కొంచెమైనను కర్మను, ద్యవిద్యవి–ప్రతిదినమునందు, విశో యథా–ప్రజలవలె, మినీమహి–తర్కించుచున్నాము.

తాత్పర్యము: ఓ వరుణదేవా! నీకు సంబంధించిన ఏ కొంచెమైనను కర్మను గూర్చి ప్రజలు తమతమ వ్యాపారమును గూర్చి తర్కించుకొనువిధముగ ప్రతిదినము తర్కించుచున్నాము. (కావున సర్వదా నిన్ను సేవించుదుము అని భావము. "వరుణాయ ధర్మపతయే యవమయం చరుమ్" అను మంత్రముచే విహితమైన హవిస్సున కిది పురోనువాక్య),

19. అర్థము: హే వరుణ!–ఓ వరుణదేవా!, మనుష్యాః–మనుష్యులమైన మేము, దైవ్యే జనే–దేవలోక నివాసియగు జనము విషయమై, యత్కించ ఇదమ్ అభిద్రోహమ్–కొంచెము కాని, అధికము గాని ద్రోహమును, అచిత్తీ–అజ్ఞానముచేత, చరామసి–చేయుచున్నామో, (కించ–మఱియు), యదపి తవ ధర్మా–ఏదియైనను నీ కర్మను, యుయోపిమ–నాశనము చేయుచున్నామో, హే దేవ!–ఓ వరుణదేవా!, తస్మాత్ ఏనసః–ఆ ద్రోహమువలనఁగాని, కర్మనాశమువలనఁగాని కలిగిన పాపమువలన, నః–మమ్ము, మా రీరిషః–హింసించవలదు.

తాత్పర్యము: ఓ వరుణదేవా! మనుష్యులమైన మేము దేవలోక నివాసులగు జనులవిషయమై ఏ కొంచెముగ కాని అధికముగఁగాని అజ్ఞానముచే ద్రోహము చేయుచున్నామో, మఱియు నీ కర్మను దేనినైనను నాశనము చేయుచున్నామో, ఓ దేవా! ఆ ద్రోహమువలనఁగాని, కర్మనాశమువలనఁగాని ఏర్పడిన పాపమువలన మమ్ము హింసింపకుము. (పూర్వోక్త హవిస్సున కిది యాజ్య).

20. అర్థము: కితవాసః=ధూర్తసమానులైన (స్వార్థసాధన పరులైన) ఋత్విజులు, యత్=ఏ కర్మాంగమును, రిరిపుః=నశింపఁజేసినవారై, న దీవి=మంచివ్యవహారమునందు ప్రవర్తించుట లేదో, వా=లేక, యద్వ సత్యమ్=ఏ పాపము తెలిసి చేయఁబడినదియో, ఉత=మఱియు, యత్ న విద్మ=ఏ పాపము అజ్ఞానముచే చేయఁబడినదియో, సర్వా తా=(లుప్త ద్వితీయాంతము. సర్వాణి తాని అని యర్థము.) ఆ పాపముల నన్నిటిని, శిథిరేవ=శిథిలములైనవానినిగా, విష్య=నశింపఁజేయుము. అథ=పిమ్మట, హే వరుణ=ఓ వరుణదేవా!, తే=నీకు, ప్రియాసః=ప్రీతిపాత్రులము, భవేమ=అగుదుము.

తాత్పర్యము: ఓ వరుణదేవా!=ధూర్తసమానులైన ఋత్విజులు స్వార్థసాధన తత్పరులై ఏ కర్మాంగమును నశింపఁజేసి మంచిగా వ్యవహరించుట లేదో, లేదా ఏ పాపమును తెలిసి చేసితిమో, ఏ పాపమును తెలియక చేసితిమో ఆ పాపముల నన్నిటిని శిథిలము లగునట్లు నశింపఁజేయుము. అనంతరము మేము నీకు ప్రీతిపాత్రుల మగుదుము. (పూర్వోక్త హవిస్సునకే ఇది వికల్పితమైన మఱియొక యాజ్య.)

ఏకాదశానువాకము సమాప్తము.

తృతీయకాండమునందు చతుర్థప్రపాఠకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే పఞ్చమః ప్రపాఠకః।

### తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]పూర్ణా పశ్చాదుత పూర్ణా పురస్తాదున్మధ్యతః పౌర్ణమాసీ జిగాయ। తస్యాం దేవా అధి సంవసన్త ఉత్తమే నాక ఇహ మాదయన్తామ్। యత్తే దేవా అదధు ర్భాగధేయ మమావాస్యే సంవసన్తో మహిత్వా। సా నో యజ్ఞం పిపృహి విశ్వవారే రయిం నో ధేహి సుభగే సువీరమ్। [2]నివేశనీ సంగమనీ వసూనాం విశ్వా రూపాణి వసూన్యావేశయన్తీ। సహస్రపోషగ్ం సుభగా రరాణా సా న ఆ గన్వర్చసా (౧)సంవిదానా। అగ్నీషోమౌ ప్రథమౌ వీర్యేణ వసూన్రుద్రానాదిత్యానిహ జిన్వతమ్। మాధ్యగ్ం హి పౌర్ణమాసం జుషేథాం బ్రహ్మణా వృద్ధౌ సుకృతేన సాతావథాస్మభ్యగ్ం సహవీరాగ్ం రయిం ని యచ్ఛతమ్। [3]ఆదిత్యా శ్చాఙ్గిరస శ్చాగ్నీనాఽదధత తే దర్శపూర్ణమాసౌ ప్రైప్సన్తేషా మఙ్గిరసాం నిరుప్తగ్ం హవిరాసీ దథాఽఽదిత్యా ఏతౌ హోమా వపశ్య న్తావజుహవు స్తతో వై తే దర్శపూర్ణమాసౌ (౨)పూర్వ ఆఽలభన్త [4]దర్శపూర్ణమాసా వాలభమాన ఏతౌ హోమౌ పురస్తా జ్జుహుయా త్సాక్షాదేవ దర్శపూర్ణమాసావాలభతే [5]బ్రహ్మవాదినో వదన్తి స త్వై దర్శపూర్ణమాసావా లభేత య ఏనయో రనులోమం చ ప్రతిలోమం చ విద్యా దిత్యమావాస్యాయా ఊర్ధ్వం తదనులోమం పౌర్ణమాస్యై ప్రతీచీనం తత్ప్రతిలోమం యత్పౌర్ణమాసీం పూర్వామాలభేత ప్రతిలోమ మేనావా లభేతాము మపక్షీయమాణ మన్వవ (౩)క్షీయేత [6]సారస్వతౌ హోమౌ పురస్తా జ్జుహుయా దమావాస్యా వై సరస్వత్యనులోమ మేవైనావా లభతే ఽము మాప్యాయమాన మన్వా ప్యాయత [7]ఆగ్నావైష్ణవ

మేకాదశకపాలం పురస్తా న్నిర్వపే త్సరస్వత్యై చరుగ్ం సరస్వతే ద్వాదశకపాలం [8]యదా

గ్నేయో భవత్యగ్ని ర్వై యజ్ఞముఖం యజ్ఞముఖమేవర్ధిం పురస్తాద్ధత్తే యద్వైష్ణవో భవతి

యజ్ఞో వై విష్ణు ర్యజ్ఞమేవాఽఽరభ్య ప్ర తనుతే [9]సరస్వత్యై చరుర్భవతి సరస్వతే ద్వాదశ

కపాలో ఽమావాస్యా వై సరస్వతీ పూర్ణమాసః సరస్వా న్తావేవ సాక్షాదా రభత ఋధ్నోత్యాభ్యాం

[10]ద్వాదశకపాలః సరస్వతే భవతి మిథునత్వాయ ప్రజాత్యై [11]మిథునౌ గావౌ దక్షిణా

సమృద్ధ్యై ॥ ౪ ॥ (వర్చపా వై తే దర్శపూర్ణమాసావప తనుతే సరస్వత్యై పఞ్చవిగ్ంశతిశ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమ ప్రపాఠకే ప్రథమోఽనువాకః॥

## వేదార్థ దీపిక

**అవతారిక:** చతుర్థప్రపాఠకమునందు కామ్య నైమిత్తికేష్టులు చెప్పఁబడినవి. ఈ పంచమ ప్రపాఠకమునందలి ప్రథమానువాకమునందు దర్శపూర్ణమాసేష్ట్యంగమైన అన్వారంభణీయేష్టి విధించఁబడుచున్నది. "పూర్ణా పశ్చాత్", "య త్తే దేవా అదధుః" అను మంత్రములచే ప్రథమమున సారస్వత హోమములు చేసి పిమ్మట అన్వారంభణీయేష్టిని నిర్వాపము చేయవలెను. (ఆచరింపవలెను).

1. **అర్థము:** పూర్ణా పౌర్ణమాసీ-పూర్ణయైన పౌర్ణమాస్యభిమానిదేవత, పశ్చాత్-పశ్చిమ దిక్కునందు, ఉజ్జిగాయ-ఉత్కర్షతో జయము నొందినది. ఉత-మఱియు, పూర్ణా-పూర్ణయైన పౌర్ణమాస్యభిమాని దేవత, పురస్తాత్-యజ్ఞభూమికి తూర్పుదిక్కునందు, మధ్యతః-పూర్వ పశ్చిమ దిక్కుల మధ్యమందును, ఉజ్జిగాయ-ఉత్కర్షతో జయము నొందినది. తస్యామ్-ఆ పౌర్ణమాసియందు, అధి(ష్ఠాయ)-అధిష్ఠించి, ఇహ-ఈ యజ్ఞమునందు, సంవసన్తః-బాగుగ నుంటున్న సర్వదేవతలు, ఉత్తమే నాకే-భోగబహుళమైన స్వర్గలోకమునందు, మాదయన్తామ్-మమ్ము సంతోషింపఁజేయుదురు గాక. హే అమావాస్యే!-ఓ అమావాస్యాభిమాని దేవతా!, యత్-ఏ కారణమువలన, తే-నీయొక్క, మహిత్వా-మహిమచేత, సంవసన్తః-బాగుగ నివసించుచున్న, దేవాః-దేవతలు, భాగధేయమ్-హవిర్భాగమును, అదధుః-పొందిరో, (తత్-ఆ కారణమువలన), హే విశ్వవారే!-సర్వానిష్టములను పోఁగొట్టునట్టి ఓ అమావాస్యాభిమాని దేవతా!, సా (త్వమ్)-ఆ నీవు, నః-మాయొక్క, యజ్ఞమ్-యజ్ఞమును, పిపృహి-పూర్ణముగఁ జేయుము. హే సుభగే!-సౌభాగ్యయుక్తయైన ఓ దేవతా!, నః-మాకొఱకు, రయిమ్-ధనమును, సువీరమ్-శోభనపుత్రుని, ధేహి-సంపాదించుము.

**తాత్పర్యము:** పూర్ణయైన పౌర్ణమాస్యభిమాని దేవత పూర్వ పశ్చిమ దిక్కులందును, ఆ రెండు దిక్కుల మధ్యమందును ఉత్కర్షతో జయము నొందినది. సర్వదేవతలు ఆ పౌర్ణమాసియం దధిష్ఠించుచు భోగబహుళమైన స్వర్గమునందు మమ్ము సంతోషింపఁ జేయుదురు గాక. ఓ అమావాస్యాభిమాని దేవతా! నీ మహిమచేత బాగుగ నివసించుచున్న దేవతలు హవిర్భాగమును పొందిరి. కావున సర్వారిష్టములను నివారించునట్టి ఓ అమావాస్యాభి

మాని దేవతా! అటువంటి నీవు మా యజ్ఞమును పూర్ణము చేయుము. ఓ సౌభాగ్యయుక్తయైన అమావాస్యాభి దేవతా! మాకు ధనమును సుపుత్రుని సంపాదించుము. (ఈ మంత్రమునకు వినియోగము అవతారికయందే వ్రాయఁబడినది.)

2. అర్థము: నివేశనీ—మంచి గృహములందు మమ్ము ఎక్కువగ ప్రవేశింపఁజేయునదియు, వసూనాం సంగమనీ—ధనము లను పొందింపఁజేయునదియు, విశ్వా రూపాణి వసూని=మణి ముక్తాది బహుప్రకారములచే నిరూపింపఁబడు నట్టి ధనములను, ఆవేశయన్తీ—మా గృహములందు ప్రవేశపెట్టునదియు, సహస్రపోషం రరాణా=సహస్ర లక్షాది ధనపుష్టి నొసఁగుచున్నదియు, సుభగా—సౌభాగ్యయుక్తయు, వర్చసా—బలముతో, సంవిదానా= సమకూర్చునదియునగు, సా—ఆ పౌర్ణమాస్యభిమానిదేవత, నః—మమ్ముఁ గూర్చి, ఆగన్—వచ్చుఁగాక. (ఆగన్—వైదికమైకప్రయోగము. 'ఆగచ్ఛతు'—అని యర్థము.) హే అగ్నీషోమౌ!—ఓ అగ్నీషోమ దేవత లారా!, బ్రహ్మణా—స్తుతిరూప మంత్రముచేత, వృద్ధౌ=సంతుష్టులును, సుకృతేన సాతౌ—బాగుగ ననుష్ఠింపఁ బడిన ఈ కర్మచే ఫలము నొసఁగువారునునగు, (యువామ్—మీరు), ప్రథమౌ=దేవతలలో ముఖ్యులు. (అతః—ఇందువలన), ఇహ—ఈ కర్మయందు, వసూన్—వసుదేవతలను, రుద్రాన్—రుద్రులను, ఆదిత్యాన్= ఆదిత్యులను, జిన్వతమ్—సంతోషింపఁజేయుఁడు. మాధ్యం పౌర్ణమాసం హి—పౌర్ణమాస్యభిమానిదేవతచే రక్షింపఁ బడి పూర్వ పశ్చిమ దిక్కుల మధ్యప్రదేశమునందును చేయఁబడుచున్న ఈ పౌర్ణమాసి సంబంధియగు హవి స్సును, జుషేథామ్—సేవింపుఁడు. అథ—హవిస్సేవనానంతరము, అస్మభ్యమ్=మా కొఱకు, సహవీరామ్—పుత్ర సహితమైన, రయిమ్=ధనమును, నియచ్ఛతమ్—ఎక్కువగ ఒసఁగుఁడు.

తాత్పర్యము: పౌర్ణమాస్యభిమానిదేవత మా దగ్గఱకు వచ్చుఁగాక. ఆ దేవత మమ్ము మంచి గృహములందు ప్రవేశపెట్టునది. మణి ముక్తాది వివిధ రూపములైన ధనములను మా గృహములం దుంచునది. కోట్లకొలఁది ధనమును పుష్టిగ నొసఁగునది. సౌభాగ్యముతోఁ గూడియుండునది. బలమును గలుగఁజేయునది. ఓ అగ్నీషోమ దేవతలారా! మీరు స్తుతిరూప మంత్రముచే వృద్ధి నొందినవారు. మేము బాగుగ ననుష్ఠించిన యీ కర్మచే ఫలము నొసఁగు వారు. దేవతలలో ముఖ్యులు. అటువంటి మీరు వసురుద్రాదిత్య దేవతలను సంతోషపఱచుఁడు. పౌర్ణమాస్యభి మాని దేవత రక్షించిన పూర్వపశ్చిమ దిక్కుల మధ్యప్రదేశమునందుఁ జేయఁబడుచున్న పౌర్ణమాసి సంబంధి యగు హవిస్సును సేవింపుఁడు. హవిస్సును సేవించిన పిమ్మట మాకు పుత్రసహిత ధనము నధికముగ నొసఁ గుఁడు. (సారస్వత హోమములకు "పూర్ణా పశ్చాత్" ఇత్యాది మంత్రములకు బదులుగా వికల్పముగ ఈ మంత్రములు చెప్పఁబడినవి).

3. అర్థము: ఆదిత్యాః చ—దేవతలును, అంగిరసశ్చ—ఋషులును, అగ్నీన్=అగ్నులను, అదధత—ఆధానము చేసిరి. (అథ —అనంతరము), తే—వా రుభయులు, దర్శపూర్ణమాసౌ=దర్శపూర్ణమాస యాగములను, ప్రైప్సన్—పొందు టకు ఇచ్ఛయించిరి. తేషామ్=వారిలో, అఙ్గిరసామ్—ఋషులయొక్క, హవిః—హవిస్సు, నిరుప్తమ్=(సార స్వత హోమము చెయకుండ), నిర్వాపము చేయఁబడినది, ఆసీత్=ఆయెను. అథ—అనంతరము, ఆదిత్యాః= దేవతలు, ఏతౌ హోమౌ=ఈ సారస్వత హోమములను, అపశ్యన్—చూచిరి (తెలిసికొనిరి). తౌ అజుహవుః— ఆ హోమములను చేసిరి. తతః వై—ఆ విధముగ హోమము చేయుటవలననే, తే—ఆ దేవతలు, దర్శపూర్ణ మాసౌ—దర్శపూర్ణమాస యాగములను, పూర్వే=అంగిరసులకంటె పూర్వమునందు, ఆలభన్త=పొందిరి (ఉప క్రమించిరి).

తాత్పర్యము: దేవతలు ఋషులు అగ్న్యాధానమునకు పిమ్మట దర్శపూర్ణమాస యాగముల నారంభించవలయునని సంకల్పిం చఁగా వారిలో ఋషులు సారస్వత హోమములను అగ్న్యాధానమునకు ముందు చేయవలెనని తెలియక అన్వా రంభణీయేష్టికై హవిర్నిర్వాపము చేసిరి. దేవతలు అన్వారంభణీయేష్టి కంగములైన సారస్వత హోమములను ముందుగాఁ జేయవలెనని తెలిసికొని ఆ హోమములు చేసిరి. అప్పుడు అన్వారంభణీయేష్టిని సాంగముగ నిర్వ ర్తించుటచే దేవతలు ఋషులకంటె పూర్వమే దర్శపూర్ణమాస యాగముల నుపక్రమించిరి. (సారస్వత హోమ మును విధించుటకు ముందుగా నిచట హోమము ప్రశంసించఁబడినది.)

4. అర్థము: దర్శపూర్ణమాసౌ=దర్శపూర్ణమాస యాగములను, ఆలభమానః=ఆరంభింప నిశ్చయించుచున్న పురుషుఁడు, పురస్తాత్=ఆరంభణీయేష్టికి పూర్వము, ఏతౌ హోమౌ=ఈ సారస్వత హోమములను, జుహుయాత్=పూర్వా పశ్చాత్" ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. (సః=ఆ పురుషుఁడు, తదా=అప్పుడు), సాక్షా దేవ=విలంబము లేకుండఁగనే, దర్శపూర్ణమాసౌ=దర్శపూర్ణమాస యాగములను, ఆలభతే=ఆరంభించుటకు యోగ్యుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: దర్శపూర్ణమాస యాగముల నారంభించవలెనని కోరుచున్న పురుషుఁడు ఆరంభణీయేష్టియొక్క ఉపక్రమము నందే "పూర్వా పశ్చాత్" ఇత్యాది మంత్రములచేత, సారస్వత హోమములు చేయవలెను. అట్లు హోమము చేసిన యతఁడు విలంబము లేకుండఁగనే దర్శపూర్ణమాస యాగముల నాచరించుటకు యోగ్యుఁడగు చున్నాఁడు. (ఇది సారస్వత హోమ విధాయక మంత్రము.)

5. అర్థము: యః=ఏ పురుషుఁడు, ఏనయోః=ఈ దర్శపూర్ణమాసములయొక్క, అనులోమం చ=అనులోమ కాలమును, ప్రతిలోమం చ=ప్రతిలోమ కాలమును, విద్యాత్=తెలిసికొనునో, సః త్వై=ఆ పురుషుఁడే, దర్శపూర్ణమాసౌ =దర్శపూర్ణమాస యాగములను, ఆలభేత=ఆరంభించవలెను, ఇతి=అని, బ్రహ్మవాదినః=మంత్రజ్ఞులు, వదన్తి =చెప్పుచున్నారు. అమావాస్యాయాః ఊర్ధ్వమ్=అమావాస్య కనంతరము, తత్=ఆ కాలస్వరూపము, అను లోమమ్=అనులోమము, (భవతి=అగుచున్నది.) పూర్ణమాస్యై=పూర్ణిమకు, ప్రతీచీనం తత్=ఉపరితనమైన కాలస్వరూపము, ప్రతిలోమమ్=ప్రతిలోమము, (భవతి=అగుచున్నది.) పూర్వామ్=ప్రథమ మైనదిగా, పౌర్ణ మాసీమ్=పౌర్ణమాసి యాగమును, ఆలభేత యత్=ఆరంభించినచో, ప్రతిలోమమేవ=ప్రతిలోమముగానే, ఏనౌ =ఈ దర్శపూర్ణమాస యాగములను, ఆలభేత=ఆరంభించినవాఁ డగును, (తదా=అప్పుడు, యజమానః= యజమానుఁడు), అపక్షీయమాణమ్ అను=క్షీణించుచున్న చంద్రు ననుసరించి, అపక్షీయేత=క్షీణించును.

తాత్పర్యము: ప్రథమమున పౌర్ణమాసయాగము ననుష్ఠింపవలయునా? లేక దర్శయాగము ననుష్ఠింపవలయునా? అని సందేహము కలుగుచున్నది. అందుకై కాలముయొక్క స్వరూపమైన అనులోమ మెటువంటిది? ప్రతిలోమ మెటువంటిది? అని విచారించవలెను. ఈ దర్శపూర్ణమాసముల అనులోమ ప్రతిలోమ కాలస్వరూపములను దెలిసికొనిన పురుషుఁడు దర్శపూర్ణమాసముల నారంభించుటకు ముఖ్యాధికారి యగునని బ్రహ్మవాదులు పరస్ప రము ప్రశ్నించుకొనుచున్నారు. వారిలో ఒక బుద్ధిమంతుఁడు ఈ విధముగ సమాధానము చెప్పుచున్నాఁడు. అమావాస్యానంతరము శుక్లప్రతిపత్తిథి మొదలు అనులోమ కాలస్వరూపము. ఈ కాలమున చంద్రుఁడు ప్రతి దినము ఉత్తరోత్తరాభివృద్ధి నొందుచున్నాఁడు. పూర్ణిమానంతరము కృష్ణప్రతిపత్తిథి మొదలు ప్రతిలోమ కాలస్వరూపము. ఈ కాలమున చంద్రుఁడు ప్రతిదినము క్రమక్రమముగ క్షీణించుచున్నాఁడు. పౌర్ణమాసి యాగమును ప్రథమమున నారంభించిన యజమానుఁడు ప్రతిలోమముగనే దర్శపూర్ణమాస యాగముల నారం భించినవాఁ డగును. ప్రతిలోమ కాలమున చంద్రుఁడు క్రమముగ క్షీణించుచుండును కావున, ఆ క్షీణించు చున్న చంద్రు ననుసరించి ఈ యజమానుఁడు క్షీణించును.

6. అర్థము: (యజమానః=యజమానుఁడు), పురస్తాత్=ఆరంభణీయేష్టికి పూర్వము, సారస్వతౌ హోమౌ=సారస్వత హోమ ములను, జుహుయాత్=హోమము చేయవలెను. అమావాస్యా వై=అమావాస్యయే, సరస్వతీ=సరస్వతి. (ఏవం కృతే సతి=ఈ విధముగ హోమము చేయఁబడిన దగుచుండఁగా, (సః=అ యజమానుఁడు), అను లోమమేవ=అనులోమముగానే, ఏనౌ=ఈ దర్శపూర్ణమాస యాగములను, ఆలభేత=ఆరంభించినవాఁ డగును. (తదా=అప్పుడు), ఆప్యాయమానమ్=వృద్ధి నొందుచున్న, అముమ్ అను=ఈ చంద్రు ననుసరించి, (యజ మానుఁడు,) ఆప్యాయతే=వృద్ధి నొందును.

తాత్పర్యము: యజమానుఁడు ఆరంభణీయేష్టికి పూర్వము సారస్వత హోమములను జేయవలెను. అమావాస్యయే సరస్వతి. ఇట్లు చేసినప్పుడు అనులోమ పద్ధతిగానే అప్పుడు అనులోమకాలమున వృద్ధి నొందుచున్న చంద్రు ననుసరించి యజమానుఁడు కూడ వృద్ధి నొందును. (సరస్వతీ చ సరస్వాంశ్చ యయోః హోమయోః దేవతే తౌ హోమౌ

సారస్వతౌ. సరస్వతీ సరస్వత్తులు దేవతలుగాఁ గల హోమములు సారస్వతము లనఁబడును. అనఁగా ఈ హోమములందు సరస్వతీ సరస్వత్తులు దేవతలుగా నుందురు. ప్రాతిలోమ్యదోష పరిహారమునకై దేవతావిశేషముల నీ మంత్రము విధించుచున్నది.)

7\. **అర్థము:** పురస్తాత్=పౌర్ణమాసి యాగము నారంభించుటకు పూర్వము, ఆగ్నావైష్ణవమ్=అగ్నివిష్ణులు దేవతలుగాఁ గలదియగు, ఏకాదశ కపాలమ్=ఏకాదశకపాల సంస్కృత పురోడాశమును, సరస్వత్యై=సరస్వతీ దేవతకొఱకు, చరుమ్=చరు పురోడాశమును, సరస్వతే=సరస్వ ద్దేవతకొఱకు, ద్వాదశకపాలమ్=ద్వాదశకపాల సంస్కృత పురోడాశమును, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను.

**తాత్పర్యము:** పూర్వమంత్రమునందు, అమావాస్య యాగమును ప్రథమమున నారంభించినచో ఆనులోమ్యముచే దోషము లేకున్నను తత్ప్రాథమ్యము నుపేక్షించి ప్రాతిలోమ్య దోష పరిహార ప్రయత్నము విధింపఁబడినది. అందువలన పౌర్ణమాసియాగమునే ప్రథమమున నారంభించవలెనని గమ్యమాన మగుచున్నది. అటువంటి పౌర్ణమాస్యారంభమునకు ముందు త్రిహవిష్కయైన అన్వారంభణీయేష్టిని ఈ మంత్రము విధించుచున్నది. ఈ యిష్టియందు ఆగ్నావైష్ణవము, ద్వాదశ కపాల సంస్కృతమునైన పురోడాశము ఒక హవిస్సుగాను, సరస్వతీ దేవతాక చరువు ఒక హవిస్సుగాను, సరస్వద్దేవతాకము, ద్వాదశ కపాల సంస్కృతమునైన పురోడాశము ఒక హవిస్సుగాను మొత్తము మూఁడు హవిస్సులు గల అన్వారంభణీయేష్టి ఈ మంత్రముచే విధించఁబడినది.

8\. **అర్థము:** అగ్నిః వై=అగ్నియే, యజ్ఞముఖమ్=యజ్ఞమునకు ముఖము. ఆగ్నేయః భవతి యత్=పురోడాశము అగ్ని దేవతాక మనుట యేది కలదో, (తేన=దానిచే), యజ్ఞముఖమేవ=యజ్ఞముఖమైన అగ్ని నుద్దేశించియే, (యజమానః=యజమానుఁడు), పురస్తాత్=ప్రథమమున, ఋద్ధిమ్=సమృద్ధిని, ధత్తే=సంపాదించుచున్నాఁడు. యజ్ఞః=యజ్ఞము, విష్ణుః వై=విష్ణువే. వైష్ణవః భవతి యత్=పురోడాశము విష్ణుదేవతాక మనుట యేది కలదో, (తేన=ఆ హవిస్సుచేత), యజ్ఞమేవ=యజ్ఞమునే, ఆరభ్య=ఆరంభించి (ఉపక్రమించి), ప్రతనుతే=ప్రకర్షతో విస్తరింపఁజేసినవాఁ డగుచున్నాఁడు.

**తాత్పర్యము:** అగ్నియే యజ్ఞముఖము. అన్వారంభణీయేష్టియందు అగ్నిదేవతాకమైన పురోడాశమును నిర్వాపము చేయవలెనని చెప్పుటచే ఆ ఆగ్నేయ హవిస్సుచే యజ్ఞముఖమైన అగ్నినే ఉద్దేశించి ప్రథమమున సమృద్ధిని సంపాదించును. యజ్ఞము సర్వాంగవ్యాపి కావున విష్ణుస్వరూపము. అట్టి వైష్ణవ హవిస్సుచే యజ్ఞమునే ఉపక్రమించి ప్రకర్షతో విస్తరింపఁజేసినవాఁ డగును. (ఈ మంత్రము హవిస్సునకు అగ్నావిష్ణు దేవతాకత్వమును ప్రశంసించుచున్నది.)

9\. **అర్థము:** సరస్వత్యై=సరస్వతీ దేవతకొఱకు, చరుః=చరు పురోడాశరూప హవిస్సు, భవతి=విధింపఁబడినది కావలెను. సరస్వతే=సరస్వద్దేవతకొఱకు, ద్వాదశకపాలః=ద్వాదశకపాల సంస్కృత పురోడాశము, (విహితః=విధింపఁబడినది). అమావాస్యా వై=('అమావాస్యా' అని స్త్రీలింగ నిర్దేశమువలన.) అమావాస్యయే, సరస్వతీ=సరస్వతి. పూర్ణమాసః సరస్వాన్=('పూర్ణమాసః' అని పుంలింగ నిర్దేశమువలన) పూర్ణమాసము సరస్వద్దేవ స్వరూపము. (తథా సతి=అట్లు కాఁగా, అనేన=ఈ దేవతా ద్వయముచేత,) తావేవ=సరస్వతీ సరస్వద్దేవతా స్వరూపములైన దర్శపూర్ణమాస యాగములనే, సాక్షాత్=వ్యవధానము లేకుండ, ఆరభతే=ఉపక్రమించినవాఁ డగుచున్నాఁడు. (కించ=మఱియు,) సః=ఆ యజమానుఁడు, ఆభ్యామ్=ఈ దేవతలచేత, ఋధ్నోతి=సమృద్ధి నొందుచున్నాఁడు.

**తాత్పర్యము:** సప్తమ మంత్రమున సరస్వతీ దేవతాక చరుహవిస్సు, సరస్వద్దేవతాక ద్వాదశకపాల సంస్కృత పురోడాశ హవిస్సు విహితము లయినవి. 'అమావాస్యా' అను స్త్రీలింగ నిర్దేశమువలన అమావాస్య సరస్వతిస్వరూప.

'పూర్ణమాన' అని పుంలింగ నిర్దేశమువలన పూర్ణమాసము సరస్వద్దేవ స్వరూపము. యజమానుఁడు ఈ దేవతలచే సమృద్ధి నొందును.

10. అర్థము: ద్వాదశకపాలః=ద్వాదశకపాల సంస్కృత పురోడాశము, సరస్వతే=సరస్వద్దేవతకొఱకు, భవతి=విహితమై యున్నది. (ఏతత్=ఇది,) మిథునత్వాయ=మిథునత్వముకొఱకు, ప్రజాత్యై=ప్రజోత్పత్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము: పూర్వోక్త హవిస్త్రయములో ద్వితీయ హవిస్సు సరస్వతీ దేవతాకముగాఁ జెప్పఁబడినది. సరస్వతి స్త్రీదేవత. తృతీయ హవిస్సునందు సరస్వతీదేవతను విడిచి 'సరస్వత్' అను పుందేవతను విధించుటచే అది యజమానునకు మిథునత్వముకొఱకు సంపన్న మగుచున్నది. ఆ మిథునత్వము ప్రజోత్పత్తికొఱకు అగుచున్నది.

11. అర్థము: సమృద్ధ్యై=సమృద్ధికొఱకు, మిథునౌ గావౌ=మిథునములైన గోవులు, దక్షిణా=అన్వారంభణీయేష్టియందు దక్షిణగా, విహితౌ=విధింపఁబడినవి.

తాత్పర్యము: అన్వారంభణీయేష్టియందు సమృద్ధికై మిథునములుగానున్న గోవులను దక్షిణగా నీయవలెను.

ప్రథమానువాకము సమాప్తము.

అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

మూలము: [1]ఋషయో వా ఇన్ద్రం ప్రత్యక్షం నాపశ్యన్తం వసిష్ఠః ప్రత్యక్ష మపశ్యత్సోఽబ్రవీ ద్బ్రాహ్మణం తే వక్ష్యామి యథా త్వత్పురోహితాః ప్రజాః ప్ర జనిష్యన్తేఽథ మేతరేభ్య ఋషిభ్యో మా ప్ర వోచ ఇతి తస్మా ఏతాన్త్స్తోమభాగా నబ్రవీత్తతో వసిష్ఠపురోహితాః ప్రజాః ప్రాజాయన్త [2]తస్మా ద్వాసిష్ఠో బ్రహ్మా కార్యః ప్రైవ జాయతే [3]రశ్మిరసి క్షయాయ త్వా క్షయం జిన్వేతి (౧)ఆహ దేవా వై క్షయో దేవేభ్య ఏవ యజ్ఞం ప్రాఽఽహ [4]ప్రేతిరసి ధర్మాయ త్వా ధర్మం జిన్వే త్యాహ మనుష్యా వై ధర్మో మనుష్యేభ్య ఏవ యజ్ఞం ప్రాఽఽహా[5]న్వితిరసి దివే త్వా దివం జిన్వేత్యాహైభ్య ఏవ లోకేభ్యో యజ్ఞం ప్రాఽఽహ [6]విష్టమ్భోఽసి వృష్ట్యై త్వా వృష్టిం జిన్వే త్యాహ వృష్టిమేవావ (౨)రున్ద్ధే [7]ప్రవాఽస్యనువాఽసీత్యాహ మిథునత్వాయో[8]శిగసి వసుభ్యస్త్వా వసూఞ్జిన్వేత్యాహాష్టౌ వసవ ఏకాదశ రుద్రా ద్వాదశాఽఽదిత్యా ఏతావన్తో వై దేవాస్తేభ్య ఏవ యజ్ఞం ప్రాఽఽహా [9]జోఽసి పితృభ్యస్త్వా పితౄఞ్జిన్వేత్యాహ దేవానేవ పితౄనను సంతనోతి [10]తన్తురసి ప్రజాభ్యస్త్వా ప్రజా జిన్వ (౩)ఇత్యాహ పితౄనేవ ప్రజా అను సంతనోతి [11]పృత నాషాడసి పశుభ్యస్త్వా పశూఞ్జిన్వేత్యాహ ప్రజా ఏవ పశూనను సం తనోతి [12]రేవదస్యోషధీభ్య స్త్వౌషధీ ర్జిన్వేత్యాహౌషధీష్వేవ పశూన్ప్రతి ష్ఠాపయత్య[13]భిజిదసి యుక్తగ్రావేన్ద్రాయ త్వేన్ద్రం జిన్వేత్యాహాభిజిత్యా [14]అధిపతిరసి ప్రాణాయ త్వా ప్రాణమ్ (౪)జిన్వేత్యాహ ప్రజాస్వేవ ప్రాణాన్దధాతి [15]త్రివృదసి ప్రవృదసీత్యాహ మిథునత్వాయ [16]సగ్ంరోహోఽసి నీరోహోఽసీత్యాహ (౫)

ప్రజాత్యై ¹⁷వసుకో౽సి వేషశ్రిరసి వస్యష్టిరసీత్యాహ ప్రతిష్ఠిత్యై ॥ ౨ ॥

(జిన్వేత్యేవ ప్రజా జిన్వ ప్రాణం త్రిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమ ప్రపాఠకే ద్వితీయో౽నువాకః

## వేదార్థదీపిక

**ఉపకారిక:** ప్రథమానువాకమునందు అన్వారంభణీయేష్టి మంత్రసహితముగఁ జెప్పఁబడినది. ఈ ద్వితీయానువాకమునందు సౌమిక బ్రహ్మత్వవిధి చెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** ఋషయః=మహర్షులు, ఇన్ద్రమ్=ఇంద్రుని, ప్రత్యక్షమ్=ప్రత్యక్షముగా, నాపశ్యన్=చూడలేకపోయిరఁట. వసిష్ఠః=వసిష్ఠుఁడు, ప్రత్యక్షమ్=ప్రత్యక్షముగ, అపశ్యత్=(దివ్యదృష్టిచే) చూచెను. సః=ఆ యింద్రుఁడు, వసిష్ఠమ్=వసిష్ఠుని గూర్చి "హే వసిష్ఠ=ఓ వసిష్ఠ మహర్షీ, యథా=ఏ విధముగ, త్వత్పురోహితాః=నీవు పురోహితుఁడవుగాఁ గల, ప్రజాః=ప్రజలు, ప్రజనిష్యన్తే=ప్రకర్షగ పుట్టఁగలరో, (తమ్=అటువంటి), బ్రాహ్మణమ్=బ్రాహ్మణుని, వక్ష్యామి=చెప్పఁగలను. అథ=ఆ బ్రాహ్మణుని వినినతరువాత, (త్వమ్=నీవు), మా=నన్ను(గూర్చి), ఇతరేభ్యః ఋషిభ్యః=మంత్రానధికారులైన ఇతర ఋషులకొఱకు, మా ప్రవోచః=చెప్ప వలదు" ఇతి=అని, అబ్రవీత్=పలికెను. (ఇత్యుక్త్వా=ఇట్లు పలికి), తస్మై=ఆ యింద్రునికొఱకు, ఏతాన్ స్తోమభాగాన్=స్తోమభాగ నామక మంత్రములను, అబ్రవీత్=చెప్పెను. తతః=పిమ్మట, వసిష్ఠపురోహితాః=వసిష్ఠుఁడు పురోహితుఁడుగాఁ గల, ప్రజాః=ప్రజలు, ప్రాజాయన్త=పుట్టిరి.

**తాత్పర్యము:** ఒకప్పుడు వసిష్ఠప్రముఖులైన ఋషులు ఇంద్రునినుండి మంత్రవిశేషములను తెలిసికొనుటకు రాఁగా, అనధికారులకు మంత్రములను చెప్పరాదని యింద్రుఁ డంతర్హితుఁ డయ్యెను. అప్పుడు వసిష్ఠుఁడు మాత్రము దివ్యదృష్టిచే నింద్రుని చూచెను. ఇంద్రుఁడు వసిష్ఠునితో నిట్లు చెప్పెను. "ఓ వసిష్ఠా! సౌమిక బ్రహ్మత్వోపయోగి మంత్రసముదాయము ఏ బ్రాహ్మణునియం దుండెనో, ఆ బ్రాహ్మణుని నీకుఁ దెలిపెదను. ఆ బ్రాహ్మణుని సామర్థ్యమువలన నీవు పురోహితుఁడవుగాఁ గల ప్రజలు (నిన్ను పురోహితునిగా నెన్నుకొనునట్టి ప్రజలు) పుట్టుదురు. నన్నుఁగూర్చి మంత్రానధికారులయిన ఋషులకుఁ జెప్పవలదు" అని యింద్రుఁడు ఆ వసిష్ఠునకు స్తోమభాగ నామక మంత్రవిశేషములను చెప్పెను. అనంతరము వసిష్ఠుఁడు పురోహితుఁడుగాఁ గల ప్రజలు పుట్టిరి. (స్తోమాన్=బహిష్పవమానాది స్తోత్రాణి, భజన్తే ఇతి స్తోమభాగాః. బహిష్పవమానాది స్తోత్రములు గల మంత్రములని వ్యుత్పత్త్యర్థము.)

2. **అర్థము:** తస్మాత్=ఆ కారణమువలన, వాసిష్ఠః=వసిష్ఠగోత్రోద్భవుఁడైన బ్రాహ్మణుఁడు, బ్రహ్మా=(సోమయాగమునందు) బ్రహ్మగా, కార్యః=చేయఁదగినవాఁడు. (తథా సతి=అట్లు కాఁగా, తథావిధా ప్రజా=అటువంటి వసిష్ఠుఁడు పురోహితుఁడుగాఁ గల ప్రజ), ప్రజాయతే ఏవ=నిశ్చయముగ పుట్టుచున్నది (పుట్టును).

**తాత్పర్యము:** ఇంద్రుఁడు వసిష్ఠునకు బ్రహ్మత్వోపయుక్తమైన సర్వమును చెప్పుటవలన వసిష్ఠ గోత్రోద్భవుఁడైన బ్రాహ్మణుఁడు స్తోమభాగాభిజ్ఞుఁడైన యతఁడు సోమయాగమునందు బ్రహ్మగాఁ జేయఁదగినవాఁడు. అట్లు చేసినపుడు నిశ్చయముగ ఆ యజమానుఁడు వసిష్ఠుఁడు పురోహితుఁడుగాఁ గల ప్రజలను పుట్టించును. (ఇది బ్రహ్మత్వవిధి మంత్రము).

3. అర్థము: (హే ఆదిత్య!–ఓ ఆదిత్యదేవా! త్వమ్=నీవు,) రశ్మిః–కిరణములతోఁ గూడినవాఁడవు. అసి–అగుచున్నావు. త్వా–నిన్ను, క్షయాయ–దేవసంఘము(ప్రీతి)కొఱకు, (స్మరామి=స్మరించుచున్నాను. అతః=ఇందువలన), క్షయమ్–దేవసంఘమును, జిన్వ–సంతోషపఱచుము. ఇతి ఆహ–అని రశ్మిరసీత్యాది మంత్రము చెప్పినది. దేవాః–దేవతలు, క్షయః వై–క్షయశబ్ద వాచ్యులు కదా!, (అతః–ఈ కారణమువలన), దేవేభ్యః ఏవ=దేవతల కొఱకే, యజ్ఞమ్–(ఈ) యజ్ఞమును, హోతా–హోత, ప్రాహ–బాగుగ చెప్పెను.

తాత్పర్యము: (పూర్వోక్త స్తోమభాగ నామక మంత్రములలో ప్రథమ స్తోమభాగము నుద్దేశించి యీ మంత్రము చెప్పు చున్నది. ఈ స్తోమభాగములు పంచమకాండోక్త బ్రాహ్మణమునం దున్నవి. ఈ మంత్రములు ఆదిత్యపర ముగా వ్యాఖ్యేయములు.) ఓ ఆదిత్యదేవా! నీవు కిరణములతోఁ గూడియున్నవాఁడవు. దేవసంఘముప్రీతికై నిన్ను స్మరించుచున్నాను. నీవు దేవసంఘమును సంతోషపఱచుము అని యీ మంత్రము చెప్పినది. ఈ మంత్రమునందలి క్షయశబ్దమునకు దేవతలు అర్థము. కావున హోత దేవతలకొఱకే ఈ యజ్ఞమును చెప్పిన వాఁ డగును. (యజ్ఞమునందు దేవతల నాహ్వానించు ఋత్విజుఁడు హోత.)

4. అర్థము: (హే ధర్మాభిమాని దేవ!–ఓ ధర్మాభిమానివగు దేవా!, త్వమ్–నీవు,) ప్రేతిః–ప్రాణ్యుపకారరూప ప్రకృష్ట గతి కలవాఁడవు, అసి–అగుచున్నావు. (అతః–ఈ కారణమువలన), ధర్మాయ–ధర్మము ననుష్ఠించునట్టి పురుషుని కొఱకు, త్వా–నిన్ను, (స్మరామి–స్మరించుచున్నాను.) ధర్మమ్=ధర్మానుష్ఠాతయగు ఆ పురుషుని, జిన్వ–సం తోషపఱచుము. మనుష్యాః–మనుష్యులు, ధర్మాః వై–(ధర్మము ననుష్ఠించువారు కావున), ధర్మశబ్ద వాచ్యులు కదా!, (అనేన మంత్రేణ–ఈ ద్వితీయ స్తోమభాగ మంత్రముచేత, హోతా–హోత), యజ్ఞమ్=యజ్ఞమును, మనుష్యేభ్యః ఏవ–మనుష్యులకొఱకే, ప్రాహ–చెప్పెను.

తాత్పర్యము: ఓ ధర్మాభిమాని దేవా! నీవు ప్రాణ్యుపకారరూప గతి గలవాఁడ వగుచున్నావు. కావున ధర్మానుష్ఠాత యగు నట్టి పురుషునికొఱకు నిన్ను స్మరించుచున్నాను. ఆ ధర్మానుష్ఠాతృ పురుషుని సంతోషపఱచుము. ఈ మం త్రముచేత హోత ధర్మోపలక్షిత మనుష్యుని నిమిత్తము ఈ యజ్ఞమును చెప్పినవాఁ డగును. (ఇది ద్వితీయ స్తోమభాగ మంత్రము.)

5. అర్థము: (హే ద్యులోకాభిమాని దేవ!–ద్యులోకాభిమానివైన ఓ దేవా!, త్వమ్–నీవు), అన్వితిః=దేవతల కనుకూలమైన గతి కలవాఁడవు, అసి–అగుచున్నావు. (తాదృశం) త్వా–అటువంటి నిన్ను, దివే=ద్యులోకముకొఱకు, (స్మరామి–స్మరించుచున్నాను.) దివమ్–ద్యులోకమును, జిన్వ–సంతోషపఱచుము. ఇతి–అని, ఆహ–అన్వితి రసీత్యాది మంత్రము చెప్పినది. (అతః–ఈ కారణమువలన, హోతా–హోత), ఏభ్యః లోకేభ్యః ఏవ=ఈ పృథి వ్యన్తరిక్ష ద్యులోకములకొఱకే, యజ్ఞమ్–ఈ యజ్ఞమును, ప్రాహ=చెప్పెను.

తాత్పర్యము: ఓ ద్యులోకాభిమాని దేవా! నీవు దేవతల కనుకూలమైన గతి గలవాఁడ వగుచున్నావు. అటువంటి నిన్ను ద్యులోకముకొఱకు స్మరించుచున్నాను. నీవు ద్యులోకమును సంతోషపఱచుము అని అన్వితిరసీత్యాది తృతీయ స్తోమభాగ మంత్రము చెప్పినది. ఈ మంత్రముచే హోత ఈ పృథివ్యంతరిక్ష ద్యులోకములకొఱకే ఈ యజ్ఞమును చెప్పినవాఁ డగును. తృతీయ చతుర్థ పంచమ స్తోమభాగముల తాత్పర్యము మాత్రము ఇచట చెప్పఁబడినది. 'అన్వితిరసీత్యాది మంత్రము తృతీయ స్తోమభాగము. అంతరిక్ష భూలోక ప్రతి పాదక చతుర్థ పంచమ స్తోమభాగ మంత్రములు ఇచట ఉదాహరింపఁబడలేదు. అయినను ఈ తృతీయ స్తోమభాగ మంత్రము తదుపలక్షకమను విషయము నుద్దేశించియే 'ఏభ్యః లోకేభ్యః' అని సముదాయ తాత్పర్యము ప్రదర్శిత మైనది.

6. అర్థము: (హే వృష్ట్యభిమాని దేవ!–ఓ వృష్ట్యభిమాని దేవా!, త్వమ్–నీవు), విష్టమ్భః–విశేషముగ ఉదకమును ధరించు వాఁడవు, అసి–అగుచున్నావు. (తాదృశమ్–అటువంటి), త్వా–నిన్ను, వృష్ట్యై–వర్షముకొఱకు, (స్మరామి–స్మరించుచున్నాను.) వృష్టిమ్–వృష్టిని, జిన్వ–సంతోషపఱచుము. ఇతి–అని, ఆహ–'విష్టమ్భోఽసి' అనెడి

షష్ఠ స్తోమభాగ మంత్రము, ఆహ=చెప్పినది. (అతః=ఇందువలన, యజమానః=యజమానుఁడు), వృష్టిమ్=వర్షమును, అవరున్ధే=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ వృష్ట్యభిమానిదేవా! నీవు విశేషముగ వర్షమును ధరించువాఁడ వగుచున్నావు. అటువంటి నిన్ను వర్షము కొఱకు స్మరించుచున్నాను. వృష్టిని సంతోషపఱచుము. (బాగుగ కురియించుము) అని 'విష్టమ్భో౽సీ'త్యాది షష్ఠ స్తోమభాగ మంత్రము చెప్పినది. ఈ మంత్రముచే యజమానుఁడు నిశ్చయముగ వర్షమును పొందును. (షష్ఠ స్తోమభాగ మంత్రము వృష్టిప్రాప్తి హేతువుగా వర్ణింపఁబడినది.)

7. అర్థము: (హే అహరభిమానిదేవ!=ఓ అహరభిమాని దేవా!, త్వమ్=నీవు), ప్రవా=జగత్ప్రివాసకత్వరూప ప్రకర్షతో వర్తించుచున్నవాఁడవు. అసి=అగుచున్నావు. (హే రాత్ర్యభిమాని దేవ!=ఓ రాత్ర్యభిమాని దేవా!, త్వమ్=నీవు), అను వా=నిద్రాదివ్యవహారమున కనుకూలముగ వర్తించుచున్నవాఁడవు, అసి=అగుచున్నావు. (ఏతత్=ఈ ఉభయులు ద్వంద్వముగా నుండుట), మిథునత్వాయ=మిథునత్వ సిద్ధికై, (భవతి=అగుచున్నది.)

తాత్పర్యము: ఓ అహరభిమాని దేవా! నీవు జగత్తు ప్రకృష్టముగ నుండుట కనుకూలముగ వర్తించుచున్నావు. ఓ రాత్ర్యభిమాని దేవా! నీవు నిద్రాది వ్యవహారానుకూలముగ వర్తించుచున్నావు. ఇట్లు ఈ ఉభయులు ద్వంద్వముగ నుండుట మిథునత్వసాధన మగుచున్నది. "ప్రవా" "అను వా" అనునవి వరుసగా సప్తమాష్టమ స్తోమ భాగ మంత్రముల ప్రతీకలు. ఈ ప్రతీక ద్వయము ననువదించి అహోరాత్రులను ప్రతిపాదించుటచే మిథునత్వ సంపత్తి ఏర్పడుచున్నది.

8. అర్థము: (హే వసుగణ పాలక!=ఓ వసుగణ పాలకుఁడవైన దేవా!, త్వమ్=నీవు), ఉశిక్=కోరికలు కలవాఁడవు (కోరుచున్నవాఁడవు), అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, వసుభ్యః=వసువులకొఱకు, స్మరామి=స్మరించుచున్నాను. వసూన్=వసువులను, జిన్వ=సంతోషపఱచుము. ఇతి=అని, ఆహ=నవమ స్తోమభాగ మంత్రము చెప్పినది. వసవః=వసుదేవతలు, అష్టౌ=ఎనమండుగురు. రుద్రాః=రుద్ర దేవతలు, ఏకాదశ=పదునొకండుగురు, ఆదిత్యాః=ఆదిత్య దేవతలు, ద్వాదశ=పంద్రెండుగురు. దేవాః=వస్వాది దేవతలు, ఏతావన్తః వై=ఏతత్సంఖ్యాకులే. (అనేన=ఈ మంత్రముచేత, హోతా=హోత), తేభ్యః ఏవ=ఆ వస్వాది దేవతలకొఱకే, యజ్ఞమ్=(ఈ) యజ్ఞమును, ప్రాహ=చెప్పెను.

తాత్పర్యము: ఓ వసుగణపాలక దేవా! నీవు కోరికలు కలవాఁడవు (కోరుచున్నవాఁడవు) అగుచున్నావు. అటువంటి నిన్ను వసువులకొఱకు స్మరించుచున్నాను. వసువులను సంతోషపఱచుము అని "ఉశిగసీ"త్యాది నవమ స్తోమ భాగ మంత్రము చెప్పినది. వసువులు ఎనిమిదిమంది. రుద్రులు పదునొకండుగురు. ఆదిత్యులు పంద్రెండుగురు. వస్వాది గణ దేవతలు ఏతత్సంఖ్యా పరిమితులే. ఈ మంత్రముచే హోత ఆ వస్వాది దేవతలకొఱకే ఈ యజ్ఞమును చెప్పినవాఁ డగును. (ఇచట నవమ దశమైకాదశ స్తోమభాగ మంత్రముల తాత్పర్యము సంగ్రహముగఁ జెప్పఁబడినది. "ఉశిగసీ"త్యాది స్తోమభాగ మంత్రము దశమైకాదశ స్తోమభాగ మంత్రముల కుపలక్షక మను నర్థము రుద్రాదిత్య పదములచే వ్యక్త మగుచున్నది).

9. అర్థము: (హే పితృపాలక!=ఓ పితృపాలక దేవా!, త్వమ్=నీవు), ఓజః=బలరూపుఁడవు, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, పితృభ్యః=పితృదేవతలకొఱకు, (స్మరామి=స్మరించుచున్నాను.) పితౄన్=పితృదేవతలను, జిన్వ=సంతోషపఱచుము. ఇతి=అని, ఆహ='ఓజో౽సీ'త్యాది ద్వాదశ స్తోమభాగ మంత్రము చెప్పినది. (అతః=దేవ ప్రతిపాదకములైన నవమ దశమైకాదశ స్తోమభాగ మంత్రముల యనంతరము, పితృదేవతా ప్రతిపాదక ద్వాదశ స్తోమభాగమును చెప్పుటవలన, హోతా=హోత), దేవాన్ ఏవ అను=దేవతల ననుసరించియే, పితౄన్=పితృదేవతలను, సంతనోతి=బాగుగ విస్తరింపఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ పితృపాలక దేవా! నీవు బలరూపుఁడవు. అటువంటి నిన్ను పితృదేవతలకొఱకు స్మరించుచున్నాను. పితృదేవతలను సంతోషపఱచుము. దేవ ప్రతిపాదక స్తోమభాగముల తరువాత పితృదేవ ప్రతిపాదక ద్వాదశ స్తోమభాగమును చెప్పుటచే హోత దేవతల ననుసరించియే పితృదేవతలను విస్తరింపఁజేసినవాఁ డగుచున్నాఁడు. (ఇట్లు చెప్పుటచే దేవ పితృదేవతలకు నైరంతర్యము సిద్ధించుచున్నది.)

10. అర్థము: (హే ప్రజాభిమానిదేవ!=ఓ ప్రజాభిమాని దేవా!, త్వమ్=నీవు), తన్తుః=పుత్రపౌత్రాది విస్తారహేతువు, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, ప్రజాభ్యః=ప్రజలకొఱకు, (స్మరామి=స్మరించుచున్నాను). ప్రజాః=ప్రజలను, జిన్వ=సంతోషపఱచుము. ఇతి=అని, ఆహ=త్రయోదశ స్తోమభాగ మంత్రము చెప్పనది. (అతః=పితృ ప్రతిపాదక స్తోమభాగానంతరము ప్రజా ప్రతిపాదక స్తోమభాగమును చెప్పుటవలన, హోతా=హోత), పిత్ర్యాన్ అను ఏవ=పితృదేవతల ననుసరించియే, ప్రజాః=ప్రజలను, సంతనోతి=బాగుగ విస్తరింపఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ ప్రజాభిమాని దేవా! నీవు పుత్రపౌత్రాది విస్తారహేతువు అగుచున్నావు. అటువంటి నిన్ను ప్రజలకై స్మరించుచున్నాను. కావున నీవు ప్రజలను సంతోషపఱచుము. పితృదేవ ప్రతిపాదక స్తోమభాగానంతరము ప్రజా ప్రతిపాదక త్రయోదశ స్తోమభాగమును చెప్పుటవలన హోత పితృదేవతల ననుసరించియే ప్రజలను విస్తరింపఁ జేయుచున్నవాఁ డగుచున్నాఁడు. పితృ ప్రతిపాదక స్తోమభాగానంతరము ప్రజా ప్రతిపాదక స్తోమభాగమును చెప్పుటచే పితృదేవతలకు నైరంతర్యము (నిరంతరత్వము) సిద్ధించుచున్నది.

11. అర్థము: (హే పశుపాలక!=ఓ పశుపాలకుఁడవైన దేవా!, త్వమ్=నీవు), పృతనాషాట్=(మా)పశువుల నపహరించునట్టి) పరకీయ సేనను నశింపఁజేయువాఁడవు, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, పశుభ్యః=పశువుల కొఱకు, స్మరామి=స్మరించుచున్నాను. అతః=ఈ కారణము వలన, త్వమ్=నీవు), పశూన్=పశువులను, జిన్వ=సంతోషపఱచుము. ఇతి=అని, ఆహ=చతుర్దశ స్తోమభాగ మంత్రము చెప్పెను. (అతః=ఇందువలన), ప్రజాః అన్వేవ=ప్రజల ననుసరించియే, (హోతా=హోత), పశూన్=పశువులను; సంతనోతి=బాగుగ విస్తరింపఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ పశుపాలక దేవా! నీవు మా పశువుల నపహరించునట్టి పరకీయ సేనను నశింపఁజేయువాఁడవు. కావున అటువంటి నిన్ను పశువులకై స్మరించుచున్నాను. ఇట్లు చెప్పుటచే హోత ప్రజల ననుసరించియే పశువులను విస్తరింపఁజేసినవాఁ డగుచున్నాఁడు. పశుప్రతిపాదకమైన ఈ చతుర్దశ స్తోమభాగముచే ప్రజలకు పశువులకు నైరంతర్యము సిద్ధించుచున్నది.

12. అర్థము: (హే ఓషధిపాలక!=ఓ ఓషధిపాలక దేవా!, త్వమ్=నీవు), రేవత్=ధనవంతుఁడవు, అసి=అగుచున్నావు. త్వా=అటువంటి నిన్ను, ఓషధీభ్యః=ఓషధులకై, (స్మరామి=స్మరించుచున్నాను.) ఓషధీః=ఓషధులను, జిన్వ=సంతోషపఱచుము. ఇతి=అని, ఆహ=పంచదశ స్తోమభాగ మంత్రము చెప్పెను. (అనేన=ఈ మంత్రముచే, హోతా=హోత), ఓషధీష్వేవ=ఓషధులందే, పశూన్=పశువులను, ప్రతిష్ఠాపయతి=ప్రతిష్ఠింపఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ ఓషధిపాలక దేవా! నీవు ధనవంతుఁడవు. అటువంటి నిన్ను ఓషధులకొఱకు స్మరించుచున్నాను. కావున నీవు ఓషధులను సంతోషపఱచుము అని పంచదశ స్తోమభాగము చెప్పినది. ఈ మంత్రముచే హోత ఓషధులయందే పశువులను ప్రతిష్ఠింపఁజేసినవాఁ డగుచున్నాఁడు.

13. అర్థము: (హే వజ్ర!=ఓ వజ్రమా!, త్వమ్=నీవు), అభిజిత్=అంతటను జయించుదానవు, యుక్తగ్రావా=దార్ఢ్యగుణముతోఁ గూడిన శిలావిశేషము, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, (స్మరామి=స్మరించుచున్నాను. అతః=ఇందువలన, త్వమ్=నీవు), ఇన్ద్రమ్=ఇంద్రుని; జిన్వ=సంతోషపఱచుము. ఇతి=అని, ఆహ=షోడశ స్తోమభాగము చెప్పినది. (ఏతత్=ఈ చెప్పుట), అభిజిత్యై=అంతటను జయముకొఱకు, (సిధ్యతి=సిద్ధించుచున్నది.)

**తాత్పర్యము:** ఓ వజ్రమా! నీవు అంతటను జయించుదానవు, దృఢత్వముతోఁ గూడిన శిలావిశేషమును అగుచున్నావు. అటువంటి నిన్ను ఇంద్రునికొఱకు స్మరించుచున్నాను. కావున నీవు ఇంద్రుని సంతోషపఱచుము అని షోడశ స్తోమభాగము చెప్పినది. ఇట్లు చెప్పుట అభిజిత్తుకొఱకు (అంతటను జయించుటకొఱకు) సిద్ధించుచున్నది. ఈ షోడశ స్తోమభాగమునకు వజ్రసాధ్యమైన అభిజయార్థత్వము చూపఁబడినది).

14. **అర్థము:** (హే ప్రాణాభిమాని దేవ!=ఓ ప్రాణాభిమాని దేవా!, త్వమ్-నీవు), అధిపతిః=ఆధిక్యముతో ప్రాణములను పాలించువాఁడవు, అసి-అగుచున్నావు. త్వా-(అటువంటి) నిన్ను, ప్రాణాయ-ప్రాణముకొఱకు, (స్మరామి-స్మరించుచున్నాను. అతః-ఇందువలన, త్వమ్-నీవు), ప్రాణమ్-ప్రాణమును, జిన్వ-సంతోషపఱచుము. ఇతి=అని, ఆహ-సప్తదశ స్తోమభాగము చెప్పినది. (అనేన-ఈ మంత్రముచేత, హోతా-హోత), ప్రజాస్వేవ-ప్రజలయందే, ప్రాణాన్-ప్రాణాపాన చక్షుశ్శ్రోత్రములను, దధాతి-స్థాపించుచున్నాఁడు.

**తాత్పర్యము:** ఓ ప్రాణాభిమాని దేవా! నీవు అధికముగ ప్రాణములను పాలించువాఁడవు. అటువంటి నిన్ను ప్రాణముకొఱకు స్మరించుచున్నాను. కావున ప్రాణమును సంతోషపఱచుము. ఈ మంత్రముచే హోత ప్రజలయందే ప్రాణాపాన చక్షుశ్శ్రోత్రములను స్థాపించుచున్నవాఁ డగుచున్నాఁడు. అపాన చక్షుశ్శ్రోత్ర ప్రతిపాదకములైన అష్టాదశైకోనవింశతి వింశతి స్తోమభాగములకు ఈ సప్తదశ స్తోమభాగము ఉపలక్షకము. "ప్రాణాన్" అను బహువచనాంత మీ యర్థమునే సూచించుచున్నది.

15. **అర్థము:** (హే మిథునీభావ!-ఓ మిథునీభావమా!, త్వమ్-నీవు), త్రివృత్-త్రిగుణ స్వరూపమవు, ప్రవృత్-ప్రవర్తకమును, అసి-అగుచున్నావు. ఇతి-అని, ఆహ-ఏకవింశ ద్వావింశ త్రయోవింశ చతుర్వింశ స్తోమభాగములు చెప్పినవి. ఏతత్-ఇది, మిథునత్వాయ-మిథునత్వముకొఱకు, సిధ్యతి-సిద్ధించుచున్నది.

**తాత్పర్యము:** మిథునీభావ మనఁగా ఆలుమగల సంయోగధర్మము. త్రైగుణ్య మనఁగా ఇచట పురుషుడు, స్త్రీ, ఆ యుభయుల సంయోగము అనెడి త్రైగుణ్యము. ప్రవృత్తి యనఁగా మంథన వ్యాపారము. ఓ మిథునీభావమా! నీవు త్రిగుణవు, ప్రవృత్తిని చేయుదానవు నగుచున్నావు. ఇట్లగుట మిథునత్వముకొఱ కగుచున్నది. ఇచట త్రైగుణ్య ప్రవృత్తి ప్రతిపాదకములైన ఏకవింశతి ద్వావింశతి స్తోమభాగములచే, మంథన సమాప్తి విశ్లేషరూప మిథునీభావావయవ ద్వయ ప్రతిపాదకములైన త్రయోవింశ చతుర్వింశ స్తోమభాగములు ఉపలక్షింపఁబడుచున్నవి. సంవృత్తనఁగా మంథన వ్యాపార సమాప్తి. వివృత్తనఁగా దంపతుల విశ్లేషము. ఈ స్తోమభాగ చతుష్టయముచే మిథునత్వము సాకల్యముగ సిద్ధించినది.

16. **అర్థము:** (హే ప్రజనన వ్యాపార!-ఓ సంతానోత్పాదన వ్యాపారమా! త్వమ్=నీవు), సంరోహః-సంరోహము, నీరోహః=నీరోహమును, అసి-అగుచున్నావు, ఇతి-అని, ఆహ-పంచవింశతి షడ్వింశతి స్తోమభాగములు చెప్పినవి. ఏతత్-ఇది, ప్రజాత్యై-ప్రజోత్పత్తికొఱకు, (సిధ్యతి-సిద్ధించుచున్నది).

**తాత్పర్యము:** ప్రజనన వ్యాపార మనఁగా స్త్రీపురుషులు సంతానోత్పత్తికై చేయు రతివ్యాపారము. సంరోహ మనఁగా శుక్రశోణిత సంశ్లేషముచే గర్భాభివ్యక్తి. నీరోహ మనఁగా ఆ గర్భమునకు నిశ్శేషముగ అవయవాభివ్యక్తి. తాత్పర్యము సులభము. సంరోహ నీరోహ ప్రతిపాదకములైన పంచవింశతి షడ్వింశతి స్తోమభాగములచే ప్రరోహానురోహ ప్రతిపాదకములైన సప్తవింశాష్టావింశ స్తోమభాగములు ఉపలక్షింపఁబడుచున్నవి. ప్రరోహము-ప్రథమ సంతానోత్పత్తి. అనురోహము-ప్రథమ సంతానానంతర భావియైన అపత్యోత్పత్తి. ఈ స్తోమభాగ చతుష్టయముచే ప్రజోత్పత్తి సంపన్న మగుచున్నది.

17. **అర్థము:** (హే ఉత్పన్న ప్రజాభిమాని దేవ!–అప్పుడు పుట్టిన సంతానమునందభిమానము గల దేవా!, త్వమ్–నీవు), వసుకః–వసింపఁజేయువాఁడవు, అసి–అగుచున్నావు. వేషశ్రీః–వేషమున కనుకూలమైన సిరి కలవాఁడవు, అసి–అగుచున్నావు. వస్యష్టిః–వ్యాప్తి సమర్థుఁడవు, అసి–అగుచున్నావు, ఇతి–అని, ఏకోనత్రింశాది స్తోమ భాగ త్రయము, ఆహ–చెప్పినది. ఏతత్–ఇది, ప్రతిష్ఠిత్యై–ప్రజల ప్రతిష్ఠకొఱకు, సంపద్యతే–సంపన్న మగుచున్నది.

**తాత్పర్యము:** ఓ ఉత్పన్న ప్రజాభిమాని దేవా! నీవు ఉత్పన్నప్రజలను నివసింపఁజేయువాఁడవు, వారివేషమున కనుకూలమైన సిరి కలవాఁడవు, వ్యాప్తి సమర్థుఁడవు నగుచున్నావని ఏకోనత్రింశ, త్రింశైకత్రింశ స్తోమభాగ ముల త్రయము చెప్పినది. ఇది ప్రజల ప్రతిష్ఠకొఱకు సంపన్న మగుచున్నది.

ద్వితీయానువాకము సమాప్తము.

---

## అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే తృతీయోఽనువాకః ।

మూలము: అగ్నినా దేవేన పృతనా జయామి గాయత్రేణ ఛన్దసా త్రివృతా స్తోమేన రథన్తరేణ సామ్నా వషట్కారేణ వజ్రేణ పూర్వజా న్భ్రాతృవ్యా నధరా న్పాదయామ్యవైనాన్బాధే ప్రత్యేనాన్నుదే ఽస్మిన్క్షయే ఽస్మిన్భూమిలోకే యోఽస్మాన్ద్వేష్టి యం చ వయం ద్విష్మో విష్ణోః క్రమేణాత్యేనా న్క్రామామీన్ద్రేణ దేవేన పృతనా జయామి త్రైష్టుభేన ఛన్దసా పఞ్చదశేన స్తోమేన బృహతా సామ్నా వషట్కారేణ వజ్రేణ (౧)సహజా న్విశ్వేభిర్దేవేభిః పృతనా జయామి జాగతేన ఛన్దసా సప్తదశేన స్తోమేన వామదేవ్యేన సామ్నా వషట్కారేణ వజ్రేణాపరజా నిన్ద్రేణ సయుజో వయగ్ం సాసహ్యామ పృతన్యతః। ఘ్నన్తో వృత్రాణ్యప్రతి। యత్తే అగ్నే తేజస్తేనాహం తేజస్వీ భూయాసం యత్తే అగ్నే వర్చస్తేనాహం వర్చస్వీ భూయాసం యత్తే అగ్నే హరస్తేనాహగ్ం హరస్వీ భూయాసమ్ ॥ ౨ ॥ (బృహతా సామ్నా వషట్కారేణ వజ్రేణ షట్చత్వారిగ్ంశచ్చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమ ప్రపాఠకే తృతీయోఽనువాకః ।

## వేదార్థ దీపిక

అవతారిక: ద్వితీయానువాకమునందు స్తోమభాగములతో బ్రహ్మత్వము విహిత మైనది. ఈ తృతీయానువాకమునందు విష్ణుక్రమములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: (అహమ్-నేను), అగ్నినా దేవేన-అగ్ని దేవునిచేతను, గాయత్రేణ ఛన్దసా=గాయత్రీ చ్ఛందస్సుచేతను, త్రివృతా స్తోమేన-'త్రివృత్' అను స్తోమముచేతను, రథన్తరేణ సామ్నా=రథంతర మనెడి సామముచేతను, వషట్కారేణ వజ్రేణ-వషట్కారరూప వజ్రముచేతను, పృతనా-పరకీయ సేనను, (లుప్త ద్వితీయాన్తము.) జయామి-జయించుచున్నాను. పూర్వజాన్ భ్రాతృవ్యాన్-పూర్వజులైన శత్రువులను, అధరాన్-నీచులనుగా, పాదయామి-సంపాదించుచున్నాను. ఏనాన్-వీరిని, అవబాధే=శృంఖలాదికముచే బాధించుచున్నాను. ఏనాన్-వీరిని, ప్రతినుదే-ప్రత్యేకముగ నశింపఁజేయుచున్నాను. అస్మిన్ క్షయే-ఈ నా నివాస గృహమునందు, అస్మిన్ భూమిలోకే-ఈ భూలోకమునందును, యః-ఎవఁడు, అస్మాన్-(ఉదాసీనుల మైనను) మమ్ము,

ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, యం చ=(ఉదాసీనుఁడై యున్నను) ఎవనిని; వయమ్=మేము, ద్విష్మః=ద్వేషించుచున్నామో, ఏతాన్=వీరి నందఱిని, విష్ణోః=విష్ణురూప యజమానుఁడనైన నాయొక్క, క్రమేణ=పాదవిన్యాసముచేత, అతిక్రామామి=లంఘించుచున్నాను.

తాత్పర్యము: భ్రాతృవ్యులు (శత్రువులు) మూఁడు విధములుగా నున్నారు. పితృపితామహాదులందుఁ గూడ నుండువారు (జ్ఞాతులు) పూర్వజులు అనఁబడుదురు. సవతితల్లియొక్క కుమారులు సహజులు అనఁబడుదురు. ఇప్పుడే తన కార్యములను నశింపఁజేయువారు అపరజులు అనఁబడుదురు. యజమానుఁడనైన నేను అగ్ని దేవుని చేతను, గాయత్రీ చ్ఛందస్సుచేతను, త్రివృత్స్తోమముచేతను, రథంతర సామముచేతను, వషట్కార మనెడి వజ్రముచేతను పరసేనను జయింతును. పూర్వజులైన శత్రువులను నాకంటె తక్కువవారినిగాఁ జేయుదును. చేసి శృంఖలాదికముచే బాధింతును. బాధించి ప్రత్యేకముగ నశింపఁజేయుదును. మఱియు నా నివాస గృహమునందు, ఈ సమస్త భూలోకమునందును ఉదాసీనులమై యున్నను మమ్ము ఎవఁడు ద్వేషించుచున్నాఁడో, ఉదాసీనుఁడై యున్నను ఎవనిని మేము ద్వేషించుచున్నామో, వీరి నందఱిని విష్ణుస్వరూపుఁడనై నాయొక్క పాద విన్యాసముచే లంఘింతును. (ఇది యజమానవాక్యము.)

2. అర్థము: (అహమ్=నేను), ఇన్ద్రేణ దేవేన=ఇంద్రదేవునిచేతను, త్రైష్టుభేన ఛన్దసా=త్రిష్టుప్ ఛందస్సుచేతను, పఞ్చదశేన స్తోమేన=పంచదశ స్తోమముచేతను, బృహతా సామ్నా=బృహత్సామముచేతను, వషట్కారేణ వజ్రేణ=వషట్కారరూప వజ్రముచేతను, పృతనా=పరకీయసేనను, జయామి=జయించుచున్నాను. "భ్రాతృవ్యాన ధరాన్పాదయామి" ఇత్యాదికము పూర్వమంత్రమునుండి అనువర్తింపఁజేసికొని పూర్వమువలెనే సమన్వయము చేసికొనవలెను ఇచట 'సహజాన్ భ్రాతృవ్యాన్' అని సమన్వయము.

తాత్పర్యము: యజమానుఁడనైన నేను ఇంద్రాదులచే పరకీయసేనను జయింతును. సహజ శత్రువులను నాకంటె తక్కువ వారినిగాఁ జేయుదును. ఇత్యాదిక శేషభాగము పూర్వమువలెనే గ్రహింపఁదగినది. ఇది రెండవ మంత్ర పాఠము.

3. అర్థము: (అహమ్=నేను), విశ్వేభిః దేవేభిః=విశ్వేదేవతలచేతను, జాగతేన ఛన్దసా=జగతీ చ్ఛందస్సుచేతను, సప్తదశేన స్తోమేన=సప్తదశ స్తోమముచేతను, వామదేవ్యేన సామ్నా=వామదేవ్య సామముచేతను, వషట్కారేణ వజ్రేణ=వషట్కారరూప వజ్రముచేతను, పృతనా=పరకీయసేనను, జయామి=జయించుచున్నాను. భ్రాతృవ్యానిత్యాదికమును ప్రథమ మంత్రమునుండి అనువర్తింపఁజేసికొని ఆ యర్థమునే చెప్పుకొనవలెను. 'పూర్వజాన్' అను పదమునకు బదులుగా ఇందున్న 'అపరజాన్' అను పదమును చెప్పుకొనవలెను. 'అపరజాన్ భ్రాతృవ్యాన్ అధరాన్ పాదయామి అని సమన్వయము. శేషము పూర్వమువలెనే. తాత్పర్యము సులభము. త్రివృదాది స్తోమములయొక్కయు, రథంతరాది సామములయొక్కయు స్వరూపము "సమిధమాతిష్ఠ" ఇత్యాద్యనువాకమునందు చూపఁబడినది.

4. అర్థము: ఇన్ద్రేణ=ఇంద్రునితో, సయుజః=కూడియుండువారమును, వృత్రాణి=శత్రువులను, అప్రతి=ప్రతికూలురు కానివిధముగ, ఘ్నన్తః=వధించుచున్నవారమునగు, వయమ్=మేము, పృతన్యతః=పరకీయసేనను తమదిగాఁ జేసికొనవలెనని కోరుచున్న శత్రువులను, సాసహ్యామ=అతిశయముగ సహించుటకు (ఎదుర్కొనుటకు) శక్తుల మైతిమి. హే అగ్నే!=ఓ యగ్నీ!, తే=నీకు, యత్ తేజః=కాంతిరూప తేజస్సు ఏది (కలదో), తేన=ఆ తేజస్సుచే, అహమ్=నేను, తేజస్వీ=కాంతిమంతుఁడను, భూయాసమ్=అగుదును. హే అగ్నే, తే,

యత్, వర్చః-బలము, (అస్తి-కలదో), తేన-ఆ బలముచేత, అహమ్, తేన-ఆ వర్చస్సుచే, వర్చస్వీ-బలవంతుఁడను, భూయాసమ్. హే అగ్నే! తే, యత్, హరః-రశ్మిరూప తేజస్సు, (అస్తి), తేన, అహమ్, హరస్వీ, భూయాసమ్.

తాత్పర్యము: పరమైశ్వర్య యోగమువలన ఆహవనీయ మనెడి ఇంద్రునితోఁ గూడియున్న వారమును, శత్రువులను మాకు ప్రతికూలురు కానివిధముగ వధించువారమునగు మేము పరకీయ సేనను తమ స్వాధీనము చేసికొన వలెనని కోరు శత్రువులను అతిశయముగ సహించుటకు శక్తుల మైతిమి. ఓ యగ్నీ! నీ కాంతిరూప తేజస్సుచే నేను కూడ కాంతిరూప తేజస్సు కలవాఁడ నగుదును గాక. నీ బలముచే నేను గూడ బలము కలవాఁడ నగుదును గాక. నీ రశ్మిరూప తేజస్సుచే నేను గూడ రశ్మిరూప తేజస్సు కలవాఁడ నగుదును గాక. (యజమానుఁ డీ మంత్రమును పఠించుచు ఆహవనీయాగ్నిని ప్రార్థించవలెను.)

తృతీయానువాకము సమాప్తము

అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే చతుర్థోఽనువాకః।

మూలము: [1]యే దేవా యజ్ఞహనో యజ్ఞముషః పృథివ్యామధ్యాసతే। అగ్నిర్మా తేభ్యో రక్షతు గచ్ఛేమ సుకృతో వయమ్। [2]ఆఽగన్మ మిత్రావరుణా వరేణ్యా రాత్రీణాం భాగో యువయోర్యో అస్తి। నాకం గృహ్ణానాః సుకృతస్య లోకే తృతీయే పృష్ఠే అధిరోచనే దివః। [3]యే దేవా యజ్ఞహనో యజ్ఞముషో ఽన్తరిక్షే ఽధ్యాసతే। వాయుర్మా తేభ్యో రక్షతు గచ్ఛేమ సుకృతో వయమ్। [4]యాస్తే రాత్రీః సవితః (౧)దేవయానీరన్తరా ద్యావాపృథివీ వియన్తి। గృహైశ్చ సర్వైః ప్రజయాన్వగ్రే సువో రుహాణాస్తరతా రజాగ్ంసి। [5]యే దేవా యజ్ఞహనో యజ్ఞముషో దివ్యధ్యాసతే। సూర్యో మా తేభ్యో రక్షతు గచ్ఛేమ సుకృతో వయమ్। [6]యేనేన్ద్రాయ సమభరః పయాగ్ంస్యుత్తమేన హవిషా జాతవేదః। తేనాగ్నే త్వముత వర్ధయేమగ్ం సజాతానాగ్ం శ్రైష్ఠ్య ఆ ధేహ్యేనమ్। [7]యజ్ఞహనో వై దేవా యజ్ఞముషః (౨)సన్తి త ఏషు లోకేష్వాసత ఆదదానా విమథ్నానా యో దదాతి యో యజతే తస్య [8]యే దేవా యజ్ఞహనః పృథివ్యామధ్యాసతే యే అన్తరిక్షే యే దివీత్యాహేమానేవ లోకాగ్ంస్తీర్త్వా సగృహః సపశుః సువర్గం లోకమే[9]త్యప వై సోమేనేజానాద్దేవతాశ్చ యజ్ఞశ్చ క్రామన్త్యాగ్నేయం పఞ్చకపాల ముదవసానీయం నిర్వపేదగ్నిః సర్వా దేవతాః(౩)పాఙ్క్తో యజ్ఞో దేవతాశ్చైవ యజ్ఞం చావ రున్ధే [10]గాయత్రో వా అగ్ని ర్గాయత్రచ్ఛన్దాస్తం ఛన్దసా వ్యర్ధయతి యత్పఞ్చకపాలం కరోత్యష్టాకపాలః కార్యోఽష్టాక్షరా గాయత్రీ గాయత్రోఽగ్ని ర్గాయత్రచ్ఛన్దాః స్వేనైవైనం ఛన్దసా సమర్ధ

యతి "పఙ్క్తౌ యాజ్యానువాక్యే భవతః పాఙ్క్తో యజ్ఞస్తేనైవ యజ్ఞాన్నైతి ॥౪॥

(సవితర్దేవా యజ్ఞముషః సర్వా దేవతా స్త్రిచత్వారిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమప్రపాఠకే చతుర్థోఽనువాకః

## వేదార్థ దీపిక

అవతారిక: తృతీయానువాకమునందు విష్ణ్వనుక్రమణ మంత్రములు చెప్పఁబడినవి. ఈ పంచమానువాకమునందు అతిమోక్ష మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: [1]యజ్ఞహనః=యజ్ఞవిఘాతము చేయునట్టి, యే దేవాః=ఏ దేవతలు, పృథివ్యామ్=భూమియందు, అధ్యాసతే=అధిష్ఠించి యుంటున్నారో, తేభ్యః=వారినుండి, అగ్నిః=అగ్ని, మా=నన్ను, రక్షతు=రక్షించుఁగాక. వయమ్=మేము, సుకృతః=బాగుగ యజ్ఞము ననుష్ఠించినవారమై, గచ్ఛేమ=యజ్ఞఫలమును పొందుదుముగాక. [2]యజ్ఞముషః=యజ్ఞసాధనముల నపహరించునట్టి, యే దేవాః, పృథివ్యామ్, అధ్యాసతే, తేభ్యః, అగ్నిః, మా, రక్షతు. వయమ్, సుకృతః, గచ్ఛేమ. (ఈ మంత్రములోని "యజ్ఞహనః" "యజ్ఞముషః" అను పదములను రెండింటిని విభజించి ఆ పదములతో ప్రత్యేకముగా 'యే దేవాః, పృథివ్యామ్' ఇత్యాది పదజాలము నంతటిని సమన్వయము చేసి రెండు వాక్యములుగా వ్రాయఁబడినవి. అనఁగా 'యజ్ఞహనః' అను మంత్రము ఒకటి. "యజ్ఞముషః" అను మంత్రము మఱియొకటి యని భావము. అనఁగా "[1]యే దేవా యజ్ఞహనః పృథివ్యామధ్యాసతే। అగ్నిర్మా తేభ్యో రక్షతు గచ్ఛేమ సుకృతో వయమ్" [2]యే దేవా యజ్ఞముషః పృథివ్యామధ్యాసతే। అగ్నిర్మా తేభ్యో రక్షతు గచ్ఛేమ సుకృతో వయమ్" అని యివి రెండు మంత్రములు.)

తాత్పర్యము: దేవతలలో మ్లేచ్ఛజాతీయులైన కొందఱు యజ్ఞభాగార్హు లగుచు యజ్ఞమును చూచుటకు సహింపనివారై వారిలో కొందఱు యజ్ఞమును నాశనము చేయుచుందురు. మఱికొందఱు యజ్ఞసాధనముల నపహరించి వేఱు ప్రదేశమునకు వెళ్లుచుందురు. అట్టి వారిలో యజ్ఞమును నాశనము చేయుదేవతలు ఎవరు పృథివియందు ఒక ప్రదేశమును నివాసముగా నేర్పఱచుకొని యుందురో ఆ యజ్ఞవిఘాతకులనుండి అగ్ని మమ్ము రక్షించుఁగాక. మేము యజ్ఞమును సమాప్తము చేసి యజ్ఞఫలమును పొందుదుము గాక. యజ్ఞసాధనాపహర్తల విషయక మంత్రము కూడ ఇట్లే గ్రహింపఁదగినది. (యజమానుఁడు వేదిమధ్యమందుండి ఈ యతిమోక్షమంత్రములను జపించవలెను.)

2. అర్థము: వరేణ్యా=శ్రేష్ఠులైన, హే మిత్రావరుణా!=ఓ మిత్రావరుణ దేవతలారా!, రాత్రీణామ్=యజ్ఞసంబంధి రాత్రులలోనున్న ఈ రాత్రియందు, యువయోః=మీకు సంబంధించిన, భాగః యః=వశానుబంధ్యారూప భాగము ఏది, అస్తి=కలదో, తేన=ఆ భాగముచేత, వయమ్=మేము, దివఃపృష్ఠే=స్వర్గమునకు పై భాగమును, అధిరోచనే=అధికముగ ప్రకాశించుచున్నదియునగు, సుకృతస్య=యజ్ఞమునకు సంబంధించిన, తృతీయే లోకే=పృథివ్యంతరిక్షములను బట్టి మూఁడవదియైన లోకమునందు, నాకమ్=స్వర్గసుఖమును, గృహ్ణానాః=గ్రహించుచున్నవారమై, ఆగన్మ=అంతటను పొందితిమి. ("వరేణ్యా=వరేణ్యౌ. మిత్రావరుణా=మిత్రావరుణౌ )

తాత్పర్యము: శ్రేష్ఠులైన ఓ మిత్రావరుణ దేవతలారా! యజ్ఞసంబంధి రాత్రులలోనున్న ఈ రాత్రియందు మీకు సంబంధించిన వశానుబంధ్యరూప భాగమేది కలదో, ఆ భాగముచే మేము స్వర్గసుఖమును యజ్ఞమునకు సంబంధించిన

మూఁడవ లోకమునందు గ్రహించుచున్న వారమై అంతటను పొందితిమి. (ఇది తృతీయ మంత్రపాఠము. పాతాళలోకము కూడ తృతీయమే కావున తన్నివృత్తికై "దివః పృష్ఠే" అను విశేషణము ఉపయోగింపఁబడినది. రౌరవాదినరక వ్యావృత్తికై 'సుకృతస్య' అని చెప్పఁబడినది.)

3. అర్థము: [1]యజ్ఞహనః, యే దేవాః, అన్తరిక్షే, అధ్యాసతే, తేభ్యః, వాయుః, మా, రక్షతు. వయమ్, సుకృతః, గచ్ఛేమ. ఇది యొక మంత్రము. [2]యజ్ఞముషః, యే దేవాః, అన్తరిక్షే, అధ్యాసతే, తేభ్యః, వాయుః, మా, రక్షతు. వయమ్, సుకృతః, గచ్ఛేమ. ఇది రెండవ మంత్రము. వాయుః=వాయుదేవుఁడు. అన్తరిక్షే=అంతరిక్ష లోకమునందు. శేషము ఒకటవ మంత్రమువలెనే గ్రహింపఁదగినది. ఇట చతుర్థ పంచమ మంత్రపాఠములు చెప్పఁబడినవి.

4. అర్థము: హే సవితః=ఓ సవితృదేవా, ద్యావాపృథివీ అన్తరా=ద్యావాభూముల మధ్యమందు, తే=నీకు సంబంధించిన, దేవయానీః=దేవతలను పొందించునట్టి (దైవికకర్మయుక్తములు), యాః రాత్రీః=(రాత్రయః అనుటకు బదులు 'రాత్రీః' అను ప్రయోగము ఛాందసము. 'దేవయానీః'=దేవయాన్యః అని అర్థము.) ఏ రాత్రులు, వియన్తి=విశేషముగ ప్రవర్తించుచున్నవో, (తాసు=ఆ రాత్రులందు, కర్మ అనుతిష్ఠన్తః=కర్మ ననుష్ఠించుచున్నవారును), సర్వైః గృహైః=గృహములం దుండునట్టి సర్వ భృత్యులతోడను, ప్రజయా అను=పుత్రాది సంతానముతోడను కూడ, సువః=స్వర్గమును, రుహాణాః=పొందుచున్న, (యజమానాః యూయమ్=యజమానులయిన మీరు, రజాంసి=రంజనీయములైన సుఖములను, తరత=పొందుఁడు.

తాత్పర్యము: ఓ సవితృదేవా! ద్యావాభూముల మధ్యమందు త్వత్సంబంధులగు యజానుష్ఠాన యోగ్యములైన యే రాత్రులు కలవో, ఆ రాత్రులందు కర్మ ననుష్ఠించుచున్న వారును గృహములందున్న సర్వభృత్యులతోడను పుత్రాది సంతానముతోడను కూడ స్వర్గమును పొందుచున్న యజమానులగు మీరు రంజనీయములైన సుఖములను పొందుఁడు. (సుత్యాకర్మార్హమైన రాత్రి యొక్కటే అయినను దీక్షోపసత్సహిత రాత్రు లనేకములు కలవు. అవియు సవితృప్రేరితము లగుటచే ఆ రాత్రులకుఁగూడ సవితృ సంబంధము కలదు. అందువలన 'రాత్రీః' అని బహువచనాంతము ప్రయుక్తమైనది. ఇది షష్ఠ మంత్రము.)

5. అర్థము: "యజ్ఞహనః, యే దేవాః, దివి=ద్యులోకమునందు, అధ్యాసతే, తేభ్యః, సూర్యః=సూర్యదేవుఁడు, మా=నన్ను, రక్షతు. వయమ్, సుకృతః, గచ్ఛేమ. "ఇది యొక మంత్రము. అనఁగా సప్తమ మంత్రము." యజ్ఞముషః, యే దేవాః, దివి, అధ్యాసతే, తేభ్యః, సూర్యః, మా, రక్షతు. వయమ్, సుకృతః, గచ్ఛేమ. ఇది మఱియొక మంత్రము. వరుసలో అష్టమ మంత్రము. అర్థతాత్పర్యములు పూర్వమువలెనే గ్రాహ్యములు.

6. అర్థము: హే జాతవేదః=ఓ యగ్నీ!, యేన=ఏ, ఉత్తమేన హవిషా=ఉత్తమ హవిస్స్వరూపముచే, పయాంసి=క్షీరరసమువలె స్వాదువులైన సోమరసములను, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, సమభరః=సంపాదించితివో, హే అగ్నే!=ఓయగ్నీ!, త్వమ్=నీవు, తేన హవిషా=ఆ హవిస్సుచేత, ఇమమ్=ఈ యజమానుని, వర్ధయ=వృద్ధి నొందించుము. ఉత=మఱియు, ఏనమ్=ఈ యజమానుని, సజాతానామ్=సజాతీయులలో, శ్రైష్ఠ్యే=స్వామిత్వమునందు, ఆదేహి=స్థాపించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! ఏ ఉత్తమ హవిస్స్వరూపముచే క్షీరమువలె స్వాదు వయిన సోమరసమును ఇంద్రునికొఱకు సంపాదించితివో, ఓ యగ్నీ! నీవు ఆ హవిస్సుచే ఈ యజమానుని వృద్ధి నొందించుము. మఱియు ఈ యజమానుని సజాతీయులలో స్వామిత్వమునందు స్థాపించుము. (ఇది నవమ మంత్రము.)

7. అర్థము: (కేచన) దేవాః=(కొందఱు) దేవతలు, యజ్ఞహనః=యజ్ఞమును నాశనము చేయువారుగను, (కేచన=కొందఱు), యజ్ఞముషః=యజ్ఞసాధనములను అపహరించువారుగను, సన్తి వై=ఉంటున్నారు కదా! తే=ఆ దేవతలు, ఏషు లోకేషు=ఈ మూఁడు లోకములందు, యః=ఏ యజమానుఁడు, దదాతి=యజ్ఞము

నందు గవాదికమును దక్షిణాద్రవ్యముగా నిచ్చుచున్నాఁడో, తస్య=అతనియొక్క, (గవాదికమ్=గవాదికమును), ఆదదానాః=అపహరించుచున్నవారును, యః=ఏ యజమానుఁడు, యజతే=యాగము చేయుచున్నాఁడో, తస్య=అతనియొక్క, విమథ్నానాః=గ్రహ చమసాదికమును భంగ పరిత్యాగాది రూపముగ విలోడనము చేయుచున్నవారునై, ఆసతే=ఉంటున్నారు.

తాత్పర్యము: కపటరూప ధారులగు కొందఱు దేవతలు యజ్ఞభాగరహితులై యజ్ఞశాలను దగ్ధముచేయుట మున్నగు పనుల వలన యజ్ఞఘాతులుగను, కొందఱు గ్రహ చమస సోమరసాదికము నపహరించువారుగను ఉంటున్నారు కదా! ఈ ఉభయవిధ దేవతలు యజ్ఞమునందు దక్షిణగా నీయఁబడుచున్న గవాదికము నపహరించుచు, యజమానుఁడు చేయుచున్న యజ్ఞమునందలి గ్రహచమసాదికమును భంగముచేయుట, పాఱవేయుట మున్నగు విధముగ విలోడనము చేయుచు ఈ మూఁడు లోకములందు నివసించుచున్నారు.

8\. అర్థము: యే దేవాః=ఏ దేవతలు, యజ్ఞహనః=యజ్ఞహన్తకులుగను, యజ్ఞసాధనాపహర్తలుగను, పృథివ్యామ్=భూమియందు, అధ్యాసతే=ఉంటున్నారో, యే=ఏ దేవతలు, అన్తరిక్షే=అంతరిక్షమునందు, అధ్యాసతే. యే, దివి, అధ్యాసతే, ఇతి అహ=అను, మంత్రములచే, యజమానః=యజమానుఁడు, ఇమాన్ లోకాన్=ఈ లోకములను, తీర్త్వా=దాఁటి, సగృహః=కలత్ర పుత్రాది సహితుఁడును, సపశుః=గవాశ్వాది పశు సహితుఁడునై, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, ఏతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడు "యే దేవా యజ్ఞహనః" ఇత్యాది పూర్వోక్త మంత్రములచే ఉపద్రవములతోఁ గూడియున్న ఈ లోకముల నతిక్రమించి కలత్ర పుత్రాది సహితుఁడును, గవాశ్వాది పశు సహితుఁడునై స్వర్గలోకమును పొందుచున్నాఁడు. (కపటరూప ధారులగు దేవతలవలనఁ గలుగు నుపద్రవములను పోఁగొట్టుటకు ఈ మంత్రములు చెప్పఁబడినవి. ఈ మంత్రములు "ఉరుగ్ంహి రాజా" అనెడి అనువాకమునకు పూర్వము చూడఁదగినవి.)

9\. అర్థము: సోమేన ఈజానాత్=సోమయాగము చేసిన యజమానునినుండి, దేవతాశ్చ=దేవతలును, యజ్ఞశ్చ=యజ్ఞమును, అపక్రామన్తి వై=తొలఁగిపోవుచున్నవి కదా! (అతః=ఈ కారణమువలన, యజమానః=యజమానుఁడు), ఆగ్నేయమ్=అగ్నిదేవతాకమును, పఞ్చకపాలమ్=పంచకపాల సంస్కృత పురోడాశ సాధ్యమునైన, ఉదవసానీయమ్=ఉదవసానీయ మనెడి కర్మను, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను (అనుష్ఠించవలెను). అగ్నిః=అగ్ని, సర్వాః దేవతాః=సర్వదేవతా స్వరూపుఁడు. యజ్ఞః=యజ్ఞము, పాఙ్క్తః=పంచసంఖ్యోపేతము. (ఏవం కృతే సతి=ఇట్లు చేయఁబడఁగా, సః=ఆ యజమానుఁడు), దేవతాశ్చ=దేవతలను, యజ్ఞం చ=యజ్ఞమును, అవరున్ద్ధే ఏవ=నిశ్చయముగ పొందుచున్నాఁడు.

తాత్పర్యము: సోమయాగము చేసిన పిమ్మట ఆ యజమానుని వలన ప్రయోజనము లేదు. కావున అతనినుండి సర్వదేవతలు యజ్ఞము తొలఁగిపోవును. ఆ దోషము పోవుటకై ఆ యజమానుఁడు 'ఉదవసానీయ'మను కర్మ ననుష్ఠించవలెను. ఈ కర్మ అగ్నిదేవతాకము, పంచకపాల సంస్కృత పురోడాశసాధ్యమునైనది. "తే దేవా బిభ్యతోఽగ్నిం ప్రావిశన్" అను శ్రుతివలన అగ్ని సర్వదేవతాస్వరూపుఁడని తెలియుచున్నది. "ధానాః కరమ్భః పరివాపః పురోడాశః పయస్యా తేన పఙ్క్తిరాప్యతే" అను శ్రుతివలన యజ్ఞము పంచత్వ సంఖ్యతోఁ గూడియున్నది. యజమానుఁడు చేసిన ఉదవసానీయ కర్మ అగ్నిదేవతాకము కావున సర్వదేవతలను పొందును. పంచకపాల సంస్కృత పురోడాశ సాధ్యమైన ఈ కర్మ పంచత్వసంఖ్యోపేత యజ్ఞమును కూడ పొందును. ఈ మంత్రమున ఉదవసానీయకర్మ విధించఁబడినది.

10\. అర్థము: అగ్నిః=అగ్ని, గాయత్రః వా=గాయత్రీ చ్ఛన్దస్సంబంధి కదా! గాయత్రీ ఛన్దాః=గాయత్రీ చ్ఛందస్సు కల యజమానుఁడు, పఞ్చకపాలం కరోతి యత్=ఉదవసానీయకర్మను పంచకపాల సంస్కృత పురోడాశ సాధ్యముగాఁ జేయుచున్నచో, తమ్=ఆ యగ్నిని, ఛన్దసా=గాయత్రీ చ్ఛన్దస్సుతో, వ్యర్ధయతి=వియోగము కలవానినిగాఁ జేయుచున్నవాఁ డగుచున్నాఁడు. (అతః=ఇందువలన), అష్టాకపాలః కార్యః=ఉదవసానీయ

కర్మయందు హవ్యమైన పురోడాశము అష్టాకపాల సంస్కృత మైనదిగా, కార్యః=చేయఁదగినది. గాయత్రీ=గాయత్రీ ఛ్ఛన్దస్సు, అష్టాక్షరా=ఎనిమిది అక్షరములు కలది. అగ్నిః=అగ్ని, గాయత్రః=గాయత్రీ చ్ఛందస్సంబంధి. (ఏవం సతి=ఇట్లు కాఁగా); గాయత్రఛన్దాః=గాయత్రీచ్ఛన్దస్సు కల యజమానుఁడు, ఏనమ్=ఈ యగ్నిని, స్వేన ఛన్దసైవ=స్వీయ ఛందస్సుచేతనే, సమర్ధయతి=సమృద్ధునిగాఁ జేయుచున్నాఁడు.

తాత్పర్యము: అగ్నియు గాయత్రియు ప్రజాపతిముఖమునుండి పుట్టుటవలన అగ్ని గాయత్రీ ఛ్ఛన్దస్సంబంధి యగుచున్నాఁడు. ఉదవసానీయ కర్మను పంచకపాల సంస్కృత పురోడాశ హవిస్సుతోఁ జేసినచో గాయత్రీ ఛ్ఛన్దస్సు కల యజమానుఁడు ఆ యగ్నిని స్వీయ గాయత్రీ ఛ్ఛన్దస్సునుండి వేఱుచేసినవాఁ డగును. కావున ఉదవసానీయ కర్మయందు అష్టాకపాల సంస్కృత పురోడాశమునే హవిస్సుగా నుంచవలెను. గాయత్రీ ఛ్ఛన్దస్సు అష్టాక్షరి కనుకను, అగ్ని గాయత్రీ ఛ్ఛన్దస్సంబంధి కావునను, గాయత్రీ ఛ్ఛన్దస్సు కల యజమానుఁడు ఆ యగ్నిని స్వీయ ఛందస్సుతోడనే సమృద్ధునిగాఁ జేసినవాఁ డగును. (ఈ మంత్రము పంచకపాలమును దూషించి అష్టాకపాలమును విధించుచున్నది.)

11. అర్థము: యాజ్యానువాక్యే=ఉదవసానీయ మందలి హవిస్సునకు సంబంధించిన యాజ్యానువాక్యలు, పఙ్క్త్యౌ=పంచత్వ సంఖ్యోపేతములు, భవతః=అగుచున్నవి. యజ్ఞః=యజ్ఞము, పాఙ్క్తః=ధానాదిమూలమున పంచత్వ సంఖ్యోపేతము. (అతః=ఇందువలన, యజమానః=యజమానుఁడు) తేన=ఆ పాఙ్క్త మంత్రపాఠముచేత, యజ్ఞాత్=పాఙ్క్త యజ్ఞమునుండి, నైవ ఏతి=తొలఁగిపోవుట లేదు.

తాత్పర్యము: ఉదవసానీయకర్మయందలి హవిస్సునకు సంబంధించిన యాజ్యానువాక్యలు పంచాక్షర యుక్తములు. యజ్ఞము "ధానాః కరమ్భః పరివాపః పురోడాశః పయస్యా తేన పఙ్క్తిరాప్యతే" అను శ్రుతివలన పాఙ్క్త మగుచున్నది. కావున ఈ యజమానుఁడు పాఙ్క్తయజ్ఞమునుండియు తొలఁగిపోవుట లేదు. ఇచట యాజ్యానువాక్యలకు అక్షరపఙ్క్తిత్వము విధింపఁబడినది.

చతుర్థానువాకము సమాప్తము

## అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: [1]సూర్యో మా దేవో దేవేభ్యః పాతు వాయురన్తరిక్షా ద్యజమానోఽగ్ని ర్మా పాతు చక్షుషః। సక్ష శూష సవిత ర్విశ్వచర్షణ ఏతేభిః సోమ నామభి ర్విధేమ తే తేభిః సోమ నామభి ర్విధేమ తే। [2]అహం పరస్తా దహమవస్తాదహం జ్యోతిషా వి తమో వవార। యదన్తరిక్షం తదు మే పితాఽభూదహగ్ం సూర్య ముభయతో దదర్శాహం భూయాస ముత్తమః సమానానామ్ (౧)[3]ఆ సముద్రాదాఽన్తరిక్షా త్ప్రజాపతి రుదధిం చ్యావయాతీన్ద్రః ప్ర స్నౌతు మరుతో వర్షయన్తూ[4]న్నమ్భయ పృథివీం భిన్ధీదం దివ్యం నభః। ఉద్నో దివ్యస్య నో దేహీశానో వి సృజా దృతిమ్। [5]పశవో వా ఏతే యదాదిత్య ఏష రుద్రో యదగ్ని రోషధీః ప్రాస్యాగ్నావాదిత్యం జుహోతి రుద్రాదేవ పశూనన్త ర్దధాత్యథో ఓషధీష్వేవ పశూన్ (౨) ప్రతి ష్ఠాపయతి [6]కవిర్యజ్ఞస్య వి తనోతి పన్థాం నాకస్య పృష్ఠే అధి రోచనే దివః। యేన హవ్యం వహసి యాసి దూత ఇతః ప్రచేతా అముతః సనీయాన్। [7]యాస్తే విశ్వాః సమిధః సన్త్వగ్నే యాః పృథివ్యాం బర్హిషి సూర్యే యాః। తాస్తే గచ్ఛన్త్వాహుతిం ఘృతస్య దేవాయతే యజమానాయ శర్మ। [8]ఆశాసానః సువీర్యగ్ం రాయస్పోషగ్ం స్వశ్వియమ్। బృహస్పతినా రాయా స్వగాకృతో మహ్యం యజమానాయ తిష్ఠ। ॥౩॥ (సమానానామోషధీష్వేవ పశూన్మహ్యం యజమానాయైకం చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

## వేదార్థదీపిక

అవతారిక: అతిమోక్షజపమునకు సంబంధించిన మంత్రములు చతుర్థానువాకమునందు చెప్పఁబడినవి. ఈ పంచమానువాకమునందు ఆదిత్యగ్రహ మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: సూర్యః దేవః–సూర్యరూపుఁడైన (ఈ) దేవుఁడు, దివేభ్యః–(యజ్ఞవిఘాతకులైన) దేవతలనుండి, మా–నన్ను, పాతు–రక్షించుఁగాక. వాయుః=వాయురూపుఁడైన (ఈ) దేవుఁడు, అన్తరిక్షాత్–(విఘ్నకారులైన దేవతలతోఁ గూడియుండునట్టి) అంతరిక్షమునుండి, మా–నన్ను, పాతు–రక్షించుఁగాక. యజమానః–యాగహేతువైన, అగ్నిః–(ఈ)అగ్ని, చక్షుషః–(విరోధిదేవ) దృష్టినుండి, మా–నన్ను, పాతు=రక్షించుఁగాక. హే సోమ!–ఓ సోమదేవా!, సక్ష!, శూష!, సవితః!, విశ్వచర్షణే! ఏతేభిః నామభిః–'సక్ష' ఇత్యాది సంబుద్ధ్యంతము అయిన ఈ నామములచే, తే=నీకు, విధేమ=పరిచర్య చేయుదుము. హే సోమ!–ఓ సోమ దేవా! తేభిః నామభిః–సూర్య వాయ్వాది పూర్వోక్త నామములచేత, తే–నీకు, విధేమ–పరిచర్య చేయుదుము.

తాత్పర్యము: ఈ ఆదిత్యగ్రహము సూర్యవాయ్వాత్మకము. కావున సూర్యరూపుఁడైన ఈ దేవుఁడు యజ్ఞవిఘాతకులైన దేవతలనుండి నన్ను రక్షించుఁగాక. వాయురూపుఁడైన ఈ దేవుఁడు విఘ్నకారులైన దేవతలతోఁ గూడియుండునట్టి అంతరిక్షమునుండి నన్ను రక్షించుఁగాక. యాగహేతువైన ఈ యగ్ని విరోధి దేవతల దృష్టినుండి నన్ను రక్షించుఁగాక. ఓ సోమదేవా! 'సక్ష' ఇత్యాది సంబుద్ధ్యంతములైన నామములచేతను, పూర్వోక్తములయిన సూర్య వాయ్వాది నామములచేతను నీకు పరిచర్య చెయుదుము. ("సూర్యో మా దేవః" అను మంత్రము పఠించుచు యజమానుఁడు చేతితో దర్భలను కప్పి లేచి నిలుచుండవలెను. 'ఏతేభిః' 'తేభిః'. ఈ పదములు వైదికైకప్రయోగములు. లౌకిక సంస్కృతమున 'ఏతైః', 'తైః' అని యుండును.)

2. అర్థము: అహమ్–యజమానుఁడనైన నేను, పరస్తాత్–పరభాగమునందు, గ్రహమ్=గ్రహమును (పాత్రవిశేషమును), అన్వారభే–అన్వారంభము చేయుచున్నాను.) అహమ్–నేను, అవస్తాత్=అవరభాగమునందు (వెనుకభాగమునందు), (గ్రహమ్=అన్వారభే). అహమ్–నేను, (అస్య–ఈ ఆదిత్యగ్రహముయొక్క), జ్యోతిషా=తేజస్సుచే, వి–విశేషముగ, తమః=చీకటిని, వవార–వారించితిని. అన్తరిక్షం యత్–ఉపరిభాగాధోభాగముల మధ్యవర్తియైన ఆకాశ మేది కలదో, తదు–అది కూడ, మే–నాకు, పితా–తండ్రివలె పాలకము, అభూత్–అయినది. అహమ్=నేను, సూర్యమ్–ఆదిత్యగ్రహమును, ఉభయతః–ఊర్ధ్వాధోభాగములందు, లేదా దక్షిణోత్తరభాగములందు, దదర్శ–చూచితిని. (అతః–ఇందువలన), అహమ్–నేను, సమానానామ్–సజాతీయులలో, ఉత్తమః–ఉత్తముఁడను, భూయాసమ్–అగుదును గాక.

తాత్పర్యము: నేను పరభాగమునందు వెనుకభాగమునందు ఆదిత్యగ్రహము నన్వారంభము చేయుచున్నాను. నేను ఈ ఆదిత్యగ్రహముయొక్క తేజస్సుచే విశేషముగ తమస్సును నివారించితిని. ఉపరిభాగాధోభాగముల మధ్యమునునుండు నాకాశము కూడ నన్ను తండ్రివలె పాలించునది యగుఁగాక. నేను ఈ ఆదిత్యగ్రహమును ఊర్ధ్వాధోభాగములందు - లేదా దక్షిణోత్తరభాగములందుఁ జూచితిని. కావున సమాన యజమానులలో ఉత్తముఁడ నగుదును గాక. (యజమానుఁడు 'అహం పరస్తాది'త్యాది మంత్రమును పఠించుచు ఆదిత్యగ్రహము నన్వారంభము చేయవలెను.)

3. అర్థము: ప్రజాపతిః=ప్రజాపతి, ఉదధిమ్–సముద్ర సమానమైన (ఈ) ఆదిత్యగ్రహమును, ఆ సముద్రాత్–(నాలుగు దిక్కులందు) సముద్రపర్యంతము, అచ్యావయతి=ప్రసవింపఁజేయుఁగాక. ఆ న్తరిక్షాత్=(ఊర్ధ్వభాగమునందు) అంతరిక్షపర్యంతము, అచ్యావయతి–అంతటను ప్రసవింపఁజేయుఁగాక. ఇన్ద్రః–ఇంద్రుఁడు, ప్రస్నౌతు–(గోవుల పాల పిదుగువలె) ఆదిత్యగ్రహమును బాగుగ కారునదిగఁ జేయుఁగాక. మరుతః–వాయువులు, వర్షయన్తు–వర్షింపఁజేయుఁగాక.

4. అర్థము: (హే ఆదిత్య!=ఓ ఆదిత్యదేవా!, (త్వమ్=నీవు), పృథివీమ్=భూమిని, ఉన్నమ్భయ=ఉత్కర్షగా తడిసిన దానినిగాఁ జేయుము. ఇదం దివ్యం నభః=ద్యులోకస్థాకాశవర్తి మేఘమువలెనున్న ఈ గ్రహమును, భిన్ధి=భిన్నము చేయుము. దివ్యస్య=దివియందున్నట్టి, ఊధ్నః=ఉదకముయొక్క సమృద్ధిని, నః=మా కొఱకు, దేహి=ఒసఁగుము. ఈశానః=సమర్థుఁడవైన నీవు, దృతిమ్=జలవిధారకమైన తిత్తివలెనున్న మేఘమును, విసృజా=(విసృజ) విడువుము.

తాత్పర్యము: ఓ ఆదిత్యుఁడా! భూమిని విశేషముగ తడుపుము. ద్యులోకస్థమైన ఆకాశమునందుండు మేఘమువంటి ఈ గ్రహమును భిన్నము చేయుము. ద్యులోకస్థమైన ఉదక (ముయొక్క) సమృద్ధిని మా కొసఁగుము. సమర్థుఁడవైన నీవు నీటిని ధరించునట్టి తిత్తివలెనున్న మేఘమును విడువుము. (వృష్టిని కోరువానినిమిత్తము ఈ మంత్రమును పఠించుచు హోమము చేయవలెను.)

5. అర్థము: ఆదిత్యః యత్=ఆదిత్యగ్రహ మేది కలదో, ఏతే=ఇవి, పశవః=పశువులు. అగ్నిః యత్=అగ్ని యెవఁడు కలఁడో, ఏషః=ఇతఁడు, క్రూరః=క్రూరదేవుఁడు. (తస్మాత్=అందువలన, క్రౌర్యపరిహారాయ=క్రౌర్యపరిహారమునకై), ఓషధీః=ఓషధులను, అగ్నౌ=అగ్నియందు, ప్రాస్య=ఉంచి, ఆదిత్యమ్=ఆదిత్యగ్రహమును, జుహోతి=హోమము చేయవలెను. (తథా సతి=అట్లు కాఁగా) రుద్రాత్=రుద్రరూపాగ్ని సమీపమునుండి, పశూన్=పశువులను, అన్తర్దధాతి ఏవ=నిశ్చయముగ అంతర్హితములనుగాఁ జేయుచున్నాఁడు. అథో=మఱియు, ఓషధీష్వేవ=ఓషధులయందే, పశూన్=పశువులను, ప్రతిష్ఠాపయతి=ప్రతిష్ఠితములనుగాఁ జేయుచున్నాఁడు.

తాత్పర్యము: ఆదిత్యగ్రహము పశుప్రాప్తిహేతు వగుటచే అది పశుస్వరూపము. అగ్ని క్రూరదేవుఁడు. కావున క్రౌర్యపరిహారమునకై అగ్నియందు ఓషధుల నుంచి పిమ్మట ఆదిత్యగ్రహమును హోమము చేయవలెను. అట్లు చేయఁగా క్రూరదేవునినుండి పశువుల నంతర్హితములుగాఁ జేసినవాఁ డగును. మఱియు ఓషధులందే పశువులను ప్రతిష్ఠితములుగాఁ జేసినవాఁడగును. (ఇది హోమవిధి).

6. అర్థము: (హే అగ్నే!=ఓయగ్నీ!, త్వమ్=నీవు), యేన=ఏ మార్గముచే, హవ్యమ్=హవిస్సును, వహసి=వహించుచున్నావో, దేవానాం దూతః=దేవతలకు దూతవైన నీవు, అముతః సనీయాన్=స్వర్గమున అతిశయముగ ఫలము నొసఁగువాఁడవై, యేన=ఏ మార్గముచేత, యాసి=పోవుచున్నావో, యజ్ఞస్య కవిః=యజ్ఞమును తెలిసికొనినదైన, (అయమ్=ఈ ఆదిత్యగ్రహము), అధిరోచవే=బాగుగ ప్రకాశించుచున్న, దివః పృష్ఠే=ద్యులోకముయొక్క ఉపరిభాగమునందు, నాకస్య పన్థామ్=స్వర్గముయొక్క మార్గమును, వితనోతి=విస్తృతము చేయుచున్నది.

తాత్పర్యము: ఓ యగ్నీ! యజ్ఞమును గూర్చి తెలిసికొనిన ఈ ఆదిత్యగ్రహము బాగుగ ప్రకాశించుచున్న ద్యులోకోపరిభాగమునందు స్వర్గమార్గమును విస్తృతము చేయును. స్వర్గమందు అతిశయముగ ఫలము నొసఁగువాఁడవును, దేవతలకు దూతవునైన నీవు హవిస్సును వహించుచు ఆ మార్గముననే పోవుచుందువు.

7. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! తే=నీయొక్క, విశ్వాః=సమస్తములైన, సమిధః=బాగుగ జ్వలించుచున్న, యాః=ఏ జ్వాలలు, (సన్తి=కలవో), పృథివ్యామ్=భూలోకమునందు, బర్హిషి=యజ్ఞభూమియందు, యాః=ఏ దీప్తులు, (సన్తి=కలవో,) సూర్యే=సూర్యునియందు, యాః=ఏ దీప్తులు, (సన్తి=కలవో,) తే=నీయొక్క, తాః=ఆ దీప్తులు, ఘృతస్య=ఆజ్యముయొక్క, ఆహుతిమ్=ఆహుతిని, గచ్ఛన్తు=పొందుఁగాక. దేవాయతే=తనను దేవతగా కోరుచున్న, యజమానాయ=యజమానునికొఱకు, శర్మ=సుఖమును, ప్రయచ్ఛన్తు=ఒసఁగుఁగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! బాగుగ జ్వలించుచున్న సమస్తమైన నీ జ్వాలలు ఏవి కలవో, అనఁగా భూలోకమునందు యజ్ఞభూమియందు ప్రకాశించు దీప్తులును, సూర్యునియందలి దీప్తులును నీవియే. అట్టి నీ జ్వాలలు ఆజ్యాహుతులను పొందుఁగాక. మఱియు ఆ జ్వాలలు తనను దేవతగాఁ గోరుచున్న యజమానునికొఱకు సుఖము నొసఁగుఁగాక. (ఈ మంత్రమును పఠించుచు ఆహవనీయాగ్నియందు దర్భల నుంచవలెను. ఆదిత్యగ్రహ విషయములైన ఈ మంత్రములు "కదాచన స్తరీరసి" అనెడి అనువాకమున కనంతరము చూడవలెను.)

8. **అర్థము:** హే యూప:—ఓ యూప స్తంభమా!, బృహస్పతినా—బృహస్పతిచే, రాయా—అనేకధన నిమిత్తము, (చతుర్థ్యర్థే తృతీయా విభక్తిః.) స్వగాకృతః—యజమానునకు స్వీయమగునట్లు చేయఁబడిన, (త్వమ్—నీవు) యజమానాయ—యజమానుఁడనైన, మహ్యమ్—నాకొఱకు, సువీర్యమ్—మంచి భోగసామర్థ్యముతోఁ గూడినదియు స్వశ్వియమ్—మంచి అశ్వములతోఁ గూడినదియు నగు, రాయస్పోషమ్—ధనపుష్టిని, ఆశాసానః—కోరుచున్నదానవై, తిష్ఠ—ఉండుము.

**తాత్పర్యము:** ఓ యూప స్తంభమా! నీవు బృహస్పతిచే అనేక ధనముల నిమిత్తము యజమానునకు స్వీయ మగునట్లుగాఁ జేయఁబడినదానవు. అట్టి నీవు యజమానుఁడనైన నాకు మంచి భోగసామర్థ్యముతోఁ గూడినదియు, మంచి యశ్వములతోఁ గూడినదియునగు ధనపుష్టిని కోరుచున్నదానవై యుండుము. (యజమానుఁడు ఈ మంత్రము చెప్పుచు ఆహవనీయాగ్ని ప్రదేశమునుండి లేవవలయును. ఈ మంత్రమును పశుప్రకరణమైన 'సముద్రం గచ్ఛ, అనెడి అనువాకమునకు పిమ్మట గ్రహించవలెను.)

పంచమానువాకము సమాప్తము.

## అథ ప్రథమకాణ్డే పఞ్చమ ప్రపాఠకే షష్ఠోఽనువాకః

మూలము: [1]సం త్వా నహ్యామి పయసా ఘృతేన సం త్వా నహ్యామ్యప ఓషధీభిః। సం త్వా నహ్యామి ప్రజయాఽహమద్య సా దీక్షితా సనవో వాజమస్మే। [2]ప్రైతు బ్రహ్మణస్పత్నీ వేదిం వర్ణేన సీదతు। [3]అథాహమనుకామినీ స్వే లోకే విశా ఇహ। [4]సుప్రజసస్త్వా వయగ్ం సుపత్నీరుప సేదిమ। అగ్నే సపత్నదమ్భన మదబ్ధాసో అదాభ్యమ్। [5]ఇమం వి ష్యామి వరుణస్య పాశమ్ (౧)యమబధ్నీత సవితా సుకేతః। ధాతుశ్చ యోనౌ సుకృతస్య లోకే స్యోనం మే సహ పత్యా కరోమి। [6]ప్రేహ్యుదేహ్యృతస్య వామీరన్వగ్నిస్తేఽగ్రం నయత్వదితిర్మధ్యం దదతాగ్ం రుద్రావసృష్టాసి యువా నామ మా మా హిగ్ంసీ[7]ర్వసుభ్యో రుద్రేభ్య ఆదిత్యేభ్యో విశ్వేభ్యో వో దేవేభ్యః పన్నేజనీర్గృహ్ణామి యజ్ఞాయ వః పన్నేజనీః [8]సాదయామి విశ్వస్య తే విశ్వావతో వృష్ణియావతః (౨)తవాగ్నే వామీరనుసందృశి విశ్వా రేతాగ్ంసి ధిషీయా[10]గన్దేవాన్యజ్ఞో ని దేవీ ర్దేవేభ్యో యజ్ఞమశిష న్నస్మిన్త్సున్వతి యజమాన ఆశిషః స్వాహాకృతాః సముద్రేష్ఠా గన్ధర్వమా తిష్ఠతాను। వాతస్య పత్మన్నిడ ఈడితాః ॥౩॥

(పాశం వృష్ణియావత స్త్రిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమప్రపాఠకే షష్ఠోఽనువాకః।

## వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు ఆదిత్యగ్రహ మంత్రములు చెప్పబడినవి. ఈ షష్ఠానువాకమునందు పత్నివిషయ మంత్రములు చెప్పబడుచున్నవి.

1. **అర్థము:** (హే పత్ని!—ఓ యజమానపత్నీ!), త్వా—నిన్ను, పయసా—క్షీరము నిమిత్తము, ఘృతేన—ఆజ్యము నిమిత్తము, (తదుభయసిద్ధికై) సన్నహ్యామి—బాగుగ (రజ్జువుతో) బంధించుచున్నాను. ఓషధీభిః—ఓషధులతోఁ గూడిన, అపః—ఉదకముల నుద్దేశించి (తదుభయసిద్ధికై), త్వా—నిన్ను, సన్నహ్యామి—బాగుగ (రజ్జువుతో) బంధించుచున్నాను. ప్రజయా—సంతానము నిమిత్తమై, అహమ్—నేను (అధ్వర్యుఁడు), అద్య—ఈ కర్మయందు, త్వా—నిన్ను, సన్నహ్యామి—బాగుగ (త్రాటితో) బంధించుచున్నాను. అస్మై—మాయందు, వాజమ్—అన్నమును, సనవః—ఇచ్చుటకు, సా—ఆ పత్ని, దీక్షితా—దీక్షాయుక్తురాలు, భవతు—అగుఁగాక.

**తాత్పర్యము:** ఓ యజమానపత్నీ! నిన్ను క్షీరము, ఆజ్యము, ఓషధులు, ఉదకములు సంతానముల నిమిత్తము ఈ కర్మయందు అధ్వర్యుఁడనైన నేను బాగుగ త్రాటితో బంధించుచున్నాను. మాకు అన్నము నొసఁగుటకు ఆమె దీక్షితురాలు (దీక్ష వహించినది) అగుఁగాక. (ఈ యోక్త్రబంధన మంత్రము దీక్షాప్రకరణమునందు "ఇన్ద్రస్య యోనిరసి" అను మంత్రమునకు పూర్వము గ్రహింపఁదగినది. అనఁగా దీని వినియోగమును అచ్చట జూడవలెను. "అథాహమ్" "సుప్రజసః" అను తృతీయ మంత్రములు కూడ ఆ ప్రకరణమునందలివే.)

2. **అర్థము:** బ్రహ్మణస్పత్నీ—యజమానపత్ని, ప్రైతు—పత్నీశాలనుండి బయలుదేరి వెళ్లుఁగాక. వర్షేన—ప్రకర్షగా, వేదిమ్—యజ్ఞవేదిని, సీదతు—అధివసించుఁగాక.

**తాత్పర్యము:** యజమానునిభార్య పత్నీశాలనుండి బయలుదేరి వెళ్లి యజ్ఞవేదిని ప్రకర్షగా నధివసించుఁ గాక. (ప్రతిప్రస్థాతయను ఋత్విజుఁడు యజమాన పత్నిని పత్నీశాలనుండి యజ్ఞవేదియొద్దకుఁ గొనిపోవలయును. (బ్రహ్మణస్పత్నీ. ఇది అలుక్సమాసము.)

3. **అర్థము:** అథ—అనంతరము, అహమ్—నేను (యజమానపత్ని), అనుకామినీ—యజమానునకు ఆనుకూల్యమును కోరుచున్నదాననై, ఇహ—ఇచట, స్వే లోకే—స్వీయ స్థానమునందు, విశా—కూర్చొనుచున్నాను.

**తాత్పర్యము:** తరువాత నేను యజమానునకు ఆనుకూల్యమును కోరుచున్నదాననై ఇచట నా స్థానమునందు కూర్చొనుచున్నాను. (యజమానపత్ని ఈ మంత్రమును పఠించుచు యజ్ఞవేదియందలి తన స్థానమునందు కూర్చుండవలెను. ఈ మంత్రము యజమానపత్ని చెప్పవలసినది.)

4. **అర్థము:** హే అగ్నే!—ఓ యగ్నీ!, సుప్రజసః—మంచి సంతానములు కలవారమును, సుపత్నీః—ధర్మపత్నులమునగు, వయమ్—మేము, అదబ్ధాసః—ఎవనిచేతను తిరస్కృతులము కానివార మగుచు, సపత్నదమ్భనమ్—వైరినాశకుఁడవు, అదాభ్యమ్—ఎవనిచేతను తిరస్కృతుఁడవు కానివాఁడవునగు, త్వా—నిన్ను, ఉపసేదిమ—సమీపించి కూర్చుంటిమి.

**తాత్పర్యము:** ఓ యగ్నీ! నేను సుసంతానము కలదానను. ధర్మపత్నిని. ఎవరిచేతఁగూడ తిరస్కరింపఁబడనిదానను. అట్టి నేను నీ సమీపమున కూర్చుంటిని. నీవు శత్రునాశకుఁడవు. ఎవరిచేతను తిరస్కృతుఁడవు కానివాఁడవు. (యజమానపత్ని అగ్నిసమీపమునఁ గూర్చుండిన పిమ్మట ఈ మంత్రమును జపించవలెను.)

5. **అర్థము:** సుకేతః—మంచి జ్ఞానముతోఁ గూడియుండు, సవితా—ప్రేరకుఁడైన అంతర్యామి, యమ్—ఏ యోక్త్ర (త్రాఁటి) రూపమైన, వరుణస్య పాశమ్—వరుణదేవునియొక్క పాశమును, అబధ్నీత—బంధించెనో, (తమ్) ఇమమ్—ఆ యీ పాశమును, విష్యామి—ఊడఁదీయుచున్నాను. (తతః—అందువలన), సుకృతస్య లోకే—పుణ్యమునకు ఫలమైన, ధాతుః చ—పరమేశ్వరునియొక్క, యోనౌ—స్థానమునందు, పత్యా సహ—భర్తతోఁ గూడ, మే—నాకు, స్యోనమ్—సుఖమును, కరోమి—చేయుచున్నాను.

**తాత్పర్యము:** మంచి జ్ఞానముతోఁ గూడియుండునట్టి ప్రేరకుఁడైన అంతర్యామి బంధించిన యోక్త్రరూపమైన వరుణపాశమును ఊడఁదీయుచున్నాను. అట్లు చేయుటవలన నేను పుణ్యమునకు ఫలమైన పరమేశ్వరుని స్థానమునందు భర్తతోఁగూడ నాకు సుఖమును కలుగఁజేసికొనుచున్నాను. (యజమానపత్ని ఈ మంత్రమును పఠించుచు రజ్జుబంధము నూడఁదీసికొనవలెను. ఈ మంత్రమును అవభృథానువాకమునందు "దేవీరాప ఏష వః" అను మంత్రమునకు పూర్వము సమన్వయము చేసికొనవలెను.)

6. అర్థము: హే పత్ని!=ఓ యజమానపత్నీ!, ప్రేహి=(శాలాముఖీయ స్థానమునుండి బయలువెడలి 'పన్నేజనీ' అను నుదకములను తెచ్చుటకు) ప్రకర్షగా పొమ్ము. ఉదేహి=లేచి వెళ్లుము. ఋతస్య=యజ్ఞమునకు, వామీః=ప్రేరకుఁడైన, అగ్నిః=అగ్ని, తే=నిన్ను, (ద్వితీయార్థే షష్ఠీ.) అను (మన్యమానః)=అంగీకరించుచున్న వాఁడై, అగ్రం నయతు=ముందుకు ప్రేరణ చేయుఁగాక. అదితిః=భూమి, మధ్యమ్=(ఉభయుల) మధ్యమార్గమును, దద్రతామ్=ఒసఁగుగాక. (త్వమ్=నీవు), రుద్రావసృష్టా=క్రూరుఁడైన దేవునిచే విడువఁబడినదానవు, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన), యువా నామ=యువతియను పేరు కలదానవు, అసి=అగుచున్నావు. మా=(నేష్టయైన) నన్ను, మా హింసీః=బాధించకుము.

తాత్పర్యము: ఓ యజమానపత్నీ! నీవు శాలాముఖీయ స్థానమునుండి బయలువెడలి 'పన్నేజని' అను నుదకములను తెచ్చుటకు ప్రకర్షగాఁ బొమ్ము. అలస్యము చేయక లేచి వెళ్ళుము. యజ్ఞమునకు ప్రేరకుఁడైన ఈ యగ్ని నీ గమనమును అంగీకరించుచున్నవాఁడై నిన్ను ముందుకు ప్రోత్సహించుఁగాక. నీవును ఉపద్రవకారియగు క్రూరదేవునిచే విడువఁబడినదాన వగుచున్నావు. కావున యువతివిగ వ్యవహరింపఁబడుచున్నావు. ఈ విధముగ పిలుచుచున్న నేష్టనగు నన్ను బాధింపకుము. (ఈ మంత్రమును చెప్పుచు నేష్ట యనెడి ఋత్విజుఁడు యజమానపత్నిని శాలాముఖీయ స్థానమునుండి కొనిపోవలెను. ఈ మంత్రమును "హృదే త్వా" అనెడి అనువాకము నందు "దేవీరాపో అపాంనపాత్" అను మంత్రమునకు పిమ్మట వినియోగించవలెను.)

7. అర్థము: హే ఆపః!=ఓ ఉదకములారా!, వసుభ్యః=వసు దేవతలకొఱకు, రుద్రేభ్యః=రుద్ర దేవతలకొఱకు, ఆదిత్యేభ్యః=ఆదిత్య దేవతలకొఱకు, విశ్వేభ్యః దేవేభ్యః=విశ్వేదేవతలకొఱకు, పన్నేజనీః='పన్నేజని' అనెడి, వః=మిమ్ము, గ్రహ్ణామి=గ్రహించుచున్నాను. యజ్ఞాయ=యజ్ఞముకొఱకును, పన్నేజనీః=పన్నేజనియనెడి, వః=మిమ్ము, గృహ్ణామి=గ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఓ యుదజములారా!, వస్వాది దేవతల ప్రీతికొఱకు, యజ్ఞముకొఱకును పన్నేజని యను మిమ్ము గ్రహించుచున్నాను. (ఈ మంత్రమును చెప్పుచు యజమానపత్ని పన్నేజని యను నుదకములను గ్రహించవలెను. ఈ గ్రహణమంత్రము, "సాదయామి" అనెడి సాదనమంత్రము "సముద్రస్య వోక్షిత్యా ఉన్నయ" అను మంత్రమునకు పిమ్మట సమన్వయించఁదగినవి.)

8. అర్థము: హే ఆపః, వసుభ్యః, రుద్రేభ్యః, ఆదిత్యేభ్యః, విశ్వేభ్యః, దేవేభ్యః, పన్నేజనీః, వః, సాదయామి=ఉంచుచున్నాను. యజ్ఞాయ, పన్నేజనీః వః, సాదయామి. "వసుభ్యః" అను మంత్రమును "గృహ్ణామి అను పదమును విడిచి శేషము నంతటిని ఈ మంత్రములోని కనువర్తింపఁజేయవలెను. అర్థము పూర్వము వలెనే గ్రహింపఁదగినది.

తాత్పర్యము: ఓ ఉదకములారా! వస్వాది దేవతలప్రీతికొఱకు, యజ్ఞమునిమిత్తమును పన్నేజనియను మిమ్ము ఇచట ఉంచుచున్నాను. (అని ఈ మంత్రము చెప్పుచు యజమానపత్ని ఉదకముల నుంచవలెను.)

9. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ!), విశ్వస్య=విశ్వాత్మకుఁడవైన, తే=నీయొక్క, సందృశి=కటాక్షవీక్షణము కలుగుచుండఁగా, (తథా=ఆ విధముగా), విశ్వావతః=విశ్వము కలవాఁడవును, వృష్ణియావతః=బలము కలవాఁడవు నగు, తవ=నీయొక్క, సందృశి సతి=వీక్షణము కలుగుచుండఁగా, వామీరను=సేవింపఁదగిన అనుష్ఠానమునకు ప్రవర్తకుఁడనైన, (అహమ్=నేను), విశ్వా రేతాంసి=బహుపుత్ర కారణములైన వీర్యములను, పత్న్యామ్=యజమాన పత్నియందు, ధిషీయ=స్థాపింపఁజేయుదును.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు విశ్వాత్మకుఁడవు. విశ్వవంతుఁడవు. బలవంతుఁడవు. అట్టి నీ కటాక్షవీక్షణము కలుగుచుండఁగా ఆచరింపఁదగిన అనుష్ఠానమును ప్రవర్తింపఁజేయునట్టి నేను బహుపుత్ర కారణములైన వీర్యములను యజమానపత్నియందు స్థాపింపఁజేయుదును. (ఉద్గాత యజమానపత్నిని చూచునట్లుగాఁ జేయుచు అధ్వర్యుఁడీ మంత్రమును ఉద్గాతచే పఠింపఁజేయుచు చూపించవలెను.)

10. అర్థము: అయం యజ్ఞః=ఈ యజ్ఞము, దేవాన్=దేవతలను, అగన్=పొందుఁగాక. దేవీః=ప్రకాశించుచున్న ఉదకములు, దేవేభ్యః=దేవతలకొఱకు, యజ్ఞమ్=మా ఈ యజ్ఞమును, న్యశిషన్=విస్పష్టముగ చెప్పినవి. యజ

మానే–(ఈ) యజమానుఁడు, సున్వతి సతి–సోమమును అభిషవము చేయుచుండఁగా, స్వాహాకృతాః–స్వాహాకారముచే సంపాదింపఁబడినవియు, సముద్రేష్ఠాః–సముద్ర సమానమైన స్వర్గమునందున్నవియునగు, ఆశిషః–ఫలవిశేషములు, అను–అనుక్రమముగ, గన్ధర్వమ్–(నాకు ప్రియుఁడైన) యజమానుని, ఆతిష్ఠత–పొందుఁగాక. వాతస్య–యజ్ఞప్రవర్తకుఁడైన వాయువుయొక్క, పత్మన్–ప్రేరణము ఉండఁగా, ఇడః–ఫలసాధనములైన స్తోత్ర విశేషములు, ఈడితాః–ఋత్విజులచే ప్రయుక్తము లైనవి. (కావున ఫలము సమస్తము యజమానుని పొందుఁగాక.)

**తాత్పర్యము:** "ఈ యజ్ఞము దేవతలను పొందుఁగాక. ప్రకాశించుచున్న ఉదకములు దేవతలకొఱకు మా ఈ యజ్ఞమును విస్పష్టముగఁ జెప్పుఁగాక. యజమానుఁడు సోమము నభిషవము చేయుచుండఁగా సముద్రమువంటి స్వర్గమునందలి ఫలవిశేషములు (యజమానపత్నినగు నాకు) ప్రియుఁడైన యజమానుని పొందుఁగాక. ఆ ఫలవిశేషములు స్వాహాకారముచే సంపాదింపఁబడినవి. అనఁగా యజమానుఁడు 'స్వాహా' అని ఉచ్చరించుచు దేవతలకై హవిస్సును హోమము చేయుటచే లభ్యము లైనవి. "యజ్ఞప్రవర్తకుఁడైన వాయుదేవుని ప్రేరణము వలన ఋత్విజులు ఫలసాధనములైన స్తోత్రవిశేషములను ప్రయోగించుచున్నారు" అని చెప్పుచు యజమానపత్ని ఉదకములను స్పృశించవలెను. అగన్–అగచ్ఛన్. విధ్యర్థమున లఙ్ప్రయోగము ఛాందసము.

షష్ఠానువాకము సమాప్తము.

---

## అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే సప్తమోఽనువాకః।

మూలము: వషట్కారో వై గాయత్రియై శిరోఽచ్ఛిన త్తస్యై రసః పరాఽపతత్స పృథివీం ప్రావిశత్స
ఖదిరోఽభవద్యస్య ఖాదిరః స్రువో భవతి ఛన్దసామేవ రసేనావ ద్యతి సరసా అస్యాఽఽహుతయో
భవన్తి [2]తృతీయస్యామితో దివి సోమ ఆసీత్తం గాయత్ర్యాఽహర త్తస్య పర్ణమచ్ఛిద్యత
తత్పర్ణోఽభవ త్తత్పర్ణస్య పర్ణత్వం యస్య పర్ణమయీ జుహూః (౧)భవతి సౌమ్యా అస్యాఽఽ
హుతయో భవన్తి జుష న్తేఽస్య దేవా ఆహుతీ [3]ర్దేవా వై బ్రహ్మన్నవద న్త తత్పర్ణ ఉపాశృణో
త్సుశ్రవా వై నామ యస్య పర్ణమయీ జుహూ ర్భవతి న పాపగ్ం శ్లోకగ్ం శృణోతి [4]బ్రహ్మ
వై పర్ణో విణ్మరుతోఽన్నం విణ్మరుతోఽశ్వత్థో యస్య పర్ణమయీ జుహూ ర్భవత్యాశ్వత్థ్యుపభృ
ద్బ్రహ్మణైవాన్నమవ రున్ధేఽథో బ్రహ్మ (౨)ఏవ విశ్యధ్యూహతి [5]రాష్ట్రం వై పర్ణో విడశ్వత్థో
యత్పర్ణమయీ జుహూ ర్భవత్యాశ్వత్థ్యుపభృ ద్రాష్ట్రమేవ విశ్యధ్యూహతి [6]ప్రజాపతిర్వా అజు
హోత్సా యత్రాఽఽహుతిః ప్రత్యతిష్ఠత్తతో వికఙ్కత ఉదతిష్ఠత్తతః ప్రజా అసృజత యస్య
వైకఙ్కతీ ధ్రువా భవతి ప్రత్యేవాస్యాఽఽహుతయ స్తిష్ఠన్త్యథో ప్రైవ జాయత [7]ఏతద్వై
స్రుచాగ్ం రూపం యస్యైవగ్ం రూపాః స్రుచో భవన్తి సర్వాణ్యేవైనగ్ం రూపాణి పశూనాముప
తిష్ఠన్తే నాస్యాపరూప మాత్మ ఞ్జాయతే ॥౩॥ (జుహూరథో బ్రహ్మ స్రుచాగ్ం సప్తదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమప్రపాఠకే సప్తమోఽనువాకః॥

## వేదార్థదీపిక

**అవతారిక:** షష్ఠానువాకమునందు పత్నీవిషయ యోక్త్రబంధాది మంత్రములు ప్రోక్తము లైనవి. ఈ సప్తమానువాకమునందు దర్శపూర్ణమాసాంగభూత స్రుగాదులకు వృక్షవిశేషములు విధింపఁబడుచున్నవి. అనఁగా జుహ్వాది హోమసాధనములు ఏ యే వృక్షవిశేషముల కఱ్ఱలతో చేయఁబడవలెనో, ఆ విషయము ఈ యనువాకమునందు వివరింపఁబడుచున్నది.

1. **అర్థము:** వషట్కారః–వషట్కారాభిమాని దేవత, గాయత్రియై–గాయత్రియొక్క, శిరః=శిరస్సును, అచ్ఛినత్ వై–ఛేదించెనఁట! (తదా–అప్పుడు), తస్యై–ఆ గాయత్రియొక్క, (ఛిన్నప్రదేశాత్=ఛిన్నప్రదేశమునుండి), రసః–రసము, పరాఽపతత్–పడెను. సః=ఆ రసము (జలము), పృథివీమ్–భూమిని, ప్రావిశత్–ప్రవేశించెను. సః=పడిన ఆ రసము, ఖదిరః–చంద్రచెట్టు, అభవత్–అయెను. యస్య=ఏ యజమానునియొక్క, స్రువః=స్రువము, ఖాదిరః–చంద్రచెట్టునకు సంబంధించినది, భవతి–అగుచున్నదో, సః–ఆ యజమానుఁడు, ఛన్దసాం రసేనై వ–ఛందస్సులయొక్క రసముచేతనే, అవద్యతి–అవదానము చేయుచున్నవాఁ డగుచున్నాఁడు. అస్య–ఈ యజమానునియొక్క, ఆహుతయః=ఆహుతులు, సరసాః–రస సహితములు, భవన్తి–అగుచున్నవి. (అతః–ఈ కారణమువలన, స్రువః–స్రువము, ఖాదిరః–ఖదిరవృక్ష సంబంధిగా, కర్తవ్యః=చేయఁదగినది. ఇది విధి.)

**తాత్పర్యము:** పూర్వము వషట్కారాభిమాని దేవత ఏదియో ఒక విరోధముచేత గాయత్రీ శిరస్సును నఱికెనఁట!. అప్పుడా గాయత్రియొక్క ఛిన్నప్రదేశమునుండి జలరూపమైన రసము భూమియందు పడి చంద్రచెట్టు ఆయెను. ఖాదిరముతోఁ జేసిన స్రువము నుపయోగించిన యజమానుఁడు ఛందస్సులయొక్క రసముచేతనే అవదానము చేసినవాఁ డగును. ఇతఁడు హోమము చేసిన ఆహుతులు సరసము లగును. కావున ఖాదిరముతో స్రువమును చేయవలయు నను విధి యిచట ఊన్నీయ మగుచున్నది. (స్రువము–ఆజ్యాది హవిస్సును అగ్నియందు హోమము చేయుటకు సాధన విశేషము. అవదానము–హోమసాధనముచే ఆజ్యాదికమును గ్రహించుట.)

2. **అర్థము:** ఇతః–ఈ భూలోకమునుండి, తృతీయస్యామ్–మూఁడవదియైన, దివి–ద్యులోకమునందు, సోమః=సోమము (తిప్పతీఁగ), ఆసీత్–ఉండెను. తమ్=ఆ సోమమును, గాయత్రీ–గాయత్రీదేవత, ఆహరత్–తీసికొనివచ్చెను. తస్య=ఆ సోమముయొక్క, పర్ణః–పర్ణము (ఆకు), అచ్ఛిద్యత–తెగెను. తత్–ఆ తెగిన ఆకు, పర్ణః–మోదుగుచెట్టు (పలాశవృక్షము), అభవత్–ఆయెను. తత్–పర్ణమునుండి పుట్టినది కావున, పర్ణస్య–పలాశవృక్షమునకు, పర్ణత్వమ్=పర్ణవృక్షమను వ్యవహారము, (అభవత్–ఆయెను), యస్య–ఏ యజమానునియొక్క, జుహూః=జుహు వనెడి హోమసాధనము, పర్ణమయీ–పలాశ సంబంధిని, భవతి–అగుచున్నదో, అస్య–ఈ యజమానునియొక్క, ఆహుతయః–ఆహుతులు, సౌమ్యాః–సౌమ్యములు, భవన్తి–అగుచున్నవి. (తదా–అప్పుడు), అస్య–ఈ యజమానునియొక్క, ఆహుతీః–ఆహుతులను, దేవాః–దేవతలు, జుషన్తే–ప్రీతిపూర్వకముగ సేవించుచున్నారు.

**తాత్పర్యము:** పూర్వము ఈ భూలోకమునుండి మూఁడవదియైన ద్యులోకమునందు సోమము (తిప్పతీఁగ) ఉండెను. గాయత్రీ దేవత ఆ తిప్పతీఁగను తెచ్చుచుండఁగా దాని ఆకు ఒకటి భూమియందు పడి మోదుగుచెట్టుగా నాయెను. పర్ణమునుండి పుట్టిన చెట్టు కావున మోదుగుచెట్టునకు పర్ణవృక్షమను వ్యవహారము కూడ ఏర్పడినది. పాలాశముతో చేసిన జుహువు నుపయోగించి హోమము చేయు యజమానుని ఆహుతులు సౌమ్యము లగును. దేవతలు ఈ ఆహుతులను ప్రీతిపూర్వకముగ సేవించుదురు. స్రుక్కు, స్రువము, జుహువు, ఉపభృత్తు, ధ్రువ– ఇవి హోమము చేయుటకు సాధనములు. (ఇచట జుహువునకు వృక్షవిశేషము చెప్పఁబడినది.)

3. **అర్థము:** దేవాః–దేవతలు, బ్రహ్మన్–బ్రహ్మజ్ఞాన విషయమై, అవదన్త వై–పరస్పరము సంవాదము చేసికొనిరఁట! తత్–ఆ దేవతల వచనమును, పర్ణః–పర్ణవృక్షాభిమాని దేవుఁడు, ఉపాశృణోత్–సమీపమున వినెను. (తస్మాత్–

ఆ కారణమువలన, తస్య=ఆ వృక్షమునకు, సుశ్రవాః నామ='సుశ్రవస్' అను పేరు, సంపన్నమ్=సిద్ధించినది, యస్య=ఏ యజమానునియొక్క, జుహూః=జుహువు, పర్ణమయీ=పలాశ మగునో, (సః=ఆ యజమానుఁడు), పాపం శ్లోకమ్=నిందావచనమును, న శృణోతి=వినుట లేదు. (స్తుతిరూప వాక్యమునే వినునని భావము.)

తాత్పర్యము: పూర్వ మొకప్పుడు దేవతలు పలాశవృక్ష చ్ఛాయయం దుపవిష్టులై బ్రహ్మతత్త్వ విషయమున రహస్యముగ పరస్పరము సంవాదము జరుపుచుండఁగా తద్వృక్షాభిమానియగు దేవత ఆ దేవతల వచనమును వినెను. అందువలన ఆ వృక్షమునకు 'సుశ్రవస్' అను పేరు ఏర్పడెను. పలాశవృక్షము సుశ్రవో నామము కలది కావున పర్ణమయియైన జుహువుతో హోమము చేసిన యజమానుఁడు సర్వదా శోభనమైన స్తుతిరూప వచనమునే వినుచుండును కాని, ఒకప్పుడును నిందావచనమును వినఁడని యీ విధముగ నిచట పర్ణవృక్షము ప్రశంసింపఁబడినది.

4. అర్థము: పర్ణః=పలాశవృక్షము, (బ్రహ్మ వై=బ్రహ్మవిషయక సంవాదమును వినుటచే) బ్రహ్మయే. మరుతః=మరుత్తులు, విట్=విడ్రూపులు (వైశ్యరూపులు). అన్నమ్=అన్నము, మారుతమ్=(కృష్యాదివరులైన వైశ్యులచే సంపాదింపఁబడినది కావున) మరుద్రూప మైనది. యస్య=ఏ యజమానునియొక్క, జుహూః=జుహువు, పర్ణమయీ=పర్ణవృక్ష సంబంధి, భవతి=అగుచున్నదో, (తస్య=ఆ యజమానునియొక్క), ఉపభృత్=ఉపభృత్తనెడి హోమసాధనము, ఆశ్వత్థీ=అశ్వత్థవృక్ష (రావిచెట్టు) సంబంధి, భవేత్=కావలెను. (ఉభయస్మిన్ ఏవం కృతే సతి=ఈ ఉభయము ఈ విధముగఁ జేయఁబడిన దగుచుండఁగా, అశ్వత్థస్వామియగు మరుత్తు,) బ్రహ్మణైవ=జుహూరూప బ్రహ్మచేతనే, అన్నమ్=విడ్రూపాన్నమును, అవరున్ద్దే=పొందుచున్నాఁడు. (కించ మఱియు), బ్రహ్మైవ=బ్రాహ్మణజాతినే, విశి=వైశ్యజాతియందు, అధ్యూహతి=అధిక మైనదిగా స్థాపించుచున్నాఁడు.

తాత్పర్యము: (దృష్టాంతమునకై జుహువునకు పర్ణమయత్వము ననువదించుచు ఉపభృత్తు' అను **హోమసాధనమునకు** అశ్వత్థవృక్ష సంబంధము ఈ మంత్రమున విధింపఁబడుచున్నది.) దేవతలు **చేయుచున్న బ్రహ్మవిషయక** సంవాదమును వినుటచే పలాశవృక్షము కూడ బ్రహ్మయే యని చెప్పఁబడినది. మరు**త్తులు వైశ్యజాత్యభిమా**నులుగా సృజింపఁబడుటచే మరుత్తులు కూడ విడ్రూపులు. కృష్యాదివరులైన వైశ్యులచే **సంపాదింపఁబడుటచే** అన్నము కూడ మరుద్రూపముగా వర్ణింపఁబడినది. "మరుతాం వా ఏతదోజో యదశ్వత్థః" **అను శ్రుతివలనఁ** గూడ ఈ విషయము స్పష్ట మగుచున్నది. ఇట్లుండఁగా జుహువును పర్ణమయినిగాఁ జేసిన **యజమానుఁడు** ఉపభృత్తును ఆశ్వత్థముగాఁ జేయవలెను. ఈ ఉభయము నీవిధముగఁ జేయఁగా జుహూరూప బ్రహ్మచేతనే అశ్వత్థస్వాములైన మరుత్తులకు విడ్రూపాన్నము సంపాదిత మగును. మఱియు బ్రాహ్మణజాతినే వైశ్యజాతియందు అధిక మైనదిగా స్థాపించిన ట్లగుచున్నది.

5. అర్థము: పర్ణః=పర్ణవృక్షము, రాష్ట్రం వై=రాష్ట్రరూపమే, అశ్వత్థః=అశ్వత్థ వృక్షము, విట్=(మరుద్దేవతామూలమున) విడ్రూపము. జుహూః=జుహువు, పర్ణమయీ=పర్ణమయిగాను, ఉపభృత్=ఉపభృత్తు, ఆశ్వత్థీ=ఆశ్వత్థమయిగాను, భవతి యత్=అగుచున్నచో, రాష్ట్రమేవ=బ్రహ్మరూప రాష్ట్రమునే, విశి=అశ్వత్థరూప విట్టునందు, అధ్యూహతి=అధిక మైనదిగా స్థాపించిన ట్లగుచున్నది.

తాత్పర్యము: పర్ణవృక్షము రాష్ట్రరూపము. అశ్వత్థవృక్షము మరుద్దేవతామూలమున వైశ్యరూపము. కావున జుహువును పర్ణమయిగాను, ఉపభృత్తును అశ్వత్థమయిగాను చేసి యుపయోగించినచో బ్రహ్మరూప రాష్ట్రమునే అశ్వత్థరూప వైశ్యునియందు అధిక మైనదిగా స్థాపించి నట్లగును.

6. అర్థము: ప్రజాపతిః=ప్రజాపతి, అజుహోత్ వా=(పూర్వము) హోమము చేసెనఁట! సా ఆహుతిః=ఆ ఆహుతి, యత్ర=ఎచ్చట, ప్రత్యతిష్ఠత్=ప్రతిష్ఠిత మైనదో (ఉన్నదో), తతః=ఆ ప్రదేశమునుండి, వికఙ్కతః=పుల్లవెలఁగ చెట్టు, ఉదతిష్ఠత్=ఉద్భవించెను. తతః=యజ్ఞసాధనమైన ఆ వికంకత వృక్షమునుండి, ప్రజాః=ప్రజలను, అసృజత=సృజించెను. యస్య=ఏ యజమానునియొక్క, ధ్రువా='ధ్రువ' యనెడి హోమసాధనము, వైకఙ్కతీ=వికంకతవృక్ష సంబంధి, భవతి=అగుచున్నదో, అస్య=ఈ యజమానునియొక్క, ఆహుతయః=ఆహు

తులు, ప్రతితిష్ఠన్తి ఏవ=నిశ్చయముగ ప్రతిష్ఠితములు అగుచున్నవి. అథో=మఱియు, ప్రజాయతే ఏవ=నిశ్చయముగ సంతానము కలుగును.

తాత్పర్యము: పూర్వము ప్రజాపతి ఒక ప్రదేశమునందు హోమము చేయఁగా ఆ యాహుతులు పడిన ప్రదేశమునుండి 'వికంకత' వృక్షము (పుల్లవెలఁగచెట్టు) పుట్టినది. యజ్ఞసాధనమైన ఆ వికంకత వృక్షమునుండి ప్రజాపతి ప్రజలను సృష్టించెను. కావున వికంకత వృక్షముతో చేయఁబడిన ధ్రువయను హోమసాధనము నుపయోగించిన యజమానుని ఆహుతులు ప్రతిష్ఠితము లగును. ఆ యజమానుఁడు నిశ్చయముగ ప్రజను పుట్టించును. ఈ మంత్రము ధ్రువకు వికంకత వృక్ష సంబంధమును విధించినది.

7. అర్థము: ఏతత్ వై=ఖాదిరత్వము, పర్ణమయీత్వము, అశ్వత్థత్వము, వైకంకతత్వము అను నిదియే, స్రుచామ్=స్రుక్కులయొక్క, రూపమ్=రూపము. యస్య=ఏ యజమానునకు, స్రుచః=స్రుక్కులు, ఏవంరూపాః=ఖాదిరత్వాది పూర్వోక్త రూపములు కలవి, భవన్తి=అగుచున్నవో, ఏనమ్=ఈ యజమానుని, పశూనామ్=గవాశ్వాది పశువులయొక్క, సర్వాణి రూపాణి=సమస్త రూపములు, ఉపతిష్ఠన్తే ఏవ=నిశ్చయముగ పొందుచున్నవి. అస్య=ఈ యజమానునియొక్క, ఆత్మన్=స్వోదరమునందు, అపరూపమ్=విరుద్ధ స్వరూపముతోఁ గూడిన సంతానము, న జాయతే=పుట్టుట లేదు.

తాత్పర్యము: ఖాదిరత్వాదికమే స్రుక్కుల స్వరూపము. ఏతద్రూపములైన జుహ్వాది హోమసాధనముల నుపయోగించిన యజమానుఁడు నిశ్చయముగ గవాశ్వాది పశువులను పొందును. ఇతనికి సుస్వరూపమైన సంతానమే కలుగును. కాని విరుద్ధరూప సంతానము కలుగదు. (పూర్వోక్త విధుల కిది ముగింపు వాక్యము.)

సప్తమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకేఽష్టమోఽనువాకః।

**మూలము:** [1]ఉపయామగృహీతోఽసి ప్రజాపతయే త్వా జ్యోతిష్మతే జ్యోతిష్మన్తం గృహ్ణామి దక్షాయ దక్షవృధే రాతం దేవేభ్యోఽగ్నిజిహ్వేభ్య స్త్వర్తాయుభ్య ఇన్ద్రజ్యేష్ఠేభ్యో వరుణరాజభ్యో వాతాపిభ్యః పర్జన్యాత్మభ్యో దివే త్వాఽన్తరిక్షాయ త్వా పృథివ్యై త్వా [2]ఽపేన్ద్ర ద్విషతో మనోఽపజిజ్యాసతో జహ్యప యో నోఽరాతీయతి తం జహి [3]ప్రాణాయ త్వాఽపానాయ త్వా వ్యానాయ త్వా సతే త్వాఽసతే త్వాఽద్భ్య స్త్వౌషధీభ్యో విశ్వేభ్యస్త్వా భూతేభ్యో యతః ప్రజా అక్ఖిద్రా అజాయన్త తస్మై త్వా ప్రజాపతయే విభూదావ్నే జ్యోతిష్మతే జ్యోతిష్మన్తం జుహోమి ॥౧॥

(ఓషధీభ్య శ్చతుర్దశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమ ప్రపాఠకేఽష్టమోఽనువాకః।

## వేదార్థ దీపిక

**అవతారిక:** ఇష్ట్యంగములైన జుహ్వాది హోమసాధనములకు వృక్షవిశేషముల సంబంధము సప్తమానువాకమునందుఁ జెప్పఁబడినది. ఈ యష్టమానువాకమునందు దధిగ్రహ మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము:** (హే దధిగ్రహ!=ఓ దధిగ్రహమా! త్వమ్=నీవు), ఉపయామ గృహీతః=పార్థివ పాత్రముచే గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. దక్షవృధే=నేర్పరులను వృద్ధిపఱచునట్టి, దక్షాయ=దక్షునికొఱకు, రాతమ్=పూర్వము ప్రజాపతిచే నీయఁబడిన, జ్యోతిష్మన్తమ్=జ్యోతిస్సు కలిగియున్న, త్వా=నిన్ను, జ్యోతిష్మతే=జ్యోతిస్సు కలవాఁడైన, ప్రజాపతయే=ప్రజాపతికొఱకు, గృహ్ణామి=గ్రహించుచున్నాను. అగ్నిజిహ్వేభ్యః=అగ్నియే జిహ్వ (నాలుక) గాఁ గలవారును, ఋతాయుభ్యః=తమకు సత్యమును కోరుచున్నవారును, ఇన్ద్రజ్యేష్ఠేభ్యః=ఇంద్రుఁడు జ్యేష్ఠుఁడుగాఁ గలవారును, వరుణ రాజభ్యః=వరుణుఁడు రాజుగాఁ గలవారును, వాతాపిభ్యః=వాయువు ఆహారముగాఁ గలవారును, పర్జన్యాత్మభ్యః=పర్జన్యుఁడే ఆత్మగాఁ గలవారునగు, దేవేభ్యః=దేవతలకొఱకు, రాతమ్=పూర్వము ఈయఁబడిన, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను. దివే=ద్యులోకముకొఱకు, త్వా=నిన్ను, గృహ్ణామి. అన్తరిక్షాయ=అంతరిక్షముకొఱకు, త్వా=నిన్ను, గృహ్ణామి. పృథివ్యై=పృథివికొఱకు, త్వా, గృహ్ణామి.

**తాత్పర్యము:** ఓ దధిగ్రహమా! నీవు పార్థివ (పృథివి సంబంధి) పాత్రముచే గ్రహింపఁబడినదాన వగుచున్నావు. కుశలు లను వృద్ధి నొందించునట్టి దక్షునికై పూర్వము ప్రజాపతిచే నొసఁగఁబడిన జ్యోతిస్సు గల నిన్ను జ్యోతిష్మం

తుండైన ప్రజాపతికొఱకు గ్రహించుచున్నాను. పూర్వము దేవతలకొఱ కొసంగఁబడిన నిన్ను గ్రహించు చున్నాను. ఆ దేవతలలో కొందఱు అగ్నిజిహ్వులు. అనఁగా అగ్నియందు హోమము చేయఁబడిన హవి స్సును గ్రహించువారు. కొందఱు సత్యమును గోరువారు. కొందఱు ఇంద్రుఁడు జ్యేష్ఠుఁడుగాఁ గలవారు. వరుణుని రాజుగా భావించువారు కొందఱు కలరు. వాయువు ఆహారముగాఁ గలవారు కొందఱు (సర్వదేవ తలు). వృష్ట్యాదులను సహించువారు కొందఱు కలరు. మఱియు ద్యులోకప్రాప్తి నిమిత్తము, అంతరిక్ష ప్రాప్తికొఱకు, పృథివీ ప్రాప్తికొఱకును నిన్ను గ్రహించుచున్నాను. (హోమద్రవ్యమైన దధి నుంచు పాత్రము దధిగ్రహము, ఈ మంత్రమును చెప్పుచు దధిని గ్రహించవలెను.)

2. అర్థము: హే ఇన్ద్ర!=ఓ ఇంద్రుఁడా!, ద్విషతః='ద్విషత్' అను శత్రువుయొక్క, మనః=మనస్సును, అపజహి=పోఁ గొట్టుము. జిజ్యాసతః=జిజ్యాసత్ అనెడి శత్రువుయొక్క, మనః=మనస్సును, అపజహి=పోఁగొట్టుము. యః =ఏ శత్రువు, నః=మమ్ము, అరాతీయతి=అరాతినిగా (దానము చేయకుండువారినిగా) కోరుచున్నాఁడో, తమ్= అతనిని, అపజహి.

తాత్పర్యము: శత్రువులు మూఁడు విధములుగ నున్నారు. (1) యజమానునియొద్దనున్న ద్రవ్యాదికమును నశింపఁ జేయువాఁడు 'ద్విషత్' అను శత్రువు. (2) ద్రవ్యము నపహరించుటకు సమర్థుఁడైనను యజమానుని యొక్క మరణమునే కోరు శత్రువు 'జిజ్యాసత్' అను శత్రువు. (3) దానము చేయఁదగినదిగా నున్న దానిని దానము చేయకుండునట్లు కోరువాఁడు 'అరాతీయత్' అను శత్రువు. ఓ యింద్రా! ఈ మూఁడు విధ ములుగానున్న శత్రువులను పోఁగొట్టుము. (దధిగ్రహమును గ్రహించవలెను.)

3. అర్థము: హే దధిగ్రహ!=ఓ దధిగ్రహమా!, జ్యోతిష్మన్తమ్=తేజస్వంతమైన, త్వా=నిన్ను, ప్రాణాయ=ప్రాణప్రీతికై, జుహోమి=హోమము చేయుచున్నాను. (ప్రాణము=ఊర్ధ్వవృత్తి.) అపానాయ=అవాగ్వృత్తి రూపమైన అపానముయొక్క ప్రీతికై, త్వా, జుహోమి. వ్యానాయ=మధ్యవృత్తి రూపమైన వ్యానముయొక్క ప్రీతికై, త్వా, జుహోమి. సతే=శాస్త్రీయమార్గమునందు వర్తించునట్టి పురుషుని ప్రీతికై, త్వా, జుహోమి. అసతే= సద్భిన్నుని ప్రీతికై, త్వా, జుహోమి. అద్భ్యః=ఉదకములకొఱకు, త్వా, జుహోమి, ఓషధీభ్యః=ఓషధుల కొఱకు, త్వా, జుహోమి. విశ్వేభ్యః భూతేభ్యః=సర్వప్రాణుల ప్రీతికొఱకు, త్వా, జుహోమి. యతః=ఏ ప్రజాపతినుండి, ప్రజాః=ప్రజలు, అఖిద్రాః=ఖేదరహితులుగా, అజాయన్త=పుట్టిరో, విభూదావ్నే=విభుత్వ మును (ఐశ్వర్యమును) ఒసఁగువాఁడును, జ్యోతిష్మతే=తేజస్వంతుఁడునగు, తస్మై ప్రజాపతయే=ఆ ప్రజాపతికొఱకు, జ్యోతిష్మన్తమ్=(సర్వప్రకాశకము కావున) తేజస్వంతమైన, త్వా=నిన్ను, జుహోమి= హోమము చేయుచున్నాను.

తాత్పర్యము: ఓ దధిగ్రహమా! తేజస్వంతమైన నిన్ను ప్రాణాదుల ప్రీతికొఱకు హోమము చేయుచున్నాను. ప్రజాపతి వలన పుట్టిన ప్రజలు ఖేదము లేనివారు. ఆ ప్రజాపతి తేజస్వంతుఁడు. ఐశ్వర్యము నొసఁగువాఁడు. అట్టి ప్రజాపతి ప్రీతికొఱకును నిన్ను హోమము చేయుచున్నాను. (ఈ మంత్రమును చెప్పుచు దధిగ్రహమును హోమము చేయవలెను.)

అష్టమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే నవమోఽనువాకః ।

మూలము: [1]యాం వా అధ్వర్యుశ్చ యజమానశ్చ దేవతా మన్తరిత స్తస్యా ఆ వృశ్చ్యేతే ప్రాజాపత్యం దధిగ్రహం గృహ్ణీయాత్ప్రజాపతిః సర్వా దేవతా దేవతాభ్య ఏవ నిహ్నువాతే [2]జ్యేష్ఠో వా ఏష గ్రహాణాం యస్యైష గృహ్యతే జ్యైష్ఠ్యమేవ గచ్ఛతి [3]సర్వాసాం వా ఏతద్దేవతానాగ్ం రూపం యదేష గ్రహో యస్యైష గృహ్యతే సర్వాణ్యేవైనగ్ం రూపాణి పశూనాముప తిష్ఠన్త [4]ఉపయామగృహీతః (౧)అసి ప్రజాపతయే త్వా జ్యోతిష్మతే జ్యోతిష్మన్తం గృహ్ణామీత్యాహ జ్యోతిరేవైనగ్ం సమానానాం కరోత్యగ్నిజిహ్వేభ్య స్త్వర్తాయుభ్య ఇత్యాహైతావతీర్వై దేవతా స్తాభ్య ఏవైనగ్ం సర్వాభ్యో గృహ్ణాత్యపేన్ద్ర ద్విషతో మన ఇత్యాహ భ్రాతృవ్యాపనుత్త్యై [7]ప్రాణాయ త్వాఽపానాయ త్వేత్యాహ ప్రాణానేవ యజమానే దధాతి [8]తస్మై త్వా ప్రజాపతయే విభూదావ్నే జ్యోతిష్మతే జ్యోతిష్మన్తం జుహోమి (౨)ఇత్యాహ ప్రజాపతిః సర్వా దేవతాః సర్వాభ్య ఏవైనం దేవతాభ్యో జుహోత్యాజ్యగ్రహం గృహ్ణీయాత్తేజస్కామస్య తేజో వా ఆజ్యం తేజస్వ్యేవ భవతి సోమగ్రహం గృహ్ణీయాద్బ్రహ్మవర్చసకామస్య బ్రహ్మవర్చసం వై సోమో బ్రహ్మవర్చస్యేవ భవతి దధిగ్రహం గృహ్ణీయాత్పశుకామస్యోర్గ్వై దధ్యూర్క్పశవ ఊర్జైవాస్మా ఊర్జం పశూనవ రున్ద్ధే ॥ ౩ ॥ (ఉపయామగృహీతో జుహోమి త్రిచత్వారిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమ ప్రపాఠకే నవమోఽనువాకః ।

## వేదార్థదీపిక

అవతారిక: అష్టమానువాకమునందు దధిగ్రహ మంత్రములు చెప్పబడినవి. ఈ నవమానువాకమునందు తన్మంత్ర వ్యాఖ్యానము చేయబడుచున్నది.

1. అర్థము: అధ్వర్యుః చ=అధ్వర్యుఁడును, యజమానః చ=యజమానుఁడును, యాం దేవతామ్=ఏ దేవతను గూర్చి, అన్తరితః=అంతరాయము చేసిరో, (తౌ=ఆ యుభయులు,) తస్యాః=ఆ దేవతకు, ఆవృశ్చ్యేతే=అపరాధము చేసినవా రగుచున్నారు. (అతః=ఈ కారణమువలన, తత్పరిహారాయ=ఆ దోషము పోవుటకై) ప్రాజాపత్యమ్=ప్రజాపతి దేవతాకమైన, దధిగ్రహమ్=దధిగ్రహమును, గృహ్ణీయాత్=గ్రహించవలెను. ప్రజాపతిః=ప్రజాపతి, సర్వా దేవతా=సర్వదేవతా స్వరూపుఁడు. (తదా=అప్పుడు, తౌ=ఆ యుభయులు), సర్వదేవతాభ్యః ఏవ=సర్వదేవతలకొఱకే, నిహ్నువాతే=అపలాపము చేయుచున్నవా రగుచున్నారు.

తాత్పర్యము: సోమయాగమునందు దేవతా బాహుల్య ముండుటవలన అధ్వర్యుయజమానులు ఏ దేవతకైన అంతరాయమును కల్పించినచో ఆ యుభయులు ఆ దేవతకు అపరాధము చేసినవా రగుచున్నారు. కావున ఈ అపరాధ పరిహారమునకై ప్రజాపతి దేవతాక దధిగ్రహమును గ్రహించవలెను. ప్రజాపతి స్రష్ట కావున సర్వదేవతా స్వరూపుఁడు. ప్రజాపతికి గ్రహము నీయఁగానే సర్వదేవతలకు అన్నము నిచ్చినవారు అను అపలాపమును చేయుచున్నవా రగుదురు. ఆ యపలాపముచేత ఆ దేవత వీరి విషయమున ద్వేషమును విడిచిపెట్టును. (ఇచట దధిగ్రహ విధానము చెప్పఁబడినది.)

2. అర్థము: గ్రహాణామ్=గ్రహములలో, ఏషః=ఈ దధి గ్రహము, జ్యేష్ఠః వా=ప్రథమభావి కదా! యస్య=ఏ యజమానుని నిమిత్తము, ఏషః=ఈ దధిగ్రహము, గృహ్యతే=గ్రహించఁబడుచున్నదో, సః=ఆ యజమానుఁడు, జ్యైష్ఠ్యమ్=ముఖ్యత్వమును, గచ్ఛత్యేవ=నిశ్చయముగ పొందుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ దధిగ్రహము సర్వగ్రహములలో ప్రథమమున ఉండునది. ఏ యజమానుని నిమిత్తము ఈ దధిగ్రహము ప్రథమమున గ్రహించఁబడునో, ఆ యజమానుఁడు సర్వ యజమానులలో నిశ్చయముగ ముఖ్యత్వమును పొందును.

3. అర్థము: ఏషః గ్రహః యత్=ఈ ప్రజాపతి దేవతాక గ్రహ మేది కలదో, ఏతత్=ఇది, సర్వాసాం దేవతానామ్=సర్వదేవతలయొక్క, రూపమ్=రూపము. యస్య=ఏ యజమానునకు, ఏషః గృహ్యతే=ఈ దధిగ్రహము గ్రహింపఁబడుచున్నదో, ఏనమ్=ఈ యజమానుని, పశూనామ్=పశువులయొక్క, సర్వాణి రూపాణి=గవాశ్వాది సర్వ రూపములు, ఉపతిష్ఠన్తే=పొందుచున్నవి.

తాత్పర్యము: ఈ ప్రజాపతి దేవతాక గ్రహము సర్వదేవతా స్వరూపము. ఏ యజమానునకు ఈ దధిగ్రహము గ్రహింపఁబడునో, అట్టి యీ యజమానుని గవాశ్వాది సర్వ పశువులు పొందును. ఈ మంత్రముచే దధిగ్రహమునకు ప్రజాపతి దేవతాకత్వము విధించఁబడినది.

4. అర్థము: "ఉపయామ గృహీతోఽసీ"త్యాది మంత్రము అష్టమానువాకమునందు వ్యాఖ్యాతము. ఆ మంత్రమునందలి దధిగ్రహ విశేషణమైన "జ్యోతిష్మన్తమ్" అను పదము ఇచట ప్రశంసింపఁబడుచున్నది. ''ఉపయామ.... గృహ్ణామి'' ఇతి ఆహ=ఉపయామ గృహీతోఽసీత్యాది మంత్రము 'జ్యోతిష్మన్తం త్వా' అని చెప్పుటచే, (దధి గ్రహః=దధిగ్రహము), ఏనమ్=ఈ యజమానుని, సమానానామ్=సజాతీయ యజమానులలో, జ్యోతిరేవ=తేజోయుక్తునిగానే, కరోతి=చేయుచున్నది.

తాత్పర్యము: దధిగ్రహము జ్యోతిష్మంత మని చెప్పుటచే అట్టి దధిగ్రహము ఈ యజమానుని తేజోవంతునిగానే చేయును.

5. అర్థము: "అగ్నిజిహ్వేభ్య స్త్వర్తాయుభ్యః" ఇతి ఆహ=''ఉపయామ గృహీతోఽసి'' అను మంత్రముయొక్క ఉత్తర భాగమునందలి ప్రజాపత్యవయవభూత దేవతా ప్రతిపాదకములైన 'అగ్నిజిహ్వేభ్యః' ఇత్యాది నవసంఖ్యాకములైనట్టిచతుర్థ్యంత పదముల తాత్పర్య మిచట సంగ్రహముగఁ జూపఁబడుచున్నది. "అగ్నిజిహ్వేభ్యః" ఇత్యాది మంత్రభాగము, దేవతాః=దేవతలు, ఏతావతీః వై=ఈ మాత్రమువారే. తాభ్యః సర్వాభ్యః ఏవ=ఆ సర్వదేవతలకొఱకే, ఏనమ్=ఈ దధిగ్రహమును, గృహ్ణాతి=(యజమానుఁడు) గ్రహించుచున్నాఁడు. ఇతి=అని, ఆహ=చెప్పెను.

తాత్పర్యము: "ఉపయామ గృహీతోఽసి" అను మంత్రముయొక్క ఉత్తరభాగమునందు "అగ్నిజిహ్వేభ్యః" ఇత్యాది నవ సంఖ్యాక చతుర్థ్యంత పదములచే ఎందఱు దేవతలు చెప్పఁబడిరో, యజమానుఁడు ఈ అందఱికొఱకు దధిగ్రహమును గ్రహించుచున్నాఁడని పై మంత్రముయొక్క ఉత్తరభాగమైన 'అగ్నిజిహ్వేభ్యః' ఇత్యాదికము చెప్పుచున్నది.

6. అర్థము: భ్రాతృవ్యాపనుత్త్యై-శత్రువులను పోఁగొట్టుటకై, "అపేన్ద్రి ద్విషతో మనః" ఇతి-'అపేన్ద్రి' ఇత్యాది హోమ మంత్ర పూర్వభాగము, ఆహ-చెప్పినది.

తాత్పర్యము: శత్రువులను పోఁగొట్టుటకై "అపేన్ద్రి" ఇత్యాది హోమమంత్ర పూర్వభాగము చెప్పినది. ద్విషదాది శత్రు త్రయముయొక్క మనస్సును పోఁగొట్టుచున్నానని ఆ మంత్రముయొక్క తాత్పర్యము.

7. అర్థము: "ప్రాణాయ త్వాఽపానాయ త్వా" ఇతి ఆహ-ప్రాణాయ త్వేత్యాదికమును చెప్పుటచే, (దధిగ్రహము), యజమానే-యజమానునందు, ప్రాణానేవ-ప్రాణములనే, దధాతి-స్థాపించుచున్నది.

తాత్పర్యము: "ప్రాణాయ త్వా" ఇత్యాదికము చెప్పుటచే, దధిగ్రహము యజమానునియందు ప్రాణములనే స్థాపించుచున్నదని భావము.

8. అర్థము: ప్రజాపతిః-ప్రజాపతి, సర్వాః దేవతాః-సర్వదేవతా స్వరూపుఁడు. (తతః-అందువలన, యజమానః-యజమానుఁడు), ఏనమ్-ఈ దధిగ్రహమును, సర్వాభ్యః దేవతాభ్యః ఏవ-సర్వ దేవతలకొఱకే, జుహోతి-హోమము చేయుచున్నాఁడు. ఇతి-అని, "తస్మై త్వా ప్రజాపతయే విభూదావ్నే జ్యోతిష్మతే జ్యోతిష్మన్తం జుహోమి" అను మంత్రము, ఆహ-చెప్పెను.

తాత్పర్యము: ఐశ్వర్యము నొసఁగువాఁడును, తేజస్వంతుఁడునగు ప్రజాపతికొఱకు తేజస్వంతమైన దధిగ్రహమును యజమానుఁడనైన నేను హోమము చేయుచున్నానని చెప్పుటచే, ప్రజాపతి సర్వదేవతా స్వరూపుఁడు కావున, ప్రజాపతికై చేసిన హోమము సర్వదేవతలకొఱకుఁ జేసిన ట్లగునని భావము.

9. అర్థము: తేజస్కామస్య-తేజస్సును కోరువానికి, ఆజ్యగ్రహమ్-ఆజ్యగ్రహమును, గృహ్ణీయాత్-గ్రహించవలెను. తేజో వా-తేజస్సే, ఆజ్యమ్-ఆజ్యము. ఏవం గృహీతే సతి-ఈ విధముగ గ్రహింపఁబడిన దగుచుండఁగా, తేజస్వ్యేవ-(యజమానుఁడు) తేజస్వంతుఁడే, భవతి-అగుచున్నాఁడు. బ్రహ్మవర్చసకామస్య-బ్రహ్మవర్చస్సును కోరువానికి, సోమగ్రహమ్-సోమ(రస)గ్రహమును, గృహ్ణీయాత్-గ్రహించవలెను. సోమః-సోమము, బ్రహ్మవర్చసం వై-బ్రహ్మవర్చస్స్వరూపమే. (తత్-ఆ కారణమువలన, సః-ఆ యజమానుఁడు,) బ్రహ్మవర్చసీ ఏవ-బ్రహ్మవర్చస్సు కలవాఁడే, భవతి-అగుచున్నాఁడు. పశుకామస్య-పశుకామునకు, దధిగ్రహమ్-దధిగ్రహమును, గృహ్ణీయాత్-గ్రహించవలెను. దధి-పెరుఁగు, ఊర్క్ వై-రసస్వరూపమే. పశవః-పశువులు, ఊర్క్-క్షీరాదిరసము నిచ్చునవి కావున రసస్వరూపములు. (అతః-ఈ కారణముచే, ఏషః-ఈ దధిగ్రహమును గ్రహించిన యధ్వర్యుఁడు,) అస్మై-ఈ యజమానునికొఱకు, ఊర్జైవ-రసస్వరూపమైన దధి గల దధిగ్రహముచేతనే, ఊర్జమ్-రసస్వరూపమైన, పశూన్-పశువులను, అవరున్ధే-సంపాదించుచున్నాఁడు.

తాత్పర్యము: అధ్వర్యుఁడు తేజస్కాముని నిమిత్తము ఆజ్యగ్రహమును, బ్రహ్మవర్చసకాముని నిమిత్తము సోమగ్రహమును, పశుకాముని నిమిత్తము దధిగ్రహమును గ్రహించవలెను. అప్పుడా తేజస్కాముఁడు తేజస్వంతుఁడు బ్రహ్మవర్చస కాముడు బ్రహ్మవర్చస్వంతుఁడు అగుదురు, దధి ఊర్క్స్వరూపము కావునను, పశువులు క్షీరాదిరసముల నిచ్చుటచే రసస్వరూపములు కావునను, దధిగ్రహమును గ్రహించిన అధ్వర్యుఁడు ఈ యజమానునికొఱకు పశువులను సంపాదించువాఁ డగును. (ఈ మంత్రమునందు కామ్యములైన మూఁడు గుణములు విధింపఁబడినవి.)

పవమానువాకము సమాప్తము.

---

## అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే దశమోఽనువాకః ।

మూలము: [1]త్వే క్రతుమపి వృఞ్జన్తి విశ్వే ద్విర్యదేతే త్రిర్భవన్త్యూమాః । స్వాదోః స్వాదీయః స్వాదునా సృజా సమత ఊ షు మధు మధునాఽభి యోధి । ఉపయామగృహీతోఽసి ప్రజాపతయే త్వా జుష్టం గృహ్ణామ్యేష తే యోనిః ప్రజాపతయే త్వా । [2]ప్రాణగ్రహాన్గృహ్ణాత్యేతావద్వా అస్తి యావదేతే గ్రహాః స్తోమాశ్ఛన్దాగ్ంసి పృష్ఠాని దిశో యావదేవాస్తి తత్ (౧) అవరున్ధే [3]జ్యేష్ఠా వా ఏతాన్బ్రాహ్మణాః పురా విదామక్రన్తస్మాత్తేషాగ్ం సర్వా దిశోఽభిజితా అభూవన్యస్యైతే గృహ్యన్తే జ్యైష్ఠ్యమేవ గచ్ఛత్యభి దిశో జయతి [4]పఞ్చ గృహ్యన్తే పఞ్చ దిశః సర్వాస్వేవ దిక్ష్వృధ్నువన్తి [5]నవనవ గృహ్యన్తే నవ వై పురుషే ప్రాణాః ప్రాణానేవ యజమానేషు దధతి [6]ప్రాయణీయే చోదయనీయే చ గృహ్యన్తే ప్రాణా వై ప్రాణగ్రహాః (౨) ప్రాణైరేవ ప్రయన్తి ప్రాణైరుద్యన్తి [7]దశమేఽహన్గృహ్యన్తే ప్రాణా వై ప్రాణగ్రహాః ప్రాణేభ్యః ఖలు వా ఏతత్ప్రజా యన్తి యద్వామదేవ్యం యోనేశ్చ్యవతే దశమేఽహన్వామదేవ్యం యోనేశ్చ్యవతే యద్దశమేఽహన్గృహ్యన్తే ప్రాణేభ్య ఏవ తత్ప్రజా న యన్తి ॥ ౩ ॥

(తత్ప్రాణగ్రహాః సప్తత్రిగ్ంశచ్చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమ ప్రపాఠకే దశమోఽనువాకః ॥

## వేదార్థదీపిక

**అవతారిక:** **నవమానువాకమునందు వషడ్గ్రహావిధి చెప్పబడినది. ఈ దశమానువాకమునందు గవామయనమునందలి ఆతిగ్రాహ్యములు, ప్రాణగ్రహములును చెప్పబడుచున్నవి.**

1. అర్థము: (హే అతిగ్రాహ్య!-ఓ అతిగ్రాహ్య గ్రహమా!) త్వే-నీయందు, క్రతుమపి-సర్వక్రతువును, వృఞ్జన్తి=సమాప్తి చేయుచున్నారు. యత్=ఏ కారణమువలన, ద్విః త్రిః-(రెండు మూఁడు మారులు కలసి) ఐదు పాత్రములందు, ఏతే విశ్వే-ఈ రసము లన్నియు, ఊమాః=రక్షకములు, భవన్తి-అగుచున్నవో, (అతః-ఈ కారణమువలన, త్వమపి-నీవు కూడ), స్వాదోః=స్వాదువుకంటెను, స్వాదీయః-మిక్కిలి స్వాదుత్వము, (యథా భవేత్-ఎట్లు అగునో, తథా=ఆ విధముగా), స్వాదునా-స్వాదుత్వముతో, సంసృజా-సంసర్గము చేయుము. అత ఊషు-ఇంతకంటెను సుష్ఠుగా అగునట్లుగా, మధు-మధువుయొక్క భాగమును, మధునా-మధువుయొక్క భాగముతో, అభియోధి-కలుపుము. (హే మధురస!-ఓ మధురసమా!, త్వమ్-నీవు), ఉపయామ గృహీతః-పార్థివ పాత్రముచే గ్రహింపఁబడినదానవు, అసి-అగుచున్నావు. ప్రజాపతయే-ప్రజాపతికొఱకు. జుష్టమ్-ప్రియమైన, త్వా=నిన్ను, (మధ్యమ పాత్రే-మధ్యమ పాత్రమునందు), గృహ్ణామి=గ్రహించుచున్నాను. ఏషః=ఈ ఖరప్రదేశము, తే-నీకు, యోనిః=స్థానము. త్వా-నిన్ను, ప్రజాపతయే-ప్రజాపతికొఱకు, (సాదయామి-ఉంచుచున్నాను.)

తాత్పర్యము: ఓ అతిగ్రాహ్యగ్రహమా! అయిదు పాత్రములందు గ్రహింపఁబడిన రసము లన్నియు రక్షకము లగుచున్నవి. కావున ఋత్విజులు నీయందు క్రతువును సమాప్తి చేయుచున్నారు. కావున నీవు కూడ ఈ రసమును స్వాదువు కంటెను స్వాదు వగునట్లుగాఁ జేయుము. ఇంతకంటెను సుష్ఠుగా నుండునట్లు ఒక మధువుయొక్క భాగమును మఱియొక మధువుయొక్క భాగముతోఁ గలుపుము. (ఓ మధురసమా! నీవు) పార్థివపాత్రముచే గ్రహింపఁబడినదానవు అగుచున్నావు. ప్రజాపతికి ఇష్టమైన దానవును, ఇతర పాత్రములనుండి తీసికొని రాఁబడిన దానవు నగు నిన్ను మధ్యమ పాత్రమునందు గ్రహించుచున్నాను. (ఇంతవఱ కిది గ్రహణ మంత్రము). ఈ ఖరప్రదేశము నీకు స్థానము. ప్రజాపతికొఱకు ని న్నీ ఖరప్రదేశమునం దుంచుచున్నాను. (ఇది సాదనమంత్రము. అతిగ్రాహ్యాయతనమునందు నాలుగు దిక్కులందు నాలుగు పాత్రముల నుంచి మధ్యమందు ఐదవ పాత్రము నుంచి, అయిదు పాత్రములందు ఆ యా మంత్రములచే గ్రహణ సాదనము లను చెప్పి, ఆ పాత్రములందలి రసములను ఐదవపాత్రములోఁ బోయుచు "త్వే క్రతుమపి" అనెడి యీ మంత్రమును పఠించవలెను.)

2. అర్థము: ప్రాణగ్రహాన్-సోమోన్మాన విశేషములైన ప్రాణగ్రహములను, గృహ్ణాతి=గ్రహించవలెను. ఏతే గ్రహా, ఇతి యావత్-ఈ గ్రహము లెన్ని కలవో, ఏతావత్ వా-ఈ మాత్రము, (అపేక్షితమ్-అపేక్షింపఁబడినది), అస్తి-కలదు. స్తోమాః-త్రివృత్, పంచదశాది స్తోమములు, ఛన్దాంసి=గాయత్ర్యాది ఛందస్సులు, పృష్ఠాని=మాధ్యందిన పవమానానంతర భావులగు స్తోత్రములు, దిశః=ప్రాచ్యాది దిక్కులు, ఇత్యేతాదృశమ్=ఇటు వంటిది, యావదేవ అస్తి-ఎంత అపేక్షిత మైనది కలదో, తత్=దానినంతటిని, (యజమానః-యజమానుఁడు), అవరున్ధే-పొందుచున్నాఁడు.

తాత్పర్యము: "వాయురసి ప్రాణః" ఇత్యాది ప్రాణమంత్రములచే సోమోన్మానరూప గ్రహములు చెప్పఁబడినవి. వానికే ప్రాణగ్రహము లని పేరు. ఈ ప్రాణ గ్రహములు ఏవి కలవో, ఇవి యపేక్షితము లైనవి. యజమానుఁడు ఈ సోమోన్మాన రూపములైన ప్రాణగ్రహములచే త్రివృదాది స్తోమములను, గాయత్ర్యాది ఛందస్సులను, మాధ్యందిన పవమానానంతర భావులగు స్తోత్రములను, ప్రాచ్యాది దిక్కులను, అపేక్షితమైన సర్వమును, పొందును. ఈ మంత్రముచే సోమోన్మానరూప గ్రహముల గ్రహణము విధింపఁబడినది. సోమమును కొలుచునట్టి గ్రహములు (పాత్రములు) సోమోన్మాన గ్రహములు. అవి "వాయురసి ప్రాణః" ఇత్యాది ప్రాణమంత్రముచేఁ జెప్పఁబడినవి. కావున ప్రాణగ్రహము లని వ్యవహరింపఁబడుచున్నవి.

3. అర్థము: పురా-పూర్వము. బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, ఏతాన్-ఈ ప్రాణగ్రహములను, విదామక్రన్-గ్రహించిరి. తస్మాత్-అందువలన, తే-వారు, జ్యేష్ఠాః=ప్రశస్తులు. (చ-మఱియు), తేషామ్-వారికి, సర్వాః దిశః-సర్వదిక్కులు, అభిజితాః-జయింపఁబడినవి, అభూవన్-అయినవి. యస్య-ఏ యజమానునకు, ఏతే-ఈ ప్రాణగ్రహములు, గృహ్యన్తే=గ్రహించఁబడుచున్నవో, (సః-ఆ యజమానుఁడు), జ్యైష్ఠ్యమేవ-ప్రాశస్త్యమునే, గచ్ఛతి-పొందుచున్నాఁడు. దిశః-దిక్కులను, అభిజయతి-అంతటను జయించుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వము ఈ ప్రాణగ్రహములను గ్రహించిన బ్రాహ్మణులు జ్యేష్ఠులై సర్వదిక్కులను జయించిరి. ఎవని నిమిత్తము ఈ ప్రాణగ్రహములు గ్రహింపఁబడునో, అతఁడు తప్పక ప్రాశస్త్యమునే పొందును. మఱియు సర్వదిక్కులను స్వాధీనము చేసికొనును. ఈ మంత్రమునందు ప్రాణగ్రహములు ప్రశంసింపఁబడినవి.

4. అర్థము: ప్రాణగ్రహాః–ప్రాణగ్రహములు, పఞ్చ–అయిదు పర్యాయములు, గృహ్యన్తే–గ్రహింపఁబడుచున్నవి. (గ్రహించవలెనని విధి). దిశః–దిక్కులు, పఞ్చ–అయిదు. (ఈ పంచవిధ గ్రహణముచే యజమానులు) సర్వాసు దిక్షు ఏవ–సర్వదిక్కులందే, ఋధ్నువన్తి–వృద్ధి నొందుచున్నారు.

తాత్పర్యము: ప్రాణగ్రహములను ఐదు పర్యాయములు గ్రహించవలెను "[1]అయం పురోభువః" అను మంత్రముచే ప్రథమ పర్యాయము ప్రాణగ్రహములను గ్రహించవలెను. ఇట్లే వరుసగా "[2]అయం దక్షిణా విశ్వకర్మా" "[3]అయం పశ్చాద్విశ్వవ్యచాః" "[4]ఇదముత్తరాత్సువః" "[5]ఇయ ముపరి మతిః" ఈ మంత్రములచే ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ పర్యాయములు గ్రహించవలెను. ప్రాచ్యాద్యూర్ధ్వాంత దిక్కులు అయిదు. కావున పంచవిధముగ గ్రహించఁబడుటచే యజమానులు సర్వదిక్కులందు వృద్ధి నొందుదురు. (ప్రాణగ్రహ గ్రహణపర్యాయ సంఖ్య ఇచట విధింపఁబడినది.)

5. అర్థము: (ఏకైకస్మిన్ పర్యాయే–ఒక్కొక్క పర్యాయము ప్రాణగ్రహమును గ్రహించినపుడు), నవనవ–తొమ్మిది తొమ్మిది చొప్పున సోమాంశువులు, గృహ్యన్తే–గ్రహించఁబడుచున్నవి. (గ్రహించవలెను). పురుషే–పురుషునియందు, ప్రాణాః–ప్రాణములు, నవ వై–తొమ్మిదియే. (నవ చ్ఛిద్రములందు సంచరించునవి అని యర్థము. ఏవం కృతే సతి–ఇట్లు చేయఁబడఁగా, అధ్వర్యవః–అధ్వర్యులు), యజమానేషు–యజమానులందు, ప్రాణానేవ–ప్రాణములనే, దధతి–స్థాపించుచున్నారు.

తాత్పర్యము: ప్రాణగ్రహములను అయిదు పర్యాయములు గ్రహించినపుడు ఒక్కొక్క పర్యాయము నవసంఖ్యాకముగ సోమాంశువులను గ్రహించవలెను. మానవుని శిరోభాగమునందలి సప్తచ్ఛిద్రములందు, అధోభాగస్థ ఛిద్రముల రెండింటియందు ప్రాణములు సంచరించుచుండును. కావున ఇట్లు చేసిన అధ్వర్యులు యజమానులందు ప్రాణములనే స్థాపించినవా రగుదురు. (ఒక్కొక్క పర్యాయము గ్రహింపఁదగిన సోమాంశుసంఖ్య ఇచట విధింపఁబడినది.)

6. అర్థము: ప్రాయణీయే చ–ప్రాయణీయాహస్సునందును, ఉదయనీయే చ–ఉదయనీయాహస్సునందును, ప్రాణాః–ప్రాణగ్రహములు, గృహ్యన్తే–గ్రహింపఁబడవలెను. ప్రాణగ్రహాః–ప్రాణగ్రహములు, ప్రాణాః వై–ప్రాణరూపములే. (తథా సతి–అట్లు కాఁగా, యజమానాః–యజమానులు), ప్రాణైరేవ–ప్రాణములచేతనే, ప్రయన్తి–(సంవత్సర క్రతువును) ప్రారంభించినవా రగుచున్నారు. ప్రాణైః–ప్రాణములచే, ఉద్యన్తి–సమాప్తి చేయుచున్నవా రగుచున్నారు.

తాత్పర్యము: సంవత్సర క్రతువుయొక్క ప్రథమాహస్సు ప్రాయణీయ మనియు, చరమాహస్సు ఉదయనీయ మనియు వ్యవహారము. ప్రాణగ్రహములను ఆ రెండు అహస్సులందు గ్రహించవలెను. ప్రాణగ్రహములు ప్రాణరూపములే కావున సంవత్సరసత్ర కర్తలు ఇట్లు చేయఁగా ప్రాణములచేతనే సంవత్సరక్రతువును ప్రారంభించిన వారును, ప్రాణములచేతనే సమాప్తి చేసినవారును అగుదురు. (ఇచట ప్రాణగ్రహ గ్రహణ కాలము విధింపఁబడినది.)

7. అర్థము: దశమే అహని–సంవత్సర క్రతువునకు ప్రకృతియైన ద్వాదశాహ క్రతువుయొక్క దశమాహస్సునందు, గృహ్యన్తే–ప్రాణగ్రహములు గ్రహింపఁబడవలెను. ప్రాణగ్రహాః–ప్రాణగ్రహములు, ప్రాణాః వై–ప్రాణస్వరూపములే. వామదేవ్యమ్–వామదేవ్య మనెడి సామము, యోనేః–స్వీయ స్థానమునుండి, చ్యవతే యత్–చ్యుత మగుచున్న దనుట యేది కలదో, ఏతత్–దీనివలన, ప్రజాః–ప్రజలు, ప్రాణేభ్యః–ప్రాణములనుండి, యన్తి ఖలు వా–విడిపోవుచున్నారు కదా! దశమే అహని–దశమాహస్సునందు, వామదేవ్యమ్–వామదేవ్య

సామము, యోనేః-స్వీయ స్థానమునుండి, చ్యవతే=చ్యుత మగుచున్నది. దశమే అహని-దశమాహస్సునందు, గృహ్యన్తే యత్-ప్రాణగ్రహములు గ్రహింపఁబడినచో, తత్-అప్పుడు, ప్రజాః-ప్రజలు, ప్రాణేభ్యః-ప్రాణములనుండి, న యన్తి ఏవ-తొలఁగిపోవుటయే లేదు.

**తాత్పర్యము:** సంవత్సర సత్రము ద్వాదశాహక్రతువునకు వికృతి కావున, 'ప్రకృతివత్ వికృతిః కర్తవ్యా' కనుక ద్వాదశాహ క్రతు సంబంధములైన అహస్సులను వికృతియైన సంవత్సర క్రతువునందు ప్రయోగింపవలెను. ఆ ద్వాదశాహస్సులలో దశమాహస్సునందు ప్రాణగ్రహములను గ్రహింపవలెను. వామదేవ్య సామమునకు "కయానశ్చిత్ర ఆభువత్" అను ఋక్కు యోని. దశమాహస్సునందు ఆ ఋక్కును విడిచి మఱియొక ఋక్కునందు వామదేవ్య సామము గానము చేయఁబడుచున్నది. అప్పుడు వామదేవ్య సామము స్వీయ యోనినుండి చ్యుత మగుచున్నది. ఈ అపరాధముచేత ప్రజలు ప్రాణములనుండి తొలఁగిపోవుదురు. ప్రాణగ్రహములు ప్రాణరూపములు కావున, ఆ ప్రాణగ్రహములు దశమాహస్సునందు గ్రహింపఁబడినచో ప్రజలు ప్రాణములనుండి తొలఁగిపోరు. (ఈ మంత్రము ప్రాణగ్రహ గ్రహణమునకు కాలాంతరమును విధించినది.)

దశమానువాకము సమాప్తము.

## అథ తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠక ఏకాదశోఽనువాకః।

మూలము: [1]ప్ర దేవం దేవ్యా ధియా భరతా జాతవేదసమ్। హవ్యా నో వక్షదానుషక్। [2]అయము ష్య ప్ర దేవయు ర్హోతా యజ్ఞాయ నీయతే।రథో న యోరభీవృతో ఘృణీవా న్చేతతి త్మనా। [3]అయమగ్ని రురుష్యత్యమృతాదివ జన్మనః। సహసశ్చి త్సహీయాన్దేవో జీవాతవే కృతః। [4]ఇడాయా స్త్వా పదే వయం నాభా పృథివ్యా అధి। జాతవేదో ని ధీమహ్యగ్నే హవ్యాయ వోఢవే (౧) [5]అగ్నే విశ్వేభిః స్వనీక దేవై రూర్ణావన్తం ప్రథమః సీద యోనిమ్। కులాయినం ఘృతవన్తగ్ం సవిత్రే యజ్ఞం నయ యజమానాయ సాధు। [6]సీద హోతః స్వ ఉ లోకే చికిత్వాన్త్సాదయా యజ్ఞగ్ం సుకృతస్య యోనౌ। దేవావీర్దేవా న్హవిషా యజాస్యగ్నే బృహ ద్యజమానే వయో ధాః। [7]ని హోతా హోతృషదనే విదాన స్త్వేషో దీదివాగ్ం అసదత్సుదక్షః। అదబ్ధవ్రతప్రమతి ర్వసిష్ఠః సహస్రంభరః శుచిజిహ్వో అగ్నిః। [8]త్వం దూత స్త్వమ్ (౨) ఉ నః పరస్పా స్త్వం వస్య ఆ వృషభ ప్రణేతా। అగ్నే తోకస్య న స్తనే తనూనా మప్రయుచ్ఛ న్దీద్యద్బోధి గోపాః। [9]అభి త్వా దేవ సవితరీశానం వార్యాణామ్। సదాఽవన్భాగ మీమహే। [10]మహీ ద్యౌః పృథివీ చ న ఇమం యజ్ఞం మిమిక్షతామ్। పిపృతాం నో భరీమభిః। [11]త్వామగ్నే పుష్కరాదధ్యథర్వా నిరమన్థత మూర్ధ్నో విశ్వస్య వాఘతః। [12]తము (౩) త్వా దధ్యఙ్ఙృషిః పుత్ర ఈధే అథర్వణః। వృత్రహణం పురందరమ్। [13]తము త్వా పాథ్యో వృషా సమీధే దస్యుహన్తమమ్। ధనంజయగ్ం రణేరణే। [14]ఉత బ్రువన్తు జన్తవ ఉదగ్ని ర్వృత్రహాఽజని। ధనంజయో

రజేరణే। [15]ఆ యగ్ం హస్తే న ఖాదినగ్ం శిశుం జాతం న బిభ్రతి। విశామగ్నిగ్ం స్వధ్వరమ్।
[16]ప్ర దేవం దేవవీతయే భరతా వసువిత్తమమ్। ఆ స్వే యోనౌ నిషీదతు। [17]ఆ (V)జాతం జాత
వేదసి ప్రియగ్ం శిశీతాతిథిమ్। స్యోన ఆ గృహపతిమ్। [18]అగ్నినాఽగ్నిః సమిధ్యతే కవిర్గృహ
పతి ర్యువా। హవ్యవా డ్జుహ్వాస్యః। [19]త్వగ్ంహ్యగ్నే అగ్నినా విప్రో విప్రేణ సన్త్సతా। సఖా
సఖ్యా సమిధ్యసే। [20]తం మర్జయన్త సుక్రతుం పురోయావాన మాజిషు। స్వేషు క్షయేషు
వాజినమ్। [21]యజ్ఞేన యజ్ఞ మయజన్త దేవాస్తాని ధర్మాణి ప్రథమాన్యాసన్। తే హ నాకం
మహిమానః సచన్తే యత్ర పూర్వే సాధ్యాః సన్తి దేవాః (౩)॥
(వోఢవే దూతస్త్వం తము సీదత్వా యత్ర చత్వారి చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం పఞ్చమ ప్రపాఠక ఏకాదశోఽనువాకః।

పూర్ణదర్శయోఽగ్నినా దేవేన యే దేవాః సూర్యః సం త్వా వషట్కారః స ఖదిర ఉపయామ
గృహీతోఽసి యాం వై త్వే క్రతుం ప్ర దేవమేకాదశ ॥౧౧॥
పూర్ణా సహజాగ్ంస్తవాగ్నే వామీః ప్రాణై రేవ షట్త్రిగ్ంశత్ ॥౩౬॥

హరిః ఓమ్।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకే పఞ్చమః ప్రపాఠకః ॥౫॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం తృతీయాష్టకః ॥౩॥

## వేదార్థదీపిక

అవతారికః దశమానువాకమునందు అతిగ్రాహ్య ప్రాణనామక గ్రహములు చెప్పఁబడినవి. ఈ యేకాదశానువాకమునందు పాఠక హౌత్రోపయోగి మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: (హే ఋత్విగ్యజమానాః–ఓ ఋత్విగ్యజమానులారా! యూయమ్–మీరు), జాతవేదసమ్–జాతవేద సముత్పన్నమైన జగత్తును తెలిసినవాఁడగు, దేవమ్–దేవుని, దేవ్యా–ప్రకాశరూపమైన, ధియా–బుద్ధితో, ప్రభరతా–ప్రకర్షగా పోషింపుఁడు. (సః అపి–ఆ జాతవేదుఁడు కూడ), అనుషక్–అనుగ్రహ యుక్తుఁడై, నః–మన యొక్క, హవ్యా(ని)–హవిస్సులను, వక్షత్–వహించుఁగాక.

తాత్పర్యము: ఓ ఋత్విగ్యజమానులారా! జాతమైన సర్వజగత్తును తెలిసిన అగ్నిహోత్రుని మీరు వివేకయుక్తమైన బుద్ధితో సేవింపుఁడు. ఆ యగ్నిదేవుఁడు కూడ మనయొక్క హవిస్సులను వహించుఁగాక. (జాతం వేత్తీతి, జాతవేదాః–పుట్టిన శుభాశుభములను, లేక జగత్తు నెఱుంగువాఁడు అగ్నిదేవుఁడు. పాశుక హౌత్రోపయోగి మంత్రములలో నిది ప్రథమ మంత్రము. 'హోత' యను ఋత్విజుఁడు అధ్వర్యుయజమానులను సంబోధించి పై విధముగ పలుకును. ఇఁకముందుఁ జెప్పఁబోవు మంత్రములు కూఁడ హోత చెప్పునవియే.)

2. అర్థము: దేవయుః–తనకు దేవతలను కోరువాఁడును, హోతా–హోమ నిష్పాదకుఁడును, రథో న యోః–రథమువలె పృథక్కర్తయు, అభీవృతః–యజమానులచే అభిముఖముగ స్వీకరింపఁబడువాఁడును, ఘృణీవాన్–కిరణ (కాంతి)యుక్తుఁడును అగు, అయం స్యః ఉ–ఈ ఆ యగ్నియే, యజ్ఞాయ–యజ్ఞముకొఱకు, ప్రణీయతే–(ఉత్తరవేదిని గూర్చి) ప్రకర్షగా తీసికొనిపోఁబడుచున్నాఁడు. (తాదృశః–అటువంటి అగ్ని,) త్మనా–స్వయముగనే, చేతతి–యజమానభక్తిని దెలిసికొనుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వోక్త మంత్రమునఁ జెప్పఁబడిన ఆ యగ్నిదేవుఁడే యజ్ఞముకొఱకు ఉత్తరవేదియొద్దకుఁ దీసికొనిపోఁబడుచున్నాఁడు. ఈ యగ్నిదేవుఁడు తనకు దేవతలను కోరుచున్నవాఁడు. హోమ నిష్పాదకుఁడు. రథము తన్నధిష్ఠించిన వానిని భూమియందున్నవారినుండి వేఱుచేసి గ్రామమునందు తీసికొనిపోవువిధముగ ఈ యగ్ని కూడ తనయందు హోమము చేయఁబడిన హవిస్సును ఇతర హవిస్సులనుండి వేఱు చేసి దేవతలయొద్దకు తీసికొనిపోవువాఁడు. యజమాను లీ యగ్ని నభిముఖముగ స్వీకరింతురు. ఇతఁడు కాంతిమంతుఁడు. అటువంటి ఈ యగ్నిదేవుఁడు స్వయముగనే యజమానుని భక్తిని తెలిసికొనుచున్నాఁడు. (ఇది ద్వితీయ మంత్రము).

3. అర్థము: అయమ్ అగ్నిః–ఉత్తరవేదియొద్దకు తీసికొనిపోఁబడుచున్న యీ యగ్ని, జన్మనః–పుట్టుక మాత్రమువలననే, అమృతాదివ–అమృతమువలనవలె, ఉరుష్యతి–ప్రబుద్ధుఁ డగుటకు కోరుచున్నాఁడు. (కించ–మఱియు, అయమ్–ఈ), దేవః–అగ్నిదేవుఁడు, జీవాతవే–జీవనౌషధముకొఱకు, సహసశ్చిత్–బలవంతుఁడైనను, సహీయాన్ కృతః–మిక్కిలి బలవంతుఁడుగాఁ జేయఁబడినాఁడు.

తాత్పర్యము: ఉత్తరవేదియొద్దకు తీసికొనిపోఁబడుచున్న ఈ యగ్ని జన్మమాత్రముచేతనే అమృతము త్రాగుటవలన మరణ రహితుఁడగు విధముగ ప్రబుద్ధుఁ డగుటకు కోరుచున్నాఁడు. మఱియు ఈ యగ్నిదేవుఁడు జీవనౌషధము కొఱకు బలవంతుఁడైనను అతిప్రబలుఁడుగాఁ జేయఁబడెను. (ఈ యగ్ని ప్రబలుఁడైనప్పుడు తాను వినాశ రహితుఁడై యజమానుని గూడ యజ్ఞనిష్పాదనముచేత జీవింపఁజేయుచున్నాఁడని భావము. ఇది తృతీయ మంత్రము).

4. అర్థము: హే జాతవేదః అగ్నే!–ఉత్పన్నమైన సర్వము నెఱింగిన ఓ యగ్నిదేవా!, త్వా–నిన్ను, పృథివ్యాః–భూమికి పైభాగమున, ఇడాయాః పదే–గోరూపమైన ఇడయొక్క పదసదృశమైన, నాభా–నాభిసదృశమైన ఆహవనీయస్థానమునందు, హవ్యాయ వోఢవే–హవిస్సును వహించుటకై, వయమ్–మేము, నిధీమహి–గట్టిగా స్థాపించుచున్నాము.

తాత్పర్యము: ఓ జాతవేదాగ్నీ! భూమికి పైభాగమున గోరూపమైన యిడాదేవియొక్క పదమువంటిదియగు నాభిసదృశమైన ఆహవనీయ స్థానమునందు హవిస్సును వహించుటకై మేము నిన్ను గట్టిగ స్థాపించుచున్నాము. (ఇది చతుర్థ మంత్రము. గోరూపమైన యిడయొక్క పాదము ఘృతయుక్తమైన విధముగ ఈ ఆహవనీయ స్థానము ఘృతాహుతి యుక్తమయినదని భావము.)

5. అర్థము: విశ్వేభిః దేవైః–సర్వదేవతలచేత, స్వనీకః అగ్నే!–మంచి సేన కలవాఁడవైన ఓ యగ్నీ!, ఊర్ణావ స్తమ్–కంబలము వలె మార్దవము కలదియు, కులాయినమ్–పక్షినిర్మితమైన గూఁడువలె బాగుగ నిర్మింపఁబడినదియు,

ఘృతవత్తమ్-ఆజ్యాహుతి కాధారమైనదియునగు, యోనిమ్-ఆహవనీయ మనెడి స్థానమును, ప్రథమః-దేవతలలో ముఖ్యుఁడవైన, (త్వమ్-నీవు), సీద-పొందుము. (అపి చ-మఱియు), సవిత్రే-యజ్ఞము ననుష్ఠించు యజమానునికొఱకు, యజ్ఞమ్-యజ్ఞమును, సాధు-బాగుగ, నయ-సమాప్తి నొందించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు సర్వదేవతలు సేనలుగాఁ గలవాఁడవు. దేవతలలో ముఖ్యుఁడవు. అటువంటి నీవు ఆహవనీయ స్థానమును పొందుము. కంబలాస్తరణోపేతమైన ప్రదేశము మృదువుగానుండి సేవ్య మైనవిధముగ ఈ ఆహవనీయస్థానము కూడ సేవ్య మైనది. పక్షులు నిర్మించుకొనిన గూఁడు బాగుగ నుండువిధముగ ఈ అహవనీయము కూడ బాగుగ నిర్మిత మైనది. మఱియు నిది ఆజ్యాహుతి కాధార మైనది. యజ్ఞము ననుష్ఠించు యజమానునికొఱకు యజ్ఞమును బాగుగ సమాప్తి నొందించుము. (ఇది పంచమ మంత్రము).

6. అర్థము: హే హోతః-హోమ నిష్పాదకుఁడవైన ఓ యగ్నీ!, చికిత్వాన్-అభిజ్ఞుఁడవైన, (త్వమ్-నీవు), స్వే ఉ లోకే-స్వకీయ స్థానమైన ఉత్తరవేదియందు, సీద-కూర్చుండుము. యజ్ఞమ్-(ఈ)యజ్ఞమును, సుకృతస్య యోనౌ-పుణ్యకర్మకు యోగ్యమైన స్థానమునందు, సాదయ-స్థాపించుము. దేవావీః-దేవతలను కోరుచున్న (దేవప్రియుఁడవైన) నీవు, దేవాన్-దేవతలను, హవిషా-హవిస్సుచే, యజాసి-పూజించుచున్నావు. (హే అగ్నే!-ఓ యగ్నీ!, త్వమ్-నీవు), యజమానే-యజమానునందు, బృహత్ వయః-దీర్ఘాయువును, ధాః-స్థాపించుము.

తాత్పర్యము: హోమ నిష్పాదకుఁడవైన ఓ యగ్నీ! అభిజ్ఞుఁడవైన నీవు ఉత్తరవేదిరూప స్వకీయ స్థానమునందు కూర్చుండుము. ఈ యజ్ఞమును పుణ్యకర్మకు యోగ్యమైన స్థానమునందు స్థాపించుము. దేవప్రియుఁడవైన నీవు దేవతలను హవిస్సుచే పూజించుచున్నావు. ఓ యగ్నీ! నీవు యజమానుని దీర్ఘాయుష్మంతునిగాఁ జేయుము. (దేవాన్ వేతి-కామయతే ఇతి దేవావీః-దేవప్రియః ఇత్యర్థః. ఇది షష్ఠ మంత్రము.)

7. అర్థము: హోతా-దేవతల నాహ్వానించువాఁడును, విదానః-స్థానమును గుర్తెఱిఁగినవాఁడును, త్వేషః-దీప్తిమంతుఁడును, దిదివాన్-దేవతలకు హవిస్సు నొసఁగువాఁడును, సుదక్షః-అత్యంత కుశలుఁడును, అదబ్ధవ్రతప్రమతిః-హింసితము కాని కర్మయందు ప్రకృష్టమతి కలవాఁడును, వసిష్ఠః-అతిశయముగ వసింపఁజేయువాఁడును, సహస్రంభరః-సహస్ర సంఖ్యాకములైన హవిస్సులను పోషించువాఁడును, శుచిజిహ్వః-(హోమయోగ్యములైన) శుద్ధములైన జ్వాలారూపములైన నాలుకలు కలవాఁడునునగు, అగ్నిః-(ఈ)అగ్ని, హోతృషదనే-హోమనిష్పాదకాగ్నికి ఉత్తరవేదిరూప యోగ్యమైన స్థానమునందు, న్యసదత్-బాగుగా కూర్చుండెను.

తాత్పర్యము: ఈ యగ్ని ఉత్తరవేది యనెడి యోగ్యస్థానమునందు బాగుగ కూర్చుండెను. ఈ యగ్ని దేవతల నాహ్వానించువాఁడు. తనస్థానము నెఱిఁగినవాఁడు. కాంతి గలవాఁడు. దేవతలకు హవిస్సు నొసఁగువాఁడు. మిక్కిలి నేర్పరి. కర్మ హింసితము కాకుండ ప్రకృష్టమైన మతితో పరిశీలించువాఁడు. అతిశయముగ వసింపఁజేయువాఁడు. సహస్ర సంఖ్యాకముగ హవిస్సులను భరించు (పోషించు) వాఁడు. హోమయోగ్యములైన పరిశుద్ధ జ్వాలారూప జిహ్వలు కలవాఁడు. (ఇది సప్తమ మంత్రము.)

8. అర్థము: హే అగ్నే!-ఓ యగ్నీ!, త్వమ్-నీవు, దూతః-దేవతలకు దూతవు, (అసి-అగుచున్నావు.) త్వము-నీవే, నః-మాకు, పరస్పాః-అత్యంతపాలకుఁడవు. త్వమ్-నీవు, వస్యః-ఈ కర్మయందు నివాసయోగ్యుఁడవు. హే వృషభ!-ఓ దేవశ్రేష్ఠా!, (త్వమేవ-నీవే), ఆప్రణేతా-వచ్చి యాగమును ప్రవర్తింపఁజేయువాఁడవు. నః-మాయొక్క, తోకస్య-సంతానముయొక్క, తనూనాం తనే-శరీరములయొక్క విస్తారమునందు, అప్రయుచ్ఛన్-ప్రమాదమును చేయనివాఁడవై, దీద్యత్-(తమస్సును పోఁగొట్టుటచే ప్రకాశింపఁజేయుచు, లేదా-) దేవతలకు హవిస్సు నిచ్చుచున్నవాఁడ వగుచు, గోపాః-పాలకుఁడవై, బోధి-అప్రమత్తుఁడ వగుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! ("అగ్నిర్దేవానాం దూత ఆసీత్" అను శ్రుత్యంతరము ననుసరించి) నీవు దేవతలకు దూతవు. నీవే మమ్ము అతిశయముగ పాలించువాఁడవు. నీ వీ కర్మయం దుండుటకు యోగ్యుఁడవు. ఓ దేవశ్రేష్ఠా! నీవే వచ్చి మా యీ యాగమును ప్రవర్తింపఁజేయుము. మా సంతానముయొక్క శరీరములు విస్తరించుట

యందు ప్రమాదమును చేయనివాఁడవై దేవతలకు హవిస్సు నిచ్చుచు, పాలకుఁడ వగుచును, అప్రమత్తుఁడవై యుండుము. (ఇది అష్టమ మంత్రము. ఉత్తరవేదియొద్దకు అగ్నిని తెచ్చునపుడు హోత ఈ యెనిమిది మంత్రములను పఠించవలెను.)

9. అర్థము: హే సవితః దేవః—ప్రేరకుఁడవైన ఓ పరమేశ్వరా! ,వార్యాణామ్=నివారింపఁదగిన విఘ్నములయొక్క, (వినివారణే—విశేషముగ నివారించుటయందు) ఈశానమ్—సమర్థుఁడవైన, త్వా=నిన్ను, అభి(ప్రాప్తుమ్)=అంతటను పొందుటకు, హే సదాఅవన్!—సర్వదా రక్షకుఁడవైన ఓ దేవా!, భాగమ్—సేవింపఁదగిన (భజనీయ మిత్యర్థః) అగ్నిని, ఈమహే—(నీ యనుగ్రహమువలన) పొందుచున్నాము.

తాత్పర్యము: (అగ్నిని మథించు సమయమున ఈ మంత్రము మొదలు ఐదు మంత్రములను పఠించవలెను.) ప్రేరకుఁడవైన ఓ పరమేశ్వరా! నివారింపఁదగిన విఘ్నములను నివారించుటయందు సమర్థుఁడవైన నిన్ను పొందుటకు, సర్వదా రక్షకుఁడవైన ఓ పరమేశ్వరా! సేవింపఁదగిన అగ్నిదేవుని నీ యనుగ్రహమువలన పొందుచున్నాము. (ఇది ప్రథమ మంత్రము).

10. అర్థము: మహీ=గొప్పదియైన, ద్యౌః—దివి, పృథివీ చ—భూమియు, నః—మాయొక్క, ఇమం యజ్ఞమ్—ఈ యజ్ఞమును, మిమిక్షతామ్—(ఆజ్యాది హోమ ద్రవ్యములచే) తడుపుటకు ఇచ్ఛయించుఁగాక. నః—మమ్ము, భరీమభిః=భరణములచే (పోషణములచే), పిపృతామ్—పూరించుఁగాక.

తాత్పర్యము: గొప్పవియగు, ద్యావాపృథువులు మా యీ యజ్ఞమును ఆజ్యాది హోమద్రవ్యములచే తడుపుటకు ఇచ్ఛయించుఁగాక. పోషణములచే మమ్ముఁ బూరించుఁగాక. (ఇది ద్వితీయ మంత్రము.)

11. అర్థము: హే అగ్నే!—ఓ యగ్నీ!, అథర్వా—అథర్వుఁడను ఋషి, త్వామ్—నిన్ను, మూర్ధ్నః—(ఉత్తమాంగమువలె) ప్రశస్తమైనదియు, విశ్వస్య వాఘతః—జగత్తును వహించునదియునగు, పుష్కరాత్ అధి—తామరాకు పై భాగమునందు, నిరమన్థత—నిశ్శేషముగ మథించెను.

తాత్పర్యము: ఓ యగ్నీ! అథర్వుఁడను మహర్షి నిన్ను తామరాకుయొక్క పై భాగమునందు నిశ్శేషముగ మథించెను. ఆ తామరాకు శిరస్సువలె ప్రశస్తమైనది. సర్వజగత్తును (అగ్నిమన్థన యజ్ఞనిష్పాదనాది మూలమున) నిర్వహించునది. (ఇది తృతీయ మంత్రము.)

12. అర్థము: హే అగ్నే!—ఓ యగ్నీ!, అథర్వణః పుత్రః—అథర్వ మహర్షియొక్క కుమారుఁడైన, దధ్యఙ్ఋషిః—'దధ్యఙ్' అను పేరు గల ఋషి, వృత్రహణమ్—వైరినాశకుఁడవు, పురందరమ్=రుద్రరూపముతో అసురుల మూఁడు పట్టణములను ధ్వంసము చేసినట్టి, తము త్వా—అటువంటి నిన్ను, ఈధే—ప్రజ్వలింపఁజేసెను.

తాత్పర్యము: ఓ యగ్నీ! అథర్వపుత్రుఁడైన దధ్యఙ్నామక ఋషి అటువంటి నిన్ను ప్రజ్వలింపఁజేసెను. నీవు శత్రువులను నశింపఁజేయువాఁడవు. రుద్రరూపముతో అసురుల మూఁడు పట్టణములను ధ్వంసము చేసినవాఁడవు. (ఇది చతుర్థ మంత్రము.)

13. అర్థము: హే అగ్నే!—ఓ యగ్నీ!, వృషా—శ్రేష్ఠుఁడైన, పాథ్యః—పాథ్యుఁడను ఋషి, దస్యుహన్తమ్=తస్కరుల నతిశయముగ వధించువాఁడవును, రణేరణే=ప్రతియుద్ధమునందు, ధనంజయమ్=ధనమును జయించువాఁడవునగు, తముత్వా—ఆ నిన్నే, సమీధే=బాగుగ ప్రజ్వలింపఁజేసెను,

తాత్పర్యము: ఓ యగ్నీ! శ్రేష్ఠుఁడయిన పాథ్యనామక ఋషి పూర్వోక్త గుణవిశిష్టుఁడవైన నిన్ను బాగుగ ప్రజ్వలింపఁజేసెను. నీవు దొంగలను బాగుగ సంహరించువాఁడవు. ఆ యా యుద్ధములందు ధనములను జయించువాఁడవు. (ఇది పంచమ మంత్రము.)

14. అర్థము: వృత్రహా—శత్రుహంతకుఁడు, రణేరణే=ప్రతియుద్ధమునందు, ధనఞ్జయః—ధనములను జయించువాఁడునగు, అగ్నిః—అగ్ని, ఉదజని (ఇతి)—ఉద్భవించెనని, ఉత జన్తవః—సర్వప్రాణులు, బ్రువన్తు—పరస్పరము చెప్పుకొందురు గాక.

తాత్పర్యము: శత్రుహంతయు, ఆయా యుద్ధములందు ధనములను జయించువాఁడునగు అగ్ని యుద్భవించెనని సర్వ ప్రాణులు పరస్పరము చెప్పుకొందురు గాక. (అరణినుండి అగ్ని యుద్భవించఁగానే హోత ఈ "అయగ్ంహస్తే" ఇత్యాది ఋక్కులను పఠించవలెను. ఇది ప్రథమ ఋక్కు.)

15. అర్థము: ఖాదినమ్-హవిస్సులను భక్షించువాఁడగు, యమ్-ఏ యగ్నిని, హస్తే న-చేతియందువలె, (కస్మింశ్చిత్పాత్రే=ఒకానొక పాత్రమునందు), జాతం శిశుం న-సద్యోజాతమైన శిశువునువలె, (ఋత్విజః-ఋత్విజులు,) ఆ బిభ్రతి-అంతటను భరించుచున్నారో, (పట్టుకొనుచున్నారో,) విశాంస్వధ్వరమ్-ప్రజలను బాగుగ హింసించనట్టి, (తమ్) అగ్నిమ్-ఆ యగ్నిని, (పురతః-ఎదుట, పశ్యామః-చూచుచున్నాము.

తాత్పర్యము: అరణినుండి పుట్టిన అగ్నిని ఋత్విజులు వెంటనే చేతియందువలె ఒకానొక పాత్రమందు సద్యోజాతమైన శిశువువలె పట్టుకొనుచున్నారు. ఆ యగ్ని హవిర్భక్షకుఁడు. ప్రజలను హింసించనివాఁడు. (ఇది రెండవ ఋక్కు.)

16. అర్థము: (హే ఋత్విజః-ఓ (ఋత్విజులారా!), దేవవీతయే-దేవతలయొక్క హవిస్స్వాదనముకొఱకు, వసువిత్తమమ్-అతిశయముగ హవిర్లక్షణ ధనము నెఱిఁగిన, దేవమ్=దీప్తిమంతుఁడైన యగ్నిని, ప్ర భరత-ప్రకర్షగా పోషించుఁడు. (సః-ఆ అగ్ని దేవుఁడు), అ(గత్య)-వచ్చి, స్వే యోనౌ-స్వీయస్థానమునందు, నిషీదతు=మిక్కిలి సమీపమునందు కూర్చుండుఁగాక. (ప్రవేశించుఁగాక.).

తాత్పర్యము: దేవతలు హవిస్సు నాస్వాదించుటకై ఓ ఋత్విజులారా! అధికముగ హవిస్సనెడి ధనము నెఱిఁగిన దీప్తిమంతుఁడగు నగ్నిని ప్రకర్షగా పోషించుఁడు. ఆ యగ్ని దేవుఁడు వచ్చి తన స్థానము సమీపమున ప్రవేశించుఁగాక. (పూర్వమంత్రములచే అరణియందు మథించఁబడిన నూతనాగ్నిని పూర్వాగ్నితో కలుపునపుడు హోత ఈ "ప్రదేవ" మిత్యాది షడృక్కులను పఠించవలెను. ఆ ఆఱు ఋక్కులలో నిది మొదటిది.)

17. అర్థము: (హే ఋత్విజః!-ఓ ఋత్విజులారా!), గృహపతిమ్-అంతటను గృహపాలకుఁడును, ప్రియమ్-ఇష్టుఁడును, అతిథిమ్-అతిథి రూపుఁడునైన, జాతమ్-ఇప్పుడు పుట్టిన అగ్నిని, స్యోనే-సుఖరూపమైన, జాతవేదసి=పూర్వమేయున్న అగ్నియందు, శిశీత-శయనించినవానినిగాఁ జేయుఁడు.

తాత్పర్యము: ఓ ఋత్విజులారా: ఇప్పుడు పుట్టిన అగ్నిని పూర్వమునుండియునున్న సుఖరూపుఁడైన అగ్నియందు శయనింపఁజేయుఁడు. ఈ యగ్ని ఇష్టుఁడు. అతిథి రూపుఁడు. గృహమునంతటను పాలించువాఁడు. (ఈ ఋక్కు రెండవది.)

18. అర్థము: కవిః-విద్వాంసుఁడును, గృహపతిః-గృహపాలకుఁడును, యువా=నిత్య తరుణుఁడును, హవ్యవాట్-హవిస్సును వహించువాఁడును, జుహ్వాస్యః-జుహువే ముఖముగాఁ గలవాఁడునునగు, అగ్నిః-(ఈ) యగ్ని, అగ్నినా-పూర్వాగ్నితోఁగూడ, సమిధ్యతే-బాగుగ ప్రజ్వలింపఁజేయఁబడుచున్నాఁడు.

తాత్పర్యము: ఇప్పుడు తీసికొనిరాఁబడిన యగ్ని పూర్వాగ్నితోఁగూడ బాగుగ జ్వలింపఁజేయఁబడుచున్నాఁడు. ఈ నవీనాగ్ని విద్వాంసుఁడు. గృహమును పాలించువాఁడు. (ఈ ఋక్కు మూఁడవది.)

19. అర్థము: (హే అగ్నే!-ఓ నూతనాగ్నీ!) విప్రః-బ్రాహ్మణ జాత్యభిమానివియు, సన్-వినాశ రాహిత్యముచే సర్వదా ఉంటున్నవాఁడవును, సఖా=సఖుఁడవునగు, త్వమ్=నీవు, విప్రేణ-బ్రాహ్మణ జాత్యభిమానియు, సతా-వినాశ రాహిత్యముచే సర్వదా ఉంటున్నవాఁడును! సఖ్యా-సఖుఁడునగు, అగ్నినా-పూర్వాగ్నితోఁగూడ, సమిధ్యసే హి-బాగుగ జ్వలింపఁజేయఁబడుచున్నావు కదా!

తాత్పర్యము: ఓ నూతనాగ్నీ! నీవు పూర్వాగ్నితోఁ గూడ బాగుగ జ్వలింపఁజేయఁబడుచున్నావు కదా! పూర్వ నూతనాగ్నులుభయులును బ్రాహ్మణ జాత్యభిమానులు. ఎల్లప్పుడు వినాశము లేకుండ ఉంటున్నవారు. మిత్రులు. (ఇది చతుర్థ ఋక్కు.)

20. అర్థము: (హే ఋత్విజః!-ఓ ఋత్విజులారా!), సుక్రతుమ్-బాగుగ క్రతువును నిష్పన్నము చేయువాఁడును, పురోయావానమ్-యుద్ధములందు పురోగామియు, స్వేషు క్షయేషు-యజమాన సంబంధములయిన స్వకీయ

గృహములందు, వాజినమ్–అన్నసంపాదకుఁడునగు, తమ్ (ఇమమ్)–అ యీ మథితాగ్నిని, మర్జయన్త–శోధించుఁడు.

తాత్పర్యము: ఓ ఋత్విజులారా! మీరు పూర్వోక్తుఁడైన ఈ మథితాగ్నిని శోధించుఁడు. ఈ మథితాగ్ని క్రతువును బాగుగ నెఱవేర్చువాఁడు. యుద్ధములందు పురోగామి. యజమాన సంబంధములైన స్వీయ గృహములందు అన్నమును సంపాదించువాఁడు. (ఇది పంచమ ఋక్కు.)

21. అర్థము: దేవాః–దేవత్వమును కోరునట్టి యజమానులు, యజ్ఞేన–యజ్ఞసాధనమైన నూతనాగ్నితోఁ గూడ, యజ్ఞమ్–యజ్ఞసాధనమైన పురాతనాగ్నిని, అయజన్త–పూజించిరి. తాని–ఆ అగ్నిద్వయ సాధ్యములైన, ధర్మాణి–కర్మలు (సుకృతములు), ప్రథమాని–ముఖ్యములు, ఆసన్–అయినవి. యత్ర–ఏ స్వర్గమునందు, పూర్వే–పూర్వ యజమానులు, సాధ్యాః దేవాః–సాధ్య ఫలోపేత దేవతలుగా, సన్తి–ఉంటున్నారో, తే హ–వారు కదా, మహిమానః–మహిమతోఁగూడిన యజమానులుగా, నాకమ్–స్వర్గమును, సచన్తే–సేవించుచున్నారు.

తాత్పర్యము: దేవత్వమును కోరు యజమానులు యజ్ఞసాధన నూతనాగ్నితోఁ గూడ యజ్ఞసాధన పూర్వాగ్నిని పూజించిరి. కలసిన ఆ యుభయాగ్నులవలన సాధ్యములైన కర్మలు (సుకృతములు) ముఖ్యము లైనవి. ఏ స్వర్గలోకమునందు పూర్వయజమానులు సాధ్యఫలోపేత దేవతలై యుంటున్నారో, వారు కదా! మహిమోపేత యజమానులుగా స్వర్గమును సేవించుచున్నారు. (ఇది షష్ఠ ఋక్కు.)

ఏకాదశానువాకము సమాప్తము.

పంచమ ప్రపాఠకము పరిసమాప్తము.

## తృతీయకాండము ముగిసినది.

---

# త్రివృదాది స్తోమముల స్వరూపము

త్రివృత్ పంచదశాది స్తోమములు, రథంతరాది సామములు ఈ యజుర్వేదమునందలి తృతీయ కాండము నందు పంచమ ప్రపాఠకమున ఆమ్నాతములైనవి. ఆ స్తోమములు, సామములు ఏర్పడు విధము ఇచట వివరించఁబడుచున్నది.

**త్రివృత్స్తోమము:** "తిసృభ్యో హిం కరోతి స ప్రథమయా త్రిసృభ్యో హిం కరోతి స మధ్యమయా తిసృభ్యో హిం కరోతి స ఉత్తమయోద్యతీ త్రివృతో విష్టుతిః" అని త్రివృత్స్తోమముయొక్క స్వరూపము సామబ్రాహ్మణమునందు సమామ్నాతమైనది. కొన్ని ఋక్కుల సముదాయము తృచ మనియు, సూక్త మనియు వ్యవహరించఁబడుచున్నది. "ఉపాస్మై గాయత" ఇత్యాది తృచాత్మకములైన సూక్తములు మూఁడు కలవు. ఆ మూఁడు సూక్తములలో ప్రథమ సూక్తమును ఉద్గాత ఒక పర్యాయము గానము చేయవలెను. ఆ గానముచేత మూఁడు సూక్తములను గానము చేసిన ట్లగును. ఉద్గాత రెండవ పర్యాయము రెండవ సూక్తమును ఒక మారు గానము చేయవలెను. దీనిచే మూఁడు సూక్తములచే గానము చేసిన ట్లగును. ఉద్గాత మూఁడవ పర్యాయము మూఁడవ సూక్తమును ఒక మారు గానము చేయవలెను. ఆ గానముచేత మూఁడు సూక్తములను గానము చేసిన ట్లగును. ఈ విధముగ ఉద్గాత మూఁడు సూక్తములను మూఁడు మారులు అనఁగా — త్రిరావృత్తిచే గానము చేయుటవలన 'త్రివృత్' స్తోమము ఏర్పడుచున్నది. అనఁగా త్రివృత్స్తోమ సంబంధినియైన విశిష్ట స్తుతి సంపన్న మగుచున్నది. ఈ స్తుతి 'ఉద్యతి' అను నామముచే వ్యవహరించఁబడుచున్నది.

**రథంతర సామము:** "అభి త్వా శూర నోనుమ" ఋక్కునందు ఉత్పన్నమైన సామము రథంతర సామముగా అభిహితమైనది.

**పంచదశ స్తోమము:** పూర్వోక్తమైన త్రివృత్ స్తోమము ఒక్కటియే సూక్త త్రయముచే నిష్పన్నమైనది. పంచదశాది స్తోమము లన్నియు తృచాత్మకమైన ఒక్కొక్క సూక్తముచే ఏర్పడుచున్నవి.

"పఞ్చభ్యో హిం కరోతి స తిసృభిః స ఏకయా స ఏకయా పఞ్చభ్యో హిం కరోతి స ఏకయా స తిసృభిః స ఏకయా పఞ్చభ్యో హిం కరోతి స ఏకయా స ఏకయా స తిసృభిః పఞ్చపఞ్చనీ విష్టుతిః". మూఁడు ఋక్కులు గల తృచాత్మకమైన ఒక సూక్తమును ఈ విధముగ గానము చేయవలెను. ప్రథమ పర్యాయము సూక్తములోని ప్రథమ ఋక్కును ఉద్గాత మూఁడు మారులును, మిగిలిన రెండు ఋక్కులను ఒక్కొక్క మారును గానము చేయవలెను. ఈ విధముగ గానము చేసిన యెడల ప్రథమ పర్యాయము ఐదు ఋక్కులను గానము చేసిన ట్లగును. ద్వితీయ పర్యాయము సూక్తము నందలి ద్వితీయ ఋక్కును మూఁడు మారులును, ప్రథమ తృతీయ ఋక్కులను ఒక్కొక్క పర్యాయమును గానము చేయవలెను. రెండవ ఆవృత్తియందు కూడ ఐదు ఋక్కులను గానము చేసిన ట్లగును. తృతీయ పర్యాయము (మూఁడవ ఆవృత్తియందు) ప్రథమ ద్వితీయ ఋక్కులను ఒక్కొక్క మారును, తృతీయ ఋక్కును మూఁడు మారులును గానము చేయవలెను. ఈ విధముగ గానము చేయుటవలన మూఁడవ ఆవృత్తి యందు కూడ ఐదు ఋక్కులను గానము చేసిన ట్లగును. మూఁడు ఆవృత్తులందును కలసి పదునైదు ఋక్కులను గానము చేయుట అగును. ఈ విధముగ పంచదశ స్తోమ సంబంధినియైన విశిష్ట స్తుతి సంపన్న మగుచున్నది. ఇది పంచదశ స్తోమముయొక్క స్వరూపము.

**'బృహత్' సామము:** "త్వామిద్ధి హవామహే" అను ఋక్కునందు ఉత్పన్నమైన సామము 'బృహత్' సామ మని వ్యవహరించఁబడుచున్నది.

**సప్తదశ స్తోమము:** "పఞ్చభ్యో హిం కరోతి స తిసృభిః స ఏకయా స ఏకయా పఞ్చభ్యో హిం కరోతి స ఏకయా స తిసృభిః స ఏకయా సప్తభ్యో హిం కరోతి స ఏకయా స తిసృభిః స తిసృభిరితి దశసప్త సప్తదశస్య

విష్టుతిః" ఇతి. ఉద్గాత మూఁడు ఋక్కులు గల తృచాత్మకమైన ఒక సూక్తమును ఈ విధముగ మూఁడు మారులు గానము చేసినచో సప్తదశ స్తోమము ఏర్పడును.

ప్రథమ పర్యాయము ప్రథమ ఋక్కును మూఁడు మారులును, ద్వితీయ తృతీయ ఋక్కులను ఒక్కొక్క మారును ఉద్గాత గానము చేయవలెను. ఈ విధముగ గానము చేయుటవలన మొదటి అవృత్తియందు ఐదు ఋక్కులను గానము చేసిన ట్లగును. ద్వితీయ పర్యాయము ద్వితీయ (మధ్యమ) ఋక్కును మూఁడు మారులును, ప్రథమ తృతీయ ఋక్కులను ఒక్కొక్క పర్యాయమును ఉద్గాత గానము చేయవలెను. ఈ విధముగ గానము చేయుటవలన రెండవ అవృత్తి యందు కూడ ఐదు ఋక్కులను గానము చేసిన ట్లగును. తృతీయ పర్యాయము ద్వితీయ (మధ్యమ) ఋక్కును, తృతీయ (ఉత్తమ) ఋక్కును మూఁడేసి మారులును, ప్రథమ ఋక్కును ఒక్క మారును ఉద్గాత గానము చేయవలెను. ఈ మూఁడవ అవృత్తి యందు ఏడు ఋక్కులను గానము చేసిన ట్లగును. అనఁగా ఉద్గాత మూఁడు ఆవృత్తులందును కలసి పదునేడు (5+5+7) ఋక్కులను గానము చేసినవాఁ డగును. ఇది సప్తదశ స్తోమ సంబంధినియైన విశిష్ట స్తుతి యగుచున్నది. ఇది దశసప్త నామమువే వ్యవహరించఁబడుచున్నది.

వైరూప సామము: "యద్యావ ఇన్ద్ర" అను ఋక్కునందు ఉత్పన్నమైన సామము వైరూప సామ మనఁబడును.

ఏకవింశ స్తోమము: "స సప్తభ్యో హిం కరోతి స తిసృభిః స తిసృభిః స ఏకయా స సప్తభ్యో హిం కరోతి స ఏకయా స తిసృభిః స తిసృభిః స సప్తభ్యో హిం కరోతి స తిసృభిః స ఏకయా స తిసృభిః సప్తసప్తిన్యేకవింశస్య విష్టుతిః", ఇతి. ఉద్గాత మూఁడు ఋక్కులు గల పూర్వోక్త తృచాత్మకమైన సూక్తమును ఈ విధముగ మూఁడు మారులు గానము చేయవలెను. ఈ గానమువలన ఏకవింశ స్తోమము సిద్ధించుచున్నది.

ప్రథమ పర్యాయము ఉద్గాత మూఁడు ఋక్కులలోను ప్రథమ ఋక్కును, మధ్యమ (ద్వితీయ) ఋక్కును మూఁడేసి మారులును, తృతీయ (ఉత్తమ) ఋక్కును ఒక్క మారును గానము చేయవలెను. ఈ గానము వలన మొదటి అవృత్తియందు ఏడు ఋక్కులను గానము చేసిన ట్లగును. రెండవ పర్యాయము ప్రథమ ఋక్కును ఒక్కమారును, ద్వితీయ తృతీయ (మధ్యమోత్తమ) ఋక్కులను మూఁడేసి మారులును గానము చేయవలెను. ఈ గానమువలన రెండప అవృత్తియందు కూడ ఏడు ఋక్కులను గానము చేసిన ట్లగును. తృతీయ పర్యాయము ప్రథమ ఋక్కును, తృతీయ (ఉత్తమ) ఋక్కును మూఁడేసి మారులును, మధ్యమ (ద్వితీయ) ఋక్కును ఒక్క మారును గానము చేయవలెను. ఈ గానమువలన మూఁడవ అవృత్తియందు కూడ ఏడు ఋక్కులను గానము చేసిన ట్లగుచున్నది. ఈ విధముగ ఉద్గాత మూఁడు అవృత్తులందు ఋక్కులను గానము చేయుటవలన ఏకవింశ స్తోమ సంబంధినియైన విశిష్ట స్తుతి ఏర్పడుచున్నది. ఏకవింశ స్తోమము సప్తసప్తిని నామముచే (7+7+7) వ్యవహరించఁబడుచున్నది.

వైరాజ సామము: "పిబా సోమమిన్ద్ర మన్దతు త్వా" అను ఋక్కునందు పుట్టిన సామము వైరాజ సామ మని వ్యవహరించఁబడుచున్నది.

త్రిణవ స్తోమము: "నవభ్యో హిం కరోతి స తిసృభిః స పఞ్చభిః స ఏకయా నవభ్యో హిం కరోతి స ఏకయా స తిసృభిః స పఞ్చభి ర్నవభ్యో హిం కరోతి స పఞ్చభిః స ఏకయా స తిసృభి ర్వజ్రో వై త్రిణవః" ఇతి. ఉద్గాత మూఁడు ఋక్కులు గల పూర్వోక్త తృచాత్మక సూక్తమును ఈ విధముగ మూఁడు మారులు గానము చేయ వలెను. ఈ గానముచే త్రిణవ స్తోమము సిద్ధించును.

ఉద్గాత ప్రథమ పర్యాయము సూక్తములోని ప్రథమ ఋక్కును మూఁడు మారులును, మధ్యమ (ద్వితీయ) ఋక్కును ఐదు మారులును, ఉత్తమ (తృతీయ) ఋక్కును ఒక్క మారును గానము చేయవలెను. ఈ గానముచేత మొదటి అవృత్తియందు తొమ్మిది ఋక్కులను గానము చేసిన ట్లగును. ద్వితీయ పర్యాయము

ప్రథమ ఋక్కును ఒక్క మారును, మధ్యమ ఋక్కును మూఁడు మారులును, ఉత్తమ ఋక్కును ఐదు మారులును గానము చేయవలెను. ఈ గానమువలన రెండవ ఆవృత్తియందు తొమ్మిది ఋక్కులను గానము చేసిన ట్లగును. తృతీయ పర్యాయము ప్రథమ ఋక్కును ఐదు మారులును, మధ్యమ ఋక్కును ఒక్క మారును, ఉత్తమ ఋక్కును మూఁడు మారులును గానము చేయవలెను. ఈ గానముచేత మూఁడవ ఆవృత్తియందు కూడ తొమ్మిది ఋక్కులను గానము చేసిన ట్లగును. ఉద్గాత ఈ విధముగ మూఁడు ఆవృత్తులందు ఋక్కులను గానము చేయుటవలన (౯ + ౯ + ౯) త్రిణవ స్తోమ సంబంధినియగు విశిష్ట స్తుతి యగుచున్నది. త్రిరావృత్త నవ సంఖ్యోపేత మగుటచే ఈ త్రిణవస్తోమము వజ్ర సమాన మగును.

శాక్వర సామము : "ప్రో ష్వస్మై పురోరథమ్" అను ఋక్కునందు ఉత్పన్నమైన సామము శాక్వర సామ మనఁబడును.

త్రయస్త్రింశ స్తోమము : "ఏకాదశభ్యో హిం కరోతి స తిసృభిః స సప్తభిః స ఏకయైకాదశభ్యో హిం కరోతి స ఏకయా స తిసృభిః స సప్తభి రేకాదశభ్యో హిం కరోతి స సప్తభిః స ఏకయా స తిసృభిరన్తో వై త్రయస్త్రింశః" ఇతి. ఉద్గాత మూఁడు ఋక్కులు గల పూర్వోక్త తృచాత్మక సూక్తమును ఈ విధముగ మూఁడు మారులు గానము చేయవలెను. ఈ గానముచేత త్రయస్త్రింశ స్తోమము సిద్ధించును.

ఉద్గాత ప్రథమ పర్యాయము సూక్తములోని ప్రథమ ఋక్కును మూఁడు మారులును, ద్వితీయ (మధ్యమ) ఋక్కును ఏడు మారులును, ఉత్తమ (తృతీయ) ఋక్కును ఒక్క మారును గానము చేయవలెను. ఈ గానముచే మొదటి ఆవృత్తియందు పదునొకండు ఋక్కులను గానము చేసిన ట్లగును. ద్వితీయ పర్యాయము ప్రథమ ఋక్కును ఒక్క మారును, ద్వితీయ ఋక్కును మూఁడు మారులును, తృతీయ ఋక్కును ఏడు మారులును గానము చేయవలెను. ఈ గానముచే రెండవ ఆవృత్తియందు కూడ పదునొకండు ఋక్కులను గానము చేసిన ట్లగును. తృతీయ పర్యాయము ప్రథమ ఋక్కును ఏడు మారులును, మధ్యమ ఋక్కును ఒక్క మారును, ఉత్తమ ఋక్కును మూఁడు మారులును గానము చేయవలెను. మూఁడవ ఆవృత్తియందు కూడ ఈ విధముగ గానము చేయుటచేత పదునొకండు ఋక్కులను గానము చేసిన ట్లగును. ఈ విధముగ పూర్వోక్త సూక్తమును గానము చేయుటవలన త్రయస్త్రింశ స్తోమ సంబంధినియగు విశిష్ట స్తుతి నిష్పన్న మగును. స్తోమములలో ఇది అంతిమ స్తోమము.

వాజపేయమునందు ఉజ్జిత్యనువాకమునందు త్రయోదశ స్తోమము చతుర్దశ స్తోమము ఆమ్నాతము లైనవి. కాని అది అంతయు ఉన్నేయమే అని గ్రహించవలెను. ఉన్నయన ప్రకారము సామసూత్రమునందు చూడఁదగినది. హిం కరోతి–గానము చేయవలెను.

రైవత సామము : "రేవతీర్నః సధమాదః" అను ఋక్కునందు ఉత్పన్నమైన సామము రైవత సామమని వ్యవహరించఁబడుచున్నది.

త్రివృదాది స్తోమ స్వరూప వివరణము సమాప్తము.

# తృతీయకాండ గత విషయ సమీక్ష

కృష్ణయజుర్వేద తైత్తిరీయ సంహితయందలి ఈ తృతీయ కాండము ఔపానువాక్యమని వ్యవహరించఁబడుచున్నది. కర్మయందు చెప్పఁబడు మంత్రమునకు వాక మనియు, ఆ మంత్రమునకు వ్యాఖ్యాన రూపమైన బ్రాహ్మణమునకు అనువాక మనియు, అనువాకముల సమీపము ఉపానువాక మనియు, తత్సంబంధి కాండము ఔపానువాక్య మనియు, కావున ఈ తృతీయ కాండము ఔపానువాక్య మనియు భాష్యకారులు తృతీయ కాండారంభమున నిర్వచనము చేసియున్నారు. ఆ యా అనువాకములందు అన్వయము చేయుటకు యోగ్యములైన అర్థములను ప్రతిపాదించుటచే ఈ తృతీయ కాండము ఔపానువాక్యమని వ్యవహరించఁబడుచున్నది. ఇది వైదిక సంప్రదాయవిదుల సిద్ధాంతము. ఈ తృతీయ కాండమునందు అయిదు ప్రపాఠకములు కలవు. ప్రథమ ప్రపాఠకమునందు దీక్షితవాదము అనఁగా- యజ్ఞదీక్షను వహించిన యజ్ఞకర్త పఠించవలసిన మంత్రములు మున్నగు అంశములు విపులముగా చెప్పఁబడినవి.

వేదము ఏ కర్మను గాని, తదంగమును గాని విధించుటకు ముందు దాని ఆవశ్యకతను దృఢీకరించుటకై దృష్టాంత పూర్వకముగ దానిని ప్రశంసించును. "ప్రజాపతి రకామయత ప్రజా సృజేయేతి స తపోఽతప్యత స సర్పా నసృజత....స ఏతం దీక్షితవాద మపశ్య త్తమవద త్తతో వై స ప్రజా అసృజత" పూర్వము ప్రజాపతి ప్రజాసృష్టి చేయవలెనని అగ్నిష్టోమానుష్ఠాన మనెడి తపస్సు చేసెను. ఆ తపస్సువలన అతఁడు సర్పములను సృజించఁగలిగెను. రెండవమారు సంకల్పించి ఆ తపస్సునే ఆచరించి పక్షులను సృజించఁగలిగెను. మూఁడవమారు కూడ సంకల్పించి ఆ తపస్సునే ఆచరించెను. మఱియు అతఁడు దీక్షితుఁడు పఠింపవలసిన మంత్రమును పఠించెను. ఆ మంత్ర పాఠమువలననే అతఁడు ప్రజలను సృజించెను. ప్రజాపతి మొదట దీక్షితవాదమును (యజ్ఞదీక్షను వహించిన యజమానుఁడు పఠించవలసిన మంత్రమును) పఠింపకయే తపస్సు చేయుటవలన నీచములైన సర్పములను, పక్షులను సృజించఁగలిగెను. పిమ్మట అతఁడు మూఁడవమారు ప్రజాసృష్టి చేయఁదలచి అగ్నిష్టోమ యాగదీక్షను వహించి పఠించవలసిన మంత్రములను పఠించుటచే ప్రజలను సృజించఁగలిగెను. ఈ విధముగ ఇచట దీక్షితవాద ప్రశంస చేయఁబడినది.

స్నానము, దానము, అనశనము, వైదిక మంత్రపాఠము అనునవి ఇచట తపశ్శబ్దార్థములని తపశ్శబ్దము నిర్వచించఁబడినది. "ఏతత్ఖలు వావ తప ఇత్యాహు ర్యః స్వం దదాతి"। "తపో నానశనాత్పరం యద్ధి పరం తద్దుర్ధర్షమ్।" "....తపో హి స్వాధ్యాయః" ఇత్యాది శ్రుతివాక్యములు తపశ్శబ్దమునకు పూర్వోక్తార్థము చెప్పుచున్నవి. ఈ సందర్భమునందే దీక్షానియమములు పాటించవలసిన విధము, పాటించనిచో సంభవించెడి అనిష్టములు, పాటించినచో కలిగెడి లాభములు మొదలగు అంశములు ప్రథమానువాకమునందు విపులీకరించఁబడినవి.

సోమయాగమునందు సోమము ముఖ్యమైనది. తిప్పతీఁగకు సోమలత యని వైదిక వ్యవహారము. ఆ సోమలతనుండి రసము తీసి ఆ సోమరసమును అగ్నియందు హోమము చేయుదురు. కనుక ఆ సోమలత ఓషధిరాజుగా వర్ణించఁబడుటయే గాక, దేవతగా కూడ వర్ణించఁబడినది. "ఏష తే గాయత్రో భాగ ఇతి మే సోమాయ బ్రూతాదేష తే....ఛన్దోమానాగ్ం సామ్రాజ్యం సామ్రాజ్యం గచ్ఛేతి మే సోమాయ బ్రూతాత్।" -"దేవతాత్మకుఁడవైన ఓ సోమరాజా! ఈ యెదుట విక్రయింపఁదగినదిగానున్న నీయొక్క లతారూప భాగము ప్రాతస్సవనమునందు గాయత్రీ ఛ్ఛందస్సుచే సంస్కరింపఁదగినదను నా మాటను గాయత్రీ దేవత సోమదేవతకు చెప్పుఁగాక. ఇట్లే ఈ భాగము మాధ్యందిన సవనమునందు త్రిష్టుప్ ఛందస్సుచే సంస్కరింపఁదగినదను నా మాటను గాయత్రీ దేవత సోమదేవతకు చెప్పుఁగాక. ఈ లతాభాగము సాయం సవనమునందు జగతీ ఛ్ఛందస్సుచే సంస్కరింపఁ దగినదనెడి నా మాటను గాయత్రీ దేవత సోమదేవతకు చెప్పుఁగాక." అని సోమము ఒక దేవతగా వర్ణించఁబడినది. ఇంకను ఈ సోమదేవతను ప్రార్థించుటకై

కొన్ని మంత్రములు ద్వితీయానువాకమునందు ప్రతిపాదితములైనవి. వీనిలో యజమానుఁడు పఠించవలసిన మంత్రములు, అధ్వర్యుని విధులు కలవు. సోమదేవతను ప్రార్థించుటకు ప్రతిపాదితములైన మంత్రములే సోమోపస్థాన మంత్రము లనఁబడుచున్నవి.

తృతీయానువాకమునందు సోమక్రయణీ పదాంజనాది విధులు చెప్పఁబడినవి. గోవు నిచ్చి సోమవిక్రేత నుండి సోమలతను కొందురు. ఆ గోవు సోమక్రయణి యనఁబడుచున్నది. ఆ గోవుయొక్క అడుగుజాడలందు హోమము చేయఁబడిన నేతితో కలసిన ధూళి సోమక్రయణీ పదాంజన మనఁబడును. అనఁగా యజ్ఞము చేయునపుడు యజ్ఞకర్త గోవు నిచ్చి సోమలతను కొనును. ఆ గోవును యజ్ఞశాల దగ్గఱ నడిపించినపుడు ఆ గోవు ఆఱు అడుగులు నడచిన పిమ్మట ఏడవ అడుగును తీయఁగానే ఆ అడుగుజాడయందు నేతితో హోమము చేయుదురు. నేతితో తడిసిన ఆ అడుగుజాడయందలి దుమ్ము, సోమలతాది హవిఃపదార్థములను మోయునట్టి రెండు శకటములును యజ్ఞముఖ స్థానములుగా ఇట వర్ణించఁబడినవి. నేతితో తడిసిన ఆ పాంసువు, ప్రధాన హవిస్సు అయిన సోమమును మోయు శకటములు ఇచట ముఖ్యములు. గార్హపత్యాగ్ని సమీపమున నుండు శకటములను ప్రాఙ్ముఖముగ నడిపింపఁజేయఁగానే పూర్వోక్తమయిన సోమక్రయణీ పదాంజనముచే బండికందెని పూయవలెను. ఈ ప్రక్రియ లౌకికాచారము ననుసరించియే ఉన్నది. ఈ సందర్భమున యజమానపత్ని అనుష్ఠించవలసిన క్రియాకలాపము కొంత కలదు. ఇచటనే యజ్ఞపశువు, ఆ పశువుయొక్క వపాదికమును వండుటకై గార్హపత్యమునుండి అగ్నిని శ్రపణ ప్రదేశమునకు తీసికొనిపోవుట మున్నగు నంశములు చెప్పఁబడినవి.

చతుర్థానువాకమున పశూపాకరణ మంత్రము లామ్నాతము లైనవి. దర్భలచేఁ గాని, దర్భముష్టిచేఁ గాని మంత్రపూర్వకముగ సంస్కరించుట ఉపాకరణ మనఁబడును. ఈ యజ్ఞపశువును ఆలంభనము చేయుటకు (వధించుటకు) ముందు దానిని యూప (స్తంబ) మునకు కట్టివేయుదురు. యజ్ఞపశువునకు ఉపాకరణము చేయునపుడును, బంధించునపుడును, దాని హవిస్సును హోమము చేయునపుడును పఠించవలసిన మంత్రములు కొన్ని యిచట ప్రతిపాదించఁబడినవి. "ప్రజాపతే ర్జాయమానాః ప్రజా జాతాశ్చ యా ఇమాః। తస్మై ప్రతి ప్రవేదయ చికిత్వాగ్ం అనుమన్యతామ్।"–"ఇప్పుడు పుట్టుచున్న ప్రజలు, ఇదివఱకు పుట్టిన ప్రజలును ప్రజాపతినుండి పుట్టినవారే కావున, ఓ యజ్ఞపశూ! నీవు ఆ ప్రజాపతియొద్దకు పోయి ఏకాంతమున నీ వృత్తాంతమును వివరముగ చెప్పుము. ఆ ప్రజాపతి నీ స్వర్గప్రాప్తిని తెలిసినవాఁడై అంగీకరించుఁగాక." అని అధ్వర్యుఁడు పశ్చిమ దిక్కునకు అభిముఖముగనున్న యజ్ఞపశువును బర్హిస్సులచేఁ గాని, జువ్వికొమ్మచేఁ గాని "అపో దేవాన్ దైవీర్విశః।" "ప్రజాపతేర్జాయమానాః" ఇత్యాది మంత్రముల నుచ్చరించుచు ఉపాకరణము చేయును. ఇట్లే బంధనాదులయందు కూడ పఠించవలసిన మంత్రములు ఈ అనువాకమున చెప్పఁబడినవి. ఈ సందర్భముననే సంజ్ఞప్త హోమములు కూడ విధించఁబడినవి. సంజ్ఞపన మనఁగా వధించుట. పశువును వధించుటవలన కలిగెడి పాపమును పోఁగొట్టుమని అగ్నిని ప్రార్థించుచు చేయు హోమములే ఈ సంజ్ఞప్త హోమములు.

చతుర్థానువాకమునందలి మంత్రములకు బ్రాహ్మణము పంచమానువాకమునందు ప్రతిపాదితమైనది. బ్రాహ్మణము మంత్రార్థమును వివరించునది. ఇది మంత్రములందలి ఆ యా పదములకు సార్థక్యమును తెలియఁజేయుచు తత్తత్కర్మలకు విధిరూపమునఁగూడ ఉండును. ఉదాహరణము:- "ప్రాజాపత్యా వై పశవ స్తేషాగ్ం రుద్రోఽధిపతి ర్యదేతాభ్యా ముపాకరోతి తాభ్యామేవైనం ప్రతిప్రోచ్యాఽఽలభత ఆత్మనోఽప్రవ్రస్కాయ" –"పశువులు ప్రజాపతి జన్యములు. రుద్ర శబ్దాభిధేయుఁడైన అగ్ని ఆ పశువుల కధిపతి. తదుభయ ప్రతిపాదకములైన "ప్రజాపతే ర్జాయమానాః" "ఇమం పశుమ్" ఇత్యాది ఋక్కులచేత పశువులను ఉపాకరణము చేయవలెను. అట్లు చేయఁగా యజమానుఁడు తన నిర్దోషిత్వమునకై ఆ ఉభయ దేవతలకొఱకే ప్రత్యేకముగ ఉచ్చరించి ఆలంభనము చేసినవాఁ డగును." ఇది పశూపాకరణ విధి. ఉపాకరణము చేయునపుడు పఠించవలసిన మంత్రములే చతుర్థానువాకమున ఆమ్నాతము లైనవి. ఉపాకరణ విధి ఈ బ్రాహ్మణమున చెప్పఁబడినది. ఈ అనువాకమునందు పురస్తాత్స్వాహాకృతులు పశ్చాత్స్వాహాకృతులు

అనెడి ఉభయవిధ దేవతల తృప్తికై వపా హోమమునకు పూర్వమునందు పరమునందును చేయవలసిన ఆజ్యహోమములు విధించఁబడినవి.

యజ్ఞము చేయు నైదు దినములలో సుత్యా దినమునందలి ప్రయోగారంభమున యజమానుఁడు అగ్నీధ్రాది స్థానములను వరుసగా "మహారాత్రే బుధ్యాఽగ్నే నయ" ఇత్యాది ఋక్కులను పఠించుచు అభిమర్శనము చేయవలెను (తాఁకవలెను). ఇట్లు చేయుటవలన యజ్ఞకర్త ఆ యా దేవతల అనుగ్రహమునకు పాత్రుఁ డగును. ధనవంతుఁడు కూడ నగును. అగ్నీధ్రాది స్థానములందు దేనికి ఏ దేవతయో తద్దేవతాకములైన ఋక్కులను విడిచి యితర ఋక్కులతో ఆ యా స్థానముల నభిమర్శించినచో ఆ యా దేవతల అనుగ్రహమును కోల్పోవును. మఱియు దరిద్రుఁ డగును. అనంతరము ద్రోణకలశము, ఆధవనీయము, పూతభృత్తు అను పాత్ర విశేషములను ఆ యా స్థానములలో ఉంచుట మున్నగు విషయములు షష్ఠానువాకమునందు చెప్పఁబడినవి.

సప్తమానువాకమునందు నైమిత్తిక యాగ మభిహిత మైనది. పరస్పర మాత్సర్యముతో ప్రవృత్తులైన ఇద్దఱు యజమానులకు ఈ నైమిత్తిక యాగము విధించఁబడినది. ఏదేని నిమిత్తము కారణముగా చేయు యాగము నైమిత్తిక యాగ మనఁబడును. యజ్ఞతంత్రమును నడుపువాఁడు అధ్వర్యుఁడు. అతఁడు ఆ యజ్ఞతంత్రమును నడుపుటయందు ఏ లోపము జరిగినను యజ్ఞము నష్టమై యజమానుని కోరిక నశించును. యజ్ఞ వినాశముచే కలుగు యజమాన నాశమునకు ముందే అధ్వర్యుఁడు నశించును. ఈ దోషము పోవుటకు అగ్నీధ్ర స్థానమునందు ఆజ్యహోమము చేయవలెనని చెప్పఁబడినది. పూర్వము విశ్వామిత్ర జమదగ్నులు వసిష్ఠ మహర్షి విషయమున స్పర్ధ వహించిరి. అప్పుడు జమదగ్ని "మమాగ్నే వర్చో విహవేష్వస్తు" ఇత్యాది సూక్తమును కనుఁగొని దానిచే నతఁడు వసిష్ఠుని ఇంద్రియ సామర్థ్యమును నశింపఁజేసెను. మాత్సర్యగ్రస్తుఁడైన యజమానుఁడు పై విహవ్య సూక్తమును తన యాగమునందు ప్రయోగించినచో అప్పుడు తన ప్రతిస్పర్ధియొుక్క ఇంద్రియ సామర్థ్యమును నిశ్చయముగ నశింపఁజేయును. ఇది హోతృ కర్తవ్యము. ఈ విషయములు సోదాహరణముగ విపులముగ సప్తమానువాకమునందు వివరించఁబడినవి.

అష్టమానువాకమునందు సోమరసమును నింపునట్టి పాత్రములలో ఉపాంశు వనెడి గ్రహమునకై సోమలతను అభిషవము చేయునపుడు పఠించవలసిన మంత్రములు ఆమ్నాతము లైనవి. అభిషవము చేయుటకు ముందు ఆ సోమలతను అభిమంత్రించవలెను. ఈ సందర్భమున సోమలత ఓషధిరాజుగాను, మిగిలిన ఓషధులు ఆ సోమరాజునకు ప్రజలుగాను వర్ణింపఁబడినవి. సోమలతను అభిషవము చేయునపుడు లత నలిగి దానిలేశములు, రసబిందువును క్రింద పడుటవలన కలిగెడి అనర్థమును నివారించుటకై హోమము ఈ యష్టమానువాకమునందు విధించఁబడినది. అగ్నియందు వేల్చఁబడిన ఆహుతి హుతమై పృథివ్యంతరిక్ష ద్యులోకములందు సంచరించుచు లోకమున కుపకరించు విధముగ భావన చేయుచున్నానని యజమానుఁడు ''ద్రప్సశ్చస్కన్ద'' ఇత్యాది మంత్రమును పఠించును. దీనివలన ''అగ్నౌ ప్రాస్తాఽఽహుతిః సమ్యగాదిత్యముపతిష్ఠతే। ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టేరన్నం తతః ప్రజాః'' — "అగ్నియందు వేల్చఁబడిన ఆహుతి బాగుగా నాదిత్యుని పొందుచున్నది. ఆదిత్యునినుండి వర్షము పుట్టుచున్నది. వర్షమునుండి అన్నము, అన్నమునుండి ప్రజలు పుట్టుచున్నారు" అనెడి స్మృత్యర్థము వ్యక్త మగుచున్నది. ఈ విషయము లన్నియు అష్టమానువాకమున వివరించఁబడినవి.

ప్రాతస్సవన మాధ్యందిన సవన సాయంసవనముల సమాప్తియందు చేయవలసిన హోమములు, సంస్రావ మనెడి హవిర్విశేష హోమము నవమానువాకమునందు చెప్పఁబడినవి. ఈ సందర్భమున సోమరసమును ఆఘారముగ హోమము చేయవలెననియు, సంస్రావ హోమమును విధించుటకు ముందు నాభానేదిష్ఠుని వృత్తాంతము ఉపోద్ఘాతముగాను చెప్పఁబడినవి. ''యత్రైతమేవం విద్వాన్మన్థినః సగ్ంస్రావం జుహోతి న తత్ర రుద్రః పశూనభి మన్యతే'' — "యజమానుఁడు ఈ విధముగ తెలిసికొని మంథిగ్రహము నుండి సంస్రావ మనెడి హవిర్విశేషమును హోమము చేయవలెను. అప్పుడు రుద్రదేవుఁడు అతని పశువులను హింసిం

వఁడు" నాభానేదిష్టాఖ్యానమును ముగించి సారాంశము ఈ విధముగ చెప్పఁబడినది. ఈ నాభానేదిష్టాఖ్యానమును 37, 38 పుటలలో చూడుఁడు. అయతన యుక్తములు అయతన రహితములునని హోమము చేయఁ బడు ఆహుతుల ద్వైవిధ్యము కూడ ఈ నవమానువాకమునందు వివరించఁబడినది.

"ఋత్విజో వృణీతే ఛన్దాగ్ంస్యేవ వృణీతే" ఇత్యాదికముచే షష్ఠకాండమునందు ఋత్విగ్వరణ మభిహితమైనది. అచట యజమానునిచే యజ్ఞమునకై వరింపఁబడిన ప్రతివ్యక్తియు హోమము చేయునపుడు పఠించవలసిన మంత్రములు దశమానువాకమున ఆమ్నాతము లైనవి. ఈ మంత్రముల నుచ్చరించుచు చేయు హోమములకు ప్రవృత హోమములని పేరు. ఈ ఋత్విజులు చేయవలసిన వైప్రుష హోమములు కూడ ఇందు విహితములైనవి. "యస్తే ద్రప్సః", "యో ద్రప్సః", "యస్తే ద్రప్సః" అని వరుసగా ఈ ప్రతీకలు గల మూఁడు ఋక్కుల నుచ్చరించుచు చేయు హోమములకు వైప్రుష హోమములని పేరు. బహిష్పవమాన స్తోత్రము చేయుటకై అధ్వర్యుఁడు, ప్రస్తోత, ప్రతిహర్త, ఉద్గాత, బ్రహ్మ అను ఋత్విజులు ఐదుగురు వెళ్లుదురు. వారిలో మొదట అధ్వర్యుఁడు, అతని ననుసరించి ప్రతిహర్త మొదలగువారు కదలి పోవుదురు. మొదటివాఁడైన అధ్వర్యుఁడు స్తోత్ర సముదాయము నారంభించుచు "వాగగ్రేగా అగ్ర ఏత్వృజుగా దేవేభ్యః" ఇత్యాది మంత్రములను పఠించును. "వాగ్దేవి ఋత్విజులలో ముందుఁ బోవుటకు సమర్థురాలు. దేవ ప్రాప్తికై ఋజుమార్గమునఁ బోవునది. అధ్వర్యునియందు, కీర్తిని స్థాపించునట్టిది. గవాది పశువులందు ప్రాణములను ధరింపఁజేయునది. అధ్వర్యునియందు యజమానునియందు పుత్రాది సంతానమును స్థాపించునది. అట్టి వాగ్దేవి ఋత్విజులలో ముందు పోవుఁగాక" అని మంత్రార్థము. ఈ విషయములు దశమానువాకమునందు వివరింపఁబడినవి.

ఏకాదశానువాకమునందు కొన్ని యాజ్యా పురోనువాక్యలు, కారీరీష్టికి సంబంధించిన మంత్రములు అభిహితములైనవి. పురోనువాక్య మంత్రమునందు పూర్వార్థమున దేవతా వాచక పద ముండును. పురస్తాదామ్నాతాః పురోనువాక్యాః. పశ్చాదామ్నాతాః యాజ్యాః, అని విద్యారణ్యమున చెప్పఁబడినది. నిత్యవిధులు కామ్యవిధులు నైమిత్తిక విధులునని విధులు మూఁడు విధములుగా నున్నవి. ఇచట విధి అనఁగా కర్మ (ఇష్టి) అని యర్థము. ఏ కర్మయందైనను దేవతల నుద్దేశించి ఆజ్యాది హవిస్సులు హోమము చేయఁబడును. హోమము చేయునప్పుడు ఆ యా కర్మలకు సంబంధించిన దేవతలు ప్రార్థింపఁబడుదురు. లేదా స్తుతింపఁబడుదురు. అట్టి దేవతలను ప్రార్థించునట్టివే ఈ యాజ్యా పురోనువాక్యలు. ఇవి నిత్య కర్మలకు, సంబంధించినవి యాజ్యా పురోనువాక్య లనియు, కామ్యకర్మలకు సంబంధించినవి కామ్య యాజ్యా పురోనువాక్య లనియు వ్యవహరింపఁబడుచున్నవి.

"చిత్రయా యజేత పశుకామః" అను విధియందు సప్త హవిస్సులు కలవు. ఈ హవిస్సులలో కొన్ని అగ్ని దేవతాకములు, కొన్ని త్వష్టృ దేవతాకములు, కొన్ని సరస్వద్దేవతాకములు, కొన్ని సినీవాలీ దేవతాకములు కలవు. ఈ హవిస్సులకు సంబంధించిన యాజ్యా పురోనువాక్యలు ఈ ఏకాదశానువాకమునందు చెప్పఁబడినవి. ఈ ప్రకరణమునందే కారీరీష్టికి సంబంధించిన మంత్రములు ఆమ్నాతము లైనవి. వర్షము కావలెనని కోరునతఁడు కారీరీష్టిని చేయవలెనని "కారీర్యా వృష్టికామో యజేత" అను శ్రుతి చెప్పుచున్నది. ఈ కారీరీష్టియందు హోమము చేయుచుండఁగా ఆ హోమ ధూమము ఆకాశమున వ్యాపించి మేఘరూపమును ధరించి వర్షము కురియుట ఈ మంత్రమందు రసోత్కర్షకముగను, ఉపమోత్ప్రేక్ష రూపకా ద్యలంకార సహితముగను, వర్ణించఁబడినది. ఈ యిష్టియందు మరుద్దేవతాక హవిస్సునకు సంబంధించిన యాజ్యా పురోనువాక్యలు కూడ చెప్పఁబడినవి. ఈ ఏకాదశానువాకముతో తృతీయ కాండమునందలి ప్రథమ ప్రపాఠకము సంపూర్ణమైనది.

ద్వితీయ ప్రపాఠకమునందలి ప్రథమానువాకమునందు పవమాన గ్రహముల అభిమర్శనము విధించఁబడినది. బహిష్పవమానము, మాధ్యందిన పవమానము, ఆర్భవ పవమానము అని పవమాన స్తోత్రములు మూఁడు విధములుగా సామవేదమునందు చెప్పఁబడినవి. ఈ పవమాన స్తోత్రములను గానము చేయుచుండఁగా యజమానుఁడు ఈ ప్రథమానువాకమునందలి "శ్యేనోఽసి గాయత్రఛన్దా అను త్వాఽఽరభే" ఇత్యాది మంత్ర

మును జపించవలెను. ఓ [1]బహిష్పవమాన స్తోత్రమా! నీవు డేఁగవలె శీఘ్ర గమనము కలదానవు. గాయత్రీ చ్ఛందస్సు కలదానవు. నిన్ను నేను అనుక్రమముగ పొందుచున్నాను. నిర్విఘ్నముగ నన్ను ఈ కర్మ యొక్క పారమును పొందించుము. [2]ఓ మాధ్యందిన పవమాన స్తోత్రమా! నీవు గరుత్మంతునివలె పై కెగురుటకు సమర్థ మగుచున్నావు. త్రిష్టుప్ ఛందస్సు కలదానవు. నిర్విఘ్నముగ నన్ను ఈ కర్మయొక్క పారమును పొందించుము. [3]ఓ ఆర్భవ పవమాన స్తోత్రమా! నీవు ఖాసనామక పక్షివలె పడుటకు సమర్థ మగుచున్నావు. జగతీ చ్ఛందస్సు కలదానవు. నిర్విఘ్నముగ నన్ను ఈ కర్మయొక్క పారమును పొందించుము. అని ఈ మంత్రముయొక్క అర్థము. ఈ పవమాన స్తోత్రములచే ద్రోణకలశము, ఆధవనీయము, పూతభృత్తు అను గ్రహములను (పాత్రములను) మూఁడిందిని అభిమర్శించి గ్రహించవలెను. ఇట్లు చేయుటచేత యజమానుఁడు పశువంతుఁడు ప్రజావంతుఁడును అగును. విధి లిఖితమైన సంపూర్ణాయువును పొందుము. అపమృత్యువుచే మరణించఁడు. ఈ గ్రహముల నభిమర్శించునపుడు ఈ అనువాకమునందలి "ఉపయామ గృహీతోఽసి" అను మంత్రమును పఠించవలెను. ఈ విధముగ ద్రోణకలశాది పాత్రత్రయాభిమర్శనము విధించఁబడినది.

ద్వితీయానువాకమునందు ప్రాతస్సవనము, మాధ్యందిన సవనము, తృతీయ సవనము అనెడి సవనములు మూఁడు నిరూపించఁబడినవి. అనఁగా ఆ మూఁడు సవనములందు చేయవలసిన అనుష్ఠానము వివరించఁబడినది. ఈ సందర్భమున ఉపాంశు గ్రహ హోమము విధించఁబడినది. ద్రోణకలశము ఆదిత్య రూపముగాను, ఆధవనీయ పూతభృత్తులు రెండును సముద్ర రూపములుగాను వర్ణించఁబడినవి. మఱియు సోమయాగమునకు అధ్వర మనెడి వ్యవహారము వచ్చినవిధము. దేవతలు అసురులును సోమయాగమును చేసినను దేవతలు అసురులను జయించుటకు అవలంబించిన ఉపాయములు మొదలగు నంశములు విపులముగ వివరించఁబడినవి. ఈ విధముగ ద్వితీయానువాకమున సోమయాగ విధి స్మరించఁబడినది.

తృతీయానువాకమునందు సోమావేక్షణము విధించఁబడినది. అనఁగా సోమరసమును హోమము చేయుటకై కొన్ని పాత్రములయందు పోసి యజమానుఁడు ఆ పాత్రములందలి సోమరసమును మొదట సామాన్యాకారముగ చూచి పిమ్మట ఒక్కొక్క పాత్రమును ప్రత్యేకముగ సంబోధించి ఆ పాత్రములందలి సోమమును చూడవలెను. "ఓ ఉపాంశు పాత్రమా! నీవు బలము నొసఁగుదానవు. కావున నా ఉచ్ఛ్వాస రూప ప్రాణముకొఱకు, బలముకొఱకును నన్ను శోధించుము" అని యీవిధముగ ఆ యా పాత్రములను సంబోధించవలెను. ఉపాంశువు, అంతర్యామము, ఉపాంశు సవనము, ఐంద్రవాయవము, మైత్రావరుణము, శుక్రామంథి, ఆశ్వినము, అగ్రయణము, ఉక్థ్యము, ధ్రువము, షోడశి, ద్రోణకలశము, ఆధవనీయము, పూతభృత్తు, ఆహవనీయము, అను పాత్రములందు సోమరసమును పోసి ఈ పాత్రములను సంబోధించుచు వేఱువేఱు విధముగ తనకు ఆ యా ఫలముల నొసఁగుమని యజమానుఁడు ప్రార్థించుచు ఆ యా పాత్రములందలి సోమమును చూచును. ఇందుఁగల విశేషాంశములు ఈ తృతీయానువాకమున వివరించఁబడినవి.

చతుర్థానువాకమునందు వేదికరణ సాధనములైన స్ఫ్యాదులను ప్రార్థించుట చెప్పఁబడినది. యజ్ఞమునందు ఒక వేదిని నిర్మింతురు. ఆ వేదిని నిర్మించుటలో కొన్ని సాధనము లవసరములై యున్నవి. ఆ సాధనముల ఉపస్థాన (ప్రార్థన)మని యర్థము. 'స్ఫ్యము' అను ఖనన సాధన విశేషము, 'విఘనము' అను నేలను చదును చేయుట కుపయోగించు సాధన విశేషము, 'పర్శువు' అను తృణాదులను ఛేదించుటకు సాధనమైన కొడవలి మొదలగునవి వేదికరణ సాధనములుగా చెప్పఁబడినవి. ఈ సాధనములను ప్రార్థించవలెను. ఇట్లే ద్రోణకలశాదులను నమస్కరించుట కూడ విధించఁబడినది. ఇంతియ కాక నమస్కరించనిచో యజ్ఞమునకు విఘాతము చేయునట్టి అగ్ని, ఇంద్ర, రుద్రాది దేవతలను యజ్ఞవిఘాతము చేయకుండుటకై నమస్కరించవలెననియు చెప్పఁబడినది. ఈ విధముగనే ద్యావా పృథివీ దేవతలు, సూర్యుఁడు, వాయువు, యముడు, సదసస్పతియైన బ్రహ్మ మున్నగు దేవతలు కూడ నమస్కార విషయులుగా వర్ణింపఁబడినారు. ఏతదుపస్థాన మంత్రములు ఈ చతుర్థానువాకమునందు ఆమ్నాతములైనవి.

యజ్ఞమునందు హోమము చేయఁగా మిగిలిన సోమరసమును యజమానుఁడు, పిమ్మట అధ్వర్యుఁడు మున్నగు ఋత్విజులును త్రాగవలె ననెడి విధియు, త్రాగుచున్న సమయమును, త్రాగిన యనంతరము చేయవలసిన విధానము పంచమానువాకమునందు వివరించఁబడినవి. ఈ ప్రక్రియను చెప్పునట్టి మంత్రములు భక్షమంత్రములని ఇచట వ్యవహరించఁబడినవి. వాగ్దేవత సోమరసమును త్రాగి తృప్తి చెందుఁగాక యని వాగ్దేవత ప్రార్థించఁబడినది. క్రతువు సిద్ధించుటకై సోమరసము త్రాగుసమయమున వాంత్యాద్యుపద్రవము కలుగఁజేయకుండ తన లోపల ప్రవేశించుటకు ప్రార్థించఁబడినది, "మే మందఱము సోమరసమును త్రాగి దేవతల మైతిమి. జ్యోతిస్స్వరూపుఁడైన సూర్యునిఁ జూచి యింద్రాది దేవతలను పొందితిమి. ఇటువంటి మమ్ము పాపరూప శత్రువు ఏమి చేయఁగలదు?" అని ఈ యనువాకమునందలి ఏడవ మంత్రము చెప్పినది. పదవ మంత్రమున ఋత్విజు లందఱు సోమరసమును త్రాగువిధము చెప్పఁబడినది. ఈ సందర్భమున పితృదేవతలకు పురోడాశ శకల రూపములైన అన్నపు ముద్దలను సమర్పించుచు వారిని నమస్కరించు విధము కూడ చెప్పఁబడినది. ఇచట సోమము దేవతా రూపమున వర్ణించఁబడినది.

షష్ఠానువాకమునందు పృషదాజ్య మభిహిత మైనది. దధి మిశ్రితమైన ఆజ్యము పృషదాజ్య మనఁబడును. ఈ పృషదాజ్యమును హోమము చేయుటకై స్రుచములోనికి గ్రహించునపుడు వలను పక్షి చూచినను; అది జాఱి పడినను యజమానుని పశువులు మరణించుట, యజమానుఁడు మరణించుట సంభవించునని, తద్దోష పరిహారమునకై ఉపాయాంతరములు చెప్పఁబడినవి. జాఱి పడిన పృషదాజ్యము నభిమంత్రించి ఉదకమును చల్లి స్రుచమును శుభ్రము చేసి, దానియందు శత పరిమిత హిరణ్యము నుంచి మఱియొక పృషదాజ్యమును దానిలోనికి గ్రహించి దానిని అశ్వముచే ఆఘ్రాణము చేయించి ఆయతనమునం దుంచవలెనని చెప్పఁబడినది. ఈ ప్రక్రియకు సంబంధించిన మంత్రములు ఈ షష్ఠానువాకమునం దామ్నాతము లైనవి. ఈ సందర్భమున పృషదాజ్యము పలురకములుగా స్తుతించఁబడినది.

సప్తమానువాకమునందు స్తుతశస్త్రములు అభిహితములైనవి. ఉద్గాతలచే గానము చేయఁబడు స్తోత్రములు స్తుతము అనఁబడును. హోతలచే గానము చేయఁబడు స్తోత్ర విశేషములు శస్త్రము అనఁబడును. ఈ స్తోత్రములు యజ్ఞమునందు ఉద్దిష్టులైన దేవతలకు సంబంధించినవి. ఈ అనువాకమునందు మూఁడు మంత్రములు కలవు. అందు మొదటి మంత్రమున బ్రహ్మ, ఉద్గాత అను ఋత్విజుల పరస్పర సంభాషణము ఈ విధముగా నుండును. "ఓ సవితృదేవా! 'బ్రహ్మన్ స్తోష్యామః' అని ఉద్గాత నీకొఱకు పలికి యున్నాఁడు. ఆ స్తోత్రమును నీ వనుమతించుము. ఈ యజ్ఞమును ఘనముగ నిర్వర్తింపఁజేయుము. ఓ ఉద్గాతలారా! బృహస్పతియే అయిన నేను బ్రహ్మను. మనుష్యమాత్రుఁడను గాను. అటువంటి నేను చెప్పుచున్నాను. మీరు ఋగక్షరముల నుచ్చరించుటయందు సావధానులై యుండుఁడు. స్తోత్రముయొక్క శరీరమే ఋక్కు. అట్టి ఋక్కును రక్షించునది సామము. మీరు గానము చేయుచుండఁగా యజమానునకు మీ రొసఁగిన ఆశీస్సులు, మీ తలంపులు యథార్థము లగుఁగాక. మీరు మనస్సుచే యథార్థమును స్మరించుఁడు. వాక్కుచే సత్యమును పలుకుఁడు. సవితృదేవుని యనుజ్ఞ ననుసరించి స్తోత్రమును పఠించుఁడు." అని ప్రథమ మంత్రమున చెప్పఁబడినది. పిమ్మట 'బ్రహ్మన్ స్తోష్యామః ప్రశాస్తః' అని ఉద్గాత పలుకఁగా, బ్రహ్మ 'దేవ సవిత రేతత్తే' అని పలికి, 'ఓం స్తుత' అని అనుజ్ఞ నిచ్చును.

'ఓ స్తోత్రమా! నీవు ఉత్తమ స్తోత్రమవు. ఓ శస్త్రమా! నీవు ఉత్తమ శస్త్రమవు. మీనుండి నేను నాకొఱకు సారమును సంపాదించుచున్నాను. మీ ఉభయుల అనుగ్రహమువలన ఇంద్రియ వైకల్యము లేనివారమై అభీష్ట ఫలము నొందుచున్నాము' అని యజమానుఁడు ఈ రెండవ మంత్రమును పఠించుచు స్తుతశస్త్రముల ననుమంత్రించవలెను. స్తుతశస్త్రముల దోహమే అనుమంత్రణమని వైదికుల పరిభాష. ఆ స్తుతశస్త్రముల దోహము మూఁడవ మంత్రమున వివరించఁబడినది. మూఁడవ మంత్రముతో సప్తమానువాకము సమాప్త మైనది.

అష్టమానువాకమునందు తృతీయ సవన, మాధ్యందిన సవన గత హోమవిశేష మంత్రము లామ్నాతములైనవి. వీనిలో ప్రస్థిత యాజ్యా హోమములు, వైశ్వకర్మణ హోమములు కలవు. యజమానుఁడు భార్యతో కూడ పూతభృత్తనెడి పాత్రమునందు మంత్ర పఠన పురస్సరముగ ఆశిర మనెడి దధివిశేషమును పోయుట మున్నగు నంశములు కూడ ఈ యనువాకమునందు ప్రతిపాదితములైనవి. "ఇన్ద్ర ఋషిభిః", "ఇన్ద్రావరుణా సుతపా", "ఇన్ద్రశ్చ సోమం పిబతా", "ఆ నో వహన్తు సప్తయే", "ఇన్ద్రావిష్ణూ పిబతమ్", "ఇమం స్తోమ మర్హతే" అనెడి యాజ్యా మంత్రములందు ప్రతిపాదింపఁబడిన ఇంద్రాది దేవతల నుద్దేశించి చేయఁబడు హోమములు ప్రస్థిత యాజ్యా హోమము లనఁబడుచున్నవి. ఈ హోమములు మొదటి రెండు మంత్రములందు చెప్పఁబడినవి. ఇవి తృతీయ సవన గత మంత్రములు.

"యజ్ఞపతి చైత్ర వైశాఖ మాసములందు జ్యోతిష్టోమ యాగము చేయకుండుటచే ప్రజలు అన్నము లేనివారై బాధపడుచున్నా రనియు, అందువలన ఈ యజమానుఁడు పాపి యనియు ఋషులు ఉద్ఘాటించుచున్నారు. కావున విశ్వకర్మ యజ్ఞపతులమైన మమ్ము చైత్ర వైశాఖ మాసములందు జ్యోతిష్టోమము ననుష్ఠించుటకు ప్రోత్సహించుఁగాక." ఈ ఋక్కు మొదలుకొని అయిదు ఋక్కులతో ఆగ్నీధ్ర స్థానమునందలి అగ్నియందు చేయఁబడు ఐదు హోమములు వైశ్వకర్మణ హోమములుగా వ్యవహరింపఁబడుచున్నవి. చైత్ర వైశాఖ మాసములందు జ్యోతిష్టోమ యాగము చేయకుండుటచే ఈ యజ్ఞపతిని పాపి యని తెలిసి ఉగ్రులైన ఋషులు నమస్కారముచే శాంతులు కావలెనని యజమానుఁడు ప్రార్థించుట ద్వితీయ ఋక్కునందు కలదు. "కొందఱు యాగకర్తలు యాగము చేయుదుమని చెప్పి ధనము సంపాదించి యాగము చేయక ఆ ధనమును భోగమునకై ఉపయోగించుచుందురు. అట్టి వారిని జూచి ఆగ్నీధ్రాది స్థానములందలి అగ్నులు ఖేదపడుచుండును. అట్టివారియొక్క దురిష్టిని నశింపఁజేయునట్టి మా యిష్టిని మంచి యిష్టిగా విశ్వకర్మ చేయుఁగాక" యని నాల్గవ ఋక్కు చెప్పుచున్నది. పంచమ ఋక్కునందు పితృదేవతా నమస్కారము విహితమైనది. ఈ అష్టమానువాకమునందలి 9, 10, 11, 12 మంత్రములను పఠించుచు యజమానుఁడు పత్నీ సహితుఁడై ఆమె మథించిన ఆశిరమును పూతభృత్తనెడి పాత్రమునందు పోయవలెననెడి విధి చెప్పఁబడినది. ప్రతిప్రస్థాత యనెడి ఋత్విజుఁడు చివరి నాలుగు మంత్రములను పఠించుచు ధ్రువపాత్రమును చూచుట, దానిని గ్రహించుట, కదలించుట అను ప్రక్రియలు చేసి అనంతరము ఆ ధ్రువపాత్రమునందలి సోమరసమును హోతృ చమసమునందు పోయవలె ననెడి అంశములు అష్టమానువాకమునందు వివరింపఁబడినవి.

నవమానువాకమునందు ప్రతిగరానంతరభావి మంత్రము లామ్నాతములైనవి. మంత్రముచేత ప్రోత్సాహము చేయుట ప్రతిగర మనఁబడును. ప్రాతస్సవన, మాధ్యందిన సవన, తృతీయ సవనములందు హోత చేయవలసిన స్తోత్రములు కలవు. వీనికి శస్త్రము అని వైదిక వ్యవహారము. ప్రశంస చేయు సమయమున హోత అధ్వర్యు నాహ్వానించినచో ఆ యాహ్వానమును హోత వజ్ర ప్రహారమయముగ చేసినవాఁ డగును. అందువలన ప్రాతస్సవనమునందలి శస్త్రముల (హోత గానము చేయు స్తోత్రముల) కన్నిటికి అధ్వర్యుఁడు ప్రతిగరము చెప్పి 'ఉక్థశాః' అను మంత్రముచేత హోతను స్తుతించవలెను. 'శస్త్రమును బాగుగ ప్రశంసించినవాఁడవు' అని ఆ మంత్రమున కర్థము. దీనిచేత వజ్రప్రహార మంతర్ధాన మగును. ప్రతిగరానంతరభావి మంత్రములలో 'ఉక్థశాః' అను మంత్రము మొదటిది. ఇట్లే మాధ్యందిన సవనమునందలి శస్త్రముల కన్నింటికి ప్రతిగరము చెప్పి, పిమ్మట "ఉక్థం వాచి" (నీ వాక్కునందు శస్త్రము బాగుగ ప్రవర్తింపఁజేయఁబడినది.) అను మంత్రముచే అధ్వర్యుఁడు హోతను స్తుతించవలెను. ఇది రెండవ మంత్రము. ఈ విధముగనే తృతీయ సవనమునందు కూడ శస్త్రములకు ప్రతిగరము చెప్పి, అనంతరము "ఉక్థం వాచి ఇన్ద్రాయ" అను మంత్రముచే అధ్వర్యుఁడు హోతను స్తుతించవలెను. ప్రాతస్సవనము సమాప్తమైన పిమ్మట అధ్వర్యుఁడు తనయందు తేజస్సును, మాధ్యందిన సవనము సమాప్తము కాఁగానే ఇంద్రియ సామర్థ్యమును, తృతీయ సవనము సమాప్తమైన తరువాత పశువులను పొందుననియు, అట్టి అధ్వర్యుఁడు ముఖ్యాధ్వర్యుఁ డనియు మంత్రవేత్తలు చెప్పియున్నారని ఈ అనువాకమునందలి చతుర్థ మంత్రము వలన

తెలియుచున్నది. ప్రతిగరానంతర థావి మంత్రములలో "ఉక్థం వాచి ఇన్ద్రియ" అను మంత్రము మూఁడవది. ఈ నవమానువాకమునందలి మిగిలిన మంత్రములలో ఈ ప్రతిగరమునకు సంబంధించిన విశేషములే విపులముగ వివరించఁబడినవి.

దశమానువాకమునందు ప్రతినిర్గ్రాహ్య మంత్రములు ఆమ్నాతము లైనవి. ప్రతినిర్గ్రాహ్య మనునది ఒకా నొక గ్రహమునకు (పాత్రమునకు) పేరు. ఈ పాత్రములలో ఇంద్ర వాయుదేవతాకము, అశ్వినీదేవ దేవతా కము, మిత్రావరుణ దేవతాకమును కలవు. అధ్వర్యుఁడు ఈ అనువాకమునందలి మంత్రములను పఠించుచు ఈ పాత్రములను వరుసగా గ్రహించి, అందలి సోమరసమును వంచి వానిని హోత కీయవలెను. ఈ విష యము ఇచట విశేషముగ వివరించఁబడినది. అదిత్యోపస్థానము మున్నగునవి మఱికొన్ని అంశములు కూడ ఈ దశమానువాకమునందు కలవు. యజమానుఁడు తనను ఉల్లంఘించి సోమమును త్రాగుచున్న శత్రువును అణఁచివేయుటకును, తాను పరలోక విషయక జ్ఞానవంతుఁ డగుటకును ఇంద్రవాయు దేవతలను ప్రార్థించును. శత్రువుకంటె తాను ఉత్తముఁడు కావలెననియు, ఇహలోక పరలోక జ్ఞానము కలవాఁడు కావలె ననియు ఇంద్రుని, మిత్రావరుణ దేవతలను, అశ్వినీ దేవతలను ప్రార్థించును. ఈ విషయము. ఈ దశమానువాకమునందు చివరిదైన దశమ మంత్రమునం దభిహిత మైనది.

ఏకాదశానువాకమునందు త్రిధాతవీయేష్టి మంత్రములు చెప్పఁబడినవి. ఈ మంత్రములందు అగ్నిస్తుతి, ఇంద్రావిష్ణుస్తుతి, ఇంద్రమాత ఇంద్రుని యుద్ధమునకై ప్రోత్సహించిన విధము, అగ్నిని స్తుతించుఁడని అధ్వర్యుఁడు ఋత్విజులను ప్రేరణ చేయుట మున్నగు నంశములు చెప్పఁబడినవి. "ఓ యగ్నీ! నీతో సఖ్యమును పొందించుచున్న యజమానుఁడు నీ రక్షణముచేత సంసారక్లేశము నధికముగ అతిక్రమించుచు న్నాఁడు. నీ రక్షణములు సుపుత్రాద్యపత్య హేతువులు, అని ప్రథమ మంత్రము అగ్నిస్తుతిని చెప్పినది. అగ్ని ప్రజ్వలనము చేయు ఋక్కులలో ఇది మొదటిది. "ఓ ఋత్విజులారా! మీరు సూర్యునివలె అగ్నిని స్తుతించుఁడు. ఆ స్తుతి పూర్వము ఋషులు చేసినట్టిది. మమ్ము విశేషముగ పోషించునది. అగ్ని హోమ నిష్పాదకుఁడు. మనకు హితమును కల్పించువాఁడు. అధ్వర్యుఁడు అగ్నిని స్తుతించుటకై ఋత్విజులను ప్రేరణ చేసిన విధము ఈ రెండవ మంత్రమువలన తెలియుచున్నది. 3, 6, 7, 8 మంత్రములు కూడ అగ్నిస్తుతి ప్రతిపాదకములే. "ఓ ఇంద్రావిష్ణు దేవతలారా! ఈ అనుష్ఠించఁబడుచున్న కర్మ నిర్విఘ్నముగ పరిసమాప్తి నొందుటకై మిమ్ము ఈ కర్మచేత, హవిర్లక్షణమైన అన్నముచేతను సంతోషపఱచుచున్నాను. మఱియు నాశరహితములైన అనుష్ఠాన మార్గములచేత మమ్ము కర్మయొక్క పారమును పొందించుచున్న వార లగుచు ఈ యజ్ఞమును సేవించుఁడు. మాకు ధనమును సంపాదించుఁడు." అని నాల్గవ మంత్రము ఇంద్రావిష్ణుస్తుతిని చెప్పుచున్నది. "ఓ కుమారా! నీవు శత్రువులను చంపి ఊరకుండఁగా ఈ దేవతలు నిన్ను పరిత్యజించుచున్నారు" అను విషయమును ఇంద్రమాత గుర్తింపఁజేయఁగా మాతృబోధానంతరము ఇంద్రుఁడు వృత్రవధోద్యుక్తుఁడైనట్లు దశమ మంత్రమువలన తెలియుచున్నది. ఈ ఏకాదశానువాకముతో ద్వితీయ ప్రపాఠకము సమాప్త మైనది.

తృతీయ ప్రపాఠకమునందు అతిగ్రాహ్యగత మంత్రము లామ్నాతము లైనవి. అతిగ్రాహ్య మనఁగా ఒకానొక పాత్రము (గ్రహము). వివిధ దేవతాకములైన అతిగ్రాహ్య గ్రహములు కలవు. ప్రతిప్రస్థాత యనెడి ఋత్విజుఁడు అగ్నిదేవతాకమైన అతిగ్రాహ్య గ్రహమును "అగ్నే తేజస్విన్" ఇత్యాది మంత్రమును పఠించుచు హోమము చేయవలెను. "తేజోవిదసి" ఇత్యాది మంత్రముచేత అనుమంత్రణము చేయు వలెను. నేష్ట యను ఋత్విజుఁడు ఇంద్రదేవతాకమైన అతిగ్రాహ్య గ్రహమును "ఇన్ద్రౌజస్విన్" ఇత్యాది మంత్రమును పఠించుచు హోమము చేయవలెను. "ఓజోవిదసి" ఇత్యాది మంత్రమును పఠించుచు అను మంత్రణము చేయవలెను 'ఉన్నేత' యను ఋత్విజుఁడు "సూర్య భ్రాజస్విన్" ఇత్యాది మంత్రమును చదువుచు సూర్యదేవతాకమైన అతిగ్రాహ్య గ్రహమును హోమము చేసి "సుపర్వదపి" ఇత్యాది మంత్ర మును పఠించుచు అనుమంత్రణము చేయవలెను. హోమానంతరము అగ్ని, ఇంద్ర, సూర్యదేవతలు తమ

యందు మేధను, ప్రజను, ఇంద్రియమును కలుగఁజేయవలెనని ప్రార్థించుచు ప్రతిప్రస్థాతాది ఋత్విజులు సదస్సునందు ప్రత్యఙ్ముఖులై హోమశేషమును భక్షించవలెనని ప్రథమానువాకమునందు చెప్పఁబడినది.

ద్వితీయానువాకమునందు స్తోత్రోపాకరణ ప్రతిగరాంగమంత్రములు చెప్పఁబడినవి. యజ్ఞమునందు గానము చేయఁదగిన సామమునకు హింకారము, ప్రస్తావము, ఉద్గీథము, ప్రతిహారము, నిధనము అను అయిదు భాగములు కలవు. వీనిలో హింకార నిధన రూపములైన ఆద్యంత భాగములు ఋత్విజు లందఱి చేతను గానము చేయఁదగినవి. ప్రస్తావము, ఉద్గీథము, ప్రతిహారము అను భాగములు వరుసగ ప్రస్తోత ఉద్గాత, ప్రతిహర్త అను ఋత్విజులు గానము చేయఁదగినవి. వీరు ఈ సామభాగములను గానము చేయుచుండఁగా అధ్వర్యు భిన్నులైన ఋత్విజు లందఱు 'ఓమ్' అని ఉపగానము చేయవలెను. "వాయుర్హింకర్తా ఽగ్నిః ప్రస్తోతా ప్రజాపతిః సామ బృహస్పతి రుద్గాతా విశ్వేదేవా ఉపగాతారో మరుతః ప్రతిహర్తార ఇన్ద్రో నిధనమ్" ఇత్యాది మంత్రముచే ఋత్విలు వాయ్వాది దేవతా రూపమున చెప్పఁబడిరి. సర్వదేవతా జనకుఁడగు ప్రజాపతి సమష్టి స్వరూపుఁ డగుటచే సంపూర్ణ సామ స్వరూపుఁడు. వాయ్వాది దేవతలు ప్రజా ప్రత్యేకదేశ లగుటచే సామైకదేశ హింకారాది కర్త లగుచున్నారు. అధ్వర్యుఁడు స్తోత్రము నుపాకరణము చేయవలెను. అనఁగా స్తోత్రపాఠమును గానము చేయుటకు అనుజ్ఞ నీయవలెను. ఈ విధముగ పవమాన స్తోత్రము లన్నిటియందు ఉపాకరణము జరుగుచుండఁగా "వాయుర్హింకర్తా" అను మంత్రమును పఠించుచు అధ్వర్యుఁడు ప్రస్తోతకు బర్హిర్ముష్టి నీయవలెను. ఈ విషయములకు సంబంధించిన మంత్రము లన్నియు ద్వితీయానువాకమునం దభిహితము లైనవి.

తృతీయానువాకమునందు రెండు అదాభ్యాంశు గ్రహములకు సంబంధించిన మంత్రము లామ్నాతము లైనవి. వస్త్రమునందు మూట కట్టి ఉంచిన సోమలతా సమూహమునుండి మూఁడు అంశువులను ఇందలి మొదటి మంత్రమును పఠించుచు వేఱుగా తీసి హోతృచమసమునందలి వసతీవరీ నామకములైన ఉదకముల నుండి కొంత ఉదకమును అదాభ్యాంశు గ్రహమునం దుంచి రెండవ మంత్రమును పఠించుచు ఈ మూఁడు అంశువులచే ఐదు మారులు గాని, ఏడు మారులు గాని కదలించవలెను. ఇచట మూఁడు అంశువులను సోమలతా సమూహమునుండి విడఁదీయుటకు గాయత్రీ, త్రిష్టుప్, జగతీ చ్ఛందస్సులు వేరు వేరు సాధనములుగా చెప్పఁబడినవి. ఈ సందర్భమున వసు రుద్రాదిత్య దేవతలు మూఁడు విధములుగ వేరు వేరుగ చెప్పఁబడిరి. ఈ సోమాంశు రూపమైన అన్నమును పొందునట్టి అగ్నీంద్ర విశ్వేదేవతలు కూడ ముగ్గురు చెప్పఁబడిరి.

ఇచట పదునొకండు రకములైన ఉదకముల నామధేయములు చెప్పఁబడినవి. అనఁగా ఉదకములు పదునొకండు విధములుగా ఉన్నవని యర్థము. లోకవ్యవహారమునందు ఉదకములకు ఈ నామధేయములు లేవు గనుక ఇవి గోప్యములని వర్ణించఁబడినవి. 1 మాన్దాః=మంద గతి కలవి. 2 భన్దనాః=మంగళకరములు. 3 కోతనాః=జ్ఞానమును కలుగఁజేయునవి. 4 నూతనాః=అభినవములు. 5 రేశ్యః=శీఘ్రగమనముచే భూమిని హింసించునవి. 6 మేష్యః=స్పర్ధ వహించునవి. 7 వాశ్యః=శబ్దము (ధ్వని) చేయునవి. 8 విశ్వభృతః=విశ్వమును ధరించునవి. 9 మాధ్వ్యః=మధుర రసము కలవి. 10 కకుహాః=దిక్కులవలె ప్రధానము లైనవి. 11 శుక్రాః=ప్రకాశించునవి. ఈ పదునొకండును ఉదక నామధేయములు. అదాభ్యాంశు గ్రహమునందలి ఉదకములందు సోమరసమును, పెరుగును మిశ్రితము చేసి దానిని పూర్వోక్తములైన ఉదక నామముల నుద్దేశించి హోమము చేయవలెను. అనంతరము ఈ మూఁడు సోమాంశువులను మహా సోమాభిషవమునందు విడువవలెనని ఈ విషయములు విపులముగ ఈ తృతీయానువాకమునందలి మంత్రములందు చెప్పఁబడినవి.

చతుర్థానువాకము తృతీయానువాకమునందలి మంత్రములకు వ్యాఖ్యాన రూపము; అనఁగా వివరణాత్మకము. యజ్ఞకర్త తృతీయానువాకమునందలి "మాన్దాసు తే శుక్ర" ఇత్యాది మంత్రములను ఉదకాభిమాని దేవతల ప్రీతికై పఠించవలెననియు, పఠించుటవలన యజమానుఁడు ఆ ఉదకముల నామధేయము

లచేతనే అభిమాన దేవతలను సంతోషపఱచి ద్యులోకమునుండి వర్షమును సంపాదించుననియు చతుర్థాను వాకమునందలి ప్రథమ మంత్రము వివరించినది. దధిసారమును సోమసారముతో కలిపి దానిని పగటిరూపుఁడైన సూర్యునియొక్క కిరణములచే గ్రహించుచున్నానని తృతీయానువాకమందలి "శుక్రం తే" ఇత్యాది మంత్రము చెప్పినది. రాత్రియు సూర్యకిరణములును వృష్టికి స్వామిభూతములు. అనఁగా సూర్యరశ్మి యుక్త కాలము, రాత్రికాలము గాక వృష్టికి మఱియొక కాలము లేదు. రాత్రి యనునది సూర్యునియొక్క పగటి రూపమును నిరూపించునది. సూర్యుని కిరణములు వర్షమును కురియించుటకు కారణములు. కావున యజమానుఁడు "శుక్రం తే" ఇత్యాది మంత్రమును పఠించుటవలన రాత్రి లక్షణ కాలముచేతను, సూర్యుని కిరణములచేతను ద్యులోకమునుండి వర్షమును భూమియందు పడవేయుచున్నాఁడని ఈ అనువాకమునందలి రెండవ మంత్రము వివరించినది. "కకుహగ్ం రూపం వృషభస్య రోచతే" ఇత్యాది మంత్రమునందలి "కకుహమ్" "రూపమ్" అను పదములచే వృష్టి వివక్ష చేయఁబడినదను అర్థమును ఈ చతుర్థానువాకము నందలి బ్రాహ్మణము వివరించినది. కనుక యజమానుఁడు ఏతన్మంత్ర పాఠముచే వర్షమును పొందునని స్పష్ట మగుచున్నది. ఇట్లే హోమమువలనను, సోమాభిషవమునందు హిరణ్యమును ఉంచుటవలనను కలిగెడి లాభములను కూడ ఈ చతుర్థానువాకము వివరించినది. తృతీయానువాకమునందలి "ఇన్ద్రాగ్నీ" ఇత్యాది మంత్రమును పఠించుచు యజమానుఁడు ఉదకములను స్పృశించుట వలన ఉదకములు ఔషధము వంటివి కావున, చికిత్స చేసిన వాఁడే యగుచున్నాఁడని ఈ యనువాకము వివరించినది.

పంచమానువాకమునందు అగ్నిష్టోమమును విడిచి వికృతిరూప ద్వాదశాహ శేషములైన పృశ్నిగ్రహములు (పాత్రములు) చెప్పఁబడినవి. ద్వాదశాహ క్రతువునకు అగ్నిష్టోమము ప్రకృతి. ద్వాదశాహ క్రతువు వికృతి. ఈ క్రతువునందు సోమమును అభిషవము చేయుటకు ముందు సోమోన్మాన కరణములైన "ఇన్ద్రాయ త్వా వృత్రఘ్నే" ఇత్యాది ప్రకృతి యాగమంత్రముల నుచ్చరించి, ఈ అనువాకమందలి "వాయురసీ" త్యాదులైన పది మంత్రములచేతను పృశ్నిగ్రహముల పదింటితో సోమలతను కొలువవలెను. ఉన్మాన మనఁగా కొలుచుట. పూర్వము ప్రజాపతి విరాట్స్వరూపమైన "వాయురసీ"త్యాది మంత్ర దశకముచే సమస్త జగత్తును సృష్టించి అందు కొంత భూత(కాల)ముగాను, కొంత భవిష్యత్తుగాను విభజించెను. కాని ప్రజాపతి ఆ విరాట్టును ఋషులకు తెలియఁజేయలేదు. జమదగ్ని మహర్షి మాత్రము తపస్సు చేసి ప్రజాపతి యను గ్రహమువలన ఆ విరాట్టును తెలిసికొని దానిచేత ధేనురూప భోగములను సృజించెను. 'వాయురసీ'త్యాది మంత్రములచేత 'పృశ్ని' శబ్దాభిధేయములైన ధేనురూప భోగములు సృజింపఁబడినవి కావున, ఆ మంత్రము లకు 'పృశ్ని' అను పేరు ఏర్పడినది. పృశ్నులు (కామధేనువులు) వాయురసీత్యాది మంత్రములచే సృజింపఁ బడినవి కనుక మంత్రములకు కూడ 'పృశ్ని' అను పేరు కలుగుట సమంజసమే. ఈ విషయము ఈ పంచ మానువాకమునందలి రెండవ మంత్రమువలన స్పష్ట మగుచున్నది.

'వాయురసీ'త్యాది మంత్ర సముదాయమునందుఁ గల పది మంత్ర భాగములలో మొదటి అయిదు మంత్రములకు ప్రాణాపాన స్వాస్థ్యము ప్రభృతి పశుప్రాప్తి పర్యంతము గల ఫలము చెప్పఁబడినది. ఆ మంత్ర దశకమునందలి ఉత్తర మంత్ర పంచకమునకు దిక్ స్వర్గములయొక్క జయము చెప్పఁబడినది. అనఁగా పూర్వమంత్ర పంచకము కామప్రాపకము. ఉత్తర మంత్ర పంచకము లోకజయ హేతువు. పృశ్ని గ్రహములతో సోమమును సత్యముయొక్క రక్షణము, సత్యముయొక్క బాహుళ్యము, సత్యముయొక్క విశేష ధారణము, సత్యముయొక్క అనృత రాహిత్యము, సత్యముయొక్క ప్రకాశములకొఱకు కొలుచు చున్నానని ఉత్తర పంచకము చెప్పుటచే యజమానునకు భూమ్యంతరిక్ష ద్యులోకముల విజయము, దిగ్వి జయము, స్వర్గలోక జయము ఫలములుగా లభించుచున్నవని స్పష్టము చేయఁబడినది.

షష్ఠానువాకమునందు పర సంజ్ఞకములైన అతిగ్రాహ్య విశేషములు చెప్పఁబడినవి. అతిగ్రాహ్యము లనఁగా (సోమరసముతో నిండిన)పాత్ర విశేషములు. 'గవామయన' మనెడి పేరు గల సంవత్సర యాగ మొకటి కలదు. పూర్వమాస షట్క మనియు, ఉత్తరమాస షట్క మనియు ఆ యాగమునకు రెండుభాగములు కలవు. ఆ రెండు షట్కముల మధ్యమున 'విషువత్' అను పేరు గల ఒక ప్రధానమైన అహస్సు కలదు.

ఆ అహస్సునకు పూర్వము పరస్సామము లనెడి మూఁడు అహస్సులు కలవు. ఈ విధముగనే ఆ హవిస్సునకు పరమున అర్వాక్సామము లనెడి మూఁడు అహస్సులు కలవు. అవి ఉత్తర మాస షట్కమున కాదియం దుండును. వానిలో పరస్సామ నామకములైన మూఁడు అహస్సులందు వరుసగా చెప్పఁబడిన "అద్భ్యస్త్వౌషధీభ్యః", "ఓషధీభ్యస్త్వా ప్రజాభ్యః", "ప్రజాభ్యస్త్వా ప్రజాపతయే" ఇత్యాదులైన మూఁడు మంత్రములచేత మూఁడు అతిగ్రాహ్యనామక సోమరసములను గ్రహింపవలెను. ఇట్లే అర్వాక్సామ నామకములైన మూఁడు అహస్సులందు విపరీత క్రమమున అనఁగా "ప్రజాభ్యస్త్వా ప్రజాపతయే", "ఓషధీభ్యస్త్వా ప్రజాభ్యః", "అద్భ్యస్త్వౌషధీభ్యః" అను విధముగ ఆ మంత్రములచేతనే మూఁడు అతిగ్రాహ్య నామక సోమ రసములను గ్రహింపవలె ననెడి విధి కలదు.

పూర్వము దేవతలు అతిగ్రాహ్యములు లేని కేవల యజ్ఞముచేత పొందఁలేని ఫలమును పర సంజ్ఞకములైన అతిగ్రాహ్య గ్రహములచే పొందిరి. కావున ఆ గ్రహములకు పారయన్తి-అభీష్ట సమాప్తిం గమయన్తీతి పరాః-అభీష్ట సమాప్తిని పొందించునవి అను వ్యుత్పత్త్యర్థము ననుసరించి పర సంజ్ఞ సార్థక మైనది. ఈ విషయము ఈ షష్ఠానువాకమునందలి ప్రథమ మంత్రమువలన వ్యక్త మైనది. కేవల యజ్ఞముచే పొందఁ బడని ఫలము నొందుటకై పర సంజ్ఞకములైన అతిగ్రాహ్య గ్రహములను గ్రహింపవలెనని రెండవ మంత్రము విధించినది. ఈ మూఁడు అతిగ్రాహ్య గ్రహములను గ్రహింపవలెనని రెండవ మంత్రము విధించినది. ఈ మూఁడు అతిగ్రాహ్య గ్రహములను గ్రహించుటవలన యజమానుఁడు ముల్లోకములను జయించునని మూఁడవ మంత్రము ఫలమును చెప్పినది. పూర్వోక్తములైన ఆమ్నాతక్రమ విపరీతక్రమములకు 4, 5 మంత్రము లందు ప్రత్యేక ఫలములు చెప్పఁబడినవి. లోకమునందు ఉదకములనుండి ఓషధులు పుట్టుచుండుట, మనుష్యులకు ఓషధులు అన్నముగా ఏర్పడుట, ప్రజలు ప్రజాపతి ననుసరించి ఉద్భవించుచుండుటయు ఈ అతిగ్రాహ్య గ్రహ గ్రహణ మంత్రముల ననుసరించియే జరుగుచున్నదని 6 వ మంత్రము చెప్పినది. ఏతద్విశేషములు 7, 8, 9 మంత్రములందు వివరముగ తెలుపఁబడినవి.

సప్తమానువాకమునందు సోమాంగముగ "ఆశ్రావయే"త్యాది మంత్రములు చెప్పఁబడినవి. పూర్వము ప్రజాపతి దేవతలను, అసురులను సృష్టించెను. వారి సృష్టి ననుసరించి యజ్ఞమును, ఛందస్సులను సృష్టించెను. పిమ్మట దేవతలు పరస్పరము ఐకమత్యము లేనివారగుటచేత నానాగతులై వివిధ ప్రాంతములకు పోయిరి. వారి ననుసరించి యజ్ఞము ఛందస్సులు దేవతలంది తొలఁగిపోయినవి. అప్పుడు దేవతలు పరస్పరము ఐకమత్యము కలవారై ఇదివరలో తాము అనుభవించిన ఐశ్వర్యమును ఇప్పుడు అసురు అనుభవించుచున్నారని తలంచి ప్రజాపతియొద్దకు పోయి విన్నవించుకొనిరి. అప్పుడు ప్రజాపతి వైదిక మంత్రముల సారమును తీసి దేవతల కొసఁగెను. అనంతరము ఆ వైదిక మంత్రముల సారముల ననుసరించి ఛందస్సులు యజ్ఞము అసురులనుండి తొలఁగి దేవతలను పొందినవి. అప్పుడు దేవతలు విజయులు, అసురులు పరాభూతులు నైరి. "ఆశ్రావయ, అస్తు శ్రౌషట్, యజ, యే యజామహే, వౌషట్" అను ఈ మంత్ర పంచకమే వైదిక మంత్రముల సారము. ఈ మంత్రములు ప్రథమ కాండమునందు ఇష్ట్యంగములుగా విధించఁబడినవి. ఇచట సోమాంగముగ విధించఁబడినవి. ఈ మంత్రముల సారమును పూర్వోక్త విధముగ తెలిసికొని ప్రయోగించిన యజ్ఞకర్త స్వయముగనే విజయవంతుఁ డగును. ఇతని శత్రువు పరాభూతుఁ డగును.

పూర్వోక్త విధముగ వైదిక మంత్రముల సారమును తెలిసికొని ఈ యజ్ఞమునందుఁగాని, లోకవ్యవహారమునందుఁగాని ఏ కొంచెము దేవతాపూజ చేసినవాఁడైనను, అతఁడు వీర్యవంతములైన వైదిక మంత్రములచే పూజించినవాఁ డగును. ఇంద్రుఁడు వృత్రుని సంహరించెను. యతులను సాలావృకముల కప్పగించెను. ఇది యంతయు పాపరూపము. ఇంద్రుఁడు అట్టి పాపకారి యగుటచే సంపూర్ణ మగునంతవఱకు యజ్ఞము ఐంద్ర మెట్లగును? అను వేదార్థవిదుల ప్రశ్నకు వేదము ఈ విధముగ సమాధానము చెప్పినది. ఇంద్రునకు రాజసి, సాత్త్వికి అని రెండు తనువులు కలవు. రాజ్యమును పాలించుచు శత్రాదులను హింసించునట్టి తనువు రాజసి. ఇది యజ్ఞార్హము కానిది. యజ్ఞమునందు హవిస్సుచే పూజింపఁదగినదియు,

యజ్ఞాంగ దేవతారూప మైనదియునగు శరీరము సాత్త్వికము. ఋజ్వలు సాత్త్విక శరీరము నుద్దేశించియే యజ్ఞము చేయుచున్నారని పూర్వోక్త ప్రశ్నకు సమాధానము. ఈ విధముగ తెలిసికొనిన యజమానునకు యజ్ఞము స్వాధీన మగును. యజ్ఞఫలము లభించును. ఈ విషయము లన్నియు సప్తమానువాకము నందు విశదీకరించఁబడినవి.

అష్టమానువాకమునందు అవభృథ కర్మయందు అంగములైన హోమాదులు చెప్పఁబడినవి. ఈ యను వాకమునందు అగ్ని, యముడు, వాయువు, ఆదిత్యుఁడు యజమానునిచే ప్రార్థనా పూర్వకముగ నమస్క రించఁబడినట్లు ఆ యా మంత్రములందు చెప్పఁబడినది. యజమానుఁడు యజ్ఞాంతమునందు యజ్ఞశాల నుండి జలసమీపమునకు వెళ్లి అచట వరుణ దేవతాకమైన హవిస్సును హోమము చేయవలెను. జలసమీపము నకు పోఁబోవుచు యజ్ఞశాలయందున్న ఆహవనీయాగ్నియందు "ఆయుర్దా అగ్నే" అనెడి ప్రథమ మంత్ర ముచే అగ్నిని ప్రార్థించుచు ఆజ్యమును హోమము చేయవలెను. ఈ సందర్భమున వేదిదాహ మనెడి ఒక ప్రక్రియ నాచరించవలెను. "యత్కుసీదమ్। అప్రతీత్తం మయి యేన యమస్య బలినా చరామి। ....... అనృణో భవామి।" -"యమునకు నేను బాకీపడియున్న ఋణమును ఈ జన్మమందే ఈ యజ్ఞప్రదేశమునం దుంటున్నవాఁడనై నిశ్శేషముగ తీర్చుకొనుచున్నాను. ఓ యగ్నీ! ఆ కారణముచేత ఉత్తమర్ణుఁడైన యమునినుండి నేను ఋణవిముక్తుఁడ నగుచున్నాను." అని ఈ మంత్రమును పఠించుచు ఆహవనీయము నుండి కొఱవిని తీసికొని దానిచే యజ్ఞశాలయందలి వేదిని కాల్చవలెను. అవభృథ, ఉదయనీయాను బంధ్య కర్మలకు పిమ్మట ఈ వేదిదాహము చేయవలెను. ఉత్తమర్ణుఁ డనఁగా ఋణము నిచ్చినవాఁడు.

పూర్వోక్తమైన అవభృథాంగ కర్మను సంకీర్ణముగ చేసిన పక్షమున సాంకర్య దోషము సంభవించును. ఆ దోషము పోవుటకై వేదిదాహకమైన దావాగ్నియందు దోసిలితో సక్తువులను హోమము చేయవలెను. ఈ విషయమును "విశ్వలోప విశ్వదావస్య త్వా" ఇత్యాది మంత్రము సవిశేషముగ వివరించినది. మంత్రా ర్థము-సమస్త పాపమును నశింపఁజేయునట్టి ఓ సక్త్వంజలీ! సమస్త పాపమును దహింపఁజేయఁ బూను కొనిన దావాగ్ని ముఖమునందు నిన్ను నుంచుచున్నాను. ఈ సక్తుహోమముచేత సంతుష్టులైన 'అగ్ధాత్' 'అహుతాత్', 'సమసనాత్' అను ముగ్గు రగ్నులు మాకు క్షుత్పరిహారమును (ఆఁకలి తీరుటను), నివాస స్థానమును, బలమును, శ్రేష్ఠధనమును చేయుదురు గాక. అగ్ని మూఁడు విధములుగా నుండును. హోమమువలన ప్రాప్తమైన దానిని భక్షించు నగ్ని 'అగ్ధాత్' అనఁబడును. హోమరహితమైన దానిని భక్షించు నగ్ని 'అహుతాత్' అని చెప్పఁబడును. సమస్తమును భక్షించు నగ్ని 'సమసనాత్' అని వ్యవహ రించఁబడును. 5వ మంత్రమును కూడ అగ్ని ప్రార్థన కలదు. 6, 7 మంత్రములు వరుసగా వాయ్వాదిత్య నమస్కార విధాయకములు. "యమస్య బలినా చరామి" అను మంత్రమునందు ప్రతిపాద్యుఁడైన యముఁడు అగ్నియే. ఇంకను ఏతద్విశేషాంశములు 8, 9, 10, 11, 12, 13, 14 మంత్రములందు వివరించఁబడినవి.

నవమానువాకమునందు వృషాలంభ మనెడి కర్మ విధించఁబడినది. ఈ కర్మయందు వృషభము నాలంభ నము చేసి వాని హవిస్సును దేవతల నుద్దేశించి హోమము చేయుట ముఖ్యమైన విషయము. దీనివలన తనకు ప్రత్యవాయము కలుగకుండుటకై ప్రజాపతిని, వృషభ జాతీయములైన గోవులను యజమానుఁడు వేడుకొనుట గమనింపఁదగినది. "ఓ గోవులారా! నేను మీకు యౌవనము కలిగియున్న వృషభము నొసఁగు చున్నాను. మీరు ఆ ప్రియునితో క్రీడించుచున్నవారై సంచరించుఁడు. పుట్టుకచేతనే మీరు భాగము కలవారు. కావున మమ్ము శపింపకుఁడు. మఱేమనఁగా- తరుణ వృషభము నొసఁగినందుకు మమ్ము అనుగ్రహించుఁడు. మీ యనుగ్రహమువలన ధనపుష్ట్యాదులు కలవార మగుదుము. ఇది "ఏతం యువా నమ్" అను ప్రథమ మంత్రముయొక్క అర్థము. వృషాలంభ కర్మ చేయు యజమానుఁడు గోవులలో ఒక వృషభము ముసలిది కాఁగా తరుణ వృషభముయొక్క చెవిదగ్గర "పిశఙ్గరూప స్తున్న స్తురీపమ్" అను మంత్రము లను జపించుచు "ఏతం యువానమ్" అను మంత్రమును పఠించి తరుణ వృషభమును గోవులలో విడువ వలెను. ఇచట గోవులను ప్రార్థించుట జరిగినది.

"నమో మహిమ్న ఉత చక్షుషే" —"దేవజనకుఁడవైన ఓ ప్రజాపతీ! సృష్ట్యాది రూపమైన నీ సర్వగోచర జ్ఞానమునకు నమస్కారము. నేను నిర్ణయించుకొనిన విషయమును నీకు చెప్పుచున్నాను. నేను చెప్పిన దానిని నీవు అంగీకరించుము. యజ్ఞసాధనమైన మంచి వృషభముతో యజ్ఞము చేయుదుము. ఈ వృషభ రూప హవ్యము దేవతలకు ప్రీతికర మగుఁగాక." ఈ మంత్రమున ప్రజాపతి ప్రార్థించఁబడినాఁడు. "దేవానా మేష ఉపానహ ఆసీత్" —ఈ వృషభమునందు దేవతల కధిక ప్రీతి యుండుటచే బంధన హేతు వైనది. దేవతలకు ప్రీతికరమైన ఈ వృషభము ఆహుతిరూపమున అగ్నియందు హుతమై ఆదిత్యుని పొంది రశ్మి రూపమున భూమియందున్న చంద్రసంబంధి జలమును గ్రహించి మేఘరూపము నవలంబించి మేఘోదర మున జలరూప గర్భముగ అయి వృష్టిరూపమున ఓషధులందు పడినదని భావము. "అగ్నౌ ప్రాస్తాఽఽ హుతి స్సమ్యగాదిత్య ముపతిష్ఠతి" అను శ్రుత్యర్థము ఈ మంత్రముచే సంగృహీత మైనది. ఇది వపాహోమ మంత్రము. 4వ మంత్రము హృదయాద్యంగ హోమ మంత్రము. 7, 8 మంత్రములు అలభ్యమానమైన వృషభమునకు సంబంధించినవే.

దశమానువాకమునందు పశుప్రాయశ్చిత్త విశేషము చెప్పఁబడినది. అతిరాత్రాది కర్మలందు తత్తద్దోష పరిహారమునకై ప్రాయశ్చిత్తము చేయునప్పుడు మేఁకను ఆలంభనము చేసి దాని వపారూపమైన హవి స్సును హోమము చేయవలెను. ఆ మేఁక ఇచట సంబోధించఁబడినది, ఆ మేఁకను ఆలంభనము చేసిన యనంతరము అది అష్టాపది (గర్భిణి) అని తెలిసినచో ఈ దశమానువాకమునందలి ప్రథమ మంత్రము నుచ్చరించుచు రెండు హోమములు చేయవలెననెడి విషయము ఇచట చెప్పఁబడినది. ఆలంభమునకు పూర్వము మేఁకను అభిమంత్రించుట, దాని గర్భమును ప్రదక్షిణముగ త్రిప్పుట, దానియొక్క ప్రతి అవయవమును ఛేదించుట, ఆజ్యహోమము మున్నగు నంశములు ఈ దశమానువాకమునందు విహితము లైనవి.

ఏకాదశానువాకమునందు యాజ్యా పురోనువాక్యలు అభిహితము లైనవి. ఆ యా ఇష్టులకు సంబంధించిన హవిస్సులను హోమము చేయునపుడు ఆ హవిస్సులు ఏ యే దేవతల నుద్దేశించి హోమము చేయఁబడునో, ఆ యా దేవతలను యజమానుఁడు ఆ యా ఫలముల నర్థించుచు స్తుతించుటయే యాజ్యా పురోనువాక్యా రూపములైన మంత్రములలోని విషయము. ఈ సందర్భమున ఇచట ఇంద్రాబృహస్పతులు, బృహస్పతి, అగ్ని, జగత్పాలకుఁడైన పరమేశ్వరుఁడు, ధాత, కుహూ, రాకా, సినీవాల్యనుమతి దేవతలు స్తుతింపఁ బడినారు. ఈ దేవతలలో కొందఱు దేవికా హవిస్సులకు సంబంధించిన వారు కూడ కలరు. ఈ ఏకాదశాను వాకమునందు 19 యాజ్యా పురోనువాక్య మంత్రము లున్నవి. విశేషాంశములు అచటనే చూడఁదగినవి. ఈ ఏకాదశానువాకముతో తృతీయ ప్రపాఠకము సమాప్త మైనది.

చతుర్థ ప్రపాఠకమునందు నైమిత్తిక కర్మ, పశ్విష్టి దర్వీహోమములు అభిహితము లైనవి. తృతీయ ప్రపాఠకములోని దశమానువాకమునందలి మంత్రములకు బ్రాహ్మణము ఈ ప్రథమానువాకమునందు చెప్పఁ బడినది. ప్రాయశ్చిత్త విశేష కర్మయందు ఆలంభనము చేయఁబడు మేఁకయొక్క శరీరము హవిస్సుగా సంకల్పింపఁబడియున్నది. ఆలంభనాంతరము అది చూడిది అని నిశ్చిత మైనపుడు గర్భస్థ శిశువు కూడ నుండుటచే సంకల్పిత హవిస్సుకంటె నధికముగ హవిస్సు ఏర్పడుచున్నది. అట్టి సమయమున ఆ యజ మానుని యజ్ఞము విగుణ మగును. తద్దోష పరిహారమునకై "సూర్యో దేవః" ఇత్యాద మంత్రముచే హోమము చేయవలెను. ఈ మంత్రమునందలి 'బృహస్పతి', 'ప్రజాపతి' శబ్దములచే యజ్ఞముయొక్క వైగుణ్య దోషము పరిహృత మగునని ఈ అనువాకమునందలి ప్రథమ మంత్రము చెప్పినది. ఒక దేవత నుద్దేశించి ఉపాకృతమైన పశువు గర్భధారణముచే అధికమైన హవిస్సు అగుటవలన రాక్షసులే ఆ పశువును పొందుదురు. రాక్షస నాశమునకై "యస్యాస్తే హరితో గర్భః" ఇత్యాది మంత్రముచే అనుమంత్రించుట వలన యజమానుఁడు ఆ పశువును దేవతలకు చెందునట్లు చేసినవాఁ డగును. "సూర్యో దేవః", యస్యాస్తే హరితో గర్భః" అను మంత్రములు పూర్వప్రపాఠకమునందలి దశమానువాకములోనివి. అచట ఆమ్నాతము లైన ఆ మంత్రముల పాఠమునకు సార్థక్యము ఇచట చెప్పఁబడినది.

ఆ దశమానువాకమందలి "ఆవర్తన వర్తయ" ఇత్యాది మంత్రముచే పశుగర్భ పర్యావర్తనము చేయవలె నని ఈ మూఁడవ మంత్రమునందు చెప్పఁబడినది. ఆ మంత్రముయొక్క వినియోగము ఈ బ్రాహ్మణము నందు చెప్పఁబడినదని అర్థము. ఈ విధముగనే ఆ దశమానువాకమునందలి మిగిలిన మంత్రములకు కూడ సార్థక్యమును తెలియఁజేయుచు ఈ యనువాకమునందలి బ్రాహ్మణము ఆ మంత్రముల వినియోగమును కూడ చెప్పినది. ప్రాయశ్చిత్త సహితముగ యజ్ఞము చేసిన యజమానుఁడు అత్యంత ధనవంతుఁ డగునని ఈ బ్రాహ్మణము ముగింపునందు స్పష్టపఱచినది.

భూత్యాదులను కోరునతఁడు చేయు యజ్ఞమునందు వశా (వంధ్య) పశువు నాలంభనము చేయవలెననెడి విధి కలదు. ఆ వశాలంభనమునకై మంత్రములు ద్వితీయానువాకమునందు ఆమ్నాతము లైనవి. ఇచట ఆలంభనము చేయఁబడు వశ కేవల వంధ్య కాదు. ఒక మారు గర్భము కలిగిన పిమ్మట సంతానము లేని పశువు వశగా మూఁడవ మంత్రమునందు అభివ్యక్త మైనది. "ఓ వశా పశూ! నీవు లోకత్రయాపేక్షచే చతుర్థవు. వృషభ సంయోగాపేక్ష లేకుండుటచే ఇంద్రియ నిగ్రహము కలదానవు, వంధ్యవు అగుచున్నావు. ఒక్క పర్యాయమే పురుషాభిలాషయుక్త మనస్సుచే నీ యుదరమునందు గర్భము శయనించెను. ద్వితీయ తృతీయ పురుష సంయోగేచ్ఛ లేకుండుటచే నీవు వశినివి. అపత్యాంతరము కలుగ కుండుటచే వశవు. అటువంటి నీవు సావీరూపమున దేవతలను పొందుము" అని మూఁడవ మంత్రము చెప్పినది. ఇదియు నాల్గవ మంత్రమును అనుమంత్రణ మంత్రములు. ౪, ౫, ౬ మంత్రములు హోమ మంత్రములు. ఆఱవ మంత్రము నందు యజమాన సహిత ఋత్విజులు హవిశ్శేషమును భక్షించవలెనని చెప్పఁబడినది.

తృతీయానువాకమునందు కామ్యపశ్వాలంభన విధి చెప్పఁబడినది. ద్వితీయానువాకమున కామ్యపశువునకు సంబంధించిన మంత్రములు మాత్రమే ఆమ్నాతము లైనవి. ఈ చెప్పఁబడిన కామ్యపశువు వశారూప కామ్యపశువే. వశాపశువు నాలంభనము చేయుటకు పూర్వము అగ్నిదేవతాకము అష్టాకపాల సంస్కృతము లైన పురోడాశమును నిర్వాపము చేయవలెనని మొదటి రెండు మంత్రములందు చెప్పఁబడినది. ఈ వశా పశువు వాయు దేవతాకముగాను, ద్యావాపృథివీ దేవతాకముగాను, అగ్నిషోమీయ దేవతాకముగాను, సరస్వతీ దేవతాకముగాను, ప్రజాపతి దేవతాకముగాను మూఁడవ మంత్రమున సహేతుకముగ నిరూపించఁబడినవి. ఈ కారణమువలన వశ సర్వదేవతాకమని ఈ మంత్రమునందే చెప్పఁబడినది. ఐశ్వర్యమును కోరు నతఁడు వాయుదేవతాకమైన వశను ఆలంభము చేయవలె ననియు, దానివలన వాయువు ఆ యజమానుని శీఘ్రముగ ఐశ్వర్యవంతుని చేయుననియు నాల్గవ మంత్రము చెప్పినది. ప్రతిష్ఠాకాముఁడైన కృషీవలుఁడు ద్యావాపృథివీ దేవతాక వశను ఆలంభము చేయవలెననియు, ఈ యాలంభము చేసిన యజమానునికొఱకు పర్జన్య దేవుఁడు దివినుండి వర్షించుననియు, అప్పుడు సస్య సమృద్ధి కలుగు ననియు పంచమ మంత్రము ప్రతిపాదించినది.

అగ్నిషోమీయ వశాలంభమువలన అన్నసమృద్ధిని, అన్నభక్షణ సామర్థ్యమును కోరు యజమానుడు అగ్నిచే అన్నవంతుఁడు, సోమునిచే అన్న భక్షణ సమర్థుఁడు నగును. వక్తృత్వ సామర్థ్యము లేని విద్వాంసుఁడు సరస్వతీ దేవతాక వశాలంభము చేయుటవలన సరస్వతీ దేవి అతనిని వక్తృత్వ సామర్థ్యము కలవానినిగా చేయును. తనచే జయింపఁబడని వానిని జయించవలెనని కోరు నతఁడు ప్రజాపతి దేవతాక వశాలంభము చేసినచో ప్రజాపతి సర్వదేవతా స్వరూపుఁడు కనుక అతఁడు సర్వ దేవతలచేతనే విజయుఁ డగును. ఈ విధముగ ౬, ౭, ౮ మంత్రములు చెప్పినవి. ద్వితీయానువాకమునందలి "ఆ వాయో భూష శుచిపాః" అను ఋక్కునకు ఇచట నవమ మంత్రమున వినియోగము చెప్పఁబడినది. ద్వితీయానువాకములోని కొన్ని మంత్రములు స్పష్టార్థము కొఱకు ఈ యనువాకమునందు వివరించఁబడినవి. వశా పశువును ఆలంభము చేయునపుడు పాటించవలసిన కొన్ని నియమములు కూడ ఈ యనువాకమునందు ప్రతిపాదించఁబడినవి. సంవత్సరసత్ర మనెడి యాగము చేసిన సంవత్సరసత్తు, సహస్రసంఖ్యాక దక్షిణా యుక్తమైన యాగము చేసిన సహస్రయాజి, సంవత్సర సదర్వాచీన యాగములందు కూడ గృహపతిగా దీక్ష నొందిన గృహమేధి అను ముగ్గురు మాత్రము ఈ వశచే యాగము చేయుట కర్హులు. వారికే ఇది యోగ్య మైనది, పొందఁ దగినదియు నగుచున్న దనెడి నియమము ఆ నియమములలో ముఖ్య మైనది.

చతుర్థానువాకమునందు జయ సంజ్ఞకములైన పదుమూఁడు మంత్రము లామ్నాతము లైనవి. చిత్తము, చిత్తి, ఆకూతము ఇత్యాదులు నాయందు ఉండుఁగాక. ఇంద్రుఁడు యుద్ధమునకు వెళ్లునపుడు శిక్షకుఁడైన ప్రజాపతి ఇంద్రునకు ఈ జయహేతువులైన మంత్రముల నొసఁగెను. ఇంద్రుఁడు హోమముచేయుట కర్హుఁడు కావున అతనియందు ప్రజాపతి కనుగ్రహము కలుగుట యుక్తము. ఆ యింద్రునకు ప్రజ లందఱు విధేయులైరి. అతఁడు తన ప్రజలయందు శిక్షకుఁడుగా నుండెను. చిత్తమ్-సామాన్యాకారముగ నిర్వికల్పక జ్ఞానముచే గోచరమగు జ్ఞానము. చిత్తిః-నిర్వికల్పక జ్ఞానము. ఆకూతమ్-సంకల్పితమైన వస్తువు. ఆకూతిః-సంకల్పము. మిగిలిన పదముల కర్థము వేదార్థదీపికయందు చూడఁదగినది. ఇది ప్రథమ మంత్రార్థము.

పూర్వము దేవాసురులు యుద్ధసన్నద్ధులు కాఁగా ఇంద్రుఁడు ప్రజాపతియొద్దకు వెళ్లెను. ప్రజాపతి అతనికి జయహేతువులైన మంత్రముల నొసఁగెను. ఇంద్రుఁడు ఆ జయహేతు మంత్రములను పఠించుచు హోమము చేసెను. దేవతలు అసురులను జయించిరి. జయహేతు మంత్రములచే జయించిరి కనుక, ఆ మంత్రములకు 'జయ' సంజ్ఞ ఏర్పడినది. స్పర్ధ కల యజమానుఁడు ఈ జయాఖ్య మంత్రములచే హోమము చేసినచో తప్పక అతఁడు శత్రుసైన్యమును జయించును. స్పర్ధ-ఒకరికంటె నొకరు మించవలెనను బుద్ధి (పోటీ).

పంచమానువాకమునందు అభ్యాతాన మంత్రములు, షష్ఠానువాకమునందు అభ్యాతాన మంత్రములచే హోమవిధి చెప్పఁబడినవి. అభ్యాతతి యనఁగా వశీకారము. ఈ మంత్రములు పదునేడు కలవు. వీనిచే అగ్న్యాది దేవతలు చెప్పఁబడిరి. అగ్ని ప్రాణులకు స్వామి. అతఁడు నన్ను (యజమానుని) రక్షించుఁగాక. ఇంద్రుఁడు లోకపాలురకు అధిపతి. యముఁ డనెడి అగ్ని భూమి కధిపతి. ఇట్లే వాయ్వాది దేవతలు అంతరిక్షాదుల కధిపతులు. అట్టి అగ్న్యాది దేవతలు ఈ బ్రాహ్మణజాతియందు, క్షత్రియజాతియందు, కోరఁదగిన ఈ ప్రజా పశ్వాది ఫలమునందు, పురస్కరణ (సన్మాన)రూపమైన ప్రాధాన్యమునందు, ఆచరింపఁబడుచున్న ఈ యనుష్ఠాన విశేషమునందు, మేము దేవతలను గూర్చి చేయు ఈ ఆహ్వానమునందును నన్ను (యజమానుని) రక్షింతురు గాక. ఓ పిత్రాదులారా! మీరు ఈ సర్వవిషయములందును నన్ను రక్షింపుఁడని ఈ అభ్యాతాన మంత్రముల అర్థము.

పూర్వము దేవతలు యజ్ఞమునందు దేని నాచరించిరో, అసురులును తమ యజ్ఞమునందు దాని నాచరించిరఁట. అప్పుడు దేవతలు అభ్యాతానము లనెడి మంత్రములను కర్మసమృద్ధి హేతువులనుగా కనుఁగొని ఆ మంత్రముల నభిముఖముగ తెచ్చి హోమము చేసిరి. ఆ హోమము చేయకుండుటచే అసురుల కర్మ సమృద్ధము కాలేదు. యజమానుఁడు ఏ కర్మచే సమృద్ధిని కోరునో, అతఁడు అభ్యాతాన మంత్రములచే హోమము చేయవలెను. అప్పు డత డా కర్మచే నిశ్చయముగ సమృద్ధి నొందునని షష్ఠానువాకమునందలి ప్రథమ ద్వితీయ మంత్రముల యర్థము. శత్రువులు కలవాఁడు అభ్యాతాన మంత్రములచే హోమము చేయవలెననియు, అట్లు చేసినచో దేవతలు విజయులైన విధముగ విజయము నొందుననియు మూఁడవ మంత్రము యొక్క సారాంశము. శత్రువులు గల యతఁడు పూర్వోక్తములైన అభ్యాతాన జయ మంత్రములచేతను, సప్తమానువాకమునందు చెప్పఁబడునట్టి రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రములచేతను హోమము చేయవలెను. ఆ హోమము చేసిన యతఁడు అభ్యాతాన మంత్రములచే శత్రువులను వశపఱచుకొనును. జయ మంత్రములచే జయించును. రాష్ట్రభృన్మంత్రములచే శత్రురాష్ట్రమును (నివాసమును) స్వీకరించును. అభ్యాతతి యనఁగా వశీకారము. జయ మనఁగా అన్యదీయైశ్వర్య నాశనము. రాష్ట్రాదాన మనఁగా శత్రుభూమి నపహరించుట యని సారాంశము. షష్ఠానువాకమునందలి ఈ మంత్రము హోమవిధాయకము. ప్రథమ మంత్రమున ఏతద్ధోమ స్తుతి చేయఁబడినది.

సప్తమానువాకమునందు రాష్ట్రభృత్సంజ్ఞక మంత్రము లామ్నాతము లైనవి. ఇవి పండ్రెండు మంత్రములు. ఈ ద్వాదశ మంత్రములచేతను ఆఱు పర్యాయములు హోమము చేయవలెను. "తస్మై స్వాహా", అని

ఒక ఆహుతిని, "తాభ్యః స్వాహా" అని ఒక ఆహుతిని హోమము చేయవలెను. ఈ మంత్రములందు గంధర్వులు,ఆ గంధర్వుల భార్యలు పేరు పేరున పేర్కొనఁబడిరి. అగ్ని నామక గంధర్వుఁడు 'ఊర్జ' అను పేరు గల ఓషధిదేవత లనెడి అతని ప్రియభార్యలు ఈ బ్రాహ్మణ జాతిని, క్షత్రియ జాతిని రక్షింతురుఁగాక అని ప్రథమ మంత్రసారాంశము. 'తస్మై స్వాహా' అని గంధర్వునకు, 'తాభ్యః స్వాహా' అని అతని భార్యలకును హవిస్సును అర్పించవలెను(హోమము చేయవలెను). చంద్రమో నామకుఁడైన గంధర్వునకు, 'భేకుర' అను పేరు గల అతని ప్రియభార్యలకును తృతీయ మంత్రముచే హవిస్సును హోమము చేయవలెను. యజ్ఞ నామక గంధర్వునకు 'స్తవ' అను పేరు గల దక్షిణారూప దేవతలగు అతని భార్యలకును చతుర్థ మంత్రముచే హవిస్సు నర్పించవలెను. సూర్య నామక గంధర్వునకు, 'ఆయు' అను పేరు గల మరీచిదేవత లనెడి అతని భార్యలకును ద్వితీయ మంత్రముచేత హవిస్సు నర్పించవలెను. మనో నామక గంధర్వునకు, సౌందర్యము వహించునట్టి ఋక్సామదేవత లనెడి అతని భార్యలకును పంచమ మంత్రముచే హవిస్సు నర్పించవలెను. వాత నామక గంధర్వునకు, ముదా నామకలైన అబ్దేవత లనెడి అతని భార్యలకును షష్ఠ మంత్రముచే హవిస్సు నర్పించవలెను. ఇంతవఱకు ఒక్కొక్క పర్యాయము రెండేసి ఆహుతులు చొప్పున ఆఱు పర్యాయములకు పండ్రెండు ఆహుతులు చెప్పఁబడినవి. పదుమూఁడవ ఆహుతుని ఏడవ మంత్రముచే హోమము చేయవలెను.

మృత్యు నామక గంధర్వునకు, భువో నామక విశ్వాభిమానిదేవతలగు అతని భార్యలకును ఎనిమిదవ మంత్రమున హవిర్హోమము విహిత మైనది. పర్జన్య నామక గంధర్వునకు, రుచో నామక విద్యుద్దేవతలగు అతని భార్యలకును నవమ మంత్రమున హవిర్హోమము విహిత మైనది. మృత్యు నామకుఁడైన ప్రజాపతియొక గంధర్వునకు, భీరు నామక ప్రజాభిమాని దేవతలగు అతని భార్యలకును దశమ మంత్రమున హవిష్ప్రదానము విహిత మైనది. కామ నామక గంధర్వునకు శోచయంతి అను పేరుగల అతని భార్యలకును ఏకాదశ మంత్రమున హవిష్ప్రదానము విధించఁబడినది. సర్వలోక పాలక దేవుని గూర్చి చెప్పునట్టి పండ్రెండవ మంత్రము ద్వాదశాహుతి సాధనము. ఇది ఉత్తరపర్యాయ పంచకమందు పంచమ పర్యాయ రూపమైన ఆహుతి మంత్రము. ఈ ద్వాదశ మంత్రములందు ప్రతిపాదించఁబడిన గంధర్వులు, గంధర్వ భార్యలు బ్రాహ్మణ జాతికి, క్షత్రియ జాతికిని సుఖము నొసఁగుఁడని ప్రార్థించఁబడినారు. ఇవి హోమ విధాయకములైన రాష్ట్రభృన్మంత్రములు.

అష్టమానువాకమునందు రాష్ట్రభృన్మంత్రములకు కామ్య ప్రయోగములు చెప్పఁబడినవి.రాష్ట్రభృన్మంత్రములు రాష్ట్రప్రాప్తి హేతువు లగుటచే రాష్ట్రస్వరూపమే కావున రాష్ట్రప్రాప్తిని కోరువాని నిమిత్తము అధ్వర్యుఁడు రాష్ట్రభృన్మంత్రములచే హోమము చేయవలెను. ఈ హోమముచే యజమానుఁడు భూమివిశేష రూపమైన రాష్ట్రమును పొందును. ఇది యొక ప్రయోగము. ఈ ప్రయోగము ప్రథమ మంత్రమున అభిహిత మైనది. ఆత్మోత్కర్ష ప్రాప్తికై ద్వితీయ మంత్రమున హోమము విధించఁబడినది. గ్రామప్రాప్తికై తృతీయ మంత్రమున హోమము విధించఁబడినది. ఈ హోమమును జూదమాడు స్థలమందు చేయవలెననియు, అట్లు హోమము చేసిన అధ్వర్యుఁడు అధిదేవనమునందే సజాతులను స్వాధీనులనుగాఁ జేయువాఁ డగుననియు, స్వాధీనులైన సజాతులు యజమానుని సేవింతు రనియు చతుర్థ మంత్రమున అభిహిత మైనది. (అధిదేవనము=జూదమాడు స్థలము.) ఈ విధముగనే మిగిలిన మంత్రములు ఆ యా కోరికలు గల యజమానుల నిమిత్తము తత్తత్ఫల ప్రాప్తికై ఆ యా ప్రయోగములను విధించినవి. ఆ యా ప్రయోగ విశేషములను అష్టమానువాకమునందలి వేదార్థదీపికనుండి తెలిసికొనవలెను.

నవమానువాకమునందు రాజసూయ ప్రకరణోత్పన్నములైన "ధాత్రే పురోడాశమ్" ఇత్యాది దేవికాఖ్య పంచ హవిస్సులకు ఉత్కర్షము చేసి పిమ్మట బహువిధమైన కామ్య ప్రయోగము నిరూపించఁబడినది. "దేవికా నిర్వపే త్ప్రజాకామ శ్ఛన్దాగ్ంసి వై దేవికా శ్ఛన్దాగ్ంసీవ ఖలు వై ప్రజా శ్ఛన్దోభిరేవాస్మై ప్రజాః ప్ర జన యతి" ఇది నవమానువాకమునందలి ప్రథమ మంత్రము. దీవ్యన్తి=అపేక్షితం ఫలం ప్రకాశయన్తీతి దేవికాః. ధాత్రాది పంచేష్టులు అపేక్షిత ఫల విశేషమును ప్రకాశింపఁజేయునవి యని వ్యుత్పత్త్యర్థము. అనుమత్యాది దేవీసంబంధులు కావున ఇవి దేవికలని వ్యవహరింపఁబడుచున్నవి. ఈ యిష్టులకు సంబంధించిన పంచదేవతలలో ధాత ఒక్కఁడే పురుషదేవత. అనుమతి, రాక, సినీవాలి, కుహు అను దేవతలు

నలుగురు స్త్రీదేవతలు. ఈ దేవికేష్టులు చందోరూపములు. "గాయత్రీ అనుమతిః" అను ప్రమాణము ననుసరించి అనుమత్యాదులు ఛందోరూపములని స్పష్ట మగుటచే తద్ద్వారా దేవికేష్టులు కూడ ఛందో రూపములుగా ఇచట వర్ణించఁబడినవి. చందస్సులు ఫలహేతువు లగుటచే సుఖకరములైన విధముగ ప్రజలు కూడ సుఖహేతువు లగుటచే ఛందస్సమానులు. కావున అధ్వర్యుఁడు దేవికారూప ఛందస్సులచేతనే దేవికేష్టి నిర్వాపము చేసిన యజమానునికై ప్రజలను (సంతానమును) కలిగించు నని అర్థము.

పంచదేవికేష్టులకు ధాత్రాది దేవతలు అయిదుగురు కలరు. వారిలో ధాతృదేవుని ప్రథమునిగా స్థాపన చేసి ఇష్టినిర్వాపము చేయుటవలన ధాతృదేవుఁడు యజమానుని యజమాన పత్నితో కలిపి మిథునముగా చేయును. అనుమతీదేవి ఈ మిథునము ననుమతించును. రాకాదేవి ఆ మిథునమునందు ప్రజ నొసఁగును. సినీవాలీదేవి గర్భస్థ ప్రజను ఉత్పాదింపఁజేయును. ఉత్పన్న ప్రజలందు కుహూదేవి మూలమున యజమానుఁడు సంభాషణాభ్యాసమును చేయునని ద్వితీయ మంత్రమున చెప్పఁబడినది. పంచదేవతలలో ధాతృదేవుని ప్రథమునిగా స్థాపన చేయుటవలన కలిగెడి ఫలమును ఈ మంత్రము చెప్పినది. ఈ ప్రయోగమువలన ఫలాంతరము కూడ కలుగునని తృతీయ మంత్రము చెప్పినది. యజమానుఁడు ఇష్టినిర్వాపము చేయునపుడు అనుమత్యాది చతుర్దేవతల మధ్యమున ధాతృదేవుని స్థాపించవలెను. అనఁగా— ఆవాహనము చేయవలెను. ఈ విధముగ చేసిన ఇష్టినిర్వాపమువలన ధాత ఈ యజమానుని గ్రామాధిపత్యమునందు స్థాపించును. ఈ దేవికేష్టుల నిర్వాపమునందే ప్రయోగభేదము ననుసరించి ఫలాంతరము లనేకములు కలుగునని ఈ నవమానువాకము నందలి మిగిలిన మంత్రములవలన తెలియుచున్నది.

దశమానువాకమునందు గ్రామాంతరమునకు ప్రయాణము చేయునట్టి అగ్నిహోత్రికి అగ్నిసమారోపణము విధించఁబడినది. అగ్నిహోత్రి గార్హపత్యాగ్ని సహితుఁడై గ్రామాంతరమునకు పోవుసమయమున గార్హపత్యాగ్నియందు ఉత్తరభాగమున హోమము చేయవలెనని ఇందలి ప్రథమ మంత్రమున చెప్పఁబడినది. హోమము చేయునపుడు పురోనువాక్యా రూపమైన ఈ ప్రథమ మంత్రమును పఠించవలెను. గ్రామాంతరము పోవునపుడు అగ్నిహోత్రి మార్గమధ్యమునఁగాని, గ్రామాంతరమునఁగాని ఇష్టకోపధానము అనఁగా— మృణ్మయములైన ఇటుకలను ఉపధానము చేయుట కష్టసాధ్యము కనుక అతఁడు సాయం ప్రాతః కాలములందు నియమముగ అగ్నిహోత్రకర్మను చేయుటచే ఆ సాయం ప్రాతః కాలములనే ఇష్టకలుగ భావించి అగ్నిహోత్ర కర్మను చేయవలెనని మూఁడవ మంత్రమునందు చెప్పఁబడినది. (ఇష్టకోపధానము—ఇటికలను చతురస్రాకారముగ కూర్చుట.) అగ్నిహోత్రి గ్రామాంతరమునకు వెళ్లినపుడు ఒకచోట పది దినములుండి అగ్నిహోత్ర హోమము చేసినచో విరాట్ఛందస్సు దశాక్షరములు కలది కావున సంఖ్యాసామ్యమువలన విరాజమునే పొంది దానిని ఇష్టకనుగాఁ జేసి ఇష్టకోపధానము చేసినవాఁ డగును. ఆ విరాట్టునందే అతఁడు అగ్నిష్టోమ యజ్ఞమును పొందినవాఁ డగును. అప్పు డతని అగ్ని చిత్య మగును.

ఇష్టకోపధానము చేసి అందు అగ్నిని ప్రతిష్ఠించి ఆ యగ్నియందు హోమము చేసినచో ఆ అగ్ని చిత్య మనఁబడును. చిత్యాగ్నులు మూఁడు విధములు. మట్టి ఇటికలను ఉపధానము చేసి అందు ప్రతిష్ఠితమైన అగ్ని ఒకవిధమైన చిత్యము. అహోరాత్రకాల రూపములైన ఇష్టకలచే చితమైన అగ్ని రెండవ విధమైన చిత్యాగ్ని. అది మూఁడవ మంత్రమునందు వర్ణించఁబడినది. విరాడ్రూపేష్టకలచే చితమైన అగ్ని మూఁడవ విధమైన చిత్యాగ్ని. ఈ చిత్యాగ్ని ఈ నాల్గవ మంత్రమున చెప్పఁబడినది. 5 వ మంత్రము హోమవిధాయకము. 6, 7 మంత్రములందు ఇందుకు సంబంధించినవే మరికొన్ని విశేషములు చెప్పఁబడినవి. అగ్నిహోత్రి పయనించునపుడు తాను అధిష్ఠించు శకటమునందు అగ్నిని ఉంచుకొని పోవునెడల ఆ శకటము దగ్ధ మగును. కావున తత్పరిహారమునకై అగ్నిహోత్రి "అయం తే యోనిర్ ఋత్వియః" అను మంత్రమును పఠించుచు ఈ యగ్నిని అరణులందు సమారోపణము చేయవలెను. అట్లు చేసినచో అగ్నిహోత్రి ఈ అగ్నిని అగ్ని యొక్క జన్మస్థానమునందే సమారోపణము చేసినవాఁడగును. కొందఱు పక్షాంతరమున ఇట్లు చెప్పుచున్నారు.

అరణులందు ఆరోపితమైన అగ్ని, అరణి దగ్ధ మగుటవలనఁగాని, అరణి అపహృత మగుటవలనఁగాని నశించు నెడల యజమానుఁడు మఱల అగ్నిని ఆధానము చేయవలసియుండును. ఆ దోషము లేకుండుటకై యజమానుఁడు అగ్నిని "యా తే అగ్నే" ఇత్యాది మంత్రముచేత తనయం దారోపణము చేసికొనవలెను. యజమానుఁడు కూడ శాస్త్రీయాగ్నికి ఉత్పాదకుఁడు కనుక అగ్నికి జన్మస్థాన మగుచున్నాఁడు. కావున యజమానుఁడు అగ్నిని జన్మస్థానమునందే ఆరోపణము చేసినవాఁ డగును. "యా తే అగ్నే" అను మంత్రము బ్రాహ్మణమునందలి ద్వితీయ కాండములోనిది.

ఏకాదశానువాకమునందు కామ్యములైన యాజ్యా పురోనువాక్యలు చెప్పఁబడినవి. యాజ్యా పురోనువాక్యలను గుఱించి ప్రథమ ప్రపాఠకమునందలి ఏకాదశానువాకమున (ఈ విషయ సమీక్షయందు) వివరించఁబడినది. ఈ అనువాకమునందు విభిన్నదేవతాకములైన ఎనిమిది హవిస్సులకు సంబంధించిన యాజ్యా పురోనువాక్య మంత్రము లామ్నాతము లైనవి. [1]"అగ్నయే గృహపతయే పురోడాశ మష్టాకపాలం నిర్వపతి కృష్ణానాం వ్రీహీణామ్" అని చెప్పఁబడిన హవిస్సునకు ఈ ప్రథమ మంత్రము పురోనువాక్య మంత్రము. ద్వితీయ మంత్రము యాజ్య. [2]"సోమాయ వనస్పతయే శ్యామాకం చరుమ్" అని చెప్పఁబడిన హవిస్సునకు మూఁడవ మంత్రము పురోనువాక్య. నాల్గవ మంత్రము యాజ్య. [3]"సవిత్రే సత్యప్రసవే పురోడాశం ద్వాదశ కపాల మాశూనాం వ్రీహీణామ్" అని విధించఁబడిన హవిస్సునకు పంచమ మంత్రము పురోనువాక్య. షష్ఠ మంత్రము యాజ్య. [4]"రుద్రాయ పశుపతయే గావీధుకం చరుమ్" అని విహితమైన హవిస్సునకు సప్తమ మంత్రము పురోనువాక్య. అష్టమ మంత్రము యాజ్య. [5]"బృహస్పతయే వాచస్పతయే నైవారం చరుమ్" అని విహితమైన హవిస్సునకు నవమ మంత్రము పురోనువాక్య, దశమ మంత్రము యాజ్య.

[6]"ఇన్ద్రాయ జ్యేష్ఠాయ పురోడాశ మేకాదశ కపాలం మహావ్రీహీణామ్" అను మంత్రముచే విహితమైన హవిస్సునకు ఏకాదశ మంత్రము పురోనువాక్య. ద్వాదశ మంత్రము యాజ్య. త్రయోదశ మంత్రము పూర్వోక్త హవిస్సునకు వికల్పముగా చెప్పఁబడిన పురోనువాక్య. చతుర్దశ మంత్రము పూర్వోక్త హవిస్సునకే వికల్పితమైన యాజ్య. [7]"మిత్రాయ సత్యాయాఽఽమ్బానాం చరుమ్" అను హవిస్సునకు పంచదశ మంత్రము పురోనువాక్య. షోడశ మంత్రము యాజ్య. సప్తదశ మంత్రము పూర్వోక్త హవిస్సునకు వికల్పితమైన యాజ్య. [8]"వరుణాయ ధర్మపతయే యవమయం చరుమ్" అను మంత్రముచే విహితమైన హవిస్సునకు అష్టాదశ మంత్రము పురోనువాక్య. ఏకోనవింశతి మంత్రము యాజ్య. వింశతి మంత్రము ఈ హవిస్సునకే వికల్పితమైన యాజ్య. ఈ ఇరువది యాజ్యా పురోనువాక్య మంత్రముల అర్థ తాత్పర్యములను వ్యాఖ్యానమున చూడవలసినది. దీనితో చతుర్థ ప్రపాఠకము సమాప్త మైనది.

పంచమ ప్రపాఠకమునందలి ప్రథమానువాకమునందు దర్శపూర్ణమాసేష్ట్యంగమైన అన్వారంభణీయేష్టి విధించఁబడినది. ఈ ప్రథమానువాకమునందలి "పూర్ణా పశ్చాత్", యత్తే దేవా అదధుః" అను మంత్రములచే ప్రథమమున సారస్వత హోమములు చేసి పిమ్మట అన్వారంభణీయేష్టి నాచరించవలెను. పూర్వము దేవతలు ఋషులు అగ్న్యాధానమునకు పిమ్మట దర్శపూర్ణమాస యాగముల నారంభించవలెనని సంకల్పించఁగా వారిలో ఋషులు సారస్వత హోమములను అగ్న్యాధానమునకు పిమ్మట చేయవలెనని తెలియక అన్వారంభణీయేష్టికై హవిర్నిర్వాపము చేసిరి. దేవతలు అన్వారంభణీయేష్టి కంగములైన సారస్వత హోమములను ముందుగాఁ జేయవలెనని తెలిసికొని ఆ హోమములు చేసిరి. అప్పుడు అన్వారంభణీయేష్టిని సాంగముగ నిర్వర్తించుటచే దేవతలు ఋషులకంటె పూర్వమే దర్శపూర్ణమాస యాగముల నుపక్రమించిరి. కనుక అన్వారంభణీయేష్టికి ముందుగా సారస్వత హోమములు చేయవలెను. అనఁగా ప్రథమమున సారస్వతహోమములు, పిమ్మట అన్వారంభణీయేష్టి, తదనంతరము దర్శపూర్ణమాస యాగములను చేయవలెనని స్పష్ట మైనది. ఈ విషయము మూఁడవ మంత్రమున చెప్పఁబడినది. నాల్గవ మంత్రము సారస్వత హోమ విధాయక మంత్రము.

దర్శపూర్ణమాస యాగముల నారంభించవలెనని కోరుచున్న పురుషుఁడు అన్వారంభణీయేష్టియొక్క ఉపక్రమమునందే "పూర్ణా పశ్చాత్" ఇత్యాది మంత్రములచేత సారస్వత హోమములు చేయవలెను. అట్లు

హోమము చేసిన యతఁడు విలంబము లేకుండఁగనే దర్శపూర్ణమాస యాగముల నాచరించుటకు యోగ్యుఁడగునని నాల్గవ మంత్రము చెప్పినది. ప్రథమమున పౌర్ణమాస యాగము ననుష్ఠించవలెనా? దర్శయాగము చేయవలెనా? అని సందేహము కలుగుచున్నది. అందుకై కాలముయొక్క స్వరూపమైన అనులోమ మెటువంటిది? ప్రతిలోమ మెటువంటిది? అని విచారించవలెను. ఈ దర్శపూర్ణమాసముల అనులోమ ప్రతిలోమ కాలస్వరూపములను తెలిసికొనిన పురుషుఁడు దర్శపూర్ణమాసముల నారంభించుటకు యోగ్యుఁ డగునని బ్రహ్మవాదులు చేసిన చర్చవలన తెలియుచున్నది. అమావాస్యానంతరము శుక్ల ప్రతిపత్తిథి మొదలు అనులోమ కాలస్వరూపము. ఈ కాలమున చంద్రుఁడు ప్రతిదినము ఉత్తరోత్తరాభివృద్ధి నొందుచున్నాఁడు. పూర్ణిమానంతరము కృష్ణ ప్రతిపత్తిథి మొదలు ప్రతిలోమ కాలస్వరూపము. ఈ కాలమున చంద్రుఁడు ప్రతిదినము క్రమక్రమముగ క్షీణించుచున్నాఁడు.

ప్రథమమున దర్శయాగము ననుష్ఠించినచో అనులోమముగనే యాగము చేసినట్లగును. కనుక ఆ యజమానుఁడు వృద్ధినొందును. కాని అలవ మంత్రము ప్రాతిలోమ్యదోష పరిహారమునకై సరస్వతీ సరస్వత్తులనెడి దేవతా విశేషములను విధించుటవలన పౌర్ణమాస యాగమునే ప్రథమమున నారంభించవలెనని గమ్యమాన మగుచున్నది. అట్టి పౌర్ణమాసారంభమునకు ముందు త్రిహవిష్కమైన అన్వారంభణీయేష్టిని సప్తమ మంత్రము విధించినది. ఈ యిష్టియందు ఆగ్నావైష్ణవము, ద్వాదశ కపాల సంస్కృతమునైన పురోడాశము ఒక హవిస్సుగాను, సరస్వతీ దేవతాక చరువు ఒక హవిస్సుగాను, సరస్వద్దేవతాకము, ద్వాదశ కపాల సంస్కృతమునైన పురోడాశము ఒక హవిస్సుగాను, మొత్తము మూఁడు హవిస్సులు గల అన్వారంభణీయేష్టిని సప్తమ మంత్రము విధించినది. 8, 9, 10, 11 మంత్రములు ఈ యిష్టియందలి విశేషాంశములను వివరించినవి.

ద్వితీయానువాకమునందు సౌమిక బ్రహ్మత్వ విధి చెప్పఁబడినది. ఒకప్పుడు వసిష్ఠప్రముఖులైన ఋషులు ఇంద్రునినుండి మంత్రవిశేషములను తెలిసికొనుటకు రాఁగా, అనధికారులకు మంత్రములను చెప్పరాదని ఇంద్రుఁడు అంతర్హితుఁ డయ్యెను. అప్పుడు వసిష్ఠుఁడు మాత్రము దివ్యదృష్టిచే ఇంద్రుని చూచెను. ఇంద్రుఁడు వసిష్ఠునితో ఇట్లు చెప్పెను. "ఓ వసిష్ఠా! సోమయాగమునందు బ్రహ్మగా ఉండుటకు అవసరమైన మంత్ర సముదాయము ఏ బ్రాహ్మణునియం దుండెనో, ఆ బ్రాహ్మణుని నీకు తెలిపెదను. ఆ బ్రాహ్మణుని సామర్థ్యమువలన నిన్ను పురోహితునిగా ఎన్నుకొనునట్టి ప్రజలు పుట్టుదురు. నన్నుఁగూర్చి మంత్రానధికారులైన ఋషులకు చెప్పవలదు" అని ఇంద్రుఁడు వసిష్ఠునకు స్తోమభాగనామక మంత్రవిశేషములను చెప్పెను. అనంతరము వసిష్ఠుఁడు పురోహితుఁడుగాఁగల ప్రజలు పుట్టిరి. ఇంద్రుఁడు వసిష్ఠునకు బ్రహ్మత్వోపయుక్తమైన సర్వమును చెప్పుటవలన వసిష్ఠగోత్రోద్భవుఁడైన బ్రాహ్మణుఁడు స్తోమభాగాభిజ్ఞుఁడైన యతఁడు సోమయాగమునందు బ్రహ్మగాఁజేయఁదగినవాఁ డని ప్రథమ ద్వితీయ మంత్రములు చెప్పినవి. ఏకత్రింశ స్తోమభాగనామక మంత్రవిశేషములు పంచమ కాండమునందలి బ్రాహ్మణమునందు కలవు. ఈ మంత్రములలోఁ గల విశేషములు ఈ ద్వితీయానువాకమునందలి తృతీయ చతుర్థాది మంత్రములందు వివరించఁబడినవి. ఆ విశేషములను ద్వితీయానువాక వ్యాఖ్యానమునుండి తెలిసికొన నగును.

తృతీయానువాకమునందు విష్ణ్వతిక్రమములు చెప్పఁబడినవి. భ్రాతృవ్యులు (శత్రువులు) మూఁడు విధములుగ ఉన్నారు. పితృపితామహాదులందు కూడ ఉండువారు (జ్ఞాతులు) పూర్వజు లనఁబడుదురు. సవతితల్లియొక్క కుమారులు సహజు లనఁబడుదురు. ఇప్పుడే తన కార్యములను నశింపఁజేయువారు అపరుజు లనఁబడుదురు. యజమానుఁడనైన నేను అగ్నిదేవునిచేతను, గాయత్రీ చ్ఛందస్సుచేతను, త్రివృత్ స్తోమముచేతను, రథంతర సామముచేతను, వషట్కార మనెడి వజ్రముచేతను పరసేనను జయింతును. పూర్వజులైన శత్రువులను నాకంటె తక్కువవారినిగా చేయుదును. చేసి శృంఖాలాదికముచే బాధింతును. ఈ సమస్త భూలోకమునందును ఉదాసీనులమై యున్నను మమ్ము ఎవఁడు ద్వేషించుచున్నాఁడో, ఎవనిని మేము ద్వేషించుచున్నామో, వాని నందఱిని విష్ణుస్వరూపుఁడనై నా పాదవిన్యాసముచే అతిక్రమింతు నని చెప్పుటచే వీనికి విష్ణ్వతిక్రమములని వ్యవహార మేర్పడినది. ఈ అతిక్రమ విశేషములే మిగిలిన మంత్రములందు వివరించఁబడినవి.

చతుర్థానువాకమునందు అతిమోక్ష మంత్రములు ఆమ్నాతము లైనవి. దేవతలలో మ్లేచ్ఛజాతీయులైన కొందఱు యజ్ఞభాగార్హు లగుచు యజ్ఞమును చూచుటకు సహింపనివారై, వారిలో కొందఱు యజ్ఞమును నాశనము చేయుచుందురు. మఱికొందఱు యజ్ఞసాధనముల నపహరించి వేఱు ప్రదేశమునకు పోవుచుందురు. అట్టివారిలో ఎవరు యజ్ఞమును నాశనము చేయు దేవతలో, ఎవరు పృథివియందు ఒక ప్రదేశమును నివాసముగ ఏర్పఱచుకొని యుందురో, ఆ యజ్ఞవిఘాతకులనుండి అగ్ని మమ్ము రక్షించుఁగాక. మేము యజ్ఞమును సమాప్తము చేసి యజ్ఞఫలమును పొందుదుము గాక. యజ్ఞసాధనాపహర్తలనుండియు అగ్ని మమ్ము రక్షించుఁ గాక, అని ప్రథమ మంత్రమునందు చెప్పఁబడినది. అతిమోక్షణ మనఁగా- సంపూర్ణముగ విడిపించుట. ఇచట యజమానుని యజ్ఞనాశకులనుండియు, యజ్ఞసాధనాపహర్తలనుండియు విడిపించి యజ్ఞఫలమును పొందించుమని యజమానుఁడు అగ్నిని ప్రార్థించుటచే ఈ మంత్రములు అతిమోక్ష మంత్రము లనఁబడుచున్నవి. కపటరూప ధారులగు దేవతలవలన కలుగు నుపద్రవములను పోఁగొట్టుటకు ఈ మంత్రము లభిహితము లైనవి. ఇవి యెనిమిది మంత్రములు. నవమ మంత్రమునందు ఉదవసానీయ మనెడి కర్మ విధించఁబడినది. సోమయాగము చేసిన పిమ్మట యజమానునివలన ప్రయోజనము లేదని, అతనినుండి యజ్ఞము సర్వదేవతలు తొలఁగి పోవుదురు. ఆ దోషము పోవుటకై సోమయాజికి ఉదవసానీయ కర్మానుష్ఠానము విహిత మైనది. ఇది అగ్నిదేవతాకము. పంచకపాల సంస్కృత పురోడాశ సాధ్యము. 10, 11 మంత్రములందు ఈ ఉదవసానీయ కర్మకు సంబంధించిన విశేషములే వివరించఁబడినవి.

పంచమానువాకమునందు ఆదిత్యగ్రహ మంత్రము లభిహితము లైనవి. ఆదిత్య గ్రహము సూర్యాత్మకముగను, వాయ్వాత్మకముగను వర్ణించఁబడినది. కనుకనే యజ్ఞవిఘాతకులనుండి తన్ను రక్షించుఁడని యజమానుఁడు ఏతద్గ్రహ స్వరూపులుగా వర్ణించఁబడిన సూర్య వాయు దేవులను ప్రార్థించును. ఈ ప్రథమ మంత్రమును, ద్వితీయ మంత్రమును కూడ పఠించుచు యజమానుఁడు అదిత్య గ్రహమును అన్వారంభము చేయవలెనని ఇచట చెప్పఁబడినది. ఈ ఆదిత్య గ్రహమును ప్రజాపతి, ఇంద్రుఁడు, వాయువు స్రవించునట్లును, వర్షించునట్లును చేయుదురు గాక యని యజమానుఁడు మూఁడవ మంత్రమున ప్రార్థించును. వర్షమును కోరువాని నిమిత్తము నాల్గవ మంత్రమును పఠించుచు ఆదిత్య గ్రహమును హోమము చేయవలెను. "ఓ ఆదిత్యుఁడా! భూమిని విశేషముగ తడుపుము. ద్యులోకస్థమైన ఆకాశమునం దుండునట్టి మేఘము వంటి ఈ గ్రహమును భిన్నము చేయుము. ద్యులోకస్థమైన ఉదక సమృద్ధిని మా కొసఁగుము. సమర్థుఁడవైన నీవు నీటిని ధరించునట్టి తిత్తివలెనున్న మేఘమును విడువుము" అని చతుర్థ మంత్రార్థము. దీని వలన ఆదిత్యగ్రహాన్వారంభము వర్షదాయకమని స్పష్ట మగుచున్నది. మఱియు ఈ ఆదిత్య గ్రహము ద్యులోకోపరిభాగమునందలి స్వర్గమార్గమును విస్తృతము చేయునది యనియు వర్ణించఁబడినది. మిగిలిన మంత్రములు కూడ ఈ విషయమునే వివరించినవి.

షష్ఠానువాకమునందు పత్నీవిషయ మంత్రములు చెప్పఁబడినవి. ఈ యనువాకమునందలి కొన్ని మంత్రములు వేరు వేరు సందర్భములందు వినియోగించఁదగినవిగా ఉన్నవి. "ఓ యజమాన పత్నీ! నిన్ను క్షీరము, ఆజ్యము మొదలగువాని నిమిత్తము ఈ కర్మయందు అధ్వర్యుఁడనైన నేను బాగుగ త్రాటితో బంధించుచున్నాను. మాకు అన్నము నొసఁగుటకు సమర్థురా లగు ఆమె దీక్షితురాలు (దీక్ష వహించినది) అగుఁగాక." ఈ ప్రథమ మంత్రము యజ్ఞదీక్షా ప్రకరణములోనిది. అట్లే "తరువాత నేను యజమానునకు అనుకూల్యమును కోరుచున్నదాననై ఇచట (యజ్ఞవేదియందు) నా స్థానమునందు కూర్చొనుచున్నాను." అను తృతీయ మంత్రము కూడ యజ్ఞదీక్షా ప్రకరణములోనిదే. అనఁగా- ఆ మంత్రముల వినియోగము ఆ దీక్షాప్రకరణమునందే ఉండును. ఇట్లే అవభృథ ప్రకరణమునందు వినియోగించవలసిన "ఇమం వి ష్యామి వరుణస్య పాశమ్" అను మంత్రము ఇచట పంచమ మంత్రముగా ఆమ్నాత మైనది. ఈ మంత్రము అవభృథ ప్రకరణమున యజమాన పత్ని పఠించవలసినది. "సుప్రజసస్త్వా వయగ్ం సుపత్నీరుపసేదిమ। అగ్నే సపత్నదమ్భన మదబ్ధాసో అదాభ్యమ్"="ఓ యగ్నీ! నేను సుసంతానము కలదానను, ధర్మపత్నిని. ఎవరిచేతను తిరస్కరించఁబడనిదానను. అట్టి నేను నీ సమీపమున కూర్చుంటిని. నీవు శత్రు

నాశకుఁడవు". ఇది చతుర్థమంత్రము. అగ్ని సమీపమున కూర్చుండిన పిమ్మట యజమానపత్ని ఈ మంత్రమును జపించవలెను. దీని వినియోగము దీక్షాప్రకరణమున కలదు. ఈ విధముగనే ఆ యా ప్రకరణమునందు వినియోగించవలసిన మఱికొన్ని మంత్రములు కూడ ఈ షష్ఠానువాకమునందు ఉన్నవి.

సప్తమానువాకమునందు దర్శపూర్ణమాస యాగములకు అంగములైన స్రుక్ స్రువాది హోమసాధనములను ఏ యే వృక్షవిశేషముల కఱ్ఱలతో చేయవలె ననెడి విషయము వివరించఁబడినది. 'స్రుక్కు, స్రువము, జుహువు, ఉపభృత్తు, ధ్రువ' అనునవి ఆజ్యాది హవిస్సును అగ్నియందు హోమము చేయుటకై ఉపయోగింపఁబడు సాధనములు. స్రువమును చండ్రచెట్టుయొక్క కఱ్ఱతో చేయవలెనని ఈ అనువాకమునందలి ప్రథమ మంత్రము చెప్పినది. పూర్వము వషట్కారాభిమాని దేవత ఏదియో ఒక విరోధముచేత గాయత్రీ శిరస్సును నఱికెనఁట. అప్పుడా గాయత్రియొక్క ఛిన్న ప్రదేశమునుండి జలరూపమైన రసము భూమియందు పడి చండ్రచెట్టు ఆయెను. ఖాదిరము(చండ్ర)తో చేసిన స్రువము నుపయోగించిన యజమానుఁడు ఛందస్సుల రసముచేతనే అవదానము చేసినవాఁ డగునని, ఆ హోమము చేసిన ఆహుతులు సరసము అగునని తత్ప్రాశస్త్యము కూడ ఆ మంత్రమున చెప్పఁబడినది. పాలాశము(మోదుగు)తో చేసిన జుహువుతో హోమము చేయవలెనని, ఆ ఆహుతులను దేవతలు ప్రీతిపూర్వకము స్వీకరింతురని రెండవ మంత్రమున చెప్పఁబడినది. ద్యులోకమునందలి తిప్పతీఁగను (సోమలతను)గాయత్రీ దేవత తెచ్చుచుండఁగా, దాని ఆకు ఒకటి భూమియందు పడి మోదుగు చెట్టు అయినది. పర్ణము(ఆకు)నుండి పుట్టిన చెట్టు కనుక మోదుగు చెట్టునకు పర్ణవృక్షమను వ్యవహారము కూడ ఏర్పడినదని దీని ప్రాశస్త్యము సహేతుకముగ ఈ రెండవ మంత్రమున వివరించఁబడినది. ఉపభృత్తును అశ్వత్థ వృక్షము(రావిచెట్టు)యొక్క కఱ్ఱతో చేయవలెనని, ధ్రువను పుల్లవెలఁగ చెట్టు కఱ్ఱతో చేయవలెనని, అట్టి ఉపభృత్తును, ధ్రువను ఉపయోగించి హోమము చేయవలెననియు చెప్పి దానివలన కలుగునట్టి విశేషమును మిగిలిన మంత్రములు వివరించినవి.

అష్టమానువాకమునందు దధిగ్రహమునకు సంబంధించిన మంత్రము లామ్నాతములైనవి. హోమద్రవ్యమైన దధిని ఉంచు పాత్రము దధిగ్రహము. దధిని పాత్రములోనికి తీసుకొనుటకు, ఆ దధిగ్రహమును తీసికొనుటకు, దానిని హోమము చేయుటకు అవసరములైన మంత్రములు ఈ అనువాకమునం దభిహితములైనవి. ఈ దధిగ్రహమును ప్రజాపతికొఱకు గ్రహించుచున్నాననియు, పూర్వము దేవతలకొఱకు ఈ దధి సమర్పించఁబడినదనియు అధ్వర్యుఁ డనును. ఈ సందర్భమున దేవతలను గూర్చి కొంత వివరించఁబడినది. దేవతలలో కొందఱు అగ్నిజిహ్వలు. అనఁగా అగ్నియందు హోమము చేయఁబడిన హవిస్సును గ్రహించువారు. కొందఱు సత్యమును కోరువారు. కొందఱు ఇంద్రుఁడు జ్యేష్ఠుఁడుగా కలవారు. వరుణుని రాజుగా భావించువారును కొందఱు కలరు. ఈ ప్రకరణమున శత్రువులను గుఱించి కొంత వివరించఁబడినది. శత్రువులు మూఁడు విధములుగ ఉన్నారు. [1]యజమానునియొద్ద ఉన్న ద్రవ్యాదికమును నశింపఁజేయువాఁడు 'ద్విషత్' అను శత్రువు. [2]ద్రవ్యము నపహరించుటకు సమర్థుఁడైనను యజమానునియొక్క మరణమునే కోరు శత్రువు 'జిజ్యాసత్' అను శత్రువు. [3]దానము చేయఁదగినదిగా ఉన్న దానిని దానము చేయకుండునట్లు కోరువాఁడు 'అరాతీయత్' అను శత్రువు. ఈ మూఁడు విధములుగా ఉన్న శత్రువులను పోఁగొట్టుమని ఇంద్రుని ప్రార్థించుచు యజమానుఁడు దధి గ్రహించవలె ననెడి విషయమును రెండవ మంత్రము వివరించినది. తేజస్వంతమైన దధిగ్రహమును ప్రాణాదుల ప్రీతికొఱకు, ప్రజాపతి ప్రీతికొఱకును హోమము చేయవలెననియు, ఆ హోమమువలన ప్రజాపతి యజమానునకు ఐశ్వర్యము నొసఁగుననియు మూఁడవ మంత్రమున చెప్పఁబడినది.

నవమానువాకమున పూర్వానువాకమునందలి మంత్రములకు వ్యాఖ్యానరూపమైన బ్రాహ్మణము చెప్పఁబడినది. సోమయాగమున అనేక దేవత లుండుటవలన అధ్వర్యు యజమానులు ఏ దేవతకైన అంతరాయమును కల్పించినచో ఆ యుభయులు ఆ దేవతకు అపరాధము చేసినవా రగుదురు. ఈ అపరాధము పోవుటకై ప్రజాపతి దేవతాకముగ దధిగ్రహమును గ్రహించవలెనని ప్రథమ మంత్రము చెప్పినది. సర్వగ్రహము

లలో దధిగ్రహము ప్రథమమున ఉండును. కనుక ఈ దధిగ్రహ గ్రహణమువలన యజమానునకు సర్వయజమానులలో ముఖ్యత్వము వచ్చునని రెండవ మంత్రమున చెప్పఁబడినది. దధిగ్రహము జ్యోతిష్మంత మని చెప్పుటచే ఈ దధిగ్రహము యజమానుని తేజస్వంతుని చేయును. ప్రజాపతి సర్వదేవతా స్వరూపుఁడు కావున ప్రజాపతికై చేసిన హోమము సర్వదేవతలకొఱకు చేసిన ట్లగును. ఈ విధముగ ఈ దధిగ్రహమునకు సంబంధించిన విశేషములు మిగిలిన మంత్రములు వివరించినవి.

దశమానువాకమునందు గవామయనమునందలి అతిగ్రాహ్య గ్రహములు, ప్రాణగ్రహములు చెప్పఁబడినవి. సోమయాగమునందు కొన్ని పాత్రము(గ్రహము)లందు సోమరసమును మంత్రోచ్చారణ పూర్వకముగ నింపి వానిని గ్రహించి తదనంతరము ఒక నిర్దిష్ట ప్రదేశము(ఉత్కరము)నందు ఉంచుదురు. ఆ పాత్ర విశేషము లన్నియు పూర్వానువాకములందు వివరించఁబడినవి. పాత్రములను గ్రహించునపుడు పఠించు మంత్రములు గ్రహణ మంత్రము లనియు వ్యవహారము. ఈ అనువాకమునందలి ప్రథమ మంత్రమున కొంత భాగము గ్రహణ మంత్రముగాను, కొంత భాగము సాదన మంత్రముగాను ఉన్నది. అతిగ్రాహ్య గ్రహ గ్రహణ సాదనములతో క్రతువు సమాప్తి చేయఁబడును. అతిగ్రాహ్యాయతనమునందు నాలుగు దిక్కు లందు నాలుగు పాత్రముల నుంచి మధ్యమందు ఐదవ పాత్రము నుంచి అయిదు పాత్రములందు ఆయా మంత్రములచే గ్రహణ సాదనములను చెప్పి ఆ పాత్రములందలి సోమరసములను ఐదవ పాత్రమందు పోయుచు "త్వే క్రతుమపి" అనెడి మంత్రమును పఠించుట ఇందలి ప్రక్రియ.

సోమమును కొలుచునట్టి గ్రహములు (పాత్రములు)సోమోన్మాన గ్రహములు. ఇవి "వాయురసి ప్రాణః" ఇత్యాది ప్రాణమంత్రములచేఁ జెప్పఁబడినవి. కావున ఇవి ప్రాణగ్రహములని వ్యవహరింపఁబడుచున్నవి. ఈ అనువాకమునందలి రెండవ మంత్రముచే ప్రాణగ్రహ గ్రహణము విధించఁబడినది. ఏతద్గ్రహణమువలన యజమానుఁడు తాను అపేక్షించిన సర్వమును పొందును. ఈ ప్రాణగ్రహములను "అయం పురోభువః" ఇత్యాదులైన ఐదు మంత్రములచే గ్రహించుట, వానిని సంవత్సర క్రతువుయొక్క ప్రథమాహస్సునందు (ప్రాయణీయమునందు), చరమాహస్సు (ఉదయనీయము) నందును గ్రహించుట, మొదలగు విషయములు వివరముగ చెప్పఁబడినవి. సంవత్సర క్రతువుయొక్క దశమాహస్సునందు గ్రహించవలెనని, దాని వలన ప్రజలు ప్రాణములనుండి తొలఁగిపోరనియు గ్రహణ ఫలము కూడ వివరించఁబడినది.

ఈ తృతీయ కాండమునందలి ఏకాదశానువాకమునందు పాఠక హౌత్రోపయోగి మంత్రములు అభిహితములైనవి. హోత జరుపునట్టి ప్రక్రియను హౌత్ర మందురు. ఆ ప్రక్రియయందు హోత పలుకవలసిన మంత్రములు హౌత్రపయోగి మంత్రము లనఁబడుచున్నవి. ఈ మంత్రములలో కొన్ని బ్రాహ్మణ గ్రంథమందు తృతీయకాండమున షష్ఠప్రపాఠకమున ఆమ్నాతము లైనవి. శేషించిన మంత్రములు ఈ యేకాదశానువాకమున అభిహితము లైనవి. ఇవి ఇరువదియొక్క మంత్రములు. ఆహవనీయమునందలి అగ్నిని ఉత్తరవేది యొద్దకు తీసికొని పోవుదురు. ఆ సమయమున ఎనిమిది మంత్రములను పఠించవలెను. పిమ్మట అరణి నుండి అగ్నిని మథింతురు. ఆ అగ్నిమంథన సమయమున అయిదు మంత్రములను పఠింతురు. అరణి నుండి అగ్ని పుట్టఁగానే రెండు మంత్రములను పఠింతురు. ఈ మథితాగ్ని నూతనాగ్ని యనియు, ఉత్తర వేదియొద్దకు తీసికొనిరాఁబడిన అగ్ని పురాతనాగ్నియనియు ఇచట వ్యవహరించఁబడినవి. ఈ నూతనాగ్నిని పురాతనాగ్నియందు కలుపుట యనెడి ఒక ప్రక్రియ కలదు. ఈ సందర్భమున ఆఱు మంత్రములను పఠింతురు. ఇవి యన్నియు హోత పఠించవలసినవి. ఈ మంత్రములలో కొన్ని పురాతనాగ్నిని స్తుతించునవి. మఱికొన్ని నూతనాగ్నిని స్తుతించునవి. ఉభయాగ్నులను కలిపిన యనంతరము ఉభయాగ్నుల సమష్టి రూపమును స్తుతించు మంత్రములు శేషించినవి. దీనితో తృతీయకాండము సమాప్తమగును.

# తప్పొప్పుల పట్టిక

| | తప్పు | | ఒప్పు | | పుట | | పంక్తి |
|---|---|---|---|---|---|---|---|
| 1. | కలిగఁజేయుచున్నవారె | ... | కలుగఁజేయుచున్నవారై | .... | 3 | .... | 39 |
| 2. | రమ్ము | .... | బొమ్ము | .... | 4 | .... | 18,/25 |
| 3. | స్వీరించు | .... | స్వీకరించు | .... | 16 | .... | 7 |
| 4. | పశూపాకారణము | .... | పశూపాకరణము | .... | 19 | .... | 18 |
| 5. | కేవలం | .... | కేవలమ్ | .... | 47 | .... | 18 |
| 6. | మెఱుపు | .... | మెఱపు | .... | 51 | .... | 7,/13 |
| 7. | అభిమతము | .... | అభిషుతము | .... | 59 | .... | 16 |
| 8. | దక్షకతుభ్యామ్ | ... | దక్షక్రతుభ్యామ్ | .... | 64 | .... | 5 |
| 9. | ప్రథమ ప్రపాఠకే | .... | తృతీయ ప్రపాఠకే | .... | 111 | .... | 1 |
| 10. | వరస్సంజ్ఞక | .... | పరసంజ్ఞక | .... | 127 | .... | 17 |
| 11. | తృతీయః | .... | చతుర్థః | .... | 153 | .... | 1 |
| 12. | అక్షపాః | .... | అక్షప్రాః | .... | 183 | .... | 31 |
| 13. | పంచమానువాక | .... | చతుర్థానువాక | .... | 226 | .... | 5 |
| 14. | యజానుష్ఠాన | .... | యజ్ఞానుష్ఠాన | .... | 227 | .... | 16 |

[illegible]

| | | | |
|---|---|---|---|
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత వెల రూ. 50/-

Published by Sri Ch. Venkatapathi Raju, I.A.S., Executive Officer, T.T.Devasthanams and
Printed at T.T.D. Press, Tirupati.